రాఘవీయం

శ్రీమాన్ కే.వి. రాఘవాచార్యుల సాహితీ సమాలోచన



ప్రచురణ
తిరుమల చారిటబుల్ ట్రస్టు, హైదరాబాదు



శ్రీ లక్ష్మీ నృసింహ మంగళాశాసనములతో

శ్రీ మాలోల గ్రంథమాల

శ్రీ అహోబిల మఠము
2-2-20/28. డి.డి. కాలనీ,
హైదరాబాద్ - 500 013

రాఘవీయం

శ్రీమాన్ కె.వి.రాఘవాచార్యుల సాహితీ సమాలోచన

సంపాదకులు:

డా॥ తిరుమల శ్రీనివాసాచార్య

డా॥ శ్రీరంగాచార్య

తాళ్లపల్లి మురళీధరగౌడు

ప్రచురణ

తిరుమల చారిటబుల్ ట్రస్టు

హైదరాబాదు

Raghaveeyam - A Collection of Essays on **K.V. Raghavacharya's** Works

రాఘవీయం శ్రీమాన్ కె.వి.రాఘవాచార్యుల సాహితీ సమాలోచన

© కాపీరైట్ : **తిరుమల చారిటబుల్‌ట్రస్టు**

ముద్రణ : హేవళంబినామ సంవత్సరం, జులై 2017

ప్రాప్తిస్థానము : **తిరుమల చారిటబుల్‌ట్రస్టు**
హైదరాబాదు - 500 028

శ్రీ మాలోల గ్రంథమాల, శ్రీ అహోబిల మఠము
2-2-20/28. డి.డి. కాలనీ, హైదరాబాద్-13

ముద్రణ సహకారం : **"పుస్తకశిల్పి" తాళ్లపల్లి మురళీధర గౌడు**

ముఖచిత్ర రూపకల్పన : **టి. మల్లేశ్**

అక్షరాలంకరణ : **కె.బి.టి. కొండయ్య**

ప్రచురణ : **తిరుమల చారిటబుల్ ట్రస్టు**
సి-501, నఫీజ్ రెసిడెన్సీ, ఏ.సి. గార్డ్స్
హైదరాబాద్-500 028.

ముద్రణ : **కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్**
విద్యానగర్, హైదరాబాద్ - 500 044
ఫోన్ : 040-2761 8261

సంపాదకీయం

'**స**మానానాం ఉత్తమ శ్లోకో అస్తు' అనే వేదోక్తి 'పుణ్యశ్లోకస్యచరితముదాహరణమర్హతి' అని తెల్పిన విద్యానాథుని వాక్కు-ఎంతో గొప్పనైనవి. ఇక్కడ శ్లోక శబ్దం ఛందః పరంగానే గాక కీర్తికి కూడావర్తిస్తుంది. ఈ విధమైన సూక్తులను శ్రీమాన్ కారంచేటి వేంకటరాఘవాచార్యుల వారు సార్థకం చేసుకున్న సాహితీ సంపూర్ణ జీవనులు. వారి జీవిత గమనం బహు మార్గానుగామియైనా - ధీర ధిషణాశక్తిమత్వంతో తట్టుకొని - తాను కష్టపడి సాధించిన 'విద్య' విలువ తెలిసిన వ్యక్తియైనందున తన కుమారులను విద్యా వినయ సంస్కార భూషణులను చేసి - చరమదశవరకు పుత్రోత్సాహమును అనుభవించిన విశేష వ్యక్తి. తమ ఉద్యోగ విరమణ తర్వాత కేవలం సాహితీ వ్రతులుగానే వుండి, శ్రీ మద్వేదాంత దేశిక సాహితిని తెలుగు వారికి సులభశైలి వ్యాఖ్యావిశేషాలతో అందించి దేశిక కృపాపాత్రులై సాహితీ లోక కృతజ్ఞతా పాత్రులై మనుగడ సాగించవలెనను- ఆచార్యులవారి వాంఛ దాదాపు పరిపూర్తిగావచ్చిన సమయంలో వారు శ్రీకైవల్యపదం చేరుకోవటం బాధాకరమైన విషయం.

ఆచార్యులవారు సిద్ధం చేసియుంచిన మరికొన్ని వ్యాఖ్యలు, రచనలున్నని, వీనికి శీఘ్రకాలంలోనే సూర్యాలోక భాగ్యం కల్గించే ప్రయత్నం జరుగుతున్నది. రాఘవాచార్య స్వామివారు వేదాంత దేశికుల కృపా విశేషమున 'వ్యాఖ్యాతృశిరోమణు'లై శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దయా విశేషంతో 'వాచస్పతు'లై - మహోపాధ్యాయులై - సంస్కృతాంధ్ర సాహితీ లోకమునందు ఆదర్శవంతంగా నిల్చే మరికొన్ని బిరుదములను సార్థకం చేసుకొని - తెలుగు వారికొక 'అపరవ్యాసుడు' మరి యొక మల్లినాథ సూరివలె శాశ్వత యశః కాయులై దుర్ముఖి శ్రావణ శు. 5 (5. 8. 2016) నాడు పరమపదించగా వారి కుమారులు శ్రీమాన్ కె.వి. రమణాచార్యులవారు, మనోహరాచార్యుల వారు ద్వాదశ దినాంత నిత్యకర్మలను సవిధిగా నిర్వహించి - పరమపదోత్సవ (13 రోజు) విశేష కార్యక్రమంలో నాడు విచ్చేసిన ఎందరో భాగవతోత్తములు, కవులు, పండితులు, బంధువర్గమంతా శ్రీమాన్ రఘునాథాచార్య స్వామి వారి సన్నిధిని జరిగిన ఆచార్యవారి 'సంస్మరణ' కార్యక్రమంలో- "శ్రీమాన్ రాఘవాచార్యులవారి సాహితీ సమాలోచన"తో బాటు మరికొన్ని విశేష వ్యాసములతో ఒక 'స్మారిక'ను 'సంవత్సరీకం' వరకు వెల్వరించి, వారిని శాశ్వత అక్షరమూర్తిగా నిల్పవలయు"నన్న ఆదేశాన్ననుసరించి అవిశ్రాంత విధి నిర్వహణలో వుండే శ్రీమాన్ రమణాచార్యుల వారు **మాతృదేవోభవ, పితృదేవోభవ...** అనే వేదసూక్తికనుగుణంగా-**యాన్యన వద్యాని కర్మాణి. తాని సేవితవ్యాని'** అనే రీతిని అనుసరించి ఇట్లు సాహితీ యజనం చేసి పితరుల కానందం కల్గించినారు.

శ్రీమాన్ ఆచార్యుల వారి నామధేయ సంబంధమేగాక - వారు తమ వ్యాఖ్యలకుంచిన ఎన్నో విశేష నామధేయాలలో 'రాఘవీయం' కూడా కలదు. పూర్వం రాచకొండ పాలకులైన రావుమాదానేడు కూడా నేడు తన శ్రీరామాయణ వ్యాఖ్యకు రాఘవీయమని పేరు పెట్టినాడు, అందుకే 'రాఘవీయం' ఉభయ విధ ద్యోతకంగా వుంటుందనే కుమారుల వాంఛ యిట్లా పరిపూర్తమయింది.

రాఘవాచార్యుల వారి ప్రతి యొక రచనను గూర్చి సంక్షేప సమీక్ష ప్రసాదించవలెనని సుప్రసిద్ధులు, వ్యాఖ్యాన విశేషములు తెలిసిన పెద్దలను లేఖలద్వారా అభ్యర్థించినాము, వీరిలో కొందరు స్పందించి అనుకున్న సమయంలో - అనువైన రచనలను పంపి ఆనందింపచేసినారు. మరికొన్ని గ్రంథాల గూర్చి ఆనాడు పెద్దలు వ్రాసిన అభిప్రాయాలనే వేయవలసి వచ్చింది, ఆచార్యుల వారి గ్రంథ విశేషాలతో బాటు ఏతత్సంబంధ విషయావగాహనకలుగునట్లు మరికొన్ని సాహిత్య వ్యాసాలను ఆయాశాఖలయందు ప్రత్యేకత సాధించిన పెద్దల

ద్వారా వ్రాయించి చేర్చి, వీనితోపాటు కవితా వైభవోపేతులైనవారి సంస్కృతాంధ్ర కవితలను కొన్నిటిని చేర్చినాము. 'రాఘవీయం' కారణంగా శ్రీమాన్ ఆచార్యుల వారి 'అక్షరమూర్తిని-ఇట్లా సేవించుకునే భాగ్యం మాకు కల్గినందులకానందిస్తున్నాము.

మరొక విశేషమేమనగా - శ్రీమాన్ రాఘవాచార్య స్వామివారి జీవిత విశేషాలను ప్రత్యేకంగా తెల్పటానికి బదులు ఆంధ్ర సారస్వత పరిషత్తువారు నిర్వహించే 'పరిణతవాణి' ప్రసంగ పరంపరలో ఆచార్యులవారి 'పరిణతవాణి'ని యథాతథంగా 'స్వవిషయం' పేరున చేర్చినాం, వీలయినంతమేర కొన్ని ఫోటోలను కూడా చేర్చి - వివిధ సందర్భాలలో పెద్దలు-శ్రీమాన్ ఆచార్యులవారినభినందించిన సన్నివేశాలను పదిల పరచే యత్నం చేసినాము. వీటన్నిటికీ వెన్నముక బలం కూర్చింది శ్రీమాన్ కె.వి.రమణాచార్యులవారే. అందుకే **"యఃప్రీణతే సుచరితైః పితరం సపుత్రః"** అనే భర్తృహరి వ్రాతనుసార్థక పరచిన ఆచార్యులవారి శ్రద్ధాతత్పరత ప్రశంసావహం. ఇంకా చేర్చవలసిన - చేరవలసిన సమాచారం వున్నా ప్రస్తుతానికిట్లా ఈ కృతిని సాహితీలోకానికి అందిస్తున్నాం రాఘవాచార్యుల వారి ప్రతి యొక రచనను గూర్చిన ఈ సమీక్షా వ్యాసాలను చదివినచో వారి కృతులను చదువలేదనే సంశయం నివృత్తి కాగలదు - భవిష్యత్తులో ఎవరైనా రాఘవాచార్యుల వారి 'దేశిక సాహితీ వరివస్య' నుగూర్చి పరిశోధన చేస్తే ఈ సంచిక పాథేయంగా ఉపకరిస్తుందని ఆశంస.

రాఘవాచార్యుల వారు చరమదశవరకు తమలేఖినిని ఆపలేదు, వారిది సు-వర్ణ లేఖిని - అందుకే శ్రీనివాసాచార్యుల వారు 'సౌవర్ణలేఖిని' శీర్షికతో విశేష విషయాలను తెల్పగా- చిట్టచివర ఆచార్యులవారి నివాసాన్ని గూర్చి మురళీధరగౌడుగారు, 'ఖాళీగది'ని చూపిస్తున్నారు.

ఈ విధంగా ఈ కృతి సిద్ధంకావటానికి సహకరించిన రాఘవాచార్యుల వారి కుంటుంబం మా అభ్యర్థనను మన్నించి రచనల పంపి సహకరించిన గద్య-పద్య రచనా వైభవోపేతులైన రచయితలందరికీ ధన్యవాదాలు.

ఒక సంవత్సర కాలం నుండి 'సర్వము తానె' యై సంచికా నిర్మాణ, ముద్రణ కార్యక్రమాలను నిర్వహించిన శ్రీ తాళ్లపల్లి మురళీధరగౌడు - ఆచార్యులవారున్నప్పుడు వారి గ్రంథప్రకాశానికి చేసిన కృషివలెనే దీనికి కూడా కృషి చేసి - తమ భక్తి ప్రపత్తుల నిరూపించుకొన్నారు. ఆచార్యుల వారి సన్నిధానంలో వీరొక 'తొండరడిప్పొడి యాళ్వార్' అనటం సమంజసం. తిరుమల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 'రాఘవీయం'ను ప్రచురించిన సంస్థనిర్వాహకులభినందనీయులు.

డి.టి.పి. నిర్వహణలో శ్రీ కె.బి.టి.కొండయ్య, ముఖచిత్రాలంకరణలో శ్రీ టి.మల్లేశ్ వారికి ఎంతో సహకరించిరి. కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్ అధినేత శ్రీ ఎ. జగన్మోహనరెడ్డి అందంగా ముద్రించడంలో శ్రద్ధ వహించినారు, వీరందరికి ధన్యవాదాలు.

'దిక్కాలాద్యనవచ్ఛిన్నానన్త చిన్మాత్రమూర్తయే
స్వాను భూత్యేక మానాయ నమః శాన్తాయ తేజసే'.

సంపాదక మండలి

స్వస్తి సౌహార్దాయ

డా॥ శ్రీ.న.చ.రఘునాథాచార్యస్వామివారు


చరవాణి: 0870 2435 999

మహామేధా సంపన్నులు శ్రీవేదాన్తదేశిక కృత స్తోత్ర సముదాయమునంతా, (పాదుకా సహస్రంతో సహ) విపులమైన ఆంధ్ర వివరణంతో లోకానికి అందించిన మహనీయులు శ్రీ.ఉ.వే.కె.వి.రాఘవాచార్యస్వామి వారు ధన్యజీవులు. వయస్సునుబట్టి నా కంటే రెండు మూడు సంవత్సరాలు చిన్నవారు. అయినా, నిర్మల హృదయంతో సోత్సాహంగా శ్రీ వైష్ణవ సంప్రదాయ సేవను చేసిన పవిత్ర హృదయులు వారు.

శ్రీ దేశికులవారి యాదవాభ్యుదయ మహాకావ్యం 24 సర్గలతో సుమారు 2000లకు పైగా శ్లోకాలు కలిగినది. దానికి అప్పయ్య దీక్షితులు సంస్కృతంలో వ్యాఖ్యను వ్రాసియున్నాడు. అట్టి మహాకావ్యాన్ని వీరు ఆంధ్ర వివరణంతో ప్రకటించటం వీరి హృదయములోని మహోత్సాహానికి ప్రతీక. ఈ మహాకావ్య వివరణం సమాప్తం కాకుండానే పరమపదనాథుడు వీరిని తన సన్నిధికి చేర్చుకోవటం, అస్మదాది రసికజన భాగ్యలోపమే నని భావిస్తున్నాను. వ్యాఖ్యాన రచనా సందర్భాలలో అచ్చటచ్చట వారు చూపిన వ్యాకరణాది శాస్త్ర వైదుష్యము అస్మదాదులకు ఆశ్చర్యావహమైనది. వీరు శ్రీవైష్ణవ సంప్రదాయ సేవకై చేసిన అమోఘ కృషి అస్మదాదులకు ఆదర్శప్రాయమైనది.

వీరి గర్భసంభూతులై విద్యావినయాది సంపత్తి కలిగి ప్రభుత్వ నిర్వహణలో క్రమముగా అనేకోన్నత పదవులను అధిరోహించిన వీరి కుమారులు శ్రీమాన్ కె.వి.రమణాచార్యాదులు సత్సంప్రదాయ సేవాధురంధరు లగుటయే గాక, తమ పితృపాదుల ఆశయాలకు అనుగుణంగా మసలుకొనుట సర్వథా అభినందనీయ విషయము. వీరు ఇతఃపరం కూడా తమ పితృపాదులవలె సత్సంప్రదాయ నిష్ఠాగరిష్ఠులై లోకానికి మార్గదర్శకులై అస్మదాదులకు ఆలంబనమై చిరంజీవులై ఉజ్జ్వల కీర్తి సంపన్నులై వెలుగొందుదురు గాక- అని సౌహార్దపూరితమైన నిర్మల హృదయముతో ఆకాంక్షించుచున్నాను.

మన ఆచార్యులు



శ్రీమద్రామానుజులవారు




శ్రీమద్వేదాంతదేశికులవారు



శ్రీమాన్ కే.వి. రాఘవాచార్యులు, శ్రీమతి పద్మావతి


కని, పెంచిన దైవం
మా అమ్మ!
మమ్ము నడిపించే దైవం
మా నాన్న!!

సాష్టాంగ ప్రణామాలతో -
— కె.వి. రమణాచార్య
కె. మనోహరాచార్య



రాఘవాచార్య జననీజనకులు

తిరుమల మనోహరాచార్యులు, వేంకటమ్మ



సోదరులతో **శ్రీమాన్ కే.వి. రాఘవాచార్యులు**

శ్రీమాన్ పార్థసారథి, డా॥ తిరుమల శ్రీనివాసాచార్య,

శ్రీమాన్ శేషాచారి (బావగారు), శ్రీమాన్ కె.వి. నరసింహాచార్యులు.



(2002) శ్రీనారాయణ శతక వాఖ్యాన గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య సి. నారాయణరెడ్డి, మరి కొందరు ప్రముఖులు



సభలో ప్రసంగిస్తున్న గ్రంథకర్త శ్రీమాన్ కె.వి. రాఘవాచార్యులు



మహాకవి సినారె, మహా పండితులు రాఘవాచార్య కలుసుకున్న అపురూప సన్నివేశం



అహోబిలమఠం, హైదరాబాదులో జరిగిన పాదుకాసహస్ర సమర్పణ సభా కార్యక్రమంలో
ప్రసంగిస్తున్న శ్రీమాన్ కే.వి. రాఘవాచార్యులు



శ్రీ జీయర్‌స్వామి 'శ్రీయతిరాజసప్తతి' గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న సందర్భం.
చిత్రంలో గ్రంథకర్త శ్రీరాఘవాచార్య, శ్రీ కే.వి. రమణ, డా శ్రీనివాసాచార్య మొదలైనవారు



శ్రీ కుర్తాళం పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ స్వామి వారితో శ్రీ కే.వి. రాఘవాచార్య



'న్యాస దశకం' గ్రంథావిష్కరణ సభలో ప్రసంగిస్తున్న డా॥కె.వి. రమణాచార్యులు.
చిత్రంలో వేదికపై ఆసీనులైన గ్రంథకర్త శ్రీ కే.వి.రాఘవాచార్యులు (ఎడమనుండి ప్రారంభంలో)



'వరదరాజ పంచాశత్' గ్రంథావిష్కరణ కార్యక్రమానికి విచ్చేయుచున్న గ్రంథకర్త శ్రీమాన్ కే.వి. రాఘవాచార్యులు



ఆచార్య కోవెల సుప్రసన్నాచార్యను సన్మానిస్తున్న ఆచార్యులు గారు




(2015) తిరుపతిలో జరిగిన 16వ మహాలక్ష్మీ యాగంలో
జీయర్ స్వాముల మధ్య ఆసీనులై ప్రసంగిస్తున్న శ్రీ రాఘవాచార్యులు



గోపాల దేశిక పురస్కారాన్ని స్వీకరిస్తున్న శ్రీ ఆచార్యులవారు



చిన్నజీయర్ స్వామి వారి సన్నిధిలో శ్రీమాన్ రాఘవాచార్యులు, రమణాచార్యులు, తిరుమల శ్రీనివాసాచార్యులు



సోదరుడు, ప్రముఖ కవి డా॥ తిరుమల శ్రీనివాసాచార్యతో శ్రీ రాఘవాచార్యులు



సోదరుడు శ్రీనివాసాచార్య రచించిన 'రుబాయీ గులాబీలు' గ్రంథావిష్కరణ సభలో పాల్గొన్న శ్రీ రాఘవాచార్యులు. చిత్రంలో డా॥ జె. బాపురెడ్డి, డా॥ అద్దేపల్లి రామమోహనరావు, డా॥ సినారె, డా॥ కే.వి. రమణాచార్యులు



తండ్రి గారితో తనయుడు రమణాచార్య




(2015) రసమయి నిర్వహణలో సోదరుడు శ్రీనివాసాచార్యులు, శ్రీ రాఘవాచార్యులు గారికి జరిపిన కనకాభిషేక సన్నివేశం.
చిత్రంలో మంత్రి శ్రీ టి. హరీశ్‌రావు, డా॥ కే.వి. రమణాచార్య, డా॥శ్రీనివాసాచార్య, శ్రీ మండలి బుద్ధప్రసాద్, శ్రీమతి స్వరాజ్యలక్ష్మి.



కనకాభిషేక మహోత్సవానంతరం శ్రీ కే.వి. రాఘవాచార్యులు గారిని
జ్ఞాపికతో సన్మానిస్తున్న మంత్రివర్యులు శ్రీ టి. హరీశ్‌రావు



with sons, daughters, son-in-law and Daughter-in-law
(Right to left) Eldest son and daughter-in-law Latha and Ramana, Eldest daughter Shakuntala, Second daughter and Son-in-law Rama and Parthasaradhi, Son and Daughter-in-law Manohar and Rama
Youngest Daughter and Son-In- Law Suvarna and Sharath



With his grandsons and granddaughter and great grandsons and daughters:
(Left to right) Great-granddaughter - Srinidhi Srinivas, Granddaughter (daughter of Manohar) Abhyudaya Grandson-in-law (2nd Son-in-law of Ramana Chary) Srinivas and he is holding his son Aarav (Great-grandson) First grandson Kiran, Great-grandson Saurabh Srinivas, Great-granddaughter- Medha, Second grandson- Hareeth



With his brothers and sister and their sons, daughters, granddaughters and grandsons.



with daughters and daughter-in-laws (Left to right) Youngest daughter-in-law Rama, Eldest daughter Shakuntala, Rama, Suvarna and Eldest daughter-in-law Latha Ramana.



With his youngest son-in-law and daughter (Sharath- Suvarna).

అనుక్రమణిక

వాచస్పతి

డా॥ సముద్రాల వేంకట రంగరామానుజాచార్యః

శ్రీమన్తః ప్రతిభాసితోచ్ఛ సువచఃపాండిత్య శౌండీరిమ
ఖ్యాతా వైష్ణవతత్త్వ విత్త్వమహితాః శ్రీరాఘవార్యా బుధాః।
నానాగ్రంథ నిషేవణాత్త వితతజ్ఞాన శ్రియా రాజితాః
తద్విశ్రాణనతా స్వభావమధురా జీయాసు రాతారకమ్॥

హే స్వామిన్! భవదీయ టీకన కలాలాలిత్య ముద్భావ్యయత్
చేతః చిత్రయతేతరామ్ కిమితి తేసౌజన్య మాచక్ష్మహే।
శ్రీమద్వైష్ణవ సంప్రదాయ భరితాన్ వ్యాఖ్యా విశేషాన్ బహూన్
ఆవిష్కృత్య సుధన్యతాముపగతం త్వాం సంస్మరామో వయమ్॥

శ్రీరామానుజదర్శనే కృతమతిః, తత్త్వ నిష్ఠాత్మాతాం
స్వీయోద్గ్రంథ సుదర్పణేతి విశదాం సందర్శ్య తుష్టో భవాన్।
శ్రీమత్ సంస్కృత- ద్రావిడీకృతి చయాత్యంతాంత రాగూఢమ
వృత్త్యాశ్చర్య విధానిదర్శిత మహో! విష్ణోః పదే మోదతామ్॥

శ్రీవేదాన్త సుదేశికాద్భుత మహాగ్రంథానువృత్తిం ముదా
హ్యాంధ్ర్యాం వాచి, వితీర్య, సుస్థిరయశాః సంప్రాప్తమోదో భవాన్।
భావత్కాతులటీకనేన, నను, తే కోశాః సదా వైష్ణవ
శ్రీమాహాత్మ్యముదీరయన్త ఇహనః శ్రీ వైష్ణవానాం ధనమ్॥

జీయా! రాఘవదేశిక! జీయాసుః శ్రీభరాః భవత్కోశాః।
శ్రీపాదుకా 'సహస్ర' ప్రముఖోపరిటీకనాత్ బుధామోదాః॥

యతిపతి 'సప్తతి' రద్యా! హ్యధికార సుసంగ్రహోపి సత్కీర్త్యః।
యదుపతివంశ విభూతిః కావ్యం ప్రాటీకి యాదవాభ్యుదయ మితి॥

బహుకాల పూర్వపరిచిత సత్కోశః శ్రీశఠారి సూక్తీద్యః।
భగవద్విషయ వివర్తో హ్యాస్త్రీ సద్వాచిసమ్యగుద్గీర్ణః॥

భవదీయ సద్విచింతా పరిచింతన హృష్టతుష్ట చిత్తోత్థం।
హార్దం భావనమిహభోః! స్వామిన్! సంధృభ్యతే మయాప్రీత్యా॥

పాదుకా సహస్ర వ్యాఖ్య (1సం.)

ఆచార్య శ్రీపెరుంబూదూర్ లక్ష్మణమూర్తి
చరవాణి: 9959 876 675

శ్రీమాన్ శ్రీకారంచేటి తిరుమల వేంకట రాఘవాచార్యులుగారు పరమపవిత్రమైన భగవద్భక్తి భరితమైన నిర్దోషమైన జీవితమును గడిపిన మహాపురుషులు. వారితో కించిత్పరిచయమైనా పవిత్రత నాపాదిస్తుంది. అలాంటి సజ్జనులను గూర్చియే-

మద్భక్తజన సమ్మర్ద పాద పాంసు విమర్దనాత్।
చతుస్సాగరపర్యంతో పావనాస్యాద్వసుంధరా॥

అను సుప్రసిద్ధ నారదీయ శ్లోకం.

పవిత్రమైన పారాయణ యోగ్యమైన శ్రీ వైష్ణవ స్తోత్ర గ్రంథాలకు, ముఖ్యంగా శ్రీమద్వేదాంత దేశిక రచిత స్తోత్రాలకు, శ్రీమాన్ శ్రీ ఆచార్యులుగారు సులభ సుందరమూ మధురమూ అయిన వ్యాఖ్యానాలను తెలుగులో వ్రాసినారు. భక్తిప్రబంధాలకు స్తోత్రాలకు వ్యాఖ్యానాన్ని రచించడానికి కేవలం పాండిత్యం నిరుపయోగం. నిరంతర భగవచ్చరణారవింద సంలగ్నమైన పునీతమైన మనస్సు ప్రధానం. అందుకే శ్రీమాన్ శ్రీ ఆచార్యులవారు శ్రీవేదాంత దేశిక రచిత స్తోత్రాలను, తదితర శ్రీ వైష్ణవ స్తోత్రాలను సాధికారంగా వ్యాఖ్యానించడానికి సంపూర్ణంగా అర్హులు.

కేవల స్తోత్ర గ్రంథాలకే కాదు, శ్రీమద్వేదాంత దేశికులనుగ్రహించిన సంస్కృత కావ్యాలకూ చక్కని వ్యాఖ్యానాలను సంతరించినారు. యాదవాభ్యుదయం, అచ్యుత శతకం, దయాశతకం మొదలైన సత్కావ్యాలు వారి వ్యాఖ్యానాల మూలంగానే తెలుగులో అందరూ చదివి ఆనందించడానికి అవకాశమేర్పడింది. వారి వ్యాఖ్యానాలన్నింటిలోనూ అతి ప్రసిద్ధమైంది బృహత్తరమైందీ శ్రీరంగనాథ పాదుకా సహస్ర వ్యాఖ్యానం.

శ్రీమద్వేదాంత దేశికులు తమ పాండిత్య వైవిధ్యాన్ని, భక్తి పారమ్యాన్ని, పారవశ్యాన్నీ, శ్రీరంగనాథ పాదుకా సహస్ర స్తోత్ర కావ్యంలో ప్రస్ఫుటం చేసినారు. వారి సర్వతంత్ర స్వాతంత్ర్యం, కవితా సౌందర్యం ఈ స్తోత్ర కావ్యంలో నిండుగా కన్పిస్తాయి. వ్యాకరణ విద్యా కౌశలం, అలంకార ప్రయోగ చమత్కృతి అను పదం దర్శనమిస్తాయి. ఈ గ్రంథానికి సంస్కృత వ్యాఖ్యానాలున్నాయి. కన్నడ తమిళ భాషల్లో వివరణలూ ఉన్నాయి. శ్రీ వేదాంత దేశికుల 'పాదుకా సహస్రం' ఆవిర్భవించి ఐదువందల సంవత్సరాలు గడిచినా తెలుగులో వ్యాఖ్యానం కానీ, వివరణంకానీ లేకపోవడం విచిత్రమే.

తెలుగువారి అదృష్టవశాత్తు పోతనగారు ఆంధ్రీకరించేవరకు భాగవతం తెలుగులో అవతరించనట్లే, భక్తుల భాగ్యవశాత్తు శ్రీమాన్ శ్రీ రాఘవాచార్యులుగారు వ్యాఖ్యానించేవరకు తెలుగులో పాదుకా సహస్రాన్ని

వ్యాఖ్యానించడానికి ప్రయత్నించిన వారులేరు. శ్రీమాన్ శ్రీ ఆచార్యులవారు గ్రంథాదిలో 'విన్నపం' చేస్తూ ఇట్లా వ్రాసినారు–

"**శ్రీమద్వేదాంత దేశిక** ప్రణీతమైన స్తోత్ర కావ్యములలో శ్రీరంగనాథ పాదుకా సహస్రం అతి ప్రౌఢమై, అనర్ఘానేక భావగర్భితమై, సర్వశాస్త్ర సారమై నిత్యానుసందేయమై, బ్రహ్మ విద్యలతో సమానముగా ముప్పది రెండు పద్ధతులతో భాసమానమై నమ్మాళ్వారులనుగ్రహించిన 'సహస్రగీతి' రీతిగా సహస్ర పద్యమయమై అద్భుతముగ అలరారుచున్న గ్రంథరాజము పాదుకా సహస్రమునకు సంస్కృతమున, తమిళమున, కన్నడమున వ్యాఖ్యానములున్నవి. కాని తెలుగు భాషలో వ్యాఖ్యానము లేదు. శ్రీమాలోల నృసింహస్వామి కృప, ఆచార్య కటాక్షము నాపై ప్రసరింపకుండినచో లోకోపకారకముగ నుండు ఈ స్తోత్రము రమణీయాంధ్ర టీకా తాత్పర్య వ్యాఖ్యా సహితముగ ప్రకాశితము కాకుండెడిది..."

శ్రీమాన్ శ్రీ ఆచార్యులవారు టీకా తాత్పర్యాలనే కాదు విశేషమైన, ఉపదేశ పరమైన, ప్రసన్న చమత్కృతి పూర్ణమైన వివరణాన్నీ ఈ గ్రంథంలో పలుచోట్ల నిక్షేపించినారు.

శ్రీ దేశికుల సంస్కృతమెంత ప్రౌఢమో, శ్రీమాన్ శ్రీ ఆచార్యులవారి తెలుగు అంత సరళము సులభము. మధురమైన తెలుగునకు తోడుగా చక్కని తమిళ ప్రబంధ పాండిత్యాన్ని సంతరించుకున్న సంప్రదాయ వివరణం శ్రీమాన్ ఆచార్యులవారి వ్యాఖ్యానంలో సాక్షాత్కరిస్తుంది. మధురమైన తెలుగు పద్యాలను– పోతనగారి నుండి కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారి వరకు– వ్యాఖ్యానంలో ఉదాహరిస్తారు. వారి వివరణ స్వభావాన్ని తెల్పడానికొక శ్లోకాన్ని ఉదాహరిస్తాను–

ధత్తే ముకుంద మణిపాదుక యోర్నివేశాత్/ వల్మీక సంభవగిరా సమతాం మయోక్తిః
గంగా ప్రవాహ పతితస్య కియానివస్యాత్/ రథ్యోదకస్య యమునా సలిలాద్వి శేషః॥ (శ్లో.6)

"పాదుకలను వర్ణించే నా వాక్కు వాల్మీకి వాక్కుతో సమానత్వాన్ని పొందుతుంది. గంగా ప్రవాహంలో కలిసిన పిమ్మట వీథిలోని నీటికి యమునా ప్రవాహానికి భేదమేముంటుంది?"

శ్రీ రామాయణంలో వాల్మీకి పాదుకలను వర్ణించినాడు. వాల్మీకి యంతటివాడు వర్ణించిన పిదప మరొక కవి– వేదాంత దేశికులే కావచ్చు– ఎవరైనా వర్ణిస్తే లక్ష్యం చేస్తారా? అని సందేహం. శ్రీ దేశికులు ఆ సందేహాన్ని ఈ శ్లోకంతో పరిహరించినారు. శ్రీమాన్ శ్రీ రాఘవాచార్యులవారి వివరణం:

"పవిత్రమైన అతిగంభీరమైన యమునా నదీజలం గంగా ప్రవాహంలో ప్రవేశిస్తుంది కదా! అలాగే తీరాన ఉండే నగరాల్లోని వీథుల్లో, వర్షం కురిసినప్పుడు పారే అపరిశుద్ధ జలం కూడా గంగాప్రవాంలో కలిసి ప్రవహించక తప్పదు. అది అనివార్యం. గంగలో కలిసిన తర్వాత గంగాతీర్థాన్ని స్వీకరింపరాదు, త్రాగకూడదు అనేవారుందురా? యమున నీటికి, వీథిలోని మురుగు నీటికి గంగా ప్రవాహంలో కలిసిన తరువాత భేదమేమైనా కనబడుతుందా? యమునా సలిలం కానీ రథ్యోదకం కానీ గంగలో అవశ్యంగా పడిపోయినందున రెండు సమానస్థితిని పొందుతాయి. గంగాజల పరిమాణ మధికమౌతుంది.

గంగాప్రవాహంలో చేరిన ఏ జలమైనా పునీతమవుతుంది. ఇతరులకు పావనత్వాన్ని కలిగించే శక్తి కూడా ఆ జలానికి సిద్ధిస్తుంది.

పాదుకా స్తోత్రం గంగాప్రవాహంలాంటిది. వాల్మీకి సూక్తి యమునా సలిలంలాంటిది. దేశికుల సూక్తి రథ్యోదకం లాంటిది. అధికులు కానీ, అల్పులు చేసిన స్తోత్రం విషయ గౌరవాన్నిబట్టి కలిగించే లాభంలో భేదముండదు. వాన కురిసినప్పుడు తీరాన ఉండే నగరంలోని నీరు గంగా ప్రవాహంలో కలిసిపోవడం ఎట్లా దుర్నివారమో అట్లే దేశికుల సూక్తికూడా పాదుకా స్తోత్ర విషయంగా ప్రసరించడం అవశ్యమే అయింది. తనకిష్టం లేకున్నా కొనసాగుతూనే ఉంది. వాల్మీకిది ఋషివాక్కు. దేశికులది ఆర్షం కాదు. మహర్షి వాక్కు కావడం కాకపోవడంలో వైషమ్యమున్నా, ఇర్వురి సూక్తులు పాదుకా స్తుతిగా రూపొందడం వల్ల ఇష్టాన్ని కూర్చడంలోనూ, అనిష్టాన్ని నివారించడంలోనూ సమానంగానే ఉంటాయి. పాదుక అనుభవాన్ని ప్రసాదించడంలో రామాయణ సామ్యాన్ని పొందుతాయి".

ఇట్లా సులభ వ్యావహారికంలో పాదుకా సహస్రంలోని శ్లోకాలన్నింటికీ శ్రీమాన్ శ్రీ ఆచార్యులవారు వ్యాఖ్యానాన్ని రచించినారు.

సంస్కృత వ్యాఖ్యాతలలో ఇరువురు సుప్రసిద్ధులు. ఇద్దరూ ఆంధ్రదేశానికి చెందినవారే. ఒకరు మల్లినాథసూరి, మరొకరు రామచంద్ర బుధేంద్రుడు. శ్రీ మల్లినాథసూరి తమ వ్యాఖ్యానారంభంలో "నా మూలం లిఖ్యతే కించిన్నానపేక్షిత ముచ్యతే" అని ప్రతిజ్ఞచేసినారు. వారు పండిత పరిషత్తును మనస్సునందుంచు కొని ఏది సులభమని గతార్థమని వారు భావించినారో దానిని వదిలివేసి విపశ్చిత్సందోహానికి సందేహం కలిగించే గ్రంథగ్రంథులని విశేషంగా వ్యాఖ్యానించినారు. రామచంద్ర బుధేంద్రుడు తమ వ్యాఖ్యానారంభంలో మల్లినాథసూక్తిని స్మరించి కాబోలు–

వ్యాకుర్వన్తి నిబద్ధ గౌరవ భయాన్నైవస్ఫుటం
యుక్తిభిః/........... కా నైపుణీ వా తతః?

అంటూ తన మార్గాన్ని భిన్నంగా నిర్దేశించినాడు. "నా నపేక్షితముచ్యతే" అంటే 'అపేక్షితం' ఎట్లాంటి వారికి? "అనపేక్షితం" ఎట్టివారికి? స్పష్టంగా వర్గీకరించడం కష్టం.

స్ఫుటంగా, యుక్తియుక్తంగా, విస్తరభీతిలేకుండా, వ్యాఖ్యానించడమే వ్యాఖ్యాన కర్త చేయవలసింది. ఇట్లాంటి పద్ధతినే శ్రీమాన్ శ్రీరాఘవాచార్యులవారు అనుసరించి, వివరంగా ఆహ్లాదకరంగా వ్యాఖ్యానించినారు.

శ్రీమాన్ శ్రీ ఆచార్యులవారి స్తోత్ర వ్యాఖ్యానాలు అనర్ఘరత్నాలు. భక్తివేదాంత విజ్ఞాన సర్వస్వాలు.

భక్తిరసాప్లుత సంస్కృత ద్రావిడ స్తోత్ర సాహిత్య రసికులందరూ వారికి శాశ్వతంగా అధమర్ణులు.

పాదుకా సహస్ర వ్యాఖ్యానము (2 సం.)

డా॥ తిరుమల కృష్ణదేశికాచార్యులు (కెనడా)

చరవాణి: 1-6473 454 773

శ్రీమద్వేదాంతదేశికులవారి బహుగ్రంథ పరంపరలో బహుళప్రశస్తిని, వ్యాప్తిని, ప్రభావమును కలిగినది 1008 శ్లోకముల పరిమితిగల 'పాదుకాసహస్ర'మను గ్రంథరాజము. శ్రీరంగనాథుని పాదుకాస్తవరూపమైన ఈ ఉద్గ్రంథమును మరొక ఆశుకవితో కలిగిన స్పర్ధామూలమున ఆశువుగా నొక్కరాత్రిలో దేశికులవారు రచించిరని 'వేదాంతాచార్య విజయ'మను సంస్కృత గ్రంథమును, 'ఆచార్య సూక్తిముక్తావళి' యను తెలుగు ప్రబంధమును తెల్పుచున్నవి. ఆచార్యసూక్తి ముక్తావళిలో ఈ ప్రతిస్పర్ధియైన ఆశుకవి పేరు లోకాచార్యులుగా పేర్కొనబడినది. తెల్లవారు సరికి లోకాచార్యులు శ్రీరంగనాథుని పాదపద్మములపై 500 శ్లోకములు మాత్రమే వ్రాయగల్గుటచే, శ్రీరంగనాథుని పాదుకలపై 1008 శ్లోకములతో పాదుకాసహస్రమును రచించిన దేశికులవారు విజయమును సాధించిరట. కాని ఈ విజయము స్వోత్కర్షగా భావించి వారు గర్వించలేదట.

శ్లో॥ సూతే సూకరయువతిః సుతశత మత్యంత దుర్భగం ఝటితి,
కరిణీ చిరాయ సూతే సకల మహీపాల లాలితం కలభమ్॥

(పంది వికారమైన, అదృష్టహీనమైన వందల పిల్లలను అతి స్వల్ప వ్యవధిలో కనును. కాని భద్రగజము బహుకాలమున కొక్క రాజాధిరోహణ యోగ్యమైన కలభమును కనును.)

అని ఆశువుగా పలికి ప్రతిస్పర్ధికి ప్రణమించిరట! ఈ స్పర్ధవల్ల శ్రీరంగనాథుని పాదుకాస్తవమొనర్చు భాగ్యము కల్గెనని వారు సంతృప్తి పడిరట!

అతి స్వల్పవ్యవధిలో రచించినను ఈ గ్రంథములో తర్కవేదాంత విషయములు, శ్రీవైష్ణవ సంప్రదాయ ప్రతిపాదకములగు విషయములు, అర్థాలంకార బాహుళ్యము, ఛందోవైవిధ్యము, వ్యంగ్య వైభవము పుష్కలముగా నుండుట 'కవితార్కిక సింహ', 'సర్వతంత్ర స్వతంత్ర' బిరుదాంకితులైన శ్రీ దేశికులవారి పాండితీ ప్రకర్షకు, ఉభయవేదాంత పాండిత్యమునకు, ఆచార్యత్వమునకు నిదర్శనములుగా నున్నవి.

సాహిత్య, పారమార్థికపు విలువలు పుష్కలముగా నున్న ఈ గ్రంథములో కొన్ని శ్లోకములు మంత్ర ప్రభావము సైతము కలిగియున్నవని, వాని ఉపాసనము వల్ల లౌకిక ప్రయోజనములు చేకూరునని కొందరు గుర్తించినారు. ఇట్టి శ్లోకములన్నిటిని ఒకచోట చేర్చి, వానిని ఉపాసించు విధానము నిచ్చుచు శ్రీ ఆండవన్ మఠాధిపతులొక చిన్న పొత్తమును ప్రకటించినారు.

ఈ గ్రంథమునకు భరద్వాజ శ్రీనివాసాచార్యులు వ్రాసిన ప్రాచీన సంస్కృత వ్యాఖ్యాన మొకటున్నది. అనంతరకాలమున సంస్కృతములోను, తమిళ, కన్నడ భాషలలోను వ్యాఖ్యానములు వచ్చినవి. ఆండవన్

మఱియు ఉత్తమూరు స్వామివారల వ్యాఖ్యానముల ననుసరించి ఇటీవల శ్రీ వరదరాజన్ శఠకోపన్‌గారు ఇంగ్లీషులో కూడా వ్యాఖ్యానమును మూల శ్లోకసహితముగా నిచ్చినారు. కాని శ్రీ వైష్ణవుల కత్యంత ప్రధానమైన ఈ గ్రంథమునకు 1996 వరకు తెలుగులో వ్యాఖ్యానము వెలువడలేదు. అహోబిల మఠాధీశ్వరులు శ్రీశ్రీవణ్ శఠకోప శ్రీనారాయణ యతీంద్ర మహాదేశికులవారి ప్రోత్సాహముతో విద్వన్మణులు, ఉభయ వేదాంత నిష్ణాతులైన శ్రీమాన్ కె.వి.రాఘవాచార్యస్వామివారిచే మూలగ్రంథము వెల్వడిన 700 సంవత్సరములకు ఈ లోపము తీర్చబడినది. సంస్కృతాంధ్ర ద్రవిడభాషలలో మహాపండితులైన వీరు సరళమైన తెలుగులో నీ వ్యాఖ్యానమును రచించి, తెలుగు జాతికి మహత్తరమైన సేవ చేసినారు.

పాదుకాసహస్రము వంటి గ్రంథములకు వ్యాఖ్యానము వ్రాయుటకు తగిన విద్వత్తుగలవారు ఈ కాలములో చాలా అరుదు. దీనికై సంస్కృత వ్యాకరణములోను, తర్కమీమాంసాశాస్త్రములలోను, మంత్రశాస్త్రములోను, శ్రుతిస్మృతులలోను, పురాణములలోను, తమిళ ప్రబంధములలోను కూలంకష పాండిత్య ముండవలెను. శ్రీ వైష్ణవ సంప్రదాయము చక్కగా తెలిసియుండవలెను. ఇవి యున్నను సరళముగా విషయమును వ్యక్తీకరింపగల సామర్థ్యముండవలెను. శ్రీ రాఘవాచార్యులవారి వ్యాఖ్యానమును చూచినచో ఈ లక్షణము లన్నియు వారిలో సమగ్రముగా నున్నట్లు నిస్సంశయముగా గోచరించును.

నేను శ్రీ రాఘవాచార్యుల శేముషీ శిఖరౌన్నత్యమును కొలుచు సమర్థుడను గాను. ఆ శిఖరోపత్యకల నధిగమించి చూడలేని అసమర్థుడను. పైగా వారనేక సంపుటములుగా వెలవరించిన వ్యాఖ్యానములో **141 నుండి 380 శ్లోకముల వరకుగల రెండవ సంపుటమును** మాత్రమే నేను చూడగల్గితిని. దానిలో నాయల్పబుద్ధికి దట్టిన వ్యాఖ్యాన విశేషములను కొన్నిటి నిచ్చట స్పర్శింప సాహసించుచున్నాను.

వ్యాకరణ విశ్లేషణ:

శ్లో॥ సామ్రాజ్య సంపదివ దాసజనోచితా త్వం/ రామేణ సత్యవచసా భరతాయదత్తా।
సత్వాం నివేశ్య చరణావని! భద్రపీఠే/ పృథ్వీం బుభోజ, బుభుజేచ యశోవిభూతిమ్॥

'ఓ పాదుకాదేవీ! దాసజనులకు సేవింప యోగ్యమైన సామ్రాజ్య సంపదలాగ సత్యవచస్కుడైన రామచంద్రునిచే భరతున కొసగబడినావు. ఆ భరతుడు నిన్ను భద్రపీఠమున అధివసింపజేసి, భూమిని పరిపాలించినాడు, యశోవిభూతిని అనుభవించినాడు'- అని ఈ శ్లోకానికి తాత్పర్యం. దేశికులవారు భుజ్ ధాతువు యొక్క లిట్ (పరోక్ష భూతకాల) రూపములైన బుభోజ, బుభుజే అను రూపములను వాడి ఈ శ్లోకమునకు విశేషమైన అర్థమును సమకూర్చినారు. భుజపాలనాభ్యవహారయోః అని ధాతుపాఠంలో భుజ్ ధాతువు పరస్మైపదిగా పేర్కొనబడింది. కాని భుజోనవనే (ఆత్మనేపదమ్) అను పాణిని 1-3-66వ సూత్రము భుజ్ ధాతువు అనవనే, అనగా పాలనార్థములో గాక భుజించుట అనే అర్థములో నున్నప్పుడు ఆత్మనేపదిగా వర్తిస్తుందని తెలుపుతూ ఉన్నది. అందుచేత ఈ ధాతువునకు బుభోజ అను పరస్మైపద లిడ్రూపము, బుభుజే అను ఆత్మనేపది లిడ్రూపము రెండూ సిద్ధిస్తాయి. పృథ్విని పాలించెను అన్నప్పుడు పరప్రయోజనకారి యగు ఆ కార్యమును తెలియజేయుటకు బుభోజ అను పరస్మైపదరూపమూ, స్వప్రయోజనకారి యగు యశస్సును

అనుభవించెను అను కార్యమును తెల్పుటకు బుభుజే అను ఆత్మనేపదరూపమును వాడి దేశికులు ఈ శ్లోకములో విశేషార్థమును కల్పించినారు. ఈ విషయమును వ్యాకరణ సంప్రదాయజ్ఞులైన రాఘవాచార్యులవారు తమ వ్యాఖ్యానంలో చక్కగా వివరించినారు.

తర్క విశ్లేషణ:

శ్లో॥ అధీష్టే పాదుకా యస్యా స్సాకేతవాసిభిః॥
అన్వయ వ్యతిరేకాభ్యా మన్వమీయత వైభవమ్॥

'సాకేత నగరవాసులు అన్వయము, వ్యతిరేకము– ఈ (రెండు రకములైన) వాక్యములచేత దేని వైభవమును అనుమానించినారో (ఊహించినారో) ఆ పాదుకాదేవియే నాకధీశ్వరి'– అని ఈ శ్లోకమునకు తాత్పర్యము. ఈ శ్లోకములో 'కవితార్కిక సింహు'లైన దేశికులవారు 'అన్వయ వ్యతిరేకాభ్యాం అన్వమీయత వైభవమ్' అను వాక్యములో తర్క శాస్త్రోక్తమైన అనుమాన ప్రమాణమును చొప్పించినారు. శ్రీమాన్ రాఘవాచార్యులవారి తర్కశాస్త్రవిషయము నిట్లు విశ్లేషించినారు:

'ప్రత్యక్షం, అనుమానం, ఉపమానం, శబ్దం (ఆప్తవాక్యం)– అని ప్రమాణాలు నాల్గు రకాలు. అందులో చక్షుస్సంయోగ సన్నికర్షం కల్గిన ప్రత్యక్ష ప్రమాణాన్ని అందరూ అంగీకరిస్తారు. పరోక్షంలో ఉన్న వాటిని మంచి యుక్తులచేతనూ, తగిన హేతువుల చేతనూ గ్రహింపజేసేది అనుమాన ప్రమాణం. 'అనుమానం' అంటే కార్యాన్నిబట్టి కారణాన్ని ఊహించడం... అనుమానం సిద్ధించడానికి వాడే వాక్యంలో కారణం అన్వయవ్యాప్తినీ, వ్యతిరేక వ్యాప్తినీ కలిగి ఉంటుంది.

1) *అన్వయవ్యాప్తి:* హేతువుండేచోట సాధ్యముండే వ్యాప్తి. రామునికి పాదుకలతో సంబంధమున్నందు వల్ల రాముడు విభువు అయ్యాడు.

2) *వ్యతిరేకవ్యాప్తి:* సాధ్యాభావానికీ, హేత్వభావానికీ అయిన వ్యాప్తి. పాదుకాసంబంధం లేనందున రాముడు విభువు కాలేదు.

ఈ విధంగా తర్కశాస్త్రసమ్మతంగా విశ్లేషించిన ఆచార్యులవారు– 'పాదుకలతో సంబంధం తొలగిన వెంటనే రాముడు దండకారణ్యవాసి అయ్యాడని భావం. పాదుకాసాన్నిధ్యమేర్పడినందువల్ల భరతుడు విభుడయ్యాడు కదా!' అని అర్థమును వివరించినారు. కాని ఇది యథార్థమునకు దూరముగా నున్నట్లున్నది. రాముడరణ్యములో నున్నప్పుడు పాదుకలతనితోడనే ఉన్నవి కదా! అతనికి అప్పుడు విభుత్వము లేదే? రాజ్యమును త్యజించి అతడు వనవాసిగనే ఉన్నాడు. ఆ వనమునుండియే భరతుడు పాదుకలను తెచ్చుకొన్నాడు కదా! అందుచేత ఆచార్యులవారి 'పాదుకలతో సంబంధం తొలగిన వెంటనే రాముడు దండకారణ్య వాసి అయ్యాడని భావం' అనే వాక్యం అర్థవంతంగా లేదు. ఆ పాదుకలను భరతుడు అయోధ్యలో ప్రతిష్ఠించి రాముని ప్రతినిధిగా విభుత్వమును పొందినాడు. అందుచే నీ అన్వయ వ్యతిరేకములను అయోధ్యలో

పాదుకలను ప్రతిష్ఠితమైన స్థితికి, ప్రతిష్ఠితముగాని స్థితికి అన్వయించుకొని, పాదుకలను ప్రతిష్ఠించుట వల్ల భరతునికి విభుత్వము కలిగింది, దేశము రాజన్వంతమైంది అని అన్వయవ్యాప్తిగా చెప్పుకొని, అది జరుగనప్పుడు విభుత్వము లేక అయోధ్య అరాజకమయ్యింది అని వ్యతిరేకవ్యాప్తిగా చెప్పుకుంటే మరింత సరసంగా ఉంటుందని నా భావం. అంటే అయోధ్యావాసులు రాముని పాదుకలను ప్రతిష్ఠించిన తర్వాత రాజ్యము రాజన్వంతమైందని, అంతకు ముందు అరాజకంగా ఉండేదని, అందువల్ల పాదుకలు ప్రభావవంతమైనవని అనుమానించినారని (ఊహించినారని) చెప్పుకోవడం బాగుంటుందని నా అభిప్రాయం.

వివిధ విషయ పరిజ్ఞానము:

పాదుకాసహస్రము వంటి గ్రంథములందలి విషయమును స్పష్టముగా వివరించుటకు బహుముఖ పాండిత్య మవసరము. శ్రీమాన్ రాఘవాచార్యులకు ఉభయవేదాంతములందు, సాహిత్యపురాణాదులందు, తర్క వ్యాకరణాది శాస్త్రములందు అగ్రిమమైన పాండిత్యముండుటవల్ల ఆయా గ్రంథములనుండి ఉదాహరణ లిచ్చుచు పాండితీమండితమైన వ్యాఖ్యానమును వెలయించినారు. ఇందుకు గ్రంథములోని ప్రతి శ్లోకము ఉదాహరణమే యైనను, మచ్చున కీ క్రింది శ్లోకాన్ని నేనెన్నుకొన్నాను. దీని వ్యాఖ్యానంలో శ్రీమాన్ రాఘవాచార్యుల వారు మహాభారతం నుండి ఒక శ్లోకాన్ని ఉటంకిస్తూ, అంతగా ప్రసిద్ధంగాని ఒక ఉదంతాన్ని తెలుపుతున్నారు.

శ్లో॥ నివేశితాం రంగపతేః పదాబ్జే మన్యే సపర్యాం, మణిపాదరక్షే!
త్వదర్పణా దాపతితా మపస్యద్గాండీవధన్వా గిరిశోత్తమాంగే॥

“ఓ మణిపాదుకా! గాండీవ ధనుర్ధారియైన అర్జునుడు శ్రీకృష్ణునిగా నవతరించిన శ్రీరంగనాథుని పాదపద్మములయందు సపర్యను (పూజాపుష్పమును) నీ కర్పించడం వల్ల, నిన్ను ధరించిన శివుని శిరస్సునందు జారిపడిన ఆ పుష్పాన్ని అతడు (అర్జునుడు) చూచెనని భావిస్తున్నాను”- అని దీనికి తాత్పర్యము. ఐతే అర్జునుడు అర్చించిన శ్రీకృష్ణుని పాదుకలపై నుంచిన పుష్పము శివుని శిరము నెట్లు అలంకరించింది అనే విషయం మహాభారతంలోని ఒక ఉదంతం తెలిస్తే కాని బోధపడదు. దీనిని విశదీకరించుటకు ఆచార్యులవారు మహాభారతంలోని ఈ క్రింది శ్లోకాన్ని పేర్కొని-

“పార్థో విజేతా మధుసూదనస్య, పాదారవిందార్పిత పత్రపుష్పమ్।
దదర్శ గంగాధరమౌళి మధ్యే, బభూవ వీరః కృతనిశ్చయార్థః॥

“శ్రీరంగనాథుడు శ్రీకృష్ణునిగా అవతరించాడు. భారతయుద్ధరంగంలో పుత్రశోకంచేత పాశుపతాస్త్ర మంత్రం జ్ఞాపకం రాక చింతాగ్రస్తుడైన పార్థునికి శ్రీకృష్ణుడు తన పాదపూజ చేయుమని బోధించాడు. పార్థుడు శ్రీకృష్ణుని పాదాలను పూలతో పూజించి కృతార్థుడయ్యాడు. శివుని దర్శనం కాగానే అతని తలమీద శ్రీకృష్ణపాదార్పిత పుష్పాలను పార్థుడు చూచి, శ్రీకృష్ణుని పరత్వమహిమకు ఆశ్చర్యపోయాడు” అని ఆ సందర్భాన్ని చక్కగా వివరించినారు. ఈ శ్లోకము లేనిదే ఈ సందర్భము సరిగా నవగతము కాదు. ఇట్లు ఏ శ్లోకము యొక్క వ్యాఖ్యానమును చూచినను వివిధ గ్రంథములనుండి ఉక్తవిషయమునకు బలవత్తరమైన ప్రమాణములు చూపుట ఆచార్యులవారికి సహజలక్షణమై యున్నది.

భాషా శైలి:

చెప్పెడి విషయమును ఇంపుగా, సులభ గ్రాహ్యంగా,మనస్సుకు హత్తుకొనేలాగ చెప్పనిదే వ్యాఖ్యానం పఠితల కుపాదేయం కాదు. దీనికై సరళమైన, శ్రవణసుభగమైన భాషాశైలి అవసరం. ఆచార్యులవారి భాషాశైలి అన్నివిధాలా ఈ లక్షణములు కల్గియున్నది. చక్కని జాతీయములను, సామెతలను ఉపయోగిస్తూ చెప్పెడి విషయమును ఆసక్తి రేకెత్తిస్తూ చెప్పడం వారి శైలి. కొన్ని ఉదాహరణలు:-

"మోదఖేదాలకు పొంగక, క్రుంగక అర్థకామాలను తన అదుపులో ఉంచుకున్న మహర్షి వసిష్ఠుడు".

"పసినిసుగు పాలు త్రాగుతూ కోరపంటితో చంటిని నొక్కి గంటుపెట్టినా, తల్లి విసుగు పడదు. పైగా కోరినా, కోరకున్నా పట్టిని చేరదీసి పట్టిపట్టి పాలిచ్చి నిమ్మకు నీరెత్తినట్లు పెంచుతుంది. నిజంగా మాతృ వాత్సల్యానికి మాటలు చాలవు కదా!"

"పాదుకలను శిరసావహించిన భక్తుని పూర్వాఘాలు దూదిమీద అగ్గిపడినట్లు నశిస్తాయి. ఉత్తరాఘాలు తామరాకు మీద నిల్చిన నీటివలె అతనిని అంటుకోలేవు".

"సుకుమారులు చెత్త, చెదారం, కల్లు, ముల్లు, రాయి రప్పలతో నిండిన నేలమీద నడవడం కష్టమే".

"సత్త్వగుణాధిక్యం గల చిత్తం చెత్తగా ఉండక, మెత్తగా, ఆర్ద్రంగా ఉంటుంది".

"అంత చక్కనయ్య గుక్కబట్టి, పిక్కబలం చూపి, ఒక్క క్షణంలో పక్కణం చేరి, చెప్పినమాటలను చిలుక పలుకుల్లాగా వినిపిస్తూ, ఉభయపక్షాలకు"-

"అంబట్లో తెడ్డు లాగా మెలగుతూ, అందులో పగతుర నడుమ ప్రాణానికి తెగించి చేసే దూతకృత్యం, ఒకరి మోచేతి నీళ్లు తాగి బతికేవాడు చేసే పని కాదా?" (ఇది రాయబారానికి వెళ్ళే శ్రీకృష్ణుని గురించి చెప్పిన వాక్యం.)

విద్వద్వరేణ్యులు, ఆంధ్రగీర్వాణ భాషాకోవిదులు, ఉభయ వేదాంత సంప్రదాయ వేత్తలైన శ్రీమాన్ కె.వి.రాఘవాచార్యుల పాదుకాసహస్ర వ్యాఖ్యాన ప్రాశస్త్యమునకు దోహదకారులైన కొన్ని యంశములను పైపైన కొంత పరామర్శించితిని. సంగ్రహముగా వ్రాసిన ఈ వ్యాసపథములోనే ఇంకను పయనించి విజ్ఞులీవ్యాఖ్యానమునందలి ఇతర విశేషములను పరిశీలింపగలరని ఆశించుచున్నాను.

పాదుకాసహస్ర ప్రద్యోతనమ్ (3 సం.)

డా॥ కె.కోదండ రామాచార్యులు

చరవాణి: 9849 392 474

వ్యాఖ్యాతృ మండలే శ్రీమాన్/ రాఘవార్యో సుధీవరః
మణివద్భ్రాజతే శశ్వత్/ ఆచార్యాయ నమోనమః

శ్రీమాన్ కె.వి.రాఘవాచార్యుల వారు సుమారు 35 గ్రంథములను సరళ సుందరమైన శైలిలో వ్యాఖ్యానములను వ్రాసి ఈనాటి పాఠకులకు మార్గమును సుగమం చేసారు. శ్రీమాన్ వేదాంత దేశికుల గ్రంథాలకు వ్యాఖ్యలను వ్రాసి సంప్రదాయ విషయములను తెలిపిన "అభినవ మల్లినాథసూరి" అని చెప్పదగిన వీరి వ్యాఖ్యాన విశేషముల గూర్చి చెప్పడం అంటే-

తితీర్షుర్దుస్తరం మోహాత్ ఉడుపేనాస్మిసాగరమ్"
ప్రాంశులభ్యే ఫలే లోభాత్ ఉద్బాహురివ వామనః"

అన్న కాళిదాసు వాక్యాలను గుర్తుకు తెచ్చుకోవలసిందే.

హైదరాబాద్‌లో శ్రీ మాడుగుల వారి అవధానంలో పరిచయమైన శ్రీమాన్ రాఘవాచార్యుల వారు తరువాత ఎప్పుడు ఎక్కడ అగుపించినా ప్రేమతో పలుకరించేవారు. చరవాణిలో సంభాషించినా సాహిత్య విషయాలనే చర్చించేవారు. అట్టి మహానుభావులు. వారి పుస్తకాలను ఆశీర్వచనంతో అందించేవారు.

అల్పాక్షర మసందిగ్ధం సారవద్విశ్వతోముఖమ్
అస్తోభమనవద్యంచ సూత్రం, సూత్ర విదో విదుః

అక్షరాలు పరిమితంగా ఉండి, అర్థ విషయంలో సందేహం కలుగకుండ, ప్రతిపాదించ దలచిన విషయాన్ని ప్రస్తావిస్తూ వ్యర్థపదాలు లేనట్టిది- సూత్రము- అట్టి సూత్రాలకు విస్తృత వ్యాఖ్యానం వ్రాస్తే అది "భాష్యమ్" కాగలదు. పాణిని అష్టాధ్యాయి సూత్రాలకు పతంజలి వ్రాసినది మహాభాష్యము. వ్యాసుని బ్రహ్మసూత్రాలకు శ్రీ భగవద్రామానుజులు వ్రాసినది శ్రీభాష్యము. విష్ణుసహస్రనామ స్తోత్రమునకు శ్రీపరాశర భట్టరువారు అందించినది భాష్యము అన్నారు. మూలగ్రంథములోని అంశములను వ్యాఖ్యానమునందలి విషయములను సంగ్రహంగా వివరించేది సమీక్ష.

కఠిన పదాలకు అర్థాలను వ్రాసి సంగ్రహంగా వివరణ ఇస్తే అది "టీక".

రాజశేఖరుడు తన కావ్యమీమాంస ప్రథమాధ్యాయంలో వృత్తి, పద్ధతి, భాష్యమ్, సమీక్షా, టీకా, వంజికా, కారికా, వార్తికం అని వ్యాఖ్యాన విశేషాల పేర్లు చెప్పినా ఈనాడు భాష్యం, వ్యాఖ్యానం, టీకా, సమీక్షా అను నాలుగు మాత్రమే బాగా ప్రచారంలో నున్నవి. విశేషంగా వివరించి చెప్పడమే వ్యాఖ్యానము అని సామాన్యార్థం చెప్పుకున్నా వ్యాఖ్యానాన్ని న్యాయకోశం ఇలా వివరించింది.

అప్రతిపత్త్యాది నివారణ ప్రయోజనం/ తత్సమాసార్థక పదాన్తరేణ విస్తరేణ/ తదర్థ కథనం వ్యాఖ్యానం

మూలంలో ప్రయోగించబడి, స్పష్టముగా అర్థము కాని పదాలకు సమానార్థకమైన సరళపదాలను చూపుతూ విశేషార్థాన్ని వివరించడమే వ్యాఖ్యానము.

పదచ్ఛేదః పదార్థోక్తిః విగ్రహో వాక్యయోజనా
ఆక్షేపస్య సమాధానం వ్యాఖ్యానం పంచలక్షణమ్

1) శ్లోకములోని పదములను విభజించి చూపుట, 2) పదములకు అర్థము వ్రాయుట, 3) సమాస, కృదంత, తద్ధితాదులుంటే వానికి విగ్రహ వాక్యములను తెల్పుట, 4) పదాలను అర్థమయ్యే రీతిలో అన్వయ పూర్వకముగా వాక్యరచన గావించుట, 5) "ఆక్షేపించబడునవి" అనుకున్న వానికి సమాధానము చెప్పుట. ఈ ఐదు లక్షణములు కలది "వ్యాఖ్యానము".

ఇహాన్వయ ముఖేనైవ సర్వం వ్యాఖ్యాయతే మయా
నామూలం లిఖ్యతే కించిత్ నా నపేక్షిత ముచ్యతే

అని ఘంటాపథముగా చెప్పిన వ్యాఖ్యాతృ చక్రవర్తి కొలచల మల్లినాథసూరివలె శ్రీమాన్ కె.వి.రాఘవాచార్యుల వారు కూడా నియమాలను ఏర్పరచుకొని వ్యాఖ్యానాలను చేశారు.

శ్రీమాన్ వేదాంత దేశికుల వారు శ్రీ రంగనాథుని పాదుకల వైభవమును వేయి ఎనిమిది శ్లోకములలో వివరించారు. దానికే పాదుకా సహస్రమని పేరు. ఇందు 32 పద్ధతులు కలవు. 381 నుండి 680 వరకు 300 శ్లోకములు కల ఆరు పద్ధతులు. 14వ నాద పద్ధతి, 15వ రత్న సామాన్య పద్ధతి, 16వ బహురత్న పద్ధతి, 17వ పద్మరాగ పద్ధతి, 18వ ముక్తాపద్ధతి, 19వ మరకత పద్ధతి.

వ్యాఖ్యానాన్ని వ్రాస్తున్నప్పుడు, మూలగ్రంథకర్త యొక్క పుట్టు పూర్వోత్తరాలను, వారి భావజాలమును, సంప్రదాయ పద్ధతిని, స్వీకరించిన అంశమును గూర్చి వారి దృష్టి మొదలగు వానినన్నిటిని వ్యాఖ్యాత మదిలో నుంచుకోవలసిన అవసరమున్నది. వీనితోపాటు వ్యాఖ్యానమును ఇటు సామాన్య పాఠకునకు, అటు పూర్తి పండితులకు అర్థమయ్యే పద్ధతిలో కాకుండా, మధ్యతరగతి పాఠకుని దృష్టియందుంచుకొని చేయవలసి యుండును. అనగా వ్యాఖ్యాతకు కూడ అవధానము ముఖ్యం.

శ్రీమాన్ రాఘవాచార్యుల వారు వ్యాఖ్యానంలో అష్టావధానం చేశారు (అంటే ఎనిమిది అంశాలను దృష్టియందుంచుకొని వ్యాఖ్యానాన్ని గావించారని నా అభిప్రాయము.)

తాత్పర్యం తర్వాత సూత్రప్రాయమైన వాక్యాన్ని వ్రాయుట:

పదములు కొన్ని మాత్రమే- భావము మాత్రము సంపూర్ణము. కంఠస్థము చేయదగినట్లుగా వాక్యరచన- ఇది వారి వ్యాఖ్యానములోని మొదటి అంశము.

ఉదా॥ 1) పాదుకానాదం శుభశకునమని గమ్యోత్ప్రేక్ష (12 పుట)2

2) పాదుకానాదం నిద్రించిన జనాన్ని మేల్కొలిపే ప్రభాత నాందిగా వర్ణితం (24 పుట)

ఈ అంశాన్ని గుర్తించుకున్న ప్రాసంగికుడు దేశికుల శ్లోకాన్ని తన ప్రసంగంలో ఉదాహరించడానికి అవకాశం కలదు.

3) పాదుకానాదం అర్చిరాది మార్గంలో మృదంగ ధ్వనిగా వర్ణితం (52 పుట)

దీనిని చదివినప్పుడు అర్చిరాది మార్గము గూర్చి తెలుసుకోవాలన్న ఆసక్తి పాఠకునకు కలుగుతుంది.

4) మణిపాదుక మయూర పింఛంగా ఉత్ప్రేక్షితం (140 పుట). నెత్తి కెక్కినందుకు క్షమించమని స్వామి పాదుకలను ఆశ్రయించిన నెమలి తోకలాగ పాదుక కనబడుతుంది- అన్నారు దేశికులు.

నెమలి కృష్ణుని పాదాల చెంత చేరగా అది శరణు కోరినదని దాని పింఛమును కృష్ణుడు శిరమున ధరించినాడని భావన.

5) గరుడ పచ్చలు కలిగిన పాదుకా సంచారం వల్ల గరుత్మంతుడు ఆనందిస్తాడని వర్ణన (236 పుట)

"పాదుకలను ధరించి స్వామి నడుస్తున్నప్పుడు నేను వాహనంగా కైంకర్యం చేయలేకపోతినే అని గరుత్మంతుడు బాధపడ్డా- చివరకు పాదుకల యందు నా నామ సాదృశ్యము కల పచ్చలు పొదగబడినవి అది చాలు" అని గరుత్మంతుడు సంతసిస్తాడని దేశికులు చెప్పిన మాట.

కైంకర్య పరుడు ఎప్పుడు స్వామి కైంకర్యమే చేయాలనుకుంటాడు కాని ఇంకొకరు చేస్తున్నా అసూయ చెందక ఏదో నెపంతో తృప్తిపడతాడని అట్లు సంతృప్తిని పొందుటయే ఉత్తమ వైష్ణవుని లక్షణమని సూచితం.

విశేషాంశముల వివరణ:

ఇందు శ్రుతి, స్మృతి, పురాణ, ఇతిహాస, కావ్య, నాటక, స్తోత్ర ప్రబంధముల నుండి – సందర్భోచితములైన అంశములను గ్రహించి ఆచార్యులవారు వివరించారు.

శ్రుతి- మాటకు నాలుగు దశలుంటాయి. పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ అని సామాన్యంగా పేర్కొనకుండా చత్వారి వాక్పరిమితా పదాని అనే ఋగ్వేదమంత్రాన్ని (1-164-45) పేర్కొని వ్యక్తి నుండి వెలువడే శబ్ద స్థితిని వివరించారు. (పుట-16)

2) పుణ్యాహవాచనం గూర్చి చెపుతూ 'స్వస్త్యయనంతార్క్ష్య మరిష్టనేమిః' అంటూ (పుట-30) గరుడ మంత్రాన్ని పేర్కొన్నారు.

3) బ్రహ్మప్రళయాన్ని ఋగ్వేదం 'నాసదానీన్నోసదాసీత్త దానీం' అంటూ చెప్పిందని నాసదీయ సూక్తాన్ని (10-129) వివరించారు.

ఇలాగే 151 పుటలో మైత్రాయణీ ఉపనిషత్తు వాక్యము కలదు. 157లో తైత్తిరీయ బ్రాహ్మణము వేదమయుడైన సూర్యుని దశను వర్ణించిన తీరు చెప్పారు.

స్మృతి-శాస్త్ర విషయములు:

"భగవానుడు", "పురుషుడు" అనే నిరుపాధిక శబ్దాలు పర వాసుదేవుని యందే వర్తిస్తాయి- అన్న స్మృతి వాక్యము (పుట-45), ముత్యాల పుట్టుకను గూర్చి అగస్త్యుడు చెప్పిన శాస్త్ర ప్రమాణము (పుట-222) ఆచార్యుల వారిచే పేర్కొనబడినవి.

పురాణము:

శ్రీ మహాభాగవతంలోని శ్లోకాన్ని ఆ గ్రంథ వ్యాఖ్యాత శ్రీధరస్వామి ఉదాహరించిన శ్లోకాన్ని (పుట-17లో) శ్రీకృష్ణ జన్మ విషయము (230లో) వివరించి 83 పుటలో విష్ణుపాదోద్భవీగంగా అని చెపుతూ విష్ణు చిత్తీయ వ్యాఖ్యాన పంక్తుల నుదాహరించి పాఠకులకు విశేష జ్ఞానము నందించారు.

ఇతిహాసములు:

శ్రీరాముని పరదుఃఖ దుఃఖిత్వమును (పుట-44), అనసూయ సీతాదేవికి వస్త్రాభరణముల నిచ్చిన విషయమును (పుట-117), భగవానునకు వైకుంఠుడనే పేరు కల్గిన విషయమును (పుట-212) వివరించి రామాయణ భారతములను పాఠకులకు గుర్తు చేసారు.

కావ్య గతాంశములు (పుట-36లో) యః పూరయన్ కీచక రంధ్రభాగాన్ (కుమార సంభవం) (పుట 8-154లో) శిఖిపింఛలాంఛిత కపోలభిత్తినా (కిరాతార్జునీయం) అని కాళిదాస, భారవి శ్లోకాల నుదాహరించటం.

స్తోత్రసాహిత్యము:

జీవాత్మ, పరమాత్మ సంవాదమును తెల్పిన శ్రీ పరాశర భట్టరు వారి శ్లోకమును (పుట-19) కృష్ణ శతక కర్త ఎదలో కదలాడే అచ్యుతుని అడుగుజాడల గూర్చి (పుట-224లో) వివరించారు.

ద్రవిడ ప్రబంధ విషయములు:

నమ్మాళ్వారు తిరువాయిమొళిలోని పాశురాలను (పుటలు-1, 52), పెరియాళ్వారు తిరుమొళిలోని (పుట-45), పెరియ తిరుమొళిలోని (పుట-138) పాశురాలను పేర్కొన్నారు.

దేశికుల ఇతర గ్రంథాలనుటంకించుట:

శ్రీమాన్ రాఘవాచార్యులవారు వేదాంత దేశికుల ఇతర గ్రంథాలలో నున్న విషయాలను వివరించి ఆ గ్రంథములను పాఠకులకు పరిచయం చేస్తూ యతిరాజ సప్తతి (పుట-11), న్యాసతిలకం (పుట-53), హంస సందేశం (పుట-66), యాదవాభ్యుదయ మహాకావ్యము (పుట-83), భగవద్ధ్యాన సోపానము (పుట-111) - వీని నుండి కొన్ని అంశాలను ఉటంకించారు.

కవి కేసరికి పాదుకా సహస్ర రచనలో పాదుకాదేవి సహాయపడే తీరును 17వ పుటలో వివరించారు.

రాజాశ్రయం కల్పిస్తాము రమ్మని ఆహ్వానం పంపిన శ్రీ విద్యారణ్యుల వారికి "క్షోణీ కోణశతాంశ పాలన కళా" ఐదు శ్లోకాలను వ్రాసి పంపించిన దేశికులు ఎంత వైరాగ్యభావంతో ఉన్నవారో వివరించినారు, (81 పు).

పూర్వాచార్యుల అనుభవములను:

పాఠకులకు సంప్రదాయ విషయములను, పూర్వాచార వైభవమును తెలియ చెప్పారు. గరుత్మంతుడు శ్రీమన్నారాయణుని చరణ కమలాలను తన చేతుల్లో నుంచుకొని ఇదే పరతత్త్వం అని కరస్థంగా చూపుతున్న కంచి గరుడసేవ- చోళ సింహపురం దొడ్డయాచార్య స్వామివారు గరుడ వాహనానందాను భవాన్ని "శ్రీదేవాధి రాజపంచకం"గా అనుసంధించిన విషయము (పుట-7లో) పేర్కొనబడినది.

ఉపనిషత్తులకు ఊతగా నిల్చిన ద్రావిడ వేదాంతానికి కన్నతల్లి శఠారి, సామర్థ్యంతో పెంచిన తల్లి యతిరాజులు- అన్న శ్రీభట్టర్‌గారి వాక్యాన్ని దానికి ఊతమిచ్చే దేశికుల, అచ్చాన్‌పిళ్ళైగారి వాక్యాలనుదాహరించి సంప్రదాయపరులకు క్రొత్త విషయాలను తెలిపారు.

శ్రీ భాష్యంలోని వాక్యమునుదాహరించి (పుట-123) బ్రహ్మ విద్యావేత్త ధమని ద్వారా ఊర్ధ్వలోకాలకు వెళ్ళుట, బ్రహ్మవేత్తకాని ప్రాణి ఇతర నాడుల గుండా బయటపడి మళ్ళీ జన్మిస్తాడన్న భగవద్రామానుజుల సూక్తిని వివరించారు.

శుద్ధ జీవునకు లభించు అష్టగుణాల వలన భగవంతునితో సమాన రూపము, గుణాలు ఏర్పడినా లక్ష్మీపతిత్వ జగత్కారణత్వాలు పరమాత్మకే తప్ప వీటిలో జీవునికి సామ్యం ఉండదు (పుట-228) అని సందేహ నివృత్తి చేశారు.

భక్తి నిర్వచనాలు (పుట-126), ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, అధి దైవిక తాపత్రయ వివరణ (పుట-135) ఆచార్యుల వారి వ్యాఖ్యానంలో చూడవచ్చును.

స్థితే మనసి సుస్వస్థే శరీరే సతి యోనరః- ఇది వరాహస్వామి చరమ శ్లోకము సుప్రసిద్ధము- దానికి తోడుగా అర్చారూపాల్లో ప్రథమావతారుడైన శ్రీరంగనాథుడు కృప చేసిన చరమ శ్లోకాన్ని పాఠకులకు అందించారు.

మామేవాను స్మరస్వ త్వం, త్వామహం సంస్మరామి చ
ఉపాయ మపవర్గస్య రహస్యమపి మే శ్రుణు
సర్వకర్మాణి సంత్యజ్య సర్వకర్మ ఫలాని చ
శరణం మాం ప్రపద్యస్వ సర్వబంధ విముక్తయే (పుట-26)

శ్రీరంగేశుడు అంతఃపురానికి వెళ్ళాడు. శ్రీదేవి భర్తకు స్వాగత సత్కారాలు చేయడానికి వస్తుంటే ఆమె కాలి యందెలు కమనీయంగా రవళిస్తున్నాయి. రంగపతి పాదుకాంతర్మణులు రమణీయంగా నినదిస్తున్నాయి.

ఆ రెండు జతల నాదాలు అవి అన్యోన్యంగా ఆనందంతో స్వాగత సత్కారాది సల్లాపాలు, సంభాషణలు జరుపుకోవడం వల్లనే...

భార్యాభర్తలు ఒకరికొకరు ఎదురు పడినప్పుడు వారి అంతరంగములోని భావజాలము ఎలా వుండాలో శ్రీదేవీ రంగనాథుల అంతఃపురంలో జనించిన నాదమే- మంజుల ధ్వని తెలుపుచున్నది.

ఇతరములు:

నానార్థ రత్నమాల, విశ్వ నిఘంటువు, అమరకోశము, హలాయుధ కోశము మొ॥ నిఘంటువులలోని వాక్యములనుదాహరించి క్రొత్త పదములను పాఠకులకు పరిచయం చేశారు. శ్లోక వ్యాఖ్యానము చివర, ఉపమా, ఉత్ప్రేక్ష, రూపకము, శ్లేష అంటూ అందున్న అలంకారమును సూచించటం.

ఉపజాతి, వసంత తిలక, రథోద్ధత, శిఖరిణీ మొదలైన దేశికుల వారు ఉపయోగించిన వృత్తముల పేర్లు తెల్పటం-

గరుత్మతః ఇయం గారుత్మతీ (పుట-235) ఉదయర్తీతి=ఉదారః (పుట-28) ఇలా వ్యాకరణాంశాలను ఈ వ్యాఖ్యానంలో చూడవచ్చు.

ప్రాణాగ్ని సంయోగం వల్ల నాదమేర్పడుతుందని ఆభాణకం, శ్రీ వేంకటేశ ఘంటానాదం బహుదూరం వ్యాపించి ప్రజలనాకర్షిస్తుంది (పుట-2) అని ఆచార్యుల వారంటే- నేను "దేశికుల రచనలోని ప్రాణభూతమైన భావజాలముతో రాఘవాచార్యుల ప్రతిభా రూపమైన అగ్ని సంయోగము చెందుట వలన వ్యాఖ్యాన రూపమైన నాదం పాఠకులకు విన్పించింది- అది చిరకాలం శ్రవణానందంగా వినిపిస్తుంది" అని అంటాను.

స్వామి తిరువీధి ఉత్సవంలో ద్రవిడ ప్రబంధ, వేద పారాయణపరులు స్వామికి అభివాదనము చేసినపుడు శ్రీశఠారిని వారి శిరోభూషణంగా సమర్పించి గౌరవించడం జరుగుతుంది, అపుడే పాదుకాదేవి తన మంజునాథ రూపంగా "ఆయుష్మాన్ భవ", "సౌమ్య" అని భగవదనుగ్రహాన్ని పారాయణ పరుల కందజేస్తుంది.

గోత్రనామాలను చెప్పుకొని అభివాదం చేయడం ధర్మం కాన ఆంగీరస, బార్హస్పత్య, భారద్వాజ, త్రయార్షేయ ప్రవరాన్విత భారద్వాజ గోత్రః యజుశ్శాఖాధ్యాయీ కోదండరామాచార్యః అహంభో అభివాదయే- అంటూ దాసుడు పాదుకా సహస్రం ముందు సాగిలపడుచున్నాడు.

పాదుకాసహస్ర సంస్తుతి (4 సం.)

డా॥ కందాళ వేంకట రామకృష్ణమాచార్యులు

చరవాణి: 9848 229 970

ఉ.వే. శ్రీమాన్ కె.వి.రాఘవాచార్యస్వామివారి రమణీయాంధ్ర టీకాతాత్పర్య వ్యాఖ్యా యుక్తమైన పాదుకాసహస్ర చతుర్థ సంపుటి ఇంద్రనీల పద్ధతి నుండి, ప్రకీర్ణ పద్ధతి వరకు పది పద్ధతులు టీకా తాత్పర్య వ్యాఖ్యాయుతములై మూలముతోపాటు పొందుపరచి యున్నవి.

వేదాంతదేశికుల గ్రంథములు ఒకవిధముగా కొరుకుడు పడునవి కావు. వారి భావుకత విలక్షణమైనది. కల్పన ఊహకందనిది. వారి కావ్యములలో విలక్షణమైనది పాదుకాసహస్రము. ఇందొక్కొక్క శ్లోకము ఒక్కొక్క తత్త్వార్థమును ప్రతిపాదించుచున్నది. ఒక ప్రక్క తత్త్వార్థజ్ఞానము, మరొక ప్రక్క కవిసమయములు, కల్పనలను బాగుగా సమన్వయించు నేర్పుగలవారే వేదాంత దేశికుల శ్లోకములను అందము చెడకుండా వ్యాఖ్యానించగలరు. అట్టి వ్యాఖ్యాతలలో ఎన్నదగిన మనీషి శ్రీమాన్ కె.వి.రాఘవాచార్యస్వామివారు.

వీరి టీకాతాత్పర్య వ్యాఖ్యానమున ప్రతి శ్లోకమునకు ప్రతిపదార్థము, తాత్పర్యము వ్రాయబడినవి. తరువాత వ్యాఖ్య. ఇందులో ఆయా శ్లోకముల అంతరార్థము సాహిత్యపరంగానూ, తత్త్వపరంగానూ విశ్లేషింపబడి చక్కగా నిరూపించబడింది. ఈ శ్లోకం వ్యాఖ్య బాగుంది అని ప్రత్యేకించి ఒక్క శ్లోకాన్ని ఎత్తి చూపించటం చాలా కష్టం. ఎందువల్లనంటే అన్ని శ్లోకాల వ్యాఖ్య ఒకదానికొకటి పోటీపడుతున్నట్లే అనిపిస్తుంది. చక్కని చిక్కని తెలుగులో, అర్థమయ్యే విధంగా నడిచిన వీరి వ్యాఖ్యా పద్ధతి అందరికీ అనుసరణీయము, అభినందనీయము. ఇట్టి వ్యాఖ్యతో పాదుకాసహస్రాన్ని ప్రకాశం చేసిన అహోబిల మఠం వారు అభినందనీయులు.

ఈ వ్యాఖ్యలో కొన్ని విశేషాలను ప్రస్తావిస్తాను. ఇంద్రనీల పద్ధతిలో- "క్లృప్తశ్యామా" అనే 22వ శ్లోకం- ఇది చాలా క్లిష్టమైనది. ఇంద్రనీల మణికాంతులు నల్లగా వ్యాపించడం వల్ల కృష్ణపక్షంలో రాత్రిగా ఉండగా, దక్షిణదిక్కును నడిచే పాదుక ఉత్తరాయనంలో మరణించినవారికే ఉత్తమగతి, దక్షిణాయనంలో మరణించినవారికి ఉత్తమగతి లేదనే వ్యవస్థ ప్రపన్నులకు కాదని సూచిస్తున్నది. వస్తుతః పాదుక తన ప్రపన్నుల యందు దాక్షిణ్యాన్ని వహిస్తున్నదని తాత్పర్యం. ఇక్కడ వ్యాఖ్యానంలో స్వామివారు ఉత్తరాయనంలో మరణించినవారికి ఉత్తమ గతియని, దక్షిణాయనంలో గతించినవారికి పునరావృత్తియనే విషయాన్ని ఉపనిషత్తుల ప్రామాణ్యమును చూపుతూ వివరించి, ఈ వ్యవస్థ బ్రహ్మజ్ఞానికి కాదని చక్కగా నిరూపించారు. ఇలాగే తరువాతి శ్లోకం- పాదుకాదేవి రాత్రి పద్మాలను వికసింపజేయడం- ఇలా విరోధాభాసలు కోకొల్లలు.

ఇక బింబ ప్రతిబింబపద్ధతిలో భగవంతుని బ్రహ్మోత్సవ సమాప్తికాలంలో తనయందు ప్రతిబింబించిన దేవతలకు అవబృథస్నానాన్ని కల్పిస్తున్నట్లుగా వర్ణించిన "యాత్రావసానమధిగచ్ఛతి" అనే ఎనిమిదవ శ్లోక వ్యాఖ్య సంప్రదాయానికి మచ్చుతునక. నమ్మాళ్వార్లే పాదుక కదా! అట్టి ఆళ్వారులను సేవించుటయే పవిత్రత- అదే అవబృథంతో సమానం అని చక్కగా సప్రమాణంగా నిరూపించటం ఒక విశేషం.



ఇట్లే కాంచనపద్ధతిలో బంగారానికి కాంతి ఉన్నా, సుగంధంలేదనే అపవాదును కాంచనపాదుక పోగొట్టిందని వర్ణించే "సతివర్ణగుణే సువర్ణజాతే" (5వ శ్లోకం) అనే శ్లోకవ్యాఖ్యలో స్వామివారు వేదములకు పరిమళమెలా కల్గుతుందో చక్కగా సప్రమాణంగా వివరించినట్లే "కాంత్యా పరం పురుష" మనే ఏడవ శ్లోకంలో పాదుకస్వామిని కనకమయునిగా చేసినట్లు వర్ణించిన సందర్భంలో ఛాందోగ్యోపనిషత్తు సూర్యమండలాంతర్వర్తి యగు శ్రీమన్నారాయణుని వర్ణించు "య ఏషోఽ_న్తరాదిత్యే హిరణ్మయః పురుషోదృశ్యతే" అను ప్రమాణమును చూపి స్వామియొక్క హిరణ్మయతత్త్వాన్ని గొప్పగా సమర్థించినారు,

అగ్నిదేవుడే బంగారు పాదుకవల్ల శుద్ధుడైనాడని వర్ణించే "విశుద్ధిమధిగచ్ఛతి" అనే పదిహేడవ శ్లోకంలో సందర్భవశమున కేనోపనిషత్తులోని యక్షరూపమును ధరించిన భగవంతుని కథను వివరించి, ఉత్సవ సమయాల్లో ఔపాసనాగ్నికి శఠారిని సమర్పించడం అనే సంప్రదాయాన్ని వివరిస్తూ పాదుక అగ్నిహోత్రుణ్ణి పవిత్రునిగా చేయడాన్ని సంప్రదాయ రీతిగా సమర్థించినారు. ఇక కాంచన పద్ధతిలో చివరి శ్లోకం "ప్రజ్వలిత పంచ హేతిః" (20వ శ్లోకం) అనేది. దీనిలో అగ్నిహోత్రునకు రంగనాథునకు పోలిక చాలా చక్కగా నిరూపించారు. ఆ శ్లోకంలో ప్రతిపదానికి గల ఔచిత్యాన్ని గొప్పగా వివరించి పాదుకలను ఆదిశేషుని అవతారంగా వర్ణించడమే శేషపద్ధతి. పాలకడలిలోనూ, శ్రీ వైకుంఠంలోనూ, పాన్పుగా ఉన్న శేషుడు, స్వామి భూమిపై అవతరించినప్పుడు తన రూపును పాదుకగా మార్చుకుని, నిత్య కైంకర్య విభూతితో తన శేషత్వాన్ని నిరూపించుకున్నాడని వర్ణించడం ఈ పద్ధతిలోని తాత్పర్యం. దీనికి ప్రమాణంగా "నివాస శయ్యాసన పాదుకాంశుకైః" అనే స్తోత్రరత్నాన్ని స్వామివారు చూపించారు. "పద్మాభోగాత్ పాదుకే రంగభర్తుః" అనే శ్లోకం ఈ పై భావాన్నే స్పష్టపరుస్తున్నది. ఈ శ్లోక వ్యాఖ్యానంలో స్వామివారు నివాస శయ్యాది రూపములను శేషుడు ఏఏ సందర్భాలలో ధరించి, స్వామిని సేవించాడో, ఆయా సందర్భాలనుస్వామివారు వివరించి శేషత్వమననేమో ప్రమాణ ప్రదర్శన పురస్సరంగా చక్కగా నిరూపించినారు,

"తత్తాదృశా నిజబలేన నిరూఢకీర్తిః" అనే ఐదవ శ్లోకంలో పాదుకలను రాజ్యాధికారాన్ని ఇచ్చి రాముడు తన మాటను నిలబెట్టుకున్నాడని వర్ణించిన సందర్భంలో, రాముడు పాదుకలకు (పాదుక రూపంలోనున్న శేషుని అవతారంలో ఉన్న లక్షణునకు) ఎలా వాగ్దానం చేశాడో స్వామివారు తమ వ్యాఖ్యలో ప్రతిభా సమున్మేషంగా వివరించి–

"భరత శిరసి లగ్నాం పాదుకే" అనే 7వ శ్లోకంలో భరతుడు పాదుకలను తన శిరస్సున పెట్టుకుని వస్తునప్పుడు లక్ష్మణుడు ఆ పాదుకలకు నమస్కరించిన సందర్భంలో లక్ష్మణుడు తనను తానే నమస్కరించాడనే విషయాన్ని శ్రీరాముడు తన అర్చామూర్తియగు రంగనాథుని సేవించడంతో సమర్థించారు వేదాంత దేశికులు. దీనినంతటినీ విశదంగా వ్యాఖ్యలో స్వామివారు తెలియజేశారు. అట్లే "అహీనాత్మా" అనే 9వ శ్లోకంలో "అహీనాత్మా సత్రం ఏకాహం" అనే పదాలకు గల శ్లిష్టమైన అర్థాలను చక్కగా తెలిపి పాదుకాదేవికి అవి ఎలా విశేషములో స్పష్టంగా ప్రతిపాదించిరి.

ద్వంద్వపద్ధతి పాదుకలకు ప్రణవకళాద్వయ రూపంతో ఆరంభింపబడినది. ప్రణవమున రెండు అంశలు– ఒకటి ఓకారాంశ. మరొకటి మకారాంశ. ఒకటి శేషిత్వాన్ని బోధిస్తే మరొకటి శేషత్వాన్ని బోధిస్తుంది.

జీవేశ్వరుల యొక్క శేషశేషి భావాన్ని తెల్పడమే ఓంకార పరమార్థము. రెండవ శ్లోకంలో భగవంతుని దయ, క్షమ అనే గుణాలు పరస్పర సంబద్ధములు ఎట్లు పరస్పర పోషకములో ఇవి చరాచర ప్రపంచాన్ని ఎలా కాపాడుతున్నాయో వర్ణింపబడింది. ఇలాగే మరొక శ్లోకంలో దైవపురుషకారాలుగా మరొక శ్లోకంలో శ్రీ భూదేవులుగా, మరొక శ్లోకంలో పరాపర విద్యలుగా, చక్రవాకద్వంద్వంగా, దక్షిణోత్తరాయన కక్ష్యలుగా, ఉభయ విభూతులుగా, శ్రుతిస్మృతి ద్వంద్వంగా, దివ్యదంపతులుగా, ఉభయ సంధ్యలుగా, బలాతిబలవిద్యలుగా, జ్ఞానకర్మ రూపాలుగా, మూర్తీభవించిన యోగక్షేమాలుగా వర్ణించారు వేదాంత దేశికులు. ఈ శ్లోకాల వ్యాఖ్యానంలో స్వామివారు పాదుకలకు ఆయా ద్వంద్వాలతో పోలిక యెట్లో ప్రమాణపురస్సరంగా విశదీకరించటం ఆచార్యుల వారి ప్రతిభకొక నిదర్శనం.

అలాగే ఊర్ధ్వ పుండ్రాలు పాదుకా సన్నివేశాలని వర్ణించే సన్నివేశ పద్ధతిలోని నాల్గవ శ్లోకానికి వ్యాఖ్య, ఈ సంపుటానికే తలమానికం. ఇక్కడ పుండ్రస్వరూపం, ఊర్ధ్వపుండ్రావశ్యకత, అవి శరీరమున ధరించు పండ్రెండు స్థానములు, ఊర్ధ్వ పుండ్రధారణావిధానం మొదలైనవి ప్రమాణపురస్సరంగా వివరింపబడ్డాయి. సన్నివేశపద్ధతిలోని 10వ శ్లోకంలో పాదుకయొక్క స్వరూపం (ముందు వెనుక విస్తృతంగా ఉండి మధ్య సన్నగా ఉండటం) భగవంతుని సంయోగ విప్రయోగాలవల్ల కలిగే పరిణామాలను ఎలా సూచిస్తోందో, చక్కటి యుక్తులతో విశ్లేషించటమే గాక సుభాషిత పద్ధతిలో "బ్రహ్మాస్త్రతామధిజగామ తృణం" అనే మూడవ శ్లోక వ్యాఖ్యానంలో వాయస వృత్తాంతం, సముద్రునిపై ఆగ్రహించి ధనుస్సును బాణం సంధించిన వృత్తాంతం, విష్ణు ధనుస్సుపై బాణము నెక్కుపెట్టిన వృత్తాంతం, పాదుక ఏలికైన వృత్తాంతం వివరిస్తూ జడములకు కూడా భగవత్సంబంధం వల్ల అశక్య కార్యహరణశక్తి కలుగుతుందని చాలా చక్కగా వివరించటం విశేషం.

ఇలా ప్రతిపద్ధతిలో వేదాంతదేశికుల హార్దమును గ్రహించి, శ్రీ రాఘవాచార్యస్వామివారు సప్రమాణంగా సయుక్తికంగా సరళంగా తమ వ్యాఖ్యానాన్ని వైష్ణవ లోకానికి సమర్పించి కృతకృత్యులై దివ్య పాదుకా ప్రభావాను సంధానంతో పరమాచార్య తిరువడిఘళ్ళకు చేరుకొని అచ్చట నిత్యకైంకర్య పరులలో నొకరై అందరికీ ఆదర్శప్రాయులైయున్నారు.

ఇతిశమ్.

పాదుకా సహస్ర సమర్చనము (5 సం.)

డా॥ కిడాంబి నరసింహాచార్య

చరవాణి: 9866 828 404

స్వామివారు శ్రీమాన్ రాఘవాచార్యులవారు అందించిన (గ్రంథాలకు గల) వ్యాఖ్యానాలు అపూర్వాలు. తెలుగు భాషకు సరికొత్త సొబగులు. ద్రవిడోపనిషత్తాత్పర్య రత్నావళి వంటి వాటి వ్యాఖ్యలు ద్రావిడ, శ్రీవైష్ణవ సంప్రదాయ పరులకు ఆనందజనకాలు కాగా, పాదుకాసహస్రము లాంటి స్తోత్ర గ్రంథముల వ్యాఖ్యలు సంస్కృత భాషాభిమానులకు ఆమోదాన్ని కలిగించేవి. నారాయణ శతకం వ్యాఖ్య లాంటివి ఆంధ్ర భాషాభిమానులకు సంతృప్తిని కలిగించేవి. శ్రీ వైష్ణవ తత్త్వాన్ని సామాన్యులకు కూడా కరతలామలకంగా చేశాయి కూడా. శ్రీమాన్ వేదాంత దేశికుల వారిపై ఆచార్యులవారికి గల అభిమానం నిరుపమానము. ఆ కారణముగానే వారు దేశికుల వారి పది శ్లోకాలుగల న్యాసదశకము మొదలుగా వేయి శ్లోకాలుగల పాదుకా సహస్రము వరకుగల గ్రంథాలలో విలక్షణమైన, విస్తృతమైన వ్యాఖ్యానాన్ని అందించి స్వాధ్యాయముతోనే తమ విశ్రాంతి కాలాన్నంతా సద్వినియోగ పరచుకున్నారు.

ఆచార్యుల వారి వ్యాఖ్యల గురించి పెద్దలు ప్రశంసించిన మాటలే వారి పాండిత్య ప్రకర్షకు, నికషోపలాలు. నంబిళ్ళైవారి వ్యాఖ్యలు ద్రావిడ ప్రబంధాలకు వలె దేశికుల స్తోత్రాలకు ఆచార్యుల వారి వ్యాఖ్యలు పరమ ప్రామాణికాలు. పంచ కావ్యాలకు మల్లినాథ సూరి వ్యాఖ్యలవలె ఆచార్యుల వ్యాఖ్యలు స్తోత్రాలకు సాగినాయి అని ఉభయ వేదాంతములందు నిష్ణాతులైన కవిశాబ్దిక కేసరులు, శ్రీమాన్ రఘునాథాచార్యస్వామి వారు ప్రశంసించారు. 'విశ్వనాథ వాఙ్మయ సూచిక' అని కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ చిన్న పుస్తకం వేసినట్లు దేశికుల రచనలను తెలుపుతూ 'వేదాంత దేశిక దర్శనం' వేయటం ఆచార్యుల వారికి దేశికులపై ఉండే అభిమానానికి నిదర్శనం. అదొక చిన్న రిఫరెన్స్ బుక్ అనాలి. ఎన్ని పుస్తకాలు వ్రాశారు దేశికులు. అందులో ఏ విషయముంది. అందలి భాష సంస్కృతమా, ద్రావిడమా అనే వివరాలు అందులో ఉండటం విశేషము. అందులో కన్పించని 'కింగృహో స్తుతి', 'హరిదిన తిలకం' లను జిరాక్సు రూపంలో నా నుండి తెప్పించుకొని చూచారు. ఏ విషయమైనా సమగ్రంగా పాఠకులకు అందించటం వారి లక్ష్యం. శ్రీవిష్ణు పాదాదికేశాంతవర్ణనలో ఒక శ్లోకం విష్ణుపరంగా అన్వయించటానికి అర్థం స్ఫురించినప్పుడు వారు పొందిన ఆనందం అనిర్వచనీయం. సమగ్రవ్యాఖ్య వారి లక్ష్యం. వారి వ్యాఖ్యను పెద్దలు ప్రశంసించటంలో ఆశ్చర్యం లేదు.

సామాన్యంగా శ్లోకానికి తాత్పర్యం, లేదా ప్రతిపదార్థ తాత్పర్యాలు, లేదా ప్రతిపదార్థ తాత్పర్య విశేషార్థాలు వ్రాస్తుంటారు. ఆచార్యుల వారు తాత్పర్యము, టీక, వ్యాఖ్యలను కూర్చారు. టీక అంటే నిరంతర వ్యాఖ్య లేదా సమగ్ర వివరణ అన్నారు. ఇక వ్యాఖ్య అంటే-

"పదచ్ఛేదః, పదార్థోక్తిః, విగ్రహః, వాక్యయోజనా
ఆక్షేపశ్చ, సమాధానం వ్యాఖ్యానం పంచ లక్షణం"

అట్లాగే వ్యాఖ్యానాలు ఎట్లా ఉంటాయో భోజుడు చమత్కరిస్తాడు.

"దుర్బోధం య దతీవ తద్ధి జహతి స్పష్టార్థమిత్యుక్తి భిః
స్పష్టార్థేష్వపి విస్తృతిం విదధతి వ్యర్థైః సమాసాదికైః
అస్థానేఽ నుపయోగిభిశ్చ బహుభిః జల్పైః భ్రమంతన్వతే
శ్రోతౄణామితి వస్తు విప్లవ కృతః సర్వేఽ పి టీకా కృతః"

మనకు ఒక విషయం శ్లోకంలో అర్థంకాదు, ఏమీ తోచదు. సరే వ్యాఖ్యానంతో విశేష ప్రతిపత్తిః' అని కదా అంటారు. వ్యాఖ్యానం అనేది మనకు విశేష (అధిక) జ్ఞానాన్ని కల్గించటానికి కదా అని వ్యాఖ్యానం చూస్తే ఈ అర్థం తెలిసిందే కదా అని దాటవేస్తాడు వ్యాఖ్యాత. ఆయన ఆ విషయం చర్చించదు. మనకు బాగా తెలిసినచోట అనవసరమైన సమాసాది వివరణలతో విస్తృతంగా వ్రాస్తాడు అనవసరమైనచోట, ఏ మాత్రం ఉపయోగపడని, రకరకాలైన అనవసరపు మాటలతో పాఠకులకు భ్రాంతిని కల్గిస్తాడు. ఇట్లా ఎక్కువమంది టీకా కారులు (అంతా) అసలు ఉన్న విషయాన్ని తప్పుదారి పట్టించారు. భ్రాంతి కల్గించారు. అసలు విషయం తోచకుండా చేశారు అని.

ఆచార్యులవారి వ్యాఖ్య ఈ మాటలకు విరుద్ధము. దాటవేయటం ఉండదు. తమ మనస్సుకు తృప్తి కలిగాకనే వ్యాఖ్యానిస్తారు. ఏదో వ్రాసేద్దామనే ధోరణి ఉండదు. పైన ఉదాహరించిన శ్రీవిష్ణుపాదాది కేశాంతవర్ణనలోని శ్లోకం ఉదాహరణ. (వారి ముఖతః విన్నమాటలే సాక్ష్యం). నా మూలంలిఖ్యతే కించిత్ నానపేక్షితముచ్యతే మూల శ్లోక సంబంధంలేని వివరణ ఉండదు. అనవసర ప్రసంగము ఉండదు. ఉత్తమ వ్యాఖ్య లక్షణమిది. ప్రతిపదార్థ తాత్పర్యాలు, చెప్పబోయే అంశాన్ని గూర్చిన చిన్న వాక్యం ఉంటాయి. 'అనుత్తమా' (918) అనే పదాన్ని వ్యాకరణశాస్త్ర ప్రకారం సిద్ధింపజేసి చూపారు. దానికి విగ్రహవాక్యం కూడా వ్రాశారు. శ్లోకంలోని రెండు పాదాల్లో (2, 4) వాడబడిన ఆ పదమునకు అర్థభేదాన్ని పదవిభజన భేదాన్ని తాము చూపారు. అంతేకాక మరో వ్యాఖ్యాత అందించిన విశేషాన్నీ తెలిపారు. శ్రుణుతే (912) అనే పదప్రయోగం వ్యాకరణ విరుద్ధమని ఆక్షేపించుకొని అది 'అపశబ్దాభాస' తప్ప అపశబ్దం కాదు అని దాని లక్షణాన్ని చెప్పి అక్కడ శ్రుణు, తే అని రెండు పదాలుగా చదువాలని అపశబ్దం లేదని చెప్పారు. ఇట్లా ఆక్షేప సమాధానాలు కన్పిస్తాయి. శ్లోకాలలో ఆ శ్లోకం ఏ ఛందస్సో, అలంకారమేమున్నదో వివరించారు. పాఠభేదం ఉంటే పాఠభేదం చెప్పారు. (962) వసంత తిలక వృత్తమని, కావ్యలింగాలంకారముందని, కాంతేషు తద్గుణ గణేషు అనే దానికి 'మాతః స్వయంగుణగణేషు' అని పాఠభేదాన్ని చూపి దానికే వ్యాఖ్య వ్రాశారు. ఆచార్యుల వారి వ్యాఖ్య సమగ్ర లక్షణ సమన్వితమైనది అని తెలుపుటయే దీని ప్రయోజనము.

చిత్రకవిత్వములో నలుబది శ్లోకాలున్నాయి. ఇది ఆనందదాయకము కాదు అని చెప్పారు సాహిత్యకారులు. దేశికులు 'యామఃశ్రయతి' (917) అనే శ్లోకంలో అశబ్దంతో (అకారార్థోవిష్ణుః) ఏకవచనాంతపు

ఏడు విభక్తులతో ఏడు వాక్యాలు కూర్చారు. దాన్ని అర్థం చేసుకోవటానికి బుద్ధికి పని చెప్పాలి. ఆ ఆలోచనలో పడి, ఆనందం భగ్నమౌతుంది.

కావ్యమంటే "రమణీయార్థమును ప్రతిపాదించే శబ్దము కలది" అని, కావ్యానికి రసము, వ్యంగ్యము ప్రధానము. ఇది ఉత్తమ కావ్యం. వ్యంగ్యం అప్రధానమైతే గుణీభూత వ్యంగ్యకావ్యం. శబ్ద, అర్థ, అలంకార, గుణములు వ్యంగ్యానికి ఉపకరించాయి. కాకుండా వాచ్యార్థానికే ఉపకరిస్తే గుణీభూత వ్యంగ్యమంటారు. రెండవ తరగతి కావ్యం (వ్యంగ్యం అప్రధానమిక్కడ) మూడవది చిత్రకావ్యం. జగన్నాథుడు దీన్నే ఐదవ తరగతి కింద చేర్చి అధమాధమ కావ్యమన్నాడు. శబ్ద అర్థ అలంకారములు గుణములు ప్రధానమై వ్యంగ్యం లేకపోతే చిత్రకావ్యం. అర్థం వెంటనే స్ఫురించకపోతే చిత్రకావ్యం, రసం అప్రధానమై, అన్వయం క్లిష్టంగా ఉంటే చిత్రకావ్యం. శబ్దచమత్కృతి మాత్రమే కలది చిత్రకావ్యం అని అలంకార శాస్త్ర కారులు చెప్పారు. కాని వేయి ఎనిమిది శ్లోకాలుగల పాదుకా స్తుతిలో ఈ నలభై శ్లోకాలు చాలా అల్పభాగం పెద్దగా రసభంగాన్ని కల్గించవు. భక్తి రసప్రవాహంలో సాగుతున్న (మధుసూదన సరస్వతి) బృహత్కావ్యంలో ఈ చిన్న భాగం అనే చితకాన్ని కల్గించవు. పైగా దేశికుల వారికిగల పద్మాది బంధనిర్మాణముగల కవితాశక్తిని నిరూపిస్తాయి. కనుక పాదుకలకు చేసిన చిత్రాలంకారంగా ఔచిత్యవంతంగా భావించవచ్చును. ఆచార్యుల వారు ఆ విషయం చెప్పారు (911). దేశికులు సాహిత్యకారులు చెప్పిన పద్మ, చక్ర, గోమూత్రికా, మురజాది బంధాలనే కాక తురంగ పదబంధం లాంటివి కూర్చారు. పద్మబంధంలో రకరకాల భేదాలు చూపారు. వారు చూపిన విశేషాలనన్నీ చదువరులకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఆచార్యులవారు సప్రమాణంగా వ్యాఖ్యానించటం విశేషంగా చెప్పుకోదగిన అంశము. చిత్రకవిత్వంలో చివర (949) పద్మంలో రంగనాథుని పాదద్వంద్వాన్ని చేర్చి రచన చేయటము, అది పాదుకా బంధమని విశేషంగా వ్యాఖ్యానించి చూపారు ఆచార్యులవారు.

అంత్యకాలంలో పరమాత్మ నామస్మరణ ఉండటం అవసరం. "స్థితే మనసి సుస్వస్థే" అని వరాహ చరమంలో స్వామి అంత్య కాలంలో, నేను స్మరిస్తాను. కాని ఆరోగ్యంగా ఉన్నప్పుడు నీవు నన్ను స్మరించు అని చెప్పాడు కదా! అని ఐనా వీని (జీవుని) పాపభీతివల్ల వీని భయం వీడేది. కనుకనే అంతిమ స్మరణ కావచ్చు. నిరంతరం స్వామిని స్మరించేవారికి అంతిమ స్మరణ పనిలేదు. సామాన్యులకు అంతిమ స్మరణం అవసరం అని వ్యాఖ్య (970). నమ్మాళ్వారులే భగవత్పాద స్థానీయులు. నిరంతరం భగవత్పాదాలు శిరసా ధరించారు కదా! దేశికుల శ్లోకానికి అనువుగా పాశురాలు చూపి వ్యాఖ్యకు మెరుగు దిద్దారు ఆచార్యులవారు. వ్యాఖ్యలో ఆచార్యుల వారు ఇతర వ్యాఖ్యాకారుల అభిప్రాయాలూ కూర్చి, వారి పేర్లను ఉట్టంకిస్తూ తమ సౌహార్దాన్ని చాటుకున్నారు.

'పాదపా' (939) శ్లోకంలో మాతా పిత్రాదుల రక్షణ అవశ్య కర్తవ్యమని, ఉపేక్షించినవారు అశుభాన్ని పొందుతారని మనం నడువవలసిన రీతిని హెచ్చరించారు. భగవంతుడు అతృప్తామృతము ఎంత తాగినా తృప్తి కలగదు. కనుకనే పాదాలను వదలటంలేదు పాదుకలు. భగవదారాధనలో పాదుకలు, తప్పక ఉంటాయి, ఆరాధిస్తారు (గమనించాల్సిన విషయం) (946+976) దేశికులు తమ పేరును, పాదుకా సహస్ర అనే దానిని శ్లోకాలలో ముద్రగా చూపారు. ఈ చిత్ర కవితావ్యాఖ్యానంలో వ్యాకరణాంశాలను వివరించిన ఆచార్యులవారి శాస్త్ర పాండిత్యము అభినందనీయము.

నిర్వేద పద్ధతి:- ఇందులో ఇరవై శ్లోకాలున్నాయి. దేశికుల వారి వైరాగ్య పంచకాన్ని చదివిన వారికి నిర్వేదం గూర్చి వివరించ పనిలేదు. "చిత్రకవితాభ్రమవల్ల కల్గిన దుఃఖంతో, తన అపరాధాన్ని క్షమించమని పాదుకను, నిర్వేదంగా స్తుతిస్తున్నారు". ఈ నిర్వేదానికి సహేతుకమైన కారణాన్ని ఆచార్యులవారు చూపించారు వ్యాఖ్యలో.

'అపిజన్మని పాదుకేపరస్మిన్' (952) అనే శ్లోకం చదవగానే కృష్ణ కర్ణామృతంలోని 'అపిజనుషి పరస్మిన్' అనే శ్లోకము, ఆనందమందాకినిలోని 'పీయూష ద్రవసార' శ్లోకము గుర్తుకు వస్తాయి పూర్వపరిచయమున్న వారికి. భావము దరిదాపుగా సరిపోతుంది. 'దౌవారిక' (959) శ్లోకం వైరాగ్య పంచకాన్ని గుర్తు చేస్తాయి. శ్రీ వైష్ణవ సంప్రదాయంలో పురుషకారరూపులుగా ఆచార్యులు శ్రీదేవి చెప్పబడినట్లే పాదుకలు కూడా పురుషకారం చేసేవిగా స్వామిని, జీవుని కలిపే సాధనముగా చెప్పబడ్డాయి (962).

ఫలపద్ధతి:- ఇందులో ముప్పది ఎనిమిది శ్లోకాలున్నాయి. శ్రీ వైష్ణవ సంప్రదాయంలో స్వామిని చేరటానికి శరణాగతి ఉపాయం, శరణాగతిని చరణములందు చేస్తాం. చరణములు, చరణరక్షణ చేసే పాదుకలు అన్యోన్యంగా మెలిగేవి కనుక చరణాగతి పాదుకలందు ఉపాయంగా చేస్తాము. ఉపేయం, ఫలము చరణ కైంకర్యమే ద్వయమంత్రం చెప్పేది ఇదే. "శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే, శ్రీమతే నారాయణాయ నమః' ఒక వాక్యం ఉపాయం కాగా, రెండవ వాక్యం ఉపేయం ఔతుంది. కనుక ఉపాయం, ఫలము పాదుకలే అన్నారు. దీనికి "ఏతేహి సర్వలోకస్య యోగక్షేమం విధాస్యతః' అని పల్కిన వాల్మీకి వాక్యం ప్రమాణంగా చూపారు. దానినే దేశికులు ఫలపద్ధతిలో (971) చెప్పారు. లోభులను గూర్చి ఆచార్యులవారు వివరించిన రీతిని ఆచార్య లక్ష్మణమూర్తిగారు ప్రస్తావించియున్నారు. ఆ మాటలు దృశ్యాన్ని కళ్లకు కట్టేట్టుగా ఉన్నాయి (973). భరతుని వ్యసనాన్ని తొలగించినట్లు మన వ్యసనాన్ని తొలగించేవి పాదుకలే (975), పాదుకలు పురుషకారం చేస్తున్నాయి. ఆచార్యులు ఏ రకంగా తాము స్వామిని ఆశ్రయించి జీవులను ఆశ్రయింప చేస్తారో శ్రీవలె, అట్లా పాదుకలు తాము స్వామి పాదాలనాశ్రయించి అందరు ఆశ్రయించేట్లు చేస్తున్నవి కనుక ఘటకురాలు అని, ఆభరణాలన్నిటిలో ఉత్తమురాలని శ్లాఘించారు (978). కోవెలలో పాదుకలను (శఠకోపాన్ని) ఎందుకు శిరసావహిస్తున్నామో అందంగా చెప్పారు దేశికులు. భగవత్పాదాలు ఒక నిధి. ఆ నిధిని కోరేవారు ఆ నిధి రక్షకమైన (శఠకోపాన్ని) పాదుకలను శిరసా వహిస్తున్నారు (తమ నిధిని రక్షిస్తున్నందుకు అని) (981). అంత్యకాలంలో భగవత్స్మరణవల్ల, మోక్షఫలప్రాప్తికి ప్రతిబంధకాలుగా నున్న విరోధులు సంహరింపబడుతారు (పాపాలు పోతాయి). పునర్జన్మ ఉండదు. ఆ స్వామి స్మరణను/ దర్శనాన్ని కలిగించేది పాదుకలు మాత్రమే. అట్టి పాదుకలే ఈ 'పాదుకా సహస్రానికి' కర్త. నేను కాను అని తమ కర్తృత్వ త్యాగాన్ని (పరిత్యజ్య) చూపారు దేశికులు. అది సాత్త్వికుల లక్షణం. అంతేకాక అర్చకులు శఠారిని శిరస్సుపై ఉంచాక, ఆ పాదుకల ప్రభావంతో ఈ స్తోత్రం ఆవిర్భవించిందనేది స్వభావోక్తి కూడా. భగవత్పాదుకా కైంకర్యం ఇహంలో, పరంలో కలగాలని దేశికులు ఆకాంక్షించారు. అదే కోరతగిన ఫలము. ఈ చిత్ర నిర్వేద ఫలపద్ధతులవల్ల స్వామిని గూర్చి మాట్లాడగలిగే శక్తి పెరిగి, ప్రాకృతిక విషయాలపై రక్తి తగ్గి, భగవంతునియందు అనురక్తి పెరిగి స్వామిని చేరే మార్గం సుగమం కావాలని కాంక్షిస్తున్నాను (చిత్ర, నిర్వేద, ఫలాలు).

వ్యాఖ్యాతృశిరోమణి వ్యాఖ్యానాన్ని వివరించటం అతి కష్టం. ప్రతి శ్లోక చమత్కృతిని ప్రతిపాదించేది ఈ వ్యాఖ్య. పాదుకా సహస్రం ఐదవ భాగంలోని విషయాన్ని క్లుప్తంగా చెప్పే ప్రయత్నం చేశాను.

అక్షరాంకప్రస్తుతి

ఆచార్య రావికంటి వసునందన్
చరవాణి: 09849 852 182

శ్రీదము పాదము, హస్తము/ శ్రీదము, చిరునగవు మోము శ్రీదము, మీకున్
శ్రీదము చిత్తము, తత్త్వ/ శ్రీదము వాగ్విభవమెన్న చిన్మయ తేజా!

కారము నుపకారముననె/ తోరపు హుంకార రీతి దోషము లందే!
చేరు ముముక్షువులను మమ/ కారము గురురాయ! పురుషకారము నందే!

రంతులు వంతులు లేని య/ నంతంబగు విష్ణుభక్తి యనవరతంబున్
స్వాంతము నందున నిల్పు చి/ రంతన! గురురాఘవార్య! రమ్యాకారా!

చేకురు శుభముల వెన్నియొ/ మాకున్ భవదాజ్ఞచేసి మాన్య చరిత్రా!
శ్రీకరములు దుగ్ధాంబుధి/ శీకరములు తుహిన్ కిరణ శేఖరములునై

డులుచును కల్మష జాలము/ నలసత నుద్వేగములను హోనుల బెలుచన్
అలఘు భవౌషధ వరమీ/ యిల మీయుపదేశ శక్తి యెంతయు ననఘా!

రాఘవాచార్య! వ్యాఖ్యాతృ రాజ రాజ!/ కదు గభీరమ్ము సరళమ్ము క్రమతరము
మీదు వ్యాఖ్యాన పద్ధతి వేదశాస్త్ర/ విహిత సద్గ్రంథ తతి పర్యవేక్షణమున

ఘన ఘనాఘన రుతము మీ గళరవమ్ము/ వేదశాస్త్ర పురాణార్థ వితరణమున
శ్రోతలను ముగ్ధమొనరించు, ప్రీతి గూర్చు/ సభలు దివిషత్సభలుగాగ సవదరించు

వరుస నాజాను బాహు సుందరము మూర్తి/ పరగు రాకాశశాంక బంధురము కీర్తి
ప్రతిభ శిష్య వరాళికి బాపునార్తి/ సక్రమ స్ఫూర్తి నాచార్య చక్రవర్తి

స్వామీ! విజ్ఞతజాలు వారెడి కనుల్, వాచో ఝరీ గంగలున్
శ్రీ మంతంబగు దివ్య మానసము, నిశ్శ్రేయాత్మ సంసక్తియున్
శ్రీమత్పాల విరాజి పుండ్రమును సచ్ఛీలంబు సర్వస్వమౌ
శ్రీమాన్ రాఘవదేశికోత్తముల కర్పింతున్ నమశ్శీకముల్

మిసమిసలాడెడు కరుణయు/ నసదృశ సద్వర్తనమును నఖిల జగచ్ఛ్రే
యస కాంక్షయు ముమ్మాటికి/ నసదై శ్రీ రాఘవార్య యలరును మీరై!

శ్రీ
కా
రం
చే
డు
రా
ఘ
వ
స్వా
మి

ప్రతిపద్యం ప్రథమ చరణ ప్రథమాక్షరాన్ని పై నుండి క్రిందికి చదివినచో 'శ్రీ కారంచేడు రాఘవా స్వామి' అగును



యాదవాభ్యుదయము-సుబోధినీ సుధ (1సం.)

ఈ. ఎ. శింగరాచార్యులు

చరవాణి: 9885 003 420

కీర్తిమూర్తులు, వాచస్పతి, పండితరత్న, శాస్త్రవిద్వన్మణి ఇత్యాద్యన్వర్థ బిరుద భూషితులైన ఉ.వే. శ్రీమాన్ కారంచేటి తిరుమల వేంకట రాఘవాచార్యస్వామివారిని తెలియని సాహిత్యప్రియుడు కాని, శ్రీవైష్ణవ సంప్రదాయాభిమానికాని ఆంధ్రదేశంలో ఉండడు. శ్రీమాన్ రాఘవాచార్యస్వామివారు సంస్కృత సాహిత్యానికి విశేషించి దేశిక సాహిత్యానికి, శ్రీ వైష్ణవ సంప్రదాయానికి చేసిన సేవ చిరస్మరణీయమైనది; అనన్య సాధ్యమైనది. విద్వద్వరిష్ఠుల ప్రశంసలనందుకొన్న పాండిత్యం, వ్యక్తిత్వం వారిది. వైదిక విద్యలో, లౌకిక వృత్తిలో సాటిలేని మేటిగా కీర్తిగడించారు. వ్యాఖ్యాన కళలో తన్మర్మజ్ఞుల మెప్పును పొందారు. ఇవన్ని ఒక ఎత్తు కాగా, సాటిలేని ఆత్మ గుణభూషితులై ఉండడం ఇంకొక ఎత్తు. అది వారి మహోన్నత వ్యక్తిత్వానికి "హేమ్నః పరమామోదః" అయినది.

శ్రీమాన్ రాఘవాచార్యస్వామివారి రచనలను గూర్చిన, వారి వ్యక్తిత్వాన్ని గూర్చిన సమీక్షాత్మక వ్యాసాలతో, వారి జీవిత విశేషాలతో గూర్చిన ఒక సంచికను అక్షరాత్మకంగా ఆవిష్కరించి, వారి మహోన్నతమూర్తిని చిరస్మరణీయం చేయదలచిన వారి కుమారులు శ్రీమాన్ కె.వి.రమణాచారి (ఐ.ఏ.ఎస్. రిటైర్డ్), శ్రీ రాఘవాచార్యస్వామివారు యాదవాభ్యుదయ మహాకావ్యానికి సంతరించిన సుబోధినీ వ్యాఖ్య- ప్రథమ భాగాన్ని (మొదటి నాల్గు సర్గల వ్యాఖ్యానం) సమీక్షిస్తూ ఒక వ్యాసాన్ని విన్నవించవలసినదిగా నన్ను ఆదేశించడం గొప్ప భాగ్యంగా భావిస్తున్నాను.

కవితార్కిక కేసరి, వేదాంతాచార్య, సర్వతంత్ర స్వతంత్ర- ఇత్యాది బిరుదాలతో ప్రసిద్ధులైన వేంకటనాథులు వేదాంతదేశికులుగా ప్రసిద్ధులు. వీరి సాహిత్యం, భగవానుని రూపంవలె, విశ్వతోముఖమైనది. వీరు స్పృశించని సాహిత్య ప్రక్రియ కాని, వేదాంత తత్త్వంకాని లేదు. సంస్కృత, ప్రాకృత, ద్రావిడ, మణిప్రవాళ భాషలలో వీరు వెలయించిన గ్రంథాలు శతాధికాలు. విశిష్టాద్వైత, శ్రీ వైష్ణవ సంప్రదాయ సాహిత్యమంతా "దేశికోచ్ఛిష్ట" మనడం యథార్థం.

ఇటువంటి వైలక్షణ్యాన్ని కల్గిన దేశిక కృతులన్నిటిలో యాదవాభ్యుదయ మహాకావ్యానికి ఉండే స్థానం, గౌరవం చాలా గొప్పది. అద్వైత విద్వద్వరేణ్యులైన అప్పయ్యదీక్షితులు ఈ మహా కావ్యాన్ని వ్యాఖ్యానించడం, తమ వ్యాఖ్యలో మొదటి సర్గలోని "క్రీడాతూలికయా" అనే 9వ శ్లోకాన్ని వ్యాఖ్యానిస్తూ "ఇత్థం విచింత్యా సర్వత్ర భావాః సంతి పదే పదే, కవితార్కిక సింహస్య కావ్యేషు లలితేష్వపి" అని గొప్పగా ప్రశంసించడం ఈ కావ్యగౌరవాన్ని స్పష్టం చేస్తున్నది.

ప్రకృతంలో ఒక విషయాన్ని ప్రస్తావించడం సందర్భోచితమని భావిస్తాను. ఇప్పటికి సుమారు 8, 9 సంవత్సరాల పూర్వం తిరుపతిలోని ఆంధ్రోపన్యాసకులు శ్రీ నెమ్మాని వేంకటరమణయ్యగారు, అప్పయ్యదీక్షితుల వారి గ్రంథాలను ఆంధ్రీకరించి, ముద్రించే ప్రయత్నం జరుగుతున్నదని, దీక్షితులవారి యాదవాభ్యుదయ వ్యాఖ్యానం ఆంధ్రీకరించమని నన్ను అడిగారు. వెంటనే నేను ఈ పనికి శ్రీమాన్ కె.వి.రాఘవాచార్యస్వామి తగినవారని, వారిని కోరమని వేంకటరమణయ్యగారికి తెలిపాను. వారు కూడా హైదరాబాద్‌కు వెళ్ళి, శ్రీ రాఘవాచార్యస్వామివారిని ప్రార్థించడం, వారి మాటను శ్రీమాన్ స్వామివారు అంగీకరించడం జరిగింది. ఇది సుబోధినీ వ్యాఖ్యారచనమునకు సంబంధించిన నేపథ్యం.

శ్రీమాన్ రాఘవాచార్యస్వామివారు అప్పటికే శ్రీదేశికుల పలు స్తుతులకు విద్వజ్జనామోదాన్ని కలిగించే రుచిర వ్యాఖ్యలను వెలయించారు. వారి వ్యాఖ్యాన శైలి విలక్షణంగా ఉంటుంది. ఏ విషయాన్ని వారు ప్రతిపాదించినా, దానికి సప్రమాణంగా నిరూపిస్తారు. ప్రతిశ్లోకానికి ప్రతిపదార్థాన్ని తెల్పిన తరువాత, విశేష వివరణారంభంలో, ఆ శ్లోకం సారంగా ప్రతిపాదింపబడే ముఖ్యాంశాన్ని ఒకటి, రెండు వాక్యాలతో పఠితకు పరిచయం చేస్తారు. విలక్షణ పదప్రయోగాలలోని వ్యాకరణాది శాస్త్రీయ విశేషాలను దేనినీ విడవకుండా అందిస్తారు. ఉభయవేదాంత తత్త్వాలను ఆవిష్కరిస్తారు. సారజ్ఞులైన నిర్మత్సర పాఠకులకు శ్రీమాన్ స్వామివారి వ్యాఖ్య ఒక విందు భోజనం.

యాదవాభ్యుదయ కావ్య వ్యాఖ్యానాన్ని కూడా శ్రీమాన్ రాఘవాచార్యులవారు ఈ శైలిలోనే రచించారు. నా ఈ సమీక్ష మొదటి నాల్గు సర్గల వ్యాఖ్యానంతో కూడిన ప్రథమ భాగాన్ని ఉద్దేశించినది కనుక, ఆ ప్రథమ భాగంలో గోచరించే కొన్ని విశేషాలను సంగ్రహంగా ప్రస్తావిస్తాను.

శ్రీవైష్ణవ సంప్రదాయానికి చెందిన సాహిత్యం ద్వయ మంత్రార్థ ప్రతిపాదకం. యాదవాభ్యుదయ కావ్యం కూడా విష్ణుతత్త్వ ప్రతిపాదకమే కనుక, ఇందులో కూడా ద్వయమంత్రార్థం అంతర్లీనంగా ప్రతిపాదింపబడినదనే విషయం చెప్పనక్కరలేదు. ద్వయమంత్రంలోని "శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే" అనే పూర్వ వాక్యంలో శ్రీమన్నారాయణుని శ్రీచరణాలలో చేసే శరణాగతి ప్రతిపాదింపబడింది. ఈ వాక్యంలోని అర్థాన్ని వివరించే ఆచార్యులు ఇక్కడ శరణ్యుడైన నారాయణ నామంద్వారా ఆశ్రయణానికి తగిన వాత్సల్య, సౌశీల్య, సౌలభ్య, స్వామిత్వాలనే గుణాలు సూచింపబడతాయని అన్నారు. శ్రీ వేంకటేశ్వరుని శ్రీచరణాలలో శరణాగతిని చేసే సమయంలో శ్రీ శఠకోపసూరి కూడా తమ తిరువాయ్ మొళి ప్రబంధంలోని ఒక పాశురంలో (6-10-10) "నికరిల్ పుకళాయ్!" (సాటిలేని వాత్సల్య గుణాన్ని కలవాడా!) ఇత్యాది నాల్గు సంబోధనలతో ఈ నాల్గు గుణాలను అనుసంధించడం ద్వారా నారాయణ నామానుసంధానాన్ని చేశారు. ఈ విధంగా వైదిక మర్యాదను, ఆ మర్యాదను పాటించిన దివ్యసూరుల ఆచరణను అనుసరిస్తూ దేశికులు యాదవాభ్యుదయ కావ్యంలోని మొదటి శ్లోకంలో "వందే బృందావన చరమ్" ఇత్యాదిగా ప్రబంధ ప్రతిపాద్యదేవత, శ్రీమన్నారాయణుని అవతార విశేషమైన శ్రీకృష్ణుని శరణాగతి చేశారు. ఈ విధంగా శరణు పొందేటప్పుడు అనుసంధేయాలైన నాల్గుగుణాలను శ్లోకంలోని నాల్గు విశేషణాల ద్వారా సూచించారని శ్రీమాన్ రాఘవాచార్యులవారు తమ సుబోధినీ వ్యాఖ్యలో వివరించారు. "బృందావన చరమ్" అనే విశేషణం

వాత్సల్యాన్ని, "వల్లవీ జనవల్లభమ్" అని సౌశీల్యాన్ని, "జయంతీ సంభవమ్" అని సౌలభ్యాన్ని, "వైజయంతీ విభూషణమ్" అని స్వామిత్వాన్ని శ్రీ దేశికులు సూచించారనే అంశాన్ని చాలా వివరణం, ప్రమాణ పురస్సరంగా శ్రీమాన్ స్వామివారు వ్యాఖ్యానించారు. ఇంతేకాక, ఈ నాల్గు విశేషాలు ప్రకృతార్థాన్ని ఉద్దేశించి సాభిప్రాయంగా ప్రయోగింపబడ్డాయి. కనుక ఈ శ్లోకం పరికరాలంకార భూషితమని కూడా అన్నారు. దివ్యసూరుల ప్రబంధాలలో కన్పించే సంబోధనలను, విశేషణాలను పూర్వాచార్యులు పరికరాలంకార ప్రక్రియలలో సమన్వయించి, వివరించడం ఇక్కడ స్మరణీయం. రెండవ శ్లోకంలో దేశికులు "యదేవైన గుణప్రాంతే శ్రాంతానిగమ వందినః, యథావద్వర్ణనే తస్య" అని భగవద్గుణ మహిమను కీర్తించారు. దీనికి సంవాదంగా నమ్మాళ్వార్ల తిరువాయ్ మొళి ప్రబంధంలోని "ఉయర్వఱ ఉయర్‌నలముడై యవన్" (నిస్సమాభ్యధిక, ఉద్యదా నందగుణమడు) అనే సూక్తిని ప్రమాణీకరించారు. ఈ విధంగా శ్రీమాన్ స్వామివారి వ్యాఖ్యానంలో పలుచోట్ల సాంప్రదాయిక, వేదాంత తత్త్వాలు ఆవిష్కరింపబడడం గమనించవచ్చు.

దేశికులు ప్రయోగించిన విలక్షణ పదాల వివరణను శ్రీమాన్ స్వామివారు తెలియజేయడం మరొక విశేషం. ద్వితీయ సర్గారంభంలో దేశికులు "దేవీ బభౌ దౌహృద లక్షణేన" (దేవకీదేవి గర్భచిహ్నంతో ప్రకాశించింది) అని దౌహృద పదాన్ని ప్రయోగించారు. దీనిని శ్రీమాన్ స్వామివారు "మాతృ జన్యస్య హృదయం మాతుశ్చ హృదయేనయత్, సంబద్ధంతేన గర్భిణ్యానేష్టం శ్రద్ధావ మాననమ్" అనే బాహటుని లక్షణాన్ని ప్రమాణీకరిస్తూ, గర్భస్థ శిశువు హృదయం తల్లి హృదయంతో సంబంధించి ఉంటుంది కనుక తల్లి గర్భాన్ని ధరించి ఉండే స్థితి దౌహృద మనబడుతుందని వివరించారు. ప్రథమసర్గలోని 71వ శ్లోకంలో "మహిమ్నాజాత వైచిత్ర్యం మహానీలమివోదితమ్" అని మహానీల పదప్రయోగాన్ని దేశికులు చేశారు. మహానీలమనే ఈ ప్రయోగాన్ని శ్రీమాన్ స్వామివారు "సింహళస్యాకరే జాతా మహానీలా ఇతి స్మృతాః" అనే రత్నశాస్త్ర వచనాన్ని ఉదాహరించి వివరించారు. 91వ శ్లోకంలో "విలక్షస్మిత సంభిన్నమౌక్తికాధర విద్రుమాపి" అని విలక్ష పదప్రయోగం చేయబడింది. విలక్ష శబ్దానికి విస్మయంతో, సిగ్గుతో కూడినదని అర్థం. దీనిని "ఆత్మనశ్చరితే సమ్యక్ జ్ఞాతే న్యైర్యస్య జాయతే, అపత్రపాతి మహతీ స విలక్ష ఇతి స్మృతః"- (తన విషయం ఇతరులకు తెలిసినపుడు ఏర్పడే సంకోచం, ఆశ్చర్యం- అనే రెండు భావాలు కలిసి ఉండే స్థితి విలక్షణమనబడుతుంది) అనే అమరకోశ టీకలోని ప్రమాణాన్ని ఉదాహరించారు.

దేశికులు కావ్యారంభంలో భగవంతుని మనస్సు నుండి చంద్రుడు పుట్టాడనే "చంద్రమా మనసోజాతః" అనే పురుష సూక్త ప్రక్రియ "జగదాహ్లాదనోజజ్ఞే మనసస్తస్య చంద్రమాః" అని అన్నారు. కాని, శ్రీ విష్ణు పురాణంలో చంద్రుడు అత్రిపుత్రుడని తెలపబడింది. ఇక్కడ తోచే అర్థ విరోధాన్ని శ్రీమాన్ స్వామివారు తమ వ్యాఖ్యలో "తత్తత్కల్పాంత వృత్తాంత మధికృత్య మహర్షి భిః, తాని తాని ప్రణీతాని విద్వాంస్తత్ర నముహ్యాతి" అనే వాయు పురాణ వచనాన్ని ఉదాహరించి కల్పాంతర వృత్తాంతాలుగా వీనిని సమన్వయించవచ్చు నని తెలిపారు.

మగనెమలి వర్షాకాల సమయంలో మేఘాన్ని చూచి ఆనందంగా నాట్యమాడే సమయంలో దానికంటి నుండి కన్నీళ్ళు స్రవిస్తాయి. ఆ కన్నీటి బిందువులను ఆడు నెమలి తాగి గర్భధారణ చేస్తుంది. ఈ విధంగా

నెమలి జంటకు శారీరక సంపర్కం ఉండదు. భగవానుడు అవతరించినా కర్మసంబంధం కల్గి ఉండదు. దీనిని సూచించడం కోసమే శ్రీకృష్ణ భగవానుడు శిరస్సుపై మయూరపింఛాన్ని ఆచరణంగా ధరించాడనే విశేషాన్ని చతుర్థ సర్గలోని 82వ శ్లోకంలో గల "కృతబర్హచూడే కృష్ణస్య మౌళౌ" అనే ప్రయోగాన్ని వివరిస్తూ తెలిపి, శ్రీకృష్ణుని మయూర పింఛధారణం ఆ స్వామి యొక్క యోగీశ్వరత్వానికి సంకేతమన్నారు. ఈ విధంగా శ్రీమాన్ స్వామివారి సుబోధినీ వ్యాఖ్య ఆవశ్యక సకల విశేషార్థ వివరణాత్మకమై, అన్వర్థమై శోభిల్లుతున్నది.

శ్రీమాన్ రాఘవాచార్య స్వామివారి వ్యాఖ్యామాధుర్యంలోని చాపల్యం చేత సుబోధినీ వ్యాఖ్యలోని మూడు, నాల్గు విశేషాలను మాత్రం ప్రస్తావించాను.

సౌశీలస్య నిధాన మార్జవ దయాదీనాం మహానాకరః
సౌజన్యస్య వుభాశ్రయో విమల విద్వత్తా గృహీతా కృతిః।
శుద్ధాచార ఖనిశ్చ దేశిక వచో దుగ్ధాబ్ధి మగ్నాశయః
శ్రీమానేష గురూత్తమో విజయతాం శ్రీ రాఘవార్యస్సదా॥

సర్వాత్మ గుణవాసాయ సదాచార్య స్వరూపిణే।
శ్రీమతే రాఘవార్యాయ నిత్య శ్రీః నిత్యమంగళమ్॥

ప్రణుతి

ఆచార్య డా॥ పుల్లెల శ్రీరామచంద్రుడు

శ్రీమద్వేదాన్త దేశికులు వివిధశాస్త్రాలలో ఎంతటి ఉద్దండపండితులో అంతటి విభిన్న సాహిత్య ప్రక్రియా నిపుణులైన మహాకవులు. భారతదేశంలోను, ఇతర దేశాలలోనూ కూడా సంస్కృతసాహితీప్రియ ప్రపంచంలో గొప్ప ఆదరం పొందిన వీరి కావ్యాలలో 'పాదుకాసహస్ర యాదవాభ్యుదయ' మహాకావ్యాలు అగ్రగణ్యమైనవి.

శాస్త్రాలలో అసమానమైన ప్రజ్ఞ కలిగి ఉండి ఉద్గ్రన్థ రచనల ద్వారా శాస్త్రవాఙ్మయాన్ని సమృద్ధం చేసిన మహాపండితులలో- కావ్యరచనా తద్రసాస్వాదాదుల విషయంలో శ్రద్ధాసక్తులున్న మహాపురుషులు చాలా అరుదు. ఈ రెండు ప్రక్రియలలోను సమానమైన ప్రావీణ్యంగల అసమాన ప్రజ్ఞాశాలులలో అగ్రగణ్యులు శ్రీమద్వేదాన్త దేశికులు. ఇలాంటి మహాపురుషులకు ఏ ప్రక్రియలో ఎక్కువ మక్కువో చెప్పడం కష్టం. అయితే తత్త్వజిజ్ఞాసతో వివిధశాస్త్రాధ్యయనం చేసినా, తాము తెలిసికొన్న తత్త్వాన్ని జిజ్ఞాసువులకు అందజేయడం కోసం శాస్త్రగ్రంథ రచనాదికం చేసినా, హృదయానికి పరిపూర్ణమైన ఆనందాన్ని ఇచ్చేది ఉత్తమ కావ్యరసాస్వాదమే అన్నట్లు శ్రీ వేదాంత దేశికులు ఈ క్రింది శ్లోకంలో సూచించారు-

పఠన్తు కతిచిద్ధఠాత్ ఖఫఛరేతి వాచాం భటాః
ఘటః పట ఇతీతరే పటురటన్తు నైయాయికాః,
వయం వకుల మఞ్జరీ గలదసార మాధ్వీఝరీ
పరీత పదరీతిభిః ఫణితిభిః ప్రమోదామహే

(అల్లమరాజు సుబ్రహ్మణ్య కవి సంకలిత చాటుధారా చమత్కార సారం నుండి. పేజి 29). కొందరు శబ్దరక్షకభటులు ఖఫఛర అంటూ కటువర్ణాల ఉచ్చరిస్తూ కాలక్షేపం చేస్తూండు గాక! నైయాయికాదులు ఘటః, పటః అంటూ ఏవేవో మాటల రటనం చేస్తూందురు గాక! మేం మాత్రం వకుళ పుష్పమంజరుల నుండి జాలువారుతూన్న తేనెధారల వంటి మధుర పదగుంభనలున్న కావ్యరచనలతో ఆనందిస్తూంటాం" అంటారు. మమ్మటుడు చెప్పినట్లు- సత్కావ్యం సద్యఃపరనిర్వృతి ప్రదం కదా!

ఇట్టి సహజ ప్రతిభా సంపన్నులవడం చేతనే వీరు అత్యుత్తమ కావ్యశ్రేణికి చెందిన అనేక శ్రవ్యకావ్యాలు, సంకల్ప సూర్యోదయాది దృశ్యకావ్యాలు రచించి గైర్వాణవాహిణిని అలంకరించారు. ఇలాంటి కవి దార్శనిక కేసరుల రచనలు చదివి అర్థం చేసికొనడమే ఒక విధంగా పాండితీప్రకర్షకు నిదర్శనం అని చెప్పాలి. తాము అర్థం చేసికొన్నదానిని ఇతరులకు స్పష్టంగా అందించ కలగడం ఉత్తమ బోధకునికి మాత్రమే సాధ్యమైన విషయం.

ఈనాడు మనకు తెలుగునాట కనబడే అలాంటి అంగుళీ గణనీయులైన విద్వత్తల్లజులలో ఒకరు శ్రీమాన్ కారంచేటి వేంకటరాఘవాచార్యులవారు. ఈ వేంకటరాఘవాచార్యులవారు శ్రీ వేంకటనాథులు రచించిన కొన్ని స్తోత్రాలకు, పాదుకా సహస్రానికీ తెలుగులో ప్రామాణికములైన, విస్తృతవ్యాఖ్యలు రచించి తెలుగు వారికి అందించి ఉన్నారు. ఇప్పుడు వీరు శ్రీదేశికుల కావ్యాలలో అత్యున్నత స్థానాన్ని అధిష్ఠించి ఉన్న ఇరవైనాలుగు సర్గల మహాకావ్యం యాదవాభ్యుదయానికి వ్యాఖ్య సంతరించడం సంస్కృతజ్ఞుల సౌభాగ్యం.

చిత్రకావ్యం అనేది సంస్కృత భాషలో మాత్రమే లభ్యమైన, ఇతర భాషలలో సంస్కృత భాషాసాహాయ్య మాత్రసాధ్యమైన, ఒక అద్భుత సాహిత్య ప్రక్రియ. పంచకావ్య పఠన క్రమంతో ప్రారంభించి సంస్కృత భాషాసాహిత్యాల అధ్యయనం చేసేవారికి- ఏకాక్షర- ద్వ్యక్షరాది శ్లోకాలు, వివిధ యమకాలు, మురజ బంధాది చిత్రబంధాలు మొదలైనవాటితో ప్రప్రథమంగా పరిచయం *కిరాతార్జునీయ- శిశుపాలవధ* మహాకావ్యాలలో కలుగుతుంది. భారవి మహాకవి 'న'కారంతో ప్రారంభించిన ఏకాక్షర శ్లోకం చివరికి 'త'కారంతో ముగించవలసి వచ్చింది. మాఘకవి 'ర'కారంతో ఒక ఏకాక్షరి శ్లోకం వ్రాయగలిగాడు. ఆ కావ్యాలలో ఇలాంటి శబ్ద చిత్ర యమకాదుల ప్రయోగం పరిమితంగానే ఉంది. శ్రీ వేదాంతదేశికులు తమ *పాదుకా సహస్ర- యాదవాభ్యుదయ* కావ్యాలలో చూపిన ఏతాదృశ చిత్ర కవితారీతులను చూస్తే ఈ ప్రక్రియలో వీరిముందు ఆ కవులిద్దరూ నిలువజాలరనే భావం సంస్కృత సాహిత్యంతో ఏ మాత్రం పరిచయం ఉన్నవారికైనా కలుగక మానదు. శ్రీ రాఘవాచార్యులుగారి సుబోధినీ వ్యాఖ్యతో వెలువడుతున్న నాల్గు సర్గల (5-6) ద్వితీయ భాగంలోని ఆరవ సర్గ ఈ విధమైన అనేక శబ్దాలంకార-చిత్రబంధాదులతో నిండి ఉన్నది. ఈ శ్లోకాన్ని స్పష్టంగా వ్యాఖ్యానించడం అనేది పండితైక సాధ్యం.

శ్రీ రాఘవాచార్యులుగారు తమదైన ఒక వ్యాఖ్యానశైలిని ఏర్పరచుకొన్నట్లు కనబడుతుంది. ప్రతీ శ్లోకంలోను- ప్రతి పదార్థం, వ్యాకరణ విశేషాలు, అలంకారాలు, వృత్త లక్షణాలు, వ్యుత్పత్తులు, తాము చెప్పిన అర్థాలకు ప్రమాణంగా నిఘంటువుల నుండి వాక్యాలు, అక్కడక్కడ కనబడే ఇతరుల రచనలతో పోలికలు, ప్రసంగ వశంచేత ఇతర వ్యాఖ్యాతల అభిప్రాయాలు ఇవన్నీ విశదీకరించడము, మహాదార్శనికుల రచనలలో సహజంగా, అప్రయత్నంగా ప్రవేశించే కొన్ని సాంప్రదాయిక-దార్శనిక విషయాల స్పష్టీకరణము- ఇది వీరి వ్యాఖ్యాన పద్ధతి. ఏ శ్లోకం తీసికొన్నా దాని వ్యాఖ్యానంలో ఈ పద్ధతిని చూడవచ్చు. ఇది అతి ప్రశస్తమైన ప్రాచీన సంస్కృత వ్యాఖ్యా పద్ధతి.

శ్రీ రాఘవాచార్యులుగారు రచించిన ఈ సుబోధినీవ్యాఖ్యతో, నాలుగైదు సర్గలు చదివి, మననం చేసే శ్రద్ధాళువులకు సంస్కృత భాషా సాహిత్యాలు, కావ్యసౌందర్యాస్వాద విధానము కూడ వశంవద మవుతాయని నా దృఢవిశ్వాసం. ఇట్టి అత్యుత్తమమైన వ్యాఖ్యలను అందజేస్తున్న శ్రీ రాఘవాచార్యులవారికి ఆంధ్రదేశంలోని సంస్కృత ప్రియలోకం సర్వథా సర్వదా ఋణపడి ఉంటుంది. ఇదే రీతిలో కావ్యానికంతకీ వ్యాఖ్యానం రచించే శక్తిని శ్రీ వేంకటరాఘవునకు ప్రసాదించవలెనని శ్రీవేంకటనాథుని ప్రార్థిస్తున్నాను.

"యాదవాభ్యుదయ మహాకావ్యం" ద్వితీయ భాగం పీఠిక నుంచి

ప్రస్తుతి

చ. వేం. శేషాచార్యులు
చరవాణి: 9849 254 282

యాదవాభ్యుదయం 24 సర్గల మహాకావ్యం. శ్రీకృష్ణచరితం ఇందులోని ఇతివృత్తం. ఈ మహాకావ్యం రచించినవారు శ్రీమద్వేదాంత దేశికులుగా ప్రసిద్ధులైన శ్రీవేంకటనాథులు. 'కవితార్కిక సింహ' 'సర్వతంత్ర స్వతంత్ర' ఇత్యాది బిరుదాంకితులు. 102 సంవత్సరముల పరిపూర్ణ పురుషాయుష కాలము జీవించినవారు. దానికి దీటుగా న్యాయ, వేదాంత, సాహిత్య గ్రంథములు 120కి పైబడి రచించిన ప్రతిభాసంపన్నులు. సంస్కృత, ప్రాకృత, ద్రావిడభాషాకోవిదులు. కావ్య, నాటక, చంపూ ప్రబంధాది వివిధ సాహిత్య ప్రక్రియల్లో నిష్ణాతులు. 'పాదుకాసహస్ర' మనే పేరుతో శ్రీరంగనాథ పాదుకా వైభవాన్ని, 'దయాశతకం' అనే పేరుతో శ్రీవేంకటేశ్వరుని (అంజనాద్రీశ్వరుని) కరుణనూ విలక్షణ కావ్యరూపంలో ఆవిష్కరించినవారు. 700 సంవత్సరాల తర్వాత కూడా నేటికీ వీరి కృతులు అజరామరాలై పండితలోక ప్రశంసలను అందుకొంటూ ఉన్నవి.

యాదవాభ్యుదయానికి వ్యాఖ్య రచించినవారూ ఉద్దండ కవి పండితులే. వీరు శైవసంప్రదాయ ప్రవర్తకులై, అద్వైత వేదాంత గ్రంథరచనలు చేసి అపర శంకరాచార్యులుగా ప్రసిద్ధులైన శ్రీ అప్పయ్య దీక్షితులవారు. బహుముఖపాండితీ పండితులు. దేశికుల వారికి దాదాపు 300 సం॥ల తరువాతివారు. వీరి కువలయానందం, చిత్రమీమాంస అనే అలంకార గ్రంథాలతో పరిచయంలేని సంస్కృత పండితుడు ఉండడంటే అతిశయోక్తి కాదు. వీరూ శతాధిక గ్రంథకర్తలే. యాదవాభ్యుదయ కావ్యం వీరి దృష్టిని ఆకర్షించింది. ఆయన స్వయం ప్రేరితులై యాదవాభ్యుదయానికి సంస్కృత వ్యాఖ్య రచించారు.

ఇపుడీ మహాకావ్యానికి తెలుగులో సుబోధినీ వ్యాఖ్య రచించి, దాని మూడవ సంపుటాన్ని (9-13 సర్గలు) సిద్ధం చేసిన శ్రీమాన్ కారంచేటి వేంకట రాఘవాచార్యుల వారు పరిచయంతో పనిలేని పండితులు. వీరు ఇప్పటివరకు 24 సంస్కృత, తమిళ సంప్రదాయ గ్రంథాలకు వ్యాఖ్యారచన చేసినవారు. తమ 87వ ఏట ముదిమి పైబడినా పట్టుదలతో ఈ మహాకార్యాన్ని భుజాలకెత్తుకొని నిర్వర్తిస్తున్నారు. మాఘకవి కీర్తించినట్లు వీరు 'మహారంభాః కృతధియః తిష్ఠంతి చ నిరాకులాః', అనే సూక్తికి ఉదాహరణంగా నిలుస్తారు.

కవిహృదయాన్ని సుస్పష్టంగా ఆవిష్కరించటం (9-32), దుర్బోధ పదాలకు సప్రమాణంగా అర్థం వివరించటం (9-41), ఆయా సందర్భాల్లో అవసరమైనంత మేరకు విశేషాంతాలు ప్రస్తావించటం (9-90, 10-102, 13-18) వీరి సుబోధినీ వ్యాఖ్యను సార్థకం చేస్తున్నాయి. పాఠకులకు సువిదితాలైన పదాల్నే పనికట్టుకొని వివరించటం, క్లిష్టాన్వయం ఉన్న సందర్భాల్లో 'సుస్పష్ట' మంటూ దాటవెయ్యటం వంటి కువ్యాఖ్యా లక్షణాలు లేశమాత్రంగానైనా లేనిది ఈ సుబోధినీ వ్యాఖ్య. వీరి వ్యాఖ్యల్లో పాదుకా సహస్రం, ఈ యాదవాభ్యుదయం తలమానికాలని చెప్పవచ్చు. అచిరకాలంలోనే ఈ యాదవాభ్యుదయ గ్రంథం పరిపూర్ణంగా వీరి వ్యాఖ్యానంతో వెలువడేందుకు వీరికి శ్రియఃపతి ఆయురారోగ్య సమృద్ధిని ప్రసాదించాలని ప్రార్థిస్తూ, నా కీవిధంగా వాగీశ్వర సేవకు అనుగ్రహం కలిగించిన శ్రీమాన్ రాఘవాచార్యుల వారికి కృతజ్ఞతాంజలులు సమర్పిస్తున్నాను.

"యాదవాభ్యుదయ మహాకావ్యం" తృతీయ భాగం పీఠిక నుంచి



భగవద్ధ్యాన సోపానమ్-మనోరమ

డా॥ పెన్నా మధుసూదన్

చరవాణి: 9860 529 642

భగవద్రామానుజుల దర్శనం ఆళ్వారుల సూక్తిమాధుర్యంతో కలిసి ఉదాత్తంగా, గంభీరంగా ఉంటూనే అందరికీ జీవన తత్త్వాన్ని బోధిస్తూ విలసిల్లుతుంది. అందులో అగ్రగణ్యులైన ఆచార్యులు ఎందరో ఉన్నారు. వారిలో పదమూడవ శతాబ్దిలో తమిళదేశమును పావనం కావించిన ఆచార్యవర్యులు శ్రీమద్ వేదాన్త దేశికులనే పేరుతో సుప్రసిద్ధులైన శ్రీ వేంకటనాథులు. తిరుపతి శ్రీ వేంకటేశుని సన్నిధిలోని ఘంటా రూపంగా అవతరించినారని వైష్ణవులందరూ అభిమానంగా స్మరించుకుంటారు. ఆయన శతాధిక గ్రంథకర్త. శ్రీ వేదాన్త దేశికులు సంస్కృతంలో రచించిన 12 శ్లోకాలు గల లఘుగ్రంథమే **భగవత్ధ్యాన సోపానము.** దీనికి మూలం తిరుప్పాణ్ ఆళ్వార్లు తమిళంలో గానం చేసిన **ప్రబంధరత్నం**. తిరుప్పాణ్ ఆళ్వారులను ప్రేమగా మునివాహనులు అని పిలుచుకుంటారు.

శ్రీమాన్ కె.వి.రాఘవాచార్యులవారు ఈ **భగవద్ధ్యాన సోపానమనే** గ్రంథానికి వెలయించిన **'మనోరమ'** వ్యాఖ్యానం నిజానికి ఒక ఆదర్శమైన వ్యాఖ్యానం ఎలా ఉండాలో చూపించే గ్రంథం. సంప్రదాయం చక్కగా తెలిసి అనేక గ్రంథాల సారాన్ని బుద్ధిలో నిక్షిప్తం చేసుకొన్నవారే ఇలాంటి సారవద్గ్రంథాలకు ప్రామాణికమైన వ్యాఖ్యలను వెలువరించగలుగుతారనడానికి ఈ మనోరమ వ్యాఖ్యానం స్పష్టతార్కాణం. ఇంతటి లఘు గ్రంథానికి ఇంత విపులమైన వ్యాఖ్యను రచించడం అవసరమా? అని భావించరాదు. ఎందుకంటే, తిరువడి (పాదములు) నుండి తిరుముడి (కేశములు, తల) వరకు శ్రీరంగనాథుని సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ తిరుప్పాణాళ్వారులు గానం చేసిన పదిపాశురములు ఎంత గొప్పవంటే, నాలుగువేల పాశురాలుగల నాలయిర దివ్య ప్రబంధంలో ఇవి చోటు సంపాదించుకున్నాయి.

ఇతిహాసాన్ని ఈ సందర్భంగా స్మరించుకోవడం అవసరం. తమిళదేశంలో పానార్ వర్గానికి చెందిన దంపతులకు పంటపొలంలో ఒక బాలుడు లభించాడు. అది క్రీ.శ. 8-9వ శతాబ్దకాలం. ఆ బాలునికి వారు సాత్త్వికమైన ఆహారాన్నే ఇచ్చి పెద్ద చేశారట. ఆ వర్గంవారు మధురంగా పాటలుపాడే వృత్తికి చెందినవారు. ఈ బాలుడు ఒక వీణపై మధురమైన పెరుమాళ్ గీతాలను పాడుతూ తిరుగుతుంటే అక్కడి ప్రజలు ఆ బాలుడిని 'వీణ పెరుమాళ్' అని పిలుచుకునేవారట.

పానార్ పెరుమాళ్ అనే ఈ బాలుడు శ్రీరంగంలోని శ్రీరంగనాథుని దేవాలయం దగ్గరలో నిలుచుండి గానంలో మునిగిపోయేవాడట. ఒకనాడు ఆ దేవాలయానికి వచ్చిన లోకసారంగుడనే సాధువు కావేరీనదికి వెళ్తూ దారిలో తన గానమాధుర్యంతో లోకాన్ని మరచిన పానార్‌ని చూసి ప్రక్కకు తప్పుకోమని అడిగాడట. కాని, భగవద్ధ్యానంలో ఒడలు మరచిన ఆ పానార్‌కి ఇదేదీ వినబడలేదు. అప్పుడు లోకసారంగుడు ఒక

చిన్నరాతి ముక్కను విసరగా అది పానార్ నుదుటికి తగిలి రక్తం స్రవించింది. దానితో బాహ్యస్పృహలోకి వచ్చిన పానార్ నిశ్శబ్దంగా అక్కడి నుండి తప్పుకున్నాడట.

లోకసారంగుడు దేవాలయంలోకి వెళ్ళి చూడగా పెరుమాళ్‌మూర్తికి కూడ నుదుటి భాగంలో గాయమై రక్తం స్రవించుచుండడం కనిపించినది. ఆ రాత్రి పెరుమాళ్ లోకసారంగునికి కలలో దర్శనమిచ్చి ఆ పానార్‌ని భుజాలపై మోసుకుని గుడిలోకి తీసుకురమ్మని ఆదేశించినారట.

మరునాడు పానార్‌ని కలిసి ఈ విషయం తెలుపగా, పానార్ తాను తక్కువ కులానికి చెందినవాడు కనుక గుడిలోకి రాలేనని చెప్పాడట. అప్పుడు లోకసారంగుడనే ఆ ముని పానార్‌ని తన భుజాలపై కూర్చోబెట్టుకొని మందిరంలోకి తీసుకెళ్ళగా శ్రీరంగనాథుని నిరతిశయ సౌందర్యాన్ని పానార్ పదిపాశురాలలో గానం చేశాడట. అవే **'అమలనాదిపిరాన్'** అని పేరు గాంచాయి.

శ్రీరంగనాథుని సౌందర్యాన్ని ఆపాద-మస్తకం మనోహరంగా వర్ణించేవి ఈ పాశురాలు. భాగవతంలో శ్రీశుకులు (2-1-13) భగవంతుని పాదాలు మొదలుకొని ధ్యానించాలని బోధించారు కదా! ఆ తరువాతి కాలంలో 13-14 శతాబ్ద సమయంలో అవతరించిన శ్రీ వేదాన్త దేశికులు ఈ పది పాశురాల గాంభీర్యానికి ఎంతగా పరవశించి పోయారంటే ఆ పది పాశురాల సారాన్ని వ్యాఖ్యానిస్తూ ఆయన మొత్తం మూడు గ్రంథాలను రచించారు. మణిప్రవాళ భాషలో **మునివాహన భోగం-** అనే వ్యాఖ్యానాన్ని, **ప్రబంధసారంలో** తిరుప్పానార్ గొప్పదనాన్ని వర్ణిస్తూ నాలుగు శ్లోకాలను, అలాగే సంస్కృతంలో ఆ పాశురాల ఆధారంగా **'శ్రీ భగవత్ ధ్యాన సోపాన'** మనే స్తోత్రాన్ని ఆయన రచించడంవల్ల ఆ పాశురాలెంత గొప్పవో తెలుసుకోవచ్చు.

"శ్రీ తిరుప్పానార్ ఆచార్యులు ప్రతిక్షణం ప్రతివస్తువులో పెరుమాళ్ళను దర్శించుకున్న కృతార్థులు. తమ అనుభవామృతాన్ని పదిపాశురాల రూపంలో మనకందించిన మహానుభావులు. ఈ పాశురాలను నిత్యం అనుసంధానం చేసుకోవడంవల్ల మనం సర్వరక్షకుడు, లోకనాయకుడు, సర్వకారణమూ అయిన పెరుమాళ్ళ స్వరూపాన్ని గ్రహించి ఆయన పాదాలను ఆశ్రయించగలుగుతాం. మునివాహన వైకుంఠంలో ముక్తజీవులనుభవించు ఆనందంతో సమానమైనది" అని శ్రీ వేదాన్త దేశికులు కీర్తించారు.

శ్రీ వేదాన్త దేశికులు రచించిన **భగవద్ధ్యాన సోపానమనే** స్తోత్రం పన్నెండు శ్లోకాలు మాత్రమే గలది. నిత్యం అనుసంధానం చేసుకోవడానికి అనువైనది. కాని, ఆ స్తోత్రంలోని అంతరార్థాన్ని సరళంగా సమర్థులైన ఆచార్యులు తెలియజేయకపోతే దాని మహత్తు మనకు తెలియదు. కనుక శ్రీమాన్ రాఘవాచార్యులవారు **'మనోరమ'** వ్యాఖ్య ద్వారా మనకు ఆ స్తోత్ర మాహాత్మ్యంతో బాటు శ్రీ వైష్ణవ సంప్రదాయ రహస్యాలనూ తెలియజేశారు.

భగవంతుని వర్ణించేటప్పుడు పాదాలతో ప్రారంభించి (తిరువడితో) శిరస్సుతో (తిరుముడితో) ముగించడం సంప్రదాయం. దానిననుసరిస్తూ శ్రీ వేదాన్తదేశికులు ఈ స్తోత్రాన్ని రచించారు.

మొదటి శ్లోకంలో ధ్యేయవస్తువు నిర్దేశింపబడింది. శ్రీమన్నారాయణుడు యోగుల ఎదలోని జ్యోతి, భక్తులకంటికి అంజనం, చింతామణి, కష్టాలను తీర్చువాడు, దేవదేవుడు, అన్ని వేదాలకు దివ్యమైన చక్షువు ఆ శ్రీమన్నారాయణుడే శ్రీరంగంలో సాక్షాత్తు దర్శనమిస్తున్నాడు అని ఈ శ్లోకంలో వేదాన్త దేశికులు వర్ణించారు.

శ్రీమాన్ రాఘవాచార్యుల వాణి ఈ శ్లోక గాంభీర్యానికి పరవశించి నర్తించినదా అన్నట్లు ఈ శ్లోక వ్యాఖ్యానంలో నమ్మాళ్వారుల నుండి భగవద్రామానుజులు, శ్రీ పరాశర భట్టరు, వకుళాభరణులు మొదలైన పూర్వసూరుల వాక్యాలను ఉదాహరిస్తూ, రామాయణ, పురాణాది గ్రంథాల ప్రమాణాలను ఉటంకిస్తూ నడిచింది మనోరమ వ్యాఖ్యానం. ధ్యానమంటే ఏదో ప్రొద్దున, సాయంత్రం కళ్ళుమూసుకొని కూర్చోవడం కాదు, నిరంతరం భగవంతుని హృదయంలో నిలుపుకోవడమే నిజమైన ధ్యానమని వివరిస్తూ అదే జీవాత్మ స్వరూపమని నమ్మాళ్వారులు బోధించిన విషయాన్ని ఆచార్యులు మన దృష్టికి తీసుకువస్తారు. ఈ శ్లోకంలోని ప్రతిపదం ఎంత గంభీరమైన అర్థాన్ని బోధిస్తుందో తెలుపడానికి ఆచార్యులు ఎన్నో ప్రమాణాలు చూపారు. దీనివల్ల స్తోత్రంలోని ప్రతిపదమూ సంప్రదాయ ప్రమాణంతో మనకు అవగతమవుతుంది.

అర్చామూర్తి గొప్పదనాన్ని వివరిస్తూ ఆచార్యులు, "పాలు ఆవు శరీరమంతా వ్యాపించి ఉన్నా పొదుగు నుంచే వచ్చినట్లు, పరమాత్ముని శక్తి అంతటా ఉన్నా అర్చామూర్తి నుండి వ్యక్తమవుతుంది" అని తెలియజేయడం సందర్భానికి తగినట్లుగా ఉండి శ్లోకభావాన్ని హృదయంలో నిలుపుతుంది. 'సిద్ధి మోక్షానురూప' మనే శబ్దాన్ని వ్యాఖ్యానిస్తూ అదే పరమాత్ముని అర్చారూపమని ఆచార్యులు తెలియజేయడం అలాగే, శ్రీరంగక్షేత్రానికి చెందిన ఎన్నో ప్రమాణాలను చూపిస్తూ శ్రీమన్నారాయణుడు బ్రహ్మకు ఇచ్చిన రంగమనే విమానం, అయోధ్యకు చేరి అక్కడి నుండి శేషపీఠానికి చేరిందని వివరించడం కుతూహలాన్ని కలిగిస్తుంది.

రెండవ శ్లోకంలో శ్రీదేశికులు శ్రీరంగనాథుని పాదాలను వర్ణించారు. శఠకోపులనబడే నమ్మాళ్వార్లే ఈ భగవత్పాదులు–అని దేశికులు గోదాస్తుతి, పాదుకా సహస్రం వంటి ఇతర రచనలలో వర్ణించినది శ్రీమాన్ రాఘవాచార్యులు సందర్భోచితంగా ఇక్కడ స్మరింపజేస్తారు. 'వేలాతీత శ్రుతిపరిమళం' అన్నదాన్ని వ్యాఖ్యానిస్తూ వేలాతీత శ్రుతి అన్నది ద్రావిడ వేదానికి వర్తిస్తుందనడం గొప్ప భావన.

మూడవ శ్లోకం శ్రీరంగనాథుని పిక్కలను వర్ణిస్తుంది. ఇందులోని విరోధాభాసాన్ని మనోరమ వ్యాఖ్యానంలో తెలుసుకోవచ్చును.

నాల్గవ శ్లోకంలో ఊరు వర్ణన ఉంది. శ్రీ వైకుంఠగద్యంలో భగవద్రామానుజులు 'అచింత్య దివ్యాద్భుత నిత్యయౌవన స్వభావ లావణ్యామృత సాగర'మని వర్ణించిన పెరుమాళ్ళ సౌందర్యాన్ని శ్రీ రాఘవాచార్యులవారు తమ వ్యాఖ్యానంలో విపులంగా వివరించారు.

నాభి సౌందర్యాన్ని వర్ణించేది ఐదవ శోక్లం. ఈ శ్లోకాన్ని దేశికులు క్రియాపదంతో మొదలు పెట్టారు–'సంప్రీణాతి' (ఆనందింపజేస్తుంది) అని. శ్రీ రాఘవాచార్యులు దీనిలోని స్వారస్యాన్ని వివరిస్తూ **'దృష్ట్వాసీతా'** అని రామాయణంలో వాల్మీకి మహర్షి వర్ణించినప్పుడు సీత కనబడడంలోని ఆనందాతిశయం క్రియాపదంతో

మొదలుపెట్టడంతో వ్యక్తమైనట్లే, ఇక్కడ **సంప్రీణాతి** అని మొదలుపెట్టడంలో ఆనందానికి ప్రాధాన్యం ఎంత ఉందో వ్యక్తమవుతుందని ఇది ధ్వన్యర్థంగా తెల్పినారు.

శ్రీరంగనాథుని వక్షఃస్థలాన్ని ఆరవ శ్లోకం వర్ణిస్తుంది. ఈ వక్షఃస్థలంపైన కదా కౌస్తుభమణి, శ్రీవత్సము ఉంటాయి. ఇందులోనే లక్ష్మీదేవి "తద్వక్షఃస్థల నిత్యవాసరసికా" అన్నట్లు నిత్యమూ అనపాయినిగా ఉంటుంది. శ్రీ రాఘవాచార్యులవారు దీనిని వివరిస్తూ– "భగవంతుని వక్షఃస్థలాన్ని భక్తితో భావిస్తే 'చిత్–అచిత్–ఈశ్వర' అనే మూడు తత్త్వాలనూ ధ్యానించినట్లవుతుంది" అని చెప్పడం హృదయంగమం. ఎందుకంటే, చిత్–అచిత్ అనే రెండు తత్త్వాలను తనయందుంచుకొనిన పురుషోత్తముడైన శ్రీమన్నారాయణుని ధ్యానం చేయాలంటే, వక్షఃస్థలాన్ని ధ్యానించడం ప్రధానమన్న ఆశయం గొప్పది.

పరమాత్ముని బాహువులను వర్ణించే ఏడవ శ్లోకం చిత్రమైనది. ఆ బాహువుల నీడివి భక్తులకు, ప్రపన్నులకు 'ఇక చాలు' అనేంతవరకు పురుషార్థాలను ప్రసాదిస్తుందన్న తిరుమంగైయాళ్వారు మాట మనోరమ వ్యాఖ్యను సార్థకం చేసింది. రూపకాలంకార సౌందర్యాన్ని ఇక్కడ గమనించవచ్చు. ఈ శ్లోకంలోని అందాన్ని ఆచార్యులవారు సరళంగా వ్యాఖ్యానించారు.

ఎనిమిదవ శ్లోకంలో శ్రీరంగేశుని ముఖారవింద వర్ణనముంది. "అప్పుడే వికసించిన తామరపువ్వులా చిరునవ్వుతో చిందులాడుతుంది" అని ఆయన వివరించారు శ్రీరంగనాథుని వదనాన్ని. అంతేకాదు, పరమాత్మ మందస్మితం ఎక్కడెక్కడ ఎవరెవరిని మోహితులను చేసిందో తలచుకొని ఆయన తన వ్యాఖ్యానంలో భగవద్గీతలోని ప్రసంగంతోబాటు, ఆళ్వారుల సూక్తిసుధను ఉదాహరించారు.

శ్రీరంగనాథుని కిరీటాన్ని వర్ణించేది తొమ్మిదవ శ్లోకం. ఇందులో వేదాన్త దేశికులు **"రాజన్వత్యః స్థితి మధిగతా వృత్తయశ్చేత సోమే"** అని వర్ణించారు. అంటే పరమాత్మ కిరీటాన్ని సేవించిన నా చిత్తవృత్తులు రాజాధీనములై నిశ్చలంగా నిలిచిపోయాయని అర్థం. ఈ శ్లోకంలో కిరీటవర్ణన ఉన్నదని చెప్పి ఉంటే వ్యాఖ్యానం సాధారణ వ్యాఖ్యానంలా ఉండిపోయేది. కాని శ్రీ రాఘవాచార్యులు "ఈ శ్లోకంలో ధ్యానయోగం శిఖరాగ్రాన్ని చేరింది" అని వివరించడం గమనించాలి. ధ్యానయోగం శిఖరాగ్రాన్ని చేరడం అంటే పరమాత్మ కిరీటం పైన మనస్సు నిలుపడమే. సర్వరక్షకుడైన శ్రీరంగనాథుని చేరిన చిత్తవృత్తులకు ఇక ఇంతకంటే క్షేమ మెక్కడుంటుంది? అన్న ధ్వన్యర్థాన్ని మనమిక్కడ గమనించవలెను.

అన్ని శ్లోకాలలో వర్ణించిన దాని సముదాయంగా రచించినది పదవ శ్లోకం. ఇందులో శ్రీ దేశికులు తమ బుద్ధి ఏ విధంగా పరమాత్మ యొక్క ఆయా అవయవాల సౌందర్యాన్ని గ్రోలుతూ ఆనంద పరాకాష్ఠను చేరిందో వర్ణించారు. ఈ విషయాన్ని వివరిస్తూ శ్రీ రాఘవాచార్యులవారు 'ధ్యానాత్మికయైన (దేశికుల) బుద్ధి నాయిక' అని స్పష్టం చేయడం శ్లోకార్థాన్ని ఇంకొంత రసవత్తరంగా హృదయంలో నిలుపుకోవడానికి తోడ్పడినట్లయింది.

శ్రీ వేదాన్తదేశికుల బుద్ధి అనెడు నాయిక పరమాత్మ పాదాలను మొదట ఆదరంగా తాకి, తరువాత పిక్కలను సేవించి, తరువాత చొరవతో ఊరువులను తగిలి, ఎదను చేరి బాహువులను వలగొని ముఖవర్చస్సును చూరగొని కిరీట పరిమళాన్ని మూర్కొని పరవశించింది అని శ్లోక భావం. ఈ శ్లోకం తానుగా ఉత్తమ కావ్యానికి ఉదాహరణం కాగా శ్రీ రాఘవాచార్యుల వారు దీనిని సరళంగా సప్రమాణంగా వివరించడం మరొక విశేషం. శ్రీ దేశికుల 'మనీష' అనే నాయిక పరమాత్మ యొక్క 'వక్త్రాభిఖ్యాం పిబతి' (ముఖకాంతిని త్రాగుచున్నది) అని వర్ణించడంలోని స్వారస్యం చక్కగా వివరించబడింది.

ధ్రువమూర్తియైన పరమాత్మ శ్రీరంగక్షేత్రంలో ఉత్సవమూర్తిగా ఎలా విరాజిల్లుతున్నాడో వర్ణించేది పదకొండవ శ్లోకం. చతుర్భుజుడైన శ్రీమన్నారాయణుడు శ్రీరంగక్షేత్రంలో శ్రీరంగనాథుడుగా విలసిల్లుతూనే నా హృదయంలోనూ తన దేవరులతో విరాజిల్లుతున్నాడని ఇందులో శ్రీదేశికులు వర్ణించారు. శ్రీమాన్ రాఘవాచార్యులు ఇందులోని స్వారస్యాన్ని గ్రహించి, ఆళ్వారులు చతుర్భుజమూర్తిని దర్శించి ఒడలు పులకరించగా ఎలా గానం చేశారో ఆయా ఉదాహరణాలతో చక్కగా వివరించారు. "సకృదేవ ప్రపన్నాయ" అని చెప్పినట్లుగా ఒక్కమారైనా ప్రపన్నులైనవారిని "భయపడకండి నేను మిమ్ములను రక్షిస్తాన"ని అభయం ప్రసాదించే ఆ దయామూర్తి స్వరూప వైభవాన్ని శ్రీ ఆచార్యులవారు మనోరమా వ్యాఖ్యానంలో వివరించడం సహృదయ-హృదయ- రంజకం.

శ్రీవేదాన్తదేశికులు ఈ విధంగా పెరుమాళ్ళను వర్ణించడం వెనుక పెరియాళ్వారు ప్రభావం ఎలా ఉందో కూడా ఇక్కడ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పూర్వాపర సందర్భాలను సమన్వయిస్తూ, మొదటి శ్లోకంలో 'అంతర్జ్యోతిః కిమపి యమినాం" అని పరమాత్మనే స్మరించిన వేదాన్తదేశికులు ఆ మూర్తి శ్రీరంగ క్షేత్రంలో కానవస్తుందని చెప్పి ఈ పదకొండవ శ్లోకం వరకు ఆ దివ్యమూర్తిని ధ్యానించి చివరకు "మధ్యేరంగం మమ చ హృదయే వర్తతే సావరోధః" అని ధ్యానపరాకాష్ఠను పొంది ఆ శ్రీరంగరూపి పరమాత్మ శ్రీరంగంలో నా హృదయంలోనూ ఉంటున్నదని వర్ణించడంలోని ఔచిత్యాన్ని శ్రీ రాఘవాచార్యులవారు మనోజ్ఞంగా వివరించారు.

సంస్కృత శబ్దమైన 'కవికేసరి' అనే బిరుదం 'ఈ కవికే సరి' అని తెలుగులో చమత్కరించడంతో శ్రీమాన్ రాఘవాచార్యులవారు వ్యాఖ్యాతృ శిరోమణి, పండితరత్న, వాచస్పతి, సర్వశాస్త్ర మార్తాండ అనే బిరుదులకే ఎలా సొగసు తెచ్చారో తెలుస్తుంది.

"భగవత్ ధ్యాన సోపాన"మనే పేరుకు తగ్గట్టు భగవంతుని ధ్యానించడంలోని సోపాన పరంపరను క్రమంగా వర్ణించి ధ్యేయాన్ని పొందడంతో అది ఎలా పరిపక్వమైనదో ఇక్కడ స్పష్టమవుతుంది. ఇది చదివి తెలుసుకోదగినది కాక గురుముఖతః వినవలసినదని అనిపిస్తుంది.

పన్నెండవ శ్లోకం ఫలశ్రుతి. ఈ శ్లోకాన్ని వ్యాఖ్యానిస్తూ ఆచార్యులు ఫలశ్రుతిలోని నాలుగు అంశాలు దీనిలో ఎలా ఇమిడాయో చక్కగా బోధపరిచారు.

1) విషయ వైలక్షణ్యం, 2) వక్తృవైలక్షణ్యం, 3) ప్రబంధ వైలక్షణ్యం, 4) ఫల స్వరూపం అనే నాలుగు ఫలశ్రుతిలోని అంశాలు.

శ్రీరంగనాథుని సకలావయవ సౌందర్యవర్ణన- విషయ వైలక్షణ్యం. ఆచార్య సేవలో తరించి స్తోత్రం చేసిన శ్రీవేదాన్త దేశికులు- వక్తృ వైలక్షణ్యం. పాలకడలిని చిలికి అమృతాన్ని కలశంలో నింపుకున్నట్లు పరమాత్మను ఎదలో నిలుపుకుంటానని విష్ణుచిత్తులు చెప్పినట్లు, ఈ స్తోత్రంలో భగవంతుని సర్వావయ సౌందర్యాన్ని శ్రీదేశికులు తనివితీరా వర్ణించడం- ప్రబంధ వైశిష్ట్యం.

యోగుల స్థితిని అనాయాసంగా పొందగోరేవారికి ఈ స్తోత్రం స్థిరమైన భక్తిని ప్రసాదించు గాక! అనడం- ఫలవైశిష్ట్యం. ఇలా స్తోత్రం సమగ్రతను శ్రీ రాఘవాచార్యులవారు ఎంతో ప్రామాణికంగా హృదయంగమంగా మనోరమా వ్యాఖ్యానంలో వివరించారు. ఈ చివరి శ్లోకంలో 'దిశతు' అనే క్రియాపదంలోని లోట్‌లకారం విధ్యర్థంలో గ్రహించాలని చెప్పి దీనిద్వారా ఆచార్య మంగళాశాసనం పురుషకారం కూడ సూచితమైనదని వివరించడం ఆచార్యుల సునిశిత ప్రజ్ఞను సూచిస్తుంది.

ఆంధ్ర టీకా తాత్పర్యాలతో శ్రీమాన్ కె.వి.రాఘవాచార్యులవారు వేదాన్త దేశికుల భగవద్ధ్యాన సోపాన స్తోత్రానికి వెలయించిన మనోరమావ్యాఖ్యానం వారి ఉభయవేదాంత వైదుష్యానికి అద్దం పడుతుంది. ఆళ్వారుల మధురవాక్కులతో బాటు, రామాయణ భాగవతాది వాక్యాలను ప్రమాణంగా చూపుతూ రచించడం వల్ల వ్యాఖ్యానం ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఇలా సర్వంకష పాండిత్యం లేకపోతే, పన్నెండు శ్లోకాల స్తోత్రానికి ఏ పదిపుటలలోనో వ్యాఖ్యానాన్ని రచించి ముద్రించేవారేమో! కాని, ఆచార్యనిష్ఠ, భగవత్ప్రపత్తి నిండుగా నెలకొన్న హృదయంతో ఈ స్తోత్రాన్ని అనుసంధానం చేసుకోవడంవల్ల శ్రీమాన్ రాఘవాచార్యులవారు ఎంతో విలువైన వ్యాఖ్యానాన్ని మనకు అందజేశారు. అందుకు సంప్రదాయనిష్ఠ కలిగిన జిజ్ఞాసువులు ఆయనకు ఋణపడి ఉంటారు- అనడంలో అతిశయోక్తి లేదు.

గోదాస్తుతి పరిమళ వైభవము

సంపన్ముదుంబై వరదాచార్యః

చరవాణి: 9949 985 320

శ్రీమాన్ రాఘవాచార్యులవారు వ్యాఖ్యానించిన గ్రంథం **'గోదాస్తుతిః'**. దీని కర్త శతాధిక గ్రంథకర్తలు, కవితార్కిక సింహులు, కళ్యాణ గుణ పరిపూర్ణులైన వెంకటనాథార్యులు. దీనికి పరిమళ వ్యాఖ్యాత శ్రీమాన్ కె.వి.రాఘవా చార్యులుగారున్ను వ్యాఖ్యాన చక్రవర్తులే. అనేక శాస్త్ర భగద్విషయాది సేవను చేసిన వీరి వ్యాఖ్య సామాన్యులకు సులభగ్రాహ్యమై యున్నది. వీరి ఈ వ్యాఖ్యయందు తమ బహుముఖీన ప్రజ్ఞాపాటవాలు ప్రదర్శిస్తూనే ఇందలి సౌలభ్యాన్ని, లాలిత్యాన్ని తమ వ్యాఖ్యానంలో పొదిగినారు.

వేదాంత దేశికులు (వేంకటనాథులు) ఈ "గోదాస్తుతి"ని విష్ణు కులనందన (శ్రీమన్నారాయణునే చిత్తమందుంచుకొని నామ ధ్యానంతో కాలం గడిపే పెరియాళ్వారుల కుమార్తె ఆండాళు లేదా గోద అని ప్రారంభింపబడి "విష్ణు చిత్తాత్మజాతః" (పైన తెలిపిన అర్థమే) అని ముగించడం (శ్రీమన్నారాయణుని పరమ భక్తులు, మామగారు ఐనట్టి వారి కుమార్తె గోద పేరుతో ప్రారంభించి మళ్ళీ ఏవంవిధ నామంతో పూర్తి చేయడం) ఈ స్తుతి మంగళమయం కావాలని కోరుకోవడమే. ఆది మధ్యాంతాల్లో భగవంతుని యొక్క భగవద్భక్తుల యొక్క నామస్మరణమున కావ్యం మహోత్కృష్టంగా పరిగణింపబడుతుంది.

తెలుగునందు కొన్ని కావ్యాలు 'మంగళ మహాశ్రీ' అని మంగళ మహా శ్రీవృత్తంతో ప్రారంభించి చివరి పద్యం చివరి పదం మంగళ మహాశ్రీ పదంతో ఇదే వృత్తంలో పూర్తి చేయటంలోగల ఉద్దేశమిదే!

శ్రీమాన్ ఆచార్యస్వామి వారు ఏవంవిధ మహోత్కృష్ట కావ్యాన్ని సరళంగా వ్యాఖ్యానించడం మనవంటి వారి తాపనివారణకేగాక తమ జన్మను ధన్యం చేసుకోవడానికి కూడ. ఒక్క విషయం, వ్యాఖ్యానానికి అయిదు లక్షణాలుంటవని పెద్దల నిర్ణయము. ఈ లక్షణాలన్నీ మన ఆచార్యస్వామి వారివద్ద దండిగా నిండుకొని యున్నవి గనుకనే పరిమళవ్యాఖ్య సర్వవిధ భావ పరిమళాలను వెదజల్లి అస్మదాదులకు జ్ఞానప్రదాతయే, తాపత్రయ నివారకమై అధికంగా పరిమళించినది.

కావ్య గత వివరాలను తెల్పుతూ గోదావరిని నామైక దేశంగ గోద అనవచ్చని గోదాదేవి భూజాత గనుక ఆమె పుట్టిన భూమిపై ప్రవహించి పవిత్రతను పొందిందట. ఇందు "గోద=గోదావరి, ఆండాళు", ఇచట స్వామివారి వ్యాకరణ ప్రతిభా విశేషాలు గుభాళించినవి. 5వ శ్లోకమందు "ముకుంద" పద వివరణ చేస్తూ ఒక శ్లోకం ఉదాహరణ ఇచ్చినను పాఠకునకు ద్రావిడ ప్రాణాయామం కాకుండ ఉండేటట్లు, "మోక్షమిచ్చేవాడు ముకుందుడు" అని అక్షరాల, పదాల పొదుపును పాటించి సూటిగా బోధపడేట్లు తెల్పినారు. వ్యాకరణ కర్తలు సూత్ర నిర్మాణంలో ఒక్క 'లఘువు' తగ్గినను పుత్రోత్సవం చేసుకున్నంత సంతోషం పొందుతారట. ఆచార్యులవారు వ్యాకరణవేత్తలు గదా!

లోకంలో భూమ్మీద పుట్టలు మొలవడం సహజం. రచయిత ఇవి గోదాదేవికి చెవియని అందుండి పుట్టిన వాల్మీకి ఆదికవియైనాడని తెల్పినారు. దీనికి వేదం నుండి "శ్రోత్రగ్ంహ్యేతత్ పృథ్వివ్యాః యద్వల్మీకః" అని పుట్ట భూదేవికి చెవియే యను దానికి ప్రమాణం.

స్వామివారు అవకాశం దొరికిన చోటల్లా వేదపురాణ, ఇతిహాస స్తోత్రాదులనుండి అసంఖ్యాకంగ ఉదాహరణలిస్తూనే ఉంటారు. ఇక్కడ మనమర్థం చేసుకోవలసిందేమంటే వ్యాఖ్యాతకు కేవలం సాహిత్యమే కాదు ఇన్ని విధాల ప్రజ్ఞా పాటవాలు, ప్రతిభా వ్యుత్పత్తులుండాలని సూచించడమే. ఇది స్వామివారి బహుశాస్త్ర పరిజ్ఞానం. గోదా చంద్రులిర్వురు భూజాతలే. అందుకే వీరు తోబుట్టువులు. ఇద్దరు అమృతాన్ని వర్షించేవారే, తాపాన్ని ఉపశమింపజేసేవారే మనోజ్ఞమూర్తులే అని సమతుల్య గుణాలను నాల్గు మాటల్లో శ్లోకమందలి అంతర్గత భావాన్ని సులభతరం చేసి తెల్పడం పాఠకుల్ని దృష్టియందుంచుకొని చేసిందే. ఇందు స్వామివారి లోకజ్ఞత తెలుస్తున్నది.

లోకంలో నీరు సహజాద్భుతశక్తి గలది. ఈ నీటితో తడిసి పెరిగిన ఔషధులను ఒక్కొక్క దానిని ఒక్కొక్క తిథి, వార, నక్షత్రాలందు సేకరించి చేసిన ఔషధంతో రోగి ఉపశమనం పొందుతాడు. ఋతుభేదాన్ని బట్టి గుణభేదం ఉంటుంది. ఇందు ఆచార్య స్వామివారికిగల జ్యోతిష, ఆయుర్వేద శాస్త్రాల పరస్పర సంబంధం తెల్పబడింది. పరమాత్మ వనమాల/ వైజయంతిమాల ధరిస్తాడనేది ప్రసిద్ధం. వనమాల అంటే ఎట్లా ఉంటుందో దాని నిర్మాణ పరిమాణం ఎంతో తెలియనివారే అధికం. దానికి వివరణనిస్తూ స్వామివారు ఒకే ఒక్క శ్లోక పాదంలో తెల్పుతారు. "ఆ పాదపద్మంయామాలా వనమాలేతి సామతా" డొంకతిరుగుడు సమాధానం ఆచార్యుల వారికి నచ్చదు. అందుకే ఋజుమార్గంలో "భుజాలనుండి పాదపద్మాల వరకు (పరమాత్మకు) వ్రేలాడే మాలయే వనమాల" అని తెలిపినారు. దీంతో వీరి స్వభావమెంత రుజువైందో తెలుస్తుంది. గోదమ్మకు వివాహం నిశ్చయమైంది. చెలులు ఆమెతో ఆడిన ఎకసక్కెములు పాఠకునికి సులువుగా బోధపడేటట్లు చెప్పిన తీరు లోకజ్ఞతా స్ఫూర్తిని తెలుపుతున్నది.

ఒక చెలి "గోదా! ఇంత సౌందర్యవతివి, యౌవనవతివి, నీ భర్తయే పురాణపురుషుడట, ఆ ముదుసలితో ఎట్లా వేగుతావో ఏమో నమ్మా" అనగా మరొక చెలి అమ్మా గోదా! ఇప్పటి నుండి నీకు రథతురగ గజాదులు ప్రయాణించుటకుండవమ్మా ఒకపక్షి నెక్కి తిరుగాలె. దానిమీద క్రింద పడకుండా కూర్చొని ప్రయాణమెట్లా సాగిస్తుందోనమ్మా అని అనగా ఇంకొక చెలి అంతేకాదమ్మా నీకు పడుకోడానికి తల్పముండదమ్మా పాము పడగ క్రింద దాని చుట్టపై పడుకోవాలె భయం భయంగా అని చెప్పగ, ఇంకొక నెచ్చెలి మీరింతే అనుకున్నారయేంటి, గోదా నీ భర్త ఉదయమే లేవడు ఎవరో ఒకరో, కొందరో వచ్చి లేపాలె. ఇట్లాంటి వానితో ఎట్లా గడుపుతావో ఏమో నీకే తెలియాలె అంటూ ఎకసక్కాలాడిన విషయం భాషాప్రయోగ చమత్కారం లోకరీతిని తెలుపుచున్నది మరియు వారి మాటల్లో స్వామివారి వైభవం కూడ తెల్పబడిందని తెల్పిన స్వామివారు నిజంగా వ్యాఖ్యాతృ చక్రవర్తులే, స్వామివారిచ్చిన ప్రమాణాలిక్కడ అనేకంగా ఉన్నవి.

వధూవరులు మాలలు మార్చుకోవడంలోని విశేషాన్ని తెలిపిన తీరు గమనించదగింది. సాధారణంగా లోకంలో వరుడు మాలను వధువు మెడలో వేస్తాడు. కాని గోదాయే మొదలు స్వామి మెడలో వేసింది. ఇందలి న్యూనాధికత్వాలను వివరిస్తూ అనేక ప్రమాణాలిస్తారు. సీతాకళ్యాణ ఘట్టమందును ఇదే పద్ధతి జరిగింది. జనకుడు రామునితో "పాణింగృహ్ణీష్వపాణినా" అంటాడు. ఈ పదానికి ఎందుకట్లన్నాడో 7,8 కారణాలున్నాయి. కాని ఆచార్యులవారు వేదప్రమాణాన్ని "యమేవైషవృణుతేతే నలభ్యః తస్యైష ఆత్మా వివృణుతే తనూంస్వాం" సూచిస్తారు. శ్రవణ మనన నిధి ధ్యానాదులతో ఆచార్యోపదిష్ట మంత్రాన్ని అనుష్ఠిస్తూ వాసుదేవుడే సర్వమని నమ్మిన జీవుని స్వామి అనుగ్రహిస్తాడు. గోద కూడ "నాచ్చియార్ తిరమెళి"లో 147 పాశురాలతోను స్వామిని స్తుతిస్తుంది. మొదట మన్మథుని వేడుకొని, తుమ్మెదలతో, ఆర్ద్ర పురుగులతో, మొయిలుతో, చిలుకలతో సందేశమంపి తన వేదనను తెల్పమంటుంది. స్వామితో వివాహమైనట్లు (వారణమాయిరం) కల కూడ కన్నది. అందుకే స్వామి కీమెయందనుగ్రహము కల్గి తనవారనే భావనతో పూలమాల గోదతో వేయించుకొని ఆనందించినాడు. ఈ విధంగా ఆచార్యులవారు అనేకోదాహరణలతో సమర్థించినారు.

పరమపదమందు స్వామికి కుడిప్రక్క లక్ష్మీదేవి, ఎడమప్రక్క గోదాదేవి ఎందుకుంటారని కవి తెల్పిన విషయాన్ని ఆచార్యులవారు సర్వతంత్ర స్వతంత్రుడైన స్వామికి కుడి ఎడమ చెవులు గింగురమనేట్లు భక్త రక్షణ ప్రాధాన్యాన్ని తెల్పి మనకు ముక్తి నిప్పించుటకే సుమా! అని అనేక ప్రమాణాలను చూపినారు. స్వామికి కర్తవ్యాన్ని బోధించిన దేవేరుల వాత్సల్యానికి ముగ్ధులై మురిసిపోయినారు. ఆచార్యులవారు "శతమఖమణిమాలా" శ్లోకం ధ్యాన శ్లోకంగా ప్రసిద్ధి-

ఇందు లక్ష్మికమలహస్త, గోదాకల్హారహస్త, జ్ఞానగరిమకు సూచకం, గోదస్తననత భర శరీరం జాతినారీ సౌందర్య సాముద్రికలక్షణం. అపార సింధు వాత్సల్యముండడం, ప్రతీక. విశ్వధాత్రికి నైజం అముక్తమాల్యాన్ని జలజాక్షునకిచ్చి స్వాధీనపరచుకున్నది స్వాధీనపతిక. ఈ విధంగా ఈమెను తలచిన వారికి రంగడు కొంగు బంగారమే.

ఇందలి చివరి శ్లోకం ఫలశ్రుతి. భక్తుడైన పరమైకాంతికుడు భగవత్పాదకంజ సేవ కన్న మరేదీ కోరుకోడు. కావలసింది పరమ పదప్రాప్తి దీనిని గోదాదేవి అనుగ్రహంతో శ్రియః పతిపాదకమల సేవాఫలంగా పొందుతాడు.

ఉభయ వేదాంతాల పరిమళాన్ని పులుముకొని ఉదయించిన ఈ గోదాస్తుతికి శ్రీమాన్ రాఘవాచార్య స్వామివారు వ్రాసిన పరిమళవ్యాఖ్య నిజంగానే గోద అలకలందున్న పరిమళ సమస్తాన్ని తనలో నింపుకొని పరిమళించింది. ఇంతటి సుకుమార వ్యాఖ్యను సుతారంగా సాగించి పండిత పామర మనోహ్లాదంగా విలసిల్లజేయడం ఆచార్యుల వారి మహోపకార గుణానికి తార్కాణం.

'శ్రీగుణరత్న కోశము' వైదుష్య వైభవము

నల్లంతిఘళ్ లక్ష్మీనరసింహాచార్య

చరవాణి: 9247 355 355

శ్రీ గుణరత్న కోశం, పరాశర భట్టార్యులు, శ్రీరంగనాథుని పట్టమహిషియైన శ్రీరంగనాయకిని (శ్రీదేవిని) కీర్తిస్తూ చెప్పిన 61 శ్లోకాల స్తుతికావ్యం. దీనికి కె.వి.రాఘవాచార్యులవారు **జ్యోతిష్మతి** అనే పేరుతో సమగ్రము, అత్యంత సుబోధకమైన తెలుగు వ్యాఖ్యను రచించినారు.

ఇక్కడ చాలా విచిత్రమైన విషయమొకటి కనిపిస్తుంది. ఈ స్తుతి కావ్యానికి సంస్కృత భాషలోనూ వ్యాఖ్య వ్రాసింది రాఘవాచార్యులే. కాని వారు వీర రాఘవాచార్యులవారు, వీరు వెంకట రాఘవాచార్యులవారు. వారు వ్రాసిన సంస్కృతవ్యాఖ్యానం వసురాశి, వీరి తెలుగు వ్యాఖ్యానం జ్యోతిష్మతి, వెలుగుల రాశి. వీరి తెలుగు వ్యాఖ్య, వీర రాఘవాచార్యులవారి సంస్కృత వ్యాఖ్యకు అనువాదం కాదు. అది స్వతంత్రంగా సాగింది. అందువల్లనే కాబోలు ఈ గ్రంథంలో సంస్కృత వ్యాఖ్యను చూపించినా ప్రత్యేకంగా చూపించినారు.

పరాశర భట్టరువారు శ్రీగుణరత్నకోశాన్ని భక్తులకు అనుగ్రహిస్తే మల్లెపూల సువాసనను గాలి నాలుగు దిక్కులకు వ్యాపింపచేసినట్లు శ్రీమాన్ రాఘవాచార్యులవారు శ్రీగుణరత్నకోశపు వెలుగులను అంతటా ప్రసరింపజేసినారు. శ్రీమాన్ రాఘవాచార్యుల తెలుగు వ్యాఖ్యానం, సంస్కృత భాషతో ఏ మాత్రం పరిచయం లేనివారికి కూడా సులభంగా అర్థమౌతూ ఉంది. పైగా పరమపూజ్యులైన పరాశర భట్టరువారు అనుగ్రహించిన శ్రీగుణరత్నకోశం కేవలం శ్రీదేవియొక్క స్తుతి మాత్రమే కాక, వైష్ణవ తత్త్వాన్ని కూడా బోధించే కావ్యం.

ఈ గ్రంథం పరాశర భట్టాచార్యులవారి నిత్య తనియతో ప్రారంభమౌతూ ఉంది. తమ ఆచార్యులను ముక్తక శ్లోకంతో స్తుతించే సంప్రదాయాన్ని 'తనియ' అని అంటారు. అద్వైత సిద్ధాంతమందు మిక్కిలి ప్రఖ్యాతి వహించిన మాధవసూరి యనే కర్ణాటక పండితుణ్ణి పరాశర భట్టరువారు తమ వాద పటిమచే ఓడించి, శిష్యునిగా స్వీకరించిన తరువాత వారిని పరాశర భట్టరువారు 'నంజీయర'ని (మనకు ప్రీతిపాత్రులైన సన్యాసులు) అని పిలిచినారే. తరువాతి కాలంలో వారికి నంజీయరనే పేరు ప్రసిద్ధమైంది. వారు కృప చేసిన–

శ్రీ పరాశర భట్టార్యః శ్రీరంగేశ పురోహితః।
శ్రీ వత్సాంకసుతః శ్రీమాన్ శ్రేయసే మేస్తు భూయసే॥

అనే శ్లోకానికి శ్రీ కూరేశుల కుమారులు, శ్రీరంగనాథాలయ పురోహితులు, సంపన్నులైన శ్రీ పరాశర భట్టర్ అనబడే ఆచార్యులు నాకు ఐహికాముష్మిక సుఖాన్ని చేకూర్తురు కాక అంటూ తాత్పర్యం ఇచ్చుటే కాక కూరత్తాళ్వాన్ అంటే ఎవరు వారికి పరాశర భట్టర్‌వారు ఏ విధంగా అవతరించినారు? కూరత్తాళ్వాన్‌కు శ్రీవత్సాంకులనే పేరు ఎందువల్ల కలిగింది?

పరాశరభట్టర్‌వారు శ్రీరంగేశ పురోహితు లేవిధంగా ఐనారు? శ్రీమాన్ అంటే ఎవరు? ఆర్యశబ్దానికి అర్థమేమిటి మొదలైన విషయాలనన్నిటిని పాఠకులకు సులభంగా అర్థమయ్యేటట్లు చెప్పినారు.

ఇక శ్రీగుణరత్న కోశానికి మంగళ శ్లోకం-

శ్రియై సమస్త చిదచిద్విధాన వ్యసనం హరేః।
అంగీకారాభిరాలోకైః సార్థయంత్యైకృతోంజలిః॥

కృతోంజలిః అని చెప్పినందువల్ల ఇది నమస్కార రూపమంగళా చరణము. ఇది సామాన్యుల దృష్టికి కన్పించే విషయం. కాని శ్రీమాన్ రాఘవాచార్యులవారికి ఇక్కడ కూడా రామానుజ సంప్రదాయం కనిపిస్తుంది.

వైష్ణవ సంప్రదాయంలో కేవలం నారాయణుని, కేవలం శ్రీదేవిని స్తుతించుట కూడదు. అమ్మవారితో కలిసియున్న స్వామిని, లేక స్వామితో ఉన్న అమ్మను స్తుతించుటయే తగింది. ద్వయమంత్రంలోని శ్రీమన్నారాయణ చరణౌ అనే పదం ఈ విషయాన్నే తెల్పుతుంది. పరమాత్మ గొప్పదనాన్ని తన చూపులతోనే అంగీకరిస్తున్న అమ్మకు నమస్కారమని శ్రీ మరియు నారాయణుడు ఇక్కడ చెప్పబడ్డారని అంటారు.

సాధారణంగా స్తుతి కావ్యం 108 శ్లోకాలతోనో లేక నక్షత్ర సంఖ్యను తెలిపే 27 తోనో ఉంటుంది. కాని పరాశర భట్టర్‌వారు 61 శ్లోకాలతో అమ్మయైన శ్రీదేవిని స్తుతించినారు. సామాన్యులకు ఇందలి విశేషం తెలియదు. కాని రాఘవాచార్యులవారి దృష్టిలో 61 అనే సంఖ్య 7 అనే సంఖ్యకు సంకేతం. "సప్త ప్రాకార మధ్యే మృదుతర ఫణిరాట్ భోగ పర్యంక భాగే నిద్రాముద్రాభిరామః" అన్నట్టు సప్తప్రాకారాల మధ్య కొలువైయున్న ఆ రంగనాథ స్వామి పట్టమహిషి శ్రీరంగనాయకికి సాక్షాత్కరించినారు. సృష్టి, స్థితి, లయాలను చేయడం పరమాత్మకు లీల. కాని ఆ లీల ధర్మపత్నియైన శ్రీదేవి ఒప్పుకొన్నందువల్లనే జరుగుతున్నాయని అమ్మవారి గొప్పదనాన్ని ఈ శ్లోకం తెల్పుతున్నదనే విశిష్టమైన అర్థాన్ని తెలిపినారు.

అట్లే శ్రీ శబ్దానికి- 1) అందరిచే ఆశ్రయింపబడేది, 2) ప్రియుడైన నారాయణుణ్ణి ఆశ్రయిస్తుంది, 3) ఆశ్రితుల బాధావచనాలను ఓపికతో వింటుంది, 4) భర్తకు ఆర్తుల కష్టాలను విన్నవిస్తుంది, 5) ఆశ్రితుల దోషాలను పోగొట్టుంది, 6) తన గుణాలచే సమస్త లోకాలను ఆశ్రయించి యుంటుంది అని ఆరు అర్థాలను తెలిపినారు.

ఈ విధంగా ప్రతి శ్లోకంలోనూ ఏదో ఒకవిధంగా శ్రుతి, స్మృతి, ప్రబంధాలను మనకు పరిచయం చేసిన సుశ్లోకుడు శ్రీమాన్ రాఘవాచార్యులవారు. అట్లే ప్రతిశ్లోకంలోనూ, ఆ శ్లోకం ఏ వృత్తంలో ఉన్నదనే విషయాన్ని గణాలతో తెల్పిన ప్రతిభావంతుడు. "వాఙ్మనసయోః భాషానభిజ్ఞం పదం కావాచః"- అనే శ్లోకం ద్వారా బ్రహ్మాది దేవతలు కూడా స్తుతింపలేని నీ ప్రభావాన్ని నా వంటి అల్పుడు, వచ్చీరాని మాటలతో నేనొక గొప్పకవిని అని లోకానికి చాటిచెప్పడానికే స్తుతిస్తున్నానని వైష్ణవులు ఎక్కువగా కోరే త్వద్ భృత్య భృత్య పరిచారక భృత్య భృత్య అనే నైచ్యాన్ని భట్టరువారు ప్రదర్శించినారంటూ వైష్ణవ సంప్రదాయాన్ని వివరించినారు శ్రీమాన్ ఆచార్యులవారు.

మన ప్రాచీన ఋషులు గానం చేసిన వేదం, ఆ తల్లి గుణగణాలనే మణులకు నిలయమని, ఇతిహాస పురాణాదులు ఆ భాండారానికి తాళపు చెవులవంటివని భట్టరువారు స్తుతించిన "దేవీం శ్రుతిం భగవతీం" అనే 10వ శ్లోకానికి వ్యాఖ్యానం చేస్తూ-

ఇతిహాస పురాణాభ్యాం వేదం సముపబృంహయేత్।
బిభేత్యల్పశ్రుతాద్వేదః మామయం ప్రతరిష్యతి॥

అనే శ్లోకం ద్వారా అల్పజ్ఞాని వేదానికి విపరీతార్థాలు చెప్పి నాశనం చేస్తాడు. కావున ఇతిహాస పురాణాల ద్వారా వేదార్థాన్ని పెంపొందించాలని అంటూ శ్రుతి, స్మృత్యాదులు తల్లి గుణగణాలను ఏ విధంగా వర్ణిస్తున్నాయో సోదాహరణంగా వివరించినారు.

అదేవిధంగా అల్పజ్ఞానులైన బౌద్ధ, చార్వాకుల గురించి, సాంఖ్యుల గురించి, కర్మను మించిన దైవం లేదనే మీమాంసకుల గురించి, పరమాత్మ గుణరహితుడనే (నిర్గుణుడనే) మాయావాదుల గురించి 'ఆహుర్వేదాన్' అనే 11వ శ్లోకంలో విపులంగా తెల్పినారు. పైగా వారికి లక్ష్మీదేవి కటాక్షం లేనందువల్ల పరస్పరం జంఘాజంఘి, ముష్టాముష్టి యన్నట్లు తలాతల యుద్ధం చేస్తున్నారంటూ వ్యాఖ్యానించినారు.

ఇంకా 'అప్యేశానా జగతః' అనే 13వ శ్లోకానికి వ్యాఖ్య వ్రాస్తూ ఖిలసూక్తమని దేనినంటారనే విషయం తెలుపుతూ, పరశాఖీయం "స్వశాఖీయామ్ అపేక్షవశాత్ పఠ్యతే తత్ ఖిలముచ్యతే।" అనే భారతం-శాంతిపర్వంలోని శ్లోకాన్ని ఉట్టంకిస్తూ వివరించినారు. అదేవిధంగా ఆ శ్లోకంలో చెప్పబడ్డ విషయాలు ఏయే సూక్తాలకు సంబంధించినవనే విషయాన్ని సోదాహరణంగా వివరిస్తూ తమకున్న వేదమంత్ర పరిచయాన్ని తెలిపినారు.

అదేవిధంగా శ్రియఃపతియైన నారాయణుడు తన దేవేరియొక్క విహారం కొరకే ఈ సమస్త సృష్టిని చేసినాడనే "కావే శంసతి యోగ్యతాం చిదచితోః" అనే 19వ శ్లోకాన్ని వ్యాఖ్యానిస్తూ పరమాత్మ సృష్టించిన పృథివి, ఆపస్సు, తేజస్సు మొదలైన భూతపంచకాన్ని, గంధ, రస, రూపాది తద్విషయాలను, బుద్ధ్యహంకార తత్త్వాలను, పంచకరణేంద్రియాలైన చక్షుః, శ్రోత్ర, జిహ్వాది జ్ఞానేంద్రియాలను అంతఃకరణమైన మనస్సు గురించి, వాక్పాణి, పాదాది ప్రవృత్తీంద్రియాలను గురించి వివరిస్తూ భట్టరువారి శ్లోకంలో ఉన్న విషయాలను సామాన్యపాఠకునికి కూడా కరతలామలకం చేసినారు.

ఇంకా నారాయణుడుండే పరమపదం కూడా తన దేవేరియైన శ్రీరంగనాయకి గురించే సృష్టింపబడినదంటూ చెప్తూ, ఆ లోకం పెంజీకటికి ఆవలనున్నదని, ఆ లోకాన్ని బ్రహ్మాది దేవతలు కూడా ధ్యానింపలేరని ఆ దివ్యలోకాన్ని ఒక్కమారు దర్శించినవారికి దేవతలు నివసించే దేవలోకం నరకలోకంవలె పరమాసహ్యంగా గోచరిస్తుందనే విషయమున్న "యద్దూరే మనసో యదేవ తమసః పారే" అనే శ్లోకాన్ని అరటిపండును ఒలిచి పెట్టినట్లు పాఠకులకు సులభంగా అందించినారు.

పరాశర భట్టరువారి కృతి శ్రీగుణ రత్నకోశం శ్రీదేవియొక్క దివ్యగుణాలనే రత్నాలకు పెన్నిధి. ఆ పెన్నిధిని సులభంగా దర్శించుటకు, దానిని తమదిగా చేసికొనుటకు పరితపించే భక్తులకు, పాఠకులకు తమయొక్క జ్యోతిష్మతీ వ్యాఖ్యానం ద్వారా చక్కగా దర్శనం చేయించి మనలనూ ధన్యవంతులను చేసినారు. తామూ గుణదర్శనం చేయించగలిగినారు. ఇది వారి కృతికి దిక్ దర్శనము మాత్రమే.

ప్రత్యక్ష స్మృతి

అష్టకాల నరసింహరామశర్మ

చరవాణి: 9440 008 863

కారంచేడు కుటుంబకీర్తి బహుళాకారంబులందిద్ది వి
ద్యారూపంబున సంస్కృతాంధ్రము లభేదంబౌ నటుల్ తీర్చి శ్రీ
సారస్వంత సమస్త రూపముగ విస్ఫారంబు గావించె సు
స్మేరైక ప్రవిధాన భాషణముతో స్మృత్యున్నతింబెంచెడిన్

నేనన్న న్నను బల్కరించునెడ హృన్నీరేజము న్విచ్చు వా
డేనాడైనను జిన్నవానిగ ననున్ ప్రేమంతునిం జేయలే
దానందాతిశయమ్ముతో బలుకు దీవ్యన్మూర్తి మాకండ్ల ముం
దే నాడున్ విలసిల్లు నా మహితుడే ఇజ్యుండు మాకెన్నడున్.

దూరము భారము లెంచక/ ధీరత నుద్యోగ గరిమ తీర్చిన విబుధో
దారుడు రాఘవ గురుడు/ ద్ధారుడు సాహిత్య పర్వతా రోహకుడౌ

ఉత్తమ గ్రంథ సమీక్షా/ చిత్తైకాగ్రత విశేష శేముషి పరచెన్
హత్తుకొను రీతి సుమతుల/ కెత్తిన కేతన మనంగ నిలలో నొప్పెన్

వారిమాట తీరు వారి మనస్సుతో/ జతను గలిపి చూడ సాధువృత్తి
హృదయ కుహరమందు హృష్టి తుష్టియు గల్గు/ నతులొనర్తు భాషణమున కెందు

ఈడు-అవతారిక అనువాద విభవము

డా॥ కందాడై రామానుజాచార్య
చరవాణి: 9395 395 899

శ్రీ శఠకోప నామముతో అలంకరించబడిన నమ్మాళ్వార్లు 32 సంవత్సరములు దివ్యముగా అనుభవించిన భగవదనుభవమును కృపతో ప్రసాదించిన తమిళ దివ్య ప్రబన్ధము తిరువాయ్ మొళి మొత్తం. ఋగ్యజురధర్వణ సారరూపములో నున్న ఇతర తమిల గ్రంథముల కంటె తిరువాయ్ మొళి 1102 పాశురములతో సామవేద సారముగా వెలువరించిన బృహద్గ్రంథము. ప్రకృతి బంధములను తెంచుకొనజాలని బద్ధజీవులను కూడా పరమ ప్రపన్నులనుగా తీర్చిదిద్దినది ఈ విలక్షణ గ్రంథము సకలార్థములను కృపచేయు తిరువాయ్ మొళిలో ప్రసిద్ధి పొందిన వ్యాఖ్యానము పేరు భగవద్విషయము ఉభయ వేదాన్త సంప్రదాయము మూడుపాయలుగా ప్రవహించినది.

1) శ్రీ భాష్య సంప్రదాయమునకు భగవద్రామానుజులు.

2) భగవద్విషయ సంప్రదాయమునకు నంబిళ్ళైవారు.

3) రహస్య త్రయ సంప్రదాయమునకు పిళ్ళైలోకాచార్యులు పరమోపకారకులు.

నమ్మాళ్వారు శ్రియఃపతి విషయమున అతి ప్రేమ కలిగి ఈడుపడి అనగా వ్యామోహమును చెంది మధురోహలలో తేలియాడుట వలన భగవద్విషయమునకు ఈడు అను నామాన్తరము కలిగినది.

ఈడు ప్రబన్ధమునకు అవతారిక శ్రియఃపతి పదముతో అరంభమగును. అందుచే అవతారికకు శ్రియఃపతి అనుపేరు సముచితముగా ఉన్నది. ఇట్లు అవతారికను ప్రస్థానసారముగా ఉపన్యసించి ముగించు చుండగా మరికొందరు కొత్తగా వచ్చి మరల కొనసాగింప ప్రార్థించగా రెండవసారి శ్రియఃపతి నారంభించిరి. దానిని ముగించబోవుచుండగా మరికొందరు వచ్చి అభ్యర్థించగా మూడవ శ్రియఃపతి వెలువడినది. ఇట్లు మూడు శ్రియఃపతులతో త్రిపుటిగా ఈ డు అవతారిక ఆవిర్భవించినది. ఈ అవతారికలో ఆళ్వారు సిద్ధాన్తమున తప్పక తెలియవలసిన మూడు తత్త్వములున్నవి. సంస్కృతవేదాన్తము భగవద్రామానుజుల శ్రీ భాష్యమువలె ద్రావిడ వేదాన్తమున భగవద్విషయ ప్రబంధము పరమ ప్రమాణమైనది నంబిళ్ళై అను సుప్రసిద్ధ నామము కల మహాచార్యులు భగవద్విషయ ప్రబంధము అవతరించుటకు మూలపురుషులు. నంబిళ్ళగారు గంభీర మధురోపవ్యాసకులు. వీరు నంజీయర్‌గారి శిష్యులు. నంబిళ్ళైగారి జ్ఞాన సమృద్ధిని శిష్యసంపత్తిని చూచి అసూయాపరులైన కందాడైతోళప్పర్ అను ఆచార్య పురుషులు నంబిళ్ళగారిని గోష్ఠిలోనే దూషించి వెళ్ళిరి.

ఆ నంబిళ్ళగారికి వడక్కు తిరువీధి పిళ్ళై (శ్రీకృష్ణపాదులు) శిష్యులగుట విశేషము. నంబిళ్ళైగారి తిరువాయ్ మొళి ప్రబంధ కాలక్షేపమున వడక్కు తిరువీధిపిళ్ళైగారు విన్నది విన్నట్లుగా ధారణాశక్తిచే శ్రీ భాష్యమునకు శ్రుతప్రకాశికవలె ముప్పత్తారాయిరప్పడిని 36వేల పంక్తుల వ్యాఖ్యానముగా సరసముగా

వ్రాసిపెట్టిన గ్రంథమే భగవద్విషయము. ఆ భగవద్విషయమునకు అనగా వడక్కుతిరువీధిపిళ్ళై కృప చేసిన వ్యాఖ్యానమునకే ఈడు అని నామకరణము. ఆ ఈడునకు అవతారికను రాఘవాచార్యస్వామివారు విశదముగా సరళముగా మధురముగా అజ్ఞులకు విజ్ఞులకు విశేషజ్ఞులకు మనోరంజకముగా తెనుగు వ్యాఖ్యానమును అందించినారు. ఇది ఈడు వైభవము అవతారికా వైభవము.

అవతారికలోని ముఖ్యాంశములను స్వామివారు విశదీకరించిన విధానమును తెలియుదము–

తత్త్వములు, వాటి సంఖ్యతో వివాదములు–

1) ఆ వివాద నిరూపణములు అసంగతములని మను వచనముతో ఒప్పించి ఇతర దర్శన సిద్ధాన్తముల కంటె స్వసిద్ధాన్త వైలక్షణ్యమును నిరూపించియున్నారు.

2) ప్రబంధమున ఉండవలసిన శబ్దార్థ ఛందోలంకారాది నియమములు, భాషా విషయ కవితా రీతులను గూర్చి ప్రశ్నోత్తరములు భగవత్సంశ్లేషమే సుఖము భగవద్విశ్లేషము సుఖహాని దుఃఖాపాదకము నిజమైన మనోరథం భగవత్ కైంకర్యమే అర్థ పంచకమును విశదపరచుట, ఆ చర్యనిష్ఠ భాగవత వైభవము, ప్రాప్యనిష్కర్ష మొదలగు విషయములను మొదటి శ్రియఃపతిలో స్వామివారు విశదీకరించినారు.

3) ఇక రెండవ శ్రియఃపతిలో ద్వయ మంత్రార్థ వివరణము దీర్ఘశరణాగత, కళ్యాణ గుణానుభవ ప్రకటనము మొదలగు వాటిని విశదీకరించినారు.

4) మూడవ శ్రియఃపతిలో ప్రబంధ చతుష్టయార్థ వివరణము, పారతన్త్ర్యనిష్ఠా ప్రతీకత మొదలైన విషయాలను వివరించారు. ఇట్లు భగవద్విషయ ప్రబంధావతారికలుగా ఉన్న మూడు శ్రియఃపతులను తమిళంలోని ఒక్కొక్క పదాన్ని కూడా వదలి వేయకుండా ప్రతిపదాన్ని అనువదించినారు. ఈ అనువాదము ఉభయవేదాన్త ప్రవర్తకులందరికి గొప్ప ఉపకారముగానున్నది. వైదిక సాహిత్యవేత్తలు సకల శాస్త్ర పారంగతులు. మీదు మిక్కిలి అధ్యాపకులుగాన విషయమును సుబోధకముగా సరళ లలిత మధుర శైలిలో జరిగినది. నిన్ని భాషలు ఇన్ని శాస్త్రాలు ఇంతటి గంభీర దర్శన సిద్ధాంతము ఓర్పూ నేర్పూ ఉన్నవారికే కాని వివరించ నలవిగాదు. ప్రతిపదానికి తెలుగులో అర్థం పొసగునట్లు అనువదించగలగటం ద్రావిడాగమ ప్రవచన లేఖినీ నైపుణ్యం ఉంటేనే సంభవము. రాఘవాచార్యస్వామి వారు ద్రవిడ పదాలను పనస తొనల్లా విడదీసి పంచదార అద్ది అందించినట్లు అర్థాలను వివరించారు, వీరి అనువాదం చదువుతుంటే అది ద్రవిడాగమం అనిపించదు. ఏ తెలుగు ప్రబంధమునో చదువుతున్నాము అనిపించుట సహజము. అందుకే వీరి అనువాదాల వాదాలు ఆ పదాల భావాలు తేనెలై వీనులకు అమృతంపు సోనలై విందు చేస్తుంటాయి.

"ఈ డు వేదాన్తాలకు ఈడైన ప్రామాణిక ప్రబంధం కాబట్టి దీనికి ఈడు అనే వ్యాఖ్యానంగా వ్యవహారం ప్రసిద్ధమైనది. తిరువాయి మొళిలో ప్రతిపాశురం 'ముక్తపదగ్రస్తం' కాబట్టి అధ్యయన పరులకు పరమపదమే పర్యవసానం. ఇవి స్వామివారి మాటలు. ఇచట ముక్తపదగ్రస్తం అనునది శ్లేష భావ బంధురము. ముక్తపదగ్రస్తం అనేది సాహిత్య ప్రక్రియ. ద్రావిడ ప్రబంధాలు చాలావరకు అంతాదిగా ఉంటాయి. పై పాశురములో చెప్పి

వాడిన పదాన్ని తరువాతి పాశురములో మరల చెప్పుట ఆ ప్రక్రియ అట్లే ముక్తముక్తుల పద పాదములచే గ్రస్తం ఆవేశించబడినది. ముక్తి పొందిన పరమ భాగవత పాదప్రవేశమున్నది గాన ఈ ప్రబంధము తప్పక ముక్తిని ప్రసాదించును. **ఆర్వారాచార్యులు** అందుకు వైకుంఠంలోని నిత్యముక్తులే కదా అవతరించినది. అట్లు ముక్తులైనవారు కూర్చిన పదములచే నిండియున్నది అని ఒక అర్థము. నిత్యసూరులే ఇట భగవదవతారంవలె భగవానుని అజ్ఞచే నిత్యసూరుల అవతారం అని ముక్తపదగ్రస్తం అంటే అర్థం. అక్కడి వారే ఇక్కడ ఈ ప్రకృతిలో కాలుపెట్టి ఇక్కడి వారిని అక్కడికి చేర్చేది ద్రావిడ దివ్య ప్రబంధం అని స్వామివారి పదగుంభనలోని గాంభీర్యార్థం.

ఈడు అవతారికగా ఉన్న మూడు శ్రియఃపతులలో ప్రబంధ లక్షణము ఆళ్వార్ల అనుభవ విశేషాలు అద్దంలో కొండలా ఆవిర్భవించాయి. స్వామివారి మాటలలో ఏది విద్య? ఏది నేర్పు? త్యాగం ఎలా ఉంటుంది? పరమార్థం ఎలా పట్టుబడుతుంది? అనే అనేక ప్రశ్నలకు ఈడైన సమాధానం ఈ డులో ఉన్నది.

ఇక స్వామివారు ఈడులో వివరించిన ఆయా మతముల సిద్ధాంతములను అన్యూనాతిరిక్తముగా శాస్త్ర జ్ఞానం అనుభవంలేని వారికి కూడా సుబోధకమగునట్లు వివరించారు.

చార్వాకుడు భూమి మొదలైన భూతములు నాలుగింటి సముదాయమందు (ఆకు సున్నం కాచు వక్కల కూడికచే రాగోదయమైనట్లు) చైతన్యమనెడు ఒక ధర్మం కలుగును. ఆ ధర్మానికున్న సుఖదుఃఖములే స్వర్గ నరకములు. ఆ నాలుగు భూతముల యెడబాటుతో చైతన్యము నశించును. ఆ వలనింకేమియూ లేదు. ఇదివారి అనువాద శైలి. ఇందులో చదువరులకు అర్థం కావటానికి 'ఆకుసున్నం కాచు వక్కల కూడికచే' అను స్వామివారి మాటే ఇది. తమిళ మూల పదాలలో ఈ మాట లేదు. చదువరులకు అర్థం కావాలి అనే స్వామివారి తపన ఇందులో స్ఫుటమౌతుంది.

ఇట్లు జైన బౌద్ధ సౌత్రాంతిక యోగా చర్య ఇత్యాది మతములను అలతి యలతి మాటలతో అర్థమును పరమార్థమును వాదులకుండగా స్వామివారి అనువాదము సాగినది. వాటిని వివరించుట గ్రంథవిస్తర భీతిచే మానివేయుచున్నాను. ఇట్టె నైయాయిక వైశేషిక పాశుపతుల సాంఖ్యయోగ దార్శనికులు. భట్ట ప్రాభాకరులు మాయావాదులు భాస్కరీయుడు యాదవ ప్రకాశులు మాధ్వ మతనిష్ఠులు ఇట్లు 17 సిద్ధాంతములను స్పష్టముగా వివరించియున్నారు.

ఇక విశిష్టాద్వైత సిద్ధాంతమున తత్త్వములు మూడు. జీవుడు, ప్రకృతి, ఈశ్వరుడు.

ప్రకృతి యనునది సాత్త్విక రాజస తామస గుణముల మూడింటితో కూడియుండునది. ఇది నిత్యము నిరంతరము మారుచుండును. ఇందువలననే ప్రకృతి వదలదగినది. ఈ ప్రకృతియందు భోగ్యబుద్ధి కలిగి సంసారమును దృఢముగా చేసుకోవాలి అనేవాడు భగవానుని ఆశ్రయించాలి. ప్రకృతి విడువదగినదట అని తెలిసి దేహమును వదులాలి అనేవారు భగవానుని ఆశ్రయించాలి.

ఇక్కడినుండి అవతారికలో ఒక్కొక్క తిరువాయ్ మొళిలో ప్రతిపాదించబడిన విషయములను వివరించియున్నారు. అట్లే ప్రకృతి స్వరూపమును ప్రత్యగాత్మ స్వరూపము పరమాత్మ స్వరూపమును విశదపరచినారు.

ఇక జీవుడు కోరదగినవి పరమాత్మకై కైంకర్యము చేయవలయును అని నన్ను అంగీకరించవలయును. ఎడతెగని దాస్యము చేయవలయును. దాస్యమే పరమ పురుషార్థము అని నిరూపించిరి. రాగము మమతలేనివానికి ఇల్లే తపోవనము నివృత్తరాగ స్వగృహ తపోవనమ్. త్యాగమనగా బుద్ధిచే విడుచుటయే. ఈ ప్రబంధమందు ప్రపత్తియే ఉపాయమని చెప్పినారు. పరమపురుషుడు మరణించిన వెంటనే పరమపదమును ప్రసాదించు పరమోపకారకుడు.

ఈ తిరువాయ్‌మొళిచే ప్రతిపాదించబడిన అర్థపంచకము–

ప్రాప్తస్య బ్రహ్మణో రూపం– ప్రాప్యశ్చ ప్రత్యగాత్మనః
ప్రాప్త్యుపాయం ఫలంప్రాప్యే– తథాప్రాప్త విరోధిచ!– ఇది అర్థపంచకము.

తిర్‌వాయ్‌మొళి ప్రబంధముచే ద్వయమంత్ర వివరణ చేయుచున్నారు. దాస్యమే పురుషార్థము కైంకర్యమే ఫలము. స్వామిని ఈ స్వామివారు–

మిగుల వెలిగెడి శ్రుతులలో నెగడువాడు సిరిగల నారాయణుడు.

రెండవ శ్రియఃపతిలో పదిపత్తుల సారమును సరళముగా విశదీకరించినారు.

మూడవ శ్రియఃపతిలో తిరువిరుత్తమున–

తిరువా శిరయములో– తిరువన్దాదియందు

తిరువాయ్‌మొళిలో ప్రతిపాదించిన విషయములను వివరించియున్నారు.

తిరువాయ్‌మొళిలో మొత్తము పది పత్తులకు సంగ్రహము మొదలు తిరువాయ్ మొళి మొదటి తిరువాయ్ మొళికి సంగ్రహము మొదటి మూడవ పాశురములు, మొదటి మూడు పాశురములకు సంగ్రహము మొదటి పాశరము మొదటి పాశురమునకు సంగ్రహము మొదటి పాదము, సకలవేదములకు సంగ్రహము ప్రణవము ప్రణవమునకు సంగ్రహము అకారముగా చెప్పబడినది. భారత రామాయణాదులు కూడా మొదట సంగ్రహముగా చెప్పి తరువాత విశదముగా చెప్పియున్నారు.

ఇలా చక్కని అనువాదంచేసిన రాఘవాచార్యులస్వామివారు ముద్రితమైన గ్రంథంమీద తమ స్వహస్తాలతో–

ఈ దు అర్థం కావాలంటే మా ఈడు సరిపోదు. రాగము మమతలేనివారు జగతిలో అరుదుగదా!

సతతం శ్రీమన్నారాయణుని చరణారవిందాలనే ఆశ్రయించేవారెవరు?

భగవద్విషయం అనంతం అర్థం చేసుకొని అలా ఆచరించటం కష్టతరం.

ఇవి స్వామివారి వాక్యాలు.

ఇది వారి నిరాడంబరతను వినయ సంపదను అసమాన పాండితీప్రతిభను తెలుపు వాక్యాలు. శ్రీమాన్ కె.వి.రాఘవాచార్యులుగారి ఈ దు అవతారికను వివరించుటకు మా ఈ దు సరిపోదు. వారి మీదున్న భక్తిప్రపత్తులను చూపించుకొను భాగ్యము కలిగినదని చాటేవే ఈ నాలుగు మాటల సరాలు.

ఇతిశమ్.

వరదరాజ పంచాశత్

సర్వంకషా సమున్మేషము

కొమాండూర్ ఇళైయవిల్లి స్థలశాయి

ముఖ్యముగా కవితార్కిక సింహులు, సర్వతంత్ర స్వతంత్రులు నైన శ్రీ వేదాంతదేశికుల కావ్యాలకు-స్తోత్ర వాఙ్మయానికి ప్రామాణికాలైన తెలుగు వ్యాఖ్యానాలు వెలయించి తెలుగు పాఠకలోకానికి శ్రీరాఘవాచార్యుల వారు చేసి మహోపకారం మరువరానిది. వీరి వ్యాఖ్యాగ్రంథాలను పఠించిన వారికి మూలగ్రంథకర్త యొక్క హృదయము అవగతమవటంతో పాటుగా రసాలంకారాది సాహిత్య మర్మాలు, వ్యాకరణాంశాలు, వేదాంత పురాణేతిహాసాలలోని అనేక విషయాలు సులభంగా తమ జ్ఞాన పరిధిలోకి వస్తాయి. శ్రీ దేశికుల స్తోత్రాలకు శ్రీ ఆచార్యులవారు రచించిన వ్యాఖ్యానంలో, "వరదరాజ పంచాశత్" స్తోత్రానికి రచించిన "సర్వంకషావ్యాఖ్య" మిక్కిలి వైలక్షణ్యాన్ని కలిగి విరాజిల్లుచున్నది.

సంస్కృత పంచమహాకావ్యాలకు సంస్కృతంలో వ్యాఖ్యానాలను వెలయించిన మల్లినాథుడు మాఘకావ్య వ్యాఖ్యానానికి 'సర్వంకష' అనే పేరు నుంచాడు. ఆ వ్యాఖ్యానానికి ఆ పేరును తానెందుకు పెడుతున్నాడో, వ్యాఖ్యానారంభంలో ఈ శ్లోకం ద్వారా తెలిపాడు.

యే శబ్దార్థ పరీక్షిణ ప్రణయినో యేవా గుణాలంక్రియా
శిక్షాకౌతుకినో విహర్తు మనసో యేవా ధ్వనే రధ్వని।
క్షుభ్యత్ భావ తరంగితే రససుధా పూరే మిమంక్షన్తియే
తేషామేవ కృతే కరోమి వివృతిం మాఘస్య సర్వంకషామ్॥

"ఎవరు శబ్దార్థములను విమర్శించి చూచుటలో ప్రేమ కలిగి ఉంటారో, ఎవరు మాధుర్య ప్రసాదాది గుణములను, ఉపమానాది అలంకారములను నేర్పుటయందు ఉత్సాహము కలవారో, ఎవరు ధ్వనియొక్క మార్గములో విహరించు మనస్సు గలవారో, ఎవరు క్షోభపెట్టు భావములను తరంగములుగల రసప్రవాహంలో అవగాహింప గోరుచున్నారో వారికోసమే మాఘకావ్యానికి 'సర్వంకషా' వివృతిని అనగా- 'సమస్త విషయములను ఒరిపిడి చేయు' వ్యాఖ్యానమును చేయుచున్నాను" అని మాఘ కావ్యానికి తాను చేయు వ్యాఖ్య, సమగ్రమైన సాహిత్య జ్ఞానాన్ని పఠించిన వారికి కలుగచేస్తుందని తెలిపాడు. శ్రీ ఆచార్యులవారు కూడా వరదరాజ పంచాశత్ స్తోత్రానికి తెలుగులో తాము చేయు వ్యాఖ్యానానికి 'సర్వంకషా' అనే పేరు పెట్టడంలో మల్లినాథుని వ్యాఖ్యానమునకు వలె 'సమగ్ర'త, 'వైలక్షణ్యము' తన వ్యాఖ్యానంలో ఉన్నవని ప్రతిజ్ఞ చేసి నిరూపించారు.

సాధారణంగా స్తోత్ర సాహిత్యమంతా దేవతాస్తుతి పరంగానే కనబడుతున్నా, కొన్ని స్తోత్రాలు కావ్య లక్షణాలను కలిగినవి కూడా ఉన్నాయి. వేదపురాణేతిహాసాలలోని రహస్యాలు, ధర్మశాస్త్ర విషయాలు, సామాజికాంశాలు, మంత్రశాస్త్ర రహస్యాలు, శబ్దశాస్త్ర మర్మాలు, పూర్వోత్తర మీమాంసా దర్శనము సారములు-

ఇలా అనేక విషయాలను స్పృశిస్తూ కూడా స్తోత్ర రచనలు సాగాయి. చాలావరకు శ్రీవైష్ణవ సంప్రదాయాచార్యుల స్తోత్రాలు గొప్ప అర్థగాంభీర్యమును కలిగియున్నాయి. శ్రీ కులశేఖరాళ్వారుల 'ముకుందమాల', యామునాచార్యుల వారి 'స్తోత్రరత్నం', భగవద్రామానుజుల 'గద్యత్రయం', శ్రీవత్సాంకమిశ్రుల 'పంచస్తవములు' పరాశరభట్టరుల 'శ్రీగుణరత్నకోశం, శ్రీరంగరాజస్తవం' వంటి స్తోత్రాలు శబ్ద సౌందర్యమును- అర్థగాంభీర్యము కలవై మంత్రాత్మకములై జ్ఞానదాయకములుగా విరాజిల్లుతున్నాయి. శ్రీ రామానుజుల అనంతరం శ్రీరామానుజ దర్శనానికి విశేషమైన సేవనందించిన మహనీయులు శ్రీ హయగ్రీవానుగ్రహలబ్ధ వైదుష్య పరిపూర్ణులైన వేదాంతదేశికులు. వీరు సంస్కృత-ద్రావిడ భాషలలో శతాధిక గ్రంథములను రచించారు. వాటిలో జటిలమైన శాస్త్రగ్రంథాలు ప్రారంభించి, సామాన్యమైన స్తోత్ర సాహిత్యం వరకు వివిధమైన అంశాలను స్పృశిస్తూ వారి రచనలున్నాయి. వీరు రచించిన స్తోత్రాలు నారికేళ పాకములై, అనేకములైన శ్రుతీతిహాస పురాణాలలోని రహస్యాలను వివరించేవిగా ఉంటూ, సంప్రదాయార్థ బోధకాలై భగవంతుని స్వరూప-రూప-గుణ-విభవైశ్వర్య వర్ణనాత్మకాలై అలరారుతున్నాయి. వీరి స్తోత్రాలను వ్యాఖ్యానం లేకుండా అర్థం చేసుకోవటం చాలా కష్టం. శాస్త్ర పరిజ్ఞానం కలవారు కూడా కొన్ని తావులలో సందేహాలకు గురి అవుతారు. అది గమనించిన ఉదారులు పెద్దలైన విద్వాంసులు సంస్కృత-తమిళ భాషలలో వ్యాఖ్యానాలు వ్రాశారు. కానీ, తెలుగు భాషలో కూడా వ్యాఖ్యానాలుంటే, సంస్కృత-తమిళ భాషలు రాని తెలుగువారికి గొప్ప ఉపకారం కాగలదు. అట్టి ఉపకారాన్ని చేయటానికే శ్రీ ఉ.వే.శ్రీమాన్ కె.వి.రాఘవాచార్యులవారు దీక్ష వహించారు. శ్రీస్తుతి, దయాశతకం, గోదాస్తుతి, సుదర్శనాష్టకమ్, యతిరాజసప్తతి, వ్యాసవింశతి, న్యాసదశకమ్, అభీతిస్తవమ్, పాదుకాసహస్రమ్ వంటి స్తోత్రాలకు టీకా-తాత్పర్యాలు, విశేషాంశాల వ్యాఖ్యానాలు తెలుగులో రచించి ముద్రించారు. అదేవిధంగా 'వరదరాజపంచాశత్' స్తోత్రానికి 'సర్వంకషా' అనే తెలుగు వ్యాఖ్యానాన్ని అనితర సాధ్యముగా రచించి ఈ రచనలో ఆచార్యులవారు అద్భుతమైన ప్రతిభావైదుష్యములు కనబరచారు.

మోక్షదాయకమైన సప్తక్షేత్రాలలో కాంచీపురం ఒకటి. విష్ణుకంచిగా పిలువబడే చోట బ్రహ్మదేవుడు చేసిన అశ్వమేధయాగ వేదమధ్యంలో ఆవిర్భవించిన స్వయం వ్యక్తమూర్తి 'వరదరాజస్వామి'. ఆయనను యాభైఒక్క శ్లోకాలతో దేశికులవారు స్తుతించారు. స్తోత్రంలో ప్రధానవిషయం, 'వరదరాజు యొక్క స్వరూప-రూప-గుణ-విభవాల వర్ణనము'.

మొదటి శ్లోకంలో 'కలయతు కుశలం నః కోఽపి కారుణ్యరాశిః'- గొప్ప కారుణ్య రాశియైన వరదరాజు మనకు మంగళమును కలుగజేయుగాక! అని ప్రార్థనా రూపమైన మంగళాచరణము చేయబడినది. "ఆశీర్నమస్క్రియా వస్తు నిర్దేశో వాపి తన్ముఖమ్" అన్నట్లుగా 'వరదరాజు మనకు క్షేమమును కలిగించుగాక!' అనే ఆశీరూపమైన ప్రార్థన మరియు 'వస్తు నిర్దేశము' కూడా చేయబడింది. 'వస్తునిర్దేశ'మనగా పూర్తి స్తోత్రమందు ఏమి చెప్పదలచారో దానిని మొదటి శ్లోకంలో సూచనగా తెలుపుట.

"ద్విరద శిఖరి సీమ్నా సద్మవాన్= హస్తిగిరి యందలి అగ్రప్రదేశం చేత తన గృహంగా కలిగినట్టి, పద్మయోనేః= చతుర్ముఖ బ్రహ్మయొక్క; తురగ సవన వేద్యాం= అశ్వమేధయాగమందలి వేదియందు; శ్యామలో హవ్యవాహః= నీలవర్ణం కలిగిన అగ్నియైనవాడు".

చతుర్ముఖబ్రహ్మ కాంచీపురంలో, పరమాత్మను దర్శింపగోరి అశ్వమేధయాగం చేశాడు. ఆ యాగాగ్ని యందు అర్చామూర్తిగా వరదరాజస్వామి ఆవిర్భవించాడు. బ్రహ్మను చెప్పే 'పద్మయోనేః' అనే శబ్దం, భగవంతుని నాభీకమలమునుండి బ్రహ్మ జన్మించాడనే పౌరాణిక వృత్తాంతాన్ని తెలుపుతుంది. తద్వారా పరమాత్మ పర- వ్యూహ-విభవ, అన్తర్యామి- అర్చాప్రకారములను కలిగియున్నాడనే తర్వాత శ్లోకాలలోని భావమంతా మొదటి రెండు పాదాలలో చెప్పినట్లయింది. 'శ్యామలోహవ్యవహః'= నీలవర్ణం కలిగిన అగ్ని. అగ్ని ఎక్కడైనా లోహితవర్ణాన్నే కలిగియుంటాడు. కానీ, ఇక్కడ 'నీలవర్ణం' కలిగియున్నవాడు అగ్నియే అయినా ఈయన వరదరాజస్వామి (అర్చామూర్తి). ఈ విషయాలను శ్రీరాఘవాచార్యులవారు 'సర్వంకష'లో నిరూపించినారు.

మూడు వేదాలలో దీపించునట్టి, పంచాయుధుడైన (విస్తారమైన జ్వాలలు కలిగినట్టి) చరు, పురోడాశాది బాహ్య హవిస్సులనూ, ప్రపన్నులు సమర్పించే ఆత్మాత్మీయ రూపాంతర్ హవిస్సులనూ స్వీకరించునట్టి, కోరిన వరాల నిచ్చునట్టి, పాలకడలియందు- రవి మండలమందు- వైకుంఠమందు నివసించునట్టి, లోహిత- శుక్ల- కృష్ణ కాంతులతో ప్రకాశించే నారాయణునికీ, అగ్నిదేవునికీ ప్రణామమని అర్థం. శ్లేషాలంకృత శ్లోకమిది.

శ్యామలో హవ్యవాహః- నలువ తన పుత్రుడే కాబట్టి నిరతిశయ ప్రీతి కలవాడై 'యజ్ఞోవైవిష్ణుః' అనే శ్రుతి పలికినట్లు, విష్ణుభగవానుడే- నీలమేఘశ్యాముడైనందు వల్ల- వచ్చి, విలక్షణమైన నీలవర్ణ శోభితాగ్నిగా ప్రజ్వలిస్తూ హవిస్సును స్వీకరించాడు. నీలవర్ణం చలువను, ఔదార్యాన్ని నిరూపిస్తుంది కదా! "అభితః పావకోపమః " అన్నట్లు భగవానుడు అగ్నిలాగా దీప్తికలవాడే. బ్రహ్మచేత ఆరాధింపబడినందువల్ల (ఈ మాటలో) పర్వతమూ అభివ్యక్తమవుతున్నది" అని యాదవాభ్యుదయంలోని దేశికుల శ్లోకాన్ని ఉట్టంకిస్తూ ఆచార్యులవారు, వరదరాజస్వామియే (అర్చామూర్తి) అగ్నియై ప్రకాశించాడని నిరూపించారు.

తత్తత్ప్రదైరుపహితేఽ పి తురంగమేధే
శక్రాదయో వరద పూర్వ మలబ్ధ భాగాః।
అధ్యక్షితే మఖపతౌ త్వయి చక్షుషైవ
హైరణ్య గర్భ హవిషాం రస మన్వభూవన్॥

అనే ఎనిమిదవ శ్లోకంలో "ఓ వరదా! అశ్వమేధయాగంలో ఆయా దేవతలను పేరు పేరున ఉద్దేశించి ఆహుతులను సమంత్రకంగా ఇవ్వడం వైదిక విధి. అయినప్పటికీ యాగవేదినుండి భగవానుడు ఆవిర్భవించడానికి మునుపు ఇతరదేవతలు ఆయా హవిర్భాగాలను పొందలేదు. ఎప్పుడైతే యజ్ఞపరమైన భగవానుడు ఆవిర్భవించాడో అప్పుడు ఇంద్రాది దేవతలు బ్రహ్మ ఇచ్చిన హవిస్సుల రసాన్ని నయనేంద్రియం చేతనే పానం చేశారు" అంటూ దేశికులే అగ్ని శబ్దార్థం భగవత్పర్యంతంగా పర్యవసిస్తుందని తెలిపారు.

బ్రహ్మేతి శంకర ఇతీంద్ర ఇతి స్వరాడి
త్యాత్మేతి సర్వమితి సర్వ చరాచరాత్మన్।
హస్తీశ! సర్వవచసా మవసాన సీమాం
త్వాం సర్వకారణ ముశంత్యనపాయ వాచః॥

అనే పన్నెండవ శ్లోకంలో "ఓ వరదా! వేదాలు, అన్నింటికీ కారణమైన సమస్త పదాలకు ముఖ్య విషయ భూతుడవైన నీవే బ్రహ్మవని, శివుడవని, ఇంద్రుడవని, స్వరాట్ అని, ఆత్మవని, సర్వమని చెపుతున్నాయి" అంటూ దేశికులవారు సర్వపదాలు భగవంతునే తెలియజేస్తాయి అని నిరూపించారు. కనుక మొదటి శ్లోకంలోని "తురగసవన వేద్యాం శ్యామలో హవ్యవాహః= అశ్వమేధయాగవేది యందు ఆవిర్భవించిన నీలవర్ణాగ్ని వరదరాజే" అనే రెండు పదాలలో తర్వాతి శ్లోకములలోని సంక్షిప్తత కనిపిస్తోంది కదా!

ఇక వరదరాజో 'సౌలభ్య- కారుణ్యాది కల్యాణ గుణపూర్ణుడు' అని తర్వాతి శ్లోకాలలో వర్ణించబోయే విషయాలను, 'ద్విరద శిఖరి సీమ్నా' అనే పదంలో సూచించారు.

"(ద్వౌరదౌస్తః ఇతి= ద్విరదః) ఏనుగు అని అర్థం. 'శిఖరి' అంటే పర్వతం. 'సీమ' అంటే (పొలిమేర) ప్రదేశం. 'సద్మ' అంటే మందిరం. కాంచీ పట్టణానికి హస్తిగిరి, కరిగిరి అని నామాంతరాలు.

దిజ్నాగై రర్చిత స్తత్ర పురా విష్ణుః సనాతనః।
తతో హస్తిగిరిర్నామ ఖ్యాతి రాసీన్మ హాగిరేః॥

పూర్వం అక్కడ వెలసి ఉన్న భగవానుణ్ణి దిగ్గజాలు ఆరాధించడం వల్ల ద్విరద శిఖరి, హస్తిగిరి, కరిశైలం అనే పేర్లతో ప్రసిద్ధమైన పర్వతమది. కాబట్టి హస్తిశైలేశుడు అని భగవంతుని అర్చావతారం యొక్క సౌలభ్యం సూచింపబడింది" అని ఆచార్యులవారి వ్యాఖ్య.

ఆ 'పరమాత్మ శ్రియఃపతియే' అనే విషయాన్ని 'కలశజలధి కన్యావల్లరీ కల్పశాఖీ' అనే పాదం ద్వారా సూచించారు దేశికులు. శరణాగతిని చేసే ప్రపన్నుడు తప్పక పురుష కారభూతురాలైన అమ్మవారిని ఆశ్రయించియే స్వామిని శరణాగతి చేయాలి. శరణాగతి రహస్యమును కొన్ని శ్లోకములలో దేశికులు వివరించారు. దానికి సంగ్రహమే ఈ మూడవ పాదము.

ఆయన 'కారుణ్య-వాత్సల్యాది గుణపూర్ణుడు' అనే విషయాన్ని శ్లోకము యొక్క నాల్గవ పాదంలో "కలయతు కుశలం నః కోఽపి కారుణ్యరాశిః" అని సూచించారు. పై విధంగా ఈ స్తోత్రంలోని విషయమంతా మొదటి శ్లోకంలో సంగ్రహంగా సూచింపబడుటయే 'వస్తునిర్దేశ'మంటే.

ఇక వ్యాఖ్యానమంటే 'అజ్ఞాత జ్ఞాపన శీలమై ఉండాలి'. 'సామాన్య బుద్ధి జనకాశ్చ' అనే పదిహేనవ శ్లోకంలోని వివరణ మనకు అనేక విషయాలను తెలుపుతుంది. "సత్, శివాది శబ్దాలు సామాన్య విశేషన్యాయ పరిశీలనచేత నారాయణుడే పరదైవమని బోధిస్తాయి" అని శ్లోక తాత్పర్యం.

"నారాయణీ త్వయి కరీశ! వహన్త్యనన్యం-

సత్, ఆత్మ, బ్రహ్మ, శివాది శబ్దాలు సామాన్య ధర్మం, విశేషధర్మం అనే రెండు ఆకారాలను కలిగియున్నందు వల్ల తత్త్వాంతర భ్రమను నివృత్తి చేస్తూ, యోగవృత్తిచేత నారాయణునియందే అన్వయిస్తున్నాయి. 'పూర్వ పదాత్ సంజ్ఞాయా మగః' అనే వ్యాకరణ సూత్రం ప్రకారం 'నార+అయన' అనే పదాలకు సమాసం

వచ్చినప్పుడు, పూర్వ పదంలోని రేఫ(ర)ను బట్టి, ఉత్తర పదంలోని నకారానికి 'ణ' కారం (ణత్వం) వస్తుంది. ఈ సమాస పదం సంజ్ఞా (నామ) వాచకమైనప్పుడే 'ణత్వం' వస్తుందని నిర్ణయింపబడింది" అంటూ వ్యాఖ్యానించి–

'ఎణ్ పెరక్కన్నలత్తు ఒణ్ పొరుళీరిల వణ్పుగత్త్ నారణన్'

'నారణన్ ముఙు వేణులగుక్కుం నాదన్' వంటి ఆళ్వారు పాశురాలను.

'అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణః స్థితః'

'నరాజ్జాతాని తత్త్వాని నారాణీతి తతో విదుః
తాన్యేవచాయినం తస్య తేన నారాయణః స్మృతః'

వంటి శ్రుతి–స్మృతులను ప్రమాణములుగా చూపించి, ముఖ్యంగా– 'నారాయణ' శబ్దంలోని ఒక్కొక్క అక్షరానికి కూడా అర్థాన్ని వివరించారు.

"(నా) నాస్తిక్య హాని ర్నిత్యత్యం నేతృత్వంచ హరేః పదే।
నాకార సేవినాం నృణాం మంత్రవిద్భిః ప్రకీర్తితః॥

నా ఆకారాన్ని సేవించిన వారికి నాస్తిక్యబుద్ధి తొలగిపోతుంది. నిత్యత్వమేర్పడుతుంది. పరమపదానికి తీసుకోపోబడే స్థితి కలుగుతుందని మంత్రజ్ఞులు తెలుపుతున్నారు.

(రా) రంజనం భగవత్యాశు రాగహాని స్తతోన్యతః।
రాష్ట్ర త్రాణాదికం చాపి ప్రాప్యతే రేఫసేవయా॥

రేఫను సేవిస్తే భగవత్ప్రీతినీ, వైరాగ్యాన్ని, రాష్ట్రరక్షణను పొందుతాడు.

(య) యోగోద్యోగ ఫలంచాశు యకారాత్ ప్రాప్యతే బుధైః।

యకారం వల్ల యోగానుష్ఠాన ఫలాన్ని పొందుతాడు.

(ణ) వర్ణనం చ తథా విష్ణోర్వాణీ సిద్ధిర్ణ కారతః॥

ణ కారం వల్ల విష్ణుమూర్తిని వర్ణించే వాక్శుద్ధి కలవాడవుతాడు. పరదైవమని వేదాలచే నిర్ణయింపబడిన నారాయణుడే కరీశుడు" అని మన్త్ర శాస్త్రంలో 'నారాయణ' అనే పదంలోని నాల్గు అక్షరాలను ఉచ్చరించి, ఉపాసిస్తే చెప్పిన ప్రయోజనాలను వివరించటం వ్యాఖ్యాతకు మన్త్రశాస్త్రంలో ఉన్న ప్రజ్ఞను తెలుపుతుంది. 'అన్వర్థ పరికల్పితమైన కంఠ్యమ్' శ్లోక పాదానికి "సాక్షాదప్య విరోధం జైమినిః" అనే బ్రహ్మ సూత్రాన్ని ఉటంకిస్తూ "అగ్నిశబ్దం సాధారణంగా జ్వలించే ఇతర పదార్థాలను తెల్పునదే అయినా పరమాత్మకు ఉండే అగ్రనయనాది గుణంచేత– శ్రీవైకుంఠానికి ముందు ఉండి తీసుకొనిపోయే నిరుపాధికంగా అసాధారణ గుణాలను తెల్పే శబ్దాలచే విశేషింపబడటంచేత– అది సాక్షాత్తుగా పరమాత్మనే తెల్పుతున్నదని, పూర్వమీమాంసా శాస్త్రకర్తయైన 'జైమిని' అనే మహర్షి విరోధమేమీ లేదన్నాడని వ్యాస భగవానుడు తెల్పినాడు" అని సూత్ర వివరణ చేస్తూ, సత్, ఆత్మ, బ్రహ్మ, శివాది శబ్దాలకు 'భాగపశున్యాయం' చేత విశేష ధర్మాన్నిబట్టి ఐకకంఠ్యము సంభవిస్తుందని విశదీకరించారు.

'సంచింతయన్నఖిలహేయ విపక్షభూతం' అనే తర్వాత శ్లోకంలో భగవంతుని దివ్యస్వరూపాన్ని వర్ణిస్తూ, ఆయనకు 'శాంతోదిత దశ', నిత్యోదిత దశ' అనే రెండు దశలుంటాయని దేశికులు చెప్పిన దానిని వివరిస్తూ-

" 'శాంతోదితావస్థ' అంటే 'విభూత్యనంతర్భావేన స్వస్వరూపానుభవదశా'= తన విభూదిలో చేరని తన స్వరూపమును అనుభవించే స్థితి, 'నిత్యోదితావస్థ' అంటే, 'సర్వభూత్యనుభవ దశా'= తన విభూతి (ఐశ్వర్యం) నంతటినీ అనుభవించే దశ- అని పారిభాషికం. 'నిరూఢ లక్షణ' అని సంప్రదాయం" అని విశదం చేశారు. అనగా, పరమాత్మ ఉభయ విభూతులను కలిగినవాడు. నిత్యవిభూతిలో 'నిత్యోదిత దశ' లీలావిభూతిలో 'శాంతోదిత దశ' ఉంటుందట. ఈ శ్లోకాన్ని వివరించేటప్పుడు ఆచార్యులవారు, కూరత్తాళ్వార్ వరదరాజస్తవంలోని 'ప్రశాంతానంతాత్మా' అనే శ్లోకాన్ని- 'అతిపతితావధి' అనే సుందర బాహుస్తవ శ్లోకాన్ని ఉట్టంకించి భగవంతుని దివ్యాత్మ స్వరూపాన్ని దర్శింపజేసారు.

అలాగే ఈ స్తోత్రంలోని పంతొమ్మిదవ శ్లోకం వ్యాఖ్యా సాపేక్షమయినది. పాంచరాత్రాగమ శాస్త్రంలో ప్రసిద్ధమైన 'విశాఖయూప' మనే భగవంతుని రూపాన్ని చెప్పే శ్లోకం. దీనిని ఆచార్యులవారు సప్రామాణికంగా వివరించిన తీరు ప్రశంసనీయం.

ఉపాసకుల హృదయమందు జ్ఞానమయమైన, గంట్లతో గుత్తిగా ఉండే గడ్డిపోచను పోలిన 'విశాఖయూపం' అనే రూపాన్ని పొంది భగవంతుడుంటాడట. ఆయన తన ఇచ్ఛా శక్తిచే తన్ను నాలుగు శాఖలుగా విభజించుకొని, నాలుగు రూపాలుగా వెలసియుంటాడు. సమాధియోగంలో జాగ్రత్-స్వప్న- సుషుప్తి- తురీయావస్థలను పొందుతూ సత్త్వగుణ శాలురైన ఉపాసకులు ఏకాగ్రచిత్తంతో అట్టి భగవంతుని రూపాన్ని ధ్యానిస్తారట.

పౌష్కర సంహితలోని ప్రమాణాన్ని చూపుతూ, శ్రీవైకుంఠంలోని 'విశాఖయూపం' వంటి ఆకారమును ధరించి భగవంతుడు 'వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ' అనే వ్యూహరూపములతో జాగ్రత్-స్వప్న- సుషుప్తి- తురీయావస్థలలో ఉపాసకుల హృదయగుహలో ఉండి ధ్యానింపబడుతుంటారని ఒక వృక్షానికి మూలం నుండి అగ్రం వరకు నాల్గు దిక్కులలో నాల్గు కొమ్మలుంటే ఎలా ఉంటుందో అలాగే, జాగ్రదవస్థలో నాల్గుమూర్తులు, స్వప్నావస్థలో నాల్గు, సుషుప్తిలో నాల్గు, తురీయంలో నాల్గు మూర్తులుగా మొత్తం పదహారు మూర్తులను కల్గిన విశాఖయూపం వలె యోగుల హృదయంలో వరదరాజస్వామి యొక్క మూర్తి ఉంటుందని ఆచార్యులవారు హృద్యంగా నిరూపించారు.

ప్రతి శ్లోకానికి ప్రతిపదార్థం, సంక్షిప్తంగా తాత్పర్యం, విశేషవ్యాఖ్యతో పఠించినవారికి దేశికుల హృదయం అవగతమై, అనేకములైన శ్రుతి-స్మృతీతిహాస పురాణాగమాదులలోని విషయములు తేట తెల్లమవుతూ అనుభవానంద స్థాయికి చేర్చే గొప్ప వ్యాఖ్యానం ఆచార్యుల వారిది. వారి వైదుష్యమును గూర్చి నావంటివారు చెప్పటమంటే సూర్యునిముందు దివిటీ వంటిదే అవుతుంది. వర్ధమానులైన వారికి సంప్రదాయమందు, సంస్కృత వాఙ్మయమందు పరిపూర్ణమైన జ్ఞానమును కలిగించేవి వీరి రచనలు. ఆచార్యుల వారి ఔదార్యానికి 'నమ ఉక్తిం విధేమ' అని మాత్రమే చెప్పగలము.

స్వస్తి-

శ్రీ అచ్యుత శతకము

డా॥ అద్దంకి శ్రీనివాస్
చరవాణి: 9848 881 838

ఏకస్య తిష్ఠతి కవేః గృహే ఏవ కావ్యం- అంటూ రాజశేఖర కవి కావ్యమీమాంసలో ఏది ఉత్తమ రచనో చెప్పకనే చెప్పాడు. కొన్ని పుస్తకాలు కవి ఇంటికీ అంటే రాసినవాడి ఇంటికే పరిమితమై పోతాయట. ప్రచురణకు కూడా నోచుకోవని, ప్రచురణయోగ్యాలు కావనీ. కొన్నైతే ఎలాగో ప్రయాసపడి ఓపిక చేసుకొని మిత్రుల ఇళ్ళదాక వెళ్తాయి. అంటే అక్కడితో సరి. ఇవేవీ ఉత్తమ రచనలు కావు. కొన్ని పుస్తకాలు మాత్రమే ఆ నోటా, ఈ నోటా ఎల్లలు దాటి విశ్వాన్ని చుట్టిరావాలనే కుతూహలంతో సంచరిస్తాయి. అలా సంచరించగల పుస్తకాలు కొన్నే ఉంటాయి. వాటిలో శ్రీమాన్ కె.వి.రాఘవాచార్యస్వామి వారు అచ్యుత శతకానికి సాయించిన వ్యాఖ్యా రచన ఒకటి. ఇలా చెప్పడానికి నిరూపించడానికి హేతువులు చాలానే ఉన్నాయి. వాటిలో కొన్నింటిని మనవి చేస్తాను.

ప్రపంచంలో అన్నింటికంటే క్లిష్టమైన, కష్టమైన పని ఏది? అంటే వ్యాఖ్యారచన అని నిర్ద్వంద్వంగా చెబుతాను. తత్రాపి సాహిత్య గ్రంథాలకు చేసే వ్యాఖ్య, ఆ సాహిత్యానికి సంప్రదాయమూ, వేదాంతమూ ఉభయదేవేరుల్లా ఎదలో చేరితే ఇక ఆ వ్యాఖ్యాత పడవలసిన పాట్లు అన్నీ ఇన్నీ కావు.

వ్యాఖ్యారచన అసిధారావ్రతం. నిబద్ధత, పక్షపాతరాహిత్యం, నిగ్రహం, మర్యాద వగైరాలు వ్యాఖ్యాతృ లక్షణాలు. కవి హృదయాన్ని ఒడుపుగా ఒడిసిపట్టుకోవడం, శాస్త్రాంశాలలో చిక్కుకుపోయిన భావాలను కట్లువిప్పి పాఠకాంశంలోనికి నేర్పుగా ఎగరవేయగలగడం.

ఎంత చెప్పాలో ఎంతవరకూ చెప్పాలో అంతే అంతవరకే చెప్పడం ఇలాంటివన్నీ లక్షణాలు. భాష, ఛందస్సు, అలంకారాలు, శబ్దవ్యాప్తి, అర్థవిస్తృతి ఇలా ఒకటేమిటి కావ్యసామగ్రి నరనరాల్లో జీర్ణించుకుపోయిన వాడే నిజమైన వ్యాఖ్యాత అనిపించుకుంటాడు. మళ్ళీ ఆయా భిన్నాంశాలపై వ్యాఖ్యాతకు ఉండే అవగాహనా శాతంపై వ్యాఖ్య నాణ్యత ఆధారపడి ఉంటుందని వేరే చెప్పనక్కర్లేదనుకుంటా. ఈ లక్షణాలన్నీ ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే- వేదాంత దేశికుల వారు ప్రాకృతంలోనూ సంస్కృతంలోనూ రచించిన 'అచ్యుతశతకమ్' అనే గ్రంథానికి శ్రీమాన్ కె.వి.రాఘవాచార్యులవారి వ్యాఖ్య చూసినందువల్ల. ఈ వ్యాఖ్య వ్యాఖ్యాతృమండలికి ఒక మాన్యువల్ లాంటిదని అనిపించినందువల్ల.

వేదాంత దేశికులవారు సరళసుందరమైన సంస్కృతచ్ఛాయతో ప్రాకృతభాషలో రచించారు ఈ శతకాన్ని. అసలు చిక్కంతా ఇక్కడే ఉంది. ప్రౌఢబంధురమైన రచనకు ఒకరకంగా వ్యాఖ్యానం చేయడం సులభమే. ఎందుకంటే కవి దృష్టి ప్రౌఢిమ మీదికి వెళ్ళి తక్కినవాటిపై వెళ్ళకుండా పక్కకు మళ్ళుతుంది. ఆ ప్రయత్నంలో

కవిహృదయం ఇట్టే పట్టుకోవచ్చు. కానీ సరళంగా రాసిన రచనకు వ్యాఖ్యానం చేయడమంటే ఎంతో కష్టం. తేలిక మాటల్లో బరువైన భావాలు అగాధాల్లాంటి శాస్త్రవిషయాలు ఇముడ్చుకొనేలా కవి ఏదో ఒక ప్రత్యేకత చూపించడానికి ప్రయత్నం చేస్తాడు. దానిని పట్టుకోని వ్యాఖ్యాత నూటికి రెండువందల పాళ్ళు విఫలుడై పోతాడు. ఉదాహరణకు ఈ శ్లోకం చూడండి. దేశికులవారు–

"మోక్ష సుఖ వృక్షమూలం
మోహజరాతుర మహారసాయన ప్రవరమ్
సకల కుశలైక క్షేత్రం
కింకర సత్య! తవ కీర్తన మమృత నిభమ్"

కింకరసత్యా! నీ నామసంకీర్తనం మోక్షసుఖం అనే వృక్షానికి మూలం లాంటిది అన్నారు. ఈ వాక్యం ఎవరికి అర్థం కాదు. మరి దీనికి వ్యాఖ్య అవసరమా? అని అనిపించవచ్చు. కాని ఇక్కడ రాఘవాచార్య స్వామివారు కవిహృదయాన్ని శబ్దప్రయోగాలద్వారా ప్రతీకలద్వారా ఆవిష్కరిస్తారు. మోక్షసుఖం ఒకటే కాదు. అది అనేక విధాలుగా ఉంటుంది. అందుకే వృక్షానితో పోల్చడం. వృక్షానికి చెట్టు, కాండం, కొమ్మలు, రెమ్మలు ఇలా అంతర్విభాగాలు ఉంటాయో, మోక్షసుఖమూ అనేక రూపాలతో ఉంటుంది. ఇది ఎన్ని విధాలుగా ఉన్నా దానికి మూలమైన నామసంకీర్తన ఒక్కటే. అందుకే చెట్టుతో పోలిక. పైకి అనేక విభాగాలుగా చెట్టు కన్పిస్తున్నప్పటికీ మూలమైన వేరు మాత్రం ఒక్కటే. ఇంతటి ఆంతర్యాన్ని కవిహృదయం నుండి ఉదయించేలా సాగింది రాఘవాచార్యస్వామి వారి వ్యాఖ్యానం.

వ్యాఖ్యాతకు ఉండవలసిన మరో ప్రధానలక్షణం స్వీయ నియంత్రణ, నిగ్రహం. అసలు వ్యాఖ్యాత చేయవలసిన పని ఏమిటయ్యా అంటే రచనలోని అర్థాన్ని యథాతథంగా ఉన్నది ఉన్నట్లు చెప్పడం. అందచందాలు చెప్పడం, ఔచిత్యాలు, చమత్కారాల జోలికి పోవడం వ్యాఖ్యాత పని కాదు. అది పెట్టుకొంటే ఆ వ్యాఖ్య కొండవీటి చాంతాడంత అవుతుంది. అదంతా విమర్శకుల పని. ఈ వ్యాఖ్యానంలోనూ రాఘవాచార్యస్వామి మల్లినాథసూరి మాటల్ని తు.చ.తప్పకుండా పాటించారు. మూలానికి అర్థం చెప్తూ ఆ అర్థం స్ఫోరకంగా ఉండేలా సంస్కృత వేదాంతాన్నీ, ద్రవిడ వేదాంతాన్నీ ఉట్టంకించారు. ఇది తత్త్వగ్రంథం కాబట్టి ఆ సంప్రదాయాన్ని సూచిస్తే తప్ప అర్థం అన్వయం కుదరదు. అందుకే అల్పాక్షరంబుల అనల్పార్థ రచనలా వీరి ఉట్టంకింపు ఉంది. దీనికి కారణం వీరిలోని నిగ్రహగుణమే.

చూడడానికి సరళంగా ఉన్నా అచ్యుతశతకంలోని ప్రతి శ్లోకమూ ఏదో ఒక శ్రుతి వచనాన్ని అంతర్భావితం చేసుకొనే ఉంటుంది. బ్రహ్మసూత్రాధికరణ న్యాయాలు, ఉపనిషద్వచనాలు, పురాణాంతర్గతార్థాలు, దార్శనిక తత్త్వాలూ మినహాయింపు కాదు. వీటన్నింటినీ సావధానంగా సంప్రదాయబద్ధంగా సహేతుకంగా సప్రమాణంగా వ్యాఖ్యాత అన్వయించి అనుసంధానించినారు. 'జీవన్ముక్తః సదృశాః' అనే శ్లోకంలో జీవన్ముక్త పదవివేచన ద్వారా సంప్రదాయ రహస్యాన్ని ఆవిష్కరించారు. సత్యశబ్ద వాచ్యుడు, దాస్యసత్య, కింకరసత్య,

నతసత్య ఇత్యాది విశేషణాలకు విశేష్యుడైన ఆ శేషశాయి తత్త్వాన్ని ఆయా పదాల ఆధారంగా వ్యాఖ్యాత విశ్లేషించిన తీరు అమోఘం.

కేవలం సంస్కృతం వస్తే చాలదు. నిజానికి ఇది ప్రాకృత రచన. దానికి సంస్కృతచ్ఛాయ అని సంస్కృతంలో రచించారు. ఇప్పుడు వీరి వ్యాఖ్య దేనికి? ప్రాకృతమూలానికా? సంస్కృతచ్ఛాయకా! అంటే ప్రాకృతంనుండి సంస్కృతంలోనికి చేసే అనువాదంలో పెద్దగా అంతరువులు లేకపోయినా వాటిని గమనిస్తూ తెలుగులోనికి ఆ భావాలను అందించడం క్లిష్టమైన కార్యమే. ఇది బహుభాషా పాండిత్యం, కావ్యౌచిత్యం, సంప్రదాయజ్ఞత– మూడూ ఉన్నవారికి మాత్రమే సాధ్యపడే అంశం. అది తెలుగు వారి భాగ్యమా అన్నట్లుగా శ్రీ రాఘవాచార్యస్వామివారి చేతికి అంది మనదాకా మన అదృష్టంకొద్దీ వచ్చింది. తెలుగులో విపులమైన ఈ వ్యాఖ్య నిజంగా పేరుకు తగ్గట్టు జ్యోతిర్మయి. మంధాచలంలాంటి ధిషణ, అచంచలదీక్ష, అద్భుతమైన ధారణ, సంప్రదాయానురక్తి, ధర్మాసక్తి, బహుముఖీనమైన ప్రతిభాపాటవాలు, సంస్కృత ద్రావిడ గ్రంథాలలోన విషయాలను అలవోకగా అన్వయించి చూపగల పాండిత్యం– ఒకటేమిటి రాఘవాచార్యస్వామి శేముషి అచ్యుత శతకాన్ని అంతరంగావిష్కరణ చేసిందని చెప్పవచ్చు.

సర్వతంత్ర స్వతంత్రులు, కవితార్కిక కేసరి వేదాంతాచార్యులు అనే బిరుదులు కల శ్రీమద్వేంకటనాథులు శ్రీవైష్ణవ వాఙ్మయంలో ఒక మహాసముద్రం. ఆ సముద్రాన్ని ఈదడానికి కావలసిన అందమైన ఒక వ్యాఖ్యానావను అచ్యుతశతక జ్యోతిర్మయీ నామధేయంతో 'లోనారసి' లోకానికి అందించిన శ్రీమాన్ రాఘవాచార్యస్వామి వారు ధన్యులు.

శ్రీ రుక్మిణీ కల్యాణము-వైష్ణవీ వ్యాఖ్య

గన్నమరాజు గిరిజామనోహరబాబు
చరవాణి: 9949 013 448

ఒక మహాగ్రంథాన్ని అవగాహన చేసుకోవాలన్నప్పుడు తత్సంబంధమైన గ్రంథ గ్రంథుల్ని విడమరచి చెప్పగలిగే వ్యాఖ్యాత అవసరం పాఠకునికి ఉంటుంది. కేవలం టీకా తాత్పర్యాలకే పరిమితమైన రచనల ద్వారా కలిగే అవగాహన కూడా అంతవరకే సీమితమైపోతుంది. అది జిజ్ఞాసువులైన పాఠకులకు తృప్తినివ్వదు. మహాకవులు వారి కవితాహృదయాన్ని తమ తమ కావ్యాల్లో నిక్షిప్తం చేయడం సర్వసామాన్య విషయం. వారి హృదయావిష్కరణ జరగాలంటే వ్యాఖ్యాతల సహకారం ఎంతో అవసరం. సమగ్రమైన వ్యాఖ్యానాలు ఉన్నప్పుడు ఆయా మహాకవుల అంతరంగాల్ని ఏ పాఠకుడైనా క్షుణ్ణంగా అర్థం చేసుకోగలిగే అవకాశం ఉంటుంది. అందుకనే మన సాహిత్యం వ్యాఖ్యాతలకు పెద్దపీట వేసింది. సంస్కృత సాహిత్యాన్ని అధ్యయనం చేసే ప్రతి సాహితీ ప్రియునికి వ్యాఖ్యాతల వల్ల ఎటువంటి ప్రయోజనం ఉంటుందో స్పష్టంగా తెలుస్తుంటుంది. వ్యాఖ్యాతృసార్వభౌమునిగా ప్రశస్తి గడించిన మల్లినాథ సూరికి సంస్కృత సాహిత్య ప్రపంచంలో ఎంతటి స్థానం ఉందో మనకు తెలిసిందే. మహాకవుల సరసన నిలబడగలిగే స్థాయినిచ్చారు సాహిత్య చరిత్రకారులు. ఒక్కోసారి వ్యాఖ్యాతల స్థాయినిబట్టి కవి రచనను నిర్ణయించేవారు. ఆ నిర్ణయాన్నిబట్టి ఆలోచిస్తే వ్యాఖ్యాత ఎంత ప్రామాణికుడో అతని స్థాయి ఎంతటిదో అర్థమవుతుంది.

తెలుగు సాహిత్యంలో కూడా తొలి తరాల్లో ఈ వ్యాఖ్యాతృ సంప్రదాయం కనిపిస్తుంది. ఆముక్తమాల్యద, శృంగార నైషధము, పారిజాతాపహరణము, మనుచరిత్రము, విజయవిలాసము వంటి ప్రబంధాలు వ్యాఖ్యా సహితాలై ప్రాచీన కవుల ప్రతిభకు దర్పణం పడుతున్నాయి. ఈ సంప్రదాయాల్ని కొనసాగించి మనకు అనేక విషయాలను అందుబాటులోకి తెచ్చిన మహనీయులు కీ॥శే॥ శ్రీమాన్ కె.వి.రాఘవాచార్యుల వారు. వారి ప్రతిభను తేటతెల్లం చేస్తున్న వ్యాఖ్యాన గ్రంథాలు తెలుగువారికి నిత్యపారాయణ గ్రంథాలు.

(సాధారణంగా మహాకవుల కావ్యాలకు వ్యాఖ్యానాలు రావడం పరిపాటే. కాని శ్రీమాన్ ఆచార్యులవారు వ్యాఖ్యానించిన గ్రంథాలలో విశిష్టాద్వైత సిద్ధాంత సంబంధులైన పలు ప్రామాణిక రచనలు ఉండటం గొప్ప విశేషం. వీటిని వ్యాఖ్యానించడానికి శాస్త్ర ప్రతిభతోబాటు ఆయా సిద్ధాంతాలలో కూడా గొప్ప ప్రతిభాపాండిత్యాల అవసరం ఉంటుంది. వారు శ్రీరంగనాథ పాదుకా సహస్రానికి అందించిన రమణీయాంధ్ర టీకా తాత్పర్య సహిత వ్యాఖ్యానం కాని, యతిరాజ సప్తతికి అందించిన చంద్రికా వ్యాఖ్యానం కాని, దయా శతకానికి అందించిన అమృతాస్వాదినీ వ్యాఖ్యానం కాని, శ్రీ సుదర్శనాష్టకానికి అందించిన జ్వాలా వ్యాఖ్య కాని, శ్రీనారాయణ శతకానికై రచించిన రాఘవీయ వ్యాఖ్య కాని, శ్రీ రుక్మిణీ కల్యాణానికి రచించిన వైష్ణవీ వ్యాఖ్య కాని, ఇటీవల వారు యాదవాభ్యుదయానికి అందించిన సుబోధినీ వ్యాఖ్య కాని, ప్రతి రచన పాఠకునిలో కొత్త కొత్త విజ్ఞాన దీధితులను ప్రసరింపజేస్తుంది. ఇవి కాక శ్రీ స్తుతికి హిరణ్మయీ వ్యాఖ్య, న్యాసవింశతికి

శ్రేయసీ వ్యాఖ్య, అభీతి స్తవానికి సంజీవనీ వ్యాఖ్య, ద్రవిడోపనిషత్తాత్పర్య రత్నావళికి ప్రకాశికావ్యాఖ్య వంటి వ్యాఖ్యానాలే గాక ఆళ్వార్లు- భక్తిప్రపత్తి మార్గాలుగా, భగవద్విషయ ఆంధ్రానువాదం మొదలైన పలురచనలు అందించిన ప్రతిభామూర్తి శ్రీమాన్ రాఘవాచార్యులవారు సంస్కృత మహాకవియైన మాఘుని కావ్య విశేషాలను తెలిపే మాఘ కావ్యవైభవము- వారికి కేవలం శాస్త్ర గ్రంథాలే గాక మహా కావ్యాలను దర్శింపజేయగలిగిన అపార ప్రతిభ ఉందన్న విషయం అవగతమవుతుంది.) వారి సాహిత్య జీవితమంతా మహామహుల రచనల్లోని లోతులను తెలుగు సాహితీప్రియులకు తెలపాలన్న కోరికతో తపస్సు చేసినట్టు వారి రచనలే మనకు తెలుపుతున్నాయి.

భాగవతము తెలిసి పలుకుట చిత్రంబు
శూలికైన తమ్మి చూలికైన...

అన్నాడు పోతనామాత్యుడు. ఆ "తెలిసి పలుకడం" ఏమిటో తెలియజెప్పిన వ్యాఖ్యానమే కీ॥శే॥ శ్రీమాన్ కె.వి. రాఘవాచార్యులవారు భాగవతాంతర్గతమైన రుక్మిణీ కల్యాణానికి అందించిన వైష్ణవీ వ్యాఖ్య. "విబుధ వరుల వలన" పోతన్న ఏమి విని ఉంటాడో, ఆయన హృదయాంతర్గతమైన భావాలు ఎటువంటివో విస్తృతంగా చెప్పే గ్రంథమిది.

మహాభాగవతంలో కొన్ని ఘట్టాలకు కావ్య ప్రతిపత్తి ఉందని పెద్దలు చెబుతుంటారు. ప్రహ్లాద చరిత్రము, వామన చరిత్రము, రుక్మిణీ కల్యాణము, గజేంద్ర మోక్షము వంటి అపురూపమైన ఘట్టాలు భక్తి పరిపూరితాలై మన గుండెల్లో చిరస్థాయిగా నిల్చిపోయిన స్వతంత్ర కావ్యరూపాలు. ఉన్నది భాగవతంలోనే కాని వాటికున్న శక్తి ఎంతటిదో ఆయా ఘట్టాల్లోని పలు పద్యాలు ప్రజల నాలుకలపై శాశ్వతంగా నిలవడమే గాక, హృదయగతాలై నిల్చిపోయిన తీరే తెలుపుతుంది. అటువంటి ఘట్టాల్లోని రుక్మిణీకల్యాణ ఘట్టాన్ని, అందులోని స్వారస్యాలను, పోతన హృదయాన్ని, భాగవత తత్త్వాన్ని, రచనా వైఖరిని, పద ప్రయోజనాలను, శబ్ద సంయోజనను గురించి విపులంగా వ్యాఖ్యానించిన వైష్ణవీ వ్యాఖ్య పాఠకుని హృదయ కవాటాలను తెరచి పలు విశేషాలను దర్శింపచేస్తుంది.

సాధారణంగా వ్యాఖ్యానాన్ని కేవలం అర్థ తాత్పర్యాలకే పరిమితం చేయకుండా శ్రీమాన్ ఆచార్యులవారు పోతన పద్యాలకున్న వైశిష్ట్యాన్ని విపులమైన రీతిలో చర్చించారు. ఈ రుక్మిణీ కల్యాణాన్ని, దానికి విపులమైన వైష్ణవీ వ్యాఖ్యను పరిశీలిస్తే వ్యాఖ్యాన పద్ధతులు ఏమిటి? అని పాఠకునికి అవగతం అవుతుంది.

రుక్మిణీ కల్యాణంలో మొదటి పద్యం-

శ్రీకంఠ చాపఖండన/ పాకారి ప్రముఖ వినుత భండన, విలసత్
కాకుత్స్థ వంశమండన/ రాకేందు యశోవిశాల రామనృపాలా!

అన్నది. ఒక విధంగా ఇది నాందీ పద్యం వంటిది. శ్రీరామచంద్రుని స్తుతించిన ఈ పద్యానికి ఆచార్యులవారు రచించిన వ్యాఖ్య ఒక్కటిచాలు వారి ప్రతిభావ్యుత్పత్తు లెంతటివో తెలుసుకొనవచ్చు. అంతేకాదు ఒక గ్రంథానికి వ్యాఖ్యానం చెయ్యాలనుకునే వారికి ఈ పద్యం మార్గదర్శనం చేస్తుంది.



సాధారణంగా కావ్యప్రారంభంలోని మొదటి పద్యం తమ కృతిపతికి భగవంతుడు సమస్త ఐశ్వర్యాలను ప్రసాదించాలని ప్రార్థిస్తూ ఉంటుంది. భాగవతం భగవదంకితమే గనుక ఇక్కడ మనకు రామచంద్ర స్తుతి కనిపిస్తుంది. కాని ఇందులో శ్రీకృష్ణస్తుతి కూడా ఉన్నట్లు శ్రీమాన్ ఆచార్యులవారి వ్యాఖ్యానం నిరూపిస్తున్నది. పోతన ఈ పద్యంలో ప్రయోగించిన శబ్దాల్లోని వివిధ అర్థాల్ని సమన్వయపరచటం వల్ల ఈ భావం కూడా పాఠకుడు అందుకోవచ్చు. ఆయా పదాల విభజన ఎట్లా జరగాలి, ఏ పదానికి ఏ అర్థాన్ని ఎప్పుడు స్వీకరించాలన్న విషయాలను ఆచార్యులవారు విపులంగా రచించారు. వివిధ గ్రంథాలపై వారికున్న సమగ్ర అధికారం, వారికున్న పాండితీ ప్రాభవం ఈ ఒక్క ప్రారంభ పద్యంలోనే మనకు స్పష్టమౌతుంది. శాస్త్రపాండిత్యం తలస్పర్శిగా కలిగినవారు మాత్రమే ఇటువంటి వ్యాఖ్య అందించి పద్యాన్ని అన్వయించగలరు.

భాగవత దశమ స్కంధం ఒక ప్రత్యేక కావ్యస్వరూపం కలిగింది. కల్యాణ స్ఫురణ కలిగే విధంగా శ్రీ సీతారాముల వారి కల్యాణ ఘట్ట సందర్భంలోని శివధనుఃఖండ విషయాన్ని సూచించే రీతిలో "శ్రీకంఠ చాపఖండన" శబ్దాన్ని కవి ప్రయోగించినట్లు వ్యాఖ్యాత భావించారు. ఈ యుక్తి యుక్తమైన యోచన పోతన భాగవత ప్రశస్తిని పదింతలు చేసింది. శ్రీకంఠుడు అంటే విషము కంఠమునందు కలిగినవాడు శివుడు అన్న అర్థం వెంటనే పాఠకునికి స్ఫురిస్తుంటుంది. ఆచార్యులవారు మరో ఆసక్తికరమైన మనకు అంతగా తెలియని మరొక విశేష కథనం తమ వ్యాఖ్యలో తెలిపారు. శ్రీకంఠునికి ఆ పేరు వచ్చిన తీరును గురించి తెలియజెప్పిన ఆ విశేషం పాఠకుని తెలివికి అదనపు చేర్పు.

ఈ ఘట్టం శ్రీకృష్ణపరమాత్ముడు రుక్మిణిని వివాహం చేసుకునే కల్యాణాత్మకమైన విష్ణుకథ. ఇందులోని మొదటి పద్యం సీతారాముల కల్యాణ విషయం స్ఫురించే రీతిలో పాఠకునికి అర్థమవుతుంది. దీన్ని నాంది పద్యంగా భావిస్తే "ఆశీర్నమస్క్రియా వస్తు నిర్దేశాలు" ఏ విధంగా నిక్షిప్తం చేయబడ్డాయో ఆచార్యులవారు సవిస్తరంగా చర్చించారు. పద్యం చిన్నదే కాని ప్రయోగించిన శబ్దాలకున్న విశేషార్థాల కారణంగా కృష్ణస్వామి కల్యాణమూ ధ్వనించే తీరు మనోహరం. ఈ పద్య వ్యాఖ్యానంలో ఇది శ్రీకృష్ణపరంగా ఏ విధంగా సమన్వయ పరచవచ్చునో తెలిపి వ్యాఖ్యాన ప్రాశస్త్యానికి దర్పణం పట్టారు. దశమస్కంధంలోని శ్రీకృష్ణలీలలను సూచిస్తూ చేసిన వస్తునిర్దేశం ఇందులో ఏ రీతిలో ఉందో వివరించారు. "శ్రీఖండనుడు", "కంఠఖండనుడు", "చాపఖండనుడు"గా కృష్ణపరమైన విశేషాలను తెల్పుతూ "శ్రీకంఠచాపఖండన" శబ్దప్రయోగపు ప్రయోజనాన్ని తెలిపి భాగవత కథా విశిష్టత, పోతన కవితావైదుష్యము మనకు దర్శింపజేశారు శ్రీమాన్ రాఘవాచార్యులవారు.

ప్రతి పద్యంలో బమ్మెరపోతన చూపిన ప్రతిభను ఎత్తిచూపిన భాగవతంలోని పద్యాలలో పోతన ప్రయోగించిన శబ్దాలకే ఒక ప్రత్యేకత ఉంది. సాధారణంగా శబ్దాలంకార ప్రయోగాలకు పోతన పెట్టింది పేరు. ఆయన కవిత్వంలో అర్థాలంకారాలు ఎంత శక్తిమంతంగా ప్రయోగించారో శబ్దాలంకారాలను కూడా అంతే శక్తిమంతంగా, ఔచితీమంతంగా ప్రయోగించగలడని ప్రతీతి. ఆయన శబ్దప్రయోగాలను గురించి వైష్ణవీ వ్యాఖ్యలో పలుచోట్ల శ్రీమాన్ ఆచార్యులవారు ఆ ప్రయోగాల ఔచిత్యాన్ని గురించి విపులంగా చర్చించారు. ఆ వ్యాఖ్యానాన్ని చదివినప్పుడు వ్యాఖ్యాత శబ్దరహస్యం క్షుణ్ణంగా తెలిసిన వాడన్న విషయం స్పష్టమౌతుంది. "కన్నియమీద నా తలపు గాఢము..." అన్న పద్యం (26వ పద్యం)లో కవి అగ్నిద్యోతనుని గురించి "విద్వన్నుత!"

అనే సంబోధనను ప్రయోగించాడు. శ్రీకృష్ణుని మాటుగా ప్రయోగించిన ఈ శబ్దప్రయోగ స్వారస్యాన్ని ఆచార్యులవారు గొప్పగా విశ్లేషించారు. శాస్త్రాలను అధ్యయనం చేసి లౌకిక పారలౌకిక జ్ఞానాన్ని ఆర్జించిన వారు మాత్రమే విద్వాంసులని, వాళ్ళచేత నుతింపబడే వ్యక్తి ఎంతటివాడో విస్తృతంగా వ్యాఖ్యానించారు. అదేవిధంగా "జగతీ సురేశ్వర సంతోష చిత్తుండ..." (16) – అనే పద్యంలో "సంతోష" శబ్దం ద్విజులకు ఎట్లా సార్థకమౌతుందో ప్రమాణాలతో నిరూపించారు. "తగు నీ చక్రి విదర్భరాజ సుతుకున్..." (42)– అనే పద్యం చివర్లోని "పుణ్యమూలంబునన్" అని పోతన ప్రయోగించిన శబ్దంలోని స్వారస్యాన్ని శ్రీమాన్ ఆచార్యులవారు వివరించిన రీతి పాఠకునిలో పోతన శబ్దప్రయోగశక్తి ఎంతటిదో తెలుపుతుంది.

ఈ రుక్మిణీ కల్యాణ వైష్ణవీ వ్యాఖ్యలోని "అలినీలాలక..." (46), "కనియెన్ రుక్మిణి..." అనే రెండు వరుస పద్యాలకు శ్రీమాన్ ఆచార్యులవారందించిన వ్యాఖ్యానం అపూర్వం. రుక్మిణీ కృష్ణుల ఆనుకూల దాంపత్యాన్ని స్ఫురింపజేసే ఈ పద్యాలలోని సౌందర్యాన్ని సామాన్య పాఠకునికి హృదయగతం కావాలన్న రీతిలో విశ్లేషించారు. రెండు పద్యాల్లో వారిద్దరికీ కవి వాడిన విశేషణాలలోని సౌందర్యమేమిటో విస్తృతంగా వివరించారు. విశేషణ పదసంఖ్య ఆ పరమాత్ముణ్ణి ఏ విధంగా ధ్వనింపజేస్తుందో కూడా చెప్పడం వ్యాఖ్యాత ప్రతిభకు తార్కాణం.

ఇందులో ప్రసిద్ధమైన మరో పద్యం "మా సరివాడవా? మా పాపగొనిపోవ..." (55) రుక్మిణిని తీసుకొని వెళుతున్న శ్రీకృష్ణుని నిందిస్తూ రుక్మి చెప్పిన ఈ పద్యంలో స్తుతి కూడా అంతర్గర్భితంగా ఉన్న సంగతిని విపులంగా వెల్లడించారు వ్యాఖ్యాత. నిందాస్తుతిలో పద్యరచన చెయ్యడం తెలుగు కవులకు కొట్టినపిండి. ఈ విషయంలో పోతన కూడా ఏమీ తక్కువ కాదన్న రీతిలో ఈ పద్యం ఉందని తెలిపారు. నిందాస్తుతుల విశేషాలను తెలియజెప్పడానికి వ్యాఖ్యాతకు అపారమైన ప్రతిభతోబాటు, గొప్ప వ్యుత్పన్నత కూడా అవసరం. ఈ పద్యవ్యాఖ్యానాన్ని పరిశీలిస్తే శ్రీమాన్ రాఘవాచార్యులవారు ఎంతటి ప్రతిభాసంపన్నులో, అంత వ్యుత్పన్నత కలిగిన మహా మహులని తెలుస్తుంది.

ఏ గ్రంథాన్ని వ్యాఖ్యానించాలన్నా, ఆ వ్యాఖ్యానానికి ఒక సమగ్రత రావాలన్నా వ్యాఖ్యాతకు విశేష గ్రంథ పరిశీలన, అపార శాస్త్రవైదుష్యము, విస్తృత పాండిత్య శక్తి ముఖ్యము. కేవలం కొన్ని విషయాలలో మాత్రమే పాండిత్య ప్రకర్ష ఉన్నప్పుడు అది సమగ్ర వ్యాఖ్యకు సరిపోదు.

శ్రీమాన్ కె.వి.రాఘవాచార్యుల వారి వ్యాఖ్యానాలను అధ్యయనం చేసినప్పుడు వారు సంప్రదించిన శాస్త్రగ్రంథాలు వారిచ్చిన నైఘంటుకార్థ సంచయము, వారు చూపించిన కావ్య ప్రమాణాలు, ద్వైత, అద్వైత, విశిష్టాద్వైత సిద్ధాంతాల విషయంలో వారికున్న విద్వత్తు అబ్బురపరుస్తుంది.

జీవాత్మ పరమాత్మను చేరాలన్న ఆర్తి ఒక ఆచార్యుని సాయంతో ఫలప్రదమవుతుందన్న విశిష్టాద్వైత సంప్రదాయానికి ఉదాహరణగా నిలిచిన రుక్మిణీ కల్యాణ కథకు అపురూపమైన వైష్ణవీ వ్యాఖ్య నందించిన శ్రీమాన్ కె.వి.రాఘవాచార్యులవారు మన తెలంగాణాలో పుట్టిన మరో మల్లినాథులే ననడంలో ఎటువంటి సందేహానికీ తావులేదు.

గరుడ దండకం- సుషమ

సముద్రాల శఠకోపాచార్య

చరవాణి: 9848 373 067

కవి ప్రయోగించిన శబ్దాలకు అర్థాలను అంతరార్థాలను పాఠకులకు విడమర్చి చెప్పడంలో కవిహృదయాన్ని పాఠకులకు ఆవిష్కరించడంలో వ్యాఖ్యానాలు కీలకపాత్రను పోషిస్తాయి.

ద్రావిడ ప్రబంధాలకు (సంప్రదాయపరమైన వ్యాఖ్యానాలను అందించిన శ్రీవరవరమునులకు (మణవాళమహామునులకు) విశదవాక్ శిఖామణి అనే బిరుదం కలదు. వరవరమునుల వ్యాఖ్యానాలు లేకపోతే ద్రావిడ ప్రబంధాల వైభవం సంప్రదాయాభిమానులకు స్పష్టంగా అందేది కాదు.

శ్రీ వరవరమునుల కోవలోనే వేదాంతదేశికుల స్తోత్రాలకు కావ్యాలకు విశదతమమైన వ్యాఖ్యానాలను అందిస్తూ సంప్రదాయాభిమానులైన పాఠకులకు మహోపకారం చేసినవారు శ్రీమాన్ కె.వి.రాఘవాచార్యస్వామి వారు.

శ్రీమాన్ రాఘవాచార్యస్వామివారి వ్యాఖ్యానాల వల్లనే శతాధిక గ్రంథకర్తలు, కవితార్కిక సింహులు, విద్వదగ్రేసరులు అయిన శ్రీ వేదాంతదేశికుల హృదయాన్ని వారందించిన అపారవాఙ్మయాన్ని తెలుగు పాఠకులు క్షుణ్ణంగా తెలుసుకునే అవకాశం ఏర్పడినది అని పేర్కొనడం ఎంతమాత్రం అతిశయోక్తి కాదు.

శ్రీ వరవరమునులు తమకు ఎనభై సంవత్సరాల వయసు పైబడినప్పుడు శరీరం సహకరించకపోయినా తగినంత ఆరోగ్యం లేకపోయిననూ, కూర్చునే ఓపికలేని సందర్భాలలో కూడా భవిష్యత్తరాల ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని రచనావ్యాసంగాన్ని కొనసాగించారట.

అదేవిధంగా శ్రీమాన్ రాఘవాచార్యస్వామివారు కూడా నేటి యువతరానికి, రాబోయే తరాల వారికి సంప్రదాయ జ్ఞానలాభాన్ని కలిగించాలనే తపనతో ఆరోగ్యం సహకరించకపోయినా కాసేపు కూర్చోని మరికాసేపు పరుండి దేశికుల గ్రంథాలకు వ్యాఖ్యానాలను సమకూర్చిన తీరు ఆశ్చర్యకరము. ఇతరులకు ఆదర్శప్రాయం కూడా.

వ్యాఖ్యాలేఖనము, గ్రంథనిర్మాణము, శిష్యులకు బోధన అనే మూడు అంశాలను కలిపి స్వాధ్యాయము అని పేర్కొంటారని

"వ్యాఖ్యానైర్లేఖనైశ్చైవ గ్రంథ నిర్మాణ కర్మణా।
శిష్యాణాం శిక్షయా చాపి స్వాధ్యాయార్థోయముచ్యతే॥"

అనే శ్లోకం ద్వారా వెల్లడగుచున్నది. ఇట్టి స్వాధ్యాయ జ్ఞాన యజ్ఞమును సుదీర్ఘకాలం నిరంతరాయంగా కొనసాగించినట్టివారు శ్రీమాన్ రాఘవాచార్యస్వామివారు.

గరుత్మంతుని ప్రశంస:– గరుత్మంతుడు నిత్యసూరులలో ప్రముఖుడు. ఇతడు శ్రీమన్నారాయణుడికి దాసుడిగా, సఖుడిగా, వాహనముగా, ఆసనముగా, ధ్వజముగా, చామరముగా ఇలా ఎన్నెన్నో విధాలుగా సేవలందిస్తూ పరమాత్మ యొక్క అనుగ్రహానికి విశేషంగా పాత్రుడైనాడు.

గరుత్మంతుడు సర్వవేద స్వరూపుడు. ఇతడు అర్చామూర్తిగా కొలువుదీరిన శ్రీవేంకటేశుని, శ్రీవేణుగోపాలుని, శ్రీరంగనాథుని ఆలయాలలో పరమాత్మకు అభిముఖంగా ఉండి భగవంతుని ముఖవికాసమునకు దోహదపడుతుంటాడు.

గరుడ భగవానుని ఉపకారమే శ్రీ వేదాంతదేశికులు హయగ్రీవానుగ్రహమును పొందునట్లు కవి తార్కిక సింహులుగా ప్రసిద్ధులగునట్లు, శతాధిక గ్రంథములను రచించినట్లు చేసినది.

శ్రీవేదాంతదేశికులు–గరుడోపాసన:– శ్రీ వేదాంతదేశికులు తమ మేనమామగారైన శ్రీమాన్ ఆత్రేయ రామానుజా చార్యస్వామివారి వద్ద పంచసంస్కారాలను పొందిన పిదప గారుడమంత్రమును కూడా ఉపదేశంగా పొందినారు.

శ్రీ వేదాంత దేశికులు పాండిచ్చేరి రాష్ట్రమునందలి కడలూరుకు సమీపంలోని తిరువహేంద్రపురంలో గరుడనదీతీరంలో ఔషధాద్రియందు కఠినమైన నియమ నిష్ఠలతో గరుడ మంత్రాన్ని అనేక పర్యాయములు జపించి మంత్రసిద్ధిని పొందిన శ్రీ వేదాంతదేశికుల ఎదుట వేదమయుడైన గరుత్మంతుడు ప్రత్యక్షమయ్యెను. అప్పుడు గరుత్మంతుని గూర్చి శ్రీ దేశికులు చేసిన స్తోత్రమే గరుడ దండకము.

శ్రీవేదాంతదేశికులు "గరుడ దండకమ్" అనే కృతిని–

"నమః పన్నగ నద్ధాయ వైకుంఠ వశవర్తినే।
శ్రుతిసింధు సుధోత్పాద మందరాయ గరుత్మతే॥"

అనే శ్లోకంతో గరుత్మంతునికి ప్రణమిల్లుతూ ప్రారంభించారు.

ఈ శ్లోకంలో అమృతోత్పాదనంలో మందరపర్వతం ఒక కవ్వంలాగా ఉపయోగపడినట్లుగానే శ్రీమన్నారాయణుడి అధీనంలో ఉండే వేదాలు అనే సముద్రం నుండి అమృతం పుట్టడానికి కవ్వపు కొండవలె వేదాత్మయగు గరుత్మంతుడు ఉపకరించునట్టివాడు అని వేదాంత దేశికులు పేర్కొన్నారు.

ఈ శ్లోకాన్ని వ్యాఖ్యానించే సందర్భంలో శ్రీరాఘవాచార్యస్వామివారు "అమృతమథన ఘట్టాన్ని సంగ్రహంగా వివరిస్తూ ఈ ఘనకార్యంలో మందర పర్వతం యొక్క పాత్రను వైకుంఠ శబ్దానికి కల వ్యుత్పత్త్యర్థాన్ని వివరించారు.

గరుత్మంతుడు భగవంతునికి ఆభరణంగా నిత్యకింకరుడిగా ప్రకాశించిన విధమును 'గరుత్మాన్' అనే శబ్దానికి ఉండే సామాన్య విశేషార్థాలను తెలిపారు.

శ్రీవేదాంతదేశికులు గ్రంథారంభంలో హయగ్రీవానుగ్రహమును తమకు కలిగించిన గురుత్మంతుని ముందుగ స్తుతించిన విషయాన్ని శ్రీరాఘవాచార్యస్వామివారు ప్రస్తావిస్తూ లౌకిక జ్ఞానాన్ని వైదికమయ విజ్ఞానాన్ని లేక మోక్షప్రాప్తికి కారణమైన మంత్ర మంత్రార్థాది ఉపదేశాలను ఎవరు అందిస్తారో అట్టివారికి ముందుగ నమస్కరించవలెను.

"లౌకికం వైదికం వాపి తథ్యాధ్యాత్మిక మేవవా।
ఆ దదీత యతో జ్ఞానం తం పూర్వమభివాద యేత్॥"

అనే మనుస్మృతి వాక్యానుసారం దేశికులు గరుడ దండకాన్ని ఆరంభించిన విధానాన్ని సోదాహరణంగా వివరించారు.

నమ ఇదం అజహత్ సపర్యాయ పర్యాయ నిర్యాత పక్షానిలాస్ఫాలనోద్వేల... ఇత్యాదిగా సాగే 3వ చూర్ణికను శ్రీమాన్ రాఘవాచార్యులారు వ్యాఖ్యానిస్తూ-

"పుణ్యాహవాచనములో గరుత్మంతుణ్ణి ప్రార్థించే విధానం వేదసమ్మతమైనదని తెలిపారు. ధనుర్మాస వ్రతంలో గోదాదేవి గోపికలను మేల్కొల్పడానికి ప్రారంభంలోనే గరుడపక్షిని "పుళ్ళరైయన్ కోయిల్" అని స్మరించిన విధమును ప్రస్తుతించినారు.

భగవంతుడి సన్నిధిలో ఉండే గరుత్మంతుడికి ప్రతినిత్యం షోడశోపచారాలతో పూజావిధానం ఉంటుందని తెలిపారు.

స్త్రీ పురుషులందరూ "స్వాధ్యాయవపుషే నమో నమస్తే" అంటూ గరుడధ్యానం చేస్తారని పేర్కొన్నారు.

క్షీరాబ్ధిలో యోగనిద్రలోనున్న శ్రీమహావిష్ణువు యొక్క కిరీటాన్ని ప్రహ్లాదుని కుమారుడైన విరోచనుడు అపహరించి పాతాళలోకంలో చేరాడు. ఋషుల ప్రార్థన మేరకు గరుత్మంతుడు అన్ని లోకాలు వెతికి చివరగా పాతాళాన్ని చేరి విరోచనుణ్ణి ఓడించి కిరీటాన్ని సంపాదించిన విషయాన్ని-

"తుండాగ్రేణ శిరస్తస్య తాడయామాస వేగతః॥

"తతో విరోచనం జిత్వా సమరే విహగాధిపః॥
ఆదాయచ కిరీటం తదా జగామ నభః స్థలే॥

అనే ప్రమాణ వాక్యములను ఉట్టంకిస్తూ వివరించినారు.

గరుత్మంతుడు ఉజ్జ్వలమైన కిరీటాన్ని తీసుకొని వైకుంఠానికి వెళుతూ భూలోకంలో బృందావనంలో నున్న బాలకృష్ణుణ్ణి దర్శించాడు.

ఆ పరబ్రహ్మాయే ఈ బాలగోపాలుడని నిశ్చయించి గొప్పనైన కిరీటాన్ని బాలకృష్ణుని శిరముపై గరుడుడు సమర్పించాడు. కిరీటం చాలా పెద్దదే అయినా చిన్నికృష్ణుని శిరమునకు సరిగ్గా అమరినది.

కిరీటాలంకృతుడైన బాలకృష్ణుని చరణాలకు వేదాత్మయగు గరుత్మంతుడు నమస్కరించి అమితానంద కందళిత హృదయారవిందుడయ్యాడని–

"క్షీరాబ్ధిశాయినో విష్ణోః కిరీటం తన్మహత్తరమ్।
మూర్ధ్ని తస్యైవ బాలస్య ముదితో వినతాసుతః॥
నిచిక్షేప తతస్తస్య కిరీటం శిరసి స్థితమ్।
సమప్రమాణ మభవత్ సహపింఛ విభూషణైః।
తతః ప్రణమ్య గరుడో భక్త్యా గోపాల బాలకమ్॥"

అనే ప్రమాణ శ్లోకాలను ఎత్తిచూపుతూ పేర్కొన్నారు.

గరుడదండక వ్యాఖ్యానంలో 'గరుడపంచాక్షరి' జపవిధానాన్ని ఆచార్యులవారు విశదముగా వివరించారు. గరుడవైభవాన్ని ఆవిష్కరించే వేదవాక్యాలను, పాంచరాత్రాగమంలోని, సంహితలలోని ప్రమాణ వాక్యాలను, శ్రీమద్రామాయణ భారత భాగవతములలోని ఘట్టాలను ఉదాహరించారు.

పోతన భాగవత పద్యాలను విశ్వనాథవారి రామాయణ కల్పవృక్షంలోని పద్యాలను కూడా ఉట్టంకించారు.

గరుత్మంతునికి, గరుడధ్వజుడైన శ్రీమన్నారాయణునికి కూడా అమితానందాన్ని కలిగించే విధంగా గరుడమంత్ర బీజాక్షరాలను గూర్చి మంత్రోపాసకులైన మహావిద్వాంసులైన శ్రీమద్వేదాంత దేశికులు ఈ గరుడ దండకాన్ని స్తోత్రరూపంగా గానం చేశారు.

గురుముఖతః గరుడమంత్రోపదేశాన్ని పొందలేనివారందరూ, ఉపదేశం పొందినా ఆ మంత్రాన్ని ప్రతినిత్యం అనుష్ఠించలేనివారు ఆ మంత్రసిద్ధిని పొందుటకు అవసరమైన నియమములను పాటించలేని వారందరూ కూడా స్తోత్రరూపమైన గరుడ దండకాన్ని ప్రతినిత్యం పఠిస్తూ గరుడమంత్రోపాసకులతో సమానమైన ఫలితాలను పొందగలుగుతారు.

గరుడ దండకాన్ని పఠించినవారికి శత్రు బాధానివారణము అనర్గళమైన వాక్శక్తి విశేష జ్ఞానలాభము మొదలైన ఫలితాలు కలుగుతాయని పేర్కొంటూ ఈ విషయాన్ని ధ్రువీకరించే శ్రీ పాంచరాత్రాగమం (భగవచ్ఛాస్త్రం)లో గరుడ మాహాత్మ్యాన్ని వర్ణించే ఘట్టంలోని–

"ఫలాని పూర్వముక్తాని వాక్సిద్ధిర్మహతీ భవేత్।
జ్ఞానం చ మహదాప్నోతి యశ్చాన్యదధి కాంక్షితమ్॥"

అనే శ్లోకాన్ని శ్రీమాన్ రాఘవాచార్యస్వామివారు ప్రస్తావించారు.

శ్రీ వేదాంత దేశికుల హృదయాన్ని, గరుడ వైభవాన్ని పాఠకులకు హృద్యమైన రీతిలో వ్యాఖ్యానం ద్వారా అందించిన శ్రీమాన్ కె.వి.రాఘవాచార్యస్వామివారు సంప్రదాయాభిమానులకు చిరస్మరణీయులు.

అక్షరమాలిక

డా॥ చక్రవర్తుల లక్ష్మీనరసమ్మ
చరవాణి: 8978 852 385

శ్రీ రమణీశ పాద సరసీరుహ సంతత చింతనార్ద్ర గం
భీర విశాల భావుకుడు విశ్వజనీన గుణాభిరాముడున్
శారద నీరదేందు సమశాంత సుధాదరహాస భాసుడున్
కారముచేటి వంశ వరకౌముదిచంద్రుడు రాఘవార్యుడున్

పాలిత ధర్మనిర్ణయుని, వైష్ణవదార్శనిక ప్రవర్తనున్
బాలరసాల పల్లవ నిభామృత సంస్కృత వాఙ్మయాత్మునిన్
శూలిని, తమ్మిచూలిని, రసోచిత వాక్కుల గెల్చువాని, మా
లోల నృసింహ దివ్యగుణలోలుని, గొల్చెద రాఘవార్యునిన్

ఆ నిగమాన్త దేశిక మహత్తర వాగ్విభవాభిరామ గీ
ర్వాణికి వాణికిన్ విపుల భాష్యము జెప్పుటకై మనోధన
ప్రాణము జీవితమ్మును నిరంతర మర్పణ జేసినారు రా
మానుజ దివ్య దీప్తుల సమానము దేవరవారి గ్రంథముల్

యతి రామానుజ మార్గమౌ వరవిశిష్టాద్వైత సిద్ధాంత మం
దు తరింపన్ కృతులన్ రచించి రసమాధుర్యంబులందుంచి మా
మతి వెల్గించిన సర్వశాస్త్ర ధిషణా మార్తాండ తేజస్వి స
ద్గతులంజూపిన సంస్కృతాంధ్ర రచనా వ్యాఖ్యాతృ వాచస్పతీ!

ఓ మహితాత్మ! జ్ఞాననిధి! ఓ పరతత్త్వ రహస్యవేది! ఓ
ధీమణి! ఓ కవిత్వజలధీ! కవితార్కిక సింహభావనా
రామ విహార చారుశిఖీ! రాజితకీర్తి! సమస్త పండిత
స్తోమ! నమో! నమో! పరమ సూరి జనావృత దేశికోత్తమా!

ఉభయ వేదాంత వరవర్తి శుభదమూర్తి
ధన్యుడు మనోహరస్వామి తపము వలన
సుదతి వేంకటాంబ వదాన్య సుకృతివలన
ప్రభవ మొందిన యతిరాజ వారసునకు
భాగవత దాసి పాదాభివందనములు

వినయాంజలి

డా॥ అక్కిరాజు సుందర రామకృష్ణ

చరవాణి: 9885 020 205

"కారంచేడు" కులాబ్ధి వంశ శశియన్ ఖ్యాతిన్ భువిన్ గన్న సు
శ్రీరమ్యున్ సుగుణాభిరాముడగునా "శ్రీ రాఘవాచార్యునిన్"
పారావార గభీర మానసుని విద్వన్మిత్ర వాంఛా రతున్
పారాశర్య సమున్ వృషాద్రి విభు సద్భక్తాగ్రణిన్ మెచ్చెదన్!

పుట్ట పుట్టువు పైని, పట్టున్న బుధులలో అగ్రేసరుండవౌ అయ్యవీవు
బాదరాయణుడైన వ్యాసర్షి దైనట్టి నాడి బట్టినయట్టి వాడ వీవు
ఇల సన్నుతులు గన్న కుల శేఖరాళ్వారు సత్కవి చంద్రుని సఖుడ వీవు
విమల యశుండైన వేదాంత దేశిక హృదయంబెఱింగిన బుధుడ వీవు
సామి "తిరుమల" వాసుని ప్రేమ మయుని భక్తి నిచ్చలు గొల్చెడి వాడ వీవు
సురుచిరుండైన "విష్ణు" దాసుడవు నీవు ఉర్వి నరయంగ సద్వైష్ణవుండ వీవు!

సాత్వికుండు పరమ సాధు గుణుండును/ సన్నుతులను గన్న సద్బుధుండు
ప్రథిత యశుడు ఘనుడు రాఘవాచార్యుండు/ ధరణి సకల గతుల పరమ గురుడు

కడు విచిత్ర మిద్ది "కారంబు"గల దది/ ఇంటి పేరు లోనె ఇతని కరయ...
కవిత మాత్ర మద్ది ఖర్జూరములు, ద్రాక్ష/ పనస, ఆమ్ర, ఫలము పగిది దోచు

వినయ భూషణుండు విజ్ఞుడై ప్రాజ్ఞుడై/ వరలినట్టి స్వచ్ఛ భాషణుండు
సంస్కృతాంధ్ర నిధిగ సన్నుతుల్ గొనినట్టి/ అనఘ వరునకేను అంజలింతు.

దివ్య ప్రబంధత్రయి

డా॥ సిహెచ్. లక్ష్మణ చక్రవర్తి
చరవాణి: 9849 714 261

తెలంగాణ ప్రాంతంలో ఉభయవేదాంత ప్రవర్తకులుగా వెలుగొందిన పండితుల గురించి తెలిసిన వారికి తెలుసు. తెలియని వారికి తెలియదు. భక్తి నివేదన వంటి మాసపత్రికలు మన ఉభయవేదాంత పండితులు అని కొందరిని పరిచయం చేసినా ఆయా పండితుల గురించి సమకాలీనులకు తెలిసింది తక్కువ. తెలంగాణ ప్రాంత ఉభయ పండితులలో విశిష్టమైన వ్యక్తిత్వం, సంప్రదాయ అభినివేశం, సంప్రదాయాన్ని ఆధునికంగా వివరించగలిగిన సామర్థ్యంగల పండితులలో శ్రీమాన్ కె.వి.రాఘవాచార్యుల వారు ప్రముఖులు.

వేదాంత దేశికుల సంప్రదాయ సాహిత్యాన్ని తెలుగువారికి అందించిన కె.వి.రాఘవాచార్యులవారు **భగవద్విషయం ఈడు** ను తెలుగు చేశారు. **ద్రమిడోపనిషత్తుకు** వివరణ అందించారు. **ఉపనిషత్ వాఙ్మయాన్ని** వివరించారు. ఇలా సంస్కృత తమిళ సంప్రదాయ గ్రంథాల వ్యాఖ్యానంతో బాటు తెలుగు కవి పోతన వాఙ్మయానికి వ్యాఖ్యానాన్ని అందించి తమ ఉభయ భాషా ప్రావీణ్యాన్ని, ప్రకటించుకున్నారు. ఆళ్వారులలో పెరియాళ్వారుల వారి **తిరుప్పల్లాండు**, తొండరడిప్పొడి ఆళ్వారుల **తిరుప్పళ్ళిఎళుచ్చి**, మధురకవుల **కణ్ణినుణ్ శిరుత్తాంబు**లకు సరళ వ్యాఖ్యను అందించి దీనికి **దివ్యప్రబంధత్రయి** అని పేరిడగా శ్రీమాలోల గ్రంథమాల 2002లో ప్రథమ ముద్రణగా వెలువరించింది.

ఈ మూడు ప్రబంధాలు నాలాయిర ప్రబంధంలో విశిష్టమైనవి. అందుకు కారణం ఒకటి స్వామికి మంగళాశాసనం చేసేది (తిరుప్పల్లాండు). మరొకటి స్వామికి సుప్రభాతసేవ చేసేది (తిరుప్పళ్ళి ఎళుచ్చి). మూడవది ఆచార్య పారమ్యాన్ని చెప్పేది (కణ్ణినుణ్ శిఱుత్తాంబు). ఈ మూడు ఒక దశకం (పదికి) మించవు. తిరుప్పల్లాండు నాలాయిర దివ్యప్రబంధానికి వేదత్తుకు ఓ మెన్నుమదుపోల్ (వేదానికి ఓంకారం వంటిదని) వరవరముని కీర్తించి ఉన్నారు. అటువంటి సంప్రదాయాన్ని అనుసరిస్తూ తిరుప్పల్లాండు తిరుప్పళ్ళి ఎళుచ్చి, కణ్ణినుణ్ శిఱుత్తాంబుల వ్యాఖ్యానాన్ని ఆచార్యులవారు అందించగా ఈ మూడూ అష్టాక్షరీ మంత్రతత్త్వాన్ని వివరించేవి కావడం మరో విశేషం.

రాఘవాచార్యులవారు ప్రౌఢకవి అయిన వేదాంత దేశికుల వారి రచనలకు వ్యాఖ్య అందించినవారు. కవి హృదయాన్ని అందులోని సంప్రదాయ తాత్త్వికతను సులభంగా ఆవిష్కరించాలన్న తపన కల్గి పూర్వ వ్యాఖ్యాతలు చెప్పని విశేషార్థాలను చెప్పినవారు. అందువల్ల పాఠకుని బట్టి, విషయాన్నిబట్టి, వారి వ్యాఖ్యాన రీతి కొనసాగుతుంది. తనకు ఎంతటి పాండిత్యమున్నా రచనానుగుణంగా వ్యాఖ్యానాన్ని నిర్మించుకోవడం ఆచార్యులవారి వ్యాఖ్యానంలో కనిపించే ప్రత్యేక అంశం. దీనికి మంచి ఉదాహరణ ఈ **దివ్య ప్రబంధత్రయి.**

ఆయా ప్రబంధాలకు వ్యాఖ్యానాన్ని రచించేముందు ఆళ్వారులు చేసిన ప్రబంధ రచనల పేర్లు తెల్పి ఆ తర్వాత ఆయా ప్రబంధాలను వెలయించిన ఆళ్వారుల చరిత్రను సంగ్రహంగా తెలిపి ఆ ప్రబంధ

పరమార్థాన్ని వ్యాఖ్యానం ప్రారంభించడం కంటే ముందే చెప్పడం ఇందులో వ్యాఖ్యాత అనుసరించారు. అలా చేయడం ద్వారా రచనలోనికి పాఠకుల్ని ఉన్ముఖుల్ని చేస్తారు. ఆయా ప్రబంధాల విశిష్టతను గ్రహించటానికి పునాదులు వేస్తున్నట్లు మనం భావించవచ్చు. ఇందులో భాగంగానే తనియన్ అంటే చెప్పి విష్ణుచిత్తులకు పెరియ ఆళ్వారు అనే పేరు రావడానికి గల కారణాన్ని ప్రస్తావన వశంగా వివరించారు.

శ్రీమన్నాథమునులు 'గురుముఖమనధీత్య' అని తనియన్ ప్రారంభించి పాదంగల్ యాముదైయపత్తు అని ముగించారు. ఈ తనియన్లలో పెరియాళ్వారుల వైభవం ఉంది. దాన్ని ప్రతిపదార్థ వివరణలతో అందించడంతో బాటు తాత్పర్యంలో అందులోని విశేషార్థాలను చెప్పే విశేష పద్ధతి రాఘవాచార్యులవారిది. "అందుకే మూడక్షరముల ప్రణవమువలె శ్రీ వటపత్రశాయి, పెరియాళ్వార్లు, ఆండాళు అను ముగ్గురూ కూడియున్న దివ్యదేశ నామ మాహాత్మ్యమును ఒక్క పర్యాయమైనను చెప్పుకొను భాగవతోత్తముల దివ్యపాదార విందములను శిరోభూషణములుగా ధరించితిమి" అన్నారు. పాశురంలో విల్లిపుత్తూరులో ఉన్న భాగవతోత్తముల విషయం మాత్రమే ఉంటే అక్కడ ముగ్గురున్న విషయాన్ని ప్రస్తావించి ఆ క్షేత్ర విశిష్టతను స్పష్టం చేశారు. ప్రతిపదార్థ తాత్పర్యాల తర్వాత వివరణ పేరుతో చెప్పే వాక్యాలలో ఆ పాశురం తత్త్వాన్ని వివరించడం కలదు. అవి పూర్వాచార్యులు చెప్పినవే అయినా దాన్ని నేటి తరానికి అందించడంలో రాఘవాచార్యులవారు చూపిన సారళ్యం పండితులు అనుసరించవలసిన రీతిగా కనిపిస్తుంది (చూడు. 11, 23 పుటలు).

తొండరడిప్పొడి యాళ్వారుల అసలు పేరు విప్రనారాయణులు. తాను విషయలోలుడై చేసిన పనులకు ప్రాయశ్చిత్తంగా భాగవత దాస్యం చేసి స్వామివారి శ్రీపాదతీర్థాన్ని స్వీకరించడంతో తొండరడిప్పొడి అన్న పేరు ఏర్పడింది. అటువంటి వారి చరిత్ర చెప్పి ఆయన తిరుప్పళ్ళి ఎళుచ్చి రూపంలో చేసిన సుప్రభాత సేవను విశ్లేషించారు. ప్రకృతి రామణీయకతను ఆళ్వారులు వర్ణించిన తీరును, సుప్రభాతసేవ చేయడంలో ఆళ్వారుల ఆర్తిని ఈ తిరుప్పళ్ళియెళుచ్చి వ్యాఖ్యానం ద్వారా ఆచార్యులవారు మనముందు నిలిపారు.

మధురకవి ఆళ్వారుల కణ్ణినుణ్ శిఱుత్తాంబు ఆచార్య పారమ్యాన్ని చెప్పేది, ఆచార్య స్వరూపంలో ఈశ్వరత్వము-ఆచార్యత్వము రెండూ ఉంటాయి. అందువల్ల ఆచార్యుడే సర్వోత్కృష్టుడు. ఈ భావన గల మధురకవి ఆళ్వారులు ఆచార్యాభిమానమే ఉజ్జీవన సాధనము అని బోధించే భాగవత నిష్ఠను వివరించే కణ్ణినుణ్ శిఱుత్తాంబును రచించినట్లు నమ్మాళ్వార్లను మధురకవులు విశ్వసించినట్లు మధురకవులను మనము విశ్వసించాలి అంటారు శ్రీమాన్ ఆచార్యులవారు తనియన్ వివరణలో.

ఆయా ప్రబంధాలను సరళ సుందరంగా అందించడం, విషయాన్ని విద్యార్థి ఉపయోగంగా చెప్పడం, 'దివ్యప్రబంధత్రయి'లో రాఘవాచార్యులవారు అనుసరించిన పద్ధతి. వారు విశిష్ట పండితులైనా సారళ్యత ఈ రచనకు జీవనాడి. వారి సంస్కృత తమిళ భాషల పాండిత్యం ఈ రచనలో తెలుస్తుంది. ఈ మూడు ప్రబంధాలనే ఎన్నుకోవడంలో అష్టాక్షరీతత్త్వం వీటిలో ఉండడం కారణమని ముందే చెప్పుకున్నాం. ఆ మంత్రరాజతత్త్వాన్ని ఈ ప్రబంధత్రయి ద్వారా పునశ్చరణ చేసుకునే అదృష్టం కల్పించిన ఆచార్య కోటికి దాసోహములర్పిస్తూ సెలవు.

మాఘ కావ్య వైభవ వైదుష్యం

డా॥ ఆచార్య వేణు

చరవాణి: 9963 982 390

సంస్కృత సాహిత్యంలో అత్యంత ప్రసిద్ధి పొందిన మహాకావ్యం "శిశుపాల వధ" మాఘకావ్యంగా దానికి లోకంలో పేరుంది.

ఇరవై సర్గలూ 1675 శ్లోకాలు కలిగివున్న ఈ శిశుపాల వధ మహాకావ్యంలో శ్రీకృష్ణ భగవానుడు కథానాయకుడు. ప్రతినాయకుడు శిశుపాలుడు. ఇది ప్రధానంగా వీర రసకావ్యం, శృంగారం కరుణ రసాలు అంగరసాలు. కావ్యంలో సర్గకొక్క ఛందస్సు ఛందోవైవిధ్యానికి ప్రతీక. ప్రతి సర్గ చివరి శ్లోకంలో రాబోయే కథాంశ సూచన కలదు.

ఈ మహాకావ్యాన్ని "యువభారతి" సంస్థ పక్షాన సుప్రసిద్ధ పండితులు శ్రీ.ఉ.వే.శ్రీమాన్ కె.వి. రాఘవాచార్యులవారు అందులోని నలభై శ్లోకాలకు "మాఘకావ్య వైభవం" అనే పేరుతో రమణీయమైన వ్యాఖ్యానాన్ని తెలుగుజాతికి అందించారు.

"మాఘకావ్య వైభవం" అన్న ఈ కావ్యంలో రాఘవాచార్యుల వ్యాఖ్యాన చతురిమను, వారి బహుశాస్త్ర పరిచయాన్ని స్థాలీపులాక న్యాయంగా వివరిస్తాను. మాఘ కావ్యంలోని ప్రథమ శ్లోకం–

శ్లో॥ శ్రియఃపతి శ్రీమతి శాసితుంజగ– జ్జగన్నివాసో వసుదేవ సద్మని
వసన్ దదర్శావతరంత మంబరా– ద్ధిరణ్య గర్భాంగ భువం మునిం హరిః 1–1

ఈ శ్లోకంతో మాఘకవి శిశుపాల వధ మహాకావ్యాన్ని ఆరంభించాడు. ఈ శ్లోకానికి వ్యాఖ్యానాన్ని అందిస్తూ– "శ్రియఃపతి లోకాన్ని శాసించడానికి శ్రీకృష్ణుడుగా అవతరించాడు. సకల సంపదలున్న వసుదేవుని ఇంట్లో ఆయన నివసించాడు. ఒకనాడు దివినుంచి భువికి దిగివస్తున్న నారదమునిని శ్రీకృష్ణుడు చూశాడు".

జగత్తుకే ఆధారమైన భగవంతునికి ఇప్పుడు జగమే ఆధారమయినది. ఇప్పుడు శ్రీకృష్ణుని కాపురం వసుదేవుని ఇంట్లో. ఇందులో పర వ్యూహ, విభవ అవతారాలలోని విశేషాలను తెలియజేస్తూ– "పితా పుత్రేణ పితృమాన్ యోని యోనౌ" అని వేదం చెప్పిన రీతిగా అందరికి తండ్రి అయిన భగవంతునికి తండ్రియై ఆ విభవావతారాన్ని సేవించి శోభించేవాడు వసుదేవుడు.

ఈ శ్లోకంలో శబ్దార్థాల చమత్కారముతో పాటు కావ్యంలోని కథా సంగ్రహాన్ని, ఇతివృత్తాన్ని కూడా తెలియజేసారు.

ఇందులో ప్రయోగించిన శబ్దాలు శ్రియఃపతి, హిరణ్యగర్భుడు, హరి అనే ఆది మధ్యాంత పదాలు శ్రీకృష్ణుడు త్రిమూర్త్యాత్మక స్వరూపుడని తెలియజేస్తున్నాయి. శిష్టరక్షణకూ దుష్టశిక్షణకూ అంకితుడయ్యాడు శ్రీకృష్ణుడని, ఆయన రసస్వరూపుడని "రసోవైసః" అని ఆ రసవ్యంజక వాగ్రూపిణి శ్రీదేవి అని వ్యాఖ్యానించారు.

వ్యూహావతారమును సేవించే కశ్యపుడే ద్వాపరయుగంలో వసుదేవుడయ్యాడన్న అర్థమే కాక వసుదేవుని ఇంట్లో నివసిస్తున్న వాడనడం చేత అంతర్యామి అని "ఆత్మాగుహాయం నిహితోస్సజంతోః" అన్న వేదార్థముతో సమన్వయింపజేశారు.

ఈ మొదటి శ్లోకంలో ఉన్న వేదాంత ఉపనిషత్తుల సార సంగ్రహాన్ని తమ బహుశాస్త్ర పరిచయంతో సమన్వయింపజేస్తూ వ్యాఖ్యానాన్ని అందించి ఇందులో కావ్య వస్తువును కావ్యఫలాన్ని విశదీకరించారు.

శ్రియఃపతిని మాఘకవి తన కావ్యకాంతా ముఖాన మంగళదీపరేఖలో తీర్చిదిద్ది చిత్రించినాడని పేర్కొన్నారు.

హరత్యఘం సంప్రతి హేతురేష్యత/ శ్శుభస్య పూర్వా చరితైః కృతీం శుభైః
శరీర భాజాం భవదీయ దర్శనం/ వ్యనక్తి కాల త్రితయేపి యోగ్యతామ్

శ్రీకృష్ణుడు నారదమునిని దర్శించడం ఆ దర్శించడమే కావ్యవస్తువుకు తేజోబీజంగా మారి మాఘ కావ్యంగా ఆవిర్భవించింది.

"మీ దర్శనం మూడు కాలాల్లోను జనుల యోగ్యతను ప్రకటిస్తుంది. భూతకాలంలో చేసిన సుకృతాన్ని పరిణమింపజేస్తుంది. వర్తమానకాలంలో పాపాన్ని హరిస్తుంది. భవిష్యత్కాలంలో శ్రేయోదాయకం" అని దీని తాత్పర్యం.

ఈ శ్లోక వ్యాఖ్యానంలో మహాత్ముల యొక్క దర్శనంవల్లే కలిగే ఆనందమును తెలియజేస్తూ, వ్యాఖ్యానకర్త ఉత్తర రామచరితలోని శ్లోకాన్ని "సతాం సద్భిస్సంగః కథమపిహి పుణ్యేన భవతి" అన్నదాన్ని ఉదాహరించారు.

నారదుడు ఆరదుడు కాదు. అంటే కామక్రోధాది అరిషడ్వర్గానికి అవకాశానిచ్చే వాడు కాదని, తన జ్ఞాన వైరాగ్యాదులచేత నరుల యొక్క విషయసుఖాన్ని తొలగించేవాడు నారదుడు. ఆయన శారీరకంగా తెల్లనివాడు, మానసికంగా నిర్మలుడు లోకకల్యాణకారకుడు అంటూ వివరించాడు.

"మేను పాపాలబోను" అని అచ్చమైన తెలుగు పదాన్ని అందించారు. "పాపాలబోను" అని అనడం వారికి తెలుగెంత ప్రీతియో దీని ద్వారా తెలుస్తుంది. ఈ శ్లోకం "తదధిగమ ఉత్తర పూర్వాఘమోదశ్లేష వినాశౌ తద్దర్శనాత్" అన్న బ్రహ్మసూత్రార్థాన్ని తెలియజేస్తుందని చెప్పడం. వేదాంతంలో వారి నిశిత ప్రజ్ఞకు పరిశ్రమకు తార్కాణము.

శ్లో॥ సబాల ఆసీద్వపుషా చతుర్భుజో/ ముఖేన పూర్ణేందు నిభస్త్రిలోచనః
యువా కరాక్రాంత మహీభృదుచ్చకై/ రసంశయం సంప్రతి తేజసా రవిః (1-70)

ఇందులో నారదుడు శిశుపాలుని రూపసంపదను వివరించాడు. "బాల్యంలో శిశుపాలుడు శరీరంచేత నాలుగు భుజాలు కలిగినవాడు. ముఖంచేత పూర్ణచంద్రునితో సమానుడు. అంతేకాదు మూడు కళ్ళూ ఉన్నవాడు. ఇప్పుడతడు యౌవనంలో ప్రతాపంచేత కరాక్రాంత భూభర్త అయిన సూర్యుడే సందేహం లేదు".

కరములు అంటే కిరణాలు, పన్నులు, చేతులు అని అనేకార్థాలు. మహీభృత్ అనే శబ్దానికి రాజులు, పర్వతాలు అని రెండర్థాలు. పదార్థాల రసద్రవ్యాన్ని తన కిరణాలతో పీల్చి పిప్పిచేసేవాడు రవి- అని వివరించారు.

నారదుడు శిశుపాలుని స్వరూపంతోబాటు, స్వభావాన్ని కూడా ఇందు వివరించాడు. ఆచార్యులవారి వ్యాఖ్యాన చతురిమను పరిశీలిస్తే శరీరంలో అవయవాలు తక్కువ ఉన్నా, ఎక్కువ ఉన్నా ఆకారంశ్రీకారం అనిపించదు అంటూ పేర్కొన్నారు.

శిశుపాలుడూ కృష్ణునివలె నాలుగు చేతులతో పుట్టాడు కాబట్టి విష్ణుమూర్తి అనుకుందామా అంటే శివునిలాగ మూడు కళ్ళూ ఉన్నాయి. అయినా చంద్రబింబంలాంటి ఆ బాలుని మొగం చూడడానికి కొంత వింతగా ఉండేదట. ఆ బాలుడు శ్రీకృష్ణుని చేతుల్లోకి రాగానే అధికంగా ఉన్నటువంటి నాలుగు చేతులు మాయమయినాయట.

పుట్టడమే వింత అయితే కొంతకాలం అందరికి అదే వింతగా ఉంటుందట. ఆకారము వికారం అయినప్పటికి అది స్వభావానికి సంకేతం అంటూ రూపంతోపాటు శిశుపాలుని స్వభావాన్ని చూపిస్తూ చేసిన వివరణ చాలా బావుంది. ఆచార్యులుగారి వ్యాఖ్యానంలోని మరో లక్షణం పఠితకు ఎక్కడ విసుగు కలిగించకుండా చదువరిని ఇంకా చదువాలన్న ఆసక్తిని కలిగిస్తుంది.

శ్లో॥ తుంగత్వ మితరానాద్రే నేదం సింధావగాధతా
అలంఘ నీయతాహేతు రుభయం తన్మనస్విని (2-48)

ఇవి బలరాముని మాటలు:

"పర్వతానికి ఔన్నత్యం ఉంది కాని గాంభీర్యం లేదు, సముద్రానికి గాంభీర్యం ఉంది కాని ఔన్నత్యం లేదు. కాని మనిషికి లంఘింపరాని గాంభీర్యౌన్నత్యాలు రెండూ ఉన్నాయి. పర్వతమైనా, పారావారమైనా, రెండూ అసమగ్రం, అసంపూర్ణమే. మనస్సు ఎంత లోతైనదో అంత ఎత్తైనది కూడా. ఆ మనస్సు ఉన్నవాడు మనస్వి. కాబట్టి లంఘింపతగనివాడు, అవమానింప తగనివాడు, మానవుడు. ధీరుడు అద్రికంటే అబ్ధికంటే మానవుడు అధికుడు, పౌరుషవంతుడు"- అంటూ మానవ మనస్సు గొప్పతనాన్ని ఆచార్యులవారు ఇందు తమ మాటల ద్వారా తెలియజేశారు.

"సముద్ర ఇవ గాంభీర్యే" అని ఉపమాలంకారానికి "ఊటబుగ్గ" అని అనడం వాల్మీకిలో ఉపమా లంకారాలు ఎలా ఊటగావస్తాయో అని చెప్పడానికి "ఊటబుగ్గ" అన్న పదప్రయోగం ద్వారా చూపించారు.

ఒక్క గుణం ఉన్నంతనే అచేతనమైన పర్వతంగానీ, పాథోధిగానీ తనను అధిగమింప నీయదు కదా! గభీరుడు, మహోన్నతుడైనా శ్రీకృష్ణుడు అనేక అపరాధాలను చేస్తు మించిపోతున్న శిశుపాలుని ఉపేక్షించక అతనిపై దండెత్తడం తక్షణ కర్తవ్యం అంటూ వ్యతిరేకాలంకారంతో కూడిన వాక్యాలతో ప్రశంసించాడు బలరాముడు.

శ్లో॥ రరాజ సంపాదక మిష్టసిద్ధే/ స్సర్వాసు దిక్ష్వ ప్రతిసిద్ధమార్గమ్
మహారథః పుష్యరథం రథాంగీ/ క్షిప్రం క్షపానాథ ఇవాది రూఢః (3-22)

శ్రీకృష్ణుడు రథము నధిరోహించిన సందర్భములోని వర్ణన:

"మహారథుడూ, చక్రీ అయిన శ్రీకృష్ణుడు కోరిక తీర్చేదీ, ఏ దిక్కైనా నిరాటంకంగానూ వేగంగానూ పోయేది అయిన పుష్యరథంమీద క్షిప్రం అనే నక్షత్రం మీద చంద్రునిలా ఆరోపించి ప్రకాశించాడు".

మహారథుడు అంటే తననూ, సారథినీ గుర్రాలను కాపాడుకుంటూ యుద్ధం చేసేవాడు.

ఈ శ్లోక వ్యాఖ్యానంలో ఆచార్యులవారి జ్యోతిశ్శాస్త్ర పాండిత్యం ద్యోతకమవుతుంది.

విలాసంగా విహరించడానికి వాడుకునే క్రీడారథాన్ని "పుష్యరథం" అంటారు. పుష్యమీ నక్షత్రానికి సంకేతం 'క్షిప్రం'. ఇందులో ఉపమాలంకారం జ్యోతిశ్శాస్త్రానికి సంబంధించింది. 'పుష్యస్సర్వార్థ సాధకః' అన్నట్లు పుష్యమీ నక్షత్రం ఉన్న సమయంలో ప్రయాణించేవారికి పనులన్నీ ఎలాంటి విఘ్నాలు లేకుండా, రాకుండా నెరవేరుతాయి.

పుష్యమీయుక్త చంద్రుడు అంటే కర్కాటక రాశిలో ఉండే చంద్రుడు, ఆ చంద్రుడు ఓర్పుకలవాడు, కీర్తికరుడు, జయప్రదుడు కూడా. ధర్మ నక్షత్రమైన పుష్యమికి అధిపతి గురువు. కర్కాటకరాశి చంద్రునికి స్వక్షేత్రం.

కాలపురుషునికి కర్కాటకం హృదయం, చంద్రుడు అతని మనస్సు, చిత్తం చిత్తంలోనే అంటే ఒకేచోట ఉండడం ధీరలక్షణం. చంద్రుడు ఛాయాగ్రహం కాబట్టి ముందుకు సింహరాశినీ వెనుకకు మిథునరాశినీ చూసే గుణం అతనికి ఉంటుంది. శ్రీకృష్ణుడు ధర్మకార్య నిర్వహణలో ఒకటీ, రెండూ అని మీన మేషాలెంచుతూ, ప్రమాదపడకుండా ప్రమాణంగా ప్రవర్తించి రాశికి వాసి కెక్కె బలం ముహూర్తంలో ఉంది.

మాఘకవి వాడిన చిన్న ఉపమానంలో ఇంతటి మహార్థన్నిచ్చే జ్యోతిశ్శాస్త్ర పాండిత్యం కనపడుతుంది. ఆచార్యులవారికి జ్యోతిశ్శాస్త్రంలో విశేషమైన పాండిత్యం ఉంది. వారి బంధువర్గంలో అందరికి ముహూర్తాలను ఆచార్యులవారే పెట్టేవారని విన్నాను. అలాంటి పాండిత్యంలో ఈ శ్లోకాన్ని వ్యాఖ్యానించి ఒక్క కావ్యం ఇలాంటి వ్యాఖ్యానంతో చదివితే ఎన్నెన్ని విషయాలు తెలుస్తాయో చూపించారు.

శ్లో॥ పరస్పర స్పర్ధి పరార్ధ రూపాః/ పౌరస్త్రియో యత్ర వధాయవేధాః
శ్రీనిర్మితి ప్రాప్త ఘుణక్షతైక/ వర్ణో పమావార్య మలా మమార్జ

ద్వారకా నగర కాంతల వర్ణన:

ద్వారకలో ఉన్న స్త్రీలు అందంలో పోటీపడే రూపవతులు. వీరిని సృష్టించి బ్రహ్మ అందాల భరిణగా లక్ష్మీదేవిని సృజించడం కేవలం ఘుణాక్షరన్యాయమే అనే నిందను నివారించుకున్నాడు.

"ఘుణాక్షర న్యాయం" అంటే ఒక నుసిపురుగు కర్రను తొలిచివేస్తే అది ఏదో ఒక అక్షరంగా ఏర్పడే రీతిని "ఘుణాక్షర న్యాయం" అంటారు.

మొదట పరమేష్ఠి (బ్రహ్మ) లక్ష్మీదేవిని సుందరంగా సృష్టించారు. ఇది ఎలా జరిగిందంటే ఘుణాక్షర న్యాయంగా జరిగిందేకాని, చతుర్ముఖుడికి ఇంతటి అందగత్తెను సృజించే చాతుర్యం ఎక్కడుంది? అనేది లోకంలో ఉన్న అపవాదు. ఆ తర్వాత బ్రహ్మ ద్వారకలో లావణ్యంలో లక్ష్మితో సమానులైన సువాసినులను సృష్టించి తనమీద ఉన్న అపకీర్తి తొలగించుకున్నాడని వివరించారు.

ద్వారకలో ఉన్న రమణులందరూ రూపంలో రమాదేవితో సమానమైన వాళ్ళే అనడం 'అతిశయోక్తి'.

శ్లో॥ దృష్టోపి శైల స్సముహుర్మురారే/ రపూర్వవ ద్విస్మయ మాతతాన,
క్షణే క్షణే యన్నవతాముపైతి/ తదేవ రూపం రమణీయ తాయాః

ఇది రైవతక పర్వత వర్ణన- మాఘుని ప్రకృతి వర్ణనలు కూడా ఉదాత్తంగా నిత్యనూతనంగా ఉంటాయి.

ఎన్నిసార్లు చూసినా, రైవతక పర్వతం శ్రీకృష్ణునికి అపూర్వమైన ఆశ్చర్యాన్ని పెంచుతూనే ఉంది. నిజమే ప్రతిక్షణం కొత్తదనం గోచరింపచేసేదే సౌందర్యం.

ఈ శ్లోకానికి ఆచార్యులవారి వ్యాఖ్యానం ఎంతమధురంగా సాగిందో గమనించడానికి వారి వాక్యవిన్యాసం చూస్తే తెలుస్తుంది.

"ప్రకృతి సౌందర్యం అభినందనీయం. నిరంతర ప్రకృతి సౌందర్య దిదృక్ష ఆ బాల గోపాలాన్ని ఆవేశిస్తుంది. జీవితయాత్ర సాగించేవారు భోగులకూ, యోగులకూ రమణీయత ఆనందదాయకం. క్షణం క్షణం నవం నవం, సర్వేంద్రియాలకు సంతర్పణం, ప్రణవాన్నీ, ప్రణయాన్నీ జీర్ణించుకున్న ప్రకృతి అందం కళాసృష్టికి మూలకందం".

నవం నవం అంటే మొదట చూసింది ఎదలో పదిలమై మళ్ళీ చూస్తే మరోరకంగా కొత్తగా కనబడడమే 'నవత'. క్షణే క్షణే అంటే కాలు కదల్చకుండా నిలిచి చూసినా "క్షణే క్షణే" కన్నుల రెప్పలు కప్పడం విప్పడం కాలవ్యవధి లక్షణం అంటూ రమణీయంగా వ్యాఖ్యానించారు.

శ్లో॥ ఉదయతి వితతోర్ధ్వ రశ్మిరజ్జా/ వహిమకరే హిమధామ్ని యాతి చాస్తమ్
మహతి గిరి రయం విలంబి ఘంటా/ ద్వయ పరివారిత వారణేంద్ర వీవామ్

మాటల నేర్పరి అయిన శ్రీకృష్ణుని సారథి దారకుడు, ఆశ్చర్యంతో రైవతకాద్రిని చూస్తున్న శ్రీకృష్ణునితో ఇలా అంటాడు-

"ఒకవైపు ఉదయిస్తున్న సూర్యునితో, మరొకవైపు అస్తమిస్తున్న చంద్రునితో రైవతకాద్రి, రెండువైపుల రెండు గంటలు వ్రేలాడే గజరాజు శోభవంటి శోభను వహిస్తున్నది".

"మధ్యలో ఉన్నది రైవతక పర్వతం. ఉదయించే సూర్యుడు ఒకవైపు, అస్తమించే చంద్రుడు రెండోవైపు గంటల్లా ఉన్నారు. పైకి వ్యాపించిన కిరణాలు త్రాళ్ళలా ఉన్నాయి. కంఠాన వ్రేలాడే రెండు గంటలున్న గజరాజులా ఈ గిరిరాజు శోభిస్తున్నాడు" అని వర్ణించడం కవిబ్రహ్మ అద్రికి కూడా ఆయువును పోసి పఠితకు లోకోత్తరమైన ఆహ్లాదాన్ని ఆనందాన్ని కలిగిస్తున్నాడు.

ఉదయించేది ఉదయాద్రి- అస్తమించేది అస్తాద్రి ఈ రెండు పర్వతాలు వేరు. వేరు వేరుగా కవులు వర్ణించారు కానీ మాఘకవి ఇక్కడ ఒకేసారి సూర్యచంద్రుల ఉదయాస్తమయాలను ఒక్క రైవతక పర్వతం మీద దొరకడం దర్శించడం అపూర్వం.

ఉపమాన ధర్మమైన గజరాజు శోభ, ఉపమేయమైన గిరిరాజుకు కల్గడం అసంభవం. అయినా గజరాజు శోభవంటి శోభను గిరిరాజు దాల్చాడు- అని సాదృశ్యాన్ని బట్టి ఏకత్వాన్ని సాధించబడినందువల్ల ఇది 'నిదర్శనాలంకారాన్ని' తెలియజేస్తుంది.

సూర్యచంద్రులు పర్వత కుక్షితో సమానమైన కక్షలో సంచరిస్తారని చెప్పడంతో రైవతకాద్రి మహౌన్నత్యం ధ్వనిస్తుంది. ఇందులో అహిమ, హిమ, వారి, వార అని శబ్దాలు ఆవృత్తి అయినందువల్ల వృత్త్యనుప్రాసాలంకారం ఇందులో చూపబడింది.

శ్లోక రచనలోని అందం, నాదం ఆయా శబ్దాల ద్వారా చూపించబడింది.

ఉదయ- అస్తమ్ ఒకేసారి కాబట్టి శ్లోక పూర్వార్ధాన్ని ఇటు చూసి అటు చూడాలి. పూర్వాపర దిక్కుల్లో క్రమంగా పెరగడం, తరగడం కనబడుతుంది.

శ్లోకంలో ఊర్ధ్వ రశ్మి రజ్జే మొదలుకొని దీర్ఘాక్షరాలుండడం విశేషం ఇవి పొడవైన తాళ్ళు మూసి వేసిన భాగాలుగా అగుపడుతున్నాయి.

పూర్వార్ధంలో 'రే' ఉత్తరార్ధంలో 'ణే' ఇవి మెడపైన రెండువైపులా వ్రేళ్ళాడదీసే తాళ్ళలాగ కనపడుతున్నాయి. ఏ ఏనుగు మెడమీద తాడు మర్కిలాగ కనబడుతున్నది. 'ఘంటా-ద్వయ' శబ్దాలు రెండు వరుసల్లో ప్రయోగించి రెండు ఘంటలు రెండు వైపులా ఉన్నాయని స్ఫురింపజేశాడు. ఇక ఇందులోని నాద సౌందర్యం, ధామ్ని, యావి, లంబి, ణేంద్రలోని గురులఘు అక్షరాలమధ్య ఉన్నటువంటి బిందువులవల్ల ప్రసారమవుతున్నదని తెలుస్తుంది. ఆద్యంతాక్షరాలు కలసి 'ఉదయలీల' అనేది స్పష్టమవుతున్నది. ఉదయకాలంలో వారణేంద్ర లీలవంటి లీలవహించిన 'గిరి' మధ్యలోనే ఉండడం ఇందులోని విశేషం.

ఈ శ్లోకంలో భావ సౌందర్యం, రచనా సౌందర్యం, రూప సౌందర్యం ఈ మూడు ఇందులో సత్యం శివం సుందరంలా సమ్మేళనం చెందాయి.



ఇది సంస్కృత సాహిత్యంలో ప్రసిద్ధమైన శ్లోకం. కాళిదాసుకు 'దీపశిఖ' అని భారవికి 'కనకాత పత్ర' మనీ పేరు వచ్చినట్లుగానే ఈ శ్లోక రచన చేసిన శ్రీ మాఘకవికి ఘంటామాఘుడు అనే పేరు వచ్చింది.

శ్లో॥ రాహుస్త్రీ స్తనయో రకారి సహసా/ మే నాశ్లథా లింగన
వ్యాపారైక వినోద దుర్లలత యోః/ కర్కశ్యలక్ష్మీర్వృథా
తేనా క్రోశిత ఏవ తస్య మురజి/ త్తత్కాల హోవనల
జ్వాలా పల్లవితేన మూర్ధ వికలం/ చక్రేణ చక్రే వపుః

సమరంలో శస్త్రాస్త్రాలతో శ్రీకృష్ణుణ్ణి జయించడానికి శక్తిచాలక చివరకు ఈటెల పోటిలాంటి మాటలతో మర్మాన్ని భేదించే శిశుపాలుని మీద శ్రీకృష్ణుడు ప్రయోగించిన చక్రవర్ణన.

ఈ శ్లోకానికి వ్యాఖ్యానాన్ని అందిస్తూ ఆచార్యులవారు సడలని బిగికౌగిలి ఆనందానికి ఆరాటపడే రాహువు పత్నీ స్తనాల కాఠిన్య శోభను వ్యర్థం చేసిన సుదర్శన చక్రాన్ని, ఇప్పుడు అగ్నిజ్వాలలతో అది ప్రజ్వరిల్లుచుండగా శ్రీకృష్ణుడు ప్రయోగించి, అదేపనిగా దూషిస్తున్న శిశుపాలుని తలను అతని దేహంపైన లేకుండా చేశాడు. తల తెగిన రాహువు ఆలింగనాది సుఖసాధ్యమైన శరీరంలేని రాహువు, తన భార్యను చూచుకుంటూ మురవడానికి తల మాత్రమే మిగిలి ముద్దు కోసం బ్రతుకుతున్నాడు బండ బ్రతుకు. శిశుపాలు వాగ్బాణాలు వేసి మర్మాన్ని భేదిస్తుంటే శ్రీకృష్ణుడు చక్రంతో శిశుపాలుని కంఠాన్ని ఖండించాడు. శిశుపాలుని దేహంనుండి వెలువడ్డ దివ్యతేజస్సు శ్రీకృష్ణునిలో లీనం కావడంతో ఈ మహాకావ్యం ముగుస్తుంది.

శ్రీమాన్ రాఘవాచార్యులవారు తమ వ్యాఖ్యానము మాఘకావ్య వైభవముతో ప్రారంభించి ప్రతిభతో వేదాంత దేశికుల గ్రంథాలన్నిటికి వ్యాఖ్యానాలు అందించి తెలుగు నేలకు, తెలుగు లోగిళ్ళకు వేదాంత దేశిక సాహిత్యాన్ని పరిచయం చేసి ఆంధ్ర వేదాంత దేశికులుగా పేరు పొందారు.

వారి సంప్రదాయ నిష్ఠ, విద్యావినయ సంపన్నతలు ఈ తరం వారికి ఆదర్శప్రాయం. మాఘకావ్య వైభవమును మరోసారి చదివే అవకాశం కల్పించిన వారికి కృతజ్ఞతలు.

అధికార సంగ్రహం

భాగవతుల లక్ష్మణాచార్యులు
చరవాణి: 9177 823 930

శ్రీమాన్ వేంకటనాథార్యః కవితార్కిక కేసరీ।
వేదాన్తాచార్య వర్యోమే సన్నిధత్తాం సదా హృది॥

వివిధ విషయ వ్యాఖ్యాన లేఖన నిపుణులు, బహుభాషాకోవిదులు, అభినవ మల్లినాథులునైన శ్రీమాన్ కె.వి.రాఘవాచార్యస్వామివారి లేఖిని నుండి వెలువడిన మరో వ్యాఖ్యాన గ్రంథం 'అధికార సంగ్రహం'. ఈ వ్యాఖ్యానానికి వారు పెట్టుకున్న పేరు 'అమృతవర్షిణీ' అన్వర్థ నామధేయమే. చదువు నారంభించిన ఏ గీర్వాణాంధ్రాభినివేశియైన ఆసాంతం అమృత వృష్టిలో తడవకమానదు. రసప్లావిత హృదయుడు కాకమానదు. ఆచార్యులవారిపై వేదాంతదేశికుల కరుణయట్టిది.

ఆచార్యులవారు వ్యాఖ్యానమనగానే దానికి ఉండవలసిన ఛందస్సంబంధి, అలంకార సంబంధి, పదప్రయోగ సంబంధి, వ్యాకరణ సంబంధి విషయాలను చక్కగా వివరిస్తారు. అట్లాగే తమ వ్యాఖ్యానానికి వేదాలు, ఇతిహాస పురాణాలు, పూర్వాచార్యుల స్తోత్రాలు, ఆగమాలు, ద్రావిడవేదాలు (ఆళ్వారుల పాశురాలు), వీటినుండి సందర్భానుగుణంగా ఉదాహరణలు వ్యాఖ్యలో అందించి వ్యాఖ్యానానికి పరిమళమద్దుతారు. వ్యాఖ్యానాలకు వారు పెట్టే పేర్లు కూడా వారి మనస్సుకు తగ్గట్టు పరిమళిస్తూ పాఠక హృదయాన్ని రంజింపచేస్తూ మూలానికి శోభను చేకూరుస్తూ ఉన్నందువలన తమ వ్యాఖ్యానాలకు పరిమళ, మనోరమ, దీపిక, అమృతాస్వాదినీ, చంద్రికా, సంజీవనీ, శ్రేయసీ, బుధరంజనీ, వైష్ణవీ, సర్వంకషా వంటి పేర్లను పెట్టి తమ వ్యాఖ్యానమెట్టిదో తెలుపకనే తెలిపినారు.

ఇందులో దేశికులనుగ్రహించిన ప్రతి శ్లోకానికి అర్థ తాత్పర్యవ్యాఖ్యలను వివరించుటయే కాక ఆ శ్లోకంలోని విశేషాంశాలను విడమరచిన తీరు ఒక్కొకమారు మల్లినాథునే మరిపిస్తుంది. ప్రతి శ్లోకానికి గల ఛందస్సును వివరించడం కూడా ముదావహము.

దేశికులవారి నారికేళ పాకాన్ని ద్రాక్షాపాకంగా మార్చి ప్రపన్నులకు మరింత సన్నిహితులైనారు శ్రీ రాఘవాచార్యుల వారు. వీరి ఈ వ్యాఖ్యానమే లేకుంటే దేశికులవారి పాండిత్యంలోని 'శబ్దగాంభీర్యాన్ని' మాత్రమే ఆస్వాదించే భాగ్యం మాత్రమే మా బోటివారికి లభించియుండేది.

మంగళాచరణంగా పేర్కొనబడిన 'ప్రపదనమయే విద్యాభేదే' అనే శ్లోకంలోని అంతరార్థాన్ని ఎంతో గొప్పగా వివరించినారాచార్యులవారు. గ్రంథనిర్విఘ్న పరిసమాప్తి కొరకు ప్రాచేతస వేదవ్యాసాది ప్రాచీన



కవి ఋషులనే కాక శఠకోప, నాథయామునాది శ్రీవైష్ణవాచార్యులను కూడా స్మరించుకోవడం ద్వారా తన కంటే తన భక్తుల నాశ్రయించడమే తన కత్యంతానందదాయకమనే భగవదభీష్టాన్ని మనముందుంచినారు. ఇదే విశిష్టాద్వైత పరంపరా లక్షణం.

'హృద్యా హృత్పద్మ సింహాసన' అనే మూడవ శ్లోకాన్ని వ్యాఖ్యానిస్తూ నేటితరానికి తెలియదగిన గొప్ప విషయాన్ని తెలిపి నారాచార్యులవారు. 'మననాత్ త్రాయతే మన్త్రః' ఇతరులకు వినిపించకుండునట్లుగా మనము ద్వారానే మనలను రక్షిస్తుంది గనుక నది మంత్రమనే విషయం మనకు తెలిసినప్పటికినీ కేవలం మంత్రాన్ని అనధికారుల చెవిన బడకుండా కాపాడుకోవటమే కాక అట్టి మంత్రాన్ని ఉపదేశించిన ఆచార్యులను ప్రశంసించడం అత్యావశ్యకమని లేనియెడల సంపత్తు, ఆయువూ రెండూ క్షీణిస్తాయి అనే మహత్తర విషయాన్ని తెలియపరచిన ఆచార్యులవారికి కార్తజ్ఞం ప్రకటించడం మన బాధ్యత.

తిరుమంత్రమైన అష్టాక్షరీమంత్రాన్ని, ద్వయమంత్రమైన మంత్రరత్నాన్ని, చరమ శ్లోకాన్ని రహస్య త్రయమంటారు. ఈ రహస్యత్రయ సారమే అపేక్షణీయమని వివరించే ఏడవ శ్లోకమైన 'శ్రుతిపథ విపరీతం...' అనే శ్లోక వ్యాఖ్యానం ద్వారా మన జీవిత లక్ష్యాన్ని కర్తవ్యాన్ని అద్భుతంగా ఉపదేశించినారు.

పదకొండవదైన 'ఆదౌ ప్రాప్యం పరమ మనఘం'... అనే శ్లోకాన్ని వ్యాఖ్యానిస్తూ 'ఆదౌ' అనే పదానికి గల అర్థాన్ని అద్భుతంగా వివరించి 'అః ఆదిః యస్య తస్మిన్ ఆదౌ= అకారము మొదట ఏ మంత్రమునందు కలదో అది ఆదిః దానియందు అనగా ప్రణవమైన ఓంకారము అకార ఉకార మకారముల సమాహారము నందే అకారము నారాయణ వాచ్యము కదా' అద్భుతమైన విశ్లేషణ. ఇదే వ్యాఖ్యానం చివరలో "ద్వ్యక్షరస్తు భవేన్మృత్యుః త్ర్యక్షరం బ్రహ్మ శాశ్వతమ్, మమేతి ద్వ్యక్షరో మృత్యుః న మమేతి చ శాశ్వతమ్" అని పేర్కొనడం ద్వారా మమ (నాది) అనే రెండక్షరాలు మృత్యుహేతువులని న మమ (నాది కాదు) అనే మూడక్షరాలు శాశ్వతత్వాన్ని సూచిస్తాయని చెప్పడం ద్వారా జీవిత పరమార్థాన్ని సాక్షాత్కరింపచేశారు. అకార, ఉకారములనే రెండక్షరములు మకారమనే మూడవ అక్షరముతో కూడి యున్నప్పుడే 'ఓమ్' అనే ప్రణవం పరిపూర్ణమై ప్రాణం పోసుకుంటున్నది కదా!

'ప్రకృత్యాత్మ భ్రాంతిర్గళతి...' అనే పదమూడవ శ్లోకంద్వారా తత్త్వత్రయాధికారాన్ని ప్రతిపాదిస్తూ ముముక్షువులకు తత్త్వత్రయచింతన అత్యావశ్యకమని పూర్వాచార్యులు ఉపదేశించినట్లుగా చిద్రూపమైన జీవుడు భోక్తయని, అచిద్రూపమైన జడవస్తువు భోగ్యమని, ఈ రెండింటిని నియమించినవాడు ఈశ్వరుడని ఈ తత్త్వత్రయాధికారాన్ని సాధించిననాడే ముముక్షుత్వం సిద్ధిస్తుందని ఆచార్యులవారు అద్భుతంగా వివరించినారు. జీవులు, బద్ధులు, ముక్తులు, నిత్యులుగా మూడు విధాలని స్పష్టీకరించినారు. అదేవిధంగా సత్త్వ, రజస్తమో గుణాత్మకమైన ప్రకృతియొక్క స్వరూప స్వభావాలను ఈ శ్లోక వ్యాఖ్యానం ద్వారా విశదపరచినారు. బలవత్తరమైన కాలస్వరూపాన్ని తెలియజేసినారు.

'పరదేవతాపారమార్థ్యాధికారాన్ని' నిర్ధారించే 'ఆత్మైక్యం దేవతైక్యం' అనే పదిహేనవ శ్లోకం ద్వారా ఉపనిషన్మూలకములైన గ్రంథాలు తెలియజేసినట్లుగా 'శ్రీమన్నారాయణుడొ'క్కడే అంతటినీ పాలించేవాడని,

చరాచర వస్తువులను తన శరీరంగా కలవాడని, మోక్షమొసగువాడని, ముక్తపురుషులచే అనుభవింపబడు వాడనియు ఎవరికీ ఎట్టి సందేహం కలుగకుండునట్లుగా విపులంగా తెలియపరచినారు. ఈ శ్లోక వ్యాఖ్యానం ద్వారా మోక్షహేతువైన 'పరదేవత' శ్రీమన్నారాయణుడే కాని అన్యదేవతలెవరూ కారనే విషయం స్పష్టమగుచున్నది.

'కాలావర్తాన్ ప్రకృతి వికృతీః'... అనే పదిహేడవ శ్లోకం ద్వారా 'ముముక్షుత్వాధికారాన్ని' వివరిస్తూ కాలవికారాలను తెలుసుకొని తన చరాచర వస్తువులందు మమతాహంకృతులను వదులుకున్నవానికి మోక్షేచ్ఛ గలిగి, అశాశ్వతమైన స్వర్గప్రాప్తికంటే కూడ అనన్యతమమైన మోక్షాన్ని పొందగోరినవాడై ప్రవృత్తి ధర్మాలను వదిలి నివృత్తి ధర్మాలను అవలంబించి, ముముక్షువు అయ్యే అధికారాన్ని సాధిస్తాడని చక్కగా తెలియజేసినారు.

'అధికారి విభాగాధికారాన్ని' వివరించే 'ముముక్షుత్వేతుల్యే' అనే పందొమ్మిదవ శ్లోక వ్యాఖ్యానంలో అధికార భేదాన్ని తెలియజేస్తూ 'బ్రహ్మవిద్యోపాసన' అన్ననూ 'ప్రీతి పూర్వకమైన ధ్యానం' అన్ననూ 'భక్తి' యనియు ప్రథమ శ్లోకంలో పేర్కొన్నట్లుగా న్యాసం, త్యాగం శరణాగతి మొదలైన పర్యాయ పదాలు గలది 'ప్రపత్తి' యనియూ శక్తికలవారు కాలవిలంబనాన్ని ఓర్చుకొనేవారు 'భక్తి'ని అనుష్ఠిస్తారనీ, శక్తిలేనివారు ఆలస్యాన్ని సహింపలేనివారు 'ప్రపత్తి'ని అనుష్ఠిస్తారని ఇరువురికి ముముక్షుత్వం సిద్ధిస్తుందనీ వివరించినారు.

"ప్రపన్నాదన్యేషాం న దిశతి ముకుందో నిజపదం' అనే ఇరువదవ శ్లోకంలోని మొదటి చరణంలో చెప్పినట్లుగా ముకుందుడు ప్రపన్నులకు తప్ప ఇతరులకు మోక్షాన్ని కృప చేయడనే విషయం సుస్పష్టం, భావమూ సులభగ్రాహ్యమే. ప్రపన్నులు రెండు విధములు. సద్వారక ప్రపత్తినిష్ఠుడని, అద్వారక ప్రపత్తినిష్ఠుడని అంగప్రపన్నుడు భక్తి నిష్ఠుడైనవాడు 'సద్వారక ప్రపత్తి నిష్ఠుడనియు' స్వతంత్ర ప్రపన్నుడు 'అద్వారక ప్రపత్తి నిష్ఠుడని'యు పేర్కొనబడినారు.

'ఉపాయ విభాగాధికారాన్ని' వివరించే 'ఉపాయస్స్వప్రాప్తే' అనే శ్లోకం ఇరువది ఒకటవది. ఇందులో ఉపనిషత్ప్రతిపాద్యుడైన భగవానుడే చేతనులు తనను పొందడానికి కారణ భూతుడనీ, భక్తి, ప్రపత్తులు రెండూ మోక్షోపాయాలనీ శాస్త్రవచనం, చేతనులు తనను చేరడానికి ఆ భగవానుడే స్వయంగా ఉపాయమైనవాడని ఉపనిషత్తులు ప్రతిపాదిస్తున్నాయి. ఉపాయమనగా చేతనులకు కర్తవ్యమైన ఒకవిధమైన జ్ఞానవికాసం. ఆ ఉపాయంచేత సాధింపబడే భగవత్ప్రాప్తి రూపమైనది ఉపేయం. ఈ ఉపేయం కూడా ఒక విధమైన జ్ఞాన వికాసమేనని ఆచార్యులవారు వ్యాఖ్యానించినారు. మార్గము గమ్యము రెండూ సర్వేశ్వరుడే ఐనందువలన ఆయనకే ఉపాయత్వం, ఉపేయత్వం రెండూ కలవని ఇక్కడ విశదమగుచున్నది.

'ప్రపత్తి యోగ్యాధికారాన్ని' వివరించే 'అర్థిత్వేన సమర్థతా...' ఇత్యాది ఇరువది మూడవ శ్లోకంలో న్యాసవిద్యను- ప్రపత్తిని- అనుష్ఠించదలచిన వ్యక్తికి ఉండవలసిన అధికార విశేషాలను విశేషంగా వ్యాఖ్యానించి నారాచార్యులవారు. ఫలవిషయంలో కోరిక, ఉపాయ విషయంలో సామర్థ్యం ఉండడమే అధికారం అనబడుతుంది. ఆ యధికారం కూడా భక్తి ప్రపత్తులను అనుష్ఠించేవారికి వేరు వేరు విధాలుగా శాస్త్రం నిర్ణయించియున్నది. అట్లే ప్రపత్తికి కుల గోత్రాది ప్రపత్తి ననుష్ఠించడానికి అధికారం కలదు.

'భక్త్యాదౌ శక్త్య భావః' అనే ఇరువది నాల్గవ శ్లోకంలో దైవ వశంవల్ల సంప్రాప్తించే నాలుగు అధికారాంశాలు కారణాలుగా వున్నాయని చెప్పబడింది. 1) భక్త్యాదులను అనుష్ఠించడమందు శక్తి లేకపోవడం, 2) జ్ఞానంలేకపోవడం, 3) శాస్త్రంద్వారా తెలుసుకోవాలనే కోరిక లేకపోవడం, 4) ఫలప్రాప్తి కోసం ఆలస్యాన్ని సహించకపోవడం. వీటి మూలంగా తమ తమ అధికారమందు భేదం కలవారైనా బ్రహ్మనిష్ఠులు మోక్షం కోసం స్వతంత్ర ప్రపత్తి ద్వారా శ్రియఃపతిని శరణుపొందుతున్నారు. ఆచార్యులవారు తమ వ్యాఖ్యానంలో ప్రపత్తిని అనుష్ఠించడానికి పదిహేను అధికారాలున్నాయని విశ్లేషించినారు.

'పరికర విభాగాధికారాన్ని' వివరించే 'ఇయానిత్థం భూతః' అనే ఇరువది ఐదవ శ్లోకంలో న్యాస విద్యకు ప్రపత్తికి పరికర విశేషం వేదం, పాంచరాత్రాది శాస్త్రాలచే ప్రామాణికంగా ప్రదర్శింపబడింది. ఈ శ్లోక వ్యాఖ్యానంలో భగవానుడు దయా సముద్రుడు కాబట్టి చరాచర జగత్తు లోపలనుండి అన్నింటినీ నియమిస్తున్నాడని పేర్కొనబడింది.

'సాంగ ప్రపదనాధికారాన్ని' నిర్వచించే 'అభీష్టేదుస్సాధే' అనే ఇరువది ఏడవ శ్లోకంలో ఉపాయాంతరాల చేత సాధ్యం కానట్టి ఫలవిషయంలో స్వయంగా ఆచార్యుని మూలంగా భగవంతుని ప్రార్థించి, ఆయనపై భారముంచడాన్ని ప్రపత్తియని విజ్ఞులు చెబుతున్నారు. ఇక ప్రపత్త్యనంతరం నేను కోరిన ప్రయోజనాన్ని నెరవేర్చే భారమూ నీదేయనే జ్ఞానాన్ని కూడా ప్రపత్తినిగా భావిస్తున్నారు. అంగాలను సప్రయోజనంగా నిరూపించిన తరువాత అంగి స్వరూపాన్ని లక్షణంగా నిష్కర్షించి, ప్రదర్శించే ఈ శ్లోక వ్యాఖ్యానంలో ఇతరోపాయాలచే సాధింపశక్యంగాని ఫలం అంగి స్వరూపం. ప్రణవమందున్న అకారమందుగల ప్రకృతి ప్రత్యయాలచే సర్వరక్షకుడుగాను, సర్వశేషిగాను తెలియజేయబడుచున్న సర్వేశ్వరునిపై తనయొక్క, తనకు సంబంధించిన వాటియొక్క రక్షణభారాన్ని, రక్షణమూలకమైన ఫలంకూడా నాది కాదు అనే త్యాగ భావంతో సర్వభారాన్ని మోపడమే ఆత్మనిక్షేపం, అంగిస్వరూపం అనబడుతుందని తెలియజేసినారు.

'కృత కృత్యాధికారాన్ని' తెలిపే 'సమర్థే సర్వజ్ఞా" అనే ఇరువది తొమ్మిదవ శ్లోకంలో సమర్థుడైన, సర్వజ్ఞుడైన, సహజమిత్రుడైన భగవానుడు మన రక్షణ భారాన్ని స్వీకరించియుండగా మనం మన రక్షణ విషయములో ఎందుకు ప్రయత్నం చేయవలెను? సర్వేశ్వరుడు మన రక్షణభారాన్ని స్వీకరించిన తరువాత మన ప్రయత్నం అవసరం లేదు. ఆచార్యులవారు తమ వ్యాఖ్యానంలో సమర్థుడు, సర్వజ్ఞుడు, సహజసుహృత్ అనే మూడు పదాలు నిర్భరత్వానికి హేతుగర్భ విశేషణాలనీ, అట్టి సర్వశక్తిమంతుడైన సర్వేశ్వరుడు మన ఆత్మను సమర్పించగానే స్వీకృతభరుడైనాడని చక్కగా విశ్లేషించినారు.

"స్వనిష్ఠాభిజ్ఞానాధికారాన్ని" తెలిపే "స్వరూపోపాయార్థేషు" అనే ముప్పది ఒకటవ శ్లోకంలో సదాచార్యులచే తీర్చిదిద్దబడిన వ్యక్తి వ్యర్థంకానట్టి యథార్థమైన నిష్ఠగల వాడౌతాడు. ఇట్టి ప్రపన్నుడు కామ క్రోధాదులను అణచివేయగల సమర్థుడవుతాడు. ఇది ప్రపన్నుని లక్షణం. అచంచలమైన నిష్ఠ, సేవాభిజ్ఞానం గల వ్యక్తికి తన నిష్ఠను గురించిన జ్ఞానం తాను పొందపోయే మోక్షం కంటే గూడ ఎక్కువ భోగ్యమైనది.

కృతకృత్యాధికారియైన ప్రపన్నునికి స్వనిష్ఠాభిజ్ఞానం మోక్షం సుఖం కంటే మించిన సుఖరూపంగా వుంటుందని ఆచార్యులవారి సుస్పష్ట వ్యాఖ్యానం.

'ఉత్తర కృత్యాధికారాన్ని' తెలిపే 'సంతోషార్థం విమృశతి' అనే ముప్పది మూడవ శ్లోకంలో ఇహలోక పరలోక భోగాలన్నీ భగవదధీనమైనవే అనుకొని భగవానునిపై భారముంచిన ప్రపన్నుడు జీవించి యున్నంతవరకు శాస్త్రీయ వృత్తిని అవలంభిస్తున్నాడు. పూర్వాచార్యుల శ్రీసూక్తులను అనుసంధానం చేస్తున్నాడు. ఈ శ్లోక వ్యాఖ్యానంలో ప్రపత్తిని అనుష్ఠించిన తరువాత శేషజీవితాన్ని ప్రపన్నుడు గడిపేవిధానం సుశ్లోకితం. దృష్టం అంటే దేహయాత్ర, అదృష్టం అంటే ఆత్మయాత్రయని ఆచార్యులవారు చక్కగా వ్యాఖ్యానించినారు.

'ప్రణయిన మివప్రాప్తం' అనే ముప్పది నాలుగవ శ్లోక వ్యాఖ్యానంలో ఆచార్యులవారు భక్తుడు భగవంతుని ఎట్లు సేవించవలెనో ఈ ఉపమానాల ద్వారా తెలియజేస్తున్నారు. "సతీవ ప్రియ భర్తారం జననీవ స్తనంధయమ్। ఆచార్యం శిష్య వన్మిత్రం మిత్ర వల్లాలయే ద్ధరిమ్॥" అన్నట్లు పతివ్రతయైన స్త్రీ తన ప్రియుడైన భర్తను లాలించునట్లు, తల్లి తన చంటిబిడ్డనువలె, శిష్యుడు ఆచార్యునివలె మిత్రుడు తన స్నేహితుడిని వలెను, భక్తుడు భగవంతుని సర్వోపచారములతో లాలించవలెను. ఇది ప్రపన్నుడు భగవంతునికి చేయు కైంకర్యము.

'పురుషార్థ కాష్ఠాధికారాన్ని' నిర్వచించే 'స్వతంత్ర స్వామిత్వాత్' అనే ముప్పది ఐదవ శ్లోకంలో భగవత్కైంకర్యం వలెనే భాగవత కైంకర్యము చేయవలెనని, భాగవత కైంకర్యంతోనే భగవంతుడు సంతోషిస్తాడని చెప్పబడియున్నది.

"యే కే చాస్మచ్ఛ్రేయాం సో బ్రాహ్మణాస్తేషాం త్వయాసనేన ప్రశ్వసితవ్యమ్" అని శిక్షావల్లిలో చెప్పినట్లుగా 'మాకంటే శ్రేష్ఠులైన బ్రహ్మజ్ఞానులకు నీవు ఆసనాద్యుపచారాలు సలిపి వారిని సంతోషపరచవలెను'. 'యస్య దేవే పరాభక్తిః యథాదేవే తథాగురౌ'. భగవంతుని పూజించినట్లే ఆచార్యుని కూడా పూజింపవలెనని శ్రుతి స్మృతులు బోధిస్తున్నవి. 'భగవంతునికి అన్నింటికంటెను భాగవత కైంకర్యం ఎక్కువ ఇష్టమైనది'.

'శాస్త్రీయ నియమనాధికారాన్ని' వివరించే 'ముకుందే నిక్షిప్య' అనే ముప్పది ఏడవ శ్లోకంలో ప్రపన్నుడు శాస్త్రీయ పద్ధతిని అనుసరించకపోయినట్లైతే తనకు, ఇతరులకూ కూడా అనర్థాన్ని కలుగజేస్తాడు కాబట్టి మోక్షం కలిగేవరకు శాస్త్రీయ పద్ధతిని అనుసరించి ప్రవర్తించడం ఆవశ్యకమని ప్రతిపాదింపబడింది.

'అపరాధ పరిహారాధికారాన్ని' తెలియజేసే "స్వచ్ఛస్వాదు" అనే ముప్పది తొమ్మిదవ శ్లోకంలో పాప పరిహారార్థమై ప్రపన్నుడు ప్రపత్తి చేసిన పిమ్మట తిరిగి పాపాలను చేస్తున్నట్లయితే ప్రాజ్ఞులు అతనిని పరిత్యజిస్తారనీ బుద్ధిపూర్వకంగా కానీ తెలియక కానీ అపరాధం చేసినప్పుడు క్షమింపుమని భగవత్సన్నిధిలో ప్రార్థించడమే ప్రాయశ్చిత్తమని ఆచార్యులవారి వ్యాఖ్యానం. ప్రాయశ్చితం అంటే ఇక్కడ మళ్ళీ 'శరణాగతి' చేయడమే. భాగవతుల విషయంలో అపరాధమొనర్చిననూ క్షమాగుణం కోరుకోవలసినదే.

ఈ విధంగా స్థాన విశేషాధికారం, నిర్యాణాధికారం, గతి చింతనాధికారం, పరిపూర్ణ బ్రహ్మాను భవాధికారం, సిద్ధోపాయ శోధనాధికారం మున్నగు మొత్తం ముప్పదిరెండు అధికారాలను 'అర్థానుశాసన

విభాగం', 'స్థిరీకరణ విభాగం', 'పదవాక్యయోజనా విభాగం', 'సంప్రదాయ ప్రక్రియా విభాగం' అనే నాలుగు విభాగాలలో మొత్తం డెబ్బది ఐదు శ్లోకాలలో శ్రీవేదాంత దేశికుల వారు అనుగ్రహించిన 'అధికార సంగ్రహమ్' అనే గ్రంథానికి 'వాచస్పతి' 'పండితరత్న' ఐన శ్రీమాన్ కె.వి.రాఘవాచార్యులవారు ఎంతో శ్రమకోర్చి తమ 'అమృతవర్షిణీ వ్యాఖ్యానం'తో ప్రపన్నుల నెందరినో అలరించినారు.

నారాయణనుని తప్ప మరొక దైవాన్ని ఆశ్రయించవద్దు. ప్రపత్తి తప్ప మరొక ఉపాయాన్ని ఆచరించ వద్దు. ఇట్టి ప్రపన్నుని స్వామి అనుగ్రహించి తన కైంకర్యానికి ఉపయోగించుకుంటాడు. అష్టాక్షరీ, ద్వయమంత్రము, చరమ శ్లోకము అని మూడు విధాలుగా శ్రీమన్నారాయణుడు నిర్దేశించిన మార్గాన్నే రహస్యత్రయ సారాన్నే 'అధికార సంగ్రహం'. డెబ్బది ఐదు శ్లోకాలలో నాలుగు అధికరణాలలో వివరంగా శ్రీవేదాన్తదేశికులవారు అనుగ్రహించిన శ్లోకాలను ద్రాక్షాపాక రీతిలో ఈ మార్గంలో పయనిస్తున్నవారికి అమృతాన్ని అందిస్తున్నట్లు వాచస్పతి శ్రీమాన్ కె.వి.రాఘవాచార్యులవారు 'అమృతవర్షిణీ' వ్యాఖ్యానాన్ని శ్రీవైష్ణవ సంప్రదాయపరులకు అందించి కృతకృత్యులైనారు. సంప్రదాయాన్ని సాధారణులకు కూడా సులభంగా అర్థమయ్యేటట్లు అందించిన శ్రీమాన్ ఆచార్యులవారికి, నమశ్శతముల నర్పిస్తున్నాను.

న్యాసదశకం

ఆచార్య శ్రీనివాసశర్మ

చరవాణి: 9346 570 748

శ్రీవేంకటేశ్వరుని ఘంటావతారులుగా విఖ్యాతులైన మహాపురుషులు, కారణజన్ములు శ్రీవేదాంత దేశికుల వారు. లోకోత్తర గ్రంథాలనెన్నో రచించిన మహామేధావి, శతాయుష్కులు రాసిన 'న్యాసదశకం'లో పట్టుమని పది శ్లోకాలున్నాయి. వేదాంత దేశికులవారు శరణాగతి ప్రాశస్త్యాన్ని సామాన్యులకు తెలిపేందుకు ఈ చిరు పొత్తం రాశారేమో అనిపిస్తుంది. ఆకారంలో చిన్నదైనా అద్భుత విషయాల నందించే అపూర్వ పుస్తకమిది. ఈ అద్భుతగ్రంథానికి విద్వాంసులు 'వాచస్పతి' శ్రీ కె.వి.రాఘవాచార్యులు అర్థ తాత్పర్యాలు రాసి వేదాంత దేశికుల హృదయాన్ని ఆవిష్కరింపజేశారు.

అన్నట్లుగా మూలంలో లేని విషయాల్ని రాఘవాచార్యులు ఉటంకించలేదు. అనవసర విషయాల్ని ఇందులో ప్రస్తావించనే లేదు. ఆద్యంతం విషయాల్ని విశదీకరించేందుకు తిరువాయిమొళి చరణాల్ని ఉల్లేఖించారు. స్థాలీపులాక న్యాయంగా 'న్యాసదశకం' పై రాఘవాచార్యులు రాసిన తెలుగు వ్యాఖ్య గురించి ముచ్చటగా మూడు ముక్కల్లో చెప్పాలనుకుంటున్నా.

సర్వరక్షకుడు శ్రియఃపతియే అనే సత్యాన్ని సోదాహరణంగా వ్యాఖ్యానంలో వివరించారు. భగవంతునికి మనం శరణాగతులమైతే మన యోగక్షేమాల్ని ఆయనే చూసుకుంటాడు. మనుషుల రక్షణలో ప్రమాదం దాగుంది. మాధవుని రక్షణలో ప్రమోదం నెలకొంది- అని వివరించారు.

నేను, నా రక్షణ భారం, నన్ను రక్షించడం వల్ల కల్గే ఫలం- ఇవన్నీ నావికావు. శ్రీపతివే! అని భావించి జ్ఞాని భగవంతుని శరణు వేడాలని దేశికుల అభిమతం. దీన్ని ప్రథమ శ్లోకంలో చక్కగా ఆవిష్కరించారు శ్రీరాఘవాచార్యులు.

భగవద్గీతలో శ్రీకృష్ణుడంటాడు-

"సర్వధర్మాన్ పరిత్యజ్య/ మామేకం శరణం వ్రజ
అహంత్వా సర్వపాపేభ్యో/ మోక్షయిష్యామి మాశుచః"

సకల ధర్మాలు వదలి నన్నొక్కణ్ణే శరణు వేడుము! నేను నిన్ను సకలపాపాల నుండి సంరక్షిస్తానని గీతాచార్యుల సందేశం.

ఏనుగు తన శాయశక్తులా మొసలితో పోరాడింది. ఇక తనవల్ల సాధ్యం కాదని గ్రహించి భగవంతుణ్ణి స్మరించింది. ఆపదలో ఉండే వాళ్ళను రక్షించే నారాయణుడు వెంటనే అక్కడికి వెళ్ళి, సుదర్శన చక్రంతో

మొసలిని చంపి గజేంద్రుణ్ణి రక్షించాడు. కాబట్టి అహంకార రహితుడై జీవి భగవంతునికి శరణాగతుడైతే సకలాభీష్టాలూ నెరవేరుతాయి. చివరకు ముక్తి కూడా కరతలామలకమౌతుంది.

ఆత్మ రక్షణ భారంలో (శరణాగతి) ఆనుకూలస్య సంకల్పం, ప్రాతికూలస్య వర్జనం, మహావిశ్వాసం, గోప్తృత్వవరణం, కార్పణ్యం- అనే ఐదు అంగాలున్నాయి. వీటితో కూడిన ఆత్మరక్షణ భారాన్ని భగవంతునికి మనం సమర్పించాలి. 'శ్రీమాన్' అనే శబ్దానికి పంద్రెండు గుణాలని అర్థం. వాత్సల్యాది గుణాలను రాఘవాచార్యులు చక్కగా వివరించారు.

"శ్రీమన్నభీష్ట వరద" అనే శ్లోకంలో (4) అభ్యుపగతం, అనభ్యుపగతం- అనే కర్మల గురించి చక్కగా వ్యాఖ్యాత వివరించారు. ప్రపత్తి అంటే శరణాగతి. భక్తి కంటె శరణాగతి సంచిత, ఆగామి కర్మలనే కాకుండా ప్రారబ్ధకర్మలో అనభ్య పగతాన్ని నిర్మూలిస్తుందని వివరించారు. దీనివల్ల ఈ జన్మ అంతం కాగానే శరణాగతునికి మోక్షం లభిస్తుంది. 'తదధిగమ పూర్వోత్త రాఘయోః అశ్లేష వినాశౌ' అనే బ్రహ్మసూత్రార్థాన్ని సరళ రీతిలో వివరించారు.

5వ శ్లోకానికి అర్థం రాస్తూ వివిధ రకాల ముక్తులగురించి వివరించారు. సాలోక్యం, సారూప్యం, సామీప్యం, సాయుజ్యం- ఇవి ముక్తులు.

గీతలో శ్రీకృష్ణపరమాత్మ 4 రకాల భక్తుల గురించి వివరించాడు.

చతుర్విధా భజంతే మాం/ జనాః సుకృతి నోర్జున!
ఆర్తో జిజ్ఞాసురర్థారీ/ జ్ఞానీ చ భరతర్షభ

వీరిలో జ్ఞానియే సర్వశ్రేష్ఠుడు- అనే అంశాన్ని ఆచార్యులు చక్కగా విశ్లేషించారు.

'దేవీ భూషణ' అనే 6వ శ్లోకంలో భగవంతుని షాడ్గుణ్య పరిపూర్ణత్వాన్ని చక్కగా వర్ణించారు. జ్ఞానం, బలం, ఐశ్వర్యం, వీర్యం, శక్తి, తేజస్సు- ఇవే షడ్గుణాలు. భగవచ్ఛబ్దానికి అర్థం కూడా ఇదే. శ్రీదేవి, భూదేవి, నీళాదేవేరులతో వివిధాభరణాలతో, సుదర్శనాది ఆయుధాలతో విరాజిల్లే పుండరీకాక్షుని పునీతమైన రూపం మనకు సాక్షాత్కరిస్తుంది.

7వ శ్లోకంలో దేశికులవారు తనతో పాటు తన చేతనాచేతన వస్తువులన్నిటిని కూడా భగవత్ కైంకర్యంలో వినియోగించుకుంటానని అన్నారు. ఈ శ్లోక వ్యాఖ్యాన వేళలో దధి భాండానికి శ్రీకృష్ణుడు మోక్షమిచ్చే వృత్తాంతాన్ని అద్భుత రీతిలో విశదీకరించారు. ప్రపత్తి చేస్తూ ఇంకేదో ఫలం కోరడం సరికాదు. స కామ భావనలు మనకు బంధాన్ని కల్గిస్తాయి. కైంకర్యం చేస్తూ 'స్వామీ!' నిరంతరం నీ కైంకర్యం చేసే అవకాశాన్ని అందించు అని ప్రార్థించాలి. 'కింకరః' అంటే సేవకుడు, 'కింకరస్య భావః కైంకర్యం' – భక్తుడు భగవంతునికి శరణాగతుడై నిరంతరం అతని సేవలో నిమగ్నుడు కావాలని తాత్పర్యం.

8వ శ్లోకంలో వేదాంత దేశికులు తన పాపరాశినంతా దగ్ధం చేయుమని భగవంతుణ్ణి వేడుకున్నారు. జీవితంలో మనం పాపాలు చేసినప్పుడు తగిన ప్రాయశ్చిత్తం చేసుకోవడం శ్రేయస్కరం అనే సందేశం ఈ శ్లోకంలో దాగుంది.

సంచిత, ఆగామి కర్మలను, ప్రారబ్ధకర్మలో అనుభవానికి రాని కర్మల్ని భగవంతుడు, అగ్ని దూదిపింజల్ని కాల్చినట్లు, కాల్చివేస్తాడు. పాపాలు రెండు రకాలుగా ఉంటాయి. చేయరానివి చేయడం, చేయాల్సినవి చేయకపోవడం. పరదారాగమనం, పరవిత్తాపహరణం, గురువృద్ధులతో పరుష భాషణం, హింసాది క్రూరకర్మలు- ఇవన్నీ పాపాలే!

ఇలాంటి పాపాలేమైనా చేసి ఉంటే క్షమించమని వేదాంత దేశికులు ప్రార్థించారు.

అకృత్యానాం చకరణం/ కృత్యానాం వర్జనం చ మే
క్షమస్వ నిఖిలం దేవ!/ ప్రణతార్తిహర! ప్రభో!

త్రికరణ శుద్ధితో వ్యవహరించాలనే అంశాన్ని ఇక్కడ రాఘవాచార్యులు చక్కగా వివరించారు. మనస్సు, వాక్కు, శరీరం- ఇవే త్రికరణాలు. దుష్టులకు, శిష్టులకు ఉన్న వ్యత్యాసం ఒక్కటే- సత్పురుషులు మనస్సులో ఉన్నదాన్నే మాటల్లో చెబుతారు. శరీరంతో ఆచరిస్తారు. దుష్టులు ఆలోచించే దొకటి, చెప్పేదొకటి, చేసేది ఒకటి.

మనస్యేకం వచస్యేకం/ కర్మణ్యేకం మహాత్మనాం
మనస్యన్యత్ వచస్యన్యత్/ కర్మణ్యన్యద్దురాత్మనాం

త్రికరణాలతో చేసిన పాపాలను క్షమించుమని శ్రీమద్రామానుజులు ప్రార్థించారు. అలాగే వేదాంత దేశికులు కూడా మనోవాక్కాయ కర్మలతో చేసిన పాపాల్ని క్షమించుమని వేడుకున్నారు- 'న్యాసదశకం' అనే లఘుకృతిలో.

చివరి శ్లోకంలో భగవత్ సంకల్పమే లఘుకృతి రచనకు కారణం- అనే వినమ్రత కన్పిస్తుంది. వేదాంత దేశికులు "తన రక్షణభారాన్ని నీవే తీసుకున్నావు శ్రీపతీ! అందువల్ల జీవన పర్యంతం బరువు (నిశ్చింతుడు) లేనివాడిగా ఉంటాను" అనే భావాన్ని వ్యక్తం చేశారు. ఇది ఆయన భక్తికి, వినయానికి తార్కాణం. న్యాసంలో ఉన్న ఐదు అంశాల్ని శ్రీ రాఘవాచార్యులు చక్కగా వివరించారు. 'అచీకరత్' అనే శబ్దానికి వ్యాకరణ విశేషాల్ని విశదీకరించారు. భగవంతుని శరణు వేడిన తర్వాత భక్తుడు నిశ్చింతగా ఉండిపోతాడు. ఆపదలు కల్గినా క్రుంగక, పొంగక స్థిర మనస్సుతో నిరంతరం భగవన్నామస్మరణ చేస్తాడు.

సంసారంలో వివిధ రకాల శోకాలతో కొట్టుమిట్టాడే మనిషికి శోకనాశం కావాలంటే భగవంతుని శరణాగతే ఏకైక మార్గం. దానివల్ల ఇహపర సౌఖ్యాలు లభిస్తాయి. భక్తియోగం కన్న ప్రపత్తి యోగం చాలా శ్రేష్ఠమైనది. 'మార్జాల కిశోరన్యాయం' లా భగవంతుడు నిరంతరం భక్తుని యోగక్షేమాల్ని గమనిస్తూ ఉంటాడు. వేదాంత దేశికుల 'న్యాసదశకం' కృతికి అద్భుతమైన తాత్పర్యార్థ వివరణం ద్వారా శ్రీయుతులు "పండితరత్న" కె.వి.రాఘవాచార్యులు వేదాంత దేశికుల అభిమతాన్ని సురుచిరంగా, సుందరంగా ఆవిష్కరింప జేశారు. ఈ కృతి పండితులకే కాక పామరులకు కూడా భగవత్ కైంకర్యం చేయడంలో దివ్యప్రేరణను అందిస్తుందనడంలో ఏ మాత్రం సందేహం లేదు.

ఓం నమోభగవతే వాసుదేవాయ.

శ్రీ రాఘవాఖ్యానము

న.చ.వేదాంతాచార్యులు
చరవాణి: 6461 2361

"కారంచేడ్ తిరుమల" వర/ "హారీత"సు గోత్ర రోచిరాదిత్యు సుధా
ధారా వాచస్పతి యగు/ శ్రీరాఘవ దేశికున్ భజింతు నిరతమున్

వేంకటమ్మ మనోహర విబుధ దంప/ తులకు తొలిబిడ్డడై వంశ తిలకమైన
రాఘవాచార్యుడిద్ధ మర్యాద/ మూర్తిగొన్న మహితుడు ఆదర్శ గుణమణి ఖని

గీర్వాణ భాష పుక్కిట బట్టి నాటకాంతమ్ము / సాహిత్యమ్ము తనుకు మీర
వేదమ్ము వల్లించె విహితమౌ జనకాజ్ఞ / యాజ్ఞికుడన్న విఖ్యాతి మీర
అలవోకగా నాంగ్లమాంధ్ర భాషలు నేర్చి / డిగ్రీలు గొనియె కడింది మీర
ఆపోశనము పట్టె నల సంప్రదాయంపు / సార సాహిత్యమ్ము చదువు మేర

ఉభయ వేదాంతముల నట్టె ఊర్జితముగ/ స్మృతికి నతికించుకొనియె సమీహితముగ
కే.వి.రాఘవాచార్య సుధీవరుండు/ బుద్ధికి బృహస్పతిని మించిపోయినారు

మదికి బురాతనమ్మయిన మంగళ సంస్కృతి మెప్పు కల్గినన్
సదముల బుద్ధికిన్ మహిత సంస్కృత భారతి ఇంపు గొల్పినన్
విదిత మనోవికాసమయి విచ్చిన గుండియ స్పందనమ్ము లో
ప్పిదమగునేని ఆ మహితు పేరిమి గౌరవ మర్థమయ్యెడున్

తేనెలు జాలువారునటు తీయని మాటల పొల్పుతోడ దా
బూని రచించు వ్యాఖ్యలవి స్ఫూర్తిమదూర్జిత కృష్ణ సూరి వ్యా
ఖ్యానము లట్లు మంగళ గుణాస్పదముల్ శ్రుతి వాక్య పాశురా
స్థానము లింద్ర చాపముల చాడ్పున మోహన వర్ణ ముగ్ధముల్

తన రచనల మహితార్థము/ జన హృదయము లందుకొనగ స్పష్టము నేయన్
పునరవతారము నెత్తిన/ ఘన నిగమాన్తార్యు డితడుగా అనిపించున్

భగవ ద్విషయపు బండితు/ లొగి నచ్చెరువొంద నిచట నూనిన దీక్షన్
మిగిలిన మూడాయిరముల/ బిగి వెరిగియు నుగ్గడించె పృథుమతి గురువై

ఒక ఋషిగా జీవించిన,/ సకల హితము గోరుకొనిన, సత్పురుషుడు దా
నకలంక మూర్తి తన జి/హ్వాకు పరుషత సోకనీని వాగ్వ్రతుడు కడున్

నను దమ సోదర ప్రతిము నచ్చిన మిత్రము శిష్యగా మన
మ్మున గడు బ్రేమజూపిన సుబోధక మండను నా కవిత్వమం
దునగల యల్పశక్తిని మనోజ్ఞ మటన్న యుదారు లోకరం
జనముగ విద్వదగ్రణుల సత్కృతులన్ దనియించు నున్నతున్

బంధువులు సోదరులు మిత్ర భావమహితు
లంతరంగులు శిష్యులు నరుగుదేర
హితము బ్రియముగా బోధించు మతము గలుగు
నచ్చు సౌహార్దమూర్తికి నంజలింతు.

శ్రీ సుదర్శనాష్టకమ్

వైద్యం వేంకటేశ్వరాచార్యులు
చరవాణి: 9989 679 681

శ్రీమద్భగవద్రామానుజ సిద్ధాంత నిర్ధారణ సార్వభౌములు శ్రీమద్వేదాంత దేశికులవారు (క్రీ.శ. 1268-1369). దేశికులవారి సాహిత్య కల్పవృక్షం బహుశాఖలుగ విస్తరిల్లింది. అందులో స్తోత్రశాఖ అందించిన సుమధుర అక్షరఫలాలు రసస్యందితాలు, పరమార్థతత్త్వ ప్రబోధితాలు, నిత్యాను సంధేయాలు. అయితే దేశికుల వారి రచన సుమధుర సుమనోహరమైనదే గాక, ప్రౌఢ సరస్వతీ పదవిన్యాస ప్రభాసిత కూడా.

శ్రీ వేదాంత దేశికులవారి వాఙ్మయాన్ని బాగా అధ్యయనం చేసి సునిశిత, గంభీరమైన పరిశీలనం చేసి, తద్భావామృతవారాశిలో మునిగి తేలినవారు శ్రీమాన్ కారంచేటి వేంకట రాఘవాచార్యస్వామి వారు.

విద్వద్ధురుద విభ్రాజితులయిన శ్రీమాన్ రాఘవాచార్యస్వామివారు దేశికులవారి అనేక గ్రంథాలకు విశేష వ్యాఖ్యలు సంతరించారు. అందులో స్తోత్ర సాహిత్యానికి అనితర సాధ్యమైన అనవద్యమైన హృద్యమైన తెలుగు వ్యాఖ్యానాలను సంతరించిన నైపుణ్యులు, పుణ్యులు శ్రీమాన్ రాఘవాచార్యస్వామివారు.

దేశికులవారి స్తోత్ర సాహిత్యంలో వేయి శ్లోకాలుగల పాదుకా సహస్రానికే గాక ఎనిమిది శ్లోకాల సుదర్శనాష్టకానికి కూడా రాఘవాచార్యస్వామివారు రమ్యమైన ప్రామాణికమైన సరళసుందరమైన సత్సంప్రదాయ పరిపుష్టమైన సద్విశేష వ్యాఖ్యానాన్ని తెలుగులో సంతరించారు.

శ్లో॥ *శ్రీమత్ గృధ్ర సరస్తటావనిజుషాం శ్రీ వైష్ణవానాం పురా*
యః శీతజ్వర నుత్తయే వ్యతనుత శ్రీ హేతి రాజాష్టకమ్।

చ॥ *అరయఁగ నొక్కమారు జనులందరు గ్రామమునందు తీక్ష్ణ మౌ*
జ్వరమున జెప్పరాని బహుబాధల నొందగ- దేశికుండు, హే
పరమ దయాంబురాశీ! నిను బ్రస్తుతి సేయ తదీయ బాధ స
త్వరము తొలంగెనంట, శుభదాయి! సుదర్శన చక్ర రాజమా!

-ప్రస్తుత వ్యాసకర్త రచించిన సుదర్శనచక్ర రాజశతకము- 37వ ప.

'గృధ్రసరస్తీరం' అనే దివ్యక్షేత్రాన్ని 'తిరుప్పుళ్ కుషి' అంటారు. ఆ దివ్యక్షేత్రంలోని భక్తజనాలు ఒకప్పుడు శీతజ్వర పీడితులయ్యారు. ఆ బాధను తొలగించేందుకు దేశికులవారు అష్టకాన్ని రచించి శ్రీ సుదర్శనులను స్తుతించి పీడితులకు యోగక్షేమాలు కల్పించారు. ఇది సుదర్శనాష్టక రచనకు మూలకారణాలలో ఒకటిగా చెప్తారు.

శ్రీమాన్ రాఘవాచార్యస్వామివారు ఒకప్పుడు శీతజ్వర పీడితులు కాగా పదిరాత్రులలో సుదర్శనాష్టకానికి జ్వాలా వ్యాఖ్యానాన్ని రచించి పూర్తిచేసే సరికి జ్వరబాధ తగ్గింది. అప్పుడు వ్యాఖ్యాన వ్రాతప్రతిని రాఘవాచార్య స్వామివారు సుదర్శనుల సన్నిధిలో సమర్పించి సుదర్శనయాగం నిర్వహించారు (చూడు. శ్రీ సుదర్శనాష్టకమ్ జ్వాలావ్యాఖ్యాసహితం, పుట-4, ద్వితీయ ముద్రణ, ఫిబ్రవరి 2014).

శ్రీమాన్ రాఘవాచార్యస్వామివారి సుదర్శనాష్టక జ్వాలా వ్యాఖ్యను గురించి వ్యాసం రాయవలసిందిగా శ్రీమాన్ డా॥ కె.వి.రమణాచారి ఐ.ఏ.ఎస్.(రి)గారు ప్రస్తుత వ్యాసకర్తకు లేఖ (తేది: 26-1-2017) పంపారు. లేఖ అందేనాటికే ప్రస్తుత వ్యాసకర్తకు జ్వరం సోకింది. జ్వరం తీవ్రరూపం దాల్చి (ప్రస్తుత వ్యాసకర్త) నీరసించడం వల్ల దాదాపు నెలరోజుల దాకా ఈ వ్యాసాన్ని రాసే వీలు కలుగలేదు. అపుడు సుదర్శనాష్టకాన్ని జ్వాలావ్యాఖ్యా సమేతంగా భక్తిశ్రద్ధలతో పఠించగా జ్వరపీడ నివృత్తి అయి ప్రస్తుత వ్యాస రచన జరిగింది.

సుదర్శనాష్టకాన్ని పఠించడంవల్ల జ్వరపీడ నివృత్తి అవుతుందని యథార్థమైన ప్రత్యక్షానుభవమైన పై సంఘటనలు నిదర్శనం.

సుదర్శనాష్టకంలోని చిట్టచివరి తొమ్మిదవ శ్లోకం ఇలా తెలియజేస్తుంది- "మనస్సు రథంలాంటిది. ప్రకృతి విషమమైనది. మానవుడు ఎత్తు పల్లాలుగల మార్గంలో నడచినా సుదర్శనాష్టక పఠనం వల్ల దృఢమైన చక్రాలున్న రథం ఒడుదుడుకులకు భంగపడక గమ్యాన్ని చేరుస్తుంది. దేశికులవారు అనుగ్రహించిన ఈ స్తోత్రం పఠిస్తే భక్తుల మనోరథం ప్రమాదవశాన పొందరాని విషయా(స్థలా)లయందు పరిభ్రమించినప్పటికీ సుదర్శనుల వారు రక్షిస్తారు" (చూడు. జ్వాలావ్యాఖ్య). ఈ స్తోత్రం అంతటి మహిమోపేతమైనది. అందుకు పైన పేర్కొన్న జ్వరపీడిత సంఘటనలు మూడు ప్రత్యక్ష పరమ సత్య నిదర్శనాలు.

సుదర్శనాష్టకం గురించి సుదర్శనులవారి అనుగ్రహం పొంది దేశికులవారు 'పరమతభంగం' అనే శాస్త్రగ్రంథాన్ని పూర్తిచేశారని కూడా చెప్తారు. ఇవన్నీ సుదర్శనుల మహిమను సువ్యక్తం చేసేవే.

శ్రీ రాఘవాచార్యస్వామివారు 'శ్రీ నృసింహప్రియ' పత్రికలో నా పుస్తకాలను సమీక్షించారు. నా 'చిత్రం, చిత్రబంధమాలిక' గ్రంథాలకు అనారోగ్యం నుండి కొద్దిగా కోలుకోగానే స్వహస్తలిఖితంగా అభినంద పూర్వకమైన వ్యాసాలను అనుగ్రహించారు. ఇవన్నీ నా మనస్సులో వారిపై చెరగని భక్తిభావ ముద్రను వేశాయి. ఎలాగైనా వారిని లేదా వారి గ్రంథాలను గురించి నేను కూడా ఒక చిన్ని వ్యాసాన్ని రచించి నిలువెత్తు అర్చామూర్తికి ఒక తులసీదళం సమర్పించినట్లుగ, చంద్రునికి నూలు పోగులా సమర్పించాలని (ఏప్రిల్ 2015 నుండి) నా మదిలో ఉంది. మ్రొక్కబోయిన దేవుడెదురైనట్లు శ్రీ రాఘవాచార్యస్వామి వారి తనయులు శ్రీమాన్ కె.వి.రమణాచారిగారు ఆ అవకాశాన్ని ప్రస్తుతం నాకు కల్పించారు.

శ్రీవేదాంత దేశికులవారు గరీయః ప్రతిభతో రచించిన స్తోత్రాలలో శ్రీ సుదర్శనాష్టకం బహుళ ప్రచార ప్రాశస్త్యాలను పొందింది. సుదర్శనాష్టకానికి సంస్కృతంలో తెంబెరై రాజగోపాలాచార్యస్వామివారు, తమిళంలో కురిచ్చిగోపాల తాతాచార్యస్వామివారు సంతరించారు. తెలుగులో రాఘవాచార్యస్వామివారు జ్వాలావ్యాఖ్య

సంతరించారు. సుదర్శనాష్టకానికి తెలుగులో ఇలాంటి వ్యాఖ్య నాన్యతోదర్శనీయం. ఈ వ్యాఖ్యకు 'జ్వాలా వ్యాఖ్య' అనే నామకరణం చేయడంలోని ఔచిత్యాన్ని కొద్దిగా ప్రస్తావించుకుందాం- సూర్యునికి- ప్రభకు ఎంతటి విడదీయరాని బంధం ఉందో సుదర్శన చక్రరాజానికి జ్వాలకు కూడా అంతటి విడదీయరాని అనుబంధం పెనవేసుకుంది. సముచితమైన వ్యాఖ్యకు సదాఖ్య కూడా సార్థకంగా పెట్టడం రాఘవాచార్యస్వామి వారి నిశిత పరిశీలనకు వైదుష్యానికి నిదర్శనం.

జ్వాల, నేమి, అర, నాభి, అక్షం అనే ఐదింటి సమ్మేళన సందర్శనమే సుదర్శన మహాపురుషుడు. కూరనారాయణ దేశికులవారు సుదర్శన శతకాన్ని రచించారు. శతకంలో ప్రప్రథమంగా జ్వాలాభివర్ణన 24 శ్లోకాలతో చేయబడింది. దీనినిబట్టి సుదర్శనుల వారి జ్వాలకు ప్రథమ ప్రాధాన్యం ఉందని సుస్పష్టం. వెలుతురు లేకుంటే జగమే చీకటిమయం. సుదర్శనులవారు భక్తసందోహానికి సుదర్శన మివ్వాలంటే జ్వాల=కాంతి అవసరం. భక్తజనుల విరోధులను అణచాలంటే జ్వాల అవసరం ఎంతైనా ఉంది.

జ్వాల= వెలుగు అనే వ్యాఖ్యానం వల్ల సుదర్శనచక్రరాజ పెరుమాళ్ల సు-దర్శనం భక్తవరులకు సువ్యక్తం సుబోధకం అవుతుందని భావన. వ్యాఖ్యానాఖ్యను కూడ సముచితంగా సార్థకంగా పెట్టడంలో దిట్టలు రాఘవాచార్యస్వామివారు.

జ్వాలా వ్యాఖ్యానం- ప్రామాణికత:

శ్రీరాఘవాచార్యస్వామివారు జ్వాలావ్యాఖ్యానంలో చెప్పిన విశేషాంశాలు సమర్థనీయమైనవి, ప్రామాణికమైనవి. అవసరమైనచోట ఆచార్యులవారు వ్యాఖ్యానంలో పూర్వగ్రంథాలనుండి ప్రామాణికమైన సమర్థనీయ వాక్యాలను ఉటంకించడం వ్యాఖ్యాన గరీయఃస్థాయిని మరింత ఇనుమడింప జేశాయి.

వేదమంత్రాలు, సామవేదం, అధర్వణవేదంలోని వాక్యాలు; పాద్మోత్తరఖండం, భాగవతం, విష్ణుధర్మం, విష్ణుపురాణం లాంటి పురాణాలలోని వచనాలు; భారతేతిహాస వచనాలు; చక్రాంకనం, అహిర్బుధ్న్య సంహిత లాంటి శ్రీ వైష్ణవ సంప్రదాయ ప్రాంచరాత్ర గ్రంథాలలోని వాక్యాలు; అమరకోశం, మేదినీకోశం, విశ్వనిఘంటువు మొదలైన కోశాల ఆధారంగా అర్థనిర్ధారణం చేయడం; ఛందోవిశేషాలను చెప్పే సందర్భాన పింగళాచార్య ఛందస్సూత్రాలు ఉదాహరించడం వ్యాఖ్యలో కనిపిస్తుంది.

తిరువాయ్ మొళి, తిరువిరుత్తం, శెన్నియోంగు, నాన్ముగం తిరువందాది మొదలయిన నాలాయిర దివ్య ప్రబంధాలలోని ఆళ్వార్ల శ్రీసూక్తులు, రామానుజ నూత్తందాది వాక్యాలు వ్యాఖ్యానంలో సందర్భోచితంగా ఉదాహరించి జ్వాలావ్యాఖ్యను ప్రామాణికంగా సార్థకంగా సమర్థనీయంగా రచించారు రాఘవాచార్యస్వామివారు.

జ్వాలా వ్యాఖ్యాన విశేషాలు:

శ్రీసుదర్శనాష్టకం జ్వాలావ్యాఖ్య సహితంగా (క్రౌన్‌సైజు 42 పుటల) ప్రత్యేక పుస్తకంగా వెలువడింది. కేవలం ఎనిమిది, తొమ్మిది శ్లోకాల రచన (42 పుటల) ఒక పుస్తకంగానే వెలువడిందంటే దానికి మూలకారణం విపుల విశేష వ్యాఖ్యానమే.

శ్రీమాన్ రాఘవాచార్యస్వామివారు శ్లోకాలకు మొదట అర్థాన్ని సులభసుందరంగా విప్పి చెప్పారు. ఆ తర్వాత తాత్పర్యాన్ని చెప్పారు. అటు పిమ్మట జ్వాలావ్యాఖ్యానం చెప్పారు.

అష్టకంలోని మొదటి ఎనిమిది శ్లోకాలూ ఒకే ఛందస్సుకు చెందినవి. ప్రతిశ్లోక పాదం కూడా పూర్వార్ధం ఉత్తరార్ధంగా విడదీయవచ్చు. అలా శ్లోకం నాలుగు పాదాలలో ఎనిమిది భాగాలు ఉంటాయి. వ్యాఖ్యానంలో కూడా శ్లోకాన్ని ఎనిమిది భాగాలుగ విశ్లేషించి వరుసగా విశేషాంశాలను విశదపరచారు వ్యాఖ్యాత.

ఎనిమిది శ్లోకాలు/ పద్యాదులు కలిగిన రచనా విశేషానికి 'అష్టకం' అని వ్యవహారం. సుదర్శనాష్టకంలో మొదటి ఎనిమిది శ్లోకాలూ సుదర్శన స్తోత్రం కాగా చిట్టచివరి తొమ్మిదవ శ్లోకంలో ఫలశ్రుతి చెప్పబడింది. మొదటి ఎనిమిది శ్లోకాలలోను చివరి పాదం- జయజయ శ్రీసుదర్శన! జయజయ శ్రీసుదర్శన!! అనే మకుటం కలిగి ఉంటుంది. మొదటి ఎనిమిది శ్లోకాలు- న, త, భ; న, త, భ అనే గణాలు కలిగి ఉంటుంది. మొదటి న, త, భ గణాలు శ్లోక పాదంలోని పూర్వార్ధం కాగా రెండవసారిగల న, త, భ గణాలు ఆ పాదంలో ఉత్తరార్ధం. పాదానికి 18 అక్షరాలు కలిగిన శ్లోకం కనుక ఈ 18వ ధృతిచ్ఛందోజాత వృత్తం. శ్లోకం పేరు పథ్య, పింగళాచార్యచ్ఛందంలో 'త్రిషుగణేషు పాదాపి పథ్యాద్వేచ' (4-22) అని శ్లోక లక్షణసూత్రం. అష్టకానికి చిట్టచివరన 'వసంత మాలికావృత్తం' ఉంది. 'విషమే సజాగురూ సమేచేత్ సభరాయశ్చ వసంత మాలికాస్యాత్' అని శ్లోక లక్షణం.

ఈ వివరాలన్నీ కూడా జ్వాలావ్యాఖ్యలో పొందుపరచారు రాఘవాచార్యస్వామివారు.

వ్యాఖ్యాన పరిశీలనంవల్ల సుదర్శనాష్టకంలోని ఎనిమిది శ్లోకాల మౌలిక భావం ఇలా దర్శనమిస్తుంది-

1) ప్రత్యర్థులకు భయాన్ని కలిగిస్తుంది - మొదటి శ్లోకం.
2) వేద పాంచరాత్రాది ప్రతిపాదిత విషయం - రెండవ శ్లోకం.
3) ఆశ్రిత రక్షణలో అసాధారణ ప్రజ్ఞ - మూడవ శ్లోకం.
4) ఆశ్రిత విరోధి విరోధకత్వం - నాలుగవ శ్లోకం.
5) భక్తుల సాంసారిక సకల దుఃఖ నివర్తకత్వం- ఐదవ శ్లోకం.
6) నిరతిశయ కరుణాకరత్వం - ఆరవ శ్లోకం.
7) సకల ఫల ప్రదత్వం - ఏడవ శ్లోకం.
8) సర్వాత్మకత్వం - ఎనిమిదవ శ్లోకం.

సుదర్శనాష్టక విశేషవ్యాఖ్యకు సంక్షిప్త భావంపై ఎనిమిది వాక్యాలుగ చెప్పబడింది.

ముగింపు:

శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఘంటావతారులూ, శ్రీవైష్ణవ దాసులను అనుగ్రహించినవారూ, దయామూర్తి అయిన వేదాంతదేశికులవారు దేశిక శబ్దవాచ్యులుగా సుశ్లోకితులు–

దేవతారూప ధారిత్వాత్/ శిష్యానుగ్రహ కారణాత్
కరుణామయ మూర్తిత్వాత్/ దేశిక కథిత ప్రియే

వ్యాఖ్యాతృ శిరోమణి, పండిరత్న, వాచస్పతి, సర్వశాస్త్ర మార్తాండ మొదలయిన బిరుద నామాలు సార్థకంగా కలిగిన మహానుభావులు శ్రీమాన్ కారంచేటి వేంకట రాఘవాచార్యస్వామివారు (1929–2016) అపర వేదాంత దేశికులు. దేశిక వాఙ్మయాన్ని వ్యాఖ్యానించారు. అమూల్య కృతిరత్నాలను అందించారు. శ్రీవైష్ణవ సంబంధిత తెలుగు వాఙ్మయం విలసిల్లినంతకాలం శ్రీమాన్ కె.వి. రాఘవాచార్యస్వామివారి సాహిత్యం 'అక్షరం'గా 'జ్వాలాయమానంగా' దర్శనమిస్తుందనడం సత్యం సత్యం పునస్సత్యం.

ఉ॥ *శ్రీలలనేశు హస్త సరసీరుహమందు వసించి లోక స*
త్పాలనమందు శౌరికి సదా సహకారిగ నుందువీవు, నీ
జ్వాల యొసంగు గావుతను భాగవతోత్తమ కామితార్థముల్
కాలమహాస్వరూప! రిపుకాల! సుదర్శన చక్ర రాజమా!!

–వైద్యం వేంకటేశ్వరాచార్య కృత చక్రరాజ శతకం– 61వ పద్యం.

న్యాసవింశతి - విశేషములు

ఆచార్య బూరుగుగడ్డ నరసింహాచార్యులు

చరవాణి: 9866 270 571

వాచస్పతి బిరుదాంకితులయిన ఉ.వే.శ్రీమాన్ కె.వి.రాఘవాచార్యస్వామివారు విశిష్టాద్వైత సంప్రదాయ పండిత కుటుంబంలో జన్మించారు. తండ్రిగారి వద్ద తగు రీతిని సంస్కృతమును తెలుగును అభ్యసించి వాటిలో నిష్ణాతులై తెలుగు ఉపన్యాసకులుగా, ఎందరినో తెలుగు పండితులుగా తీర్చిదిద్దారు. విశిష్టాద్వైతమునకు, దానిలో దేశిక సంప్రదాయమునకు చెందిన దేశికులు వీరు. వీరెల్లప్పుడునూ స్వాధ్యాయమునే అనుష్ఠించెడివారు. స్వాధ్యాయమంటే వేదంగదా! వీరేమో సంప్రదాయ నిష్ఠులు ఉభయ భాషలలో ప్రవీణులు మాత్రమే అదెట్లా కుదురుతుందంటారా? స్వాధ్యాయార్థాన్ని శాండిల్య స్మృతి ఇట్లా వివరిస్తుంది-

వ్యాఖ్యానైర్లేఖనైర్వాపి గ్రంథ నిర్మాణ కర్మణా।
శిష్యాణాం శిక్షయా వాపి స్వాధ్యాయార్థోఽయ ముచ్యతే॥

అని. ఇదంతా వేదము గురించి, అనేది వేరే విషయం.

వ్యాఖ్యానావశ్యకత:- సర్వజ్ఞుడొక్కడే లోకంలో అందరూ అల్పజ్ఞులే. కనుక అన్నీ చదివి అభ్యసించి పండితులవుతారు. ఆ దిశగా దర్శన, శాస్త్ర, ఇతిహాస, పురాణ కావ్యనాటకాదులను నేర్చుకోవాల్సిందే. గురువుగారు నేర్పుతారు. వారికి సందేహమనిపిస్తే ఆ వ్యాఖ్యానాన్ని చూస్తారు. అన్ని గ్రంథాలను ఏ భాషలో ఉన్నాయో ఆ భాషను గుప్పిట పట్టుకుంటే, వ్యాఖ్యానాల సహాయంతో గురు బోధ సౌకర్యం లేనివారు కూడ చదువుకోవచ్చు, పాండిత్యమూ సంపాదించుకోవచ్చు. ఓ విధంగా వ్యాఖ్యాతలు- చదువరులకు, సహృదయులకు, గ్రంథకర్తలకు మధ్య వారధిలాగ పనిచేస్తారు. వ్యాఖ్యానాలతోటె మూలగ్రంథంలోని విశేషాలు స్పష్టమవుతాయి. కాని ఒక్కోసారి పఠితకు సందేహమున్న పదాన్నో విషయాన్నో సందర్భాన్నో వ్యాఖ్యాత వదలిపెడ్తాడు. పైగా తను అనుకున్నవాటిని పెంచి, వ్యాకరణ విశేషాలను జొప్పించి, కోశప్రామాణ్యం దృఢీకరించి, సమాసములను వింగడించి, పాఠకునకు తలనొప్పిని కలిగిస్తుంటాడు. మహారాజు శ్రీ భోజమహారాజూ ఈ కష్టాలన్నిటిని పడ్డవాడే. ఆయనంటాడు-

"దుర్బోధం యదతీవతద్ధి బుహాతిస్పష్టార్థ మిత్యుక్తి భిః
స్పష్టార్థేష్వతి విస్తృతిం విదధతి వ్యర్థైః సమాసాదికైః।
అస్థానేఽను పయోగి భిశ్చ బహు భిర్జల్పైర్భ్రమంతన్వతే
శ్రోతౄణామితి వస్తు విప్లవ కృతః సర్వేఽపి టీకాకృతః॥

అని. 'అర్థం కష్టమయినదాన్ని స్పష్టార్థమని, నిజంగా స్పష్టమయి'న దాన్ని వ్యర్థపు మాటలతో వివరిస్తూ, అనవసరంగా అనుపయోగ విషయాలను చెప్తూ, భ్రమను కలిగిస్తారు పాఠకులకు ఈ వ్యాఖ్యాతలు. అందుకే వారిని వాస్తవాన్ని కిందుమీదు చేసేవారంటాడు భోజమహారాజు. అభినవగుప్తులవారు తన సిద్ధాంతాలను మూలకర్తకు అంటగట్టాడని పెద్దలంటారు. అందుకే మూలంలో లేనిది, మూలము- ప్రమాణము లేనిది ఏది చెప్పను, వ్రాయనని మల్లినాథుడు ప్రతిన బూనాడు. అవసరంలేనిది ఏది చెప్పనని ఇంకో మంచి మాటన్నాడు.

'నా మూలం లిఖ్యతే కిఞ్చిత్, నానపేక్షిత ముచ్యతే।
ఇహాన్వయ ముఖేనైవ సర్వం వ్యాఖ్యాయతే మయా॥'

వ్యాఖ్యానం అంటే ఏమిటో తెలుసుకుందాం. న్యాయకోశం, 828 పేజీలో, పరాశర పురాణంలోనిది అని ఈ శ్లోకం కలదు.

శ్లో॥ పదచ్ఛేదః, పదార్థోక్తిః, విగ్రహో, వాక్యయోజనా।
ఆక్షేపేషు సమాధానం, వ్యాఖ్యానం పఞ్చ లక్షణమ్॥
(ఆక్షేపోథ సమాధానం వ్యాఖ్యానం షడ్విధం స్మృతమ్॥)

అని పాఠాంతరం కూడా ఉన్నది. 1) పదములను విడదీయడం, 2) వాక్యయోజనను- అన్వయాన్ని- చేయడం, 3) ప్రతిపదానికి అర్థాన్ని చెప్పడం, 4) విగ్రహము- సమాసాలకు విగ్రహ వాక్యాలు చెప్పడం- దీంతోబాటు ఇంకా వ్యాకరణ విశేషాలను వివరించడం, 5) ఏవయినా ఆక్షేపాలుంటే (అనుకొనికూడ) వాటికి సమాధానాలు ఇయ్యడం- అనేవి అయిదు వ్యాఖ్యానము యొక్క లక్షణాలు. రెంటిని వేరుగా చూపి ఆఱు లక్షణాలని కూడ చెప్పారు ఈ లక్షణాలని. వీటినే కాకుండ, గ్రంథకర్త అభిప్రాయాన్ని తెలుపడం, పద వాక్య ప్రయోగ కౌశలాన్ని తెలుపడం వర్ణనాశక్తిని నిగ్గుదేల్చడం, ఉంటె రసాన్ని ఎట్లా పోషించాడో చెప్పడం, అంతట ఔచిత్యం ఎట్లా ఉందో వివరించడం అనేవాటిని లక్షణాలుగా తీసుకోవచ్చును.

విశిష్టాద్వైతమున భక్తి ప్రపత్తులకు విశిష్టమయిన స్థానమున్నది. *'భజ ఇత్యేషవై ధాతుః సేవాయాం పరికీర్తితః। తస్మాత్సేవా బుధైః ప్రోక్తా భక్తిసాధన భూయసీ॥'* అని సౌభాగ్య భాస్కరము. భగవద్రామానుజులేమో 'అవిచ్ఛిన్నతైల ధారవలె స్మరణము' అన్నారు. పొందదగినవాడు శ్రీమన్నారాయణుడు. పొందింపజేసేది ఆయనే- దీన్నే శాస్త్రంలో ఉపేయమూ ఆయనే ఉపాయమూ ఆయనే అన్నమాట. త్వమేవోపాయ భూతోమే, భవ ఇతిప్రార్థనామతిః॥ అని ప్రపత్తికి నిర్వచనము. అందుకే వెంకటేశాది ప్రపత్తుల్లో 'చరణౌ శరణం ప్రపద్యే' అని ఉంటుంది. ప్రపత్తి చేసిన వాడు ప్రపన్నుడు. ద్వయమంత్రం ఇదే విషయాన్ని ఘోషిస్తున్నది.

అవతారికలో ఆచార్యులవారు దేశికులు, వారి గ్రంథాలు, వాటిలో స్తోత్రగ్రంథాలు వాటిలో ఒకటి **న్యాసవింశతి** అని ముఖ్యమయినదని తెలిసి "ప్రపత్తి, శరణాగతి, భరన్యాసం ఆత్మసమర్పణం లాంటి పర్యాయ పదాలు గల్గిన 'న్యాస'ము మోక్షోపాయమయిన విద్య" అని స్పష్ట పరిచారు. ప్రపత్తికి హేతువు సదాచార్యుడు.

అతనిని సేవించడమనే రూపములో మంగళాచరణమును శ్లోకంలో చేస్తూ ఆచార్యుని లక్షణాలను విపులముగా వివరించారు.

న్యాసవింశతికి దేశికులవారే చిన్న వ్యాఖ్యను రాశారు. రాఘవాచార్యులవారు మూలమును, వ్యాఖ్యానాన్ని ఆధారం చేసుకుని చాలా స్పష్టము, అన్యూనానతిరిక్తము అత్యంతోపయుక్తం అయిన ఈ వ్యాఖ్యను వెలయించారు.

వ్యాఖ్యాన లక్షణాల్లో చెప్పిన రీతిన, పదచ్ఛేదము, అన్వయము, ప్రతిపదార్థములను ఇచ్చినారు. ప్రతి శ్లోకపు వ్యాఖ్య మొదట్లోనే ఒకే ఒక్క వాక్యంలో శ్లోకం యొక్క హృదయాన్ని ఆవిష్కరిస్తారు. మొదటి శ్లోకానికి ఈ వాక్యం– "సదాచార్య లక్షణాలను వివరించే శ్లోకం. అభ్యుదయాన్ని శ్రేయస్సునూ పొందగోరే ప్రజ్ఞావంతుడు పద్నాలుగు లక్షణాలు కలిగిన ఆచార్యులను వరించవలెను" అని, పేజి–7. రెండవ శ్లోకానికి 'దేవునివలె గురువు పూజింపదగినవాడని బోధన, 12వ పేజి. అనేది ఆ వాక్యం. మూడవ శ్లోకానికి 'సచ్ఛిష్యుని లక్షణాలను వివరించే శ్లోకమిది. పేజి. 18. నాలుగో శ్లోకానికి 'ఆదర్శ ఆచార్యోపదేశాన్ని సచ్ఛిష్యుడు నిత్యం ఏకాగ్ర చిత్తంతో అనుసంధించుకోవాలని, పేజి–21, పదవ శ్లోకానికి 'న్యాసోపాసనల వైలక్షణ్యం సుశ్లోకితం పేజి–49. "ప్రపత్తి స్వతంత్రమయినదయినా, అంగాలు లేనిది కాదని ప్రతిపాదిస్తున్న శ్లోకమిది– అని 11వ శ్లోక వాక్యము. 'రక్షాపేక్షా' ఇత్యాది పదమూడో శ్లోకానికి– ప్రపత్తి లక్షణాన్ని శోధించే శ్లోకమిది పేజి–62.

'ప్రపత్తి ప్రతిపాదక వాక్యాలలో ఉన్న సర్వధర్మాన్పరిత్యజ్య' అనే వాక్యార్థాన్ని తెలుపుతున్న శ్లోకమిది. ప్రపత్తి తర్వాత కాలాన ఏ ధర్మాన్నీ ఆచరించవలసిన పనిలేదనే శంకను పరిహరించారు దేశికులు ఈ శ్లోకంలో అని సందేహ నివృత్తిని అవతరించారు ఆచార్యులవారు పేజి–71. 'మామేకం' అనే మాటకు అర్థాన్ని వివరించే శ్లోకమిది. ప్రపత్తి అనుసరించే ఏక శబ్దానికి అర్థం ఊహించవలసి యుంటుందని దేశికులు ఆ మాటయొక్క ప్రాధాన్యాన్ని సుశ్లోకిస్తున్నారు పేజి–76. ఇక త్యక్త్వోపాయా నపాయాన్' అనే 19 శ్లోకానికి 'శరణాగతి చేసిన తరువాత ప్రపన్నుడు జీవితంలో ప్రవర్తించే విధానాన్ని ఉజ్జీవించడానికి అనుసంధింపదగిన పద్ధతిని, ప్రార్థననూ సుశ్లోకిస్తున్నది– అని రాస్తారు ఆచార్యులవారు' పేజి–86.

అవసరమయిన చోట్ల అధికంగా వివరించడం, లేనిచోట సంక్షేపంగా రాయడం, కఠిన పదాలకు, పదబంధాలకు, ఇతిహాసము యొక్క అంశాలను విపులీకరించడం అనే వ్యాఖ్యా ఔచిత్యాన్ని బాగా పాటిస్తారు వ్యాఖ్యాత. మొదటి శ్లోకానికి ఆఱు పేజీల వ్యాఖ్యానాన్ని వెలయించారు. 14 ఆచార్య లక్షణాలను విశదీకరించారు. 'తల్లిదండ్రులు శరీరాన్ని మాత్రమే కలిగిస్తారు, గురువు మాత్రం జ్ఞాన జన్మనే ప్రసాదిస్తాడు. శాశ్వతానంద దాయకమయిన జ్ఞానజన్మ శ్రేష్ఠమయినది కదా!' అనే ఆపస్తంబ సూత్ర వాక్యాలతో ఆచార్యుల శ్రేష్ఠత్వాన్ని ఉగ్గడిస్తాడు. 'సహి విద్యాతస్తంజనయతి, తత్ శ్రేష్ఠంజన్మ, శరీరమేవ మాతా పితరౌ జనయతః' (ఆపస్తంబ సూత్రం పేజి. 7.) "సంప్రదీయతే గురుణాశిష్యాయ ఇతి సంప్రదాయః. సతాంసంప్రదాయః సత్సంప్రదాయః" – అని బాగా వింగడించారు.

మూలములోని పదాలను, విషయాలను ప్రమాణీకరించడానికి వీరు శ్రుతి, స్మృతి, దర్శన, ఇతిహాస, గీత, పురాణ, ద్రావిడ ప్రబంధాలు, తిరుప్పావు, పాంచరాత్రాగమన గ్రంథాలు, ఆఖరుకు స్తోత్ర సాహిత్యం నుండీ కూడా విపులంగా ఉటంకిస్తారు.

మనకు సాధారణంగా తెలుసుననుకునే వాటికి కూడ మనము అనుకొనని అర్థాలను విడమర్చి చెప్పి ఆశ్చర్య చకితులను చేస్తారు వ్యాఖ్యాత- స్వపరహిత పరం- 'తనకూ ఇతరులకూ మేలు కలుగునట్లు జాగరూకుడయి ఉండాలి' పరహితం అంటే ఉత్కృష్టమయిన శ్రేయస్సును, ముక్తిని, ఉపాయమూ ఉపేయమూ శ్రీమన్నారాయణుడే అనే అధ్యవసాయాన్ని కలిగించే సమర్థుడయి ఉండాలి' అని వివరిస్తారు పేజి-11.

శిష్యలక్షణ శ్లోకాన్ని వ్యాఖ్యానించాక, అవసరం గనుక మరోచోట చెప్పబడిన లక్షణ శ్లోకాలను 'ఆస్తికో... శిష్య ఇత్యభి ధీయతే॥, "శాంతోఽనసూయః... శిష్యశ్చోపరతః సుధీః" అని ఉటంకించారు. అంతేగాక ఆచార్యులచే వర్జనీయులని ఇతరత్ర వివరించిన శ్లోకమూ ఉంది-

"నమత్తోన్మత్త పతితాభి శస్త క్రూర నాస్తికాః
నానార్థినోన చాజ్ఞాతాస్త్యక్తవ్యా మంత్రదాయినా॥"

అని కూడా అధికంగా వివరిస్తారు. 'స్వాధీనా శేషసత్తా స్థితియతన' అనే శ్లోకం ఎట్లా మూల మంత్రాన్ని ఇముడ్చుకుందో, చక్కగా వివరించారు. అ+ఉ+మ= ఓం అను దానిలో అకారము నారాయణున్ని, ఉకారం లక్ష్మిని, మకారం లక్ష్మీనారాయణులిద్దరికి శేషభూతుడయిన జీవుణ్ణి తెలుపుతున్నది. దీనివల్ల నమః పదం యొక్క అర్థం సిద్ధిస్తున్నది. న, మః= నేను నా రక్షణను చేసుకొనే వాడను కాను. నమః పదంచేత శేషత్వానికి విరోధియయిన స్వాతంత్ర్యం నివర్తింపబడి, పారతంత్ర్య జ్ఞానం చెప్పబడుతుంది అని వివరిస్తారు. ఇక్కడ మనం పరాశరు భట్టరు వారి 'అకారార్థో విష్ణుః' అనే శ్లోకార్థాన్ననుసంధించుకోవాలి.

వీరి వ్యాఖ్యానాన్ని చదివితే ప్రపత్తిని గూర్చి తెలియడమే కాకుండా భక్తికి ప్రపత్తికి గల భేదం మొదలయిన విషయాలు చాలా స్పష్టంగా తెలుస్తాయి. వీరి మాటల్లోనే - "సర్వధర్మాన్ అనే శ్లోక వ్యాఖ్యానమందు ప్రపత్తికి భక్తియొక్క అంగత్వం ప్రతిపాదింపబడింది. అంటే భక్తియోగానికి శరణాగతి సహాయపడుతుందని భక్తి ప్రశంసాపరమయిన వాక్యాలే ఉన్నాయి. శ్రీ భాష్యమందు కూడ గుణోపసంహార పాదమందు (3-3) బ్రహ్మోపాసనలను వివరించినట్లు 'ప్రపత్తి స్వతంత్ర విద్య' అని ప్రతిపాదింపబడలేదు కదా! అని సందేహం కలుగుతుంది". ఈ సందేహాన్ని ఆచార్యులవారు ఇట్లా దూరం చేస్తారు తమ వివరణతో. "కర్మజ్ఞానాను గృహీతమయిన భక్తి సాధన భక్తి. భగవానుని కటాక్షంచే కలిగే భక్తి సాధ్యభక్తి. 'సాధనం భగవత్ప్రాప్తౌ స ఏవేతి స్థిరామతిః సాధ్య భక్తిః స్మృతాసైవ ప్రపత్తిరితి గేయతే॥" అని. "సాధన భక్తిని ఆశ్రయించిన వారికి భక్తి ఉపాయం, భగవానుడు ఉపేయం. సాధ్యభక్తి కలిగియున్న వారికి ఉపాయం, ఉపేయం (రెండూ) భగవానుడే. ఈ సాధ్యభక్తియే ప్రపత్తి" అని. వ్యాసం ఎక్కువవుతుందనే భయంతో ఈ విషయమాపుతాను.

ఆచార్యులవారు తమ ఈ చిన్నగ్రంథంలో ఎన్నో గ్రంథాలు గ్రంథకర్తల నుండి ఉదాహరించి పదాన్నో విషయాన్నో ప్రమాణీకరించారు. ఆ ఉదాహరణలు వీరి తలస్పర్శి పాండిత్యాన్ని చాటుతున్నాయి. అవి ఇవి శ్రీమద్భగవద్గీత, శ్రీభాష్యము, ఛాందోగ్యోపనిషత్తు, కఠోపనిషత్తు, కణ్ణినుణ్ శిరుత్తాంబు, తిరువాయ్ మొళి, తిరుప్పావై, అభీతిస్తవము, తిరుప్పల్లాండు, ముండకోపనిషత్తు, విష్ణుపురాణము, విష్ణుధర్మోత్తర పురాణము, లక్ష్మీతంత్రము, అమరకోశము, బ్రహ్మసూత్రాలు, శ్రుతప్రకాశికా; పేర్లు చెప్పకుండా శ్రుతి, ఉపనిషత్తులు,

రామాయణము, అభయ ప్రధానసారము, వరదరాజస్తవము, శ్వేతాశ్వరోపనిషత్, తైత్తిరీయోపనిషత్, అహిర్బుధ్న్య సంహిత, శ్రీగుణరత్నకోశము, రహస్యత్రయ సారము, స్తోత్ర రత్నం, శ్రీరంగ గద్య, న్యాసదశకము, జితంతే స్తోత్రము. ఇక కర్తలు- శాండిల్యమహర్షి, నమ్మాళ్వార్లు, పరాశర భట్టరు, పెరియాళ్వార్లు మొదలగువారు.

ఆచార్యులవారి గద్యశైలి సంస్కృతము తెలుగులు కలిసిన మణి ప్రవాళశైలి. అంత గ్రాంథికముగాని, శిష్టవ్యావహారిక రీతిలో ఉంటుంది. వీరు మానవాళికి సందేశమును కూడ సందర్భానుసారంగా ఇచ్చారు. 'ముఖ్యంగా మానవాళితో శారీరక బంధుత్వం కాక, శాశ్వతంగా ఆత్మబంధువుగా సహవసించాలి పేజి-10. దేవునివలె గురువు పూజింపదగినవాడు పే-12. సంసారికి చేయతగ పనులేవో తెలియక పోవడమే కన్నులు లేనితనం. ఇది మానసికమయిన చీకటి పేజి-13. గురూపదేశమే సర్వధా మనన యోగ్యమయినది. శాస్త్రాన్ని చదివి జ్ఞానాన్ని సంపాదించుకోవడం కష్టతరం పేజి-26. ప్రపత్తికి త్యాగమని పేరున్నది పేజి-33. మహావిశ్వాసం ప్రపత్తికిగల అంగాలలో సారమయినది పేజి-38. ప్రార్థించకుంటే రక్షింపదు అనే విచారంతో, శరణ్యునికి కృప కలుగునట్లు ప్రార్థించడం ఆవశ్యకం. ఇది లోకపద్ధతి కూడా పేజి-55. అపాయం అంటే అపచారం, శాస్త్ర నిషిద్ధకర్మ, తత్త్వ విషయంలో అనుభవ పర్యంతమయిన జ్ఞానంలేకపోవడమే- అవివేకమే అనర్థాలకు మూలం పేజి-87. పురుషుడు జనన కాలమందే దేవర్షి భూత పితృఋణాలతో పుట్టుతాడు పేజి-88. "ముముక్షువులు ఆచార్యోపసదనం చేయాలి. మంత్రోపదేశాన్ని పొందాలి. తత్త్వజ్ఞానాన్ని సంపాదించి గురుతరమయిన కర్మజ్ఞాన భక్తియోగాది ఇతరోపాయాలను అనుష్ఠించే శక్తి లేనందువల్ల లఘూపాయమే కర్తవ్యమయిన సాంగభరన్యాసం చేయాలి. స్వీకృత భరుడూ, శరణ్యుడు అయిన శ్రియఃపతి యొక్క గుణాలను అనుసంధిస్తూ నిర్భరులయి, నిర్భయులయి యుండాలి" పేజి-101.

అప్రయత్నంగానే వీరికి యమకాలంకారం వస్తుంది. జితేంద్రియుడు కాసులను, పెంకాసులను సమానంగా భాసిస్తాడు కదా! పేజి-10. సందర్భానుసారంగా ఎన్నో సుభాషితాల నుటంకిస్తారు. మచ్చునకు కొన్ని 'శిష్యాదిచ్ఛేత్పరాజయమ్, సత్యేసర్వం ప్రతిష్ఠితమ్, అనాపృష్టమపి బ్రూయుః గురవో దీనవత్సలాః, యథాదేవే తథాగురౌ, నవిశ్వసే దవిశ్వస్తే, విశ్వస్తే నాతి విశ్వసేత్.

ఇట్లా మోక్షోపాయమయిన వేదాంత దేశిక న్యాసవింశతికి, ఆచార్యులవారు వ్యాఖ్యాన లక్షణ లక్షితమయిన, సశాస్త్రీయమయిన, సముచిత వివరణయుక్తమయిన, అన్వయ పూర్వకమయిన, హృదయంగమమూ మనోహరమూ అయిన వ్యాఖ్యను వెలయించి ముముక్షు భాగవతోత్తములకు, జిజ్ఞాసువులకు, చదువరులకు ఎంతయో ఉపకారాన్ని చేశారు.

సుగమాశ్రేయసీ నామ్నీ రాఘవార్య వినిర్మితా।
న్యాస వింశతివ్యాఖ్యేయం జ్ఞానబుద్ధి ప్రదాభవేత్॥

‘అభీతి స్తవ’ పరిచయం

డా॥ కె.వి. సుందరాచార్యులు

చరవాణి: 8331 817 994

శ్లో॥ కవితార్కిక సింహాయ కల్యాణ గుణ శాలినే
శ్రీమద్వేంకటనాథాయ వేదాంత గురవేనమః॥

పరమపురుష కల్యాణ గుణ సంకీర్తన గలది ప్రబంధం. ఆళ్వార్లు, పూర్వాచార్యుల రచనలన్నీ పరమాత్మ గుణ వర్ణనలతోనే దివ్యప్రబంధాలైనవి. ఆ వరుసలో చేరిందే ‘అభీతిస్తవ’ (19 శ్లోకాలున్న) చిన్న ప్రబంధం. దీన్ని అనుగ్రహించినవారు పూర్వాచార్యులు, సర్వతంత్ర స్వతంత్రులు, కవితార్కిక కేసరులు శ్రీమద్వేదాంత దేశికులవారు. పాదుకా సహస్రం, దయాశతకం, శతదూషిణి, సంకల్ప సూర్యోదయం మొదలైన శతాధిక గ్రంథాలు రచించినవారు. భగవద్రామానుజుల తర్వాత విశిష్టాద్వైత సంప్రదాయాన్ని ప్రచారం గావించిన ప్రపన్నులు.

“అభీతి స్తవం”లో దేశికులు పరమపురుషుడైన శ్రీరంగనాథుణ్ణి శరణు పొందటం, ప్రధాన విషయం. స్వామి కల్యాణగుణాలు వర్ణించి, తమ ఆయుధాలతో లేదా స్వయంగా శ్రీరంగ క్షేత్రానికి ఏర్పడిన ఉపద్రవాన్ని శమింపచేయమని ప్రార్థించటం జరిగింది. వేదాంత దేశికుల రచనలన్నీ వ్యాఖ్యాపేక్షితాలే.

దేశికుల గ్రంథాలను తెలుగువారికి సరళమైన భాషలో అందించాలన్న లక్ష్యంతో వారి గ్రంథాలకు వ్యాఖ్య రచించినవారు శ్రీ ఉ.వే.ప్ర. శ్రీమాన్ కె.వి.రాఘవాచార్యస్వామివారు. వీరు ప్రపన్నులు. ఉభయ వేదాంతాలను చులికితం చేసుకున్నవారు. వేద వేదాంగాల్లోను పుష్కలమైన పాండిత్యంగలవారు. పాదుకా సహస్రం, సుదర్శనాష్టకం మొదలైన దేశికుల రచనలకు ఇంతకుముందే వ్యాఖ్యానాలు రచించినారు. వారి వ్యాఖ్యానాలు అస్మాదృశులకు ఉపకారకాలవుతున్నాయి. ఇవి తెలుగువారిని ఉజ్జీవింపచేస్తున్నాయి. భక్తి, ప్రపత్తి, భరన్యాసం, మోహం, షాడ్గుణ్య సంపత్తి, ఆచార్యానుగ్రహం వంటి సంప్రదాయ విషయాలను ప్రసన్నంగా వివరించినారు.

‘అభీతిస్తవం’ ఆవిర్భవించటానికి ప్రధాన కారణం శ్రీరంగంపై తురుష్కుల దాడి. ఈ విషయాన్ని దేశికులు 22వ శ్లోకంలో సూచించినారు.

శ్లో॥ కలప్రణిధి లక్షణైః కలిత శాక్య లోకాయతైః
తురుష్క యవనాదదిభి ర్జగతి జృంభమాణం భయమ్।
ప్రకృష్ట నిజ శక్తిభిః ప్రసభమాయుధైః పంచభిః
క్షితి త్రిదశ రక్షకైః క్షపయ రంగనాథ! క్షణాత్॥

దీన్ని వ్యాఖ్యాత – శ్రీరంగనాథా! కలిపురుష లక్షణాలు గల బౌద్ధులు, లోకాయతులు, తురకలు, యవనులు మొదలైనవారిచేత లోకమందు విజృంభిస్తున్న భయాన్ని అధికమైన శక్తిగలవి, కాబట్టి వైదిక జనులను రక్షించే పంచాయుధాల చేత క్షణంలో బలవంతంగా నశింపజేయుము అని వివరించారు.

శ్రీమాన్ రాఘవాచార్యస్వామి 1948 ప్రాంతంలో తెలంగాణాలో తురకల విజృంభణం వల్ల కలిగిన భయాన్ని స్వయంగా చూచి, అనుభవించినవారు. అటు భయాలను తట్టుకునే ధైర్యాన్ని కలిగించేదే 'అభీతి స్తవం'. ఈ స్తవాన్ని చదువుకున్నందువల్ల ఏ విధమైన భయాలు అయినా తొలగిపోయి నిర్భయులమవుతాము.

శ్లో॥ *భయం శమయ,రంగధామ్న్యనితరాభిలాష స్పృశాం*
శ్రియం బహుళయ ప్రభో! శ్రిత విపక్ష మున్మూలయ।
స్వయం సముదితం వపు స్తవ నిశామయంతః సదా
వయం త్రిదశ నిర్వృతిం భువి ముకుంద! విందేమహి॥

ప్రభో! ముకుంద! శ్రీరంగ క్షేత్రంలోనే తప్ప ఇతర విషయాల్లో ఏ మాత్రం అభిలాష లేని పరమ భాగవతుల భయాన్ని నశింపజేయి. శ్రీ వైష్ణవ శ్రీని బాగా వృద్ధి పొందించు. ఆశ్రితుల శత్రువులను నిర్మూలించు. స్వయం వ్యక్తమైన నీ దివ్యమంగళ విగ్రహాన్ని కళ్ళారా సేవిస్తూ నిత్యసూరులనుభవించే ఆనందాన్ని మేమీ భూలోకంలోనే అనుభవిస్తాము– అని దేశికులు రంగనాథుణ్ణి ప్రార్థించారు. అన్ని విధాల శక్తిమంతుడైన పరమాత్మే ఈ ప్రపన్నులను ఆనందింపజేస్తాడు. ఆ స్వామి అనుగ్రహమే ప్రధానం. అందువల్ల ఆ సర్వేశ్వరుణ్ణి ప్రార్థించటం కంటే ఈ జీవునికి వేరు మార్గం లేదు– అని దేశికులు తాము రంగనాథుణ్ణి ప్రార్థిస్తూ మనకు మార్గం చూపి భయం వదలి పెట్టమని ఉద్బోధించారు.

భక్తులను కాపాడుటయే పరమాత్మ పరమార్థం. ఏ భయంలేని స్వామి ఎల్లప్పుడు ఆయుధాలు ధరించి ఉండటం ప్రణతులైన రక్షణకోసమే కాని వేరు కాదు. ఈ కారణమే కాకుంటే పరమాత్మ పంచాయుధాలు ధరించటం వ్యర్థం కదా! ఈ విషయమే రంగనాథ స్తవంలోను ఇట్లా ఉన్నది–

శ్లో॥ *పాతుం ప్రణత రక్షాయాం విలంబి మస హన్నివ।*
సదా పంచాయుధీం బిభ్రత్ సనః శ్రీరంగ నాయకః॥

అని కూరేశులు కూడా పేర్కొన్నారు. ఇది ఆ రంగనాయకుల త్వర. దేశికులు 11వ శ్లోకంలో దీన్నే వివరించారు. భక్త రక్షణమే స్వయం భగవద్రక్షణం కూడా అని సిద్ధిస్తున్నది.

శ్రీ వరాహస్వామి చరమ శ్లోకాన్ని గుర్తింపచేస్తూ దేశికులు 6వ శ్లోకంలో–

శ్లో॥ *స్థితే మనసి విగ్రహో గుణిని ధాతు సామ్యేసతి*
స్మరే దఖిల దేహినం య ఇహ జాతు చిత్ త్వామజమ్।
తయైవ ఖలు సంధయా తమథ దీర్ఘ నిద్రావశం
స్వయం విహిత సంస్మృతిర్నయసి ధామ నై శ్రేయసమ్॥

ఏ వ్యక్తి తన శరీరం, ఇంద్రియాలు స్వాధీనంలో ఉన్నప్పుడు ఆ పరమాత్మను ఒకసారైనా స్మరిస్తాడో అతణ్ణి మరణకాలంలో తానే స్మరించి వైకుంఠానికి చేరుస్తాడు. అది ఆ భగవానుని దయాళుత్వం. అందువల్ల భగవన్నామ స్మరణం మన ఇంద్రియాలు స్వాధీనంలో ఉన్నప్పుడే చేయటం మంచిది. కఫ వాత పిత్తాదులతో స్మృతిని కోల్పోయి, మరణకాలంలో కట్టెగా శరీరం మారినప్పుడు భగవంతుణ్ణి స్మరించటం జీవునికి సాధ్యం కాదు. అప్పుడా భగవానుడే అతణ్ణి ఆదుకొని వైకుంఠానికి చేరుస్తాడు. ఇది ఆ స్వామి ప్రతిజ్ఞ కూడా.

7వ శ్లోకంలోను దేశికులు రంగభూరమణ! కృష్ణ! విష్ణో! నారాయణ! అంటూ స్వామి శుభాలను కలుగజేసే నామాలు యముని దర్శనాన్ని కలుగజేయవు. నరక బాధలను అనుభవింప చేయవు. అందువల్ల భయపడాల్సిన పనిలేదు. స్వామి నామ సంకీర్తనమే భయాన్ని తొలగిస్తుంది- అని భగవన్నామ సంకీర్తన ఫలాన్ని వివరించారు.

శ్లో॥ సకృత్ ప్రపదన స్పృశా మభయ దాన నిత్యవ్రతీ
నచద్విరభి భాషసే త్వమితి విశ్రుత స్వోక్తిభిః
యథోక్త కరణం విదుః తవతు యాళు దానాదయః
కథం వితథ మస్తు తత్ కృపణ సార్వభౌమే మయి॥

స్వామీ! రంగనాథా! రామావతారంలో ఒకసారి మాత్రమే శరణు పొందినవారికి అభయ ప్రదానం చేయటం నా వ్రతమన్నావు. 'రామో ద్విర్నాభి భాషతే' అని స్వయంగా చెప్పావు. నీవు చెప్పిన మాట తప్పక ఆచరిస్తావని రాక్షసులు మొదలైన వారు కూడా తెలుసుకున్నారు. అటువంటి అభయ ప్రదాతవు అతిదీనుణ్ణైన నా విషయంలో నీ ప్రతిజ్ఞ వ్యర్థం కాకూడదు- అంటూ స్వామికి గుర్తు చేసి కాపాడమన్నారు దేశికులు. శ్రీరామ చరమ శ్లోకాన్నిట్లా పేర్కొన్నారు-

భగవానుడు భయపడేవాళ్ళ విషయంలో దయను ప్రసరింపజేయాలనీ, అట్లా దయ చూపకపోతే ఇక దయ చూపేవాడెవడు? నాకంటె నీ దయకు పాత్రుడెవడున్నాడు? అంటూ స్వామి దయాగుణం సార్థకం కావాలంటే దయనీయుల విషయంలో దయ చూపి, ఇష్టప్రాప్తి కలిగించాలనీ, అనిష్టాలు తొలగించాలని కోరారు. అదేవిధంగా శ్రీరంగానికి కలిగిన ఆపదను నీవే తొలగించాలని ప్రార్థించారు.

శ్లో॥ మను ప్రభృతిమానితే మహతి రంగధామాదికే
దను ప్రభవ దారుణై ర్దర ముదీర్య మాణాం సరైః
ప్రకృష్టగుణక! శ్రియావసుధయాచ సంధుక్షితః
ప్రయుక్త కరుణోదధిః ప్రశమయ స్వశక్త్యా సయమ్॥

అనంత కల్యాణ గుణపూర్ణుడవైన రంగనాథా! మనుమహారాజు మొదలైన వారిచే పూజింపబడిన శ్రీరంగ విమానాది క్షేత్రాల్లో దానవులకంటే క్రూరులైన శత్రువులు భయాన్ని కలిగిస్తున్నారు. శ్రీదేవి భూదేవుల ప్రేరణతో దయను కనుపరుస్తు నీ శక్తిచే నీవే ఆ భయాన్ని శమింపజేయుమని ప్రార్థించారు. కల్యాణగుణాల్లో

దయాగుణం ప్రధానమైంది. అది స్వామికి మాత్రమే ప్రత్యేకమైంది. శ్రీరంగమే కాకుండా దక్షిణదేశంలోని తిరుమల మొదలైన క్షేత్రాల్లోను తురుష్కులు ధ్వంస రచన చేస్తున్నారు. వాటన్నింటిని నీ శక్తిచే కాపాడుమన్నారు.

సాధారణంగా పెద్దలనుండి కార్యం సాధించుకోవాలంటే వారి గుణాలను స్తుతించాలి. అందుకే దేశికులు పరమపురుషుడు రంగనాథస్వామి తిరుకల్యాణ గుణాలు స్తుతించి అభయ ప్రదానం చేయాల్సిందిగా ప్రార్థించారు.

ఈ విధంగా పరమాత్మ రంగనాథుని గుణవర్ణనతో కూడిన 'అభీతిస్తవం' చక్కని ప్రబంధం. శ్రీమాన్ రాఘవాచార్యస్వామివారు తమ వ్యాఖ్యానంలో దివ్య ప్రబంధాల్లోని పంక్తులు కూడా ఎత్తిచూపారు. వాటికి సాజాత్యంగల పూర్వాచార్యుల స్తుతుల్లోంచి, బ్రహ్మసూత్ర, భగవద్గీత వంటి వాటిల్లోంచి వివరించారు. దేశికుల స్తవానికి తగిన వ్యాఖ్య సంజీవనిని సమకూర్చారు. సంస్కృతం తెలియని వారికెంతో సహాయం చేశారు. వేదాంత దేశికులతో పాటు రాఘవాచార్యస్వామి కూడా పాఠకుల హృదయాల్లో నిలిచిపోతారు. సందేహం లేదు. స్వామివారికి తెలుగు వారంతా ఋణపడి ఉంటారు.

నవనవోన్మేషం నారాయణ శతక వ్యాఖ్యానం

ఆచార్య వెలుదండ నిత్యానందరావు

చరవాణి: 9441 666 881

పోతన కృత నారాయణ శతకానికి రాఘవాచార్యులవారు 'రాఘవీయం' పేరిట వ్యాఖ్యానం వ్రాయగా పావని సేవాసమితి పక్షాన చల్లా సాంబిరెడ్డి అనే వదాన్యులు, సంస్కారవంతులు ప్రచురించినారు.

పద్యాంతర్గతంగా ఉండే వ్యంగ్య మర్యాదలు, చమత్కారాలు, కవి ఆంతర్యం అన్నీ సుబోధకం చేయడం వ్యాఖ్యాతలపని. నారాయణ శతక రచనలో రాఘవాచార్యులవారు ఇవన్నీ సమర్థంగా నెరవేర్చారు. "ఇహాన్వయ ముఖేనైవ సర్వం వ్యాఖ్యాయతే మయనా ఉ మూలం లిఖ్యతే కించిన్నానపేక్షిత ముచ్యతే" అనే మల్లినాథ సూరి భావం వ్యాఖ్యాతలకెప్పుడూ శిరోధార్యమే. రాఘవాచార్యులవారు నారాయణ శతకానికి మొదట ప్రతిపదార్థ తాత్పర్యాలు రాశారు. దీంతో సామాన్య పాఠకునికి ప్రయోజనం సమకూరుతుంది. కాని ఆసక్తి, జిజ్ఞాస ఉన్నపాఠకున్ని మరింత విజ్ఞానవంతుని చేయడానికి శ్రుతులు, స్మృతులు, పురాణాలు, కావ్యాలు, నిఘంటువులు, భగవద్గీత, ఉపనిషత్తులు, ద్రావిడ సంప్రదాయ సాహిత్యం నుంచి ఉపపత్తులను చూపుతూ వ్యాఖ్య రాశారు. ఈ ఒక నారాయణ శతక వ్యాఖ్యానాన్ని శ్రద్ధగా అధ్యయనం చేస్తే నూరుగ్రంథాలు చదివిన ఫలితం కల్గుతుంది. రాఘవాచార్యులవారు ఉదాహరించిన గ్రంథాలు చూస్తే వారెంతటి వ్యుత్పన్న శీలురో, ఎంతటి పండితులో మనకు ఆశ్చర్యం కలుగుతుంది.

శ్రీగుణరత్నకోశం, హేమ నిఘంటువు, అమరకోశం, ఆళ్వార్లసూక్తులు, వేదార్థ సంగ్రహం, దయా సహస్రం, విష్ణుషట్పదీ స్తోత్రం, శ్రీస్తవం, శ్రీరంగరాజస్తవం, హర్యష్టకం, విష్ణుసహస్రనామాలు, ఆపస్తంబసూత్రం, రహస్యత్రయసారం, ముకుందమాల, పాదుకాసహస్రం, చతుఃశ్లోకి, భగవద్గీత, హారీతస్మృతి, ఈశ్వర సంహిత, బోధాయన సంహిత, స్కాందపురాణం, బ్రహ్మాండపురాణం, నృసింహ పురాణం, విష్ణుపురాణం, పద్మపురాణం, ముండకోపనిషత్, బృహదారణ్య కోపనిషత్, నారాయణోపనిషత్, ఛాందోగ్యోపనిషత్, శ్వేతాశ్వతరోపనిషత్, అధర్వణిక కృష్ణోపనిషత్, రామాయణ, భారత భాగవతాలు (సంస్కృతాంధ్రాలు), అనర్ఘరాఘవం, కిరాతార్జునీయం, శిశుపాలవధ, కుమార సంభవం, కృష్ణకర్ణామృతం (సంస్కృతాంధ్రాలు), భరతకోశం, సాహిత్యదర్పణం, దాశరథీశతకం, హరివంశం ఇత్యాది గ్రంథాలెన్నింటి నుండో ఉల్లేఖించడం ఆయన అపారమైన పాండిత్యానికి నిదర్శనం.

ఇంత సంప్రదాయ పండితుడైనప్పటికీ ఒక పద్యాన్ని వ్యాఖ్యానిస్తూ అర్థావగాహనను సులభతరం చేయడానికి దైనందిన వ్యవహారంలోని ఆంగ్ల పదాలను వాడడానికి కూడ వెనుకంజవేయలేదు.

"శరీరమొక బస్సు, పరమాత్మ చోదకుడు డ్రైవరు. కర్మ అనే ధనంతో దాని ఫలమనే టిక్కెట్టుకొని జీవుడనే ప్యాసెంజర్ ఆ బస్సెక్కుతాడు. టిక్కెట్టుకు తగినంత దూరపు స్టేజి వరకు బస్సుమీద త్రిప్పి దించేస్తాడు" "(పుట119). ఎంత సరళంగా చెప్పారు! దీన్ని ప్రత్యేకించి వ్యాఖ్యానించాల్సిన పనిలేదు.

"విందుల్విందులటంచు గోపరమణుల్ ద్రేపల్లెలో చిన్ననా
డందెల్ మ్రోయగ ముద్దుమోమలర నిన్నాలింగుతుంజేయుచో
డెందంబుల్ దనివార రాగరసవీటీలీలలన్ దేల్చు మీ
మందస్మేరముఖేందురోచులు మమున్మన్నించు నారాయణా".

శ్రీ కృష్ణుని (ముఖ) దర్శనం విందు చేస్తుంది. గోపికలు ఆ ముఖాన్ని చూస్తూ శృంగారభావంతో విందు చేసుకుంటున్నారు. అలాంటి ముఖం మమ్మల్ని కాపాడుగాక అనేది దాని స్థూలభావం. పంచేంద్రియాలను తృప్తిపరుస్తున్న విందు భగవద్రూపం అని మాట వరసకు అంటే సరిపోదు. అన్వయించినపుడే వ్యాఖ్యాత శక్తియుక్తులు బయటపడుతాయి.

"ముద్దు లొలికే ముఖం కన్నులకు విందు, మంజీరాల శింజితాలు చెవులకు విందు. విచిత్ర స్నిగ్ధ విగ్రహం డెందానికి విందు. మధురగంధిమందహాసం నాసికకు విందు. 'కృష్ణా'! అనే పసిడి పలుకు రసనకు విందు. సర్వేంద్రియాలు సంతృప్తి చెందినా, త్వగింద్రియానికి తాకితేగాని తృప్తి యుండదు. కాబట్టి మంగళాంగుణ్ని చూచిన వెంటనే విందులు, విందులూ అంటూ గోపాంగనలు ఆలింగనం చేసుకొనేవారు. అప్పుడు కృష్ణుడు బాలుడే అయినా, గోపికల డెందం కందళించి అనందభరిత మయ్యేరీతిగా మగపోడిమితో సింగారపు చేష్టలు చేస్తు చిరునవ్వుల వెన్నెలను చిందించేవాడు. ఆ మోము, ఆ రవళి, ఆ లీలలు, ఆ చిరునవ్వులు మనకూ విందులై పుష్టినీ, తుష్టినీ కలిగిస్తాయి కదా!" (పుట. 155)

ఇది చదివిన వెంటనే రాఘవాచార్యులు గారెంత బాగా చెప్పినారో అని మురిసిపోతాం. వారి అన్వయ సామర్థ్యానికి మూలం ఆయన వ్యుత్పన్నత, బహుగ్రంథ పఠనం. ఇది శ్రీకృష్ణ కర్ణామృతంలో కనిపిస్తుంది. లీలాశుకుని శ్రీకృష్ణకర్ణామృతం సాధారణంగా భక్తులు, పండితులు చదువుకునేవారు. కనుక దాని అనువాదమైన వెల్గపూడి పెద్దామాత్యుని అనువాద పద్యాన్ని ఉల్లేఖించారు. ఇది రాఘవాచార్యుల ప్రత్యేకత.

"అందము గుల్కు నీయలసయానము మాటలు తేనె సోనలన్
జిందు మృదుస్మితంబు సుధ జిందు గటాక్షము లౌర వించుకన్
విందులు కౌగిలింత కడు వింత యటంచును గోపకాంత లా
నందము తోడ బల్కుదురునాథ భవన్మహిమానుభావముల్" (శ్రీ కృష్ణకర్ణామృతం 1-27)

మరొక చోట జ్ఞాని లక్షణాలను తెలుపుతూ రాఘవాచార్యులుగారు ఇలా అంటారు: "వ్యక్తి సంఘజీవి, సాంఘిక ధర్మాల ననుసరించి వైయక్తిక జీవితాన్ని గడుపడం తనకూ, సంఘానికి శ్రేయస్కరం. వ్యక్తిగత ధర్మాలను పరిశీలించి ఆదరంతో అవలంబించిన వ్యక్తి సమాజానికి ఆదర్శ పురుషుడవుతాడు. సమాజం ఆయనను మహాజ్ఞానిగా గౌరవిస్తుంది. జ్ఞానికి స్వ, పరభేదం ఉండదు. ఆత్మవత్ సర్వభూతాని అన్నట్లు సర్వప్రాణులను, తననువలె చూచుకుంటాడు. అందరి యందు దేహభేదాలను గణింపక సమదృష్టి కలిగియుంటాడు." (పుట. 211).

"ధరసింహాసనమై, సభంబు గొడుగై, తద్దేవతల్ భృత్యులై,
పర మామ్నాయములెల్ల వందిగణమై, బ్రహ్మాండమాగారమై,
సిరి భార్యమణియై, విరించి కొడుకై శ్రీ గంగ సత్పుత్రియై
వరుస న్నీ ఘనరాజసంబు నిజమై వర్ధిల్లు నారాయణా".

ఇది నారాయణ శతకంలోని అతి ప్రసిద్ధమైన పద్యం. నాయకుని ప్రాభవ వైభవాలను ఉగ్గడించే పద్యం. ఇది చాలమంది చదివేవారు. ఈ పద్యాన్ని వ్యాఖ్యానిస్తు రాఘవాచార్యులు తన చిన్ననాటి దృశ్యాన్ని అనుభూతిలోకి తెచ్చుకొని మరొకసారి పులకించిపోయారు.

"కరీంనగర్ జిల్లాలోని ముప్పిరితోట గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవం వైశాఖ శుద్ధ మందు జరుగుతుంది. వీధ్యుత్సవ మప్పుడు, భగవత్సేవకు ముందు వెనుక ద్రవిడ వేద పారాయణం జరుగుతుంది. ఇంక యజమానుడు శ్రీరామిడి రాఘవరెడ్డితోపాటు భజనపరులు మేళతాళాలతో భజన చేస్తుండేవారు పూర్వం. మధ్యమధ్యనవారు ధరసింహాసనమై అనే పద్యాన్ని పలుమారులు రాగయుక్తంగా గళమెత్తి పఠించేవారు. పద్యావర్తికి ఒకసారి 'సమస్త రాజ హరి బల గోవిందా' అంటూ ఎలుగెత్తి బాహువులు పైకెత్తి కీర్తిస్తూ కేల్మోడ్చేవారు. ఆ దృశ్యం సకలజన మనోనయనానందకరంగా ఉండేది" (పుట. 62) ఇలాంటి సంస్కారాలు, మనోనయనానందకర దృశ్యాలు పట్టణీకరణం, అతి నాగరికతల కారణంగా కనుమరుగై పోతున్నాయి.

భగవంతుడు భక్తులయందు జ్ఞానులయందు మాత్రమే కాదు. భక్తులు కానివారియందు, అజ్ఞానులయందు కూడ వుంటాడు. ఎటొచ్చి వారి యందు "కంటకాగ్రవస్థితః" వారి హృదయంలో ముండ్లమీద నిలిచి యున్నట్లు ఉంటాడు- (పుట 223) అని వ్యాఖ్యానిస్తారు.

కె.వి. రాఘవాచార్యుల నారాయణ శతకం వ్యాఖ్యానం చదివితే చొక్కమైన పాండిత్యం, సంప్రదాయ పరిజ్ఞానం, అనుభవ పరిపాకం, భక్తితత్పరతలు మూర్తీభవించిన మహనీయుని ప్రవచనాలను ఆలకిస్తున్న అనుభూతి కలుగుతుంది. ఆ మహనీయునికి అంజలి ఘటిస్తున్నాను.

"శ్రీ రాఘవార్యం శిరసానమామి"

సాధన నరసింహాచార్య
చరవాణి: 9440 927 200

మల్లినాథసూరి విశేషవ్యాఖ్యానం వల్ల కాళిదాసు కావ్యరచనాపటిమ, సాహితీప్రియుల హృదయాలలో మహాకవిగా నిల్పినది అద్వైతానికి "భామతి" (శంకరభాష్యం), వేదాలకు సంహితలు, ఉపనిషత్తులు, ఎలా పాఠకులకు వారధిగా నిల్చినాయో, అవి వ్యాఖ్యాతల ప్రతిభా వ్యుత్పత్తులకు దర్పణాలు.

భక్తి, జ్ఞాన, వైరాగ్య సంపన్నులు, ఉభయవేదాంత ప్రవర్తకులు అయిన శ్రీమాన్ రాఘవాచార్యులు గారు శ్రీమద్వేదాంత దేశికులవారి "పాదుకా సహస్రము" అనే ఉద్గ్రంథానికి, తదితర కృతులకు వ్యాఖ్యానాలను రచించి, సామాన్య పాఠకులను అలరించిన పండిత శిరోమణి. వ్యాఖ్యాతలు, సమీక్షకులు ఒక కావ్యాన్ని ఎలా సమీక్షించాలో తెలిపే "పెద్దబాలశిక్ష" వంటివి వీరి వ్యాఖ్యాన గ్రంథాలు.

నారాయణశతకాన్ని వ్యాఖ్యానించిన రాఘవాచార్యులు గారు వెల్లంకి తాతంభట్టు, కస్తూరిరంగ కవుల వంటి లాక్షిణికుల అభిప్రాయాలను పరిశీలించి, ఇది ప్రాచీనమైన శతకమని, భక్తి, జ్ఞాన, వైరాగ్యముల కదంబమని, పరబ్రహ్మతత్త్వాన్ని, దశావతారాల స్వరూప, గుణ విభూతులను ఆవిష్కరించే సప్త శీర్షికల పద్యసమాహారమని, ఇది పోతనగారి రచనే అని విశ్లేషించి, అనవసరమైన అనుమానాలను నివృత్తిచేసినారు.

"నామ ప్రభాదశకం", కృష్ణావతారవింశతి, జ్ఞానవింశతి అనే శీర్షికలు ఉన్నాయని, నారాయణుని వైభవాన్ని విలక్షణంగా విశ్లేషించే శతకమని పేర్కొన్నారు ఆచార్యులవారు. కవిపేరు శతకంలో పేర్కొనకపోవడం వల్ల పాఠకులకు కల్గిన సందేహాలను, చక్కగా, సాధికారికంగా స్వామి శివశంకరస్వామి వంటి జ్ఞానుల అభిప్రాయాలను పరిశీలించి, పరిశోధించడంలో రాఘవాచార్యుల వారి అశేషకృషి కలదు.

మొదటి పద్యం:

" శ్రీరామామణి పాణి పంకజమృదుశ్రీతజ్ఞ, పాదాబ్జ, శృం
గారాకారశరీర, చారుకరుణాగంభీర, సద్భక్తమం
దా రాంభోరుహపత్రలోచన, కళాధారోరుసంపత్సుధా
పారావార విహార, నాదురితముల్, భంజింపు నారాయణా!"

పాపములనుండి విముక్తిని కోరుతూ, భక్తిప్రపత్తులతో నారాయణుని కోరే ఆధ్యాత్మిక తత్త్వదర్శిని ఈ శతకం.

"శ్రీ" శబ్దం లక్ష్మీదేవి మాహాత్మ్యాన్ని ఎలా ప్రకటిస్తుందో వివరిస్తూ ఆరు విధాలుగా వ్యాఖ్యాత వివరించారు. (1) అందరిచే ఆశ్రయింపబడేది శ్రీదేవి (2) తాను నారాయణున్ని ఆశ్రయించింది. (3) ఆశ్రితుల మాటలను

వింటుంది. (4) ఆశ్రితుల ఆర్తిని శ్రీహరికి వివరిస్తుంది. (5). దోషాలను పోగొడుతుంది. (6) విశ్వమంతా రమణీయ, శుభప్రదమైన గుణాలతో వ్యాపింపచేస్తుంది. పద్మప్రియ, పద్మాలయ, పద్మముఖి అయిన లక్ష్మీదేవి కరకమలాల మార్దవశోభ, నారాయణుని పాదారవిందాలకే తెలుస్తుంది అనడంలో కవి యొక్క సుకుమారతత్త్వాన్ని, పదలాలిత్యాన్ని ఆచార్యులవారు తమ పాండితీ ప్రకర్షతో విశ్లేషించారు.

సాధారణంగా మానవులను వర్ణించేటప్పుడు శిరస్సునుండి, పరమాత్ముని వర్ణించేటపుడు పాదాల నుండి వర్ణించడం సంప్రదాయం. ఆ సంప్రదాయాన్నే కొనసాగించిన కవి "శ్రీరామామణి పాణి పంకజ" అనే ప్రయోగంతో శతకాన్ని ఆరంభించారు.

ప్రార్థించే సమయంలో దంపతులు ఇరువురిని ప్రార్థించాలి ఒక్కరినే ప్రార్థించడం తగదు. ఒక్క సీతాదేవినే కోరుకున్న రావణుడు, ఒక్క రాముణ్ణే కోరుకున్న శూర్పణఖ ఎలా దుస్థితి పొందారో లోకంలో అందరికీ తెల్సినదే. అందువల్లే శ్రీమన్నారాయణుడు, శ్రీదేవి సమేతుడై మనలను రక్షించాలి అన్న ఉపదేశాన్ని ఆచార్యులవారు మనకు అందించారు.

"కరుణాగంభీర" అనే ప్రయోగాన్ని విశ్లేషిస్తూ, "దయ"ను వేదాంతదేశికులవారు పరహిత చింతనగా వివరించారని తెల్పుతూ, సముద్రం వంటి "దయ"ను ప్రవేశించడం అసాధ్యమని, అందుకు సముద్రతీరం వంటి భగవంతుణ్ణే శరణువేడాలని, ఆయనను త్రికరణశుద్ధిగా సేవిస్తే, ఇహలోక తాపత్రయం నశిస్తుంది. పరలోకజ్ఞానం కలుగుతుందనీ వివరించారు.

ఈ సందర్భంలోనే దేవవృక్షాలు, వాటి వ్యుత్పత్తులతోనే భగవంతునికి అర్చన చెయ్యాలి అంటూ (1) మందారం (2) పారిజాతం (3) సంతానవృక్షం (4) కల్పవృక్షం (5) హరిచందన వృక్షాలు, వీటి పువ్వులతోనే ఆరాధించాలి అని సూచిస్తారు వ్యాఖ్యాత. "కళాధారోరుసంవత్సుధా" అనే ప్రయోగంలో

"కళాశ్చపంచభూతాని, జ్ఞానకర్మేంద్రియాణిచ !
పంచపంచమనశ్చేతి షోడశోక్తామహర్షిభిః !!"

అంటూ 16 కళలు వాటి ప్రాశస్త్యాన్ని వివరించారు.

5 జ్ఞానేంద్రియాలు, 5 కర్మేంద్రియాలు, పంచభూతాలు, మనస్సు ఇటువంటి అద్భుత విషయాలతో బాటు "నారాయణ" శబ్దం సంజ్ఞావాచకమని, "యస్మాన్నారాయణీయో, నజ్యోయ్యోస్తికశ్చిత్" విశ్వంలో అత్యంత సూక్ష్మమైనది, గరిష్ఠమైనది ఏది కలదో అదే 'నారాయణ' మన్న వేదోక్తిని ఉటంకిస్తూ, ఓ నారాయణా! నేను తెలిసికానీ, తెలియక కానీ ఆచరించిన పాపములను వాటివల్ల కలిగే ఫలములనుండి నన్ను బ్రోవుమా! అన్న కవి వాక్కును విశ్లేషించి, మనకు తెలియని ఎన్నో విశేషాలను తెల్పిన రాఘవాచార్యులవారి వ్యాఖ్యాన పటిమకు నమస్కరిద్దాం.

శ్రీ రాఘవ ప్రశంసా

డా॥ కండ్లకుంట అళహ సింగరాచార్యః

చరవాణి: 2402 1050


శ్లో॥ కారంచేద్వంశసిన్ధోః సమజని రజనీకాన్త తుల్యస్వరూపః
గైర్వాణ్యామ్ ద్రావిడోర్న్యోః సమధికధిషణః సంప్రదాయాభిమానీ
కాలక్షేప ప్రబన్ధ ప్రవచన కుశలః సూక్ష్మతత్త్వార్థ దర్శీ
వ్యాఖ్యాతా గ్రన్థరాశేః సహృదయ హృదయామోది శైలీ సమగ్రమ్

శ్లో॥ శ్రీ పాదుకా సహస్రాది దేశిక గ్రన్థసంచయమ్
ఆంధ్ర్యాం ప్రమాణ సంయుక్తం వ్యాచఖ్యౌ రాఘవస్సుధీః

శ్లో॥ శ్రీమత్పరాంకుశముఖోదిత సామవేద
సారాంశ నిర్మిత మహా ద్రవిడ ప్రబన్ధమ్
సంక్షిప్య పద్యశతకేన సుచారుశైల్యా
వేదాన్తదేశిక వరః కృతి మాతతాన

శ్లో॥ తస్యాఃకృతేః సురవచోగ్రథి తత్త్వ హేతోః
తద్భిన్న పాఠక జనస్య సుబోధనార్థమ్
ఆంధ్ర్యాం చకరా వివృతం సంకలాంశ యుక్తాం
శ్రీ రాఘవో జనహితాయ ప్రకాశికాఖ్యామ్

శ్లో॥ ఛాన్దోగ్య వాక్యార్థ సమర్థకాని శఠారి గీతస్థ పదాని వీక్ష్య
రత్నావళీ శ్లోక సమన్వయేన ప్రకాశికా పణ్డిత రఞ్జకాస్తే



"పెరియాళ్వారు" జనించెనో మరల...

డా॥ ఆచార్య ఫణీంద్ర
చరవాణి: 9959 882 963

పరమోత్కృష్ట మహా ప్రపన్నులుగ తా భాసిల్ల నీ భూమిపై
"పెరియాళ్వారు" జనించెనో మరల "కే.వీ.రాఘవాచార్యులై"
అరిపాదంబుల నుండి మస్తకముపై నంటంగ శ్రీ వైష్ణవా
చరణాసక్తియు, విష్ణు కింకరత- ఆజన్మాంత బంధంబునన్!

ఇమ్మడి ప్రేమ, దయా కిర/ ణమ్ముల ప్రసరించె తాను నానావిధముల్
తమ్ములకు జీవన వికా/ సమ్మును కలిగింప నగ్రజన్ముడు, సవితై!

సంస్కృతాధ్యాత్మ వాఙ్మయ ఝురిని మునిగి,
ద్రవిడ వేదాంత సాహిత్య రసము గ్రోలి,
ఉభయ వేదాంత సత్పండితోత్తమునిగ
ప్రణుతికెక్కె "కారంచేటి" వంశ ఘనుడు!

"పాదుకా సహస్రము" వంటి పలు ప్రబంధ
దివ్య వ్యాఖ్యాన గ్రంథాల భవ్య రచన
దినము, రాత్ర మనక సల్పి దీప్తినొందె
అపర "వేదాంత దేశికు" లన్న యట్లు!

శ్రీకాంతున్ హృదిలోన నిల్పి సతమున్ శిష్టాను సంవర్తియై,
లోకోద్ధారకుడైన పుత్రు గని, సుశ్లోకంబుగా ధాత్రిపై
సాకల్యంబును గొన్న జీవనముతో సార్థక్యమున్ గాంచియున్,
వైకుంఠంబున విష్ణుమూర్తి పదసేవావృత్తికై యేగె తాన్!

సిరితావి

సాతులూరి గోపాలకృష్ణమాచార్య

ఈ జగత్తులో తల్లిదండ్రులను మించిన దైవము లేదు అనునది సత్యము. వేదము మనము దైవభావనతో ఆరాధించవలసిన వారిని గురించి తెలుపుతూ 'మాతృదేవోభవ, పితృదేవోభవ' అని పేర్కొనినది. ఇందు ఆరాధింపబడువారిలో ప్రథమ స్థానమును తల్లికే ఇచ్చినది. కనుకనే వ్యవహారములో కూడ స్త్రీని ముందుగా పేర్కొని తరువాత పురుషుని పేర్కొనుట జరుగుచున్నది. ఈ వ్యవహారము లౌకికముగ మాత్రమే కాక పురాణములందు కూడ ఇట్లే సీతారాములు, గౌరీ శంకరులు ఇత్యాది నామములు ప్రసిద్ధముగ వినబడుచున్నవి.

బ్రహ్మవైవర్త పురాణము 'రాధాకృష్ణ' అనియే ఏల వ్యవహరించవలెనను విషయమును తెలుపుతూ–

"గరీయసీ త్రిజగతాం మాతా శత గుణైః పితుః।
రాధాకృష్ణేతి గౌరీశేత్యేవం శబ్దః శ్రుతౌ శ్రుతః॥"

(తండ్రి కంటె నూరురెట్లు ఆధిక్యమును కలిగినది తల్లి. కనుకనే రాధాకృష్ణులు, గౌరీశంకరులు అను వ్యవహారము శ్రుతియందు వినబడినది) అని తెలిపినది.

ఇందులకు ఉదాహరణముగ సామవేదమందలి కౌథుమ శాఖయందు 'గృహాణార్ఘ్యం మయాదత్తం సంజ్ఞయా సహభాస్కర' (సంజ్ఞాదేవితో కూడిన సూర్యదేవా! నాచే యొసగబడిన అర్ఘ్యమును స్వీకరించుము) అనియు 'ప్రసీద రోహిణీ చంద్ర గృహాణార్ఘ్య మిదం మమ'. (రోహిణీ దేవికి ఆహ్లాదమునొసగు ఓ చంద్ర దేవా! అనుగ్రహించి నాచే నొసగబడు అర్ఘ్యమును గ్రహింపుము) అనియు అన్వయ ముఖేన స్త్రీ యొక్క ఆధిక్యము పేర్కొనబడినది.

ఇక వ్యతిరేక ముఖముగ ఎట్లు తల్లి ఆధిక్యము తెలుపబడినదో బ్రహ్మవైవర్త పురాణానుసారముగనే పరికించిన యెడల–

"ఆదౌ పురుష ముచ్చార్య పశ్చాత్ ప్రకృతి ముచ్చరేత్।
సభవే న్మాతృఘాతీచ వేదాతి క్రమణే మునే॥"

(మొదట పురుషుని నామమును పేర్కొని తరువాత స్త్రీ నామమును పేర్కొనినవాడు మాతృఘాతకుడు, వేదము నతిక్రమించినవాడు అగును) అని వ్యక్తమగుచున్నది.

తైత్తిరీయ ఉపనిషత్తు నందలి శీక్షావల్లియందలి 'మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ, అతిథి దేవోభవ' అను వాక్యములకు 'తల్లిని దైవముగా కలవాడవు కమ్ము, తండ్రిని దైవముగా కలవాడవు కమ్ము, ఆచార్యుని దైవముగా కలవాడవు కమ్ము, అతిథిని దైవముగా కలవాడవు కమ్ము' అని సామాన్యముగ అర్థము భాసించిననూ, వేదాధ్యయనమును పూర్తిచేసుకొనిన పిమ్మట ఉపదేశింపబడే ఈ వాక్యములకు ఇంత మాత్రమే అర్థమైయుండనోపదు. ఇందలి గంభీరమైన భావమును గ్రహించుట ఆవశ్యకము.

ఇచట 'మాతృదేవోభవ' అనుటలో 'త్వంమాతా సర్వలోకానాం' అను విష్ణు పురాణ వచనము ననుసరించి అఖిల జగన్మాతయగు శ్రీలక్ష్మీదేవి మాతృదేవతగా పేర్కొనబడుచున్నది. 'పితృదేవోభవ' అనుటలో 'పితామహస్య జగతః', 'దేవ దేవో హరిః పితా' అను ఇతిహాస పురాణ వచనములను బట్టి సమస్త జగత్తుకు తండ్రియగు శ్రీమన్నారాయణుడే పితృదేవుడుగా పేర్కొనబడినాడు. 'ఆచార్య దేవోభవ' అను వాక్యమునందు ఆవశ్యకమగు ఆధ్యాత్మిక జ్ఞానమును అనగా మంత్ర మంత్రార్థములను ఉపదేశించి అసన్నేవ' (లేచి వాడే) అను రీతిగా ఉన్నవానిని 'సన్త మేనం' (ఉన్నవానిగా నిర్దేశించి) అనునట్లు చేసిన ఆచార్యులు పేర్కొనబడినారు.

"అమ్మొ నరంగళ్కు మా విక్కుమ్... అవనన్నో ఆచారియన్" అను విళాంశోలైప్పిళ్ళైగారి 'సప్తైగాథై' యందలి పాశురము ఇచ్చట స్మరించదగినది. ఇక 'అతిథి దేవోభవ' అనుటలో-

"ఉణ్ణానాళ్ పశియాదదొన్నిల్లై, నిన్ నామమ్
నణ్ణానాళ్ అవై పట్టిని నాళ్"

అని నటుల భగవదనుభవమును జేయుటయే విందు భోజనమనియు, భగవదనుభవము లభింపకపోవుటయే పస్తుండుట యనియు భావించు భాగవతోత్తములు అతిథులుగా పేర్కొనబడినారు. ఇట్లు వీరిని దైవముగ భావింపుమని ఉపదేశించుటయే ఇందలి గంభీరమైన భావము.

ఆరాధనీయులను గురించి వేద మీ క్రమమును తెలుపుటలో ఒక సామంజస్యము కలదు. కనిపించిన భాగవతోత్తములనందరిని నడయాడే భగవన్నివాసములుగా భావించి ఆరాధించవలెనను జ్ఞానము కలుగునది ఆచార్యుని యొక్క సదుపదేశము వలననే కదా! అట్టి సదాచార్యుని ఆశ్రయించి తరించవలెనను సద్బుద్ధి పొడమునది భగవదనుగ్రహము వలననే కదా! ఆ భగవదనుగ్రహము కలుగుటకు ఆవశ్యకమగునది అమ్మ పురుషకారము. కనుకనే శ్రుతి ఈ నలుగురిలో తొలుదొల్తగా ఆరాధించవలసినది అమ్మనే అని 'మాతృదేవోభవ' అని ప్రారంభములో తెలిపినది.

అందువలన ఉపకార గౌరవమును, ప్రాధమ్యమును బట్టి చూచిన ఎడల మనము సేవించవలసినది అమ్మ లక్ష్మీదేవినే కదా! మన పూర్వాచార్యులు సాధారణముగా ఏ గ్రంథమును ప్రారంభించినా 'శ్రియఃపతి యామ్' అని అమ్మ సంబంధముతో స్వామిని నిర్దేశించుట గమనించదగిన విషయము.

ఇట్టి అమ్మవారి వైభవమును తొలుదొల్తగా, సమగ్రముగా నాలుగు శ్లోకములలోనే ఇమిడించి అందించిన మహోదారులు శ్రీయామున మునులు. భగవద్రామానుజుల గీతాభాష్యమునకు మూలగ్రంథమనదగిన గీతార్థ సంగ్రహమును, శ్రీ భాష్యమునకు మూల గ్రంథమనదగు 'సిద్ధిత్రయము'ను అనుగ్రహించి వారు శ్రీమద్యామున మునులే. ఇట్టి వీరి అతి గంభీరార్థ గర్భితమై వెలయు 'కాన్తా చతుః శ్లోకీ స్తోత్రము'నకు సరళమై పూర్వాచార్య వ్యాఖ్యానములకు మరింత శోభను కూర్చు రీతిని ఆంధ్రభాషలో వ్యాఖ్యానమును వెలయించిన మహావిద్వాంసులు ఉ.వే.శ్రీమాన్ కె.వి.రాఘవాచార్యస్వామివారు. ఈ స్వామివారు పాదుకా సహస్ర ఆంధ్రవ్యాఖ్యానముతో తెలుగువారికి చేసిన ఉపకారము మరువరానిది.

అంతమాత్రమే కాక శ్రీ మద్వేదాంత దేశికులవారు అనుగ్రహించిన భగవద్ధ్యాన సోపానము, శ్రీ గోదాస్తుతి, శ్రీ సుదర్శనాష్టకములకు స్వామివారనుగ్రహించిన వ్యాఖ్యానములు ఆంధ్రజనులకు దేశిక సూక్తి మాధుర్యమును అనుభవింపజేయు రసగుళికలు. శ్రీ స్వామివారి వ్యాఖ్యాన శైలి సహృదయ హృదయానందకరము మాత్రమే కాదు. ప్రామాణికము కూడా తాము ఏ పదమును వ్యాఖ్యానించినా అందుకు ఉపోద్బలకమగు ప్రమాణమును చూపక విడువని శైలి స్వామివారిది. విశేషించి వేదమునుండి, దివ్య ప్రబంధముల నుండి, పూర్వాచార్య గ్రంథముల నుండి ప్రమాణములను చూపియే వ్యాఖ్యానించుట స్వామివారి వ్యాఖ్యాన ప్రామాణికతను తెలుపుచున్నది.

ఇట్లు సిరితావిని గుబాళింపజేయు వ్యాఖ్యానమును సేవించి ఆనందించు భాగ్యమును పొందినవారు ధన్యులు.

"చతుఃశ్లోకి" గ్రంథం (2006)లోని పీఠిక

గ్రైవేయకమ్

టి.పి. శ్రీరామచంద్రాచార్య స్వామి

సత్సంప్రదాయ స్తోత్ర వాఙ్మయంలో భగవద్ గుణాభివర్ణన పరాలుగా కొన్ని స్తుతులు వెలయగా భగవతీ గుణకీర్తన పరంగా కొన్ని స్తుతలు ఆవిర్భవించినవి. నిజానికి రెండూ భిన్నాలు కావు. అయ్య పొగడికోలులో అమ్మ కైవారముల సవ్వడులూ వినవస్తాయి. అమ్మకు కావించే కైమోడ్పులలో అయ్య గొప్పతనాలు కతపబ్బాలూ కావస్తాయి. పూవు లేక తావి, వెలుగు లేక పొద్దూ వుండవు కదా! అయినా స్వామి మహిమను శ్లాఘించటం ఒక తీరు, మాతృగరిమను కొండాడటం ఒక తీరును. దేని రుచి దానిది. స్తోత అభిరుచిని బట్టి ఇది సాగుతుంది. ప్రప్రథమంగా సత్సంప్రదాయ స్తోత్రవాఙ్మయ నందనవనంలో శ్రీ వైభవ కల్పవల్లికను 'చతుఃశ్లోకి'గా నెలకొల్పిన మహోదారులు శ్రీయామున మునులు– తరువాతి వారికి ఆ కల్పవల్లిక కొనలు వేసి తీగలు పాకి ననలు దొడిగి విరిజల్లులు కురిసి ఎదలలో పూలపందిళ్ళు నెలకొల్పుకోను తోడ్పడినది.

ఈ క్రమాన వెలసిన స్తుతి ప్రబంధాలు శ్రీ కూరేశ మిశ్రుల 'శ్రీస్తవం', శ్రీ పరాశర భట్టారకుల 'శ్రీగుణరరత్నకోశం' శ్రీమన్నిగమాంత దేశికుల 'శ్రీస్తుతి' వేంకటాధ్వరి 'లక్ష్మీసహస్ర'మును. అమ్మను పురుషకారంగా, లక్ష్మీనారాయణ మిథునాన్ని ప్రాప్యంగా, తన్మిథున కైంకర్యాన్నే స్పృహణీయంగా భావించి, 'భవతీ సంబంధ దృష్ట్యా హరింపశ్యేమ'... అన్నట్లుగా తల్లితో తనయులాడిన ముద్దులొలుకు, కల్లకపటములకు తావులేని పలుకు కప్పురపు పెల్లలు. ఎదతమ్ముల జాలువారు ప్రణయ రసకుల్యా మధుధారలు నింపిన రస కలశాలు. పురిటి పొత్తిళ్ళ పుప్పొళ్ళు పాదారుంతుదాలుగా, పరమ మృదుతా విస్రంభ స్థానములుగా వాసిగాంచిన తల్లి చివురుపాదాలకు అవనేజన మొనగూర్పను తలపు వెన్నెల నీరునింపిన పసిడిగిండియలు. ఆజానులంబి వైజయంతీ ప్రస్పర్ధమానర్ధి హృద్యానవద్య పద్య ప్రసూన మాలికలు ఈ స్తుతి ప్రబంధములు.

అట్లా ఆ జగన్మాతకు శ్రీమన్నిగమాంత మహాదేశికులు సమర్పించిన పద్యప్రసూన మాలిక ఈ శ్రీస్తుతి. కవితార్కిక సింహులు శతాధిక గ్రంథకర్తలు 'సాహిత్యే సుకుమారవస్తుని దృఢన్యాయగ్రహ గ్రంథిలే తర్కేవామయి సంవిధాతరి సమం లోలాయతే భారతీ'– అన్న శ్రీ హర్షుని మాట వారిపట్ల అక్షర సత్యం. శాస్త్రారణ్యానీ విహార వ్రతుల ఈ పలుకుతొయ్యలికి మృదుశయ్యలు కూర్పగల మెత్తటి నిద్దపు తలపుల భావుక చూడామణులు వారు. స్తుతిసాహిత్య సరస్వతికి వారు పరికల్పించిన చామీకర శతపత్ర భద్రపీఠి 'దయాశతకం'. రంగనాథుని జగదేక పతిత్వానికి వారు పట్టిన వేయి వెలుగుల ముత్యాల వెల్లగొడుగు 'పాదుక'. ఎంత లలిత భంగుల, మృదఫణితుల సుకుమార సరణుల వారు స్తుతులు నెరపినా వాటి లోతుపాతులు, సొగసులు, చమత్కృతులు, జాణతనములు అనుభవరసికులు తవ్వితలకెత్త వలసినదే కాని మనముగా చూరగొనలేము.

అందుకు సమర్థులయినవారి వ్యాఖ్యలే శరణ్యాలు. శ్రీస్తుతికే ఏమిటి దేశికుల స్తుతి ప్రబంధాలకన్నిటికీ వ్యాఖ్యలుగా అవి చాలా వరకు సంస్కృత ద్రావిడ భాషలలో ఉండటంవల్ల తెలుగులకు దేశిక ప్రబంధ రసాస్వాదనం కొంచెం దుర్లభంగా ఉంటుంది.

ఆ లోటును తీరుస్తూ మహావిద్వాంసులు, సంస్కృతాంధ్ర ద్రావిడ భాషలలో మంచి పట్టుగల వారు, చక్కని నుడికారపు పలుకు లల్లికల గడి దేరినవారు, ఉభయవేదాంత సంప్రదాయ ప్రవర్తకాచార్య ప్రవరులూ అయిన శ్రీమాన్ కె.వి.రాఘవాచార్యస్వామివారు **'శ్రీస్తుతి'కి మెరుగులు చిమ్ము 'హిరణ్మయీ'** వ్యాఖ్యను వెలయించినారు.

దేశికుల తలపుల నాడిని, పలుకుల వాడిని పట్టి చూచిన పరమభావుకులు వారు. వారి రమణీయమైన పాదుకా వ్యాఖ్య వ్యాఖ్యాతృలోకంలో హిమనగోత్తుంగంగా వారిని నిలిపినది. అర్థతాత్పర్యాలు సమకూరుస్తూ లలిత విశదంగా, పర్యాప్త విపులంగా, ప్రమాణ పరిమండితంగా సరసమైన వ్యాఖ్యను శ్రీస్తుతికి ఘటించినారు శ్రీమాన్ రాఘవాచార్య స్వామివారు. భగవచ్ఛాస్త్రాన్ని, వేదాంత దర్శనాన్ని, పూర్వాచార్య శ్రీ సూక్తులను, దివ్యప్రబంధ వాఙ్మయాన్ని, పురాణ సంహితావ్రాతాన్ని పరామర్శిస్తూ దేశికులు భావించిన శ్రీ తత్త్వాన్ని పరమ రమణీయంగా హృద్యానవద్యంగా పాఠకుల మనోవీధుల చిత్తరువులు గీసి నిలిపినారు శ్రీ స్వామివారు. ప్రతిపదమూ రమణీయమే. ఒక్కొక్కచోట ఒక్కొక్క సొగసు. కాంతా, కమలా, అంబా శబ్దాల నిరుక్తిని నిపుణంగా ప్రదర్శించారు.

"కుసుమధనుషః కింకరోమేరుధన్వా'/ 'తవప్రసాదాత్ కుసుమాయుధోఽపి"

అన్న కాళిదాస శ్లోకాన్ని స్మరింపజేసి దేశికుల ఉభయత్ర ధనుశ్శబ్ద ప్రయోగ స్వారస్యాన్ని శ్లాఘ్యంగా నిరూపించారు.

'త్వామేవాహుః కతిచిదపరే త్వత్ప్రియంలోకనాథం' అన్న శ్లోకంలో ఉపనిషదంతరంగము శ్రీరామానుజాభితము సరసము, సంప్రదాయానుగతమూ అయిన మిథున ప్రాప్యత్వాన్ని, కైంకర్యాన్ని చక్కగా విశదీకరించినారు. యామున, కూరనాథ, భట్టారక స్తుతుల క్రమాన శ్రీస్తుతిని సరసంగా అన్వయించి పూర్వాచార్యులతో దేశికులకు గల ఐకరసాన్ని మధురంగా నిరూపించినారు శ్రీమదాచార్యులవారు 'హిరణ్మయి'లో.

గుణదోషాలున్నవున్నట్టు ప్రకటించుమని నన్నాదేశించినారు ఉ.వే. శ్రీమాన్ రాఘవాచార్యస్వామి వారు. ఉన్నదున్నట్టు వ్రాసే వాణ్ని నేను. దోషాలు నాకు గోచరించలేదు. అయితే ఒక్క మాట. ఇది దోషోద్ఘాటనం మట్టుకు కాదు. విద్వజ్జనుల మ్రోల వినమ్రంగా విన్నవించు కొంటున్న నా అల్పజ్ఞతా విలాసవీచికగా ఒక విచికిత్స.

దేశికులు స్తోత్రారంభంలో 'వక్షఃపీఠీం మధువిజయినో భూషయంతీం స్వకాంత్యా' అంటారు. స్తుతి సమాప్తిలోనూ, 'సంపద్దివ్యా మధు విజయినః సన్నిధత్తాం సదామే' అంటారు. ఉభయత్ర మధుహనన వృత్తాంతం ప్రస్తుతం. 'మధువిజయి' శబ్దాన్నే స్వీకరిస్తారు ఉభయత్ర. ఆద్యంతం మధుస్యంది స్తుతిగా ఇది సరసం, చమత్కృతి! మధు శబ్దం అహంకార ద్యోతకం అని, అఖండగర్వ నిర్వాపణ నిపుణం జగత్కారణం అనీ తొలి శ్లోకం వ్యాఖ్యానంలో ప్రకటించినారు వ్యాఖ్యాతలు.

సహృదయులకు గ్రైవేయకం కాగలదీ హిరణ్మయీ వ్యాఖ్య అని విశ్వసిస్తున్నాను.

'శ్రీస్తుతి' (2008) గ్రంథ పీఠిక

ప్రకాశికా ప్రశంస

డా॥ ఈ.ఏ. శింగరాచార్యులు

ఈ ద్రవిడోపనిషత్తు ఒక గొప్ప సాగరము. నాథమునులు దీనిని 'ద్రావిడ వేదసాగరము' అనిరి. దీనిని అనుసరించుచు శ్రీదేశికులు ఈ ప్రబంధమును, తాత్పర్యరత్నావళి ప్రారంభములో 'శఠజిదుపనిషద్గుసింధుమ్' అని, చివరలో 'శుద్ధబోధార్ణవ' మనియు సాయించిరి. సాగరము పలు రత్నములకు ఆకరము. ఈ ద్రవిడోపనిషత్సాగరము నందును మహార్ఘములైన రత్నము లెన్నియో నిక్షిప్తములై యున్నవి. అవి సామాన్యులకు అందుబాటులో నుండునవి కావు. కావున పరమకారుణికులైన దేశికులు తమ బుద్ధి అను మందర పర్వతముతో ఈ సాగరమును మథించి, అందలి అమూల్యములైన తాత్పర్యార్థములను రత్నములను సేకరించి, సంస్కృతీకరించి, వానిని గ్రథనము చేసి రత్నావళిగా రూపొందించిరి. అదియే ప్రస్తుతము వ్యాఖ్యాతమగుచున్న **ద్రవిడోపనిషత్తాత్పర్య రత్నావళీ** ప్రబంధము.

ఇందు నూటికి మించిన స్రగ్ధరావృత్త నిబద్ధములైన శ్లోకములు కలవు. వీనిలో మొదటి 10 శ్లోకములు ఉపోద్ఘాతరూపములు. ఈ శ్లోకములలో తిరువాయ్‌మొళి ప్రబంధము యొక్క, తత్ప్రణీతలైన శ్రీ శఠకోపుల యొక్క ప్రబంధ ప్రతిపాద్యార్థవము యొక్క వైలక్షణ్యమును, 'భాషాగానం నగాతవ్యమ్' అనుచు దేశీయ భాషలో భగవద్గానము చేయరాదను నియమము ఇచట వర్తింపకుండుటను, తిరువాయ్‌మొళి ప్రబంధము యొక్క చతుర్వేద రూపత్వమును, శారీరక మీమాంసా సామ్యమును ఇందు పది శతకములలో భగవానుని సేవ్యత్వాది గుణదశకము ప్రతిపాదింపబడుటయును, ఇందలి నూరు దశకములు భగవానుని నూఱు గుణ విశేషములను సూచించుటను 'యాని నామాని గౌణాని' అనునట్లు శ్రీ విష్ణుసహస్ర నామములోని వేయి నామములు భగవానుని వేయి గుణములను ప్రదర్శించునట్లే 'నామజ్గళాయిరత్తుళ్' అను శఠకోపసూక్తి ప్రకారము ఈ ప్రబంధములోని వేయి పాశురములు వేయి గుణములకు ప్రకాశములగుటయును తెలుపవడినవి. ఇట్టి ప్రక్రియను దృష్టిలో నుంచుకొనియే దేశికులు తిరువాయ్‌మొళి ప్రబంధములోగల ఒక్కొక్క పాశురములో నున్న ప్రాణభూతమైన ప్రయోగమును ఒక్కొక్క గుణముగా నుడివిరి. ఉదాహరణకు– ప్రబంధములోని మొట్టమొదటి పాశురములోని 'ఉయర్వఱ ఉయర్నల ముడైయవన్' అను ప్రయోగమును 'నిస్సీమోద్య ద్గుణత్వాత్' అనుచు సంస్కృతీకరించిరి. ఇట్టి విధానమునే కృతిలో సర్వత్ర పాటింపబడుటను గమనింపవచ్చును. ఇట్లు ప్రతి దశకమునకు ఒక్కొక్క శ్లోకము చొప్పున రచింపబడినది. దీనితోపాటు అచ్చటచ్చట స్వాపదేశార్థములను విశదీకరించుటకై అధికముగా కొన్ని శ్లోకములను అనుగ్రహింపబడినవి.

ఉదాహరణకు ప్రథమశతక చతుర్థ దశకమగు 'అఞ్జిఱైయ' దశకములోని పది పాశురములలో గల స్వాపదేశార్థములను 'సద్రీభవ్యాన్' అను ఒక ప్రత్యేకమైన శ్లోకములో నిబంధించిరి. ప్రతి శతకము చివర ఆ శతకములోని పది దశకములలో అనుసంధింపబడిన పది గుణములను తెల్పుచు అధికముగా ఒక్కొక్క శ్లోకమును అనుగ్రహించిరి. ఈ విధముగా తాము ప్రారంభమున తిరువాయ్‌మొళిలోని నూఱు

దశకములు భగవానుని నూఱు గుణములను, వేయి పాశురములు వేయి గుణములను సూచించుచున్నవనుటను నిరూపించిరి. చివరలో మరల వేరొక పర్యాయము పది శతకములలో కీర్తింపబడిన పది గుణములను 'ఇత్థం సేవ్యం సుభోగ్యమ్' అను శ్లోకములో వ్యక్తీకరించిరి. ఆ పిమ్మట నమ్మాళ్వార్లు సాయించిన నాల్గు ప్రబంధముల తాత్పర్యమును 'ఆద్యేస్వీయ ప్రబంధే' అను శ్లోకమున నుడివి, తదుపరి రెండు శ్లోకములలో పునః తిరువాయ్‌మొళి ప్రబంధములోని అర్థ విశేషములను సంగ్రహించిరి. చివరగా తాము అనుగ్రహించిన తాత్పర్య రత్నావళీ ప్రబంధము తిరువాయ్‌మొళి ప్రబంధ ప్రతిపాద్యుడైన శ్రీరంగనాథునకు, తద్భక్తులకును హృదయ ధార్యము కాగలదని ఆశంసించుచు కృతిని ముగించిరి.

తిరువాయ్‌మొళి ప్రబంధమునకు దశోపనిషద్భాష్యకారులగు శ్రీరంగరామానుజ మునివరులు ప్రసాదించిన ఒన్బది నాయిరప్పడి అను సంస్కృత వ్యాఖ్య, పెరియ పరకాలస్వామివారు సాయించిన పదినెణ్ణాయిరప్పడి అను మణి ప్రవాళ వ్యాఖ్యయు కలవు. ఈ వ్యాఖ్యలలో సర్వత్ర ద్రవిడోపనిషత్తాత్పర్య రత్నావళీ శ్లోకములు బహుత్ర ప్రస్తావింపబడుటయే కాక, ఆ శ్లోకములలో దేశికులు ఏ విశేషమును 'తిరువాయ్‌మొళి'లోని ఏ ప్రయోగమును దృష్టిలో నుంచుకొని ప్రయోగించిరో వివరింపబడినది. ఈ వ్యాఖ్యలు రెండును బ్రహ్మతంత్ర పరకాల మహాదేశికస్వామివారి ఆజ్ఞానుసారము చెన్నై నగరములోని గీతాచార్య ముద్రాక్షరశాలలో 1942వ సం॥న ముద్రింపబడినవి. ఈ ముద్రణలో ఏ కారణము వలననో 'ఇత్థంసద్వారగమ్యమ్' అను షష్ఠశతక సంగ్రహ శ్లోకము కన్పించుట లేదు.

ద్రవిడోపనిషత్ తాత్పర్య రత్నావళికి శ్రీ వేంకటాచార్యస్వామివారి మణి ప్రవాళ వ్యాఖ్య కలదు. ఇది పూర్వోక్త ఒన్బది నాయిరప్పడి, పది నెణ్ణాయిరప్పడి వ్యాఖ్యలతో పాటు ముద్రించబడుటయే కాక, తత్పూర్వమే ఆఱాయిరప్పడి, పన్నీరాయిరప్పడి, ఈడు మువ్వత్తాఱాయిరప్పడి- ఇత్యాది వ్యాఖ్యాన త్రయముతో ముద్రింపబడిన కోశములందు, ఆఱాయిరప్పడి, ఒన్బది నాయిరప్పడి, పన్నీరాయిరప్పడి కోశము (గ్రంథము)లందును ప్రచురితమైనది. తెనుగుభాషలో టీకా తాత్పర్యములు మాత్రము ప్రచురింపబడినవి.

ఇంతవరకు ఈ కృతికి ఆంధ్రములో సమగ్రమైన సంప్రదాయ సారస్యరహస్యార్థ విశదీకరణచణమైన, సహృదయావర్జకమైన వ్యాఖ్యానము రచింపబడలేదను కొఱతను వ్యాఖ్యాతృశిరోమణులు ఉ.వే.శ్రీమాన్ కె.వి. రాఘవాచార్యస్వామి వారు తమ ప్రణాళికావ్యాఖ్యతో సంపూర్ణముగా తీర్చిరి. వీరు ఇతఃపూర్వమే గోదాస్తుతి, భగవద్ధ్యాన సోపానము వంటి దేవిక కృతస్తోత్రములకు బుధరంజకములైన వ్యాఖ్యానములను వెలయించి ప్రసిద్ధులగుటయే కాక, అనితర సాధారణమైన రీతిలో పాదుకా సహస్రమునకు 'రమణీయ మను సార్థక వ్యాఖ్యను అయిదు సంపుటములలో సమకూర్చి, శ్రీ వైష్ణవ సంప్రదాయజ్ఞులను, విశేషించి ఆంధ్రపాఠకులను అధమర్ణులను గావించుకొనిరి. గడచిన సంవత్సరములో వీరు బమ్మెరపోతనామాత్య ప్రణీతమైన నారాయణ శతకమునకు కూర్చిన రాఘవీయ వ్యాఖ్య పలువురి విద్వాంసుల, రసజ్ఞుల మెప్పును పొందినది. వీరి వ్యాఖ్యలన్నియు ఆవశ్యక సర్వవిషయ సంకలితములై, మధురశైలీ శోభితములై, పండిత పామర రంజకములై ఒప్పారుచున్నవి.

ఈ వ్యాఖ్యలన్నియు ఒక ఎత్తు కాగా, ప్రస్తుతము స్వామివారు సంతరించిన ప్రకాశికా వ్యాఖ్య ఒక ఎత్తు. ఇది కేవవము తాత్పర్యరత్నావళీ శ్లోకములలోని ప్రయోగములను వివరించుటతో పర్యాప్తము కాలేదు. తన్మూలములైన తిరువాయ్‌మొళి పాశురములలోని రహస్య రహస్యార్థములను పూర్వాచార్యుల వ్యాఖ్యలను అనుసరించి సందర్భోచితముగా విశదీకరించుట దీని వైలక్షణ్యమును నిరూపించుచున్నది. ఉదాహరణకు తిరువాయ్‌మొళిలోని 'తుయరఱు శుడరడి' అను మొదటి పాశురం ప్రారంభములోగల విశేషణము కంచి వరదరాజస్వామిని ఉద్దేశించి అనుగ్రహించబడినదనే సంప్రదాయ రహస్యాన్ని వ్యాఖ్యాతలు ఉట్టంకించారు. ఈ స్వారస్యము ఆ పాశురములోని 'అమరర్ కళ్ అధిపతి' అనే ప్రయోగాను గుణముగ అర్చామూర్తులలో 'దేవాధిరాజు' నాముడు వరదరాజస్వామియే కదా! ఈ స్వారస్యము శ్రీ కాంచీ మహావిద్వాన్ అణ్ణాస్వామివారు సాయించారు.

అట్లే మొదటి శతకం చతుర్థ దశకంలోని 'ఇన్నడి శల్ వైప్పారై నాడాయే' అనే ప్రయోగాన్ని వివరిస్తూ తిరుమలనంబికి సంబంధించిన ఐతిహ్యాన్ని ఉట్టంకించిరి. వ్యాఖ్యాతలు తమ వ్యాఖ్యలో ఆయా విశేషములను విశదీకరించే ప్రయత్నములో పలువైదిక, పౌరాణిక, దివ్య ప్రబంధసూక్తులను ఆకర సహితముగా ప్రమాణములుగా ఎత్తి చూపుటతో పాటు తమిళ, తెనుగు సాహిత్యములలో గల ప్రయోగములను కూడా గ్రహించుట విశేషము. 'కారుణ్యాప్తత్వ యోగాత్' అనే తాత్పర్య రత్నావళీ సూక్తిని విశదీకరించుచు గోపీనాథ వేంకట రామాయణములోని 'ఏను బ్రతికి యుండనినకుల వరుడు' ఇత్యాది పద్యమును ఉద్ధరించి ప్రమాణముగా గైకొనిరి. 'వళవేషులకిన్' అనే (1-5) దశకసారమును తెలిపే శ్లోకములోని 'క్షుద్రాహ్వానాభిముఖ్యాత్' అనే విశేషణమును వివరించుచు శ్రీ పిళ్ళై ప్పెరుమాళ్ అయ్యఙ్గార్ సాయించిన 'నూత్తెట్టు తిరుపతి అన్దాది'లోని 'పణ్డెఉన్' అనే పాశురమును ప్రమాణముగా గ్రహించిరి. ఇవన్నీ వీరి బహు భాషావైదుష్యమును, బహుగ్రంథానుశీలన తత్పరతను, మూలగ్రంథ తాత్పర్యమును సమగ్రముగా వివేచించగలిగే సామర్థ్యమును నిరూపించుచున్నవి. వీరు కేవలము ఈడు వ్యాఖ్యానమునే కాక, ఇరుపత్తు నాలాయిరప్పడి వంటి ఇతర వ్యాఖ్యాలను కూడ పరిశీలించినారనే విషయము 'శర్వాదేః స్వాంగదానాత్' అను ప్రయోగ వివరణము వలన స్పష్టమగుచున్నదది. ఈ విధముగ ప్రకాశికా వ్యాఖ్యను సేవించినప్పుడు, అది కేవలము ద్రవిడోపనిషత్ తాత్పర్యరత్నావళికి వ్యాఖ్యానము మాత్రమే కాదని, తిరువాయ్‌మొళికి గల వ్యాఖ్యానము లన్నిటిలో నిక్షిప్తములై యున్న, మధురములైన సకల సంప్రదాయ విశేషార్థములను విశదీకరించు అద్వితీయ వ్యాఖ్యారూపమైన ఉద్గ్రంథమని ఎవరికైనను వ్యక్తము కాగలదు. ఇది సంప్రదాయ రసజ్ఞులను మెప్పించు ఉత్తమమైన వ్యాఖ్య అనుటలో అతిశయోక్తి లేదు. తెలుగు పాఠకులను, ప్రత్యేకించి సంప్రదాయజ్ఞులను శ్రీ స్వామివారు ఈ ప్రకాశికా వ్యాఖ్యానముతో మరింతగా అధమర్ణులను చేసికొన్నారు.

'ద్రవిడోపనిషత్తాత్పర్య రత్నావళి' (2003) గ్రంథంలోని పీఠిక

అమృత చషకం

ఉ.వే.శ్రీమాన్ ఈయుణ్ణి రంగాచార్యస్వామి
చరవాణి: 08814-277 566

శ్రీమాన్ వేంకటనాథార్యః కవితార్కిక కేసరీ।

వేదాంతాచార్యవర్యోమే సన్నిధత్తాం సదా హృది॥

పరమవైదికమైన విశిష్టాద్వైత సిద్ధాంతంలో తత్త్వాలు మూడు. ఇవి చిదచిదీశ్వర తత్త్వాలు. వీటిలో ఈశ్వరుడు అఖిల హేయ ప్రత్యనీకుడు, అనంతజ్ఞానానంద స్వరూపుడు, జ్ఞానశక్త్యాది కల్యాణగుణ భూషితుడు, సకల జగత్తుల సృష్టి స్థితి సంహారకర్త, చతుర్విధ పురుషార్థ ప్రదాత, విలక్షణ దివ్యమంగళ విగ్రహుడు, లక్ష్మీభూమీనీళా నాయకుడుగా నిరూపింపబడ్డాడు.

భగవానుడైన శ్రీమన్నారాయణుని కల్యాణ గుణాలు సంఖ్యలో లెక్కలేనివి అయినా, "తవానంత గుణస్యాపిషడేవ ప్రథమే గుణాః" అనే రీతిలో శాస్త్రాలలో ఆఱు గుణాలకు పెద్దపీట వేయబడింది. అవి భగవచ్ఛబ్ద వాచ్యాలైన జ్ఞాన, శక్తి, బల, ఐశ్వర్య, వీర్య, తేజస్సులు. ఈ విషయాన్ని గూర్చి కూరేశులు వరద రాజస్తవంలోని- "ప్రకృష్టం విజ్ఞానం బలమతులమైశ్వర్యమఖిలం విమర్యాదం వీర్యం వరద! పరమాశక్తిరపిచ, పరంతేజశ్చేతి ప్రవరగుణషట్కం ప్రథమజమ్" అనే శ్లోకంలో పలికారు. అంతేకాక, ఈ ఆఱు గుణాలు మిగిలిన కల్యాణ గుణాలకు ప్రసవ భూములు అని అన్నారు- "గుణానాం నిస్సీమ్నాం గణనవిగుణానాం ప్రసవభూః"- అని అంటూ, అందువల్ల దయాక్షాంత్యౌదార్యాది నిస్సీమ నిస్సంఖ్యాలైన కల్యాణ గుణాలు షడ్గుణ ప్రభవాలు. ప్రణతజన భోగ్యాలు.

వీటిలో దయ, క్షాంతి (క్షమ), వాత్సల్యగుణాలు ప్రకృతంలో గమనించదగినవి. జ్ఞానం యొక్క అవస్థాంతరంగా దయను గ్రహించవచ్చు. క్షమా, వాత్సల్యాలను ఈ దయాగుణం యొక్క కాష్ఠాభేదాలు చెప్పవచ్చునని ఆచార్యుల నిర్వాహం.

శ్రీపరాశరభట్టర్ శ్రీరంగరాజస్తవం ఉత్తరశతకంలో దయాగుణాన్ని "దయా పరవ్యసనహరా" అని నిర్వచించారు. ఇతరుల దుఃఖాలనుతీర్చే గుణమే దయ. ఇతరుల దోషాలను క్షమించే, సహించే గుణం క్షమ. ఇతరుల దోషాలను చూడకపోవడం, వాటిని "కుత్తమ్ శెయినుమ్ కుణమ్ కొళ్ళుమ్" అనే రీతిలో గుణాలుగా స్వీకరించడం వాత్సల్యం. ఈ మూడు తల్లిలో విశేషంగా వ్యక్తమయ్యే గుణాలు. వీటిలో లక్ష్మీదేవి దయాగుణానికి ప్రతినిధి, క్షమాగుణానికి భూదేవి ప్రతినిధి. వాత్సల్యానికి నీళాదేవి ప్రతీక. శ్రీదేశికులు దయాశతక ప్రారంభంలో లక్ష్మీదేవిని "కరుణా మివరూపిణీమ్" అని, భూదేవిని "తత్కృపా ప్రతిఘాతానాం క్షమయా వారణం యయా" అని, "నీళా యద్భోగ పటలైః ధ్రువమ్, భావితం శ్రీనివాసస్య భక్త దోషేష్వదర్శనమ్" అని నీళాదేవిని స్తుతించడం గమనార్హం. ఇక్కడ ఒక చమత్కారమైన అర్థ నిర్వాహం కూడా ఉన్నది. క్షమ, వాత్సల్యాలు

దయాగుణ ప్రకారాలు అయినట్లే, దయాగుణ ప్రతినిధి అయిన లక్ష్మీదేవికి క్షమా వాత్సల్యాలకు ప్రతీకలైన భూదేవి నీళాదేవులు ఛాయాస్థానీయులు. "తిరువుమ్ నిషల్ పోల్వనర్" అని తిరువిరుత్తంలో నమ్మాళ్వార్లు, "ఛాయా మివాభ్యుదయినీ మవనీంచతస్యాః" అని శ్రీరంగరాజస్తవంలో, "దేవి! త్వామనునీళయా సహమహీ దేవ్యః సహస్రంతథా యాభిస్త్వం స్తనబాహు దృష్టిభిరివస్వాభిః ప్రియం శ్లాఘసే" అని శ్రీగుణరత్నకోశంలో భట్టర్ పల్కడం అనుసంధేయాలు.

శరణాగతరక్షణలో ప్రధానాలైన భగవద్గుణాలు మూడు. అవి జ్ఞానం, శక్తి, కరుణం. కూరేశులు అతిమానుషస్తవంలో "త్వద్ జ్ఞాన శక్తి కరుణాసు సతీషు నేహ పాపం పరాక్రమితు మర్హతి మామ కీనమ్" అని అన్నారు. ఈ మూడు గుణాలలోను కరుణకు ప్రాధాన్యం. మిగిలిన రెండు తదంగాలు. అందువల్లనే అది ఈ స్ఫూర్తిలో చివరగా నిర్దేశింపబడింది. కూరేశులు అతిమానుషస్తవం చివరలో భగవత్సన్నిధిలో శరణాగతిని చేస్తూ "ఏతాదృశోహ మగతిః భవతో దయాయాః పాత్రం త్వదీయ చరణౌ శరణం ప్రపద్యే" అని "వాచం త్విమాంసకృదథాప్యసకృన్మయోక్తాం సత్యాం కురుష్వదయయైవ దయైకసింధో" అని, శరణాగత రక్షణలోని దయాగుణ ప్రాధాన్యాన్ని ఆమ్రేడనం చేశారు.

పైన ఉట్టంకింపబడ్డ "త్వద్ జ్ఞాన శక్తి కరుణాసు" ఇత్యాది కూరేశ స్ఫూర్తిని వ్యాఖ్యానిస్తూ శ్రీనివాసాచార్యుల వారు "యాయాః పాత్రం, దయయువైతి ప్రకరణాను గుణ్యేన దయాయాః ప్రధాన సాధనత్వం, జ్ఞాన శక్త్యోః తదంగత్వమితి సంప్రదాయః" అని అన్నారు. వేద పురుషుడు "యోబ్రహ్మాణం విదధాతి పూర్వం యోవైవేదాంశ్చ ప్రహిణోతి తస్మై" అని అంటూ భగవానుని దయాగుణ కార్యాలైన సృష్టిని, జ్ఞాన ప్రదానాన్ని ప్రస్తావించి అటువంటి దయాగుణ విశిష్టుడైన పరమాత్మను "తం దేవ మాత్మబుద్ధి ప్రసాదం ముముక్షుర్వై శరణమహం ప్రపద్యే" అని శరణాగతిని చేశాడు. శ్రీరామాయణంలో వాల్మీకి మహర్షి "కృపయాపర్యపాలయత్" అని అన్నాడు. ఆళ్వార్లు "నిన్నరుళే పురిన్దిరున్దేన్" అని భగవానుని దయను విశ్వసించానని అన్నారు. ఇటువంటి శరణాగత రక్షణలో విలక్షణమైన దయను పలువురు కీర్తించడంలో ఏమి ఆశ్చర్యం ఉన్నది.

ప్రసంగవశాత్తు ఇక్కడ ఒక మధురమైన, సాంప్రదాయికమైన అర్థనిర్వాహం ప్రస్తావనార్హం. నమ్మాళ్వార్లు తిరువాయ్మొళి ప్రబంధ ప్రారంభంలో "తుయరఱు శుడరడితొళుదు ఎన్ మననే" భక్తుల దుఃఖాలను తొలగించే స్వభావాన్ని కల భగవానుని ప్రకాశమానాలైన శ్రీపాదాలను ఓ మనసా! ఆశ్రయించు అని అన్నారు. ఈ ఆళ్వార్ల స్ఫూర్తి ఆఱాయిరప్పడి అనే వ్యాఖ్యలో "ఆశ్రిత జనసమస్త దుఃఖాపనోదన స్వభావమాన తిరువడి మలర్ కళిలే" అని వివరింపబడింది. ఆశ్రితుల సమస్త దుఃఖాలను పోగొట్టే స్వభావం అంటే అది దయయే కదా! ఆ దయాగుణంతో కూడిన భగవత్పాదాలను ఆశ్రయించుమని ఆళ్వార్లు తమ మనస్సుకు ఉపదేశించారు. తిరువాయ్మొళి ప్రబంధం అంతా భగవానుని పాదాలను ఉద్దేశించి చెప్పబడిందని ఆళ్వార్లే స్వయంగా "ముకిల్వణ్ణన డిమేల్ శొన్నశొల్మాలై ఆయిరత్తుళ్" అనే సూక్తి ద్వారా తెలిపారు. అంటే దయాగుణ విశిష్టాలైన భగవచ్చరణాలను ఉద్దేశించి చెప్పబడ్డ ప్రబంధమే కదా తిరువాయ్మొళి కనుక, ఈ ప్రబంధం సమగ్రంగా సర్వేశ్వరుని శ్రీచరణాల దయాగుణ ప్రఖ్యాపకం అంటే ఇది ఒక దయా సహస్రం.

భగవానుని దయను కీర్తించే పూర్వాచార్య కృతస్తోత్రాలలో వేదవ్యాస భట్టారకుల క్షమాషోడశి, శ్రీ వేదాంత దేశికుల దయా శతకం ప్రముఖంగా కన్పిస్తున్నవి. పండిత రాయకృతమైన కరుణాలహరి కూడా ఈ కోవలోకి చేరుతుంది. భగవానుని పరత్వాది పంచరూపాలలో అన్నిటిలో కల్యాణగుణాలు అన్నీ పుష్కలాలు అయినా, అర్చావతారంలో సౌలభ్య సౌశీల్య వాత్సల్యాది గుణాలు మిక్కిలి ప్రస్ఫుటాలు.

"ఈ గుణాలలో కూడా అర్చావతారస్సర్వేషాం బాంధవో భక్తవత్సలః" అని, "అర్చ్యః సర్వసహిష్ణుః" అని చెప్పబడ్డ రీతిలో దయ, క్షమ, వాత్సల్యగుణాలు మిక్కిలిగా ప్రకాశిస్తాయి. దివ్యదేశాలలో నెలకొని ఉండే అర్చామూర్తులలో ఈ గుణాలు ప్రకాశిస్తున్నా, తిరుమలలోని శ్రీవేంకటేశ్వరునిలో దయా పరాకాష్ఠ అయిన వాత్సల్యగుణం ఉజ్జ్వలమని దివ్యసూరుల హృదయం. నమ్మాళ్వార్లు శ్రీవేంకటేశ్వరుని శ్రీచరణాలలో శరణాగతిని చేసే సందర్భంలో "నికరిల్ పుకళాయ్!" అనే సంబోధన ద్వారా శ్రీనివాసుని వాత్సల్యగుణం అసాధారణమని అన్నారు. మఱి ఒక చోట "ఎన్కణ్ పాశమ్వైత్తపరమ్ శుడర్ శోది" అని అన్నారు. ఇక్కడ 'పాశ' శబ్దం చేత వాత్సల్యగుణం నిర్దేశింపబడిందని వ్యాఖ్యాతల అభిప్రాయం (ఈ గుణం తల్లిలో కన్పించే అసాధారణ గుణమని పూర్వోక్తం కదా! ఆళ్వార్లు కూడా శ్రీనివాసుని "తాయ్తన్దై ఉయిరాకిన్హాయ్... తణ్వేఙ్గడ మేకిన్హాయ్" తల్లిగా సంభావించడం ప్రకృతంలో భావ్యం). ఆచార్య హృదయమనే అద్భుతమైన రహస్య గ్రంథంలో నాయనార్ అనే పూర్వాచార్యులు కూడా ఈ విషయాన్ని "మణ్ణోర్ విణ్ణోర్ వైప్పిల్... నికరిల్ వాత్సల్యముజ్జ్వలమ్" అని తెలియజేశారు.

ఇటువంటి విశిష్టమైన శ్రీనివాసుని దయాగుణాన్ని శ్రీవేదాంత దేశికులు దయాశతకమనే స్తుతి గ్రంథంలో సహృదయ మనోహరంగా కీర్తించారు. దయాశతకంలో శ్రీ వేంకటేశ్వరుని దయతత్ప్రకారాలైన క్షమ, వాత్సల్యం స్తుతింపబడడాన్ని మాత్రం ప్రస్తావించవచ్చు. వాత్సల్యగుణాన్ని గూర్చి ప్రస్తావించే ఒక శ్లోకరత్నాన్ని ఆ శ్లోకంలో స్ఫురించే మధురాలైన అర్థవిశేషాలను విన్నవిస్తాను. ఇది దయా శతకంలోని 97వ శ్లోకం.

"ఔత్సుక్య పూర్వముపహృత్యమహాపరాధాన్ మాతః! ప్రసాదయితుమిచ్ఛతిమే మనస్త్వామ్ ఆలిహ్యతాన్నిరవ శేషమలబ్ధతృప్తిః తామస్యహోవృషగిరీశధృతాదయే! త్వమ్" అనే శ్లోకంలో శ్రీనివాసుని వాత్సల్య గుణ వైభవం వ్యాజస్తుత్యలంకారం ద్వారా భూషితమైనది. ఇందులోని అర్థవిశేషాలు విస్తరభీతిచేత సంగ్రహంగా విన్నవింపబడుతున్నాయి.

(మాతః) ప్రకృత సందర్భానికి తగిన సాభిప్రాయకమైన సంబోధన ఇది. వాత్సల్యగుణంలో తల్లిది ప్రత్యేక స్థానం కదా! అంతేకాక, తల్లికి కుమారుడు ఆమెకు ఇష్టమైన వస్తువును సమర్పించి సంతోషపెట్టడం కర్తవ్యమని ఈ సంబోధన తెలుపుతున్నది. (ఔత్సుక్య పూర్వమ్) సుతవత్సల అయిన తల్లి తన పుత్రునిలోని దోషాలను గమనించకపోవడమే కాక, వాటిని భోగ్యాలుగా (గుణాలుగా) స్వీకరిస్తుంది కదా! అటువంటి తల్లికి భోగ్యాలైన, అపరాధరూపాలైన ఉపహారాలతో ఎపుడు సంతోషపెడతాను? ఎప్పుడు సంతోషపెడతాను? అనే ఔత్సుక్యంతో అని భావం. (మహాపరాధాన్) పెద్ద పెద్ద అపచారాలను. అంటే భగవదపచార, భాగవతాపచార, అసహ్యాపచారాలను మహచ్ఛబ్దంచేత వాటిలో ఒక్క అపచారమే చాలు దయాదేవి కడుపును

నింపడానికి- అని అనిపించే అపచారాలు అని స్ఫురిస్తుంది. (ఉపహృత్య) తల్లికి భోగ్యాలైన వానినే కదా ఉపహారాలుగా సమర్పించాలి. అందువల్ల మహాపరాధాలను ఉపహారాలుగా (కానుకలుగా) సమర్పించి. (త్వాం ప్రసాదయితుమ్) తల్లివైన నిన్ను సంతోషపెట్టడం కోసం. "మాతృదేవోభవ", "నమాతుః పరదైవతమ్" అని కీర్తింపబడే తల్లివి అయిన నిన్ను సంతోషపెట్టాలని కన్నతల్లిని ఆనందింపజేయడమే కదా పుత్రకర్తవ్యం. (మేమనః ఇచ్ఛతి) అసాధ్యమని తెలిసినా, నా మనస్సు కోరుతున్నది. "మనోరథానా మగతిర్న విద్యతే కదా!" నీ మనస్సు కోరుకునేది అంత దుర్లభమా! అసాధ్యమా! అనే ప్రశ్నను శ్లోకంలోని ఉత్తరార్ధం సమాధానిస్తున్నది.

(త్వమ్) సర్వనామ శబ్దాలు వక్తృ బుద్ధి స్థభావ ప్రకాశకాలు. ప్రకృతంలో ఈ పదం వల్ల దయాదేవి తల్లి కనుక పోషణీయ అని, నిండించడానికి సాధ్యం కాని పెద్ద బాన కడుపును కల్గినది అని ప్రకృత సందర్భానుగుణంగా స్ఫురిస్తున్నది. (తాన్) ఈ సర్వనామ శబ్దం, దయాదేవి ఆకలిని తీర్చగలవని, ఆమె కుక్షిని నిండించి తృప్తి కల్గించగలవని తలచి చేర్చి పేర్చి పెట్టుకొన్న పాపాలను అనే అర్థాన్ని ఇస్తుంది. (నిరవశేషమ్) అనాది సంచితాలైన పలుపాపాలను వేటినీ మిగల్చకుండా పూర్తిగా ఆకాశమంత పరిణామాన్ని కల దయాదేవి కుక్షికి ఈ పాపాలు ఆవగింజతో సమానమయ్యాయి. అందువల్ల వేటినీ మిగల్చకుండా (ఆలిహ్య) ఈ క్రియాపదంలోని 'ఆజ్' సాభిప్రాయకం. ఇంతకాలంగా ఇంతగా చేర్చిపెట్టిన మహాపరాధాలు అన్నీ కలిసినా ఒక ముద్దగా కూడా కాలేకపోయాయి. అందువల్ల చిన్న పిల్లలు తమ చేతివేళ్ళను కొంచెంగా అంటుకొన్న తేనె వంటి పదార్థాలను నాలుకతో నాకినట్లుగా, దయాదేవి తమ కుక్షికి ఆకలికి ఏ మాత్రం సరిపోని అపరాధాలను అవలీలగా నిరవశేషంగా జిహ్వాతో నాకి, (అలబ్ధతృప్తిః) తన కడుపుకు తగిన ఆహారం లభించనందువల్ల ఆమెకు ఏ మాత్రం తృప్తికలుగలేదు.

అనాదిగా మనోవాక్కాయాల నిరంతరం నాచేత, నాకు చెందిన వారిచేత చేయబడుతున్నా అకృత్యకరణ కృత్యాకరణాది రూపాలైన అపచారాలను సమీకరించి చేర్చి, ఈమె ఉదరపూరణకు సరిపోతాయని భావించి ఉపహారంగా సమర్పించినా, ఈమెకు తృప్తిలేశం కూడా కలుగలేదే! అయ్యో! ఇక ఈమె ఆకలిని ఏ విధంగా తీర్చడం? ఈ తల్లిని ఏ విధంగా పోషించడం? (తామ్యసి) ఇంతవరకు నా కుమారుడు వస్తాడు, నా కడుపును నిండించి తృప్తిపరుస్తాడని భావించావు, ధైర్యంగా ఉన్నావు. కాని, తృప్తిలేశం కూడా కల్గనందువల్ల నీవు చాలా గ్లానిని పొందుతున్నావు. ఇటువంటి స్థితిలో క్లేశపడే నిన్ను చూచి (వృషగిరీశ ధృతా) వృషగిరినాథుడు 'అయ్యో! ఈమె నిరాధారగా ఉన్నదే! అని నిన్ను ధరించాడు. (ఆహా) అమ్మా! దయాదేవి! నీ కడుపు ఎంత పెద్దది? ఏ విధంగా నీ ఆకలిని తీర్చగలను? నీకు తృప్తి కల్గించగలను? అయ్యో! కష్టం అని ఈ విధంగా ఈ శ్లోకాన్ని పైపైన చూచినపుడు దయాదేవి నిందాపరంగా అర్థం తోస్తుంది.

కాని, వ్యాజస్తుత్యలంకార ప్రక్రియలో సాగిన ఈ శ్లోక రచనలోని అర్థాన్ని జాగ్రత్తగా గమనిస్తే దయాదేవి యొక్క వాత్సల్యం అపరిమితం అనే స్తుతి ధ్వనిస్తుంది. ఆ స్తుతికి అనుగుణంగానే శ్లోకంలోని పదాలు ప్రయోగింపబడ్డాయని తెలుస్తుంది.

"మహాపరాధాన్ ఉపహృత్య" అనే ప్రయోగం ద్వారా మహాపరాధాలు ఉపహారాలుగా రూపింపబడడం వల్ల ఆశ్రితాపరాధాలు క్షోభను కల్గించకపోవడమే కాదు, ప్రీతిహేతువులు కూడా అని ధ్వనిస్తున్నది. "దోషోయ

ద్యపి తస్యస్యాత్” అని కదా సర్వలోక శరణ్యుని సూక్తి. “ప్రసాదయితు మిచ్ఛతి” అనే ప్రయోగం ద్వారా ఆశ్రితుల అసంఖ్యేయాలైన అపరాధాలను సుప్రసన్నమైన మనస్సుతో స్వీకరిస్తుందని ధ్వనిస్తున్నది. “ఆలిహ్యతాన్ నిరవశేషమ్” అనే ప్రయోగంలోగల ‘ఆలిహ్య’ అనే పదం ద్వారా ఆశ్రితులకు చెందిన వారి అపరాధాలను కూడా పరిపూర్ణంగా తన క్షమకు విషయంగా చేస్తుందని స్ఫురిస్తున్నది. ‘ఆలిహ్య’ అనే క్రియ ద్వారా వాటి అత్యాదరణ స్వీకరణం వ్యక్తమవుతున్నది. ఈ విధంగా ఆశ్రితుల యొక్క, వారికి చెందిన వారియొక్క మహాపరాధాలను అత్యాదరణంగా స్వీకరించి, ఇంకెవ్వరూ చేయలేని పరిపూర్ణమైన అనుగ్రహాన్ని వారి విషయంలో చూపినా, “ఎన్ అడియార్‌క్కు ఎన్ శెయ్‌వన్? ఎన్నే ఇరుత్తినీ” అనే రీతిలో, “అస్మైనకించిదు చితం కృతమ్” అనే రీతిలో “నన్ను ఇంత గట్టిగా నమ్మిన వీనికి ఏమి చేయలేకపోయానే అయ్యో!” అని భావిస్తూ ఏమి ఉపకారాన్ని చేయని దానివలె భగవానుని దయ తృప్తిని పొందలేకపోతున్నది అనే అర్థస్వారస్యం ‘అలబ్ధ తృప్తిః’ అనే పద ప్రయోగం ద్వారా ధ్వనిస్తున్నది. ఈ రీతిలో ఆ తృప్తిని పొందే దయాదేవి ఆశ్రిత వ్యామోహ విజృంభణచేత ఒకవేళ పరబ్రహ్మత్వాన్ని కూడా ఆశ్రితునకు ఇచ్చివేస్తుందో? ఏమో? అనే భీతితో భగవానుడు ఈమెను నిరోధించాడనే అర్థస్వారస్యం (నహినిందాన్యాయానుసారం) “వృషగిరీశధృతా” అనే ప్రయోగంలో స్ఫురిస్తుంది. (ధృతా, అవష్టబ్ధా అని అర్థం) మనస్సుతో భావించడానికి కూడా సాధ్యం కాని రీతిలో అతిదుష్కరాలైన మహాపచారాలను కూడా క్షమించి అనుగ్రహించినా, తగిన ప్రత్యుపకృతి ఏమి చేయలేదనే అతృప్తిచేత, భగవానుని నిరోధం చేత క్లేశపడుతున్నది అనే అర్థస్వారస్యం ‘తామ్యసి’ అనే పదం ద్వారా ధ్వనిస్తున్నది. “సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ” ఇత్యాదిగా భగవానుని స్వరూపాన్ని పరిచ్ఛేదించి పలుకగల్గినా, దయాదేవీ! నీ ఆశ్రిత వాత్సల్యం ఆహా! ‘అపరిచ్ఛిన్నం’ అనే భావం అహో! అనే ఆశ్చర్యార్థక పదం ద్వారా స్ఫురిస్తున్నది. ఈ విధంగా మొదట దయాదేవి నిందాపరంగా అన్వయించిన ప్రయోగించిన అనితరసాధారణ పదప్రయోగ కౌశలం శ్రీ దేశికులకే చెల్లు. ఈ ఒక్క శ్లోకం మాత్రమే కాదు, దయా శతకంలోని శ్లోకాలన్ని గంభీరార్థ ప్రతిపాదకాలు, రస్యరహస్యార్థ గుంఫితాలు, సహృదయ హృదయా వర్జకాలు.

ఇటువంటి విలక్షణమైన, లోతైన అర్థాలను, రహస్యాలను ఇముడ్చుకొన్న దయాశతకాన్ని వ్యాఖ్యానించడం కత్తిమీద సాములాంటిదే. సంస్కృతంలో శ్రీ వాత్స్య రామానుజాచార్యులవారు, శ్రీమాన్ ఎ.వి.గోపాలాచార్య స్వామివారు మొదలైన పలువురు ఈ స్తుతిని వ్యాఖ్యానించారు. తెలుగులో కీర్తిమూర్తులు శ్రీమాన్ కోళియాళం శఠకోపాచార్య స్వామివారు వివరంగా, సుమధురంగా సంతరించిన వ్యాఖ్యను టిటిడి రెండుమార్లు ముద్రించింది. శ్రీ సేవా స్వామివారి వ్యాఖ్యానం కూడా విస్తృతమైనది. ఇంకా ఎంతోమంది ఈ కృతిని తమదైన శైలిలో వ్యాఖ్యానించారు.

ఇవన్నీ ఒక ఎత్తు కాగా ఇపుడు వెలువడుతున్న వాచస్పతి, వ్యాఖ్యాతృ శిరోమణి డా॥ ఉ.వే.శ్రీమాన్ కె.వి.రాఘవాచార్య స్వామి అమృతాస్వాదినీ వ్యాఖ్య ఒక ఎత్తు. ఇతః పూర్వమ్ ఈ ఆచార్యవర్యుల అనితర సాధారణమైన వ్యాఖ్యాన కౌశలం పాదుకా సహస్రం, నారాయణ శతక, యతిరాజ సప్తతి, అభీతిస్తవ, శ్రీస్తవ, రుక్మిణీ కల్యాణాది కృతులకు వీరు సంతరించిన అపూర్వ అద్భుత వ్యాఖ్యల ద్వారా లోకానికి సుపరిచితం. 450 పుటలకు మించిన, అతి విస్తృతమైన ఈ అమృతాస్వాదినీ వ్యాఖ్య అస్మాదృశ ప్రపన్నకోటికి

ఒక జీవాతువు సాహిత్య రసికులకు షడ్రసోపేతమైన విందు. ఎనభై ఎండ్లు నిండిన వార్ధక్య దశలో సైతం శ్రీమాన్ స్వామివారు కొనసాగిస్తున్న సంప్రదాయ సాహిత్య సేవ మహామహోపాధ్యాయ శ్రీమాన్ రఘునాథాచార్య స్వామివారి ప్రశంసకు పాత్రమైనది. అంటే, ఇంతకంటే ఇంకొక ప్రశస్తి పత్రం వీరి వైదుష్యానికి పనిలేదు. అమృతాస్వాదినీ వ్యాఖ్యను గూర్చి విన్నవించుకోమని దాసుని శ్రీమాన్ స్వామివారు ఆజ్ఞాపించడం వారి సౌమనస్యాన్ని సౌహార్దాన్ని చాటుతున్నది.

ఇంతకుముందు శ్రీమాన్ రాఘవాచార్య స్వామివారు వెలయించిన వ్యాఖ్యలవలెనే ఈ అమృతాస్వాదినీ వ్యాఖ్య కూడా "నా మూలం లిఖ్యతే కించిన్నానపే క్షితముచ్యతే" అనే మల్లినాథసూరి వ్యాఖ్యాన ప్రక్రియలో సాగింది. పలు గ్రంథాల నుండి పలు ప్రమాణాలను సందర్భోచితంగా ఉదాహరించే వీరి వ్యాఖ్యానశైలి విలక్షణమైనది. "ప్రత్యేకించి" నిషాదానాం నేతా 'యస్మిన్ దృష్టే' ఇత్యాది శ్లోకాలను వ్యాఖ్యానించిన సందర్భాలలో శ్రీమాన్ స్వామివారి సర్వతోముఖాలైన ప్రతిభాపాండిత్యాలు, విషయ విశ్లేషణలోని నైశిత్యం వ్యక్తమవుతున్నది. ఆలంకారిక విశేషాలనే కాక, వేదాంతాది వివిధ శాస్త్రరహస్యాలను కూడా వివరించడం విశేషం. ద్రావిడ ప్రబంధాలలోని పలు ప్రమాణాలను, ఆ ప్రబంధాల వ్యాఖ్యలలోని సందర్భానుగుణాలైన వివరణలను శ్రీమాన్ స్వామివారు అడుగడుగునా ఉట్టంకించిన తీరు వారి ఉభయవేదాంత వైశారద్యాన్ని ప్రస్ఫుటం చేస్తున్నది. ఆంధ్ర ప్రపన్న సాహితీ ప్రియుల భాగ్యఫలంగా వెలసిన అమృతాస్వాదినీ వ్యాఖ్య ఒక అమృత చషకం. శ్రీవైష్ణవసం ప్రదాయజ్ఞులు, సాహిత్యరసికులు అందఱు శ్రీమాన్ స్వామివారికి అధమర్ణులు అనడంలో అతిశయోక్తిలేదు. సాహితీ ప్రియులు, సంప్రదాయజ్ఞులు అందఱు ఈ వ్యాఖ్యానంలోని మధురిమను అనుభవించి ఆనందించాలని కోరుతున్నాను.

అమృతాస్వాదినీ వ్యాఖ్యా రాఘవార్య వినిర్మితామ్।
సేవంతాం విబుధాః! రస్య రహస్యార్థ మనోహరామ్॥

'దయాశతకం' (2010) గ్రంథానికి వ్రాసిన పీఠిక)

నమో వాకం ప్రశాస్మహే

ఆచార్య డా॥ పుల్లెల శ్రీరామచంద్రుడు

శ్రీశంకరాచార్య విరచితములుగా వివిధ దేవతా స్తావకాలైన ఎన్నో స్తోత్రాలు ప్రచారంలో ఉన్నాయి. వాటిలో ప్రథమ శ్రేణికి చెందినది **'విష్ణుపాదాది కేశాన్త స్తోత్రమ్'.**

అద్వైత శ్రద్ధాళువులైన శ్రీశంకరాచార్యులు భేదబుద్ధి ప్రచోదితాలైన స్తోత్రాలు రచిస్తారా అను ఆశంకకు సమాధానంగా, కొంచెం విపులంగా ఇదంతా రాయవలసి వచ్చింది. నిజానికి శ్రీ శంకరులే.

"షట్పదీస్తోత్రం"లో నారాయణునితో ఇలా అంటారు-

"సత్యపి భేదాపగమే నాథ తవాహం నమామకీనస్త్వమ్।
సాముద్రోహితరఙ్గః క్వచన సముద్రో న తారఙ్గః॥"

(ఓ మహావిష్ణూ! మనకిద్దఱికీ భేదం లేకపోయినా- నేను నీ వాడను, కాని నీవు నా వాడవు కాదు. "సముద్రం యొక్క తరంగం" అంటారు కాని "తరంగం యొక్క సముద్రం" అని ఎవరూ అనరు కదా!)

"దేహబుద్ధ్యా తు దాసోఽహం జీవబుద్ధ్యా త్వదంశకః।
ఆత్మబుద్ధ్యా త్వమే వాహం ఇతిమే నిశ్చితా మతిః॥"

(చైతన్యం ఉన్న దేహమే నేను అనుకొన్నప్పుడు నేను నీ దాసుడను. దేహంకాదు; దేహంలో ఉన్న 'చైతన్యరూప జీవుడే నేను' అనుకొన్నప్పుడు నేను నీ అంశను. "శుద్ధ చైతన్యమే నేను" అనుకొన్నప్పుడు నువ్వూ నేనూ ఒకటే.) ఇత్యాది ప్రసిద్ధ శ్లోకాలు ఈ దృష్టినే సూచిస్తున్నాయి.

శ్రీశంకర భగవత్పాదులు రచించిన, ప్రౌఢమైన రీతిలో- శైలిలో ఉన్న ఈ **విష్ణుపాదాది కేశాంత స్తోత్రం**లోని వైశిష్ట్యం సామాన్యమైన సంస్కృత భాషాజ్ఞానం ఉన్న వాళ్ళకు దుర్గ్రాహ్యమైనది. అనేకమైన అర్థాలంకారాలతో, శబ్దాలంకారాలతో అలంకృతమై అర్థగాంభీర్యానికీ, భావగాంభీర్యానికీ నెలవైన ఈ స్తోత్రానికి తగిన వ్యాఖ్యానం చేయడం కూడా సామాన్య పండితుల శక్యం కాని ప్రయత్నమే. అలాంటి ఈ స్తోత్రానికి అత్యద్భుత పాండితీ పూర్ణమైన విస్తృత వ్యాఖ్యానం రచించి 'వాచస్పతి', 'పండిత రత్న' ఇత్యాది బిరుదాంచితులైన శ్రీమాన్ కె.వి.రాఘవాచార్యుల వారు ఆస్తిక లోకానికి ఎంతో అమూల్యమైన కానుక నందించారు.

విశాల కాయమైన స్రగ్ధరా వృత్తంలో కూర్చిన యాభై (50) శ్లోకాలలో శ్రీశంకరాచార్యులు శ్రీమహావిష్ణువు దివ్య శరీరం, పాదాలు మొదలు కేశాల వరకు అత్యద్భుత రీతిలో వర్ణించారు. మానవుల శరీర సౌందర్యం ముఖాది పాదాంతావయవ వర్ణనతో వర్ణించాలనీ, దేవతల విషయంలో పాదాది కేశాంతావయవాలను వర్ణించాలనీ ప్రసిద్ధమైన కవి సమయాన్ని అనుసరించి చేసిన వర్ణన ఇది.

భగవత్పాదులు మొదటి తొమ్మిది శ్లోకాలలో పాంచజన్య- చక్ర- శార్‌ఙ్గ- నందక- కౌమోదకులను, గరుత్మంతుని, ఆదిశేషువునూ, లక్ష్మీ-భూదేవులను స్తుతించి, పదవ శ్లోకం నుండి యాభైయవ శ్లోకం వరకు, భగవత్పాద పాంసు వర్ణనతో ప్రారంభించి కేశాంతావయవ సౌందర్యాన్ని వర్ణిస్తూ శ్రీ మహావిష్ణువును స్తుతించారు. విష్ణు పాద వర్ణనతో ప్రారంభించిన ఈ స్తోత్రాన్ని యాభై ఒకటవ (51) శ్లోకంలో చేసిన విష్ణు భక్త పాదాభివందనంతో ముగించారు. యాభై రెండవ (52) శ్లోకం ఫలశ్రుతి రూపం. ఈ (52)వ శ్లోకం కొన్ని ప్రతులలో లేదు. ఈ స్తోత్రం అత్యధిక సంఖ్యలో ఇతర స్తోత్రాలవలె, ఆరాధ్య దేవతా విషయంలో ప్రసిద్ధమైన అనేక విశేషణాలను ఒక ఛందోబద్ధ రీతిలో కూర్చి రచించిన స్తోత్రం కాదు. ప్రతి శ్లోకంలోను ఎన్నో ఆధ్యాత్మిక- సాంప్రదాయిక విషయాలు ఇమడ్చి వ్రాసిన స్తోత్రం. అనేక శాస్త్రాలతోను, సంప్రదాయాలతోను, పురాణాదులతోను, కావ్య నాటకాది సాహిత్య గ్రంథాలతోను, నిఘంటువులతోను పరిచయమూ అన్నింటిని మించి సహృదయత్వమూ ఉన్న విద్వన్మణులు మాత్రమే దీనిలోని వైశిష్ట్యం తాము గ్రహించి ఇతరులకు అందజేయ గలుగుతారు. అలాంటి అంగుళీగణనీయులైన విద్వద్వతంసుల అగ్రశ్రేణికి చెందిన శ్రీమాన్ రాఘవాచార్యులవారు ఈ స్తోత్రానికి తాము రచించిన, సార్థక నామధేయమైన 'శ్రీరంజనీ' వ్యాఖ్యానంలో ఎన్నో విషయాలను ఒక చోట చేర్చి తమ వైదుష్యాంచిత సహృదయత్వాన్ని ప్రదర్శించారు. వీరి వ్యాఖ్యా నిర్మితి ఎలా నడిచిందో ఉదాహరణకి ప్రథమ శ్లోకం చూడవచ్చును.

ముందుగా శ్లోకానికి ప్రతి పదార్థ తాత్పర్యాలు చెప్పి, తరువాత 'శ్రీరంజనీ వ్యాఖ్య' శీర్షిక క్రింద ఈ శ్లోకంలోని అనేక విషయాలు సప్రమాణంగా విషయీకరింప బడ్డాయి. 1) ఇలాంటి స్తోత్రాలు భక్తులకు ఎలా మోక్ష సామ్రాజ్యప్రదాలో చెప్పి, అధికారి ప్రయోజన సూచనం చేయబడింది. 2) స్తోత్ర ప్రారంభంలో 'లక్ష్మీ' శబ్ద ప్రయోగం, శాస్త్రానుసారం, రచయితకూ, పఠితులకూ మంగళప్రదం అను విషయం ప్రతిపాదింపబడింది. 3) తన కపోలం మీద మహావిష్ణువు శంఖంతో స్పృశించినంత మాత్రాన ఐదు (5) సంవత్సరాల వయస్సులో ఉన్న ధ్రువుని ముఖం నుండి అద్భుతమైన వాగ్ఝరి స్తోత్ర రూపంలో బయల్వెడలింది. అలాంటి శబ్ద బ్రహ్మస్వరూపమైన శంఖాన్ని ముందుగా వర్ణించడం చాలా యుక్తంగా ఉన్నదని విశదీకరించబడింది. 4) శ్రీమహా లక్ష్మియే భక్తులకు భుక్తి-ముక్తులను అనుగ్రహించుటకై భర్తను ప్రేరేపిస్తూ పురుషకారిణియై యుంటుంది. అందుచేత శ్రీశంకరులు 'లక్ష్మీభర్తుః' అంటూ ప్రారంభంలోనే 'లక్ష్మీనిర్దేశం' చేయడం ఉచితంగా ఉందని చెప్పబడింది. 5) శంఖం తానే విష్ణు కరాగ్రంమీద నిలచినది. 'కృతవసతి' అన్నారు కాని 'కారిత వసతి' (హస్తాగ్రం మీద ఉంచబడింది) అని శ్రీ శంకరాచార్యులు అనలేదు. అందుచేత భగవంతుని ఆయుధాలు, పీతవస్త్రాదులు కూడా చేతనములే అను సంప్రదాయం సూచింప బడుతూన్నది- అని పదప్రయోగ స్వారస్యం ప్రకటింపబడింది. 6) మాలిన్యలేశం కూడ లేకుండ పూర్తిగా తెల్లగా ఉండే శంఖాన్ని సకళంకమైన చంద్రునితో పోల్చడం యుక్తమా అని ఆశంకించుకొని సమాధానంగా "భక్తి జ్ఞాన వైరాగ్యాత్మకమైన దివ్య చక్షుః సంపన్నులైన ఆచార్యులకు గోచరించిన రీతి- అనుభూత విషయం- సామాన్యులకు ఎలా తెలుస్తుంది?" అంటూ, తత్సమర్థనకోసం 'లక్ష్మ లక్ష్మీంతనోతి' ఇత్యాది కాళిదాస వాక్యాలు

ఉదాహరింపబడినవి. వ్యాఖ్యాత ఇంకా ఎన్నో విషయాలను కూడ ప్రసక్తానుప్రసక్తంగా ప్రతిపాదిస్తూ, దాదాపు ముప్ఫై (30) వాక్యాలను శ్రుతి-స్మృతి- నిఘంటు- పురాణ-కావ్య- వ్యాకరణ-ద్రవిడ ప్రబంధాల నుండి ఉద్ధరించి ప్రమాణంగా చూపారు. మొత్తం (52) శ్లోకాల వ్యాఖ్యానం కూడ ఇదే పద్ధతిలో నడిచింది.

శ్రీ శంకర భగవత్పాదులు 49 శ్లోకాలలో భగవంతుని సగుణస్వరూపాన్ని వర్ణించి యాభై యవ (50) శ్లోకం నిర్గుణమైన సచ్చిదానంద స్వరూపాన్ని వర్ణించారు. శ్రీ రాఘవాచార్యులవారు ఆ శ్లోకానికి వ్రాసిన వ్యాఖ్యానంలో అద్వైత సిద్ధాంతానికి సంబంధించిన కొన్ని అంశాలు సుస్పష్టంగా ప్రతిపాదించారు. 'తత్త్వమసి' ఇత్యాది మహా వాక్యాలలో వాక్యార్థం నిర్ణయించే సందర్భంలో అద్వైతులు 'జహదజహల్లక్షణ' అను లక్షణాభేదాన్ని అంగీకరిస్తారు. ఈ విషయాన్ని స్పష్టీకరిస్తూ ఆచార్యులవారు లక్షణాభేదాలను స్పష్టంగా విశదీకరించారు. ఈ ఘట్టంలో వీరు చేసిన వివిధ విషయ ప్రతిపాదనం వీరికున్న వివిధ వేదాన్త సంప్రదాయ పరిజ్ఞానానికీ, నిష్పాక్షిక దృష్టికీ నిదర్శనంగా నిలుస్తుంది. ఉత్తమ దార్శనికుల దృక్పథం ఇలాగే ఉంటుంది కదా!

శ్రీ కె.వి. రాఘవాచార్యులవారు తమ వ్యాఖ్యాతృ చక్రవర్తిత్వాన్ని వారు రచించిన అనేక విస్తృత వ్యాఖ్యానాల ద్వారా నిరూపించుకొన్నారు. శ్రీ వేదాన్త దేశికుల పాదుకా సహస్రానికి వీరు రచించిన ప్రామాణిక వ్యాఖ్య ఐదు (5) సంపుటాలలో వెలువడింది. పాదుకా సహస్రం ఎన్నో నిగూఢమైన సాంప్రదాయిక విషయాలతో క్లిష్టమైన శబ్దాలంకారాదులతో సామాన్యుల బుద్ధికి ఎంత దురవగాహ మైనదో పండితులకు తెలిసిన విషయమే. వేదాన్త దేశికుల కొన్ని ఇతర రచనలకు కూడ వ్యాఖ్యలు రచించారు. వీరు ప్రాకృత సంస్కృత భాషలలో రచించిన అచ్యుత శతకానికి సువిస్తృత వ్యాఖ్య 'జ్యోతిర్మయి' రచించి ఈ మధ్యనే ప్రకటించారు. శిశుపాల వధాదులకు వీరు రచించిన విమర్శనాత్మక గ్రంథాలు పండితుల మన్ననల నందుకొన్నాయి.

ఒక్క వాక్యంలో చెప్పాలంటే శ్రీమాన్ కె.వి. రాఘవాచార్యులవారు రచించిన ఏ ఒక్క వ్యాఖ్యానమైనా సరిగా అర్థం చేసికొంటూ శ్రద్ధా పూర్వకంగా పఠించువారికి అనేక శాస్త్రాలలోని విషయాలతోను, దార్శనిక సంప్రదాయాలతోను నిర్దుష్టమైన జ్ఞానం లభిస్తుంది. ఈ విశ్వాసంతో **'శ్రీరంజనీ' వ్యాఖ్యా సహిత విష్ణుపాదాది కేశాంత స్తోత్రాన్ని** పఠించినవారు యాభై రెండవ శ్లోకంలో భగవత్పాదులు చెప్పిన పరమాత్మ స్వరూప సాక్షాత్కారాన్ని పొందుతారు. ఆస్తికులందటికీ ఈ అవకాశం కల్పించిన శ్రీమాన్ కె.వి.రాఘవాచార్యులవారికి నమోవాకం ప్రశాస్మహే.

"శ్రీవిష్ణుపాదాది కేశాంత స్తోత్రం" (2014) గ్రంథ పీఠిక

సంస్కృత అవధాన సాహితి

డా॥ జి.యం.రామశర్మ
చరవాణి: 9908 846 177

అవధానాలు ధారణా ప్రధానాలు, ఆశుకవితా సంవిధానాలు. అవధానమంటే చిత్త ఏకాగ్రత. వైదిక సాహిత్యం నుంచి లౌకిక సాహిత్యానికి ప్రసరించిన ఈ అవధాన విద్యకు ఆద్యుడు విద్వదారాధ్యుడు అనితర సాధ్య ప్రతిభా సముమ్మేషుడు ఈ నాటి తెలంగాణ రాష్ట్రంలోని కొలిచెలమ (మెదకు జిల్లా) గ్రామ వాసిగా వాసిగాంచిన ప్రప్రథమ శతావధాని శ్రీ కోలాచల మల్లినాథసూరి కావడం ఈ నేల చేసికొన్న పుణ్య విశేషం. ఈయన కాళిదాసాది మహాకవుల కావ్యాలకు కమనీయ వ్యాఖ్యానాలను కల్పించిన మహామహోపాధ్యాయ మల్లినాథసూరికి పితామహుడు (తాత). ఈ ధీశాలి 13వ శతాబ్దికి చెందిన రెండవ ప్రతాపరుద్ర చక్రవర్తి (కాకతీయరాజు– ఓరుగల్లు) ఆస్థానంలో ఆస్థానకవిగా స్వప్రతిభా ప్రభానురూపమైన కనకాభిషేక సత్కారాన్ని పొందినట్లుగా ప్రబంధ ప్రమాణాలున్నాయి.

శ్లో॥ *కొలిచెల్మాన్వయాబ్ధీందు ర్మల్లినాథో మహాయశః* (ప్రతాపరుద్రీయం– రత్నాపణ వ్యాఖ్యా– ప్రస్తావన)

పై శ్లోకం శ్రీ మల్లినాథసూరిని శతావధానిగా సముద్ఘోషిస్తున్నప్పటికి ఆనాటి అవధాన స్వరూప స్వభావాలు మాత్రం అలభ్యంగానే ఉన్నాయి. ప్రబంధ యుగంలో 'శతలేఖిన్యవధానం' అనే మాట విరివిగా వినిపించింది. రామరాజ భూషణుడు శతలేఖినీ పద్య సంధానంలో చతురుడనని ప్రకటించుకున్నాడు. 19వ శతాబ్దంలో మహనీయుడు, శతావధాని విద్వాన్ శ్రీ మాడభూషి వేంకటాచార్యుల వారి పూనికతో అవధాన కళకు ఒక స్వరూపం సంపన్నమయింది. వారేర్పరచిన స్వరూపం సంస్కృత శ్లోక వైఖరిలో ఉండడం గమనార్హం.

శ్లో॥ *కావ్యోక్తిః కవితోక్తి రంచిత కళావిద్భిస్సహ భాషణం*
పౌరాణోక్తి రమంద లౌకిక గిరో వ్యస్తాక్షరోక్తి స్సమం
ధీమద్భి శ్చతురంగ ఖేలన మథో సంఖ్యేయ పుష్పాలయో
యస్మిం త్స్యా ద్యుగపత్తదేవ కృతినా మష్టావధానాభిధం

శ్రీమాన్ మాడభూషి వారేర్పరచిన పై అష్టావధాన స్వరూపంలో ఆశుకవిత, కావ్యచర్చ, శాస్త్రచర్చ, పురాణోక్తి, లౌకిక ప్రసంగం (అప్రస్తుత ప్రసంగం), వ్యస్తాక్షరి, చతురంగ ఖేలనం, పుష్పగణనం అనే అంశాలున్నాయి.

జగదాశ్చర్య కరావధాన కవితా సంపన్నులు, కింకవీంద్ర ఘటా పంచాననులు అయిన తిరుపతి వేంకటకవుల సంధానంలో అవధాన శారద ఒక సమగ్ర రూపాన్ని ధరించడమే కాక సమస్యాపూర్తి, దత్తపది మొదలైన జన మనోరంజనాంశాలను సంతరింప చేసుకొన్నది. ఛందోభాషణం, సమస్యా పూరణం, దత్తపది అను అంశాలు సంస్కృత సాహిత్యంలో అత్యంత సనాతనాలు. ఈ కవితా వినోద ప్రక్రియలను ప్రహేళికలన్నారు

లాక్షణికులు. ఈ వినోద ప్రక్రియలను తెలుగు అవధానాల్లోకి అనువర్తింప జేసుకొని అవధాన కళను మనో వినోదాత్మకంగా మలచిన కీర్తి తిరుపతి వేంకటకవులు మొదలైన అవధాన చక్రవర్తులకు దక్కుతుంది.

ప్రస్తుతం మనం వ్యవహరిస్తున్న దత్తపది, సంస్కృత సాహిత్యంలో సమస్యగానే ప్రచురితమై ఉంది. సమస్యలే సంక్షిప్యతే అనయా అను వ్యుత్పత్తి రీత్యా అది సరిపోతుంది.

*"**అంబలి** ద్వేషిణం వందే **చింతకాయ** వరప్రదం*
***కూరగాయ** కృతత్రాసం **పాలనే**ఽ**తి**ప్రియం గవాం"*

ఈ ప్రాచీన శ్లోకంలో అంబలి, చింతకాయ, కూరగాయ, పాలనేతి అనే దత్తపదాలు అందంగా ఒదిగి పోయాయి. విష్ణుపరంగా ఆ పదాలను మలచడంలో గల కవిధిషణ ఇక్కడ సుధ్యుపాస్యం- పూర్వంలో భోజసభ ఇలాటి కవితావినోదాలకు చిరునామాగా వెలిగింది. నవరత్నాలుగా పిలువబడే 9 మంది కవులతో భోజుడు నవనవోన్మేషంగా భాసించి ధారానగరాన్ని కవనధారానగరంగా మార్చాడనే ప్రతీతి ఉంది. భోజుని సమీపించిన ఒక విప్రకవి "భోజనం దేహి రాజేంద్ర ఘృత సూప సమన్వితం" అని పలికి రెండవ పాదం కోసం తడుముకోగా వెంటనే కవికుల గురుడైన కాళిదాసందుకొని "మాహిషం చ శరచ్చంద్ర చంద్రికా ధవళం దధి" అని పూరించారు. ఇది ఆనాటి ఛందోభాషణకు దర్పణాయమానం. అదే సదస్సులో రాజు "టంటంట టంటంట టటంట టంటం" అనే ఒక విచిత్రమైన సమస్యనీయగా-

రాజాభిషేకే మద విహ్వలాయా/ హస్తాచ్చ్యుతో హేమఘటో యువత్యాః
సోపాన మార్గేషు కరోతి శబ్దం/ టంటంట.....................

అని కవికులమణి పూరించిన సరణి సాహితీ ప్రపంచ ప్రసిద్ధి.

అలాగే ప్రామాణికమైన పాణిని అష్టాధ్యాయి సూత్రాలను నాలుగింటిని దత్తపదులుగా గ్రహించి వాటిని (సర్వస్యద్వే, వృద్ధోయూనా, ఏకోగోత్రే, స్త్రీ పుంవచ్చ) శ్లోకంలోని ప్రతిపాదాదిల్లో అమరించి చెప్పిన ఒక ప్రాక్కవి మనీష ప్రాతఃస్మరణీయం. ఆ శ్లోకాన్ని ఆలకిద్దాం, ఆనందంతో పులకిద్దాం.

శా॥ సర్వస్యద్వే సుమతి కుమతీ సంపదాపత్తి హేతూ
వృద్ధోయూనా సహ పరిచయాత్త్యజ్యతే కామినీభిః
ఏకో గోత్రే ప్రభవతి పుమాన్యః కుటుంబం బిభర్తి
స్త్రీ పుంవచ్చ ప్రచలతి తదా తద్ధి గేహం వినష్టం

పై శ్లోకం భావక్లిష్టత లేకుండా ప్రవాహ నిర్విశేషంగా సాగింది. వ్యాకరణ సూత్రాలను మనస్సులో భద్రపరచుకొనే దిశగా మన పూర్వులు పై విధంగా ప్రాయికంగా వినోదాత్మక ప్రయోగాలెన్నో చేసారు.

కాళీమాత వరప్రసాదం పొందిన తర్వాత కాళిదాస మహాకవిని ఆయన భార్య విద్యాధరి "అస్తి (వా) కశ్చిద్వాగ్విశేషః" (నీ మాట ఏదైనా సంస్కార విశేషాన్ని సముపార్జించుకున్నదా? లేక మునుపటి వలెనే వెర్రి

వెర్రిగా మాట్లాడుతున్నావా? అను ఉద్దేశంతో) అని ప్రశ్నించింది. దానికి ప్రతిస్పందించిన మహాకవి, భార్య యొక్క ప్రశ్నవాక్యాన్నే పరమప్రమాణంగా గ్రహించి దానిలోని 'అస్తి' అను పదంతో ఆరంభించి (అస్త్యుత్తర స్యాం దిశి...) కుమార సంభవ మహాకావ్యాన్ని, రెండవదైన 'కశ్చిత్' అను పదంతో కలం కదిపి (కశ్చిత్కాంతా విరహ గురుణా...) మేఘదూత కావ్యాన్ని, ఇక మూడవదైన 'వాక్' అను పదంతో ప్రారంభించి (వాగర్థా వివసంపృక్తౌ) రఘువంశ మహాకావ్యాన్ని రచించిన ఉదంతం విజ్ఞులకు విదిత చరమే. అస్తి, కశ్చిత్, వాక్- అను దత్తపదితో ఒక శ్లోకమో, ఒక కావ్యమో కాదు, మహత్త్వపూర్ణంగా మూడు మహాకావ్యాలను భారతీయ సాహితీ కళాకలాపాలుగా కల్పించిన కాళిదాసు క్రాంతిదర్శిత అనల్పం, అప్రతిమానం. ఈ నేపథ్యంలో కాళిదాసెంత పురాతనుడో 'దత్తపది' అంశం అంత సనాతనం అని చెప్పడం వాస్తవదూరం కానేరదు.

శ్లోక రచనలో తెలుగు పద్యాలలో మాదిరి యతి (అక్షరమైత్రి) ప్రాసల నియతి ఉండదు. కాబట్టి పద్య రచనతో పోల్చినప్పుడు శ్లోక రచనలో సౌలభ్యమున్నదనుట నిజం. కాని సంస్కృత భాషపై భేషనిపించే మంచిపట్టు, తదీయ శబ్దజాలంపై సమంచితమైన అధికారం కవికి ఉండాలి. అప్పుడే శ్లోకం హేరాళ ధారాళంగా సాగి సుశ్లోకమవుతుంది.

విద్వాన్ మాడభూషి వారి నుండి నేటి వరకు సంస్కృతావధానాల పల్లకీలలో సరస్వతీమాతను ఊరేగించిన సరసులైన అవధాని వతంసులెందరో ఉన్నారు. సాహితీ సమారాధనలో వారార్జించిన పుణ్యమెట్టిదో, అవధాన సాధనలో వారి నైపుణ్యమెలాంటిదో, వారు పూరించిన సమస్యాది- అంశాల ద్వారా తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

ఆ గిరిపల్లి శతావధానంలో (1960) శ్రీమాన్ మాడభూషివారిని ఒక ప్రాశ్నికుడు కూర్మావతారాన్ని వర్ణించుమని కోరగా ఆయన అలవోకగా ఇలా చెప్పారట.

శ్లో॥ *పద్మాయమానస్య ధరాతలస్య/ నాళాయతిస్మాహి పతిశ్చ తస్య*
కందాయమానం కమఠాధిరాజం/ ధ్యాయామి నిత్యం పరమార్థ దృష్ట్యా

"పద్మము వంటి భూతలానికి తామరతూడు వలె వ్రేలాడు సర్పరాజుకు దుంపలాగా ఉన్న కూర్మస్వామిని ధ్యానిస్తున్నాను" అను ఆ శ్లోకంలోని భావచిత్రం భావుకుల మనస్సులకు హత్తుకుంటున్నది.

చర్ల బ్రహ్మయశాస్త్రి గురుత్వంలో సమధీత శబ్దశాస్త్రులైన తిరుపతి వేంకటకవులు తమ శత/ అష్టావ ధానాలలో ఎన్నో భావబంధురమైన శబ్దసుందరమైన సంస్కృత సమస్యలను వర్ణనాద్యంశాలను పూరించి వారి గీర్వాణ వాణీ పాటవాన్ని ప్రకటించుకున్నారు. అమలాపురం శతావధానంలో వారు "చంద్రోదయం వాంఛతి చక్రవాకీ" అను సమస్యకు సమయోచితమైన పూరణ చేసి సభను పులకింపజేసారు.

శ్లో॥ *బంధీకృతేర్కే దశకంధరేణ/ సదాస్థితే చంద్రమసి స్థిరాయాం*
వధం విధాతుం కిల తస్య రామ/ చంద్రోదయం వాంఛతి చక్రవాకీ

"రావణునిచే సూర్యుడు బంధింపబడగా, భూమిపై సదా చంద్రుడే కొలువై ఉండగా, రావణ వధ చేసి తనకు ఆనందాన్ని పంచుటకై చక్రవాకి (ఆడపక్షి) రామచంద్రోదయాన్ని కోరుకొంటున్నది. చక్రవాక పక్షి సూర్యకాంతిలో ఆనందించే పక్షి. చంద్రకాంతి దానికి కృష్ణహేతువనునది కవి సమయం. ఈ కవి సమయాన్ని దృష్టిలో ఉంచుకొని చేసిన పైపూరణలో చంద్రోదయాన్ని రామచంద్రోదయంగా మార్చడంలోని కవ్యుక్తి కవి యుక్తి ప్రశంసా పాత్రం.

శతావధాని శ్రీమాన్ రొంపిచర్ల శ్రీనివాసాచార్యులుగారు (1926) ఒక అవధానంలో భోజ, భవభూతి, హర్ష, కాళిదాస- అను దత్తపదులను గ్రహించి ఆధునిక యువతను గురించి సుమనోజ్ఞంగా ఇలా చెప్పారు-

శ్లో॥ *భోజనే న శుచితా, భవభూతి/ ప్రార్థనా హృది సుఖేష్వతి హర్షః*
నూత్న యౌవన విలాస శుభశ్రీ/ కాళిదాస చికురానుగ దృష్టిః

"భోజనం విషయంలో అపరిశుభ్రత, మనస్సులో ఎప్పుడూ ఐశ్వర్యాన్ని (భవభూతి) గురించిన కోరిక, సుఖాల పట్ల హర్షం, నవ యౌవన విలాసాలతో కూడిన, సొగసైన తుమ్మెదలకు దాసులైన (నల్లనైన) కురులు కలిగిన యువతులను అనుసరించే దృష్టి (శ్రీక+అళిదాస చికుర+అనుగ దృష్టిః) అనేవి నేటి యువకుల వైఖరులు" అను పై శ్లోక భావం సాహితీ ప్రియం భావుక సంభావ్యం.

శ్లేష యమక కవిగా సంస్కృతాంధ్రోభయ భాషలలో అష్టావధానాలు చేసిన కీ॥శే॥ శ్రీ గౌరీభట్ల రామకృష్ణశాస్త్రి (సిద్దిపేట జిల్లావాసి) వేములవాడలో నిర్వహించిన అవధానంలో 'నిశిభాతి దివాకరః' (రాత్రి రవి వెలుగుతున్నాడు) అను సమస్యను సమయస్ఫూర్తితో ఇలా పూరించారు.

శ్లో॥ *సువర్ణ భాజన వ్యాజా ద్యోషిత్పల్లవ పాణిషు*
శ్రీ రుద్రమర్చితుం శైవనిశి భాతి దివాకరః

"శివరాత్రి పర్వదినాన, సమావిష్టలైన సువాసినుల చేతులలో బంగారు పళ్ళెం రూపంలో సమాయత్తమై శివార్చకై సూర్యుడు శివరాత్రి (శైశనిశి) నాడు శోభిస్తున్నాడు" అను పై శ్లోక భావం పరమార్థ భాసురం.

సంస్కృత భాషా శతావధాని, మహామహోపాధ్యాయ శ్రీ దోర్బల ప్రభాకర శర్మగారు పూరీలో నిర్వహించిన అవధానంలో "పిపీలికా నృత్యతి వహ్నికుండే" అను సమస్యను సహృదయ హృదయోల్లాసిగా ఇలా (చీమ అగ్నికుండంలో నర్తిస్తున్నదని సమస్యకర్థం) పూరించారు:

శ్లో॥ *యజ్ఞః సమాప్తశ్చ సుదక్షిణాప్తా/ శాంతో హవిర్భుర్వ్య నలశ్చ తృప్తః*
గత స్సవీ స్నాతు మిత స్సముద్రం/ పిపీలికా నృత్యతి వహ్నికుండే

యజ్ఞం పూర్తయింది. ఋత్విజులు దక్షిణను పొందారు. హవిస్సులచే అగ్నిదేవుడు తృప్తి చెందాడు. యజమానుడు అవభృథ స్నానానికై వెళ్ళాడు. కాగా ఆ చల్లారిన యజ్ఞకుండంలో ఒక చీమ నృత్యం చేస్తున్నది అని ఆ శ్లోక భావం.

శతావధాని డా॥ సూరం శ్రీనివాసులు (నెల్లూరు)గారు ఒక సంస్కృత అవధానంలో "సంభ్రాంతా కురునాయకేన హసతా కృష్ణా సమాలింగితా" అను సమస్యకు సారవంతమైన పూరణ చేసి మెప్పందుకున్నారు. ఆ పూరణ ఇలా ఉంది–

> శ్లో॥ *భీష్మే యుద్ధ పరాఙ్ముఖే శరగురౌ యాతే చ లోకాంతరం*
> *కర్ణేచాపి మృతే హి భారమఖిలం శల్యే సమారోపితం*
> *సంభావ్యైవ జయం తథాపి వసతౌ స్వప్నేపి నిద్రాళునా*
> *సంభ్రాంతా..*

"భీష్మద్రోణ కర్ణులు పతనం కాగా సైన్య భారం శల్యునిపై ఉంచబడింది. అయినా జయాన్ని ఆశిస్తూ నిద్రిస్తున్న దుర్యోధనుడిచే స్వప్నంలో ద్రౌపది కౌగిలించుకొనబడినది" అనే పై శ్లోక భావం రసజ్ఞ రంజితంగా ఉన్నది. 'స్వప్నంలో' అను మాటతో ఆ సమస్యలోని అసంబద్ధత తొలగింది.

అవధాన సరస్వతీ పీఠ అధ్యక్షులు, బృహద్వి సహస్రావధాని డా॥ మాడుగుల నాగఫణిశర్మగారు ఒక శతావధానంలో జడేజా, ద్రావిడ్, కామ్లే, కుమ్లీ– అను క్రికెటర్ల పేర్లను దత్తపదిగా గ్రహించి రామాయణ పరంగా రసభరంగా ఇలా పూరించారు.

> శ్లో॥ *ఏషా **జడేజా** వికటా నిహన్యా/ త**ద్రావిడే**ద్యా జలధి ప్రసిద్ధా*
> *తద్వానరోన్ముష్టి విఘాత చూర్ణా/ **కామ్లే**తి **కుమ్లీ**తి రవం చకార*

భావం:– "జడ(ల)జాతయైన, ద్రావిడ స్తుత్యమైన ఈ సింహిక అను రాక్షసి వికటమైనది కాన సంహరింపదగినది"– అని నిశ్చయించుకున్న హనుమ చేతి దెబ్బచే చూర్ణితయైన ఆ రక్కసి చస్తూ కామ్లే కుమ్లీ అను వింతధ్వనులు చేసింది".

హైదరాబాదులో డా॥ మాడుగుల వారు చేసిన మరో శతావధానంలో– చపాతి, పరోట, సాంబారు, కుర్మ– అను దత్త పదులను స్వీకరించి శివపరంగా వారు పూరించిన తీరు పులకింతలు గొలిపేదిగా ఉంది.

> శ్లో॥ *య**శ్చపాతి** జగత్సర్వం యోఽను కంపా**పరోఽటతి***
> ***సాంబారు**ద్ర స్తమాశ్రిత్య వయం **కుర్మో** నమశ్శతం*

భావం:– ఏ విభుడు జగత్తును పాలిస్తున్నాడో, దయాపరుడై అంతట చరిస్తున్నాడో అటువంటి సాంబుడైన రుద్రుని ఆశ్రయించి నమశ్శతాన్ని మనం చేద్దాం (చేస్తున్నాం). విచిత్రమేమంటే చపాతి, పరోట, సాంబారు అనే పదాలు నడ్డి విరిగి విశేషార్థ సమున్మేషంగా పై శ్లోకంలో దీపిస్తున్నాయి. 'కుర్మః' అను సంస్కృత క్రియాపదాన్ని చాకచక్యంగా ప్రయోగించడం అందులోని మరో మెరుపు.

అద్వైతావధానం, రామాయణావధానాది వివిధ వినూతన ప్రయోగాలతో విలసిల్లుతున్న శతావధాని డా॥ ఆర్. గణేశ్‌గారు (కర్ణాటక రాష్ట్రం) ఒక అవధానంలో హలో, హాయ్, హనీ, స్వీట్– అను ఆంగ్ల

పదాలను దత్తపదిగా పొంది శూర్పణఖతో రాముడు మాట్లాడిన వైఖరిని పరమ రమణీయంగా శ్లోకంలో పొందుపరిచారు.

శ్లో॥ *వినోదార్థం సార్థం ముని నివహాలోలో రఘువరః*
స్పృహాయాం రాగాంధాం వికట వనితాం దండకవనే
మహాతేజస్వీట్ ప్రత్యయ సముచితై శ్చైక వనితో
విశాలక్షీ త్వేవం వదతి మహనీయో విధివశాత్

ఇందులో రామచంద్రస్వామి పరంగా తేజస్వీట్ (తేజస్వి+ఈట్= తేజస్వి శ్రేష్ఠుడు) అను విశేషంగా ప్రయోగించి 'స్వీట్' పదాన్ని అమర్చడంలోని కవి శేముషి ప్రశంసార్హం.

సంస్కృతాంధ్రోభయ భాషావధాని శ్రీ తిగుళ్ళ శ్రీహరి శర్మగారు (వేములవాడ) బెంగుళూరులో అష్టావధానం చేస్తుండగా (1986) ఒక ప్రాశ్నికుడు 'విద్యున్మాలా' అనే నాలుగక్షరాలను క్రమంగా ప్రతిపాదంలోని రెండవ అక్షరంగా ప్రయోగించి విద్యున్మాలా వృత్తాన్ని (కర్ణాటక రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుతూ) చెప్పమని న్యస్తాక్షరి నీయగా శర్మగారు తమ కవితావిద్యుత్తునిలా ప్రసరింపజేసారు.

విద్యున్మాలా:- *సా విద్యుచ్చే త్కౌబేర్యాం స్యా/ దుద్యుక్తా ధారావర్షం స్యాత్*
తన్మాన్యాత్ర శ్రీ కర్ణాటే/ శ్రీ లాలిత్యం సస్యే దద్యాత్

భావం:- ఉత్తర దిశలో మెరిస్తే ధారావర్షం కురుస్తుందని శాస్త్రం. ఈ కర్ణాట రాష్ట్రంలో ఉత్తర దిశలో మాన్యంగా మెరుపు మెరిసి పంటల విషయంలో శ్రీ లాలిత్యాన్ని ఇచ్చుగాక!

ఇలా ఎందరెందరో అవధాని కవులు తమ సుందర సుకుమార సురభిళ కవన బృందావనాలలో గీర్వాణ వాణీ వీణా నిక్వాణాలతో సంస్కృత అవధాన సాహితిని సుసంపన్నం చేసారు.

"జయంతి తే సుకృతినో రసి సిద్ధాః కవీశ్వరాః"

ఉపనిషద్వైభవము

ఆచార్య మసన చెన్నప్ప

చరవాణి: 9885 654 381

భారతీయ ఆర్ష సాహిత్యం వేదాలను స్వతః ప్రమాణంగా అంగీకరిస్తుంది. సర్వమానవ కళ్యాణ కారకంగా వేదమాత ఆవిర్భవించింది. "మానవుడవుకమ్ము, దివ్యమానవుణ్ణి నిర్మించు" అనేది వేద సందేశం.

"సంగచ్ఛధ్వం సంవదధ్వం" అని ఋగ్వేదం (10-191-2) చెప్తుంది. "ఓం క్రతోస్మర" అని యజుర్వేదం (40-15) ఉద్బోధిస్తుంది. "మాతా భూమిః పుత్రోహం పృథివ్యాః" అని అధర్వవేదం వివరిస్తుంది. ఈ సూక్తులను గమనించినప్పుడు, వేదం దేశకాల పరిస్థితులకు అతీతమైందని తెలుస్తుంది.

ఉపనిషద్వైభవమంతా వేదాధారమైందే. వేదం ప్రవచించిన వసుధైక కుటుంబ భావనను ఉపనిషత్తులు ఏనాడు కూడా విస్మరించవు. రాగద్వేషాలకు, మనోమాలిన్యాలకు, లింగ ప్రాంత భాషా సంబంధమైన దురభిమానాలకు అతీతమైనవి ఉపనిషత్తులు!

వేదాల తర్వాత ఆధ్యాత్మికచింతనకు, ఏకేశ్వరోపాసనకు పట్టం గట్టినవి ఉపనిషత్తులే. సత్యం, ధర్మం, న్యాయం, అహింస, అస్తేయం, బ్రహ్మచర్యం, తపస్సు, స్వాధ్యాయం మొదలైన సదాచారాలన్నీ సత్పురుషుల ఆచరణవల్ల, ఉపదేశాలవల్ల ప్రవాహరూపంలో ఈనాటికీ మనకందుతున్నాయంటే అందుకు కారణం ఉపనిషత్తులే. వేదం ప్రబోధించిన జీవన విధానాన్నీ, ఆలోచనాధారనూ గ్రహించి, ఆచరణలో పెట్టి అనుభవ పూర్వకంగా మహర్షులు మనకందించినవే ఉపనిషత్తులు.

"ఈశావాస్యమిదం సర్వం యత్కించ జగత్యాంజగత్"- అని ఈశావాస్యోపనిషత్తు ఈ చరాచర జగత్తులో ఉన్నదంతా పరబ్రహ్మచేతనే వ్యాపితమై ఉందని తెలియజేస్తుంది. ఏది వాక్కుతో చెప్పబడదో, దేని కారణంగా వాక్కు వెలువడుతుందో, దేని ప్రేరణవల్ల మనస్సు సంకల్పిస్తుందో, చెవులు వింటున్నాయో, కళ్లు చూస్తున్నాయో, ప్రాణవాయువు శరీరంలో పదివిధాలుగా విభక్తమై తన పని తాను చేస్తుందో అదే పరబ్రహ్మ అని కేనోపనిషత్తు వర్ణిస్తుంది. ఇంద్రియాలు దైవాన్ని పొందజాలవని, దైవంలో నానాత్వం లేదని, దైవమంటే జ్ఞానమని, ఆనందమని బృహదారణ్యకోపనిషత్తు ప్రతిపాదిస్తుంది. మోక్షానికి వారధి బ్రహ్మయేనని ముండకోపనిషత్తు తెలుపుతుంది. "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" అని తైతిరీయోపనిషత్తు (1-2) పరబ్రహ్మను నిర్వచిస్తుంది. "ఏకోవశీ సర్వభూతాంతరాత్మా" ఈ విశ్వం ఎవరి వశంలో ఉందో, అతడే అన్ని ప్రాణులకు అంతరాత్మ అని కఠోపనిషత్తు వెల్లడిస్తుంది. "ఓమిత్యేత దక్షర ముద్గీథ ముపాసీత" అని ఛాందోగ్యోపనిషత్తు పరబ్రహ్మ నామం ఓంకారమని, దాన్ని ఉచ్చైస్వరంతో గానం చేయాలని ఉపదేశిస్తుంది. శ్వేతాశ్వతరోపనిషత్తు "విశ్వతశ్చక్షురుత విశ్వతోముఖో విశ్వతోబాహురుత విశ్వతస్పాత్" (3-14), పరబ్రహ్మకు కళ్లూ, ముఖం,

చేతులూ పాదాలు విశ్వమంతటా నిండి ఉన్నాయని నొక్కి చెప్తుంది. తద్వారా పరబ్రహ్మ వ్యాపకుడన్న విషయం స్పష్టమవుతుంది.

"సస్యమివమర్త్యః పచ్యతే సస్యమివా జాయతే పునః" అని కఠోపనిషత్తు మరణశీలుడైన మానవుడు అన్నంలాగా నశించి, తిరిగి అన్నంలాగా ప్రభవిస్తాడని తెలుపుతుంది. ఎవరు దేవుణ్ణి తమ హృదయ కమలంలో దర్శిస్తారో వారే ధీరులని, వారికే శాశ్వత సుఖం లభిస్తుందని అదే కఠోపనిషత్తు వివరిస్తుంది. జీవాత్మ నిజానికి స్త్రీగాని, పురుషుడు గాని కాదని, తాను సృష్టికర్త అయిన పరబ్రహ్మకంటె వేరని తెలుసుకొన్నప్పుడే దైవకృపకు పాత్రుడవుతాడని శ్వేతాశ్వతరోపనిషత్తు తెలియజేస్తుంది. ఇంకా ఈ ఉపనిషత్తు మానవ శరీరం మాత్రమే సుందరమైన రచన అని చెప్తుంది. ఛాందోగ్యోపనిషత్తు 'న జీవో మ్రియతే' (6-11-3) నశించనివాడు జీవుడని తెలుపుతుంది. ఇంకా ఈ ఉపనిషత్తు పంచమహాకోశాలను ప్రస్తావిస్తూ, అన్నమయ కోశంకంటె ప్రాణమయ కోశం, దానికంటె మనోమయ కోశం, దానికంటె విజ్ఞానమయ కోశం, దానికంటె ఆనందమయ కోశం సూక్ష్మమైందని వెల్లడిస్తుంది. మనవాక్కు అగ్నివల్ల, మనస్సు చంద్రునివల్ల ఆవిర్భవించాయని చెప్తూ సృష్టిలో ఆహారోత్పత్తికి కారణభూతమైన ప్రాణమే మన శరీరంలో ఆకలిగాని, అన్నాన్ని భుజిస్తుందని ఒక పరమ రహస్యాన్ని బయటపెట్టింది ఛాందోగ్యోపనిషత్తే!

పరబ్రహ్మ అక్షరుడు. అనగా నాశంలేనివాడు. ఓంకారమే అతని నామం. పనిచేస్తూ ఓంకారాన్నే జపించాలని, ఓంకారాన్ని జపిస్తూ పనిచేయాలని ఈశావాస్యోపనిషత్తు (17) ఉపదేశిస్తుంది.

నాల్గు వేదాలు పదేపదే దేన్ని వల్లిస్తున్నాయో, అన్ని తపస్సులు దేన్నిగూర్చి ఉద్దేశింపబడినాయో, దేన్ని కోరి బ్రహ్మచర్యం పాటిస్తున్నారో ఆ శబ్దం ఓంకారమని కఠోపనిషత్తు (2-15) తెలియజేస్తుంది. ప్రకృష్టమైన జ్ఞానంతోనే పరబ్రహ్మ లభిస్తాడని కూడా ఈ ఉపనిషత్తు తెలుపుతుంది. ఓంకారమనే విల్లు నెక్కుపెట్టి దైవమనే లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఆత్మ అనే బాణాన్ని ప్రయోగించడమే ఉపాసన అని ముండకోపనిషత్తు స్పష్టం చేస్తుంది.

ఓంకార పదవాచ్యుడైన పరబ్రహ్మను ధ్యానించినట్లైతే కోరికను బట్టి సంసార సుఖం లేదా, మోక్షానందం లభిస్తుందని ప్రశ్నోపనిషత్తు ఎఱుకపరుస్తుంది.

వాక్య సముదాయాలతో ఒప్పారు మాండూక్యోపనిషత్తు ఓంకార ప్రశస్తిని చాటుతుంది. ఓంకారం ఈశ్వర నామమని, ఈశ్వరుని తత్త్వం వాచ్యమని, ప్రపంచమే దానికి వ్యాఖ్యానమని తెలుపుతూ, ఓంకారోపాసన చేయమని ప్రబోధిస్తుంది. పరమాత్మ 4వ పాదం ఎవరికీ అంతుపట్టదని, అది విశేషప్రయత్నం (యోగం) చేత మాత్రమే అనుభవంలోకి తెచ్చుకోదగింది అని ఈ ఉపనిషత్తు తెలుపుతుంది.

సమస్త ప్రాణులు, పంచభూతాలు, పరమేశ్వరునిలో ప్రతిష్ఠితమై ఉన్నాయని, పరమేశ్వరుని 'చిర్' శక్తి చేతనే చరాచర జగత్తు నడుస్తుందని, అందుకే అతణ్ణి 'ప్రజ్ఞానం బ్రహ్మ' అంటారని, హెచ్చు తగ్గులు లేని జ్ఞాన స్వరూపమే ఉపాసింపదగిందని ఐతరేయోపనిషత్తు తెలియజేస్తుంది.

ఓంకారోచ్చారణ లేకుండా యజ్ఞం ఆరంభించరాదని, పంచకోశాలలో ఆనందమయ కోశం విశిష్టమైందని, ఆనందమయ శరీరంలోనే పరమాత్మ ప్రకాశిస్తాడని, కనుక నిష్కామ కర్మయోగాన్ని అవలంభించడం ద్వారా మనం ఆ పరమాత్మను అనుభవంలోకి తెచ్చుకోవాలని తైత్తిరీయోపనిషత్తు ప్రబోధిస్తుంది.

ఋగ్వేదీయులు ప్రణవోపాసకులు, సామవేదీయులు, ఉద్గీథోపాసకులు ఓంకారమే ఉచ్చైస్వరంతో గానం చేయబడుతుంది కనుక 'ఉద్గీథం' అనబడుతుంది.

'ఉత్' అంటే ప్రాణం- 'గీః' అంటే వాక్కు. 'థం' అంటే అన్నం. ఈ మూడు శక్తుల సమాహారమే ఉద్గీథం. విశ్వమంతా ఈ మూడింటి కోసం పరమాత్మను అనుక్షణం ఉపాసిస్తుంది. కనుక మనం కూడా ఉద్గీథోపాసన చేయాలని ఛాందోగ్యోపనిషత్తు చెప్తుంది.

ఐతరేయుడు నిత్యం 3 యజ్ఞాలు చేశాడు. 116 ఏండ్లు బ్రతికాడు. మనిషి జీవితకాలం యజ్ఞం లాంటిది. ప్రథమయజ్ఞం 24 ఏండ్లు. 24 అక్షరాల గాయత్రికి సమానం; రెండవ యజ్ఞం 44 ఏండ్లు. మాధ్యందిన యజ్ఞం. 44 అక్షరాల త్రిష్టుప్పు ఛందస్సుకు సమానం; 3వ యజ్ఞం 48 ఏండ్లు సాయంత్రం చేసేది. 48 అక్షరాల 'జగతి' ఛందం వంటిది.

పూర్ణమానవుడు కావడానికి త్రివిధ యజ్ఞాలద్వారా బ్రహ్మోపాసన జరగాలని ఈ ఉపనిషత్తు చెప్తుంది.

వాక్కును మనస్సులో, మనస్సును ప్రాణాలలో, ప్రాణాన్ని ఆత్మలో, ఆత్మను పరబ్రహ్మలో కలపడమే ఉపాసన అని ఈ ఉపనిషత్తు చెప్తుంది.

'ఉపాసన' అంటే పరమాత్మకు సమీపంలో ఉండడం. సాక్షాత్కారం అంటే పరమాత్మను అనుభవంలోనికి తెచ్చుకోవడం అని బృహదారణ్యకోపనిషత్తు ప్రబోధిస్తుంది.

విడిచిపోయిన జంతువును పదచిహ్నములతో పట్టునట్లుగా, విస్మరించిన ఆత్మతత్త్వాన్ని సూక్ష్మమైన బుద్ధితో తెలుసుకోవాలని ఈ ఉపనిషత్తు తెలుపుతుంది. యాజ్ఞవల్క్యుడు మైత్రేయికి చేసిన ఆత్మోపదేశం, జనకునికి చేసిన బ్రహ్మోపదేశం పరమాత్మ బుద్ధి గమ్యమని తెలుపుతూ సత్యధర్మాన్ని ఆశ్రయిస్తే పరమాత్మ సాక్షాత్కారం లభించినట్లేనని ఈ ఉపనిషత్తు బోధిస్తుంది.

సర్వాంతర్యామి, సర్వశక్తిమంతుడు, సర్వజ్ఞుడు- ఐన పరమేశ్వరుడు ఉపాస్యుడని తేటతెల్లం చేస్తుంది ఈ ఉపనిషత్తు. పరమాత్మను ఉపాసించటానికి అనువైన ప్రదేశం మన హృదయాకాశమేనని, అదే దహరాకాశమని ఈ ఉపనిషత్తు విశదం చేస్తుంది.

శ్వేతాశ్వతరోపనిషత్తు కేవలం యోగోపాసన ద్వారానే మోక్షం లభిస్తుందని తెలుపుతుంది.

"స్వదేహమరణిం కృత్వా ప్రణపంచోత్తరారణిమ్।
ధ్యాన నిర్మథనాభ్యాసాత్ దేవం పశ్యేన్నిగూఢవత్॥" (1-14)

దేహాన్ని, ఆ తర్వాత ఓంకారాన్ని అరణిగా మార్చి ధ్యానం అనే మంథనం నిరంతరం సాగిస్తే లోన దాగి ఉన్న పరమాత్మ అనుభవంలోకి వస్తాడని ఈ ఉపనిషత్తు తెలియజేస్తుంది.

ఈ విధంగా ఉపాసనకు బాహ్యవస్తువుల అవసరంగాని, గుర్తులుగాని, అవసరంలేదని, ప్రపంచంలోని మానవులు హెచ్చు తగ్గులు లేకుండా పలుకగలిగే సాధనం ఓంకారమని చెప్తూ- ఉపనిషత్తులు మనల్ని సరళమైన ఉపాసనా మార్గంలో నడిపిస్తాయి.

నైతిక పునాదులపైననే ఆధ్యాత్మిక సౌధం నిలిచి ఉన్నది. 'సత్యం వద, ధర్మం చర' అనే వేదమంత్రాలే ఉపనిషత్తులకు ఆధారం.

'మాగృధః కస్యస్విద్ధనమ్' (1) ఎవరి ధనాన్ని అపహరించకు- అని ఈశావాస్యోపనిషత్తు చెప్తుంది.

ప్రేయోరాజ్యం (లౌకక సుఖాలు) కంటె శ్రేయోరాజ్యమే (మోక్షం) శ్రేష్ఠమని కఠోపనిషత్తు విశదం చేస్తుంది. తండ్రి ఆజ్ఞను పాలించడం ద్వారా, గురూపదేశం ద్వారా మానవుడు జన్మను సార్థకం చేసుకుంటాడని ఈ ఉపనిషత్తు తెలుపుతుంది. స్త్రీ, ధన, కనక, వస్తు, వాహనాలకంటె ముక్తి మాత్రమే కోరదగింది అని కఠోపనిషత్తు బోధిస్తుంది. ఇంద్రియ నిగ్రహం మనుష్య జీవనాన్ని సత్యపథంలో కొనసాగింపజేస్తుందని ప్రశ్నోపనిషత్తు ప్రబోధిస్తుంది. "సత్యమేవం జయతే నానృతమ్" (3-1-6) సత్యమే జయిస్తుంది. అసత్యం జయించదని ముండకోపనిషత్తు మనల్ని సత్యమార్గంలో నడిపిస్తుంది.

"జిహ్వామే మధుమత్తమా" నా నాలుక ఎల్లవేళల తియ్యని మాటలే పలుకాలి; "అన్నం ననింద్యాత్" అన్నం నిందింపరానిది; "న కంచన వసతౌ ప్రత్యాచక్షీత" వసతి ఇవ్వకుండా, అతిథిని తిరిగి పంపరాదు; "సత్యంవద ధర్మంచర" సత్యాన్ని పలుకు, ధర్మాన్ని ఆచరించు- అని తైత్తిరీయోపనిషత్తు ప్రబోధిస్తుంది. బృహదారణ్యకోపనిషత్తు "యదేవ ఇదమ ప్రతిరూపం వదతి స ఏవ సపాప్మా" (1-3-2); అసత్య భాషణం మహాపాపం; "యదేవ ఇదమ ప్రతిరూపం పశ్యతి స ఏవ సపాప్మా"(1-3-4) కన్నులతో అనుచితమైన దృశ్యాన్ని చూడడమే పాపం; ఇట్లే చెవులద్వారా అనుచిత శబ్దాలను వినడం, దుస్సంకల్పాలకు పాల్పడడం, త్రికరణశుద్ధి లేకపోవడం మహాపాపమని ప్రబోధిస్తుంది. మాంసభక్షణ చేయరాదు, బ్రహ్మవేత్తలను నిందించ రాదు, వ్యభిచరించరాదు- అని ఛాందోగ్యోపనిషత్తు నైతిక విలువలకు స్థానిమిచ్చింది. (మజ్జో నాశ్నయాత్ తద్వ్రతమ్ (2-19-2); బ్రాహ్మణాన్ననిందేత్ తద్వ్రతమ్ (2-20-2); నకాంచన పరిహరేత్ తద్వ్రతమ్ (2-13-2)

ఈ విధంగా దేశకాలాతీత నైతిక సూత్రాలను ఉపనిషత్తులు తెలియజేశాయి. ఇంచుమించుగా అన్ని మత గ్రంథాలు వీటినే అనుసరించాయి.

ఉపనిషత్తులు రచింపబడిన కాలంలో వర్ణవ్యవస్థ ఉంది. ఒక వర్ణంవారు మరొక వర్ణం వారితో కలిసి జీవించేవారు. ఈనాటి సంకుచిత కులతత్త్వం ఆనాడు లేదు. చేసే పనులనుబట్టి వర్ణాలు ఏర్పడిన కాలమది. కుటుంబ సంబంధాలు ఈనాటివలెగాక, పరస్పరం సహకరించుకునే స్థితిలో ఉండేవి.

తండ్రి ఎవరో తెలియని సత్యకామునికి ఉపనయన సంస్కారం చేసి, ఉత్తమ శిష్యునిగా తీర్చిదిద్దిన గౌతముని చరిత్ర ఛాందోగ్యోపనిషత్తులో ఉంది. ఇదే ఉపనిషత్తులో జానశ్రుతి అనే రాజుకు రైక్వుడనే పేరుగల ఒకానొక బండి తోలుకొని బ్రతికేవాడు బ్రహ్మోపదేశం చేసిన సంఘటన కూడా చోటు చేసుకున్నది. అర్హతను బట్టి జ్ఞానం అందరికి అందించవలసిందేనన్న సూత్రం ఆ కాలంలో పాటింపబడింది. రాజులు కూడా బ్రహ్మోపదేశాన్ని పొందడానికి సింహాసనాన్ని విడిచిపెట్టి బ్రహ్మవేత్తలను వెతుక్కుంటూ వెళ్లే సంస్కృతి ఆనాటిది.

బండి తోలుకుని బ్రతికే రైక్వుడు బ్రహ్మవేత్తగా వెలిగిపోవడం- ఆనాటి సామాజిక సమరసతకు చక్కని నిదర్శనం. కులం, గోత్రం, చివరికి తండ్రి ఎవరో తెలియని సత్యకాముడు గురుకులానికి అధిపతియై వేలాది మంది శిష్యులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం ఆనాటి ప్రజలమధ్య, రాజులమధ్య, నేర్చుకునే వారిమధ్య, గురువుల మధ్యగల సామరస్యానికి చక్కని ఉదాహరణలు. జ్ఞానార్జనలో ఎవరు ఏ స్థాయి వారైనప్పటికీ అహంకారం ప్రదర్శించేవారు కారు. పుట్టుకకంటె, పుట్టిన తర్వాత నేర్చుకునే విద్యలకే నాటి సమాజంలో అధిక గౌరవం లభించింది.

బృహదారణ్యకోపనిషత్తు సామాజిక సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుంది. 'ప్రాణేంద్రియ సంవాదం' ద్వారా ప్రాణం ఇంద్రియాలకు బలాన్నిచ్చినట్లే సమాజంలోని ధనవంతులు పేదల సంరక్షణ బాధ్యత తీసుకోవాలనే సందేశాన్ని ఇస్తుంది. యాజ్ఞవల్క్యుడు తన భార్య మైత్రేయికి ఆత్మోపదేశాన్ని చేయడాన్నిబట్టి, సమాజంలో భర్తలు భార్యలకు ప్రీతిపాత్రులై ఉండేవారని తెలుస్తుంది.

గార్గి అనే విదుషీమణి జనకుని సభలో ఎందరో విద్వాంసులుండగా, యాజ్ఞవల్క్యుణ్ణి బ్రహ్మవేత్తగా నిర్ణయించడాన్నిబట్టి, ఆనాటి సమాజంలో భారతనారికిగల స్థానం ఎంత గొప్పదో నిరూపితమైంది.

సమాజం మొత్తం భగవంతుని విరాట్ స్వరూపంగా భావింపబడింది. ఆత్మపరంగా అందరూ సమానమేనన్న సమరసతాభావం ఆనాటి సమాజంలో వెల్లివిరిసింది.

అన్నం అందరిది. అది పరమేశ్వరునిచే ప్రాణికోటికి ఇవ్వబడిందనే జ్ఞానం ఆనాటివారిది. పరులకీయక ఎవరు తింటారో వారికి తృప్తికలుగదు. పరులకిచ్చి, తాముదింటూ బ్రతుకగలిగిన వారే ధన్యులని బృహదారణ్యకోపనిషత్తు గొప్ప సామాజిక సందేశాన్ని ఇస్తుంది.

"తస్మాద్య దనేనాన్నమత్తితే నైతాన్ తృప్యన్తి;
ఏవం హవా ఏనం స్వా అభిసంవిశన్తి..." (1-3-18)

తల్లి, తండ్రి, గురువు, అతిథి ఈ నల్గురు దేవతా స్వరూపులుగా లెక్కింప బడడం సామాజికోన్నతిని తెలియజేస్తుంది- తైత్తిరీయోపనిషత్తులో.

శిక్షావల్లి: "మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ, అతిథిదేవో భవ" (1-11-2).

అన్నాన్ని శ్రద్ధతో పెట్టాలి, సంతోషంగా పెట్టాలి, భయభక్తులతో పెట్టాలి, సానుభూతితో పెట్టాలి అంటుంది ఈ ఉపనిషత్తు.

"శ్రద్ధయా దేయమ్, అశ్రద్ధయా అదేయం, శ్రియాదేయం, ప్రియాదేయం, భియాదేయం, సంవిదా దేయమ్" (శిక్షావల్లి. 11-3).

"స్వస్తి పంథామనుచరేమ సూర్యాచంద్ర మసావివ" అనే ఋగ్వేద మంత్రార్థాన్ని పుణికి పుచ్చుకున్నది ఈ ఉపనిషత్తు.

త్యాగేన భుంజీథాః, మాగృధః కస్యస్విధనమ్" అనే యజుర్వేద వాక్యాన్ని సార్థకం చేశాయి ఉపనిషత్తులు. డబ్బును తృణప్రాయంగా భావించినారు ఉపనిషత్ కాలంవారు. ధనానికీ ఆధ్యాత్మిక విధానానికి సంబంధం పెట్టుకోవడం తగదన్నారు.

"న విత్తేన తర్పణీయో మనుష్యః" అని కఠోపనిషత్తు చెప్తుంది. సంపద మనిషిని సంతృప్తి పరచ జాలదని దాని భావం. పెట్టి తినండి, కొట్టి తినకండి అన్న వేదవాణిని శిరసా వహించిన ధర్మగ్రంథాలు ఉపనిషత్తులు. "శేవధి రనిత్యమ్" అన్న కఠోపనిషత్తు ప్రేయోరాజ్యం కంటె శ్రేయోరాజ్యాన్ని మిన్న ప్రతిష్ఠించింది. ఇక బృహదారణ్య కోపనిషత్తు మనిషిని స్వార్థం నుండి బయటపడేలా చేస్తుంది. 3 'దా'ల కథను పరిశీలిస్తే మనిషి దానగుణంచేతనే జీవన్ముక్తుడవుతాడని నొక్కి చెప్తుంది. సంన్యాసాశ్రమంలో ప్రవేశించేటప్పుడు అటు గురువుగాని, ఇటు తండ్రిగాని, అటు శిష్యునికి, ఇటు పుత్రునికి తన సంపదను, కీర్తిని, జ్ఞానాన్ని ఇచ్చి జీవన్ముక్తులు కావాలని ఆదేశిస్తుంది. 'పుత్ర' శబ్దానికి, తండ్రి చేయగా మిగిలిన పనులను పూర్తిచేసి కుమారుడు లోకంలో త్యాగమూర్తిగా ఉండాలనే అర్థాన్నిస్తుంది.

"అమృతత్వస్యతు నాశాస్తి విత్తేన"- మోక్షం ఎన్నడూ ధనంతో దొరకదని బృహదారణ్యకం బోధిస్తుంది.

వైదిక జీవనంలోని పరమార్థాన్ని ఇదే ఉపనిషత్తు ఎన్నో కథలద్వారా వివరిస్తుంది. ముఖ్యంగా పంచ మహాయజ్ఞాలు త్యాగశీలతకు మెరుగులు పెట్టినాయి. 'స్వాహా' శబ్దం, లేదా "ఇదం నమమ" అనే శబ్దం మనలో త్యాగబుద్ధిని పెంచుతున్నాయి.

నాల్గువేదాలు జ్ఞాన ప్రధానాలైనట్లే, నాలుగు ఆశ్రమాలు మరియు పురుషార్థాలు మానవాళికి సుఖదాయకమైనవి. వీటిని ఉపనిషత్తులు సవిస్తరంగా వర్ణిస్తున్నాయి.

బ్రహ్మచర్యాశ్రమం ఆశ్రమంలో మొదటిది. సమిధను చేతబట్టి బ్రహ్మచారులు గురువుల దగ్గరికి చేరి బ్రహ్మవిద్యను నేర్చుకునే సందర్భాలు ఉపనిషత్తులో ఎన్నో ఉన్నాయి. నచికేతుడు తండ్రి ఆజ్ఞచేత గురుకులానికి వెళ్ళి, అక్కడ అగ్నివిద్యను, మోక్షవిద్యను తెలుసుకున్నాడు. ప్రేమోరాజ్యం కంటే శ్రేయోరాజ్యం (మోక్షం) గొప్పదని యమాచార్యుని మూలంగా గ్రహించినాడు.

శిష్యులు సమస్త విద్యలతోపాటు, పరమాత్మను గూర్చి గురువుల ద్వారానే తెలుసుకుంటారు. ఆ తర్వాత తెలుసుకున్నదాన్ని మననం చేస్తారు, క్రమంగా ధ్యానిస్తారు. అప్పుడే ఆత్మ సాక్షాత్కారానికి దారి ఏర్పడుతుంది.

ప్రశ్నోపనిషత్తును గమనిస్తే సుకేశుడు, సత్యకాముడు, గార్గ్యుడు, కౌశల్యుడు, వైదర్భి, కబంధి అనే బ్రహ్మచారులు సమిధలను చేతబట్టుకొని బ్రహ్మవిద్యను నేర్చుకోవడానికి పిప్పలాద మహర్షి ఆశ్రమానికి వచ్చినట్లు ప్రశ్నోపనిషత్తులో వర్ణింపబడింది. పిప్పలాదుడు వారిని ఒక సంవత్సరంపాటు తన ఆశ్రమంలో ఉండి బ్రహ్మచర్య వ్రతాన్ని పాటించిన తర్వాతగాని, వారడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం నాటి సంప్రదాయంగా గుర్తింపబడుతుంది.

గృహస్థాశ్రమం అంటే అతిథి అభ్యాగతులకు మర్యాద చేయడం, యజ్ఞయాగాదులను నిర్వహించడం మొదలైన అంశాలకు ప్రాధాన్యం ఈయడమే.

బ్రహ్మాండంలో ప్రాణవాయువే ఆహారోత్పత్తికి కారణభూతమైంది. అదే మన శరీరంలో ఆకలి గొంటుంది. కనుక ఆకలిగొన్న తోడి జీవులకు ఆహారాన్ని అందించి మనం తినాలని ఛాందోగ్యోపనిషత్తు ప్రబోధిస్తుంది. అతిథికి పెట్టకుండా అన్నం తినరాదని ఈ ఉపనిసత్తు ఆదేశిస్తుంది. మూడు సమయాలలో యజ్ఞవిధులు నిర్వహించాలని సూచిస్తుంది. ప్రాతః సవనానికి వసువులు దేవతలని, ఈ యజ్ఞాన్ని 24 అక్షరాల గాయత్రి రక్షిస్తుందని, మాధ్యందిన సవనానికి ఏకాదశ రుద్రులే దేవతలని, ఈ యజ్ఞాన్ని 44 అక్షరాల త్రిష్టుప్పు ఛందం కాపాడుతుందని; సాయంత్రం చేసే తృతీయ సవనానికి ఆదిత్యులే దేవతలని, ఈ యజ్ఞాన్ని 48 అక్షరాల జగతి ఛందం పరిరక్షిస్తుందని, ఈ మూడు యజ్ఞాలను నిర్వహించినవారు 116 ఏండ్లు ఆరోగ్యంగా జీవితాన్ని గడుపుతారని ఛాందోగ్యం ప్రబోధిస్తుంది.

ఉపనిషత్తులు మోక్షవిద్యకు ప్రాధాన్యం ఇచ్చినట్లే లౌకిక విషయాలకు ప్రాముఖ్యం ఇచ్చాయి. మానవ సంబంధాలెట్లుండాలో ఉపనిషత్తులు చెప్పినట్లు మరే గ్రంథాలు చెప్పవు.

ఉపనిషత్తులలో భగవంతుడే ప్రజాపతి. అతనికి మనుషులందరూ సమానమే. అందరికి అతడే తండ్రి. కులమత వర్గాలకు అతీతంగా విరాజిల్లే గ్రంథాలు ఉపనిషత్తులు. విశ్వజనీన భావాలకు కేంద్రాలు ఉపనిషత్తులు.

రాజుకు ప్రజలమీద ప్రేమ ఉన్నట్లే, ప్రజలకు రాజుమీద ప్రేమ ఉండాలంటుంది బృహదారణ్యకోపనిషత్తు. తండ్రి కొడుకులు, భార్యాభర్తలు, గురుశిష్యులు వీరిలో ఒకరు తమ సుఖం చూసుకుంటే మరొకరికి వారు ప్రేమపాత్రులు కారని, అందుకే ఇతరుల ప్రేమను సంపాదించాలంటే వారి సుఖాన్ని కోరుకోవాలని ఈ ఉపనిషత్తు ప్రతిపాదిస్తుంది. భార్యాభర్తల అనుబంధాన్ని బృహదారణ్యకోపనిషత్తు వెల్లడించినట్లే గురుశిష్యుల సంబంధాన్ని మాండూక్యోపనిషత్తు వివరిస్తుంది. గురుశిష్యులు కలసి భోంచేయాలని, అధ్యయనం చేయాలని, నిగ్రహశక్తిని అలవర్చుకోవాలని, ఈశ్వరుని అనుగ్రహాన్ని పొందాలని చాటుతున్నదీ ఉపనిషత్తే.

ఇక ఆత్మ పరమాత్మల సంబంధాన్ని చక్కగా వివరిస్తున్న ఉపనిషత్తు ముండకోపనిషత్తు.

"ప్రణవో ధనుః శరోహి ఆత్మా/ బ్రహ్మ తల్లక్ష్య ముచ్యతే" (2-2-4)

పరాత్పరుడైన పరమాత్మ సాక్షాత్కారమైతే హృదయ గ్రంథి విడిపోతుందని ఈ ఉపనిషత్తు విశద పరుస్తుంది. ఈ ఉపనిషత్తులోనే ఋగ్వేదమంత్రం స్వీకరింపబడింది.

"ద్వాసుపర్ణా సయుజా సఖాయా/ సమానం వృక్షం పరిషస్వజాతే।
తయోరన్యః పిప్పలం స్వాద్వ/ త్త్యానశ్నన్న న్యోऽ భి చాక శీతి"

ఒక చెట్టు రెండు పక్షులు. ఒకటి పండును తింటుండగా, మరొకటి చూస్తూ ప్రకాశిస్తుంది. ఈ రెండు పక్షులు ప్రపంచం అనే చెట్టును ఆశ్రయించి ఉన్నాయి. వాటిలో పండు దినే పక్షి జీవుడు కాగా, చూస్తూ ప్రకాశిస్తున్నది పరమేశ్వరుడే.

సృష్టిలో జీవేశ్వరుల సంబంధాన్ని వేదాధారంగా ముండకోపనిషత్తు చక్కగా విశదం చేసింది. అందులో ఎల్లప్పుడూ కలిసి ఉంటాయని, మంచి స్నేహితులనీ, సమానంగా ప్రకృతిని ఆశ్రయించి ఉంటాయని పక్షుల పరంగా చెప్పిన మాటలు జీవేశ్వరులకు వర్తిస్తాయి.

జీవేశ్వరుల అనుబంధాన్ని శాశ్వతమైందిగా వర్ణిస్తున్న వేదవాణి మన కవశ్యం శిరోధార్యం. అందుకు ఉపనిషత్తులు ఉదాహరణగా నిలిచాయని చెప్పడంలో ఎవరికీ ఎలాంటి భేదాభిప్రాయం ఉండదు.

వ్యాఖ్యల్లో ఛందః ప్రాధాన్యం

డా॥ సంగనభట్ల నరసయ్య
చరవాణి: 9440 073 124

ప్రాచీన భారతీయ సాహిత్య నిర్మాణం సంస్కృత భాషల్లో వైదిక, లౌకిక వాఙ్మయాలుగా సుమారు 5 వేల సంవత్సరాలనుండే ఉన్నా, మనకు విద్వాంసులైన ఋషుల ప్రవచన పరంపర మూడువేల సంవత్సరాల నుండి మాత్రమే లభిస్తుంది. యోగ, వ్యాకరణ, అర్థశాస్త్రాది అంగాంగి రూపశాస్త్రాలుగా క్రీ.పూ. 3వ శతాబ్ది ఆరంభం నుండి గ్రంథరూప లభ్యమానత ఉంది. ఇది పాణిని, పతంజలి కౌటిల్యాది ఋషి పరంపరతో మొదలైంది. లేఖన సౌకర్యాల కొరత కారణంగా నాటి సాహిత్య, శాస్త్రాది విషయాలకు మౌఖికత, సంక్షిప్త సూత్రబద్ధత ప్రాణాలయ్యాయి. తత్కారణంగా గురుముఖతః బోధ, లేదా ప్రధాన శిష్యుల గురుగ్రంథ వ్యాఖ్య ఈ కాఠిన్యత నుండి శాస్త్రాది విషయాలను, పురాణాది గ్రంథ రహస్యాలను, గ్రంథ గ్రంథులను విముక్తం చేసాయి. ఈ వ్యాఖ్యాన పరంపరలో పాణిన్యాదుల శాస్త్రగ్రంథాలు ప్రప్రథమాలు. వ్యాఖ్యాన సాహిత్యానికి ప్రామాణికత వచ్చింది. క్రీ.శ. 7వ శతాబ్దిలో తొలుత ఆచార్య శంకర భగవత్పాదులు, అటు పిమ్మట తక్కిన ఆచార్యద్వయం తమ సిద్ధాంతానువర్తనంగా ప్రస్థాన త్రయానికి చేసిన వ్యాఖ్యలు పరమ ప్రమాణాలు అయినాయి. ఈ పరంపర ఆనంతరికుల చేతిలో "మూలచ్ఛేదీ తవ పాండితీ ప్రకర్షః" అనేంతగా మూలకర్త కంటే వ్యాఖ్యాతే గొప్పవాడన్నంత స్థాయికి ఎగబాకింది. అందుకే 13వ శ. వాడైన వ్యాఖ్యాతృ చక్రవర్తి మల్లినాథ సూరి "నా మూలం లిఖ్యతే కించిత్ నానపేక్షితముచ్యతే" అని ఒట్టు వేసుకోవలసి వచ్చింది.

ప్రాచీన సాహిత్యానికి వచ్చిన వ్యాఖ్యాన పరంపర త్రివిధాలుగా చెప్పవచ్చు. ఒకటి **సరళ సుబోధవ్యాఖ్య.** ఇది సామాన్యులను దృష్టిలో పెట్టుకొని రాసేది. రెండోది **విశేష వ్యాఖ్య.** మూలకర్త హృదయాన్ని ఆవిష్కరించడం కోసం విస్తృతంగా చేసే వ్యాఖ్య. ఇది ఒక్కోసారి మూలగ్రంథానికి ఐదు, ఆరు రెట్లుగా విస్తరిస్తుంది. మూడోది **పండిత వ్యాఖ్య.** ఇది పండితులను మెప్పించడానికి తన పాండిత్యం ప్రదర్శించడానికి, ఆ రంగంలో ఆ గ్రంథం చదివితే వంద గ్రంథాలు చదివినంత సమాచారం ఇచ్చేది. పాఠకుని అవసరాలను బట్టి ఈ త్రివిధత్వం సంభవించింది.

వ్యాఖ్యానంలో ఛందస్సు పరిశీలన ఎంతవరకు అవసరం అనేది ప్రస్తుతాంశం. ఛందశ్శాస్త్రం అతిప్రాచీనం. వేదాలకు ముందే ఉంది. వేదాలు అక్షరఛందస్సులైన గాయత్రి, త్రిష్టుభ్, మొ॥ వాటిలో రాయబడ్డాయంటే అవి ముందునుండే ఉన్నాయి కదా! అలాగే లౌకిక సాహిత్యంలో తొలుత కవనం చేసిన మహర్షి వాల్మీకి నోట వెలువడ్డ "మానిషాద! ప్రతిష్ఠాం..." శ్లోకరూపంగా ఛందోబద్ధంగా వెలువడినదే కదా! పైగా మహర్షే ఆశ్చర్యపోయినట్టు భవభూతి తన ఉత్తర రామచరిత నాటకంలో "పాదాక్షర సమంబద్ధం, తంత్రీలయ సమన్వితం" అంటూ సంఘటనను దృశ్యంగా మలచినాడు. దీంతో మూలకర్త హృదయాన్ని వ్యాఖ్యానించడంలో

ఛందస్సు పాత్రను కూడా స్పష్టపరుచవలసిన ఆవశ్యకత వ్యాఖ్యాత ముందుకు వచ్చింది. అంతేకాదు మంత్ర పఠనంలో సైతం "విశ్వామిత్ర ఋషిః, అనుఃష్టుప్ ఛందః" అంటూ ఋషిచ్ఛందాలను స్మరించడం ఆనవాయితి అయింది. ఏ ఛందస్సుతో ఏ బాణీలో ఆ మంత్రం మౌఖికంగా గానం చేయాలో తెలిపే విధానం ఇది.

వివిధ ఛందస్సుల వివిధమైన గమనాలు మౌఖిక పఠనంలో ఎంతగా ఉండేవో నేటికాలపు మౌనపఠనంలో అంతగా నశించాయి. వ్యాఖ్యాతలు తమ వ్యాఖ్యానంలో ఛందస్సులను పరిచయం చేయడం ఈనాడు అంతగా అవసరం లేకున్నా నాడు ఉండేది. నా ఎరుకలో భగవద్గీత సర్గసర్గకు బాణీ మారుతూ పారాయణం చేసేవారున్నారు.

అనుష్టుఃప్ ఛందం చాలా సరళంగా రాసే బాణీ. పురాణాలు అధికంగా దీంట్లోనే ఉన్నాయి. ఆశువుగా, వేగోక్తిలో రచించేటప్పుడు ఇది బాగా ఉపయోగపడుతుంది. లక్ష శ్లోక భారతం ఇందుకో ఉదాహరణ. ఛందో వైవిధ్యం పురాణాల్లో అనంతరకాల పరిణామం. అందుకే భాగవత మహాపురాణం పురాణాల్లో ఆఖరుదిగా సుమారు క్రీ.శ.7వ శతాబ్ది నాటిదిగా చెప్పవచ్చు. దీనికి వ్యాఖ్యానం రాస్తున్నప్పుడు భావ, శబ్దాదిక చర్చతో బాటు ఛందః పరిశీలనం చేసేవారు. మహాభారత వ్యాఖ్యలో ఛందః పరిశీలన అంతగా అక్కరలేదు.

క్రీ.శ.9వ శతాబ్ది వాడైన క్షేమేంద్రుడు శాస్త్రరచనకు సరళమైన అనుష్టుఃప్ ఛందాన్నే వాడమన్నాడు. నాలుగు పాదాలు, ఎనిమిది అక్షరాల ఈ ఛందం (మొ॥ 32 అక్షరాలు) అతి సరళం. యతిప్రాసల (తెలుగులోవలె) గొడవ (సంస్కృతంలో) లేదు. ఛందం విశేషం అయినప్పుడు వ్యాఖ్యానం అవసరం. ఈ వ్యాఖ్యానం రెండు రకాలు. ఒకటి ఛందోలక్షణం చెప్పడం అంటే గణ, యతి, ప్రాసాదుల వివరణ. ఉదాహరణకు అభిజ్ఞాన శాకుంతల వ్యాఖ్యలో వ్యాఖ్యాతలు తొలి శ్లోకం స్రగ్ధరా అని, ద్వితీయ శ్లోకం ఆర్యా అని చెప్పినట్లు వీటి గణాదికం కొందరు అక్కడే వివరిస్తే, మరికొందరు లక్షణాన్ని లక్షణగ్రంథాలలో చూసుకొంటారని నిశ్శబ్దంగా ఉన్నారు.

మరో విశేషం తొలి గణం కావ్యానికి శుభసూచకత్వంగా పెట్టాలనే కొన్ని విశ్వాసాలుండేవి. కావ్యం మగణాది ప్రారంభం కావాలని ఓ నియమం."ఆదౌ భూదేవతాకస్య సర్వగురోర్మగణస్య ప్రయోగాచ్ఛు భలాభ స్సూచ్యతే. తదుక్తం– 'శుభదోమోభూమిమయ' ఇతి. వకారస్యామృత భీజత్వాత్పునిచయ గమన సిద్ధిః" అని మల్లినాథసూరి రఘువంశాది కావ్యాలకు వ్యాఖ్య రాస్తూ శ్లోక వ్యాఖ్యలో అంతిమంగా ఇది చెప్పినాడు. ఛందస్సు మారేవరకు మౌనంగా ఉండి, తిరిగి కొత్త ఛందానికి తిరిగి లక్షణాదులు చెప్పేవాడు. విద్యార్థులకు శబ్దజ్ఞానంతో బాటు ఛందోజ్ఞానం కూడా అవసరమని ఆ జగద్విఖ్యాత వ్యాఖ్యాత అభిప్రాయం.

ఇక రెండో రకం ఆ ఛందస్సు ఉపయోగంతో కవి ఏమైనా రస సంబంధంగా సాధించాడా అన్నది. ఉదాహరణకు వనంలో తిరిగే మత్తేభాన్ని వర్ణించడానికి మత్తేభ విక్రీడితంలో రాయాలి అన్నది. ఈ నియమం తొలినాళ్లలో లేకున్నా తరువాత ఏదో ఔచిత్య సాధనగా చలామణి అయింది. మత్తేభ (ఏనుగు) వర్ణన ఉత్పలమాలలో రాయకూడదనే దాకా వెళ్లింది. ఈ భావనకు వ్యాఖ్యాతలూ కొంతవరకు బాధ్యులే. తెలుగు

మహాభారతానికి ఛందోరస స్వరూపాలు అనే పేరుతో పరిశోధించిన మాధవశర్మగారు తదనుగుణంగా వ్యాఖ్యానించినారు.

ఈ విధానం సర్వదా సత్యసమ్మతం కాదు. పూర్వం ఈ భావనలేదు. ఐతే కాళిదాసాదులు మందాక్రాంతాదులు ఎన్నుకొని ఒక వింత సంప్రదాయం నెలకొల్పినారు. మేఘసందేశానంతరకాలంలో సందేశకావ్యాలకు మందాక్రాంతమే శ్రేష్ఠమన్న భావన ఆ గ్రంథాల వ్యాఖ్యాతలు పండిత, సాహిత్యజ్ఞుల మనస్సులలో ముద్రించినారు.

రసానుగుణ ఛందః ప్రయోగాలు కవులు చేసారని వ్యాఖ్యాతలు రాయడం ఒక దుష్పథం అని చెప్పడానికి నేను ఓ ప్రబల సాక్ష్యం ఇస్తాను. మహాభారత గాథలో ద్రౌపది వస్త్రాపహరణ ఘట్టంలో భీముని క్రోధం పట్టలేనంత తీవ్రమైంది కదా! అతని తీవ్ర ప్రతిజ్ఞలు ఏ ఛందస్సులో రాయాలి? శార్దూల, మత్తేభాల్లో రాయాలి అని. "కురువృద్ధుల్ గురు వృద్ధ భాంధవులనేకు"లన్న పద్యంలో మత్తేభం బాగుంది. కాని ఆ భీముడే దుశ్శాసనుని వధించి దోసిళ్లతో రక్తం తాగుతానని శపథించి, తిరిగి దుర్యోధనుని చూచి "ధారుణీ రాజ్య సంపదమదంబున..." అన్న పద్యం ఉత్పలమాలలో పాడినాడు. అంటే నన్నయ మహాకవికి ఈ ఛందస్సు ఈ రసం కోసమన్న భావన లేదన్నమాట. పైన చెప్పిన వ్యాఖ్యాత ఈ ఛందానికి ఏమి వ్యాఖ్యానిస్తాడో?

కాబట్టి ఇలాంటి చోట్ల వ్యాఖ్యానాల్లో ఛందస్సు యొక్క వివరణ లక్షణానికి పరిమితం చేసి (మల్లినాథ సూరివలె) చెప్పడం ఔచిత్యవంతంగా ఉంటుంది. మిగిలిన అతిశయ వ్యాఖ్యానం 'మూలచ్ఛేదీ' అవుతుంది.

ప్రాచీనకవులకు ఆ భావన లేదనుకున్నా ఆధునిక విమర్శకులలో కల్గిన ఈ ఛందస్సు యొక్క ఔచిత్యం ఆధునిక కవులకు కూడా పాకి కొత్తపుంతలు తొక్కింది. ఈ సందర్భాలలో వ్యాఖ్యానం గనుక రాస్తే ఛందస్సుల వివరాలు చెప్పాల్సిందే. దీనికి ఒక ఉదాహరణ ఇస్తాను. ఆధునిక కాలపు మహాకావ్యం ఐన విశ్వనాథ సత్యనారాయణగారి శ్రీమద్రామాయణ కల్పవృక్షంలో ఓ ఘట్టం ఉంది. శూర్పణఖ నాస శ్రవణేంద్రియో పరిభాగ ఖండనం. ఇది జరిగి, శూర్పణఖ ఏడుస్తూ దూరంగా వెళ్లిపోతూ ఉంటుంది. ఆ ఏడ్పు ధ్వని మనకు క్రమక్రమంగా తక్కువగా వినిపిస్తూ తగ్గిపోతుంది. ఆ సందర్భంలో విశ్వనాథ పాదాక్షరాలు తగ్గిపోయే ఛందస్సులు వాడి సూచించినాడు. ఈ కావ్యాన్ని వ్యాఖ్యానిస్తే విశ్వనాథ ప్రదర్శించిన ఈ ఛందశ్చమత్కారాన్ని వ్యాఖ్యాత చూపాల్సిందే కదా! అయితే ఇవి కదాచిత్తులే.

కవి జనాశ్రయాది నామాలు నాటి ఛందశ్శాస్త్రాలు వాటికి కవిత్వంతో గల ప్రాధాన్యతను వ్యంజిస్తున్నాయి. కవికి కవిత్వం ప్రాణం. కవిత్వానికి ఛందస్సు ప్రాణం. కనుక ఛందస్సుల ముచ్చటలు లేక కావ్య వ్యాఖ్యానాలు ఉండేవి కావని సారాంశం.

వ్యాఖ్యానాల్లో సుప్రసిద్ధులైన శ్రీమాన్ కె.వి.రాఘవాచార్యుల వారిని అభినవ మల్లినాథులుగా నేను భావిస్తాను. విశేషించి విశిష్టాద్వైత సిద్ధాంత వ్యాఖ్యలో వారికి సాటి ఎవరు లేరు. విషయ పరిజ్ఞానం, బహుగ్రంథ పరిశీలనం, వివరణానుకూల వచస్సు, సాహిత్యం, ద్రావిడ వేద పరిశ్రమ, రహస్యార్థావగాహనం, అనర్ఘ శ్లోకరత్నోద్ధారణం వీటికి నిండైన రూపం రాఘవాచార్యులు.

వారిని వ్యాఖ్యానంలో ప్రమాణాల ప్రదర్శన 'విద్వజ్జనాభిమాన్యులు'గా చేస్తుంది. 'ఉభయ వేదాంతశాస్త్రసార వైశారద్యం'తో నిండిన వ్యాఖ్యానాలు వీరి లేఖిని నుండి వెలువడ్డాయి. 1) పాదుకా సహస్ర వ్యాఖ్య, 2) నారాయణ శతక, 3) యతిరాజ సప్తతి, 4) అభీతి స్తవం, 5) శ్రీ స్తవ, 6) రుక్మిణీ కళ్యాణం, 7) వేదాంత దేశికుల దయా శతకం వ్యాఖ్యలు. ఇంకా నేను చూడనివి ఉండవచ్చు.

వేదాంత దేశికుల దయాశతకంలో రాఘవాచార్యులు వ్యాఖ్యానిస్తూ స్తోత్ర కావ్యంలోని ప్రథమ దశకం అనుష్టుఃప్ ఛందోభరితం చేసారని శ్లోక ఛందంగూర్చి వివరించారు.

ఈ శ్లోకమే ఛందంగా ఆది శ్లోకంగా ఎందుకు దేశికులు తీసుకున్నారంటే ఆదికవి మహర్షి వాల్మీకి ఆది కావ్యాది శ్లోకం "మానిషాద ప్రతిష్ఠాం త్వగమ శ్శాశ్వతీస్సమాః" అనేది అనుష్టుఃప్ కనుక ఆ సంప్రదాయం పాటించారని వ్యాఖ్యానించడం వారి ఛందశ్శాస్త్ర గాఢాభినివేశ సంబంధమైన ఔచిత్య స్ఫురణంగా భావించాలి.

వ్యాఖ్యానంలో శ్లోకానికి పదవిభాగం, అన్వయం, ప్రతిపదార్థం, నామవాచక రూప నిర్ణయం, క్రియా (దశ)లకార సూచనం, విశేష నిరూపణ మొదలైనవి పూర్తి ఐనాక, ఆ పద్యంలో శ్లోకం ఏ ఛందస్సుకు చెందిందో నిరూపించడం ఓ సంప్రదాయం. ఇది వివరించడం సహజంగా గణ యతి ప్రాస లక్షణాలతో సరిపోతుంది. కాని రాఘవాచార్యులు దాని రహస్యాన్ని కూడా వివరించి వ్యాఖ్యా వైలక్షణ్యాన్ని ప్రదర్శించిన మహా వ్యాఖ్యాత.

రాఘవాచార్యులవారి వ్యాఖ్యాన ప్రతిభ

ఆచార్య రవ్వా శ్రీహరి
చరవాణి: 9959 886 020

కవితార్కిక సింహ బిరుదాంచితులు శ్రీమద్వేదాంతదేశికుల వారు సంస్కృత వాఙ్మయంలో శతాధిక గ్రంథాలను రచించి లబ్ధప్రతిష్ఠులైన మహానుభావులు. ఈ గ్రంథాలన్నీ విశిష్టాద్వైత సంప్రదాయ సిద్ధాంతాలను వివిధ ప్రక్రియల్లో ప్రతిపాదించినాయి. వీటిలో స్తోత్రాలు, కావ్యాలు మొదలైన అనేక ప్రక్రియలకు సంబంధించిన గ్రంథాలు ఉన్నాయి. వీటిలో యాదవాభ్యుదయం, సంకల్ప సూర్యోదయం, సుభాషిత నీతి, పాదుకా సహస్రం, హంస సందేశం- అనేవి పంచకావ్యాలుగా ప్రసిద్ధి చెందినాయి. వీటిలో యాదవాభ్యుదయానికీ (కొన్ని సర్గలకు), పాదుకాసహస్రానికీ వాచస్పతి, పండిత రత్న, ఉభయవేదాంత నిష్ణాతులు శ్రీమాన్ కె.వి.రాఘవాచార్య స్వామివారు చక్కని వ్యాఖ్యలను సంతరించి తెలుగు వారికి మహోపకారం చేసినారు. యాదవాభ్యుదయానికి వారు తమ 87వ ఏట శారీరక శక్తి అనుకూలించని స్థితిలో ఉంటూ కూడా ఎంతో శ్రమించి చక్కని వ్యాఖ్యను రచించినారంటే వేదాంతదేశికుల రచనలపై, సంప్రదాయంపై వారికున్న గౌరవాభిమానాలు వ్యక్తమౌతున్నాయి.

సాధారణంగా వాఙ్మయ ప్రపంచంలో కవుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. వ్యాఖ్యాతల సంఖ్య చాలా తక్కువగా ఉంటుంది. వ్యాఖ్యాత ఒక గ్రంథానికి వ్యాఖ్యానం రాయాలంటే అతనికి వాఙ్మయంలోని అన్ని శాఖలతో పరిచయమే కాదు పాండిత్యం కూడా ఉండాలి. కావ్యాల్లో వచ్చే పౌరాణికాంశాల వ్యాకర శాస్త్రాద్యంశాలు, శ్రుతి, స్మృత్యాది విషయాలు, తదితర ప్రామాణిక గ్రంథాల అధ్యయనం ఉండాలి. కనుకనే సంస్కృతంలో మల్లినాథాదులూ, తెలుగులో వేదం వెంకటరాయ శాస్త్రిగారు మొదలైనవారూ ఏ కొద్దిమంది మాత్రమే వ్యాఖ్యాతలుగా కీర్తి గడించినారు. శ్రీమాన్ రాఘవాచార్యులవారు అలాంటి క్లిష్టమైన వ్యాఖ్యాన ప్రక్రియను చేపట్టి 'యాదవాభ్యుదయం' మొదలైన గ్రంథాలకు వ్యాఖ్యానాలు రాసినారంటే అది వారి మేధాశక్తికి, సంప్రదాయ నిష్ఠకు, సాహిత్య రక్తికి తార్కాణం. ఆచార్యులవారికి వ్యాఖ్యాతకుండవలసిన సర్వశక్తులూ, సమగ్రంగా ఉన్నాయనడంలో సందేహం లేదు.

వ్యాఖ్యానంలో మూలంలోని విలక్షణపదాలకూ, కఠిన పదాలకూ అర్థం వివరించడం ఒక అంశం. కేవలం అర్థం చెప్పడమే కాక వాటికి కోశప్రామాణ్యం కూడా చూపెట్టాలి. సాధారణంగా పండితులందరూ తాము చెప్పిన అర్థానికి అమరకోశాన్నే ఎక్కువగా ప్రమాణంగా ఉదాహరిస్తుంటారు. కాని ఆచార్యులవారు ఒక్క అమరకోశం నుండే కాక వైజయంతి, విశ్వనిఘంటువు, రత్నమాల, శేషనిఘంటువు, యాదవ నిఘంటువు, అమరమాల, నానార్థ రత్నమాల, శబ్దార్ణవం, మేదిని ధనంజయ నిఘంటువు మొదలైన నిఘంటువుల నుండి ప్రమాణ వాక్యాలను ఉద్ధరించి చూపడం విశేషం. ఒక్క ఉదాహరణ గమనించండి:

"అధర్మనిష్ఠైః రధునా ధర్మ సేతు విభేదకైః
అసంఖ్యై రద్భుతై స్తుంగైః క్రమ్యే రాక్షస పర్వతైః"

భూదేవి తన బాధలను దేవతలకు విన్నవించుకునే సందర్భంలోనిది ఈ శ్లోకం. ఇందులో "అసంఖ్యైః రాక్షస పర్వతైః క్రమ్యే అనేది ప్రధాన వాక్యం. రాక్షసపర్వతైః అనే పదానికి విశేషణమైన 'అసంఖ్యైః' అనే పదానికి లెక్కపెట్టలేనన్ని అన్నీ, యుద్ధ రహితమైనవి (ఢీ కొనేవారు లేనివి) అని రెండర్థాలు పేర్కొని వీటికి "ఏకత్వాదౌ విచారే చ సంఖ్యా సంఖ్యం తు సంయుగే" అని రత్నమాలాకోశాన్ని ప్రమాణంగా చూపడం విశేషం.

వసుదేవుని గుణగణాలను వర్ణించే సందర్భంలో "యదృచ్ఛాగతమైశ్వర్యమానృణ్య రుచిర స్వభూత్" - (1-34) (ఋణ పడకపోవడంపై ఆసక్తి కలవాడై అప్రయత్నంగా వచ్చిన సంపదను అనుభవించినాడు) అని చెప్పబడింది. ఇట ఆనృణ్యమనే దాన్ని ఆచార్యులవారు "జాయమానో వై బ్రాహ్మణస్త్రిభీ ఋణవాన్ జాయతే, బ్రహ్మచర్యేణ ఋషిభ్యః, యజ్ఞేన దేవేభ్యః, ప్రజాయా పితృభ్యః- ఏష వా అనృణః" అని శ్రుతి ప్రమాణాన్ని ఉద్ధరించి ప్రతిమనుజుణ్ణీ బంధించే ఋషి ఋణం, దేవవర్ణం, పితౄణం అనే ఋణాలనూ, వీటిలో ఋషి ఋణం బ్రహ్మచర్యంచేత, దేవఋణం యజ్ఞాలచేతా, పితౄణం సంతానం చేతా తీరుతాయని సప్రమాణంగా నిరూపించినారు.

వీరు తమ వ్యాఖ్యానంలో విలక్షణ పదాలను కూడా వ్యాకరణ శాస్త్ర రీత్యా చర్చించి వాటి సాధుత్వాన్ని నిరూపించడం కనిపిస్తుంది. దేవకీ శబ్దానికి దేవకుని కుమార్తె అని వ్యుత్పత్తి. (దేవకస్య అపత్యం స్త్రీ) ఐతే ఈ అర్థంలో దేవక శబ్దంపై అణ్‌ప్రత్యయమూ, స్త్రీత్వార్థంలో జీప్ ప్రత్యయమూ, ఆదివృద్ధీ వచ్చి 'దైవకీ' అనే రూపం ఏర్పడాలి. ఆత్రేయుడు కూడా దేవకస్య అపత్యం స్త్రీ దైవకీ అని వృద్ధి లేని పదమే (దేవకీ) ప్రసిద్ధమని వివరించినారు. పదసాధుత్వా సాధుత్వ విచారణలో ఆచార్యులవారి వ్యాకరణ వైదుష్యం స్పష్టమౌతుంది.

ఇట్లే స్థేయా (1-50) అనే శబ్దం స్థిరశబ్దం నుండి ఏర్పడ్డ విధానమూ, భూమ్నా (2-1) అనే శబ్దం బహు శబ్దం నుండి ఏర్పడ్డ విధానమూ- ఇలా ఎన్నో చోట్ల తమ వ్యాకరణ వైదుష్యంతో పాఠకుల సందేహాలను తీరుస్తారు.

మనకు కొన్ని శబ్దాలకు స్థూలంగా మాత్రమే అర్థాలు తెలుస్తాయి. కాని వాటి నిర్దుష్టమైన, శాస్త్రీయమైన అర్థాలు తెలియవు. పైపై అర్థాలతోనే సంతృప్తి పడిపోతాం. వ్యాఖ్యాకారుడు అట్టి పదాల శాస్త్రీయమైన, సలక్షణమైన అర్థాలను తెలియజేస్తూ పఠితలకు వ్యుత్పత్తిని కలిగిస్తాడు.

యదుమహారాజు పాత్రుడైనవానికే దానం చేసేవాడని ఆయన దానవిధానాన్ని చెప్పే సందర్భంలో పాత్రుడంటే ఎవరో? పాత్ర శబ్దానికి విశేషార్థమేమిటో ఆచార్యుల వారిలా ప్రమాణపూర్వకంగా వివరిస్తారు.

"న విద్యయా కేవలయా తపసా వాపి పాత్రతా
హాస్య వృత్తమిమే చోభే తద్ధి పాత్రం ప్రచక్షతే" (1-12)

వ్యాఖ్య: కేవలం ఒక్క విద్యచేత గానీ లేదా ఒక్క తపస్సు చేతగానీ పాత్రత- యోగ్యత ఏర్పడదు. జ్ఞానం, అనుష్ఠానం (ఆచారం) ఈ రెండూ కలిగి ప్రవర్తించే వ్యక్తికే పాత్ర శబ్దం చెల్లుతుందని దీని భావం.

విష్ణుమూర్తి లోకరక్షణమనే గొప్ప భారాన్ని ధర్మశీలురపై ఉంచినాడని భూదేవి బ్రహ్మాది దేవతలతో చెపుతుంది. (1-38) ఇట ఆచార్యులవారు లోకరక్షణ భారం వహించే ధర్మశీలురెవరెవరో ఇలా ప్రమాణపూర్వకంగా వివరిస్తారు-

"గోభిర్విప్రైశ్చ వేదైశ్చ సతీభిః సత్యవాదిభిః
దాతృభిర్ధర్మ శీలైశ్చ సప్తభిర్ధార్యతే మహీ" (భాగం1, పుట 84)

గోవులు, బ్రాహ్మణులు, వేదాలు, పతివ్రతలు, సత్యవచస్కులు, దానశీలురు, ధర్మశీలురు- ఈ ఏడుగురు లోకరక్షణ భారాన్ని వహిస్తారని దీని భావం.

ఈ విధంగా జిజ్ఞాసువులకు విశేషణాలను తెలుపుతూ ఆచార్యులవారు వ్యాఖ్య సాగించడం వారి పాండిత్య ప్రకర్షకు నిదర్శనం.

"త్రివేదీ మధ్యదీప్తాయ త్రిధామ్నే పంచహేతయే
వరదాయ నమస్తుభ్యం బ్రాహ్యాంతర హవిర్భుజే" (1-పుట 87)

బ్రహ్మాది దేవతలు వేదవేద్యుడైన నారాయణుణ్ణి స్తుతిస్తున్న శ్లోకం ఇది. ఇందులో నారాయణుడు పంచాయుధుడుగాను, త్రిధాముడుగాను స్తుతింపబడ్డాడు. నారాయణుని పంచాయుధాలేవో, త్రిధామయులేవో వివరించడం జిజ్ఞాసువులకెంతో ఉపకరిస్తుంది. శంఖం, చక్రం, గద, ఖడ్గం, శార్ఙ్గం అనే ధనుస్సు- ఇవి నారాయణుని పంచాయుధాలు. త్రిధాముడంటే మూడుచోట్ల నివసించేవాడు. విష్ణుమూర్తి నివసించే ఆ మూడు చోట్లు క్షీర సముద్రం, సూర్యమండలం, వైకుంఠం అని వివరిస్తూ ఈ శ్లోకంలోని త్రిధాముడన్న పేరు విష్ణుమూర్తికే కాక అగ్నిహోత్రునికి కూడా వర్తిస్తుందని వ్యాఖ్యానిస్తూ ఆచార్యులవారు హేతిశబ్దం ఆయుధానికే కాక అగ్నిజ్వాలకు కూడా వర్తిస్తుందనీ, పంచాయుధుడు భగవానుడైతే అగ్ని సప్తార్చి అనీ వివరించినారు. అగ్నికి సప్తజిహ్వుడనే పేరు కూడా ఉంది. ఆ సప్తజిహ్వ లేవో జిజ్ఞాసువులకు సప్రమాణంగా తెలియజేస్తారు-

"కాళీ కరాళీ చ మనోజవా చ సులోహితా యా చ సుధూమ్ర వర్ణా
స్ఫులింగినీ విశ్వరూపీ చదేవీ లేలాయమానా ఇతి సప్త జిహ్వాః"

అనే శ్లోకానుసారం కాళి, కరాళి, మనోజవ, సులోహిత, ధూమ్రవర్ణ, స్ఫులింగిని, విశ్వరూపి అగ్నిదేవుని యొక్క ఏడు జిహ్వాలని పేర్కొంటారు. ఇట్లే దక్షస్మృతిలోని-

"హిరణ్యా కనకా రక్తా కృష్ణాదైవాథ సుప్రభా
అతిరిక్తా బహురూపా చ సప్తజిహ్వాః ప్రకీర్తితాః"

అనే శ్లోకంలో పేర్కొన్న సప్తజిహ్వాల పేర్లను కూడా పేర్కొంటారు. ఇది వ్యాఖ్యాతకు గల బహుగ్రంథ పరిజ్ఞానాన్ని వ్యక్తం చేస్తుంది.

"దురితోదన్వదావర్తే ఘూర్ణమానస్య దుఃఖ్యతః"- (1-107) అనే శ్లోకంలో 'దుఃఖ్యతః' అనేది విలక్షణమైన పదం. వినగానే ఇది అసాధుశబ్దమేమో అని సందేహం కలుగుతుంది. ఆచార్యులవారు దుఃఖ శబ్దానికి కండ్వాదులయందు పఠింపబడటంవల్ల యక్ప్రత్యయం చేరి 'దుఃఖ్యత్' అనే రూపం ఏర్పడిందనీ, దుఃఖ్యత్ శబ్దము యొక్క షష్ఠ్యేక వచన రూపమే దుఃఖ్యతః' అని ఇందులోని వ్యాకరణ మర్మాన్ని మన సందేహాన్ని తీరుస్తారు.

"ఏతస్మిన్నంతరే దేవీ మేరుమధ్యముపేయుషః
ప్రజాపతిముఖాన్ దేవాన్ ప్రాహ సాగరమేఖలా" (1-పుట 37)

అనే శ్లోకంలో 'దేవాన్ ప్రాహ' అనే ప్రయోగం ఉంది. ఇటు 'ప్రాహ' అనే దానికి పలికెను అని భూతార్థం చెప్పుకోవాలి. కాని 'ఆహ' అనేది బ్రూఞ్ ధాతువు లట్ రూపం కనుక దానికి భూతార్థం రావాలంటే 'స్మ' అనే పదాన్ని చేర్చవలసి ఉంటుంది కదా! అనే సందేహాన్ని లేవనెత్తి 'ప్రాహ' అనేది బ్రూఞ్ ధాతువు లట్ రూపం కాదని అది విభక్తి ప్రతిరూపకమైన అవ్యయమని శాకటాయనుని అభిప్రాయాన్ని ఉద్ధరించి ఇది 'కుగతిప్రాదయః' అనే సూత్రం చేత సమాసం వచ్చిన రూపమని ప్రతిపాదించడం ఆచార్యుల వారి వ్యాకరణ శాస్త్ర శేముషికి నిదర్శనం.

పూతన సంహార సందర్భంలోని శ్లోకం (47)లో "గతాసుమైక్షంత నిశాచరం తా భీమాకృతిం భైమరథీమివాన్యామ్" అని ఉంది. 'చనిపోతూ ఉన్న భయంకరాకృతి గల ఆ పూతనను మరో భీమరథినివలె చూచినారు' అని దీని తాత్పర్యం. ఐతే ఇట 'భీమరథి' అంటే ఏమిటో తెలియాలి. ఇది వ్యాఖ్యాన సాపేక్ష పదం కనుకనే ఆచార్యులవారు భీమరథి అంటే ఏమిటో ప్రమాణం చూపుతూ ఇలా వివరిస్తారు-

"సప్తత్యాః సప్తమే వర్షే సప్తమే మాసి సప్తమీ
రాత్రిర్భీమరథీ నామ సర్వప్రాణభయంకరీ"

77వ వయస్సులో 7వ నెలలో 7వ నాటి రాత్రికి 'భీమరథి' అని పేరు. అది ప్రాణాపాయాన్ని కలిగించే రాత్రి. కనుక రాత్రించరి యైన పూతన కళేబరాన్ని చూచి గండం (ప్రాణాపాయం) కలిగించడానికి వచ్చిన అపరభీమరథి అని ఆ భీరులు భావించినారట. ఈ వివరణం ఆచార్యులవారి వ్యాఖ్యాతృ మహిమను వ్యక్తం చేస్తుంది.

ఆచార్యులవారు అలంకార శాస్త్రంలోనూ గొప్ప పండితులు. కనుక అనేక సందర్భాల్లో కేవలం అలంకారాలను పేర్కొనడమే కాక అవసరమైన చోట్ల శాస్త్రీయమైన వివరణ కూడా చేసినారు.

ఆయా సందర్భాల్లో బ్రహ్మసూత్రాలు, వేదాలు, ఉపనిషత్తులు, తిరువాయిమొళి, భగవద్గీత, వివిధ పురాణాలు- ఇలా ఎన్నెన్నో గ్రంథాలను ఉద్ధరిస్తూ విషయ నిరూపణ చేయడం పండితైక సాధ్యం.

అనేక శాస్త్రాల్లో పారంగతులైనవారు కనుకనే ఆచార్యులవారు వేదాంత దేశికులవారు అనుగ్రహించిన యాదవాభ్యుదయ మహాకావ్యానికి తెలుగులో చక్కని వ్యాఖ్యను సంతరించి తెలుగులోకాన్ని అనుగ్రహించి నందుకు వారు తెలుగు వారందరికీ చిరస్మరణీయులుగా ఉంటారు.

ఆచార్యులవారి వ్యక్తిత్వం గురించి ఒక్కమాట. సంస్కృతాంధ్రాల్లో అపారమైన పాండిత్యం కలిగి ఉన్నా దాన్ని ప్రదర్శించుకొని కీర్తి ప్రతిష్ఠలు, పదవులు సంపాదించుకోవాలన్న ఆశ వారిలో లేశమైనా కనిపించదు. సద్గ్రంథాలను లోకానికి అందివ్వాలన్న తపన ఒక్కటే వారిలో కనిపిస్తుంది. జీవితమంతా సాహిత్య, శాస్త్ర, సంప్రదాయ విషయాల కోసమే శ్రమించిన విశిష్ట వ్యక్తిత్వం వారిది.

చివరగా ఒక విషయం మనవి చేసి వ్యాసం ముగిస్తాను. అది వారి పరిచయ భాగ్యం గురించి. ఆచార్యులవారి వలె నేను కూడా మొదట ఉన్నత పాఠశాలలో తెలుగు పండితునిగా పనిచేసేవాణ్ణి. 1966లో ఇద్దరమూ ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలలో ప్రైవేటు అభ్యర్థులంగా ఏం.ఏ. (సంస్కృతం) పరీక్ష రాసినాము. అప్పుడే వారితో నాకు ప్రథమంగా పరిచయమేర్పడింది. తరువాత వారితో నాకు అంతగా సంబంధం లేకపోయినా వారికి నా మీద ఎంతో అభిమానం, ప్రేమ అందరితో నా గురించి మంచిమాటలు చెప్పేవారు. వారితో పరిచయ భాగ్యం కలగడం వారి ఆశీస్సులు నాకు లభించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నాను.

"శ్రీమద్వైష్ణ దేశికేంద్ర ధిషణా వైశిష్ట్య విస్ఫోరకం
శ్రీమద్యాదవ, పాదుకా, యతి, దయాగ్రంథాది వ్యాఖ్యాకృతమ్
కాలక్షేప విధీన్ విధాయ జనతా సంస్కార సందీపకం
శ్రీ మద్వేంకట రాఘవార్య విబుధం ప్రజ్ఞానిధిం సంస్తుతే"

వ్యాఖ్యాతృ శిరోమణి

ఆచార్య ఎస్వీ రామారావు

చరవాణి: 9848 012 053

భారతీయ సాహిత్యంలో అత్యంత ప్రముఖమైన ప్రక్రియ వ్యాఖ్యానం. ఇది కవిహృదయ ప్రకాశానికీ, కావ్యతత్త్వ వివేచనకూ ముఖ్యమైన సాధనం. భగవద్గీతకు త్రిమతాచార్యులు కూర్చిన భాష్యత్రయం, కాళిదాసాది కవుల కావ్యాలకు మల్లినాథ సూరి సంతరించిన 'సంజీవనీ' వ్యాఖ్యలు జగత్ప్రసిద్ధం. అటువంటి విశిష్ట ప్రక్రియను చేబట్టి ప్రతిభా దీధితులు వెదజల్లిన విద్వన్మనీషి శ్రీమాన్ కె.వి.రాఘవాచార్యులుగారు.

భక్త కవులకు, పండిత ప్రకాండులకు ఆలవాలమైన సుక్షేత్రంలోని (కరీంనగరు జిల్లా నారాయణపురం) పండిత కుటుంబంలో జన్మించిన (1929 జనవరి 22) రాఘవాచార్యులు తమ తండ్రివద్ద దివ్య ప్రబంధాలను అధ్యయనం చేసి ఆధ్యాత్మిక స్ఫూర్తితో ముందుకు సాగినారు.

విశిష్టాద్వైత సాహిత్యధారను గ్రహించి ఆర్ష విద్యావేత్తగా రూపొందిన రాఘవాచార్యులు పండితైక వేద్యమైన వ్యాఖ్యాన ప్రక్రియను ఎన్నుకొని పుంఖాను పుంఖంగా వ్యాఖ్యాన పరంపరను కురిపించారు. అయితే ఆయన వ్యాఖ్యాన రచనలు పదవీ విరమణ దశ తర్వాతనే ప్రచురితమైనాయి. మాఘకావ్య వైభవం (యువభారతి ప్రచురణ) మొదలుకొని వ్యాఖ్యాన కృతులు ఆయన అమృత లేఖిని నుంచి వెలువడినాయి.

"నిగమాంత దేశికుల గ్రంథాలకు ఒక ప్రహతమైన వ్యాఖ్యాన మార్గాన్ని వేసుకొని ముందుకు సాగుతున్న దేవరవారి లేఖినికి వార్ధక్యం అడ్డు కాదు. అది నిత్యయవ్వనోత్సాహంతో ముందుకు సాగటం మాకు చాలా ఆనందం కలిగిస్తున్నది" అంటూ మంగళాశాసనం చేసిన శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారు "కవితార్కిక సింహాన్ని మీ వ్యాఖ్యాన కరస్పర్శచే ముద్దుగా దువ్వి స్వాధీన పరచుకొన్న మీరు ధన్యజీవులు" అని ఆచార్యులవారి వ్యాఖ్యాన ప్రతిభను కొనియాడారు.

శ్రీ భగవద్రామానుజులు ప్రవచించిన విశిష్టాద్వైత సిద్ధాంత ప్రతిష్ఠాపకులలో శ్రీమద్వేదాంత దేశికులది తలమానికమైన స్థానం. వారి స్తోత్ర రత్నాలు కవితా రసపూరితములే కాదు ఆత్మోద్ధారణ సాధకాలుగా లోకోపకారములైనాయి. "మాఘే మేఘే గతం వయః" అని మల్లినాథ సూరి పేర్కొన్న విధంగా "యతి ప్రవర భారతీ రసభరేణ నీతం వయః" అని భగవద్రామానుజుల సూక్తి రసాస్వాదనంలోనే వయసు గడిచిందని ఉగ్గడించిన మహానుభావులు వేదాంత దేశికులు.

స్తోత్ర రత్నాలు సంస్కృత భాషలో ఉండటం వల్ల వాటిలోని గహనమైన తాత్త్వికాంశాలను, భక్తి భావాలను తేట తెలుగులో సరళసుందర శైలిలో తెలుగు పాఠకులకు అందించాలన్న పవిత్ర కార్యానికి రాఘవాచార్యులుగారు సంకల్పించటం అభినందనీయం. సౌలభ్యం కోసం కొన్నిచోట్ల మూలగ్రంథాల సంస్కృత

వ్యాఖ్యానాలు జోడించటం కూడా ప్రశంసనీయం. అర్థం, తాత్పర్యం, వ్యాఖ్యానం వారు అవలంబించిన వ్యాఖ్యా విధానం. టీకా తాత్పర్యాలను సరళతరంగా వివరిస్తూ, మూలంలో నిక్షిప్తమైన అంతరార్థాలను, వేదాంత విషయాలను విపులంగా శాస్త్ర ప్రమాణాలతో తమ వ్యాఖ్యానం ద్వారా పాఠకులకు అందించారు. స్తోత్రాలలోని శబ్ద ప్రయోగ సారస్యాన్ని, విశిష్టాద్వైత సంప్రదాయాలను ప్రసన్నమైన రీతిలో విశదీకరిస్తూ భక్తి ప్రపత్తి సంబంధమైన అంశాలను హృద్యంగా వ్యాఖ్యానించారు. వివిధ శాస్త్రాలతోనూ, దార్శనిక సంప్రదాయాలతోనూ ఆచార్యులవారికి గల గాఢమైన పరిచయానికి ఈ వ్యాఖ్యానాలు ప్రత్యక్షర సాక్ష్యాలు. "కె.వి.రాఘవాచార్యుల వారు తమ వ్యాఖ్యాతృ చక్రవర్తిత్వాన్ని వారు రచించిన అనేక విస్తృత వ్యాఖ్యల ద్వారా నిరూపించుకున్నారు" అన్న మహా మహోపాధ్యాయ ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడి వాక్కులు అక్షర సత్యాలు.

శ్రీమాన్ రాఘవాచార్యుల రచనల్లో అధిక శాతం కవితార్కిక సింహం వేదాంత దేశికుల స్తోత్రాలకు వ్యాఖ్యానాలే. గోదాస్తుతి, శ్రీస్తుతి, అభీతిస్తవమ్, అచ్యుత శతకం మొదలైనవి ఎన్నైనా ఉదాహరింప వచ్చును. "దేశికుల తలపుల నాడిని, పలుకుల వాడిని పట్టి చూచిన పరమ భావుకులు వారు" అని ఉభయ వేదాంత శ్రీ టి.పి.రామచంద్రాచార్యస్వామి ఉగ్గడింపు. నిగూఢమైన వేదాంత విషయాలు గర్భితమైన దేశికుల పాదుకా సహస్రానికి 5 సంపుటాలలో ప్రామాణికమైన వ్యాఖ్యను రచించారు.

అయితే అద్వైత మత స్థాపకులైన జగద్గురు శంకర భగవత్పాదుల 'శ్రీవిష్ణు పాదాది కేశాంత స్తోత్రమ్'కు సమకూర్చిన శ్రీరంజనీ వ్యాఖ్య, రాఘవాచార్యులుగారి వ్యాఖ్యాన రచసలలో విలక్షణమైనదిగా పేర్కొన దగినది. మానవుల శరీర సౌందర్యాన్ని ముఖాది పాదపర్యంతం గల అవయవ వర్ణనతో వర్ణించాలని, దేవతల విషయంలో పాదాది కేశాంతం వరకూ అవయవ వర్ణన చేయాలి అన్న ప్రసిద్ధ కవి సమయాన్ని పాటించి శ్రీ శంకరులు శ్రీ మహావిష్ణువు స్వరూపాన్ని అభివర్ణించారు. శబ్ద మాధుర్యం, అర్థ గాంభీర్యాలను సంతరించుకొన్న 52 స్రగ్ధరల మాలికయైన ఈ స్తోత్రం శంకరాచార్యుల కృతుల్లో విశిష్టమైనది.

"సత్యపి భేదా పగమే నాథ తవాహం నమామకీన స్త్వం
సాముద్రోహి తరఙ్గః క్వచన సముద్రోన తారఙ్గః"

(ఓ మహావిష్ణూ! మన కిద్దరికీ భేదం లేకపోయినా- నేను నీ వాడను, కాని నీవు నా వాడవు కాదు. "సముద్రం యొక్క తరంగం" అంటారు కాని "తరంగం యొక్క సముద్రం" అని అనరు కదా!) అని 'షట్పదీ స్తోత్రం'లో శంకరులు ఉగ్గడించారు.

'శ్రీ విష్ణు పాదాది కేశాంత స్తోత్రమ్'లో అంతర్నిగూఢంగా ఉన్న విష్ణు తత్త్వాన్ని వ్యాఖ్యానించటంలో రాఘవాచార్యులు అమేయమైన ప్రతిభను కనబరచారు. శ్రుతి స్మృతి పురాణేతిహాసాల యందుగల పాండిత్యాను భవంతో శ్రీశంకరుల వాక్యాలను సప్రమాణంగా వివేచించారు. "లక్ష్మీభర్తుర్భుజాగ్రే కృతవసతి" అన్న మొదటి శ్లోకానికి చేసిన పదిపుటల వ్యాఖ్యానమే అందుకు నిదర్శనం. లక్ష్మీపతియొక్క కరాగ్రమందు స్థిరంగా ఉండే పాంచజన్యం అనే శంఖరాజం మనలను కాపాడు గాక అని తాత్పర్యం తెలుపుతూ శ్రీరంజనీ వ్యాఖ్యలో ఆచార్యులు ఇలా వ్యాఖ్యానించారు: "లక్ష్మీ అనేది మంగళదేవతా వాచకం. కావ్యాది శ్లోకం లక్ష్మీ శబ్దంతో

ఉపక్రమింపబడినది. కాబట్టి కవికి, వ్యాఖ్యాతకు, చదివే వారికి, విన్నవారికి కూడా అనిష్ట నివృత్తినీ, ఇష్ట ప్రాప్తినీ కలిగిస్తూ సమస్త మంగళాస్పద మవుతున్నది” (పు-22).

ఆచార్యులవారు తమ వ్యాఖ్యా రచనలకు పెట్టిన శీర్షికలే (పరిమళ, హిరణ్మయీ, చంద్రికా, సుబోధినీ, వైష్ణవీ, శ్రేయసీ, బుధరంజనీ, మనోరమా, రమణీయ, సుషమా, రాఘవీయ, ప్రకాశికా, జ్వాలా, దీపికా, సంజీవనీ, జోతిష్మతీ, సర్వంకషా, జ్యోతిర్మయీ, శ్రీరంజనీ, అమృతాస్వాదినీ వ్యాఖ్యలు) సార్థకములై వారి వ్యాఖ్యాతృ వైభవాన్ని చాటుతాయి.

“వీరు నిత్య సాహిత్య క్షేత్ర కృషీవలులు. ఆకలిగొన్న వానికి చేసే అన్నదానం సార్థకం అవుతుంది. ఒక సత్రం కట్టి నిత్యాన్నదానం ఏర్పాటు చేస్తే ఎంతోమంది ఆర్తులు తమ ఆకలి తీర్చుకొని తృప్తిపడతారు. అట్లా ఉపకరించే సత్రం వంటిదే శ్రీ రాఘవాచార్యులవారి నిరంతర గ్రంథరచనా మహోద్యమం” అన్న మహామహోపాధ్యాయ డా॥ నల్లాన్ చక్రవర్తుల రఘునాథాచార్యుల ప్రశంసతో స్వస్తి పలుకుతూ, తమ 87వ ఏట పరమపదము చేరిన (2016 ఆగస్ట్ 5) రాఘవాచార్యులు, వ్యాఖ్యాతృ శిరోమణిగా తెలుగు సాహిత్య రంగంలో కలకాలం నిలచివుంటారు.

వేదాల ఆవశ్యకత

డా॥ మట్టి కృష్ణారెడ్డి
చరవాణి: 9441 200 322

'వేద'శబ్ద పరిచయం: 'వేదయతీతి వేదః' తెలియజేసేది అని, 'వేదయతి యతో ధర్మాధర్మ ఇతి వేదః ' ధర్మాధర్మాలను తెలిజేసేదని అర్థం. 'విదంత్యనేన ధర్మానితి వేదః' దీని వలన ధర్మార్థాదులు తెలియబడతాయి కాబట్టి ఇది వేదం. 'విద్యన్తే ధర్మాదయః పురుషార్థాః యైః తే వేదాః' దేని వలన ధర్మాది పురుషార్థాలు తెలియబడతాయో అది వేదం. 'అపౌరుషేయం వాక్యం వేదః' అపౌరుషేయమైన వాక్యం వేదం. 'ఇష్టప్రాప్తి అనిష్టపరిహారయోః అలౌకికం ఉపాయం యః గ్రంథః వేదయతి సవేదః' అభీష్టఫలాలను అందుకోవడం కోసం, అనిష్ట ఫలాలను నిరోధించడం కోసం వేదమే పరమోపాయం.

ప్రత్యేక్షేణానుమిత్యే వా యస్తూపాయో న విద్యతే।
ఏవం విదంతి వేదేన తస్మాత్ వేదస్య వేదతా॥

అంటే ప్రత్యక్షంగా చూచి కాని, అనుమానం చేత ఊహించిగాని గ్రహింపలేని విషయాలను వేదవిజ్ఞానం చేత గ్రహించడానికి వీలవుతుందని, ప్రత్యక్షానుమాన ప్రమాణాలచే తెలియని విషయాన్ని తెల్పేది కావున దీన్ని వేదమన్నారు. ఇది ఎవరిచే రచింపబడినది కాదు కాబట్టి అపౌరుషేయమన్నారు. ఒకరి నుండి వేరొకరికి వినికిడి ద్వారా అనగా ఆనుశ్రావికంగా పరంపరగా, ఒకతరం నుండి మరొక తరానికి సంగమిస్తున్నది కావు. దీన్ని శ్రుతి అన్నారు. ఇది సమస్త సృష్టికి కారణభూతమైన వాక్కు.

"వేదాలు అపౌరుషేయాలు" అనే విషయంలో అనేక భిన్నాభిప్రాయాలున్నాయి. వీనినెవరూ వ్రాయక పోయినా లౌకికదృష్టితో స్వదేశీయులు, విదేశీయులు ఎంతోమంది పరిశోధనలు చేసి వేదకాలాన్ని తెలుప జూపారు. కాని సాధ్యపడలేదు. మహర్షి స్వామి దయానంద సరస్వతి తన ఋగ్వేదాది భాష్యభూమికలో ప్రమాణాలతో "వేదం అపౌరుషేయమని కాలాతీతమైనద"ని నిరూపించారు. స్మృతికారులు (అంటే మనుస్మృతి, పరాశర స్మృతి మొదలైన వాటిని రచించినవారు) "వేదానికి కర్త లేదు" అనే విషయాన్ని ఘంటాపథంగా అనేక ప్రమాణాలతో ప్రకటించారు.

"న కశ్చిద్ వేదకర్తా చ వేదం శృత్వా చతుర్ముఖః।
తథైవ ధర్మాన్ స్మరతి మనుః కల్పాన్తరేఽన్తరే॥"

అని పరాశరస్మృతి చెబుతున్నది. ఈ సందర్భంలో పరాశరస్మృతికి వ్యాఖ్యానంగా వచ్చిన "పరాశరమాధవీయ వ్యాఖ్య" ఇలా చెబుతుంది:

"... వేదకర్తృత్వం ఆశంక్య నిరాచష్టే- న కశ్చిదితి. న తావత్ వేదవ్యాసో వేదకర్తా. విభాగమాత్ర కారిత్వాత్, నాపి చతుర్ముఖః ఈశ్వరేణ చతుర్ముఖాయ వేదప్రదానాత్. నాపి జగదీశ్వరః తస్య వేదాభివ్యంజకత్వాత్".

అంటే వేదానికి కర్తలేదు. వేదవ్యాసుడు వేదాన్ని విభజించినవాడే కాని వేదానికి కర్తకాదు. బ్రహ్మకూడ వేదకర్త కాదు, ఈశ్వరుని వద్దనుండి అతడు వేదాలను గ్రహించడం చేత. అలాగని ఈశ్వరుడూ వేదకర్త కాదు. అతడు కేవలం వేద అభివ్యంజకుడు మాత్రమే (అభివ్యంజకుడంటే ప్రకటించేవాడు అని అర్థం).

అలాగే "యో బ్రహ్మాణం విదధాతి పూర్వం యో వై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై" అని శ్వేతాశ్వతరోపనిషత్తు (6-18) తెలియజేస్తుంది.

అందుచేత, ఈశ్వరాదులే వేదాలకు కర్తలు కారంటే అల్పజ్ఞులగు మానవులు కర్తలు కాజాలరని వేరే చెప్పనక్కర్లేదు కదా!

"వేదం" నిత్యమని సర్వశాస్త్రాల శాసనం. అది పరమేశ్వరునిచేత ప్రసాదింపబడినదని ఐతిహ్యం. "తస్య మహతో భూతస్య నిఃశ్వసిత మేతత్ ఋగ్వేదో యజుర్వేదః సామవేదోఽథర్వాంగిరసః" మొదలైన వచనాలు- వేదాలు పరమేశ్వరుని నిశ్వాసములు- ఊర్పులుగా వెలువడినాయని చెప్తున్నాయి. 'ఊర్పులు' అనడం చేత స్వభావసిద్ధాలే కాని ప్రయత్నజన్యములు కావని తెలుస్తున్నది. ఆ విధంగా 'అపౌరుషం'గా శబ్దరాశి అయినట్టి వేదం- "శ్రుతిః, అనుశ్రవః, ఆమ్నాయః, స్వాధ్యాయః, త్రయీ" మొదలైన అనేక నామాలతో తనను తాను వ్యవహరించుకొన్నది. వేదాలు, పురాణాలు పరిశీలిస్తే గాని వీటికి గల సంప్రదాయానుగతమైన అర్థం మనకు అవగతం కాదు. సూక్ష్మంగా పరిశీలించేకొద్ది వేదం "అపౌరుషేయం, సనాతనం, స్వతః ప్రమాణం, క్రాంతదర్శి, తపఃసమాధి గోచరం, అనాది నిధనం, స్వయం జాతం, బ్రహ్మతత్త్వావబోధకం, పురుషార్థ సాధకం, గురుశిష్య పరంపరాప్రాప్తం" అని స్పష్టపడుతుంది. ఇట్టి శ్రుతికి గల నామాలలో "వేదః " అనేది అత్యంత ప్రసిద్ధం.

యజ్ఞాల్లో నాలుగు విధాల ఋత్విక్కులుంటారు. 1) హోత, 2) అధ్వర్యుడు, 3) ఉద్గాత, 4) బ్రహ్మ. ఇందు 'హోత' ఆహ్వానకర్త. యజ్ఞసమయంలో దేవతా ప్రశంసతో కూడిన వేదమంత్రాలను ఉచ్చరిస్తూ దేవతలను ఆహ్వానిస్తాడు. ఈ మంత్రాలను 'ఋక్కు'లంటారు. ఈ మంత్రాల సమూహమే ఋగ్వేదం. విధివిధానంగా అధ్వరాన్ని నడిపించేవాడు అధ్వర్యుడు. అతడు చదివేది యజుర్వేదమంత్రాలు. 'ఉద్గాత' అంటే ఉచ్చస్వరంతో గానం చేసేవాడు. స్వరబద్ధంగాను, ఉచ్చస్థాయిలోను గానం చేయబడే మంత్రాల సమూహమే సామవేదం. ఇక నాల్గవ ఋత్విక్కు అయిన బ్రహ్మ సర్వవిధమంత్రాలు తెలిసినవాడు. యజ్ఞాన్ని పరిసమాప్తి చేసేవాడు అతడే. బ్రహ్మ చదివే మంత్రాలు బ్రహ్మవేదం అయ్యాయి. అదే అధర్వవేదం. ఈ విధంగా ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వవేదం అని వేదం నాగులు విధాలు.

ఋషి, దేవత, ఛందస్సు, స్వరాల పరిచయం

ప్రతి మంత్రానికి "ఋషి, దేవత, ఛందస్సు, స్వరము" అను నాలుగు అంగాలుంటాయి. ఈ చతురంగ బలమనునది ఉండుటచేతనే నాటినుండి నేటివరకు అవి చెక్కుచెదరకుండా ఉన్నవి. ఇవి లేకుంటే ఏనాడో వాటిలో మార్పులు చేర్పులు జరిగి ఉండేవి.

'మంత్రం' అంటే...? :

"మత్రి గుప్తపరిభాషణే" "మన ధ్యానే" అను ధాతువుల వలన "మంత్రం" అను శబ్దం ఏర్పడుతుంది. "మన్యంతే జ్ఞాయంతే సర్వాః సత్యవిద్యాః యైః తే మంత్రాః" "దేని ద్వారా సర్వవిద్యలు తెలియజేయబడతాయో అది మంత్రం" అని వ్యుత్పత్తి. "మననాత్ మంత్రః" (నిరుక్తః 7) మననం చేయదగినది, చేయబడేది, మననం ద్వారానే తెలియబడేది మంత్రం. సృష్టి రహస్యాన్ని, జ్ఞానాన్ని రహస్యంగా- గూఢంగా పరిరక్షించబడిన వేదవాణికి మంత్రమని అర్థం. వేదమంత్రాన్ని సమాధిస్థితిలో ధ్యానమగ్నుడై సూక్ష్మంగా మననం, చింతనం చేసినప్పుడే దాని రహస్యం జ్ఞానగమ్యమవుతుంది. కాబట్టి వేదమంత్రార్థం అత్యంత నిగూఢమైనది.

సృష్టిపదార్థం, సృష్టిలోని జీవపదార్థం, వాని మూలకారణ పదార్థతత్త్వం మొదలైనవన్నీ ఈ బ్రహ్మాండాన్ని నిర్మించు పరమాత్మతత్త్వానికి మాత్రమే తెలిసుంటుంది. అతడే సృష్టిరహస్యాలను మంత్రాల రూపంలో అక్షరబద్ధం చేయగలడు. కావున వేదమంత్రాలకు కర్త పరమేశ్వరుడే. మంత్ర నిర్మాణ వ్యూహాన్ని తెలుసుకున్నవాడే దాన్ని ఛేదించగలడు. యోగసమాధి స్థితుడైన యోగి-ఋషికి మాత్రమే అది సాధ్యం.

నాలుగు వేదాలలో ఉండే మొత్తం ఋక్కులను 'మంత్రము'లను పేరుతో పిలుస్తారు. మానవకృతములైన ఛందోరచనలన్నియు అనగా రామాయణ భారతాది ఇతిహాస కావ్యములు, మనుస్మృత్యాది ధర్మశాస్త్రములు మొదలగు వాటియందున్నవన్నియు శ్లోకములనబడును.

మంత్రద్రష్టలగు మహర్షులు:-

"ఋషి ర్దర్శనాత్" "ఋషయో మంత్రద్రష్టారః" వేదమంత్రాలను దర్శించిన వారినే ఋషులంటారు. ఈ ఋషులు మంత్రద్రష్టలే కాని మంత్రకర్తలు కారు. అనంతమైన ఆకాశంలో పరమాత్మ నిశ్వాస రూపాలుగా ఉన్న శబ్దాత్మక పరబ్రహ్మను తపఃసంపన్నులైన మహర్షులు సమాధిస్థితిలో పొందగలిగారు. వారు ఋజుప్రవృత్తి గలవారై నిర్మలాంతఃకరణాలతో కనుగొన్న జ్ఞానఖండికలే ఈ వేదమంత్రాలు. అనంతవిశ్వంలో భగవంతుని ఊపిరిగా సంచరిస్తున్న శబ్దతరంగాలను తమ తపఃశ్శక్తితో పసిగట్టి వాటిని తరతరాలుగా యుగయుగాలుగా లోకకళ్యాణం జరగడం కోసం అందించారు. అందుకే వారు మంత్రదర్శనం చేయజాలిన మహామహిమగల మహర్షులు. భగవంతుని ప్రేరణవల్లనే ఈ వేదవాక్కులు వారి హృదయాల్లో ప్రకాశించాయి. మంత్రాలను దర్శించిన మహర్షులు ఎందరో ఉన్నారు.

ఋషి గురించి రెండభిప్రాయాలున్నాయి. మంత్రార్థాన్ని తెలుసుకోగోరిన యోగి సమాధిస్థితిలోనికి వెళ్ళి పరమేశ్వరుని ప్రార్థిస్తే అట్టి యోగి అభీష్టంమేరకు పరమేశ్వరుడు ఆ మంత్రార్థాన్ని విశదపరుస్తాడు. దీనిని మంత్రార్థదర్శనం అంటారు. ఈ విధంగా మంత్రద్రష్టలైన వారినే ఋషులంటారు. అట్టి ఋషులు తమ శిష్యగణానికి, ప్రజలకు ఆ మంత్రార్థాన్ని బోధించేవారు. ఏ ఋషి ముందుగా సమాధిస్థితిలోనికి వెళ్ళి ఆ మంత్రార్థాన్ని దర్శించి ప్రచారం చేస్తాడో అట్టి ఋషి పేరును ఆ మంత్రానికి ఋషిగా పేర్కొంటూ వచ్చారు. వేదకాలంనుండి ఇప్పటివరకు ఈ పద్ధతిని అనుసరిస్తూ వస్తున్నారు. ఇది మొదటి అభిప్రాయం.

రెండవ అభిప్రాయం గలవారు దీనిని అంగీకరిస్తూ మంత్రాలకు చెప్పబడిన ఋషుల పేర్లు వారి అసలు పేర్లు కావు, అవి నైమిత్తిక నామాలంటారు. వాటిలో యౌగికార్థం ఉంటుంది. అది మంత్రార్థాన్ని మరింత విశదపరుస్తుంటుంది.

"దేవతలు" అనగా...?:

'దా-దానే', 'దా, ద్యుత్, దీప్, దివు' అను ధాతువులతో 'దేవ' శబ్దం ఏర్పడుతుంది. "దేవో దానాద్ వా, దీపనాద్ వా, ద్యోతనాద్ వా, ద్యుస్థానో భవతీతి వా" ఇచ్చునది, ప్రకాశించునది, ప్రకాశింపజేయునది, మరియు ద్యుస్థానంలో ఉండునది 'దేవత' శబ్దముతో చెప్పబడుతుంది. అనగా జ్ఞానం, ప్రకాశం, శాంతి, ఆనందం, సుఖం మొదలైనవి ఇచ్చు సకల జడచేతన పదార్థాలు దేవతలనబడతాయి.

యజుర్వేదంలో... అగ్నిర్దేవతా వాతో దేవతా సూర్యో దేవతా చన్ద్రమా దేవతా వసవో దేవతా రుద్రా దేవతా దిత్యా దేవతా మరుతో దేవతా విశ్వేదేవా దేవతా బృహస్పతిర్దేవతేన్ద్రో దేవతా వరుణో దేవతా. - యజు. 14-20)

అగ్ని, వాయు, సూర్య, చంద్ర, వసు, రుద్ర, ఆదిత్య, ఇంద్ర వరుణాది ప్రకృతి పదార్థాలన్నియు దివ్యగుణ యుక్తాలు కావున 'దేవ' శబ్దంచే చెప్పబడతాయి.

"విద్వాంసో వైదేవాః" సత్య (వేద) విద్యల నెరిగినవారు, జ్ఞానదానం చేస్తూ ప్రపంచంలోని జీవేశ్వర ప్రకృతులు మొదలగు పదార్థాల యథార్థ జ్ఞానాన్ని లోకానికి తెలుపుతుంటారు.

"దివు-క్రీడా విజిగీషా వ్యవహార ద్యుతిస్తుతి మోదమద స్వప్నకాంతిగతిషు" అను ఈ ధాతువుచే కూడ దేవశబ్దం ఏర్పడుతుంది. విజయాన్ని సాధించు కోరికగల వీరక్షత్రియులు, పరమేశ్వరుని స్తుతిస్తూ పదార్థాల యథార్థ స్వరూపాన్ని తెలుపు విద్వాంసులు, జ్ఞానదాన మొనర్చు బ్రాహ్మణులు, ప్రకాశించు సూర్యచంద్ర, అగ్ని, విద్యుత్తు మున్నగు పదార్థాలు, సత్యవ్యవహారాల నొనర్చు వైశ్యులు, సత్యకర్మల నాచరించు శూద్రులు మొదలగు వారందరును దేవతాశబ్దార్థులు. అనగా ప్రపంచానికి ఉపకారం చేయు జడచేతన పదార్థాలన్నీ దేవతలనబడతాయి. దేవతా పదానికర్థం మంత్రం యొక్క ప్రతిపాద్య విషయమని తెలుసుకోవాలి.

దేవతలు:

నాలుగు వేదాలలో అనేక దేవతల గుణగణాలు వర్ణించబడ్డాయి. ఆ దేవతలు ప్రకృతి తత్త్వాలకు చెందినవి.

సూర్యుడు బుద్ధికి, అగ్ని సంకల్పానికి, సోముడు- చంద్రుడు భావానికి ప్రతినిధులు. వేదంలో 1) సూర్యాది ద్యుస్థాన దేవతలు, 2) ఇంద్రాది అంతరిక్ష దేవతలు, 3) అగ్న్యాది పృథివీస్థాన దేవతలు, 4)విశ్వ కర్మాది అమూర్తభావ దేవతలు, 5) పురంధ్ర్యాది స్త్రీ దేవతలు, 6) అగ్నిష్టోమాది దేవతాద్వంద్వాలు, 7) స్థాన రక్షక దేవతల వంటి ద్వితీయశ్రేణి దేవతలు అని ఏడు విధాలుగా వున్నారు.

ఒక్కొక్క వేదమంత్రానికి ఆధిభౌతిక, ఆధ్యాత్మిక ఆధిదైవికమను మూడు విధాలుగా అర్థం చెప్పుకొనవచ్చును. ఉదాహరణకు ఉషస్సూక్తంలోని ఉషశ్శబ్దానికి ప్రతి ఉదయం సాక్షాత్కరించే 'అరుణోదయ' మని ఆధిభౌతికార్థం. మనుష్యులను నిద్రనుండి మేల్కొలిపి జాగృతులను చేస్తూ ఉపకరించే ఉషఃకాలాధిపతియైన 'ఉషోదేవత' అని ఆధిదైవికార్థం. మనుష్యులను అహంకార మమకారాది రూపమైన అజ్ఞానాన్ని నశింపజేసి ఆత్మస్వరూప సాక్షాత్కారానికి ఉపయోగించే 'ఆత్మతత్త్వజ్ఞానం' అని ఆధ్యాత్మికమైన అర్థం. ఈ రీతిలో ప్రతిసూక్తంలోని ప్రతి మంత్రానికి మూడు రకాలుగా అర్థాన్ని పొందవచ్చును. కొందరు ప్రాకృతిక దేవతలను మూడు వర్గాలుగా విభజించారు. అవే- పృథివీ, అంతరిక్ష, ద్యుఃస్థానీయ దేవతలు.

"కతి వై దేవాః" దేవతలు ఎందరు? అని నిరుక్తకారుడైన యాస్క మహర్షి ప్రశ్న వేసుకొని "త్రయః త్రింశో వైదేవాః" 33 దేవతలని సమాధానం చెప్పినాడు. అవి "అష్టౌ వసవః, ఏకాదశ రుద్రాః, ద్వాదశ ఆదిత్యాః, ఇంద్రః ప్రజాపతిశ్చ". వసుదేవతలు-8, రుద్రదేతలు-11, ఆదిత్యదేవతలు-12, ఇంద్రుడు-1, ప్రజాపతి-1 మొత్తం దేవతలు 33.

"పంచభూతాలు, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు" ఈ ఎనిమిది వసుదేవతలనబడతాయి. ఇవి జగత్తును వసింప-నివసింపజేస్తాయి. కావున వసుదేవతలనబడ్డాయి.

కర్మేంద్రియాలు-5, జ్ఞానేంద్రియాలు-5, జీవాత్మ-1 ఈ పదకొండు రుద్రదేవతలనబడ్డాయి. శరీరంనుండి ఆత్మ వెడలిపోవునప్పుడు ప్రాణులను రోదింప (ఏడ్పింప) జేస్తాయి. కావున రుద్రదేవతలనబడ్డాయి.

సంవత్సరమునందలి 12 మాసాలు ద్వాదశ ఆదిత్యులు అనబడుతాయి. ఇవి మన ఆయుష్యాన్ని ప్రతిదినం తరిగించును- అనగా తీసుకుని పోవును. ఇలా 31 దేవతలయినారు. 1) ఇంద్రుడు-విద్యుత్తు, 2) ప్రజాపతి-యజ్ఞం. ఈ రెండు కలిసి మొత్తం 33 దేవతలు అయినారు. ఈ 33 దేవతలను పూజించుట అనగా యథాయోగ్యంగా ఉపయోగించుకొనుట అని అర్థం. కేవలం పూజనీయుడు ఆ పరమేశ్వరుడొక్కడే. మిగతావన్నియు దివ్యగుణాలు గల వస్తువులు. వీటిని ఉపయోగించుకొని దివ్యత్వాన్ని పొందాలి.

దేవతల విషయంలో యాజ్ఞికుల కథనం మరొక రకంగా ఉంది. వేదాలలో వివిధ నామాలతో పేర్కొనబడిన దేవతలన్నీ వివిధ శక్తులే కాని ఒకే దేవతకుగల వివిధ నామాలని వారంగీకరించరు. దానికి యాస్కమహర్షి సమాధానం చెబుతూ స్థానాన్ని బట్టి వర్గీకరిస్తే పృథివిపైన వివిధ పదార్థాలన్నీ పృథివీస్థానీయాలే అవుతాయి కదా! అని వారంటారు. కనుక ఇచట పృథివీస్థానీయ దేవతలలో (వివిధ పదార్థాలలో) అగ్ని ముఖ్యదేవతయనీ, అంతరిక్షంలో వాయువు లేక విద్యుత్తు ముఖ్యదేవత యనీ, ద్యుస్థాన దేవతలలో సూర్యుడు ముఖ్యదేవతయనీ గ్రహించాలి.

వేదాలలో దేవతలను గూర్చిన స్తుతి ప్రార్థనలను పరిశీలించినప్పుడు దేవతలు మానవాకృతి గలవేమోనని అనిపిస్తుంది. కానీ, ఇది సత్యం కాదు. ప్రాకృతిక దేవతలన్నీ జ్ఞానం-చైతన్యం లేని జడపదార్థాలే. ఆ వర్ణనలన్నీ ఆలంకారికాలు. ఆ విధంగా వర్ణించబడినంత మాత్రాన అవి మానవాకృతిగల జ్ఞానంగల దేవతలని తలంచరాదు. ఏలయన కొన్ని రాళ్ళను, రప్పలను, నదులను, వృక్షాలను సంబోధిస్తూ ప్రార్థనలు కనబడుతాయి. అప్పుడు అవి జ్ఞానం గల దేవతలని అంగీకరించగలమా?

కనుక సారాంశమేమిటంటే వేదాలలోని వివిధ ప్రాకృతిక దేవతలన్నీ ప్రాకృతిక పదార్థాలు మరియు దివ్య శక్తులు. మనం ఆ స్తుతుల ద్వారా ఆయా పదార్థాల గుణగణాలను తెలుసుకొంటూ, వాటిని మననం-చింతనం చేస్తూ పరిశోధనలు చేస్తే ఎన్నో విజ్ఞాన విషయాలు వెలుగులోకి వస్తాయి. మన జీవితం సుఖమయం అవుతుంది.

ఇవే మంత్రాలకు ఆధిభౌతికంగా అర్థం చెప్పుకుంటే అట్టి గుణగణాలుగల రాజులకు, విద్వాంసులకు, వ్యక్తులకు అవి వర్తిస్తాయి. ప్రకరణాన్ని బట్టి ఇవే మంత్రాలు ఆధ్యాత్మికార్థాన్ని బోధిస్తాయి. అప్పుడు ఆ పదాలతో పరమేశ్వరుడు సూచింపబడతాడు. ఈ విధంగా వేదాలు అనేకార్థ బోధకాలు. ప్రకరణాన్ని, ప్రసంగాన్ని బట్టి అర్థం చెప్పుకోవడమే ఉత్తమం.

ఛందస్సు:

ప్రతి మంత్ర జ్ఞానానికి ఋషి, దేవతలతో పాటు ఛందోజ్ఞానం కూడ అవసరం. "ఛది-ఆహ్లాదనే" అను ధాతువు నుండి ఛందస్సు అను శబ్దం పుట్టింది. "ఛందయతి ఆహ్లాదయతి ఇతి ఛందః" శ్రోతలకు ఆహ్లాదం కలిగించునది ఛందమని తెలియుచున్నది. "ఛన్ద్యన్తే అనేన ఇతి ఛన్దః" వ్యుత్పత్తి కూడ ఇదే అర్థాన్ని చెప్పుచున్నది. "ఛన్దయతి పృణాతి రుచతే ఇతి ఛందః" ఏ వాణిని వింటే మనస్సు ఆహ్లాదాన్ని చెందుతుందో ఆ ఛందమయి వాణి వేదం. "ఛందయతి మంత్రప్రతిపాద్యయజ్ఞాదీన్ ఇతి ఛందః" మంత్రప్రతిపాదితాలైన యజ్ఞాదులను, అసురసంబంధమైన విఘ్నాలనుండి రక్షించునది అను అర్థాన్ని గ్రహించాలి.

అపౌరుషేయాలై గంభీరాలైన వేదాలను పరిరక్షించుకొనుటకు, వాటి అర్థాలను గ్రహించుటకు మన ప్రాచీన మహర్షులు ఆరు వేదాంగాలను రచించారు. అందులో ఛందశ్శాస్త్రం ఒకటి. "ఛందః పాదౌతు వేదస్య" ఛందస్సు వేదపురుషునికి పాదాలుగా చెప్పబడింది. వేదమంత్రాలను లయబద్ధంగా ఉచ్చరించుటకు, కాలగమనంలో మానవుని భ్రమప్రమాదాదుల వలన కలుగు దోషాలను నివారించుటకు ఈ ఛందశ్శాస్త్రం మిక్కిలి ఉపకారకమైనది. అక్షరనియమం, గణనియమం, గురులఘు నియమం మొదలగువాని మూలంగా దోషాలను నివారించుకోవచ్చును.

ఛందో జ్ఞానంవల్ల ఒక్కొక్క పాదంలో ఎన్ని అక్షరాలు ఏ క్రమంలో ఉంటాయో తెలుస్తుంది. దాని వల్ల పారాయణం తేలికౌతుంది. ఇది మంత్రార్థానికి కూడా సూక్ష్మరూపంలో సహాయపడుతుంది. అనేక చోట్ల మంత్రార్థం స్పష్టంకావడానికి ఛందజ్ఞానం అవసరమౌతుంది.

వేదమంత్రాలను ఛందస్సుతో బంధించటంవలన వానిలో కొన్ని అక్షరాలుగాని, పదాలుగాని ప్రక్షిప్తం చేయలేరు, చేయజాలరు. చేసినా దొరికిపోతాయి. "ఏ వ్యక్తి వేదమంత్రాల ఛన్ద, ఋషి, దేవతల జ్ఞానం కలిగియుండడో అతడు చేసే అధ్యయన అధ్యాపనాలు యజన-యాజనాలు నిష్ఫలమౌతాయ"ని కాత్యాయన మహర్షి చెప్పారు. ప్రతి వైదికుడు వేదమంత్రాలను సరిగా ఉచ్చరించడానికి, వేదార్థాన్ని- వేదరహస్యాన్ని తెలుసుకోవడానికి, మంత్రాలలోని ప్రక్షిప్తాలను తొలగించడానికి, వైదిక శాస్త్రోక్త కర్మకాండను-యజ్ఞయాగాదులను చక్కగా అనుష్ఠించడానికి ఛందఃశాస్త్రాధ్యయనం తప్పక చేయాలనీ, లేకుంటే అతని స్వాధ్యాయం కుంటితనంతో కూడుకున్నదే అవుతుందని వేదవిద్వాంసులంటారు.

"ఛందస్సు" అంటే సంతోషం కలిగించే వాక్సమూహం. ఈ సంతోషం ఆ వాక్సమూహంలోని గురు లఘువుల వల్ల, వాటి ఆవృత్తివల్ల, వాటి నియమపూర్వక విచ్ఛేదం వల్ల కలుగుతున్నది. ఇవన్నీ ఆ శబ్ద సమూహంలోని లయను అభివ్యక్తం చేయడం ద్వారా ఆహ్లాదాన్ని కలిగిస్తాయి.

పాదంలో ఉండే అక్షరసంఖ్యను బట్టి ఛందస్సు పేర్కొనబడింది. ముఖ్యంగా వేదమంత్రాలు సప్త ఛందస్సులలో ఉంటాయి. అవి: 1) గాయత్రీ, 2) ఉష్ణిక్, 3) అనుష్టుప్, 4) బృహతీ, 5) పంక్తి, 6) త్రిష్టుప్, 7) జగతీ. వీటిలో కూడా ఉపవిభాగాలున్నాయి. మొత్తం 26 ఛందస్సులున్నాయి.

ఛందోవిజ్ఞానంతో కూడిన వైదిక కర్మానుష్ఠానం ప్రశస్తమైంది గనుక ఛందస్సు చాలా ఆవశ్యకమైనది. ఛందస్సు వేదాంగంగా పరిగణించబడింది.

ఛందస్సు కవిత్వానికి సౌందర్యాన్ని కలిగిస్తుంది. వచనం కంటే ఛందోబద్ధమైన రచన గుర్తుంచుకోవడానికి చాలా అనుకూలంగా ఉంటుంది. నియమపూర్వకమైన విచ్ఛేదం ఉండడం వల్ల ఇది ధారణకు ఎంతో వీలుగా ఉంటుంది. ఛందోబద్ధంగా ఉండటం చేతనే వేదాలు లిఖితరూపంగా లేకపోయినప్పటికీ శ్రుతులనబడుతూ అనాది నుంచీ స్వస్వరూపాన్ని కోల్పోకుండా చక్కని స్వరూపంగా చెక్కుచెదరకుండా స్థిరంగా ఉండగల్గాయి.

స్వరం:

వేదమంత్రాల్లో ఉండే అచ్చులకు ఉచ్చారణను బట్టి ఉదాత్త, అనుదాత్త, స్వరితాలనే పేరుతో మూడు రకాలైన స్వరాలుంటాయి. ఏకశ్రుతిని కూడా ఒక స్వరంగా కొందరంగీకరించారు. అచ్చులలో చేరటం వలననే హల్లులకు స్వరసంబంధం ఏర్పడుతున్నది. కాని వాటికి స్వరం లేదు. అచ్చులకే స్వరాలని పేరున్నది. ఇవి మూలపాఠాన్ని సంరక్షించడానికి, సందర్భానికి తగిన అర్థాన్ని నిర్ణయించుకోవడానికి ఉపయోగపడతాయి. ఒకే పదానికి స్వరభేదాన్ని బట్టి అర్థం కూడా మారిపోతుంది.

తాలువు (దవుడ) మొదలగు స్థానాలకు పైభాగంలో పుట్టిన అచ్చు 'ఉదాత్త'మని, తాలువు మొదలగు వాటికి దిగువపుట్టిన అచ్చు 'అనుదాత్త'మని, ఈ ఉదాత్తానుదాత్త ధర్మాలు రెండు కలిసి ఉన్న అచ్చు 'స్వరిత' మని పాణిని తన అష్టాధ్యాయిలో చెప్పారు. ఇక నాల్గవది ఏకశ్రుతి. దీనికే 'ప్రచయ'మని కూడ పేరు. ఇందులో ఉదాత్తానుదాత్త స్వరిత లక్షణాలేవీ కనపడవు.

స్వరంవల్ల ప్రయోజనమేమనగా? ఈ స్వరం కేవలం వైదిక భాషకు మాత్రమే కాదు, పూర్వం లౌకిక భాషలో కూడ పాటింపబడేది. ఇప్పటికీ మన సంభాషణల్లో కొన్ని లౌకిక పదాలను ఒత్తి పలకడం ద్వారా దీర్ఘం తీయడం ద్వారా అర్థభేదం రావడం గమనిస్తూనే ఉన్నాం. వేదాల్లో స్వరభేదాన్ని బట్టి అర్థభేదం ఎంతో కనబడుతుంది.

ప్రారంభంలో ఎంతటివారైనా వేదాలను సస్వరంతో చదువలేరు. అంతమాత్రాన వారి కెలాంటి దోషమంటదు. భక్తితో వేదపఠనం చేయువారికి స్వరదోషమేమీ ప్రాప్తించదు.

'రాగన్న' విలక్షణ జీవనమాలిక

డా|| గుమ్మన్నగారి బాల శ్రీనివాసమూర్తి
చరవాణి: 9866 917 227

శ్రీమాన్ కె.వి.రాఘవాచార్యులవారు స్వాతంత్ర్యానంతర కాలపు తెలంగాణ సంప్రదాయ పండిత మండలిలో అత్యంత విలక్షణులు. నాటి సంప్రదాయ విద్వాంసులకు సంస్కృతంతో అనివార్యమైన అనుబంధం ఉండేది. ఇక తెలుగు పాండిత్యం నిరుపమానమే. ఉర్దూ రాష్ట్రభాషగా చెలామణి అయిన కాలంలో వారి బాల్యం గడిచింది. కనుక ఆ భాషలో లేఖన పఠనాలూ గొప్పగానే ఉండేవి. నాటి విద్వాంసుల్లో పలువురు ద్విభాషా పండితులు. అయితే ఆచార్యుల వారిది అంతకుమించిన విశిష్టత. ఆయన స్వయంకృషితో ఇంగ్లీషు చదువుకున్నారు. ఆ భాషలో మెట్రిక్ వరకు పాఠాలు చెప్పే స్థాయిలో వైదుష్యాన్ని సాధించారు. మొక్కవోని పట్టుదల, వృత్తిపట్ల అంకితత్వం, ఎదుగుతూ చదువుతూ ఉండగలిగే వ్యక్తిత్వం, మానవీయ సౌజన్య-స్ఫూర్తి ఇవన్నీ ఆచార్యులవారిలో కనిపించిన ఉల్లేఖనీయమైన గుణగణాలు. మాది సిద్ధిపేట పాత తాలూకా (ఇప్పుడు అదే జిల్లా) లోని పోతారెడ్డిపేట గ్రామం. ఆచార్యులవారిది కరీంనగర్ జిల్లా నారాయణపురమే అయినా, జీవితంలో కీలక కాలం మెదక్ పట్టణంలో అంతకు ఎక్కువగా సిద్ధిపేటలోనూ గడిచింది. మా నాన్నగారు స్వర్గీయ గుమ్మన్నగారి లక్ష్మీనరసింహ శర్మగారు ఆచార్యులవారు అత్యంత ఆప్తమిత్రులు.

ఆచార్యులవారి పురిటిగడ్డ నారాయణపురం ఆనాడు పండిత నిలయం. అక్కడ స్మార్త, విశిష్టాద్వైత తాత్త్వికతల్లో లోతైన పాండిత్యమున్న మేటి ఘనపాఠీలు ఉండేవారని మా ప్రాంతం పెద్దలు చెప్పగా విన్నాను. ఆ ఉభయ మార్గానుయాయుల కఠిన శిక్షణలో రాఘవాచార్యగారి బాల్యంలో వేదాధ్యయనం జరిగింది. స్మార్తాన్ని కూడా చదువుకున్నారు. వేదభాగాలు చదువుతుంటే శ్రుతిబద్ధమైన సంగీతంవలె ఉండేది. రాఘవాచార్యులవారు సంస్కృతాంధ్ర భాషల్లో విశిష్టాద్వైత తాత్త్వికతతో సాగరమంత లోతైన వారని చాలామందికి తెలుసు. ఆయన సంహితాభ్యాస ప్రవీణులన్న సత్యం బహుశా సన్నిహితులకే తెలుసునేమో! స్మార్తంలో ఇంతటి దిగ్గజమైనా ఏనాడూ పౌరోహిత్యంవైపు దృష్టిపెట్టకపోవడం ఆయన వ్యక్తిత్వంలోని మరో గొప్ప గుణం. తనకు ఉపాధ్యాయ వృత్తిలో ఉపాధి ఉంది కనుక మరొక రంగంలోనూ సంపాదన చేయకూడదనుకున్న సూత్రబద్ధ వైఖరి ఇందుకు కారణమనుకుంటాను.

నాటి తెలంగాణ పండిత వర్గంలో శాస్త్రదృష్టి ఎక్కువ. పరంపరగా వస్తున్న సంస్కృత కావ్యాధ్యయనం, ఛందస్సు, అలంకార శాస్త్రం, వ్యాకరణాల్ని లోతుగా చదువుకోవం, ప్రధానంగా వాటినే జిజ్ఞాసువులకు బోధించడం అప్పటి పండితుల ఆసక్తులు. ఆచార్యులవారు కూడా చాలాకాలంపాటు ఈ ధోరణిలోనే ఉన్నారు. సిద్ధిపేట ప్రాంతంలో ఎవరికైనా జటిలమైన సాహిత్య- భాషాంశాల పట్ల పరిష్కార వైఖరి అందాలంటే అందుకు ఆచార్యులవారికి మించిన వారులేరు. ఆయన లఘు సిద్ధాంత కౌముది వంటి బృహత్ గ్రంథాలను ఎంతో ఇష్టంతో పరామర్శించడం నేను స్వయంగా చూశాను. అధ్యయనం పట్ల అతి నిశితమైన దృష్టి ఉన్నవారు కొత్త అంశాలు కనబడినప్పుడే రచనలు చేస్తారు. ఆషామాషీ రచనలకు వారు పూర్తి వ్యతిరేకులు.

రాఘవాచార్యులవారిది ఇదే కోవ. బాల్యం నుండి మొదలుకొని దశాబ్దాలపాటు సాహిత్య భాషారంగాల్ని "శాస్త్రదృష్టి"తో చదివిన ఆచార్యులవారు బాగా ఆలస్యంగా విమర్శనా రంగంలోని ప్రవేశించారు. బాల్యంలో చదువుకున్న మాఘ కావ్యానికి (శిశుపాల వధ) చక్కని వ్యాఖ్యానాన్ని అందించారు. యువభారతి తరపున ఈ చిరు రచన వెలువడింది. పుటలు తక్కువే అయినా పుటం పెట్టినట్టుగా ఉంది ఈ వ్యాఖ్యానం! ఇది ఎంతోమందిని ఆకర్షించింది. ఇక అప్పటినుండి ఆయన ఎన్నెన్నో గ్రంథాలకు వ్యాఖ్యానాలు రచించారు. ఇందులో అరుదైనవే ఎక్కువ. ఈ వ్యాఖ్యానాల ద్వారా ఆయా గ్రంథాల ప్రాచుర్యాన్ని మరికొన్ని వందల సంవత్సరాలు పెంచగలిగారు ఆచార్యులవారు. నిజంగా అదొక యజ్ఞం! తెలుగు వ్యాఖ్యాన విద్వాంసుల్లో వేదం వేంకటరాయశాస్త్రి, నాగపూడి కుప్పసామయ్య వంటి ఎందరో ప్రసిద్ధులున్నారు. సంస్కృత వాఙ్మయ వ్యాఖ్యాతలైన రాఘవాచార్యులవారు ఆ వరుసలో చేరదగినవారే. ఆచార్యులవారి వ్యాఖ్యాన సేవల్ని గురించి ఎవరైనా పరిశోధిస్తే ఎంతో బాగుంటుంది.

మా నాన్నగారు లక్ష్మీనరసింహశర్మ సిద్ధిపేట పాత తాలూకాలోని గ్రామాల్లో సిద్ధిపేట పట్టణంలోనూ కొన్ని పదుల సంఖ్యలో అవధానాలు చేశారు. ఎన్నో అవధానాలలో రాఘవాచార్యులవారు పృచ్ఛకులుగా ఉన్నారు. నాన్నను సానుకూల దృష్టితో అభినందించేవారు. ఆయన వంటి విద్వాంసులు తన పద్య పద ప్రయోగాల్ని సెబాసనడం నాన్నలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఇద్దరూ ఎంతో ఇష్టంతో తాంబూల చర్వణం చేసేవారు.

నా బాల్యంలో సిద్ధిపేట హౌజింగ్ బోర్డ్ కాలనీ (రాఘవాచార్యుల వారి స్వగృహం) కాంపౌండులో రాత్రిపూట తమలపాకులు నములుతూ ఇద్దరూ కొన్ని గంటల పాటు సాహిత్య గోష్ఠిని కొనసాగించడం ఒక గొప్ప జ్ఞాపకం. ఇందులో సాహిత్యంతో పాటు ఉభయుల బాల్యాలు, అప్పటి సంఘటనలు, విషాద, వినోద అనుభవాలు ఎన్నో మధుర జలపాతంవలె పొంగిపొరలేవి. నాన్న సిద్ధిపేట వెళ్ళినప్పుడు రాఘవాచార్యుల వారిని కలుసుకోవాలని వెళ్ళేవారు. ఆ సందర్భాల్లో ఆచార్యులవారు సాదర ఆహ్వానాన్ని పలికి సాహిత్య సంభాషణ ఆరంభించేవారు. ఇక తాంబూల చర్వణం సరేసరి. సిద్ధిపేటలో భిన్న ధోరణులు, భిన్న సంస్థలు, విభిన్న వ్యక్తిత్వాలు, వైరుధ్యాలు, వైవిధ్యాలున్న ఆలోచనలతో సాహిత్య లోకం బలమైన అస్తిత్వాన్ని చూపించేది. రాఘవాచార్యులవారు ఈ విభిన్న వర్గాలకు అందరికీ సన్నిహితులే. కార్యక్రమాలు జరిగినప్పుడు తనను ఆహ్వానిస్తే తప్పకుండా వెళ్ళేవారు. తనకే పెద్దపీట దక్కాలన్న అహంభావాన్ని ఏనాడూ ఆయనలో ఎవరూ చూడలేదు.

మా నాన్న గొప్ప ఆదర్శాలను జీవితానికి ఆలంబనలగా చేసుకున్నారు. పెట్టుకున్న ఆదర్శాల్ని తు.చ. తప్పకుండా ఆచరించి చూపించారు. ఆయన ఆదర్శమూర్తులుగా భావించిన కొద్దిమందిలో రాఘవాచార్యుల వారొకరు. తరచూ మాతో ఆచార్యులవారి గొప్పతనాన్ని విపుల రీతిలో వివరించేవారు. "స్వయంకృషితో అనేక పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు", "స్వయంకృషితో ఇంగ్లీషులో వైదుష్యాన్ని సాధించారు", "కుటుంబాన్ని ఉన్నత స్థానంలోకి తీసుకొని రావడంలో రాగన్న చూపించిన నిబద్ధత అపూర్వం". ఇట్లా మా చిన్నతనంలోనే రాఘవాచార్యులవారి గొప్పతనం ఏమిటో నాకు మా తమ్ముడికి అర్థమైపోయింది. "కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు" అన్న కవి వాక్కు నిజమని ఆచార్యులవారి జీవితం నిరూపించింది.

మా నాన్నగారు డాక్టర్ కె.వి.రమణాచార్యులవారిని గురించి ఎంతో వాత్సల్యంతో చెప్పేవారు. రమణగారు అత్యంత ప్రతిభావంతుడైన విద్యార్థి అని బాల్యంలోనే నాన్న గుర్తించారు. మెదక్‌లో రమణగారి పసి వయసులో ఏదో సందర్భంలో నాన్న ఒక ఇంగ్లీషు వాక్యాన్ని మరో రూపంలో చెప్పమని అడిగినారట. రమణాచారిగారు క్షణం ఆలస్యం చేయకుండా చెప్పేశారట! నేను మా తమ్ముడూ చిన్నతనంలో సైన్సుకు ట్యూషన్ వెళ్ళాలనుకున్నాము. మా నాన్న అందుకు అంగీకరిస్తారనే ఆశ మాలో ఉండేది. ట్యూషన్ వెళ్ళడాన్ని నిర్ద్వంద్వంగా మా నాన్న తిరస్కరించారు. "ట్యూషన్ వద్దని ఎందుకు అంటున్నావే నాన్నా?" అని మేము కొంత కోపంతోనే అడిగినాము. "రాగన్న కొడుకు రమణను ఆదర్శంగా తీసుకోండిరా. రమణ తనకు ట్యూషన్ వద్దన్నాడు. ఒక టీచర్ కొడుకునైన నేను మరో టీచర్ దగ్గరకు ట్యూషన్ వెళ్ళను అన్నాడురా. అదీ ప్రతిభ అంటే" అన్నాడు నాన్న. అప్పటినుండి మేము ఏనాడూ ట్యూషన్ మాట ఎత్తలేదు. మా పిల్లల్ని కూడా ఎప్పుడూ ట్యూషన్‌కి పంపించలేదు. నేనూ మా తమ్ముడూ బాగా కష్టపడి గ్రూప్-1 సర్వీసులు పరీక్షలు రాశాం. అప్పుడు కూడా కోచింగ్‌కి వెళ్ళనే లేదు. రమణగారి మాటల్ని ఉటంకిస్తూ మా నాన్న చెప్పిన ప్రబోధం మాపై అంతటి బలమైన ప్రభావాన్ని వేసింది.

రమణగారు 1977లో గ్రూప్-1 సర్వీసుకు ఎంపికైనట్టు గుర్తు. అప్పుడు నేను ఏడవ తరగతిలో ఉన్నాను. ఆయన రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్‌గా ఉన్నారు. సిద్ధిపేట ప్రాంతం నుండి ఎదిగిన కొద్దిమంది ఉన్నతోద్యోగుల్లో ఆయన ప్రముఖులు, అయినా రాఘవాచార్యులవారు తన కుమారుడి ఉన్నతోద్యోగం, అధికార హోదాల గురించి ఏనాడూ చెప్పుకునేవారు కాదు. ఎటువంటి ఆడంబరాలూ ఆచార్యులవారిలో లేవు. అదే నిజమైన వేదాంతి లక్షణం. మూడు సంవత్సరాల క్రితం డాక్టర్ రమణాచారిగారిని కలుసుకునేందుకు వారి నివాసానికి వెళ్ళాను. వారితో కొద్దిసేపు మాట్లాడాను. "నాయనగారిని చూడాలని ఉంది" అన్నాను. "వెళ్ళు, పైన ఉన్నారు" అన్నారాయన. ఇంట్లోకి అడుగుపెడుతూనే "అయ్యా!" అని గొంతు సవరించుకున్నాను. అప్పటికి నేను ఆచార్యులవారిని దర్శనం చేసుకొని దశాబ్దం దాటింది... అయినా నా గొంతు విన్నంతనే "నాయనా శ్రీనివాసా, వచ్చినావురా? ఎంత కాలమైందిరా నిన్ను చూచి; బాగున్నావురా" అంటూ అభివాదం చేసేలోపునే ఆలింగనం చేసుకున్నారు. అమ్మ నాన్నలు ఇద్దరూ ఏడాది వ్యవధిలోనే కన్ను మూశారని చెబితే కన్నీరు పెట్టుకున్నారు. మా స్వగ్రామం సంగతులూ అడిగి తెలుసుకున్నారు. సంక్షిప్త వ్యవధిలోనే తమ రచనా వ్యాసంగాన్ని పరిచయం చేశారు. పది పుస్తకాలు ఇచ్చారు. ధార్మిక వాఙ్మయం అందరికీ అందుబాటులోకి రావాలన్నారు. నిజంగా అదొక అపూర్వమైన ఘట్టం. ఎంతటి వాత్సల్యం! ఎంతటి ఆత్మీయత! ఇది నేను మా సన్నిహిత మిత్ర బృందానికి చెబితే వారంతా రాఘవాచార్యులవారి గొప్పతనానికి నమస్సులు పలికారు.

ఆచార్యులవారిని గురించి తెలుగు పాఠకులకు పరిచయం చేయగలిగే ఒక అవకాశం ఇటీవలే దొరికింది. జాతీయ స్థాయిలో గుర్తింపును కలిగిన నీల్‌కమల్ సంస్థవారు "తెలంగాణ వైతాళికులు" పేరుతో మూడు సంపుటాలు ప్రచురించాలని సంకల్పించారు. వాటికి నేనే సంపాదకుడిని. ఈ నేపథ్యంలో "అక్షరమూర్తులు" (సాహిత్య ప్రముఖులు) అనే సంపుటంలో రాఘవాచార్యులవారిని గురించి ఒక సమగ్ర వ్యాసాన్ని ప్రచురించగలిగాను. గొప్ప పండితుడు, తెలంగాణ సంప్రదాయ విద్వత్ పరంపరలో శిఖర సమానుడు, వ్యాఖ్యాన సంప్రదాయంలో అపర మల్లినాథుడు కె.వి.రాఘవాచార్యులవారి పవిత్ర స్మృతికి వినమ్ర నమస్సులు.

మా రాఘవాచారి గారు

డా॥ ఎ. వినయబాబు

చరవాణి : 8008 103 811

మాతృదేవోభవ, పితృదేవోభవ ఆచార్య దేవోభవ అన్నవి అందరికి ఒక నానుడిగాని నాకు మాత్రం ఒక అక్షర సత్యం. ఉపాధ్యాయులకు ఇల్లు ఇచ్చి “కిరాయికి బదులు మా పిల్లలకు పాఠాలు చెప్పండి” అన్న మా బాపు (కీ॥శే॥ శ్రీ రామరాజుగారు) కోరికతో బడి పాఠాలను, బతుకు పాఠాలను అందరికి బోధించి మా బతుకులను తీర్చి దిద్దిన గురుబ్రహ్మ శ్రీమాన్ కారంచేటి తిరుమల వేంకట రాఘవాచార్యులు గారు.

సబ్జెక్టునే కాకుండా అన్ని సబ్జెక్టులను నేర్చుకునే విధానాన్ని నేర్పించిన నేర్పరి మా సారు. ఉద్యోగ రీత్యా తెలుగు సారయినా అన్ని భాషలను ముఖ్యంగా ఇంగ్లీషును క్షుణ్ణంగా నేర్పించిన నేర్పరి.

రెన్ & మార్టిన్ గ్రామర్ పుస్తకాన్ని ఆపోశన పట్టించి ఆంగ్లభాషా జ్ఞానానికి గట్టి పునాదిని వేసిన వారు. 1969లో ఉవ్వెత్తున లేచిన తెలంగాణా ఉద్యమం కాలంలో రమణన్న పోరు దారులు నేర్పిస్తే, సారు మమ్మల్ని కూచోబెట్టి సంస్కృత భాష నేర్పించి, అమర కోశం వల్లె వేయించి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి సంస్కృత భాషా గుబాళింపులను ఆస్వాదింప జేసినారు.

ప్రతి మార్గళి మాసంలో ఉదయాన్నే తిరుప్పావై కాలక్షేపాలు, పద్మమ్మగారు అతి రుచిగా చేసే పొంగలి రుచులు ఒక అనిర్వచనీయ అనుభూతి పరంపర. ఈ కాలక్షేపాలు, రోజు ద్రావిడ సంస్కృత బోధన చేసి నిత్యాను సంధానం, తిరుప్పావై లాంటి గ్రంథాల ధారణ చేసుకునే విజ్ఞానాన్ని మా బాపుకిచ్చిన మహానుభావుడు.

వారి ఇల్లు, వావిలాల రంగన్న, ముప్పిడితోట వెంకన్న, దేవేందర్, మెదక్ వెంకన్న వాళ్ళు ఐదుగురు. మేము ఐదుగురం. అప్పుడప్పుడువచ్చి పోయే మెదక్ రంగన్న, పుష్పక్క, వావిలాల శకుంతల, సీనయ్యగారు, నర్సయ్యగారు, వెంకటయ్యగారు, ఒక జన కోలాహలం, ఒక బాలానందం.

అందరినీ ఆదరించి, బోధించి సూచించి తీర్చిదిద్దిన మహా మనీషి. ఆ చదువులతోపాటు చార్‌పత్తర్, కచ్చకాయలు టొక్క, ఉప్పుబందర్, Beautiful Donkey ఆటలు. రమ, రమణన్నల గానమాధుర్యాలతోపాటు మా అందరి గార్ధభరాగాలతో ఆడిన అంత్యాక్షరులు, భువన విజయం, అనంతం, ఒక జ్ఞాపకాల దొంతర.

వారు మాకు చదువులు చెపుతూనే అకుంఠిత దీక్షతో ఐదో పడిలో ఎం.ఏ (తెలుగు) పూర్తిచేసి చదువుకు వయసుతో నిమిత్తం లేదని నిరూపించారు (రమణన్న పి. హెచ్‌డి. కయినా, నా యం.టెక్ (సి.యస్) పి. హెచ్‌డిల కయినా వారే స్ఫూర్తి.)

మా రెండు కుటుంబాలు అనడం కన్నా మేమంతా ఒకే కుటుంబం అనడం సమంజసం. కష్టసుఖాలను కలిసి పంచుకున్న వాళ్లమే. అమ్మగారు తీవ్రమైన అనారోగ్యం పాలైనప్పుడు భర్తగా వారు చేసిన సేవ అందరికి ఆదర్శప్రాయం.

జీవిత చరమాంకంలోనూ వారు దేశికుల వారి గ్రంథాలకు సరళమైన భాషలో సామాన్యులకు అర్థమయ్యేలా వ్యాఖ్యానాలు అందించి తరించారు, నా బోటి వారినందరినీ తరింపచేశారు.

వారికి ఎన్నో సన్మానాలు సత్కారాలు జరిగినాయి. అంతిమ ఘడియల్లో హాస్పిటల్‌లో వారిని దర్శించుకున్నప్పుడు “నా జీవితం అయిపోయిందిరా. ఇక ఈ శరీరాన్ని తిప్పలు పెట్టవద్దని తమ్ముడికి చెప్పురా” అని తన మరణకాలాన్ని సూచించిన బ్రహ్మజ్ఞాని.

మాబాపు మరణించిన కొద్ది మాసాలకే రాఘవాచార్యులు, వారిచెంతకు వెళ్లిపోవడం యాదృచ్ఛికమే అయినా అది వారి గాఢమైన స్నేహానికి, అనుబంధానికి ప్రతీక. మా సారు చిరస్మరణీయులు.

పద్యోపాయనము

శేషం రామానుజాచార్యులు

వలితాపాంగ కటాక్ష వీక్షణములన్ వాగ్దేవి సారింప ధీ
విలసన్మంజుల కావ్యకల్పన కనద్వేలాత్తవాల్లభ్యమౌ
సులభ గ్రాహ్య విశేషభాసిత రసస్రోతస్వినీ వ్యాఖ్యలన్
వెలయింపంగ కృతార్థుడీ ఘనుడు కేవీరాఘవాచార్యుడే

రసరమ్యంబగు మాఘకావ్య రచనాప్రౌఢిన్ ధృతిన్ దెల్పె, మా
నసికోల్లాసిత వ్యాఖ్యలన్ శతకమౌ నారాయణాఖ్యంబుతా
నసమాన ప్రతిభా విశేషములు సార్థంబయ్యె మీ చాతురిన్
లసదుద్యత్ప్రతిభాసమాన విబుధ శ్రీ రాఘవాచార్యాభిధా!

నానా కావ్య విశేష సంస్కృతుల పూర్ణప్రజ్ఞ ధీమంతమై
ఈనాడాంధ్రుల మానసంబులను ఎంతేమోదముం గూర్పరే
మీ నైపుణ్యము పాండితీనికషమున్ మీ ధార, సాహిత్య సు
శ్రీనాధున్వలె జేసెమాకు కవితా శ్రీగంధముల్ చల్లగా

చారు గీర్వాణ భాషా విశేషాశ్లేషి/ మండిత పాండిత్య దండపాణి
జ్ఞానైక సంవర్ధ నానంద లాహిరి/ ద్రవిడ వారాశి శీతాంశు రశ్మి
శ్రీ వైష్ణవాచార సిద్ధాంత కౌముది/ హరిపదాంభోజ విహారశీలి
యువభారతీయుల కవనాభిరుచి తీర్చు/ నరుదైన కావ్యాల నమరజేసె

భవ్య వేదాంత దేశికున్ భక్తితలచి/ పరమ రమణీయమగునట్టి వ్యాఖ్యచేసి
ప్రౌఢ పాదుకాస్తవము నపూర్వ రీతి/ వెలయజేయంగ యిది రాఘవీయమయ్యె

భారతీదేవి గారాబు పట్టియగుట/ కవనమందును వ్యాఖ్యాన కళలయందు
మాటలందున సరసంపు మూటయయ్యె/ రాఘవాచార్యుడు, ప్రపన్న రాఘవుండు.

సౌవర్ణ లేఖిని

డా॥ తిరుమల శ్రీనివాసాచార్య

చరవాణి: 9949 365 903

వేంకటమ్మ తల్లి; వేంకట యని పేరు/ నందుముందు నిలిచె; నమ్మ తండ్రి
రాఘవార్యుడౌట రాఘవాచార్యుడన్/ బేరు నిలిచె; మంచి పేరు వచ్చె

జనకు డేమొ మనోహరాచార్యుడౌట/ ప్రముఖ జనమనోహరమయ్యె రాఘవార్యు
బ్రతుకు; రాఘవ శబ్ద ప్రభావమేమొ!/ సత్య ధర్మానురక్తుడై సాగె నతడు

జనకుడైన మనోహరాచార్యు నొద్ద
పాశుర స్తోత్రములు తిరువాయి మొళిని
ముద్దుగా ముచ్చటగ బాల్యముననె నేర్చె
నంద అబ్బుర పడగ 'నధ్యాపకుడ' యె
భగవదారాధనను నేర్చె భక్తిగరిమ

జోగ వేంకన్న సన్నిధి శ్రుతులు, నమిల/ కొండ రంగయార్యుల కడ కొన్ని నాళ్లు
పంచకావ్యాలు పఠియించి, ప్రాజ్ఞ బావి/ కృష్ణశాస్త్రిని సేవించి తృష్ణదీర
రేల నుత్తర రామచరిత్ర నాట/ కాదులను రసదృష్టిచే నధిగమించె

యౌవనోదయమున పెండ్లియాడె, చదువు/ కొన్న యువతి పద్మావతిన్ గుణగరిష్ఠ
నాంగ్ల భాషను నేర్చిన యతివ యామె/ ఏడు తరగతుల్ చదివిన యిందువదన

ప్రవిమల దాంపత్య ఫలముగా గలిగిరి/ సుతులిద్దఱును మరి సుతలు మువురు
జ్యేష్ఠపుత్రుడు గుణశ్రేష్ఠుడు వేంకట/ రమణుడు విద్యలో ప్రథముడయ్యె
అట ద్వితీయుడు మనోహరుడు శాస్త్రజ్ఞాన/ వంతుడై వినయ సంపన్నుడయ్యె
గుణవతుల్ సుతలు శకుంతల రమయు సు/ వర్ణ నామమ్ముల బరగినారు

క్రమముగా నందఱికిని శిక్షణ మొసంగి/ ప్రేమతో బెంచి పోషించి పెండ్లి చేసె
తగిన కృషిసల్పి ఉత్తమాధ్యాపకుడయి/ చెల్లియలకు తమ్ములకును జేసె పెండ్లి

ఉన్నత జ్ఞానసౌధ సోపానములను/ క్రమముగా నెక్కి సదమల ప్రమను గాంచి
రాఘవార్యుడు జనకుని ప్రతినిధియయి/ రేయి పవలును శ్రమియించి ఋణము దీర్చి
లేని సంసారమును పైకి లేపినాడు/ సోదరులకు ధర్మపథమున్ జూపినాడు

కారంచేటి తిరుమలా/ చార వ్యవహార విషయ సర్వస్వమ్మున్
నేరిమి నోరిమితో మన/ సారగ గ్రహియించి రాఘవార్యుడు తెలిపెన్

సాధించినాడు ప్రస్థాన చతుష్టయ/ సార పీయూష రసమ్ము నెల్ల
మతిని నిల్పినవాడు చతురుపాంగమ్ముల/ తాత్త్విక జ్ఞాన తాత్పర్య మెల్ల
అభ్యసించినవాడు వ్యాకృతి జ్యోతిష/ కల్పాది శాస్త్ర విజ్ఞానమెల్ల
తీర్చుకొన్నాడు సంతృప్తి చతుర్విధ/ ఋణములన్ ధార్మిక దృష్టి వేఁయ

పంచ సంస్కార పూత ప్రపన్ను డతడు/ భగవదారాధనాసక్త భక్తవరుడు
దాన యజన యాజన ముఖ్య ధర్మకర్మ/ సర్వమును సల్పె రాఘవాచార్య శ్రౌతి

శ్రుతిగత ధర్మకర్మచయ సూనృత భాసుర రామ మూర్తియై
సతతము సత్య భాషణము సల్పెడు నిర్మల ధర్మజుండునై
హితకర భ్రాతృవత్సలత నేర్పడ తండ్రికి జ్యేష్ఠ పుత్రుడై
భృతిగతి గూర్చె తమ్ములకు ప్రేముడి రాఘవు డాత్మబంధుడై

ప్రథిత కావ్యము 'శిశుపాల వధ' శ్లోక/ ములకు గూర్చిన వ్యాఖ్య మొదటి రచన
పిదప 'గోదాస్తుతి' వివరణమ్మును వ్రాసి/ ప్రాజ్ఞుల దృష్టిలో బడగ జొచ్చె
వేదాంత దేశిక విరచితమ్ములు స్తోత్ర/ కావ్యములకు గూర్చె క్రమ వివృతి
కమనీయమగు 'పాదుకాసహస్రము'నకు/ రమణీయమగు వివరణము వ్రాసె

అన్ని వివరణ లొక్కయెత్తతని విపుల/ పాదుకాసహస్ర గ్రంథ వ్యాఖ్య యొక్క
యెత్తు; తత్కీర్తి నింగెత్తు కెదిగి పోయె/ రాఘవాచార్య జీవిత గ్రంథ మదియె

పారాయణాత్మక నారాయణ శతక/ మున కర్థ వివరణములను వ్రాసె
లోక ప్రసిద్ధమౌ రుక్మిణీ కల్యాణ/ మును గూర్చి వ్యాఖ్యానమును రచించె
యతిరాజ రామానుజాచార్య విరచిత/ బ్రహ్మ సూత్రార్థ తత్త్వమును దెలిపె
వేదాంత దేశిక విశ్రుత స్తోత్ర కా/ వ్యములకు తెలుగు వ్యాఖ్యలను వ్రాసె

ఒక్కటా కాదు ముప్పది యొక్క స్తోత్ర/ కావ్యములకు రచించె వ్యాఖ్యానములను
సంభృత శ్రుతుల్ విద్యార్థి జనులు మెచ్చ/ రాఘవాచార్యు డతుల ధీ భ్రాజితుండు

ఒక కంట శాస్త్రమ్ము లొక కంట కావ్యముల్/ సమ ధర్మ రస లక్షణముల నిలిపె
ఒక చేత సంస్కృత మ్మొకచేత తెలుగును/ లిఖియించి విజ్ఞాన శిఖల నిలిపె
ఒక వైపు నాళ్వార్ల నొక క్రేన నాచార్య/ వరసేవ వారి తత్త్వములు నిలిపె
ఒక దిక్కు విబుధుల నొక వైపు పామర/ జన వాంఛలను దీర్చి సమత నిలిపె

లబ్ధవర్ణుల పూజించి లబ్ధి నొందె/ శిష్య గణముల దీవించి సేవలొందె
అఖిలబంధులు దరిజేర నాదుకొనుచు/ రాఘవార్యుడు సుగుణాభి రాముడయ్యె

ఉభయ వేదాంతముల గూర్చి సభలయందు
పండితేంద్రులు మెచ్చ నుపన్యసింప
హృద్యమగు రీతి వ్యాఖ్యాన కృతులు వ్రాయ
సత్కరించిరి రాఘవాచార్య గురుని
విబుధ వరులు 'వాచస్పతి' బిరుద మొసగి

ప్రథిత కోవిదుల్ 'పండితరత్న' యనుచు/ గౌరవించిరి ఘన సభాగారమందు
నిండు సభ 'సర్వశాస్త్ర మార్తాండ' యనుచు/ రాఘవార్యుని మెచ్చిరి ప్రాజ్ఞులెల్ల

అమర భాషాగత విమల సారస్వత/ సౌందర్య పులకిత స్వాంతు డతడు
ఆంధ్ర వాణీ ప్రపంచాఖిల ఘన ప్రబం/ ధ సుగంధ భరిత చేతస్కు డతడు
ద్రావిడ శారదా రమణీయ చిన్మయ/ నారాయిరా స్వాదన మతి యతడు
వేద చతుష్టయ విపుల పావనమంత్ర/ పఠన పాఠన కళా ప్రవరు డతడు

ఉరుదు నభ్యసించిన చదువరి యతండు/ హింది అందమ్ము గన్న సహృదయు డతడు
బోధచే మేధచే విష్ణు పూజచేత/ ఆర్యు డాతడు రాఘవాచార్యు డతడు

ధనుల నాశ్రయించని యుపాధ్యాయు డతడు/ చక్రి నర్చించినట్టి సంసారి యతడు
తల్లిదండ్రుల గొలిచిన తనయు డతడు/ సత్యహిత భాషి రాఘవాచార్యు డతడు

శ్రీనివాసా! యనుచు నన్ను జేర బిలిచి/ ప్రేమతో విద్యలను చెప్పి పెండ్లి చేసి
నన్ను సాహితీ పథమున నడిపి, నా దు/ హితలకుద్వాహములు సల్పి హితము గూర్చి
తండ్రి తరువాత తండ్రియై ధర్మశాస్త్ర/ సారమును దెల్పె రాఘవాచార్య గురుడు

పుత్రుడై ఛాత్రుడై మిత్రుడై భర్తయై/ జనకుడై నెరవేర్చె సకల విధులు
ఆర్యుడై ప్రవిమలాచార్యుడై శాస్త్రియై/ అన్నయై కావించె నఖిల విధులు
వేత్తయై నిగమాంతవేత్తయై జ్యోతిష/ విబుధుడై నడిపించె విహిత విధులు
స్ఫూర్తియై వ్యాఖ్యాతృమూర్తియై జ్ఞానార్థి/ విశ్వాని కందించె వివిధ కృతులు

ద్రష్టయై స్రష్టయై యుపదేష్టయునయి/ భక్తుడై నిత్యశుద్ధ ప్రపన్నుడు నయి
ధర్మమూలమౌ జీవన తరువు కరణి/ రాఘవార్యుడు బ్రతికె విలక్షణముగ

సకల సద్గుణ సహధర్మచారిణి యగు/ తన కళత్రము రోగ బాధలను జిక్క
బహు విధమ్ములునైన సేవలను జేసె/ చాలనాళ్లట్లు పెక్కు కష్టాల నోర్చి
తనువు చాలింపగా భార్య, ధర్మమూర్తి/ రాఘవాచార్యుడోర్చె వైరాగ్య భరము

ప్రథిత వేదాంత దేశిక రచితమైన/ 'యాదవాభ్యుదయ'మను కావ్యమణికి నొక
వ్యాఖ్య రచియింప దలపెట్టి వ్రాసె కొంత/ వరకు, నంతట భీకర వ్యాధి వచ్చి
గుండెపై బడి రచియింపకుండ జేసె/ నతని సౌవర్ణ లేఖిని యాగిపోయె

పుత్రు డంతట నొక ఆసుపత్రి యందు/ తండ్రి జేర్పించి సమకూర్చె తగు వసతు
లైన నేమిటి? కాలమ్ము నాపగలమె?/ కడకు రాఘవాచార్యుడు కన్నుమూసె

మా తిరుమల కుటుంబము మాటరాక/ కుమిలి కుమిలి దుఃఖించెను గుండె పగుల
చిమ్మ చీకట్లు కన్నుల గ్రమ్మి వేసె/ పల్లవించిన ఆశలు వాడిపోయె

ప్రవహించు భాషా స్రవంతి తటాలున/ ఇంకినట్లుగ దోచె నెదలయందు
విరిసిన బహుశాస్త్ర వృక్ష మెకాయెకి/ కూలినట్లనిపించె గుండెలందు
దీపించు సాహితీ దీపమొకేసారి/ మలిగినట్టుల దోచె మనసులందు
వేదాంత తత్త్వముల్ విరచించు లేఖిని ఆగినట్లనిపించె నాత్మలందు

కొడుకుగా అన్నగా నొక కూర్మి భర్త/ గా జనకునిగా నొజ్జగా ఘన కుటంబ
సారథిగ ధర్మ సంసార జలధి నీది/ అలసిపోయిన గుండియ ఆగిపోయె

పరమ వైష్ణవ భక్తి ప్రపత్తులు గని/ విష్ణువే త్వరపడి యట్లు పిలిచె నేమొ!
సాగిపోయెను రాఘవాచార్య గురుడు/ ముక్తుడై వేగ వైకుంఠమును గనంగ

వేంకటరమణుడు పుత్రుడు/ సంకటముల బాపు శక్తిసాంద్రుడు ఘనుడున్
పంకజనాభుని భక్తుని/ వేంకట రాఘవున కంత్య విధులన్ జరిపెన్

శ్రద్ధతో పెట్టి మాసిక శ్రాద్ధములను/ జనకు నెడగల భక్తితో ఘనుల బిలిచి
సకలమైనట్టి సాంవత్సరిక విధులను/ నిర్వహించెను ధార్మిక నిరతి మెరయ

జనకుడైనట్టి రాఘవాచార్య కీర్తి
చంద్రికలు వెల్గ దశ దిశాంచలము లందు
ఉభయ వేదాంత విజ్ఞాన ప్రభల నొప్పు
సజ్జనుల చేత రాఘవాచార్య కృతుల
గూర్చి వ్యాసముల్ కైతలన్ కోవిదతను
వ్యక్తి శక్తుల వ్రాయించి భాసురమగు
నొక్క సాహిత్య సంచిక నుల్లమలర
విబుధ వర్గము మెచ్చ నావిష్కరించి *(03-07-2017న)*
సర్వరసులకునందించి సంచికలను
సముచితమ్మగు రీతిగా సత్కరించె
ఘనుడు చైతన్యమూర్తి వేంకట రమణుడు.

ఖాళీ గది

తాళ్లపల్లి మురళీధరగౌడు
చరవాణి: 9393 176 552

ఎప్పుడు వెళ్లినా
ఆ ఇంట్లో ఒక మూలగదిలో
ఒక అక్షర తపస్వి తన పనిలో నిమగ్నమై ఉండేవాడు
అందరూ మేల్కొన్నప్పుడు అతను నిద్రావస్థలో ఉండేవాడు
లోకమంతా నిద్రిస్తున్నప్పుడు మేల్కొని గ్రంథరచన చేస్తుండేవాడు

అతడు నవ్వినప్పుడు
పుంభావ సరస్వతి నవ్వినట్టుండేది
అతడు సంభాషించినప్పుడు
సంస్కృత భారతి అతని రసనాగ్రంపై నాట్యమాడేది

అతణ్ని చూసినప్పుడు
అభినవ పోతనలా కనిపించేవాడు
మల్లినాథసూరిలా అతని వ్యాఖ్యలు సాగేవి
దేశికుల వారి సంస్కృత సాహిత్యాన్ని
సరళసుందరంగా పాఠకుల కందించేవాడు
దేవభాష ఇంత అందమైనదా అని అబ్బురపరచేవాడు

అప్పుడప్పుడూ నా తల నిమిరినప్పుడు
ఏదో అనిర్వచనీయ, అలౌకికానందం కలిగేది
'నాయనా' అన్న ఆ ఒక్క పిలుపుతో
నా హృదయం ఆర్ద్రమై పోయేది
మా నాన్నే బతికి ఉంటే ఇలాగే పిలిచేవాడేమో!

అతని చివరి గ్రంథం శుద్ధప్రతిని అచ్చుకై నా కప్పగించి
నా చేతిని గట్టిగా పట్టుకొని నా కళ్లలోకి చూసినప్పుడు
చలించిపోయాను
ఎప్పటికీ ఆ సన్నివేశం మరచిపోలేనిది

'రేపు హాస్పిటల్‌కు వెళ్లివస్తాను నాయనా' అన్నప్పుడు
"ఇది మామూలుగా ఎప్పుడూ జరుగుతున్నదే కదా!
ఎన్నిసార్లు ఇలా వెళ్లిరాలేదూ!" అని అనుకున్నానే కాని
అతని మహాప్రస్థానం అప్పుడే ఆరంభమౌతున్నదని
ఊహించలేకపోయాను

ఇప్పుడు ఆ తపస్వి తన గది ఖాళీ చేసి,
వైకుంఠ యాత్రకు వెళ్లిపోయాడు
తిరిగిరాని లోకాలకు పయనమయ్యాడు
ఆ ఒంటరి గదిని ఎలా చూడను?
అతడు లేని ఆ గదిలో ఎలా అడుగు పెట్టను?

శ్రీ వేదాంత దేశికుల సంగ్రహ జీవిత చరిత్ర

కె.వి.రాఘవాచార్యులు

గురుభ్యస్తద్గురుభ్యశ్చ నమోవాక మధీమహే।
వృణీ మహే చ తత్రాద్యౌ దమ్పతీ జగతాంపతీ॥

శ్రియఃపతి, ఉభయ విభూతి నాయకుడైన శ్రీమన్నారాయణుడు హంస, మత్స్య, హయగ్రీవ, నరనారాయణాద్యనేకావతారాలెత్తి సంసార ప్రవాహంలో పడి కొట్టుమిట్టాడుతున్న జీవులు తనను ఉపాసించి తరించడం కోసం వేదమార్గాన్ని నెలకొల్పాడు. భగవత్తత్త్వాన్ని తెలిపే శాస్త్రాలను ప్రవర్తింపజేశాడు. అజ్ఞానులైన చేతనులు ఆ సౌలభ్యాన్ని గమనించకపోవడమే కాక "అవజానంతి మాం మూఢాః" అని ఆయన ఆవేదన పడే రీతిగా ప్రవర్తించారు. భగవానుడు పరమ దయాళువు కాబట్టి మరొక ఉపాయాన్ని పన్నినాడు. క్రూరమృగాలను పట్టుకొనే వ్యక్తి మరొక మృగాన్ని ఎరగా చూపి వాటిని పంజరంలో పడేలాగా చేసుకొంటాడు కదా! అలాగే సర్వేశ్వరుడు తన పారిషదులలో కొందరిని ఈ జీవులతో సమానంగా లోకంలో అవతరింపజేస్తే, వారి ఉపదేశానుష్ఠానాలవల్ల జనులు జ్ఞానులవుతారని ఆశించి, క్రమంగా ఆళ్వారులనూ, ఆచార్యులనూ అవతరింపజేశాడు.

ప్రాచీనమైన విశిష్టాద్వైత సంప్రదాయాన్ని ఆళ్వారులు భగవద్భక్తి పరీవాహరూపాలైన తమ దివ్య ప్రబంధాల ద్వారా ప్రపంచానికి వెల్లడించారు. తరువాత 11వ శతాబ్దిలో శేషాంశ సంభూతులైన భగవద్రామానుజాచార్యులు బాగా చెదరిపోయిన వైదిక పద్ధతిని చక్కదిద్ది, శ్రీ భాష్యాది సంస్కృత గ్రంథాల ద్వారా ఆ విశిష్టాద్వైత సిద్ధాంతాన్నే స్థిరీకరించి జగదుపకారులైనారు.

కొంతకాలానికి ఉభయవేదాంత సంప్రదాయ ప్రవిష్టులలోనూ ఆచార ధర్మాలను పాటించడం పట్ల ఔచిత్యానౌచిత్యాలను గమనింపలేనట్టి లోపాలు ఏర్పడినాయి. అందువల్ల జ్ఞానానుష్ఠానాల మూలంగానూ, ప్రబంధ రచనల చేతనూ శ్రీ భాష్యాన్ని బలపరుస్తూ, రామానుజ సిద్ధాంతానికి మంచి పూనికనిచ్చే మరొక అవతారం అత్యవసరమయింది. ఆ అవతార విశేషమే శ్రీ వేదాంత దేశికులు.

శ్రీమద్రామానుజాచార్యులవారి అంతేవాసులలో సుప్రసిద్ధులైన శ్రీకూరేశులు, దాశరథి, ప్రణతార్తి హరాచార్యులు మొదలైన గొప్ప విద్వాంసులెందరో ఉండిరి. వీరిలో ప్రణతార్తి హరాచార్యులు సంస్కృత వేదాంత శాస్త్రంలో ఉద్దండ పండితులు. వీరికి 'కిడంబి ఆచ్చాన్' అని ప్రసిద్ధమైన పేరు. రామానుజుల వారే వీరికి 'వేదాంతోదయనుడు' అని బిరుదునిచ్చి శ్లాఘించారు.

శ్రీరంగనాథ దేవాలయంలోని అర్చకస్వాములకు రామానుజులవారు విధించిన పడికట్లను పాటించడం కష్టమనిపించింది. యత్యాశ్రమ నియమానుసారంగా రామానుజులవారు గృహస్థులైన స్వాముల ఇండ్లకు ఎప్పటివలె భిక్షకు పోగా, ఒక గృహస్థుడు అన్నంలో విషం కలిపి భిక్షను పెట్టాడు. అంతేవాసులు వన్నెమారిన

భిక్షాన్నాన్ని నిషేధింపగా దాన్ని ఒక కుక్క తిని మరణించింది. అప్పటినుంచి రామానుజులవారు ఉపవాస దీక్షకు పూనుకొన్నారు. వీరిని పరామర్శించడానికి వీరి ఆచార్యులైన మహా పూర్ణులు వస్తుండగా రామానుజుల వారు ఎదురేగి సాష్టాంగ ప్రణామం చేశారు. వీరు లెమ్మనలేదు, వారు లేవలేదు. కావేరిలో పట్టపగలు కాలుతున్న ఇసుకలో కమిలిపోతున్న సుకుమార శరీరాన్ని చూచి సహించలేక ప్రణతార్తి హరాచార్యులు రామానుజులవారిని ఆవేశంతో భుజాలపైన ఎత్తుకొనిపోయి మఠంలో శైత్యోపచారం చేస్తుండగా, మహాపూర్ణు లక్కడికి వచ్చారు. 'మీకు ప్రాణసమానులైన ఈ అంతరంగ శిష్యునితోనే మఠంలో వంట చేయించుకొని ప్రసాదాన్ని స్వీకరించు'మని మహాపూర్ణులు రామానుజుల వారిని ఆదేశించారు. ఈ ప్రణతార్తి హరాచార్యులే రామానుజ మఠంలో ఆచార్యులవారికి మహానసికులుగా నియమితులైనారు. వేదాన్తోదయనా (ప్రణతార్తి హరా) చార్యుల పుత్రుడు రామానుజాచార్యులు. వీరి పుత్రుడు పద్మనాభ నామాంతరులైన రంగరామానుజాచార్యులు. వీరికి 'ఆత్రేయ రామానుజాచార్యులు' అనే పుత్రుడు 'తోతాద్ర్యంబ' అనే పుత్రిక కలిగారు. 'కిడాంబి అప్పుళ్ళార్' అనీ 'వాదిహంసాంబువాహులు' అనీ ప్రసిద్ధ నామధేయులైన ఈ ఆత్రేయ రామానుజులు, శ్రీ భాష్యానికి శ్రుతప్రకాశికా వ్యాఖ్యాన కర్తలైన శ్రీ సుదర్శన భట్టర్ (వీరిద్దరు) 'నడాదూర్ అమ్మాళ్' అనే సుప్రసిద్ధులూ, శ్రీ భాష్య సింహాసనాధీశులూ అయిన 'వాత్స్యవరదాచార్యుల వారికి శిష్యులు (దేశికుల వంశవృక్షమున్న పుట దర్శనీయమ్).

భగవద్రామానుజులవారు నియమించిన చతుస్సప్తతి (74) సింహాసనాధిపతులలో ఒకరైన 'శ్రీ అనంత సోమయాజి' కాంచీనగరం వద్ద 'తూప్పుల్' అనే అగ్రహారంలో దీపప్రకాశాఖ్య దేవాలయ సమీపంలో నివసించారు. వీరి పుత్రుడు 'పుండరీకాక్ష సోమయాజి'. వీరి పుత్రుడైన 'అనంతసూరి'కి ఆత్రేయ రామానుజుల సోదరియైన 'తోతాద్ర్యంబ' ధర్మపత్ని అయింది. ఈ దంపతులు తిరుమలకు వెళ్ళి శ్రీ వేంకటేశ్వరస్వామికి అర్చనచేసి ప్రార్థించారు. నాటి రాత్రి తోతాద్ర్యంబ గర్భమందు శ్రీ వేంకటేశ్వరస్వామి ఘంట ప్రవేశించినట్లు దంపతులు కలగన్నారు. అనతి కాలంలో వీరికి సుపుత్రుడు ఆవిర్భవించాడు. అది విభవనామ సంవత్సరం 1268 ఎ.డి. (పురటాశి) కన్యామాసం. ఆశ్వీజ శుక్ల ఏకాదశి శ్రవణ నక్షత్రం. శ్రీ వేంకటేశ్వరస్వామికి (బ్రహ్మోత్సవంలో) చక్రతీర్థోత్సవం జరుగుతున్న శుభదినం. విశ్వామిత్ర గోత్రానికి చెందిన మహానుభావుడు 'అనంతసూరి' శ్రీ వేంకటేశ్వరస్వామి జన్మనక్షత్రాన అవతరించిన ఆ శిశువుకు వేంకటనాథుడని నామకరణం చేశారు.

"ఉత్ప్రేక్ష్యతే బుధజనైరుపపత్తి భూమ్నా ఘంటాహరేస్సమజనిష్టయదాత్మనేతి" (సం.సూ) వీరి జీవిత కాలంలో లోకులు వీరిని ఆ 'వేంకటేశుని ఘంటావతారు'లని వ్యవహరించారన్న వీరి మాటచే స్పష్టీకృతం.

'అప్పుళ్ళార్' ఆ బాలునికి ఐదవయేట అక్షరాభ్యాసం చేసి, రామాయణ, భారత, భాగవత కథలను బోధించాడు. ఆ సంవత్సరమే కంచి వరదరాజు దేవాలయంలో శిష్యులకు శ్రీ భాష్యప్రవచనం చేస్తున్న శ్రీ వాత్స్యవరద గురు సన్నిధికి తన భాగినేయుడైన బాలుణ్ని వెంట తీసుకొని వెళ్ళాడు. దివ్యతేజస్సంపన్నుడైన ఈ బాలుణ్ని చూచి, గోష్ఠిలో కాసేపు ప్రవచనం ఆపి, "ఆ బాలుడెవరు?" అని ఆ గురువు అప్పుళ్ళార్‌ను

అడిగాడు. ఆయన 'తన మేనల్లు'డని చెప్పాడు. ఆగిపోయిన ప్రవచనం ఎంతవరకు పూర్తి అయిందో అని ఆ వరద గురువు ఆలోచించసాగాడు. "ఆచార్యవర్యా! దాసుడు ఈ గోష్ఠిలో ప్రవేశించుసరికి 'శాస్త్రయోనిత్వాత్' అనే వాక్యార్థాన్ని దేవరవారు ప్రవచిస్తున్నారు కదా!"' అని సూచించిన ఆ బాలుని జ్ఞాపకశక్తికి సదస్యులందరు ఆశ్చర్యపడినారట. వాత్స్య వరదాచార్యులు మహానుభావులు. వీరికి 'నడాధూర్ అమ్మాళ్' అని ప్రసిద్ధ నామమేర్పడింది. 'అమ్మాళ్' అంటే మాతృమూర్తి అని అర్థం. స్త్రీలింగ శబ్దం. వీరు ప్రతిదినం కాచిన పాలుతెచ్చి నోటితో ఊది చల్లార్చి వరదరాజ పెరుమాండ్లకు ఆరగింపు సమర్పించేవారు. 'నడాధూర్' గ్రామానికి చెందిన వీరిని ఆ వరదరాజ స్వామి 'నడాధూర్ అమ్మాళ్' అని ఆదరంతో పిలిచేవారట. అట్టి వరద గురువు వేంకటనాథుణ్ని ఆపాదమస్తకం చూచి, "ప్రతిష్ఠాపిత వేదాన్తః ప్రతిక్షిప్త బహిర్మతః। భూయా స్త్రై విద్యమాన్యస్త్వం భూరికల్యాణ భాజనమ్॥" (సం.సూ) (నీవు ఇతర మతసిద్ధాంతాలను ఖండించి, వేదాంత శాస్త్ర సిద్ధాంతాన్ని స్థిరంగా స్థాపించి వేదమూర్తులచే సమ్మానితుడవై, సకల శుభాలను పొందెదవు గాక) అని అనుగ్రహించారు.

తండ్రిగారు తనయునికి ఏడవయేట యథావిధి ఉపనయన సంస్కారం చేశారు. అప్పటినుంచి గురువూ, మేనమామగారూ అయిన ఆత్రేయ రామానుజాచార్యులు వేంకటనాథునికి శ్రద్ధతో వేద, వేదాంగ, తర్కమీమాంసాది శాస్త్రాలనూ, రామానుజ దర్శనాది సకల విద్యలనూ బోధించారు.

శ్రీవేంకటనాథశర్మ మంచివర్చస్వి, మేధావి, ఏకసంథాగ్రాహి. కాబట్టి 'వింశత్యబ్దే విశ్రుతనానావిద్యః ' (సం.సూ) ఇరువదేండ్ల ప్రాయంవరకే సకల విద్యలను అభ్యసించాడు. ఆత్రేయ రామానుజాచార్యులు ఈయన సదాచార నిష్ఠకు సంతోషించి, గరుడ మంత్రాన్ని ఉపదేశించారు. గుర్వాజ్ఞా ప్రకారం కంచి నుంచి తిరువ హీంద్రపురం వెళ్ళి, అక్కడ గరుడనదిలో స్నానం చేసి, ఔషధాద్రిపైన అశ్వత్థ వృక్షం క్రింద పద్మాసనుడై గరుడ మంత్రోపాసన చేశాడు. గరుత్మంతుడు ప్రత్యక్షమైనాడు. వేంకటనాథశర్మ గరుడ దండకంతో స్తుతించాడు. ప్రసన్నుడైన ఆ విష్ణురథుడు శ్రీ హయగ్రీవ మంత్రాన్ని ఉపదేశించాడు. తదేక దీక్షతో ఉపాసన చేసిన వేంకటనాథశర్మకు లక్ష్మీహయవదనుడు సాక్షాత్కరించి తన లాలాజలాన్ని పానం చేయించాడు. ఆ దైవానుగ్రహం చేత సకల శాస్త్రాలు ఈయన జిహ్వాగ్రాన నర్తించాయి. ఆ క్షణాన, ఆశువుగా శ్రీహయగ్రీవ స్తోత్రం చేశాడు.

విద్యావ్రతస్నాతకానంతరం శ్రీ వేంకటనాథస్వామి 'తిరుమంగై' (కనకవల్లి) అనే కన్యకను ధర్మపత్నిగా స్వీకరించారు. గృహస్థాశ్రమ ధర్మాన్ని చక్కగా అనుష్ఠిస్తూ, వీరు నాలుగు ఆశ్రమాలలో ద్వితీయమైనా, గృహస్థాశ్రమమే అద్వితీయమైనదని నిరూపించిన మహాపురుషులు.

తమనాశ్రయించిన శిష్యబృందాలకు వేదాంత శాస్త్రగ్రంథాలను ప్రవచిస్తుండేవారు. 'సంకల్ప సూర్యోదయ' నాటకాన్ని రచించే కాలం వరకు 'త్రింశద్వారం శ్రావిత శారీరక భాష్యః' అంటే ముప్పదిసార్లు శ్రీ భాష్య ప్రవచనం పూర్తి అయిందని వీరే విశదపరచారు.

అద్వైత పండితులు కొందరు శ్రీరంగంలో సంప్రదాయ సిద్ధంగా జరిగే అధ్యయనోత్సవాన్ని జరుపకుండా మాన్పించారు. అక్కడి పండితులు వృద్ధులైనందువల్ల వారితో వాదించడానికి సాహసించలేదు. ఆలయ

ధర్మాధికారి, అప్పటికి లబ్ధప్రతిష్ఠులైన శ్రీ వేంకటనాథ దేశికులకు ఆహ్వాన పత్రికను పంపినాడు. వార్తాహరుల వెంట దేశికులు శ్రీరంగం చేరినారు. సభలో చాలారోజులు వాదోపవాదాలు చెలరేగాయి. తుదకు ప్రత్యర్థులు పరాజితులై పాదాక్రాంతులైనారు.

శ్రీ వేంకటనాథ దేశికులు, అమితోత్సాహపరులైన ధర్మాధికారి, ఆచార్యపురుషులు, అర్చక స్వాములు మొదలైన భాగవతోత్తములతో కలిసి అధ్యయనోత్సవాన్ని వైభవంగా జరిపించారు. ఈ వాదాల సారాంశమే తర్వాత, 'శతదూషణి' అనే ప్రౌఢమైన వేదాంత వాద గ్రంథంగా దేశికులచే ఆవిష్కృతమయింది.

శ్రీ వేంకటనాథ దేశికులవారు కొంతకాలం అళగిర్ కోవిల్, మధురై, శ్రీ విల్లిపుత్తూర్, ఆళ్వార్ తిరునగరి, వానమామలై, త్రివేంద్రం, గోపపురం (తిరుక్కోవలూర్) ఇత్యాది దక్షిణ దివ్యదేశాలను సందర్శిస్తూ, దేహళీశ స్తుతి మొదలైన స్తోత్రాలను రచించారు. క్రమంగా ఉత్తర భారతదేశంలోనూ 'మధుర, బృందావనం, ద్వారక, అయోధ్య, గయా, ప్రయాగ, హరిద్వార్, బదరీత్యాది' దివ్యతీర్థ క్షేత్రాలను సందర్శించి, యాదవాభ్యుదయం, హంససందేశ కావ్యాలను నిర్మించారు. తిరుమలకు వేంచేసి శ్రీనివాసుని సేవించి 'దయాశతకం' రచించారు. శ్రీ పెరుంబూదూరులో భగవద్రామానుజమూర్తిని సందర్శించి యతిరాజ సప్తతిని, కంచిలో వెలసియున్న భగవన్మూర్తుల విషయంగా వరదరాజ పంచాశత్, వేగాసేతు స్తోత్రాదులను రచించారు. శ్రీరంగంలో వేంచేసి యున్నప్పుడు శ్రీస్తుతి, భూస్తుతి, దశావతార స్తోత్రం, భగవద్ధ్యాన సోపానం, శ్రీరంగనాథ పాదుకా సహస్రమ్ మొదలైన స్తోత్రకావ్యాలనేకాక మీమాంసాపాదుకా, సేశ్వరమీమాంస, న్యాయ పరిశుద్ధి, న్యాయ సిద్ధాంజనమ్, ఇత్యాది శాస్త్రగ్రంథాలనూ రచించారు. అమృతరంజని, అమృతాస్వాదిని, పరమపద సోపానమ్ మొదలైన ద్రావిడ ప్రబంధాలనూ నిర్మించారు. భగవద్రామానుజ సిద్ధాంతమని ప్రసిద్ధి చెందిన ప్రాచీన విశిష్టాద్వైత సిద్ధాంతాన్నే తమ 'ప్రాకృత, సంస్కృత, ద్రవిడ' ప్రబంధాలలో అద్భుతంగా ప్రతిపాదించారు.

విద్వత్పరిషత్తు దేశికులను 'కవితార్కికసింహ' అనే బిరుదునిచ్చి ప్రశంసించింది. ఆధీతి బోధాచరణ ప్రచారణల ద్వారా వేదమార్గ ప్రతిష్ఠాపనాచార్యులైనారని శ్రీరంగనాథుడు 'వేదాంతాచార్యులు' అనే బిరుదును, శ్రీరంగనాయకి 'సర్వతంత్ర స్వతంత్రులు' అనే బిరుదును వీరికి అనుగ్రహించారు.

శ్రీ భాష్య సారార్థమైన ఐదువందల స్రగ్ధరావృత్తాలతో కూడిన 'అధికరణ సారావళి' అనే గ్రంథారంభంలో 'విశ్వస్మిన్నామ రూపాణ్యను విహితవతా తేనదేవేన దత్తామ్! వేదాన్తాచార్య సంజ్ఞామవహిత బహువిత్ సార్థ మన్వర్థయామి॥" (ఈ రచనలో పెరియ పెరుమాండ్లు ప్రసాదించిన బిరుదును అన్వర్థీకరించుకొంటున్నాను) అని దేశికులు ప్రకటించుకొన్నారు. ఈ ప్రబంధానికి తాత్పర్య వివరణ రూపమైన 'అధికరణ దర్పణ' మనే గ్రంథాన్ని వీరే రచించారు.

కంచిలోనే జ్ఞాన వైరాగ్య భూషణులై ఉంఛవృత్తితో కాలక్షేపం చేస్తున్నప్పుడు, వేదాంత దేశికులకు 48వ యేట, శ్రీ వరదరాజస్వామి కృపవల్ల 'కనకవల్లి తాయార్' కు పుత్రుడు ఉదయించాడు. అది నళనామ సంవత్సరం, ఆవణిమాసం, రోహిణీ నక్షత్రం తేది: 11 ఆగష్టు 1316 ఎ.డి. దేశిక స్వామి తన పుత్రునికి



'వరదాచార్యులు' అని నామకరణం చేశారు. వరదాచార్యులు తండ్రిగారి వద్దనే విద్యనభ్యసించి సకలశాస్త్ర పారంగతుడైనారు.

"పిత్రే బ్రహ్మోపదేష్ట్రే మే గురవే దైవతాయచ।
ప్రాప్యాయ ప్రాపకాయాస్తు వేంకటేశాయ మంగళమ్॥"

(దేశిక మంగళా శాసనమ్)

'జనకుడు, బ్రహ్మోపదేష్ట, గురువు, దైవం, ప్రాప్య, ప్రాపకులు కూడా తమ తండ్రిగారే అని (కుమార వేదాంతాచార్యులు) శ్రీ వరద నాథనయినారాచార్యులు 'శ్రీ వేదాంతదేశిక మంగళా శాసనం'లో అనుసంధించారు.

ఆచార్యులను ఆశ్రయించి ఉజ్జీవించాలనుకొని 'సర్వజ్ఞ సింగప్ప' శ్రీ వేదాంత దేశికులవారిని తన నగరమైన 'వేంకటగిరి'కి వేంచేయవలసినదిగా ప్రార్థించాడు. కాని దేశికులు మాత్రం ఆ పరమాస్తికుని నగరానికి వెళ్ళలేదు. కృపాప్రసన్నులైన ఆచార్యులు కాబట్టి, 'సుభాషితనీవి' అనే నీతి కావ్యాన్ని, తత్త్వసందేశం, రహస్య సందేశం, రహస్య సందేశ వివరణం' అనే మరో మూడు గ్రంథాలను మణిప్రవాళ శైలిలో వ్రాసి ఒక శిష్యునితో పంపి సర్వజ్ఞ సింగప్పకు అందజేశారు.

క్రీ.శ. 1327వ ప్రాంతంలో మహమ్మదీయుల దండయాత్ర దక్షిణ భారతదేశానికి కూడా విస్తరించింది. 'ఢిల్లీ సుల్తాన్ సేనానియైన మాలికాఫర్' శ్రీరంగం, మధురపై దాడి చేశారు. ఆ సమయాన ఆచార్య పురుషులు సమావేశమై శ్రీరంగ మందిర సంరక్షణ కోసం మూడు వర్గాలుగా ఏర్పడ్డారు. వృద్ధులైన శ్రీ పిళ్ళై లోకాచార్యుల వారు శ్రీరంగనాథుని ఉత్సవ మూర్తులను పల్లకిలో వేంచేపించి రహస్యంగా కావేరి దాటి దక్షిణ దిశకు పయనించారు.

విశిష్టాద్వైత సిద్ధాంత సర్వస్వమైన 'శ్రుతప్రకాశికా' శ్రీ భాష్యాన్ని చక్కగా విని వ్యాఖ్యానించిన, గ్రంథ కర్తయైన శ్రీ సుదర్శన భట్టర్ మందిర సంరక్షణకు పాటుపడదలచారు. వారు 'శ్రుతప్రకాశిక'నూ, తన ఇద్దరు పుత్రులనూ భద్రంగా కాపాడుమని అప్పగించినందువల్ల, దేశికులు వారిని వెంటపెట్టుకొని వాయవ్య దిశకు పయనించారు.

మందిర ద్వారాలను పెద్ద బండరాళ్ళతో అచ్ఛాదించి ప్రాకారరక్షణ కోసం పాటుపడుతున్న శ్రీ సుదర్శన సూరి మహమ్మదీయుల పాశవిక శక్తికి బలియైనారు.

దేశిక స్వామి దారిలో బాలురనిద్దరిని రాత్రిపూట పడుకోపెట్టి, వారిపై ఆకులు, కొమ్మలు కప్పి, కొంత దూరాన వ్యాఖ్యాన సహిత శ్రీ భాష్య గ్రంథాన్ని క్రిందపెట్టి దానిపై తానూ, శవాల నడుమ పడుకొన్నాడట.

"శ్రీరంగేనగరే ధరాజకహతే నష్టేషు సైద్ధాంతిక
గ్రంథేష్వేష్వఖిలేషు ఘోరమయితే శ్రీ వైష్ణవానాం హతే।

ఆచ్ఛాద్యస్వతనుం శవైశ్చ తదధః సంస్థాప్యతత్పుస్తకం
వేదాన్తా ర్యగరూ రరక్షచ పునస్సంచారయామాసతత్॥"

ఆ ఘోర విపత్తులో, ఆపద్ధర్మంగా ప్రాణాలనూ, విశిష్టాద్వైత సిద్ధాంత గ్రంథాన్నీ రక్షించి తర్వాత ప్రచారం చేశారని సుశ్లోకితం.

ప్రభాతకాలాన లేచి గ్రంథాన్ని, బాలురనూ తీసుకొని కొన్ని దినాలు ప్రయాణం చేసి, కర్ణాటక రాష్ట్రంలోని 'సత్యకాలం' (ఇప్పుడు సత్యమంగళం) అనే గ్రామానికి చేరుకొన్నారు దేశికులు. ఆ గ్రామంలో చిరకాలం నివసించారు. బాలురకు యథావిధి ఉపనయనం చేశారు. విద్యనూ బోధించారు. అక్కడనే దేశికుల పుత్రుడునూ, శ్రీ బ్రహ్మతంత్ర స్వతంత్ర స్వాములూ (మైసూరు పరకాల మఠ యతిగురువులు) దేశికులవారి సన్నిధిలో శాస్త్రాధ్యయనం చేశారు. తురుష్కులదాడి అంతరించి, దేశంలో శాంతి రాజ్య ముదయించడానికి, శ్రీరంగనాథుడు యథాస్థానంలో నెలకొనడానికి దేశికులు నిరంతరం ప్రార్థించారు. ఆ విధంగా సాగినదే 'అభీతిస్తవం' (సత్యకాలంలోనే 'నిలబడినట్లున్న దేశికుల విగ్రహం' ఉంది.)

అక్కడినుంచి తిరునారాయణపురం (మేల్కోటె) చేరి, శెల్వపిళ్ళై పెరుమాళ్ళను సేవించారు. శ్రీ రామానుజ సిద్ధాంత నిర్ధారణ సార్వభౌములుగా వాసి గాంచారు. ఆత్రేయ రామానుజ దయాపాత్రులు కాబట్టి వీరిని బ్రహ్మతంత్ర స్వతంత్ర స్వాములవారు ఆశ్రయించి-

"రామానుజ దయాపాత్రం జ్ఞానవైరాగ్య భూషణమ్।
శ్రీ మద్వేంకట నాథార్యం వందే వేదాన్త దేశికమ్॥"

అనే శ్లోకాన్ని వ్రాసి సమర్పించారు.

కాంచీనగర శిక్షాకేంద్రంలో దేశికులకు సహపాఠియైన శ్రీ విద్యారణ్యస్వామివారు యవనులను పరిమార్చి, విజయనగర రాజ్యస్థాపకుడైనాడన్న వార్తను విన్నారు. ఆ సమయాననే తన ప్రార్థన సఫలమైనట్లూ, జింజికోట దళనాయకుడైన గోపనార్యుడు తురుష్క ముష్కరులను తరిమివేసి, ఆనాటికి తిరుమలలో పూజింపబడుతున్న శ్రీరంగనాథుని ఉత్సవమూర్తులను అతి వైభవంగా శ్రీరంగక్షేత్రానికి తీసుకొని వచ్చాడన్న వార్తనూ దేశికులు విన్నారు. వెంటనే శ్రీరంగం చేరుకొన్న వేదాంత దేశికులవారి సమక్షాన శ్రీరంగనాథుడు పునఃప్రతిష్ఠితుడైనాడు. గోపనార్యుని భక్తిని ప్రశంసిస్తూ దేశికులు ఆశువుగా చెప్పిన రెండు శ్లోకాలు దేవాలయాంతర్భాగాన తూర్పు గోడపైన చెక్కబడి, నేటికీ కనబడుతున్నవి. అప్పటినుంచి శ్రీరంగంలోనే స్థిరంగా ఉన్నారు. శిలావృత్తిచే జీవిస్తున్నారు. భగవత్కైంకర్య ధురంధరులై అనేక గ్రంథాలను రచిస్తున్నారు.

ఆ సందర్భంలో శ్రీ విద్యారణ్యస్వామివారు దేశికులను సన్మానింపదలచి, విద్యానగర చక్రవర్తి ఆచార్యుల మహిమను వినిపించారు. రాజభటుల ద్వార దేశికులకు ఆహ్వాన పత్రాన్ని పంపించారు. విద్యారణ్య అభిప్రాయాన్ని దేశికులు గమనించారు.

(ఉంఛవృత్తిచే జఠరాగ్నిని శమింపజేయ శక్యం కాదా? ఉదరంలో అగ్నిమండిన మండుగాక! మల్లెపూల పరిమళాన్ని వెదజల్లే మాటలతో క్షుద్రమహీపతులను గడ్డిపరకనైనా యాచించను. పిత్రార్జితమూ లేదు. నేనార్జించిన ధనమూ లేదు (పైతామహం). చతుర్ముఖ బ్రహ్మను కన్నతండ్రి- కంచి వరదరాజు పెరుమాండ్లే నాకు ధనం. ధనంజయ స్యందన భూషణమే ధనం- ఈ తాత్పర్యమున్న) 'సిలంకి మనలం భవేదనల మౌదరం బాధితుం" అనే శ్లోకాలను 'వైరాగ్య పంచం' వ్రాసి దేశికులు ఆ భటులతోనే పంపించారు.

ఆచార్యుల విశుద్ధ వైరాగ్యానికి విద్యారణ్యస్వామి వారాశ్చర్యపడి-

"విద్యారణ్యో వివిధం వేంకటసూరేర్విశోధ్య వైరాగ్యమ్।
యం విష్ణోరవతారం మేనే, సేవే తమాగమాంత గురుమ్॥"

నిగమాంత గురువులు సాక్షాత్తుగా విష్ణ్వవతారులే అని గుర్తించి ప్రశంసించారు.

సామాన్య జీవితం గడిపిన నిగమాన్త దేశికులు అద్భుత మహిమ కలవారు.

దేశికులు 'కంచి'లో ఉన్నప్పుడు ఒక తాంత్రికుడు తనతో వాదించడానికి ఆహ్వానించాడు. వాదనలో ఓడించి అతని మనస్సును నొప్పించలేక స్వామి అంగీకరించలేదు. అతడు చెరువులోని నీటిని త్రాగడం ఆరంభించాడు. స్వగృహంలోనే ఉన్న దేశికుల కడుపు ఉబ్బడం మొదలయింది. ఇది తాంత్రికుని కృత్యమే అని గమనించిన స్వామి తన ప్రక్కనే ఉన్న గోడను గోళ్ళతో గీకాడు. దానివెంట నీళ్ళు కారుతూ వీధిలోకి ప్రవహించాయి. చెరువులో నీళ్ళు తగ్గుతున్నా, తాంత్రికుని కుట్ర ఫలించలేదు. వెంటనే అతడు వచ్చి దేశికుల పాదాలమీద సాష్టాంగపడి, క్షమించుమని ప్రార్థించాడు. నీవు చాలామంచి పనిచేశావయ్యా! నీ వల్లనే కదా వాననీరు లేకున్నా నగర వీథులన్నీ శోధింపబడ్డాయి. ఇక ముందు ఎవరినీ నీకంటే తక్కువ వారని తలచక, చక్కగా జీవించుమని దేశికులు ఆదేశించారు.

ఒకనాటి తొలిప్రొద్దున దేశికులు స్నానంచేసి, సూర్యోపస్థానం చేస్తూండగా ఒక వ్యాళగ్రాహి ఒక విషసర్పాన్ని విడిచాడు. ఆ భుజంగం బుస్సుమంటూ తనను కాటువేయడానికి వచ్చి పడగను ఎత్తేలోపల, ఆచార్యులు తనచుట్టు నేలమీద ఒక వృత్తరేఖను గీసాడు. పన్నగం ఆ గీతను దాటి రాలేక దానిచుట్టూ తిరుగుతుండింది. ఆచార్యులు గరుడదండకంలోని మూడవపాదం పఠించేసరికి పక్షిరాజు తుర్రున వచ్చి ఆ ఆ పామును గిర్రున ఎత్తుకొని పోయాడు. పక్షిపాదాల్లో చిక్కుకొని విలవిలలాడే విషధరాన్ని చూచిన అహితుండికుడు ఆచార్యుల పాదాల మీదపడి తన అపచారాన్ని క్షమించుమని ఏడ్చాడు. దేశికులు ఆకాశంవైపు చూచాడు. ఆ పక్షి పామును జారవిడిచిపోయింది. నేలమీద పడి గిలగిలలాడే ఆ పామును అతడు పట్టి బుట్టలో పెట్టుకొని పారిపోయాడు.

తిరువహీంద్రపురంలో బ్రహ్మోత్సవం జరుగుతున్నప్పుడు దేశికులు తైర్థికునిగా అక్కడికి వేంచేశారు. నాటి రాత్రి ఎప్పుడూ తన వెంట ఉండే శ్రీ హయగ్రీవమూర్తికి తిరువారాధనను సమర్పించారు. కాని తన దగ్గర ఏమీ లేనందువల్ల నైవేద్యం పెట్టక విచారంతో ఉన్న ఆ రాత్రి నాల్గవ జామున, ఒక రైతు వచ్చి

దేశికులతో మొరపెట్టుకొన్నాడు. "స్వామీ! అర్ధరాత్రి ఒక తెల్లని గుర్రం వచ్చి నా పంటను మేసి, తిరిగి మీరున్నచోటుకే వచ్చింది. ఇదేమి న్యాయమండి?" అంటూ ఇంక ఏదో అనబోయాడు. కాని అంతలోనే దేశికస్వామి చిన్నగా నవ్వుతూ, "ఓ రైతన్నా! దేవుడు నిన్నూ, నన్నూ అనుగ్రహించాడు. బాధపడకు. పంట బాగా పండుతుంది పో" అన్నాడు. ప్రొద్దున్నే ఆ రైతు తన పొలానికి గబగబా పోయాడు. పిల్లతెమ్మెరల ప్రేరణచే స్వేచ్ఛగా నర్తిస్తున్న ఆ పసుపుపచ్చని పైరులచ్చి, వెన్నులో బరువుతో తలవంచి తనకు స్వాగతం చెబుతుంటే "ఆహా! స్వామి మహిమ ఎంతగొప్పది!" అనుకొంటున్న ఆ రైతు డెందం ఆనందంతో చిందులాడింది.

ఒకనాడొక యువకుడైన బ్రహ్మచారి దేశికుల సన్నిధికి వచ్చి "పెండ్లి చేసుకొంటాను. ధనసహాయం చేయండి స్వామీ!" అని యాచించాడట. పెండ్లి కోసం పెంపర్లాడే ఆ బ్రహ్మచారి దైన్యానికి దేశికుల ఒడలంతా జలదరించింది. వెంటనే ఆశువుగా 'శ్రీ స్తుతి' చేసి ఆ బ్రహ్మచారికి బోధించాడు, అతడు శ్రీమహాలక్ష్మీపాదాల నెదలో నిల్పుకొని 'శ్రీస్తుతి'ని పఠించగా కోరుకొన్న ధనం కుప్పలు కుప్పలుగా కురిసిందట. జ్ఞానలక్ష్మి, వైరాగ సంపద, వాగ్వైభవం ఎంత ఉన్నా, వినయసంపద మాత్రం లేకపోతే ఏదీ రాణించదు. కలికాల ప్రభావంవల్ల అసూయగల కొందరు వైష్ణవులు దేశికులను అవమానించడానికి రాత్రిపూట వీరి గృహద్వారానికి తోరణంగా చెప్పులదండలను కట్టారు. ఉదయాన ఆచార్యులు ద్వారాన్ని తెరచుకొని వెలుపలికి వస్తుంటే ఆ దండలు వీరి తలకు తగిలాయి. చాటుగా ఉండి చూచిన ధూర్తులు చప్పట్లు కొట్టారు. ఆ సవ్వడి విన్న దేశికులు కడు వినయంతో 'కొందరు కర్మావలంబకులైతే మరికొందరు జ్ఞానావలంబకులు కదా! మేము మాత్రం హరి దాసుల పాదరక్షావలంబకులం' (కర్మావలంబకాః కేచిత్, కేచిత్ జ్ఞానావలంబకాః! వయంతు హరి దాసానాం పాదరక్షావలంబకాః!) అనే శ్లోకాన్ని ఆశువుగా విన్నవించారట. అఖర్వగర్విష్ఠులైన వారందరు నేలగీతలు గీశారట.

ఒకనాటి సాయంసమయాన శ్రీరంగనాథుని సన్నిధిలో ఏర్పడిన విద్వత్పరిషత్తులో ఒక విద్వత్కవి 'శ్రీరంగనాథ పదకమల సహస్రమ్' రచించడానికి ప్రతిజ్ఞ చేయగా, దేశికులు 'పాదుకా సహస్ర' రచనకు ప్రతిజ్ఞ చేశారు. అదేరాత్రి దేశికులు 1008 (వేయి ఎనిమిది) శ్లోకాలను రచించి, ఉదయాన పరిషత్తులో ఆ గ్రంథాన్ని చదివి శ్రోతల నానందపరచారు. 'పదకమల సహస్ర' రచనకు ప్రతిజ్ఞ చేసిన ప్రత్యర్థి 300 (మూడు వందల) శ్లోకాలను మాత్రమే రచించగలిగాడని అభియుక్తోక్తి.

శ్రీమద్వేదాన్త దేశికుల కవితా ప్రతిభకు 'శ్రీరంగనాథ పాదుకా సహస్రమ్' విజయధ్వజ వైజయంతీ పతాకంలాంటిదని పండితులెందరో ప్రశంసించారు.

"వితస్తి మాత్రేదారుఖండే సహస్రం వివరాణి రచితవాన్ వేంకటనాథ గురురేవకవిః, అన్యేతుకపయ ఏవ". జిట్టెడున్న కట్టెముక్క మీద వేయి ఛిద్రాలను కల్పించిన వేంకటనాథగురువే కవి. ఇతరులు మాత్రం కవులే, అని ఉద్దండ పండితులైన అప్పయ దీక్షితులు కొనియాడారు.

భగవద్రామానుజుల తర్వాత అవతరించిన శ్రీవైష్ణవ సిద్ధాంత ప్రవర్తకులైన ఆచార్యులలో జ్ఞానానుష్ఠానాల చేతనూ, వైరాగ్య సంపత్తి చేతనూ, వాగ్వైశద్యం చేతనూ మళ్ళీ రామానుజులవంటి ప్రాధాన్యాన్ని ఆక్రమించిన

వారు, సర్వతంత్ర స్వతంత్ర, కవితార్కిక కేసరీ, వేదాంతా చార్యాది బిరుదులతో భూషితులైన శ్రీ వేంకటనాథా చార్యులొక్కరే అనడం పండిత ప్రముఖులు అంగీకరించిన విషయమే. వీరు శతాధిక గ్రంథకర్తలుగా ప్రసిద్ధులు.

దేశికుల రచనలు

కావ్యాలు:-

1) యాదవాభ్యుదయం, 2) హంస సందేశం, 3) సుభాషితనీతి, 4) సమయసాహస్రి, 5) సంకల్ప సూర్యోదయం (నాటకం), 6) అచ్యుత శతకం (ప్రాకృత భాషామయం), 7) అపర్యాప్తామృతస్తుతి, 8), అభీతి స్తవం, 9) అష్టభుజాష్టకం, 10) కామాసికాష్టకం, 11) గరుడ దండకం, 12) గరుడ పంచాశత్, 13) గోపాల వింశతి, 14) దయా సహస్రమ్, 15) దయా శతకమ్, 16) దశావతార స్తోత్రం, 17) దివ్య దేవమంగళా శాసన పంచకం, 18) దేహళీస్తుతి, 19) న్యాస తిలకం, 20) న్యాస దశకం, 21) న్యాస వింశతి, తద్వ్యాఖ్య, 22) పరమార్థ స్తుతి, 23) భగవద్ధ్యాన సోపానం, 24) భూస్తుతి, 25) యతిరాజ సప్తతి, 26) రఘువీర గద్య, 27) వేగా సేతు స్తోత్రం, 28) వైరాగ్య పంచకం, 29) శరణాగతి దీపిక, 30) శ్రీ గోదాస్తుతి, 31) శ్రీ దేవనాయక పంచాశత్, 32) శ్రీ రంగనాథ పాదుకా సహస్రమ్, 33) శ్రీ వరదరాజ పంచాశత్, 34) శ్రీ స్తుతి, 35) షోడషశాయుధ స్తోత్రమ్, 36) సుదర్శనాష్టకం, 37) శ్రీ హయగ్రీవ స్తోత్రమ్, 38) యజ్ఞోపవీత ప్రతిష్ఠావిధి, 39) భగవదారాధన విధి, 40) హరిదిన తిలకమ్, 41) శిల్పార్థ సారః (శిల్పశాస్త్రం) 42) రస భౌమామృతం (వైద్యశాస్త్రం) 43) వృక్ష భౌమామృతం (వైద్యశాస్త్రం), 44) భూగోళ నిర్ణయమ్.

వేదాంత గ్రంథాలు:

45) ద్రవిడోపనిషత్తాత్పర్య రత్నావళిః, 46) ద్రవిడోపనిషత్సారః, 47) మీమాంసా పాదుకా, 48)సేశ్వర మీమాంసా, 49) శతదూషణీ, 50) అధికరణ సారావళిః, 51) తత్త్వ టీకా, 52) న్యాయ పరిశుద్ధిః, 53)న్యాయ సిద్ధాంజనమ్, 54) తత్త్వముక్తా కలాపః (తద్వ్యాఖ్యా- సర్వార్థ సిద్ధిః), 55) గీతాభాష్య తాత్పర్య చంద్రికా, 56) గీతార్థ సంగ్రహః, 57) శ్రీపాంచరాత్ర రక్షా, 58) సచ్చరిత్ర రక్షా, 59) నిక్షేప రక్షా, 60)చతుశ్శ్లోకీ భాష్యమ్, 61) స్తోత్రరత్న భాష్యమ్, 62) గద్యత్రయ భాష్యమ్, 63) ఈశావాస్యోపనిషద్భాష్యమ్, 64) అధికార దర్పణమ్.

రహస్య గ్రంథాలు:

65) సంప్రదాయ పరిశుద్ధిః, 66) తత్త్వపదవీ, 67) రహస్య పదవీ, 68) తత్త్వ నవనీతమ్, 69)రహస్య నవనీతమ్, 70) తత్త్వమాతృకా, 71) రహస్య మాతృకా, 72) తత్త్వ సందేశః, 73) రహస్య సందేశః, 74)రహస్య సందేశ వివరణమ్, 75) తత్త్వ రత్నావళిః, 76) తత్త్వ రత్నావళీ ప్రతిపాద్య సంగ్రహః, 77) రహస్య రత్నావళిః, 78) రహస్య రత్నావళీ హృదయమ్, 79) తత్త్వత్రయ చుళక్కమ్, 80) రహస్యత్రయ చుళక్కమ్, 81) రహస్య శిఖామణిః, 82) అభయ ప్రధాన సారః, 83) అంజలి వైభవమ్, 84) ప్రధాన శతకమ్, 85) ఉపకార సంగ్రహః, 86) సారసంగ్రహః, 87) చకార సమర్థనమ్, 88) మునివాహన భోగః , 89) మధురకవి హృదయమ్, 90) శ్రీమద్రహస్యత్రయ సారః, 91) సారసారః, 92) విరోధ పరిహారః.

ద్రావిడ ప్రబంధాలు:

93) అమృత రంజనీ, 94) అధికార సంగ్రహః, 95) అమృతాస్వాదినీ, 96) అర్థపంచకమ్, 97) శ్రీ వైష్ణవ దినచర్యా, 98) తిరుచ్చిన్నమాలై, 99) పన్నిరునామమ్, 100) తిరుమంత్రచ్చురుక్కు, 101) ద్వయచ్చు రుక్కు, 102) చరమశ్లోకచ్చు రుక్కు, 103) ముమ్మణిక్కోవై, 104) నవమణిమాలై, 105) ప్రబంధసారః, 106) ఆహార నియమః, 107) నిగమ పరిమళః, 108) పందు, 109) కళల్, 110) అమ్మానై, 111) ఊశల్, 112) ఏశల్.

లుప్తమైన గ్రంథాలు ఎన్ని ఉండినవో కదా! వీరి గ్రంథాలన్నిట్లో భగవద్రామానుజ సిద్ధాంతమే ప్రతిపాదింపబడింది. విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని బలపరచినారు కాబట్టి, దేశికులవారిని "రామానుజ సిద్ధాంత నిర్ధారణ సార్వభౌములు" అని ప్రపన్నులు కీర్తిస్తుంటారు.

"నిగమాంత గురుప్రోక్తం గ్రంథం కంచిత్ పఠంతియే
విమతస్థాన్ సమస్తాంశ్చ తేజయంతి న సంశయః॥"

వేదాంతాచార్యులు రచించిన ఏదో ఒక గ్రంథాన్ని ఎవరు చదువుతారో, వారు ఇతరులు అవలంబించిన ఆచార సంప్రదాయాలలోని గుణదోషాలను విమర్శించి, వారికి స్వసంప్రదాయంలోని వైశిష్ట్యాన్ని బోధించి, పాటింపజేయగల సమర్థులై రాణిస్తారని శ్లోక తాత్పర్యం.

"వేదాన్తాచార్య రచిత ప్రబంధా స్సారదర్శినః।
పర్యాప్త మావయోః శ్రోత్రోః కింవా గ్రంథాంతరాయుతైః॥"

వేదాంతాచార్యులు అనేక గ్రంథాలను రచించారు. వాటిలోని ముఖ్యమైన విషయాలను శ్రద్ధతో పరిశీలించిన వారూ, విన్నవారూ పూర్వజ్ఞాన సంపన్నులవుతారు. వేలకొలది వేరే గ్రంథాలతో ప్రయోజనమేమి? అని తామనుభవించి తెలుసుకొన్న వారు చెప్పిన వాక్కులు.

"వేరే సంజాత భేదే మునిజన వచనే ప్రాప్త నిత్యావమానే।
సంకీర్ణే సర్వవర్ణే సతి తదనుగుణే నిష్ప్రమాణే పురాణే॥

మాయావాదే సమోదే కలికలుష వశాచ్ఛూన్యవాదే వివాదే
ధర్మత్రాణాయ యోఽభూత్ సజయతు భగవాన్ విష్ణుఘంటావతారః॥"

"కలికాల ప్రభావంవల్ల అపార్థాలను కల్పించడమూ, పెద్దల మాటలను పాటించక పోవడమూ, సకల వర్ణాలు, సంకీర్ణమవడమూ, శూన్యవాదం మాయావాదం ప్రబలిపోయి ప్రజలకు తమ సంప్రదాయ స్వరూపమేదో తెలియక, సంఘవిచ్ఛిత్తికి దారితీస్తున్న సమయాన వైదిక ధర్మరక్షణ కోసం శ్రీ వేంకటేశ్వర స్వామి ఘంటయే శ్రీ వేంకటనాథాచార్యులుగా అవతరించడమయింది. ఆ ఆచార్యులకు జయమగుగాక" అని డిండిమకవి (14వ శతాబ్ది) వయసులో చిన్నవాడైనా, సమకాలీనుడైనందువల్ల దేశికుల ప్రభావాన్ని ప్రశంసించాడు.

దేశికులు రచించిన, 'యాదవాభ్యుదయ' మహాకావ్యానికి అప్పయ దీక్షితులు వ్యాఖ్యానం వ్రాశారు. అందు ప్రస్తావనగా దీక్షితులు, దేశికుల రచనలు లలిత పదాలు కలవై పరమార్థంతో కూడియున్నవని అన్నారు.

"ఇత్థం విచింత్యా స్సర్వత్ర భావాస్సంతి పదే పదే।
కవితార్కిక సింహస్య కావ్యేషు లలితేష్వపి॥"

వాస్తవంగా కవితార్కిక కేసరి రచనలు మొదటిసారి చదివినప్పుడు అవి నారికేళ పాకమనిపిస్తాయి. వాటిని రెండవసారి చదివితే, అవి సులభగ్రాహ్యమై ద్రాక్షాపాకం కలవే అనగలుగుతారు పాఠకులు.

ప్రతివాది భయంకర అణ్ణన్ (1300-1400 ఎ.డి.) దేశికుల నాశ్రయించి బాల్యంలోనే సకలశాస్త్ర ప్రవీణులైన ప్రతిభాశాలురు. ఒక గొప్ప అద్వైత వేదాంత సిద్ధాంతి కాంచీపురానికి వచ్చి వాదానికి ఆహ్వానించాడట. వాదంలో ఒకరి మనస్సును నొప్పించడానికి ఇష్టపడని దేశికుల వద్ద "గురువర్యా! వాదించడానికి నేను పోతాను" అని ఉత్సాహంతో పలికిన ఆ బాలుడు, అనుమతిని పొంది ఆ సిద్ధాంతితో వాదించాడట. ("యేనాసీత్ సహసా సముద్రిత ముఖోవాదీ గతాహంకృతిః") ఓడిపోయిన ఆ సిద్ధాంతి విశిష్టాద్వైత మతాన్ని స్వీకరించి, సంతోషంతో ఆ బాలునికి తన ఉపాస్య దైవమైన సువర్ణ నృసింహ విగ్రహాన్ని సమర్పించాడట. వేదాంతోదయన సంప్రదాయ ప్రవర్తకులైన దేశికులు, ఆ విధంగా జయించి వచ్చిన బాలుణ్ని ఆలింగనం చేసి హర్షపులకితాంగులై 'ప్రతివాది భయంకరం అణ్ణన్' (ప్రతి పక్షులకు భయంకరమైన నా తండ్రీ!) అని పేర్కొన్నారట. ఆ బాలుడు ఈ బిరుద నామంతోనే వ్యవహరింపబడుతూ ప్రసిద్ధి పొందాడట.

ఆ 'ప్రతివాది భయంకరం అణ్ణన్' స్వామివారు చతుర్విధ పురుషార్థాలలో తురీయ పురుషార్థమైన మోక్షసామ్రాజ్యాన్ని పొందగోరే వారు దేశికుల పట్ల అత్యంత భక్తి కలిగి ఉండాలి.

"గురౌ వాది హంసాంబుదాచార్య శిష్యే, జనా భక్తిహీనా యతీంద్రా ప్రియాః స్యుః।
యతీంద్రా ప్రియా విష్ణుకారుణ్యదూరాః కుతోముక్తి వార్తాహితా దృగ్విధానామ్॥"

అని ప్రతిపాదించారు. అంతేకాదు, దేశికుల విషయమై వారు "సప్తతి రత్నమాలికా" స్తోత్రం కూడా రచించారు.

"వీతరాగా విశిష్టార్థా వేదాన్తా చార్య సప్తతిః
వైష్ణవైః సాదరంగ్రాహ్యా విద్వద్భిర్వీతమత్సరైః॥"

"ప్రతివాది భయంకరేణ సాసుధియా సప్తతిరత్నమాలికా
నిగమాంత గురౌ సమర్పితా హృదయేతం భుజతాస్వయాధియా॥"

శ్రీ బ్రహ్మతంత్ర స్వతంత్ర (పరకాల మఠం) స్వామివారు దేశికులవారిని ఆశ్రయించి-

"బ్రహ్మతంత్ర చతురాయయోగినే సర్వతంత్ర చతురో గురూత్తమః।
వేద మౌళి యుగళం హ్యుపాదిశత్, వాది సింహమనఘం తమాశ్రయే॥"

అనే శ్లోకం చేత 'ఉభయవేదాంతోపదేశం' పొందినట్లు విశదమవుతున్నది. ఈ బ్రహ్మతంత్ర స్వతంత్ర స్వామివారు దివ్యప్రబంధాను సంధానారంభంలో పఠింపదగిన "రామానుజ దయాపాత్రం" అనే శ్లోకాన్నే కాక, మరొక శ్లోకాన్ని కూడా నిర్మించారు.

"నమః పదమిదం భూయాత్ తస్మై వేంకట సూరయే!
యద్వాగమృతసేకేన సంజీవిత మిదం జగత్॥"

"ఎవరి వాగమృతసేచనం చేత ఈ లోకం జీవించిందో అట్టి శ్రీ వేంకట సూరి కొరకు ఈ (నా) నమస్కృతి" అని శ్లోకార్థం.

షోళంగిపురం శ్రీకందాళ దొడ్డయాచార్యులకు ఒకప్పుడు అప్పయ దీక్షితులతో వాదం సంభవించిందట. విచార మధికమయింది. స్వగృహమందే దైవసన్నిధిలో ప్రపత్తిచేసి పవళించారట. స్వప్నంలో భగవంతుడు "వేదాంతాచార్య కృతాంశత దూషణీ మధీష్వ, జేష్యసి" అని అనుగ్రహింపగా శతదూషణిని అధ్యయనం చేసి దీక్షితులను వాదంలో జయించారట. అప్పటి నుంచి దొడ్డయాచార్యులు దేశిక భక్తాగ్ర గణ్యులై "శతదూషణి"కి "చండమారుతం" అనే వ్యాఖ్యానాన్ని రచించారు.

ఆ వ్యాఖ్యానమందు–

"బాహ్యాదిభిశ్చిర నిరుద్ధ నిజప్రకాశే పాణింధమీ భవతి వేదపథే సమీచి!
శ్రీమద్యతీంద్ర కృతిరత్న రుచి ప్రచారైః సంచారయన్ జయతిసః కవివాది సింహః॥"

దేశికులు వేదమార్గ ప్రతిష్ఠాపకులు అని ప్రతిపాదించారు. మరొకటి–

"అపరిచిత సంప్రదాయై రవిదిత యతిరాజసూక్తి తాత్పర్యైః
అశమితకు దృష్టి గర్వై రలమలమన్యై రనాగమాంతార్యైః॥

విశిష్టాద్వైత సంప్రదాయమూ, రామానుజ యతీంద్రుల శ్రీసూక్తులు తెలియని వ్యక్తులతో ప్రయోజన మేమి? అంటూ దేశికులను స్తోత్రం చేస్తూ "వైభవ ప్రకాశికా స్తోత్ర" గ్రంథాన్ని నిర్మించారు శ్రీ కందాళ దొడ్డయాచార్యులు.

వయోజ్ఞాన వృద్ధులైన శ్రీ పిళ్ళలోకాచార్యుల వారు దేశికుల రచనలను ప్రశంసించిన ఒక పాశురం 'అధికార సంగ్రహం' అనే దేశిక ప్రబంధారంభంలో 'తనియ'గా అనుసంధింపబడుతున్నది.

"శీరోన్ఱు తూప్పుల్ తిరువేంగడముడైయాన్, పారొన్ఱచ్చొన్న పళమొళియుళ్;
ఓ రోన్ఱు తానే యమైయాదో తారణియిల్ వాళ్వార్క్కు, వానేఱప్పోమళవుమ్ వాళ్వు"

ఈ భూమండలంలో నివసించే ప్రపన్నులకు పరమపదాన్ని చేరేంతవరకు గల ఉజ్జీవనం కోసం గొప్ప కల్యాణ గుణాలు కలిగి అద్వితీయమైనది కాబట్టి తూప్పుల్ అనే దివ్యక్షేత్రంలో ఆవిర్భవించిన శ్రీ దేశికులు భూలోక వాసులందరు ప్రావీణ్యాన్ని పొందేరీతిగా అనుగ్రహించిన పలు ప్రాచీన దివ్యసూక్తులలో ఏదో ఒక్క సూక్తియే చాలదా?" అని పాశురార్థం. ఏదో ఒక సూక్తిలోని మాధుర్యాన్ని అనుభవించడంచేత జన్మ సఫల

మవుతుందనడం వల్ల, సూక్తి వైభవం సూచితం. 'పళమొళి' (ప్రాబల్కు వేదం) అనడం వల్ల దేశికుల సూక్తులకు వేదసామ్యం ధ్వనిస్తున్నది.

శ్రీ కుమార వరదార్యులు "పిళ్ళైయన్దాది" ప్రబంధంలో దేశికులను స్తుతించిన ఒక పాశురమిది–

"అన్టివ్వులగినైయాక్కి యరుమ్పొరుళ్ సూల్విరిత్తు
నిన్టు తన్నీళ్ పుగళ్ వేంగడమామలై మేవియుమ్ పిన్,
వెన్టిప్పుగళ్, త్తిరువేంగడనాదనెనుమ్ గురువాయ్
నిన్టు నిగళ్న్దు మణ్మేల్ నిన్టనోయ్గళ తవిర్త్తననే॥" (-5)

పూర్వం భగవానుడు విశ్వాసాన్ని సృష్టించాడు. వేదశాస్త్రాలను అద్భుతంగా ప్రకాశింపచేశాడు. తానే ప్రసిద్ధి పొందిన తిరుమలైలో శ్రీ వేంకటేశ్వరస్వామిగా వెలశాడు. తర్వాత కలియుగంలో శ్రీ వేంకటనాథ గురువుగా తానే అవతరించి ప్రపంచ ప్రఖ్యాతిని పొందిన ప్రజ్ఞా విశేషంచేత లోకంలో వ్యాపించిన ధర్మవిరుద్ధమైన పద్ధతులను రూపుమాపాడు. సామాజిక రుగ్మతలను ఉపశమింపజేశాడు అని పాశుర సారార్థం.

"శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణం (మందరం)" లో కృతికర్తయైన శ్రీమాన్ వావిలికొలను సుబ్బారావు (వాసుదాస స్వామి) శ్రీవేదాంత దేశికులను స్తుతించారు. దేశికుల వాగ్వికాసం సరస్వతికే కొత్త తాళం నేర్పిందనడానికి ఒక ఐతిహ్యం కలదని వారే దాన్ని వివరించారు. 'కంచుఢక్కా' బిరుదం గల డిండిమభట్టకవి దేశికులతో వాదానికి వచ్చి "ఈ ఢక్కా నీవు వాయించు, నేను కవిత్వం చెబుతాను; నేను వాయించితే నీవు కవిత్వం చెప్పు" మని పందెం చఱిచాడట. దేశికులు ఆ ఢక్కాను తీసుకొని వివిధ తాళాలు శాస్త్ర ప్రకారం వాయించగా, ఆ ధాటికి సరిగా డిండిమభట్టు చెప్పలేక తికమకలాడాడట. తర్వాత డిండిమభట్టు ఢక్కా తీసుకొని శాస్త్ర పద్ధతిని విడిచి తారుమారుగా వాయింప సాగుతుంటే దేశికులు దానికి తగినట్లే సాగించిన కవిత్వం 'రఘువీరగద్య' మని పేర్కొనబడిందట.


వజ్రాయుధంతో సమానమైన గోళ్ళచేత భయంకరమైన దేహంగల పులికే పులి యనే పేరు సార్థకం కాని సాలెపురుగుకు ఆ పేరు తగదు కదా! అలాగే కవికేసరి యనే బిరుదు దేశికుల యందే సార్థకం కాని ఇతర కవులకు ఆ పేరు పెట్టుకొన్నా, తగదని తాత్పర్యం.

వర్ణాశ్రమ ధర్మాలను పాటిస్తూ, శ్రీ భాష్యకారుల సిద్ధాంతాన్నే శిరసావహిస్తూ, అనుష్ఠానం, ఉపదేశం, రచనలు అనే మూడు ప్రక్రియల ద్వారా శ్రీ వైష్ణవ సంప్రదాయంలోని ఔచిత్యానౌచిత్యాలను గమనింపజేస్తూ, "గృహమేవ తపోవనమ్" అన్నట్లు గృహస్థాశ్రమంలోనే ఉండి విలక్షణమైన వైరాగ్య జీవితాన్ని గడిపిన శ్రీ వేదాంత దేశికులు "శతాయుః పురుషః" అన్నట్లు పూర్ణాయుష్మంతులై 1369వ సంవత్సరం, కార్తీక మాసంలో పరమపదించారు. శ్రీ వేంకటేశ్వరస్వామి అవతరించిన దినమందు అవతరించి "తిరుమంగై యాళ్వార్" అవతరించిన దినమందు అంతర్ధానం చెందారు అని వీరి చరిత్ర వల్ల తెలుస్తుంది.

ఆచార్య పురుషుల చరిత్ర అందరికీ ఆదర్శం కదా!

కవితార్కిక సింహాయ కల్యాణ గుణశాలినే
శ్రీమతే వేంకటేశాయ వేదాన్త గురవే నమః.

శ్రీ వేదాన్త దేశికుల వంశవృక్షాదికం



శ్రీ రాఘవాచార్యుల వారి పాదుకాసహస్ర వ్యాఖ్య (5భా.) పీఠిక నుండి

స్వవిషయం

కె.వి.రాఘవాచార్యులు

యత్ర్పసాదాద్బహుజనాః/ ప్రాపురుద్యోగమిహచాక్షరాస్యతామ్॥
సేయ మాంధ్ర సారస్వత/ పరిషదేధతా మా చంద్రతారకమ్॥

ఆంధ్రసారస్వత పరిషద్వేదిక మీద విద్వత్తల్లజులు, కవులు, వయోజ్ఞాన వృద్ధులెందఱో, 'పరిణతవాణి' ప్రసంగం ద్వారా తమ జీవితానుభవాలను వ్యక్తం చేశారు. కాని కేవలం ఎనిమిది పదులు దాటిన సామాన్య వ్యక్తినైన నేను 'పరిణతవాణి' కలవాడనని, ప్రసంగించడం సముచితమనుకోవడం లేదని విన్నవించుకొంటున్నాను.

ఉన్న స్థితినుంచి ఉన్నత స్థితిని పొందడానికి సాధించిన ప్రగతిని సమీక్షించుకోవడ మవసరమనియే కాబోలు, నన్ను ఎంపిక చేసిన ఆంధ్ర సారస్వత పరిషదధ్యక్షులు, జ్ఞానపీఠ పురస్కార గ్రహీతలు, పద్మభూషణ్ ఆచార్య సి.నారాయణరెడ్డిగారికి, ప్రసంగం వాయులీనం కాకుండా, దానికి అక్షరాకృతిని కల్పించి, అందించ వలసిందిగా ఆదేశించిన ఆం.సా. పరిషత్ర్పధాన కార్యదర్శి ఆచార్య ఎల్లూరి శివారెడ్డిగారికి హార్దికాభివందనాలు.

కరీంనగర్ జిల్లా, సిరిసిల్ల తాలూకాలో 'రాచర్ల పరగణ' అనే పేరుతో ఏడు గ్రామాలు 'మఖ్తె'గా పరిగణింపబడేవి. ఈ సప్త గ్రామాలకు నీటిపారుదలగల పెద్ద చెఱువుకు పర్వతాల మధ్య ఆనకట్ట వేసిన కిషన్ దాసు రాజావారికి నాలుగు ఊళ్ళను (011=6 దస్సానగా) ఇచ్చి, మూడు ఊళ్లను (10=6 ఛయ్యానగా) మాత్రముంచుకొన్న మఖ్తేదార్ (దేశపాండ్య) నారాయణపురంలో నివసించేవాడు. ఏడు గ్రామాలకు (మఖ్తాకు) ఎల్లారెడ్డిపేటలో తహశీలు కచ్చేరి ఉండేది.

నారాయణపురంలో శ్రీ సీతారామస్వామి దేవాలయం, ఎల్లారెడ్డిపేటలో శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం ఉన్నాయి. ఈ ఆలయాల్లో నిత్యం త్రికాలాల్లో ధూపదీప నైవేద్యాలు, తిరు నక్షత్రోత్సవాలు, ధనుర్మాసోత్సవం, బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతుంటాయి. వేదమూర్తులు, సంస్కృత పండితులు, సంగీత విద్వాంసులు, విద్వత్కవులు, కళాకారులు, దేవదాసీలు, భగవత్సేవా వాహకులు, భజంత్రీవారు ఒకరికేమిటి – అందరికీ భూములను 'ఇనాం'గా నిచ్చి మఖ్తేదార్ ఆదరంగా చూచేవాడు.

మా పూర్వులు దక్షిణ దేశం నుంచి సంచారార్థమై వచ్చినందువల్ల 'మా గ్రామంలో ఆచార్య పీఠస్థులు నివాసులై యుండవలె'నని ఉదారాశయంతో ఐదుపుట్ల వరి ధాన్యమున్న (గరిశను) పెద్ద గృహాన్ని దానమిచ్చి, దేవాలయంలో స్థానాచార్యులుగాను, నాల్గు ఎకరాల భూమిని ఇనాముగా నిచ్చి, నారాయణపురంలోనే నిల్పి యుంచారని పెద్దలు చెప్పినమాట.

ఇప్పుడు ఎల్లారెడ్డిపేట (మండలం) గ్రామానికి ఒక కిలోమీటర్ దూరాన ఉన్న ఆ నారాయణపురమే నా జన్మస్థానం. నేను త్వరగా మాతృ గర్భం నుంచి బయట పడడానికి (గడి) కోట గుమ్మానికి కాపలాదారులైన నల్గురు అరబ్బీ జవాన్లు వచ్చి, ఇంటిముందు పద్దెనిమిది సార్లు తుపాకులను పేల్చి బాగా శబ్ద ప్రకంపన

చేశారట. అది విభవనామ సంవత్సరం. 1929 క్రీ.శ. పుష్య శుద్ధ ద్వాదశినాడు జన్మించానని జన్మ పత్రికలో వ్రాసియున్నది. తల్లి వేంకటమ్మగారు, తండ్రి శ్రీమాన్ కారంచేటి తిరుమల మనోహరాచార్యస్వామి వారు. నాకు కారంచేటి తిరుమల వేంకట రాఘవాచార్యులని నామకరణం చేశారు. నాకు నలుగురు తమ్ములు, ఇద్దఱు చెల్లెండ్రు. చివరి తమ్ముడు డా॥ టి.వెంకటరమణాచారి 22 మే 2010 నాటి రాత్రి పరమపదించాడు.

మా తండ్రిగారు నాకు మాటలు వచ్చినప్పటినుంచి స్తోత్ర పాఠాలను, ఎక్కాలను కంఠస్థం చేయించారు. నాకు ఐదవయేట, నా తమ్ముడు పార్థసారథికి మూడవయేటనే, తహశీల్ కచ్చేరిలో పేష్కారుగా ఉన్న శ్రీమాన్ శేష భట్టర్ శ్రీనివాసాచార్యుల చేత అక్షర స్వీకారం జరిపించారు. క్రమంగా కట్టె పలకల మీద కాక్ళతం, పెద్దబాలశిక్షలోని పదాలను, ఎక్కాలను, బొట్లు, పరక, వీసం, పుట్టి లెక్కలు వ్రాయడం, వ్రాసిన కార్డులను ఉత్తరాలను చదివించడం నియమంగా ఉండింది.

మొట్టమొదట 'తల్లీ నిన్ను దలంచి పుస్తకము జేతన్ బట్టితిన్', 'క్షోణితలంబు నెన్నుదురు సోకగ మ్రొక్కి నుతింతు', 'అంబ! నావాంబుజోజ్జ్వల కరాంబుజ!' అనే మూడు పద్యాలను పలకల మీద వ్రాసి చెప్పగా వాటిని మరునాడు చూడకుండా నిర్దుష్టంగా మేము వ్రాసి చూపించడం ఒక నేర్పు.

తరువాత ఆంధ్రనామ సంగ్రహం, సాంబ నిఘంటువు పద్యాలు, అమరకోశం ఉదయాన చెప్పిన పాఠాలను చింతన (పూటకు 25 సార్లు ఆవర్తి. 4 పూటలు 4×25= 100 ఆవృత్తులు) చేసి మఱునాడు వాటిని నోటికి అప్పజెప్పాలి. పగలు గం.3లకు కంచెలో మేసివచ్చిన ఎడ్లను కచ్చరానికి పూన్చి, అందులో పరుపు, రెండు దిండ్లు పెట్టి మమ్మిలిద్దరిని కూర్చోపెట్టి, మా తండ్రిగారు రెండు గంటలవరకు 4, 5 క్రోసుల దూరం గజ్జెల చప్పుడుతో ఎడ్లు పరుగుదీయునట్లు సారథ్యం చేస్తూనే, ఉల్లసిల్లిన మాకు ద్రావిడ దివ్య ప్రబంధాన్ని పాశురాలను, సంథ చెప్పేవారు. ముఖ్యంగా నాకు ఎనిమిదవయేట ఆవునూరిలో శ్రీమాన్ ఆచ్చి నృసింహాస్వామి వారు జరిపే ధనుర్మాస కొఠాయి ఉత్సవంలో దివ్య ప్రబంధాధ్యాపకులందఱు ఒక వరుసలో, మేమిద్దరము వారి కెదురుగా కూర్చొని పుస్తకం పట్టకుండా మూడు రోజులు దివ్య ప్రబంధాన్ని మున్నుడి, పిన్నుడిగా శేవకాలం చేయాలని అనుశాసించారు. ఉత్సవాంతంలో 'మీ కుమారులను శూరాధ్యాపకులను చేశావయ్యా!' అని మా తండ్రిగారిని ప్రశంసిస్తూ పెద్దలతో సమానంగా మాకు సంభావన ఇచ్చి 'వార్షిక' ఏర్పాటు చేశారు ఆచ్చి స్వామివారు. విద్యాభ్యాసానికి బాల్యమే యోగ్యమన్నారు.

తర్వాత శబ్దమంజరిలోని శబ్దాలను, ధాతువులను, సమాసవృత్తిని, రామాయణ సంగ్రహాన్ని మాకు పాఠం చెప్పారు. ఉదయాన నాలుగు గంటలకే లేపి, ఒకనాడు స్తోత్రాలను, మరొకనాడు అమరాన్ని, ఇంకొక నాడు దివ్యప్రబంధాన్ని ఆవర్తి చేయించేవారు. ఒక ఏడాది తేడాతో మా అన్నదమ్ములకు ఉపనయనం చేశారు. వెంటనే మా తండ్రిగారే మాకు పంచ సంస్కారాలనూ కృపజేశారు. మా యూరిలో బ్ర.శ్రీ.వేదమూర్తుల జోగా వెంకటయ్యశర్మగారు క్రమాంత స్వాధ్యాయిగా ప్రసిద్ధులు. వారివద్ద విద్యార్థులెందఱో పంచదశకర్మలనే కాక, వేద విద్యలను నేర్చి, ప్రతిష్ఠాంత యాజ్ఞికులుగా పేరుగాంచినారు. ప్రతిదినం మేము ఉ.గం. 8ల

నుంచి గం 12 వరకు దావళిని గట్టుకొనిపోతే మాకు శర్మగారు సంధి చెప్పి, పలకలమీద వ్రాసిన వేద పాఠాన్ని వల్లెవేయించడమూ వారి ఇంట్లోనే జరిగేది.

ఉ.వే.శ్రీమాన్ నమిలికొండ శ్రీరంగాచార్య శాస్త్రిగారు మా ఇంటి పక్కన ఉన్న వారి ఇంట్ల సంస్కృత విద్యార్థులకొక పదుగురికి తామే భోజన వసతులను కల్పించి, విద్యనభ్యసింపజేసేవారు. ఎల్లారెడ్డిపేట శ్రీ వేణుగోపాల దేవాలయంలోనే సంస్కృత పాఠశాల నేర్పరచి, భగవాన్‌దాసు రాజాగారు నెలకు (రూ. 15/లు) పదునైదు రూపాయలనిస్తూ, శాస్త్రిగారిని సంస్కృతాధ్యాపకులుగా నియమించారు. మధ్యాహ్నం ఎల్లారెడ్డిపేటకు శాస్త్రిగారితోపాటు అందరం పోయి, ఇతర గ్రామాలనుంచి వచ్చిన విద్యార్థులతో పాటు పాఠాలు చెప్పించుకొని, చింతన చేసే వాళ్ళం. పాఠశాల వేళ నాలుగు గంటలు మాత్రమే యుండేది. సాయం గం.5లకు గృహోన్ముఖుల మవడం జరిగేది.

ఇక శర్మగారు వైదికంగా మాకు పంచదశకర్మలను, దేవయాజ్ఞిక ప్రక్రియను ప్రయోగాత్మకంగా నేర్పినారు. తాళపత్ర గ్రంథాల్లో ఉన్న పాఠ్య భాగాన్ని జూచి, కట్టె కలాలను శిరాబుడ్డిలో ముంచి దొడ్డు కాగితాలపైన వ్రాసుకొని భద్రంగా ఉంచడం అలవాటైనది. ఒకనాడు బందరు మచిలీపట్నంలో చల్లావారి యాజుషస్మార్త మన్త్ర పాఠం ప్రథమభాగాన్ని వి.పి. ద్వారా తెప్పించుకొన్నాను. నాలుగు తూముల వడ్లను కోమటికి కొలిచి ఇస్తే, నాలుగు రూపాయలిచ్చాడు. ఆ నాలుగు రూపాయలతో వి.పి. విడిపించుకొని పుస్తకం తీసుకొన్నాను. ధాన్యం అంత చౌకగా ఉండింది.

ఒకప్పుడు శర్మగారు, రాఘవాపురంలో శ్రీరఘునాథరావుగారి కూతురు వివాహానికి నన్ను తోడ్కొని పోయి నాతో వైవాహిక ప్రక్రియను జరిపించారు. అక్కడ వధూజన పక్షాన బ్ర.శ్రీ.వే. జగదేకపురం రామచంద్రయ్యగారు ఉన్నారు. వారు నన్ను వధూ గృహప్రవేశ హోమం చేయుమని ఆజ్ఞాపించారు. మా గురువుగారు ప్రోత్సహించారు. నేను ఆ హోమం చేస్తున్నప్పుడు తద్విధానాన్ని చూస్తూ, రామచంద్రయ్యగారు "ద్వంద్వ న్యంచి పాత్రాణి ప్రయునక్తి" అంటే ఏం చేస్తున్నావని అడిగారు. 'అయ్యా!' న్యంచి కాదు. 'న్యంచి' అనే పదమది. బోర్లవేసి అనే అర్థం కలది కదా! అగ్నిహోత్ర వేదికకు ఉత్తర దిశలో దర్భలను పరచి, వాటిపైన దక్షిణోత్తర సమాంతరంగా రెండేసి పాత్రలను- దర్వి, ఆజ్యస్థాలి; ప్రోక్షణ, పూర్ణపాత్ర; ఇధ్మ, స్రువా'లనే- షట్పాత్రలను తలక్రిందులుగా ఆసాదించడం విధి కదా!" అంటూనే క్రియను చేస్తున్నాను. నా హస్త విన్యాసాన్ని (చేయి తిరుగడాన్ని) గమనించి, వారు మా గురువుగారితో 'మీ అంతే వాసి క్రియాదక్షుడే నండోయ్; అలాగా విధిని అర్థం చేసుకొని క్రియను ఆచరించేవారు అరుదుగా ఉంటారు అనగానే వారు మీరు వాణ్ని పొగడవద్దు, దీవించాలి అని పలికారు. రామచంద్రయ్యగారు నాతో, నీవు 'హరిదత్త భాష్యం' చదువు, కర్మకౌశలం కలుగుతుంది' అన్నారు. 'అది మీ ఆశీర్బలం' అని నమస్కరించాను.

నాలుగేండ్ల వేదాధ్యయనకాలంలో ఒకనాడు 'ధమస్తద్వాతో' అనే 'పనస' కు 'ఘన' పాఠం అప్పజెప్పుతున్నప్పుడు 'కౌలు' తప్పు చెప్పినాను. 'ధనుర్దక్షిణాత్' అనే చోట 'ధనురుత్తరాదుత్తరాద్ధనుర్ధను రుత్తరాత్' అని చెప్పబోతుండగా గురువుగారు తమ చేతి కట్టెతో, ఆనాడే గీయుంచుకొన్న గుండు మీద బలంగా కొట్టారు. మంట మండింది. ఏడ్చాను. 'సరి ఈనాటికి చాలు, రేపు తప్పకుండా అప్పజెప్పు'మని

పొమ్మన్నారు. దండం సమర్పించి ఇంటికి వచ్చాను. ఆ కాలాన ప్రతి శుక్రవారం సెలవు కాబట్టి సంస్కృత పాఠశాలకు ఆనాడు పోలేదు.

గురువుగారు తమ ఇంటికెదురుగా ఉన్న మా ఇంట్లోకి వచ్చి, వరండాలో నున్న ఒక కుర్చీలో కూర్చొని 'రాఘవా! ఇలారారా!' అని పిలిచాడు. ఎదుటికి పోగానే నన్ను తమ ఒడిలోకి తీసుకొని 'ఈనాడు పరధ్యాన్యంలో నున్నావా? ఎన్నడూ ఒక్క దెబ్బతినలేదు. నీ తలమీద కొట్టాను. ఇంత బొడుసు వచ్చిందేమిరా' అంటూ నా గుండును నిమురుతుండగా, వారి కన్నీటి చుక్కలు రెండు నా గుండు మీద పడ్డాయి. నేను తల ఎత్తి చూచాను. ఉత్తరీయంతో తమ కన్నులను తుడుచుకుంటున్నారు. నేనూ ఏడ్చాను. గురువుగారు గద్గద స్వరంతో "ఇదే మొదటి దెబ్బ, చివరిది కూడా! ఇక నిన్ను కొట్టను రా" అన్నారు.

"శ్రద్ధావాన్ లభతేజ్ఞానం తత్పరస్సంయతేంద్రియః" అని గీతాచార్యులు చెప్పినట్లు శ్రద్ధ, తత్పరత, ఇంద్రియ నిగ్రహం- ఈ మూడూ జ్ఞానార్జనకు, విజయానికీ సాధకాలు. జ్ఞానం అనే పదంలో 'జానాతి, ఇచ్ఛతి, యుతతే' అనే అర్థాలున్నాయి. జ్ఞానం అనుష్ఠాన పర్యవసాయి అన్నమాట. "జ్ఞానస్యతు తిస్రోభార్యాః బుద్ధిర్మేధా స్మృతిస్థథా!" సమగ్ర వ్యవహార జ్ఞానం గ్రహణ శీలమైనది. జ్ఞానాన్ని అనుసరించేవి బుద్ధి, మేధ, స్మృతి. ఈ హోమాలచే కార్యాన్ని సాధించేది బుద్ధి- సంగతానుభవాలను ధారణ చేసేది మేధ. సద్యఃస్ఫురణ శక్తి స్మృతి యనబడుతుంది. తల్లిదండ్రులు శారీరకమైన జన్మనిస్తారు. ఆచార్యోహి విద్యాతస్తం జనయతి' గురువు జ్ఞానజన్మనిచ్చి, తత్ఫలితంగా పునఃజన్మ లేకుండా చేస్తాడు.

భారతీయ తత్త్వశాస్త్రరీత్యా మానవుడు జన్మతోనే ఋణత్రయంతో పుడుతాడు. వాటిలో తత్త్వజ్ఞానాన్ని మనకు పరంపరగా అందించిన ప్రధానమైన ఋష్యృణాన్ని వేదశాస్త్రాధ్యయనం చేతనే మనం తీర్చుకోవలసి యుంటుంది. రాఘవా! నీకు ద్వయోపనిషత్తును చెప్పినాను కదా! 'షట్పదో యంద్విఖండః' అనబడే ద్వయమంత్రాన్ని సంధ్యావందన మాచరించిన తర్వాత శ్రద్ధతో అర్థాన్ని స్మరిస్తూ పునశ్చరణ చేయాలి నీవు అన్నారు. సరే! అన్నాను.

ఈ సన్నివేశాన్ని తిలకిస్తున్న మా తల్లిదండ్రుల కన్నులూ చెమ్మగిల్లాయి. మా నాన్నగారు "వాత్సల్యమంటే దోషాన్ని గుణంగా మల్చుకోవడమని కదా అర్థం. 'గురువో దీనవత్సలాః' అన్నమాట క్రియాసాపేక్షమయింది. 'చదువుకో దెబ్బ, సాముకో పోటు' అన్నట్లు నీ ప్రయత్నమంతా వాణ్ని చక్కదిద్దడానికే కదా! ఎందుకింత చింత పడుతున్నావన్నయ్యా!" అని మా గురువుగారిని అనునయిస్తూ తన నశ్యపు డబ్బిని వారికి అందిచ్చి, ఇర్వురూ (ముక్కు పొడుమును) పీల్చుకొన్నారు. 'స్థాలిత్యేశాసితారం' అనేమాటకు గురువు అంటే ఎంతో శ్రేయోభిలాషి కదా! అని అప్పుడు నాకు అర్థమయింది.

సంస్కృత పాఠశాలలో (5) ఐదు సంవత్సరాలు చదివినను, ఐదు కావ్యాలు పూర్తి కాలేదు. రఘు వంశంలో చతుర్థ సర్గ నారంభించి ముందు వెనుక మొత్తం తొమ్మిది సర్గలు వ్యాఖ్యానంతో సహ కంఠస్థం చేస్తేగాని ముందు పాఠం చెప్పేవారు కాదు. కుమార సంభవంలో మొదటి రెండు సర్గలు, ఐదు, ఆరు సర్గలు సవ్యాఖ్యగా చదివినాము. మేఘసందేశం పూర్వోత్తరాలు, వీటితోపాటు హితోపదేశం, భర్తృహరి శతకత్రయం,

కాలామృతం ఉపవాచకాలుగా పాఠం చెప్పినారు. మాతోపాటు బ్ర.శ్రీ.దోర్బల విశ్వనాథశర్మ, తిగుళ్ళ వేంకటేశ్వర శర్మ, రాచెర్ల వెంకటేశ్వర్లు, శ్రీమాన్ (గుమ్లాపురం) శ్రీనివాసాచార్యులు (భారవి) కిరాతార్జునీయం వరకు సహాధ్యాయులుగా నున్నారు. ప్రతిదినం రెండు, మూడు శ్లోకాలను మాత్రమే వ్యాఖ్యాన సహితంగా పాఠం చెప్పేవారు. మఱునాడు వ్యాఖ్యానంతో (నోటికి) అప్పజెప్పవలసిందే. మాకంటె పూర్వవిద్యార్థులైన బ్ర.శ్రీ.బొప్పాపురం గోపయ్యగారు, శిరిశనగల్ల కృష్ణమాచార్యులు వ్యాస భాగవతాన్ని, శ్రీమద్రామాయణాన్ని, వ్యాఖ్యానంతో సహా, పదిహేను శ్లోకాలను చదివేవారు. శాస్త్రిగారు పాఠప్రవచనార్థం వారికై ఎక్కువ సమయాన్ని కేటాయించేవారు.

విద్యార్థులకు ఇక్కడ ఎన్నాళ్ళు చదివినా, ఉపాధిపత్రం మాత్రం లభించదనే భావం పొటమరించింది. అంతలో కరువు వచ్చింది. ఎకరానికి కొంత ధాన్యం సర్కారుకు కొలచి ఇవ్వవలసిన కంట్రోల్ కాలం దాపరించింది. శాస్త్రిగారు బ్రాహ్మణ, శ్రీవైష్ణవుల గృహాల్లో- ఇంటికొక విద్యార్థిని భోజన వసతులకై నియమించి ఉంచారు. ఇక శాస్త్రిగారి ఇంట్లో వారి బంధువుల బాలురే ముగ్గురు, నల్గురు ఉండేవారు. ఆ సందర్భంలో బ్ర.శ్రీ.దోర్బల విశ్వనాథశర్మగారు 'తెనాలి'కి వెళ్ళారు. శ్రీ శిరిశనగళ్ళ శ్రీనివాసాచార్యులు సీతారాంబాగ్- హైదరాబాదుకు పోయారు. మా సతీర్థ్యులందఱికి మద్రాసుకు విద్యాభ్యాసం కోసం వెళ్ళిన బ్ర.శ్రీ.దొంతి శివ్వంపేట విశ్వనాథశాస్త్రిగారు ఆదర్శంగా ఉన్నారు.

'నాన్నగారూ! మా తోటి విద్యార్థులలో కొందఱు పట్టణాల్లో విద్యాభ్యాసనం చేస్తే ఉపాధి పత్రం లభిస్తుందని వెళ్ళిపోయారు. మీరు మా ఇద్దరిని కూడా తెనాలికో, హైదరాబాదుకో దయతో పంపిస్తే, పోయి అక్కడ చదువుకొంటా'మని ప్రార్థించాము.

"పరస్థలానికి పోతే సమయానికి ఆహారం లభించదు. మీ దుస్తులు మీరే ఉతికి ఆరవేసుకోవాలి. మీదు మిక్కిలి విద్యార్థులందఱు సహన శీలురుగా ఉండరు. జగడాలతోనూ దెబ్బలాడుతుంటారు. ఎంతో కష్టపడవలసి వస్తుంది. అయినా, మిమ్ములను విడిచిపెడితే మాకు నిద్రాహారాలు సరిగా ఉంటాయా? ఇక్కడ చదువుకేం కొదువ ఉంది? శాస్త్ర పురాణాలను మన ఊరిలోనే ఉండి చక్కగా నేర్చుకోవచ్చు. వేరే చోటికి వెళ్లి విద్యనార్జిస్తామనే తలపును తలకెక్కించుకోక, మన ఇంట్లోనే తృప్తిగా భోజనం చేస్తూ, ముప్పొద్దులు నిర్విరామంగా చదువును సాగిస్తే మీరే బాగుడుతారు" అని నయాన భయాన బోధించారు మా నాన్నగారు.

తత్ఫలితంగా, మా యిద్దఱన్నదమ్ములకు లౌక్యం తెలియకుండా అయింది. గోటి గొట్టరాదు, బొంగురం వేయరాదు, మోట రెక్కలేదు, రైలు జూడలేదు, కూపస్థమండూకంలా ఉండింది మా స్థితి. మాకు ప్రవచన చాతుర్యం కలుగుతుందని గుడిలోనో, గడిలోనో పురాణమో, హరికథయో జరుగుతుంటే అక్కడ మమ్ములను కూర్చోపెట్టేవారు. గూటిలో ఆముద దీపకాంతిలో, మడత పడితే ముక్కలయ్యే పుటలలోని చిన్న అక్షరాలు గల జీర్ణ గ్రంథాలలో పాఠ్యాంశాలను చింతన చేసిన రీతిని ఇప్పుడు తలచుకొంటే ఆశ్చర్యమనిపిస్తుంది. పండితులు, కవులు పెట్రోమాక్స్ వెలుగులో రాత్రిపూట సాహిత్య చర్చలను, ఆధ్యాత్మిక విషయాలపైన వివాదాలను జరిపేవారు. ఆ రోజుల్లో మహారాజశ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారు మా యూరికి వచ్చి కవులను

సమావేశపరిచారట. శ్రీమాన్ ఆచి నృసింహాచార్యస్వామివారు, పదిర కృష్ణమూర్తిగారు, శ్రీరంగాచార్యశాస్త్రిగారు, బావి కృష్ణశాస్త్రిగారు ఆశువుగా చెప్పిన కవితలను రెడ్డిగారు వ్రాసుకొని, తర్వాత తమ గోలకొండ సంచికలో ప్రచురించిన వాటిని మా గురువుగారు నాకు చూపించారు. ఆ పద్యాలను చదివి చకితుడనయ్యాను. 'ప్రసన్న గంభీర పదా సరస్వతీ' అంటే ఇలాగే ఉంటుందనుకొన్నాను.

కొన్నాళ్ళకు ఒక 'వ్యాసావళి' పుస్తకంలో ఆ పండితులు, విద్వత్కవులున్న నారాయణపురం, జనగామ తాలూకాలోనిదని వ్రాసియున్న వాక్యం శోధనీయం కదా! అని మానసికంగా ఆవేద కలిగింది.

ఒకనాడు దేవాలయంలో కూర్చుండి 'కవిత' నాకు అబ్బుతుందో లేదో అని ప్రయత్నించాను.

తల్లి వేంకటమ్మ తండ్రి మనోహరా/ చార్యులిడిరి మాకు జ్ఞానభిక్ష।
తిరుమలాన్వయమ్ము హరితస గోత్రమ్ము/ కవిత వ్రాయుధిషణ కలుగవలయు॥

చతురుండగు మా జనకుడు/ అతులితగతి వసుచరిత్ర నమరము నేర్పెన్।
మతి మంతుడు తోబుట్టువు/ హితముగ తద్బోధ మాదు యెదలో వెలసెన్॥

అని నేను వ్రాసిన కాగితాన్ని 'గీతాభాష్య' మనే గ్రంథంలో పెట్టాను. ఎలాగో దాన్ని నా తమ్ముడు చూచి, సంతోషంతో 'అన్నయ్య పద్యాలను వ్రాశాడు' అని ఆ కాగితాన్ని నాన్నగారికి జూపించాడు.

"వెంకట్రాఘవా! పరిణతబుద్ధి కలవారు కవితా కళను ఆరాధిస్తారు. చక్కని కవిత్వాన్ని విద్వత్కవులు విని సంతోషించినప్పుడే 'కవి' అనే యశస్సు కలుగుతుంది. సమాజం ఆ కవిని సన్మానిస్తుంది. ఆనందోప దేశాత్మకంగా మహాకావ్యాలను వ్రాసిన కవికుల గురువైన కాళిదాసే "మందః కవి యశః ప్రార్థీ" అని "ఆ పరితోషాద్విదుషాం నసాధుమన్యే" అని ఎంతో వినయాన్ని ప్రకటించుకొన్నాడు. 'దృశ్యాన్ని వర్ణించినా, స్వీయ భావాలను సరసంగా ప్రకటించినా, ప్రతిచరణమందు గణ యతి ప్రాసల నియమం పాటించబడిందా లేదా అనే విచారం అధికంగా అవసరమవుతుంది. ఇప్పుడే కవిత్వం చెప్పదగినంత గొప్పవాడ ననుకొంటున్నావా? నీవు వలసినంత శాస్త్రజ్ఞాన మార్జింపదగిన వయస్సులో ఇతర విషయాలమీద మనస్సును లగ్నం చేయక, విద్యార్జన మందే నిమగ్నుడవై యుండు'మని హెచ్చరించారు మా తండ్రిగారు.

మా యింటికి కుడివైపున 'బంగళా'లో గ్రామపురోహితులుగానూ, నిగమాగమశాస్త్ర విద్వన్మణిగానూ పేర్గాంచి యున్నవారు బ్ర.శ్రీ.బావి కృష్ణశాస్త్రిగారు. "అన్నయ్యా! నాకు నాటకాలంకార సాహిత్య జ్ఞానాన్ని ప్రసాదించండి" అని వేడుకొన్నాను. 'నీకు శ్లోక సమన్వయ జ్ఞానమున్నందువల్ల నాకు పాఠం చెప్పడం కష్టమనిపించదు. రేపే ప్రారంభించు'మన్నారు కృష్ణశాస్త్రిగారు. పగలు శ్రీరంగాచార్యస్వామి వద్ద మాఘకావ్యం, లఘు సిద్ధాంతకౌముది, గీతాభాష్యం, సంప్రదాయ గ్రంథాలను అభ్యసించాను. బ్ర.శ్రీ. కృష్ణశాస్త్రి వద్ద (ఒంటిగంట) అర్ధరాత్రి దాకా నైషధం, తర్క సంగ్రహం, భారత చంపువు, శాకుంతలం, ఉత్తర రామచరిత్ర, సాహిత్యదర్పణం వీరరాఘవీయ వ్యాఖ్యతో సహా వ్యాస భాగవతంలో నాలుగు స్కంధాలను క్రమంగా నేర్చుకొన్నాను. గోరక్‌పూర్ నుంచి 'మహాభారతం' (రూ. 60-00 లకే సెట్టు) పోస్టు ద్వారా తెప్పించిన కృష్ణశాస్త్రిగారు సభాపర్వాన్ని, విరాట పర్వాన్ని నాతో చదివించారు. మా ఊళ్ళో పండితులెవ్వరూ లేనప్పుడు (కొన్నిరోజులు)

ఆరు మైళ్ళ దూరాన ఉన్న 'అవునూరు'కు పోయి శ్రీ ఆచి వేంకటాచార్యుల వద్ద పాఠం చెప్పించుకొని సాయంకాలం మా యూరికి చేరుకొన్న రోజులు కూడా విస్మరించరానివి. ఇలాగా రెండేండ్లు నిరంతర చింతనతో గడిచాయి.

నా పెద్ద చెల్లెలు- కొండమ్మ వివాహం, దేశపాండ్య వేంకటరావు కూతురు, బావి కృష్ణశాస్త్రి కూతురు, శ్రీరంగాచార్యశాస్త్రి కూతురు- ఈ నల్గురి వివాహ శుభలగ్న ముహూర్తం ఒకరోజే అయినందువల్ల వేదశాస్త్ర సంగీత కళాభిజ్ఞులతో ఊరంత కళకళలాడునట్లు వైభవంగా, నాలుగు రోజులు జరిగింది. అప్పుడు వచ్చిన బంధువులలో పాపన్నపేట నుంచి మా పెద్దనాన్న, పెద్దతల్లి, వారి కుమారుడు శ్రీమాన్ తిరుమల వేంకట నరసింహాచార్యులు కూడా వచ్చి వారం రోజులున్నారు. మెదక్ హైస్కూలు టీచర్‌గా ఉన్న ఎ. టి.వి.ఎన్.చారిగారి చెల్లెలు కుమార్తెను 10 సం॥ల పద్మావతిని నాకోసం పెద్దలు నిర్ణయించారు. మరుసటి సంవత్సరమే (జమ్మికుంట మండలం) 'వావిలాల'లో పద్మావతితో నా వివాహ కార్యక్రమం నాలుగు రోజులు బాగా జరిపించారు. తదుపరి సంవత్సరంలో తమ్ముడు పార్థసారథికి పెండ్లి అయింది.

ఆ కాలాన వరుడు వధువును వివాహమయ్యేంతవరకు చూచే అవకాశం కల్పించక, పెద్దలే చూచి నిశ్చయించే నియమముండింది.

నేను, నా సహాధ్యాయి బ్ర.శ్రీ.కె.మురళీధరశర్మగారును వైదికులు అభిమానంతో ఆహ్వానిస్తే, ఉపనయన, వివాహాది శుభకార్య కలాపాలను నిర్వహించడం ఉత్సాహకరంగా ఉండేది.

సీతారాంబాగ్- హైదరాబాదులో శ్రీ మహావిష్ణు యాగానికి మా తండ్రిగారు నన్ను, నా తమ్ముణ్ణి తోడ్కొని పోయారు. అచ్చట పెద్దవారిని ఋత్విక్కులుగానూ, హోతలుగానూ, బాలురను పరిచారకులుగా వరించడానికి రెండు వరుసలలో కూర్చోబెట్టారు. మా నాన్నగారు పెద్దవారి పంక్తిలోనే కూర్చుండబెట్టారు. ఎన్నుకొనే స్వాములు వచ్చి 'మీరు పరిచారక శ్రేణిలో చేరండి లెండి' అని గద్దించారు. వెంటనే లేచిన మేము గళమెత్తి ఒకే స్వరంతో "ఆడితోనపైజ ఓజోబలం యశశ్చక్షు శ్శోత్ర"మని ఆరంభించి "లోకపాలః కిం కం తత్సత్యమన్న మమృతం" అని పఠిస్తుండగానే 'బుడతలు పిడుగులే' అంటూ మాకు దీక్షావస్త్రా లిచ్చారు. ఋత్విగ్వరణమయింది. మా తండ్రిగారి యాగం పూర్తి అయిన మరునాడు ఒక బంధువు విద్యానగర్ బ్రిడ్జి దాటిన తరువాత ఒక ప్లాట్‌ను చూపి '(01-6) పాంచానకు గజం చొప్పున ఈ స్థలం కొన్నా'నన్నారు. న్యూ నల్లకుంట అన్న పేరు అప్పటికేర్పడలేదు. 'అదుగో! అక్కడ రామాలయం కోసం పునాదులు తీస్తున్నారు' అని చెప్పగా పోయి చూచాము. చాలా ప్లాట్లు అమ్మబడినాయి. ఎప్పుడైనా హైదరాబాదులో నివసించక ఉంటామా? అని అప్పుడు ఒక ప్లాటైనా కొనక పోతిమి కదా! అని ఇప్పుడనిపిస్తుంటుంది.

నారాయణపురం చేరిన తరువాత ఒక సంవత్సరం నిజామాబాదు, ఆదిలాబాదు, కరీంనగరం జిల్లాల్లో (ఉన్న రెండువేల కడప) సకుటుంబంగా శిష్యసంచారం చేసి వచ్చాము. ఇక నేనెన్నడూ అలా సంచరించలేదు. ఇప్పటికీ అభిమానులాహ్వానించిన చోటుకు తప్ప ఎక్కడికీ పోవడం లేదు. అది కూడా భగవదాజ్ఞాపాలనగా ఆచార్య ధర్మాన్ని నిర్వహించవలసి యుంటుంది. అస్తు.

మేమైతే స్కూలులో చేరి చదువలేదు. రెండవ తమ్ముణ్నైనా చదివిద్దామని నరసింహాచార్యులను సిరిసిల్లకు తీసుకొనిపోయి 'అవ్వల్ దర్జా తహతాన్య' మదరసాలో నాల్గవ తరగతిలో చేర్పించాను. తమ్ముణ్ని చక్కగా చదివించుమని మా చెల్లెలుకు చెప్పి, వాణ్ని వాళ్ళయింట్లో విడిచి వచ్చాను.

15 ఆగష్టు 1947న భారతదేశం (విభక్తమై) స్వాతంత్ర్యాన్ని పొందింది. జాతి సంతోషం అంబరమంటుతున్న సమయంలోనే జాతిపిత మహాత్మాగాంధీ హత్య (30 జనవరి 1948) జరిగింది.

దేశమంతటా విషాదచ్ఛాయలు వ్యాపించాయి. గాంధీజీ అమర్‌హై, వందేమాతరం, అంటూ పల్లెపల్లెలోనూ నినాదాలు చెలరేగాయి. నైజాం రాష్ట్రంలో రజాకార్ల వల్ల ప్రతిగ్రామంలో అలజడులు అధికమయినాయి. ముఖ్యంగా మా యూరిలో యువకులు తెల్లటోపీలు ధరించి, చిన్న జండాలను పట్టుకొని 'స్వతంత్ర భారత మాతాకీ జై' అంటూ నినాదాలతో ఊరేగి సమావేశం జరుపుతుంటే ఎస్.ఐ. పోలీసులు వచ్చి గుంపులో యువకులను లేపి, ఈడ్చి లాఠీ దెబ్బలు కొట్టేవారు. అలాగా మమ్ము, యువకులను పోలీసులు తుపాకీ గుండ్లతో కొట్టుకుంటూ ఠానా గంభీర్‌రావుపేటకు తీసుకొని పోతుండగా, ఊరిలోని వందమంది పెద్దలు వారికి అడ్డుపడి జగడమాడుతుంటే (దొరవారి పంపున) మాలీపటేలు, పట్వారి, పోలీసు పటేలు వచ్చి వారితో సంప్రదించగా, మమ్ము యువకులను విడిచిపెట్టడమూ, వాళ్ళకు జల్సాలు ఏర్పరచడమూ మామూలుగా సాగుతుండేది.

రాష్ట్రంలో ఎందరో మగువలు, మగవారు రజాకార్ల ఆయుధాలకు బలి అయ్యారు. గ్రామీణుల దైనందిన జీవితం దుర్భరమయింది. మా గ్రామస్థులు సామూహిక మరణం సంభవిస్తే మేలు కదా! అని భయభక్తులతో శ్రీ సీతారామస్వామి దేవాలయంలో నిత్యపూజలను జరుపుతామని నిశ్చయించారు. ఆలయానికి సున్నం వేశారు. స్తంభాలకు రంగులు వేశారు. యాగశాలలోనూ, కల్యాణ మంటపంలోనూ గోడలపైన భగవల్లీలను తైలవర్ణ చిత్రాలు- చిత్రించారు. ఆలయంలోనే తిరుగడానికి పల్లకీని, చిన్న రథాన్ని వడ్ల అనంతరాములు, కమ్మరి రాజయ్య నిర్మించి సమర్పించారు. కుమ్మరి వాళ్ళు దీపప్రమిదలను, కంచుళ్లను ఇచ్చారు. నిత్యం ఇప్ప నూనెతో ఆలయం లోపల, బయట, పైన లక్ష దీపాలను వెలిగించారు. రజకులు చెరువులలో నుంచి తామర పూవులను, తోటల్లో నుంచి రంగు రంగుల పూవులను తెచ్చేవారు. సువాసినులు పూల మాలికలను అల్లి, తోమాలలనూ కూర్చి సమర్పించేవారు. కోమట్లు, రైతులు, గౌడులు, గొల్లలు రోజుకొకరు ఐదు కుంచాల పులిహోర, రెండు కుంచాల చక్కెర పొంగలి, రెండు కుంచాల దధ్యోజనం నైవేద్యం కోసం అర్చక స్వయంపాక స్వాములతో చేయించేవారు. కళాకారులు హరికథలను చెప్పేవారు. సప్తాహ భజనలు చేసి గోపాలకాల్వలను నిర్వహించేవారు. బ్ర.శ్రీ.కే. మురళీధరశర్మ అలంకార పరికరాలను సిద్ధం చేసి ఇచ్చేవారు. బ్రాహ్మణులు వేదాధ్యయనం చేసేవారు. శ్రీ వైష్ణవులు దివ్య ప్రబంధాలను పారాయణం చేసేవారు. రోజుకొక అలంకరణం- మోహినీ అవతారం, కాళీయమర్దన, గోపికా వస్త్రాపహరణం (పొన్నసేవ), గోవర్ధన గిరిధారణం, గజేంద్ర మోక్షం ఇత్యాదిగా అలంకరించి, తులసీ పుష్పమాలికలను సమర్పించి, భగవంతునికి కైంకర్యం చేసే భాగ్యం, ఆ శ్రియఃపతి కృపచేత నాకు కల్పింపబడింది. తమ్మళి సన్నాయివాళ్ళు, బ్యాండు వాళ్ళు, డప్పులవాళ్ళు ఒక్కరు కూడా ప్రతిఫల మాశించక, భగవత్కైంకర్య పరులయ్యారు. ఏడు

గ్రామాల జనులు వచ్చి, భగవత్సేవలో పాల్గొని, రోజు తీర్థ ప్రసాదాలను స్వీకరించి పోయి, వచ్చేవారు. రేయింబవళ్ళు కల్యాణోత్సవ రథోత్సవాలతోనూ, చైత్రమాసంలో వసంత నవరాత్రులతో పాటు బ్రహ్మోత్సవం జరిగినప్పుడు, విశేషంగా శ్రావణ మాసోత్సవాలతో వైకుంఠంగా ప్రకాశించిన ఆ దివ్యధామాన్ని ఆబాల గోపాలం సేవించి ధన్యజీవులయ్యారన్న రమణీయ వృత్తాంతం మరపురానిది.

రాష్ట్రమంతా రజాకార్ల దౌర్జన్యంతో అల్లకల్లోలంగా ఉన్నప్పుడు మా గ్రామం మధురాతి మధురమైన భగవత్సేవా ధురంధరత్వం చేత 'ఇది నారాయణపురం' అనే నామాన్ని సార్థకంగా నిల్పుకొన్నది. శ్రీ వల్లభాయ్ పటేల్ యొక్క నిరుపమాన సామర్థ్యంవల్ల 17 సెప్టెంబర్ 1948వ నాడు నిజాం ప్రభువు లొంగిపోయాడు. కోటి రత్నాల వీణయైన తెలంగాణ విముక్తి పొందిందని (గడిలో) రేడియోవార్త శ్రవణానందంగా వినిపించింది. ప్రతి వ్యక్తి యొక్క డెందమానంద కందళితమయింది. రాష్ట్రమంతా పండుగ దినం నెలకొన్నది.

నేనొక మనిషినయ్యాను. ఇంటికి పెద్దవాణ్ని అయినా, మా కుటుంబానికైనా నేనేమి సహాయపడడం లేదు కదా! అనే దుగ్ధ- చింత- నాకు అమితంగా ఏర్పడింది. ఇట్టి విచారంతో రోజు ఒకే పూట భోజనం చేసేవాణ్ని. అంతలో ఈ ప్రాంతానికి వలె, మా గ్రామానికీ ప్లేగు తగిలింది. ఎలుకలు పడడం, రోగాలతో జనులు బాధపడుతుండడంవల్ల ఊరు విడిచి, బాహ్యప్రదేశంలో గుడిశలు వేసుకొని కాపురం చేయడమయింది. బ్రాహ్మణులు, కోమట్లు ఒకే ప్రాంతంలో ఉన్నారు. కాపులు, తదితరులు వారి వారి చేలల్లో నివాస మేర్పరచు కొన్నారు.

బ్ర.శ్రీ. జోగా వెంకన్నశర్మ (గురువు)గారు (85 ఏండ్లకు) గుడిశలోనే దివంగతులయ్యారు. వారికి ఊర్ధ్వలోక క్రియలను శ్రీ మురళీధరశర్మ పూర్తిచేసి, వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామిని దర్శించి వచ్చేదాకా నేను వారి వెంట తోడుగా ఉండి స్వస్థలం చేసుకొన్నాను.

ఏమీ తోచని స్థితిలో నున్న నన్ను మా నాన్నగారు 'సుందరకాండ' పారాయణం చేయుమని ఆదేశించారు. పెందలకడనే లేచి, నదిలో స్నానం చేసి, భగవదారాధన చేసిన తర్వాత నిత్యం పారాయణం, పగలు 3 గం. లకు భోజనం చేయడం నియమంగా ఉండింది. సాయం సమయాన శ్రోతల కోరిక మేరకు 'విష్ణుసహస్ర నామం' సామూహిక పారాయణానంతరం, శ్రీమద్భగవద్గీతోపన్యాసాలతో మూడు మాసాలకాలం గడిచింది. 1949వ సంవత్సరం, శివరాత్రి దాటగానే గ్రామాన్ని శుభ్రపరచి, ఇండ్లకు సున్నం జాజులు వేసి, తోరణాలతో అలంకరించి, తిరిగి ప్రవేశించడమయింది. చైత్రమాసంలో వసంత నవరాత్రులు, సీతారామ కల్యాణం, పంచాహ్నిక బ్రహ్మోత్సవ సమయమయింది. సుందరకాండ పారాయణం సమాప్తమయిన దినమందు, ఆలయంలో స్వామి భోగానికి, బ్రాహ్మణ శ్రీవైష్ణవుల భోజనానికి వారి వారి యిండ్లకు సాహిత్యాలు పంపించ బడినాయి.

హనుమదాలయంలో శ్రీ రామదాసుకు మన్యుసూక్తంతో అభిషేకించి, సింధూర లేపనం, పుండ్రధారణం, పూల హారాలు, వడల మాలికతో నలంకరించి నారికేళ, కదళీ ఫలాదులు నైవేద్యమర్పించి, హారతినిచ్చి, భజనతో ప్రదక్షిణ నమస్కృతులొనర్చి, తిరిగి సీతారామస్వామి సన్నిధికి వచ్చి, మంగళా శాసనానంతరం

తీర్థ ప్రసాదులకు స్వీకరించడమయింది. సాయంకాలం పెద్దలందఱు ఇంటికి వచ్చి ఈ అల్పజ్ఞునికి మహదాశీర్వచనం చేశారు; చందనగోష్ఠి తర్వాత దక్షిణ తాంబూలాది సత్కారాలను కృపతో స్వీకరించారు.

బ్ర.శ్రీ. బావి కృష్ణశాస్త్రిగారు తమ ఉపన్యాసంలో "చిరంజీవి రాఘవుడు మందుడు కాడు. అతడు మేధావి. సదాచారుడు. ఉపాధి పత్రాన్ని పొందే విద్య నభ్యసించక పోతినన్న తపన, ఏదైన ఉద్యోగం చేయాలనే ఆరాటం అతనికి ఇటీవల అధికమై, లోలోన కృశిస్తున్నాడు. మన మధ్యలో గారాబంగా పెరిగినందు వల్ల మనసు విడిచిపోయి, బయట లోకాన్ని చూడలేకున్నాడు. 'అచేష్టమాన మాసీనం శ్రీః కంచిన్నోపతిష్ఠతి' ఏమీ చేయక, ఊరక యుండేవానికి సంపత్తు లభించదు కదా! ఈ జాడ్యం తొలగిపోవడానికి, ఇంటి నుండి అతడు కాలు బయట పెట్టిననాడు అతని ప్రజ్ఞ పలు దెసల ప్రకాశిస్తుంది. యువకుడైన తాను రెండు పూటలు తప్పక భోజనం చేయాలి. 'శరీరం మాద్యం ఖలు ధర్మ సాధనం' అన్నమాట అతనికి తెలియనది కాదు. దృఢమైన దేహమందే మేధస్సు వికసిస్తుంది. అతడు బుద్ధిమంతుడని తెలిసిన ఇక్కడున్న పదుగురిలోని భావాలను నేను దృఢాధ్యవసాయంతో బాహిరంగా ప్రకటిస్తున్నాను. తల్లిదండ్రులు కూడా అతనికి ప్రోత్సాహాన్ని కల్పించి, బయటకు పంపిస్తే ఉద్యోగమూ లభిస్తుంది. కుల దీపకునిగా భగవానుడు కటాక్షించగలడని మంగళాశాసనం చేస్తున్నా"మన్నారు.

వారి అభిభాషణతో నాకు కొండంత స్థైర్యమేర్పడింది. ఒక వారమాలోచించాను. గ్రామంలో శ్రీకె.మురళీధరశర్మ కార్యదర్శిగా చిన్న గ్రంథాలయ మేర్పరచి, యువకులను సభ్యులను చేర్చి రోజూ అక్షరాస్యులు వచ్చి శ్రద్ధతో గ్రంథాలను, పోస్టు ద్వారా తెప్పించిన భారతి, స్వతంత్ర, సుజాతేత్యాది పత్రికలను చదివే పాటవాన్ని కల్పించడమయింది.

తెలుగు భాషను వృద్ధి చేయడానికి సిరిసిల్లలో శ్రీమాన్ నేరెళ్ళ వేంకటాచార్యులు ఆంధ్ర సారస్వత పరిషత్ శాఖను స్థాపించి పరీక్షలు నడుపనున్నారని తెలిసింది. నేను పోయి వారినడిగితే 'ప్రథమ, మధ్య, ప్రవేశ, పరీక్షలను క్రమంగా వ్రాయాలి. ఒకేసారి పై పరీక్ష వ్రాయదలచిన వారు హైదరాబాదు పరిషత్తు నుంచి అనుమతి పత్రాన్ని పొందవలసి యుంటుంద'న్నారు. ఒక పక్షపు రోజుల తర్వాత మా తల్లిగారిచ్చిన పది రూపాయలతో బయల్దేరాను. బొగ్గుతో నడిచే బస్సులు రోజుకు మూడు మాత్రమే కాబట్టి, 12 గం.లకు బస్సెక్కి స్టేషనులో (...) అర్ధరూపాయి టిక్కెట్టుతో కామారెడ్డికి చేరాను. 4గం.లకు స్టేషనులో ఒక రూపాయి అయిదణాల టిక్కెట్టుకొని రైలులో కాచీగూడకు చేరుకొన్నాను. ఆ రాత్రి స్టేషన్ వెనుక ఉన్న శ్రీ యోగిరావు (సుందర్‌రావుగారి జామాత) గారి భవనంలో నిద్రించాను. ఉదయాన నిత్యానుష్ఠానానంతరం 'జెట్కా'లో సారస్వత పరిషద్భవనానికి పోయాను. అక్కడ అరుగుమీద కూర్చున్న కాసేపటికి ఒక మహానుభావుడు ఆఫీసులోకి వెళుతూ నన్ను జూచి 'ఇక్కడెందుకు కూర్చున్నావు? నీకేం కావాలి?' అని అడిగాడు. వారి ముందు బద్ధాంజలితో నిల్చి "ప్రవేశ పరీక్షకు అనుమతిని పొందడానికి వచ్చాను" అనగానే లోనికి రమ్మన్నారు. టేబుల్ ముందు నిలబడిన నన్ను నీవేమి చదువుకొన్నావన్నారు. 'నేను స్కూల్లో చదవలేదు. వేదం, సంస్కృత కావ్య నాటకాలంకార సాహిత్యాన్ని అభ్యసించాను. ప్రవేశపరీక్ష నిచ్చి, ఉపాధి పత్రాన్ని పొందితే ఏదైనా

ఉద్యోగం లభిస్తుందేమో అని ఆశించి వచ్చాను అనుమతించండి' అన్నాను. వారి పక్కన ఉన్న వ్యక్తి 'భారవి' కావ్యంలోని ఒక శ్లోకం చదివి, తాత్పర్యం చెప్పమన్నాడు.

"సఖీనివ ప్రతీయుజోను జీవిన
స్సమానమానాన్ సుహృదశ్చబంధుభిః
ససంతతం దర్శయతే గత స్మయః
కృతాధిపత్యామివ సాధుబంధుతామ్"

ధర్మరాజులాగా పేర్గాంచవలెనని తలచిన సుయోధనుడు కపట రహితుడై తన భృత్యులను మిత్రులనువలెనూ, మిత్రులను బంధువులను వలెనూ, బంధు వర్గాన్ని ఆధిపత్యం నిర్వహిస్తున్న వారిగానూ, వారికి ఉన్నత పదవులను కల్పించి సాదరంగా చూస్తున్నాడు. అందువల్ల-

"సమున్నయన్ భూతి మనార్యసంగమాత్
వరం విరోధపి సమం మహాత్మభిః"

ఐశ్వర్యాభివృద్ధిని కోరే వ్యక్తికి దుర్జన సహవాసం కంటె సజ్జనులతో విరోధమైననూ మేలే కదా! అని శ్లోకార్థం. మరొకరు 'ఒక పద్యం చదివి అర్థం చెప్పండి' అని అడిగినారు. 'వల్లెవేయని కారణాన పద్యాలు కంఠస్థంగా లేవు. మీరు చదివితే భావం చెబుతానండి' అని విన్నవించాను.

"అభ్రంలిహాదభ్ర విభ్ర మ భ్రభ్రమాకృన్నీల దీర్ఘ శరీర మమర" ఈ వాక్యార్థాన్ని వినిపించుమన్నారు.

"ఆకసాన్ని తాకుతూ, గొప్ప ప్రళయకాల మేఘమనే భ్రమను గొల్పుతున్న నల్లని సుదీర్ఘ దేహం కల వాడని అర్థం కదా!" అన్నాను.

"భళా! యోగ్యత ఉంది. ప్రవేశ పరీక్షకై వీరికి అనుమతి పత్రమీయండి" అని ఒకరిని పిలిచి చెప్పి 'ఆ గదిలో కూర్చొండి' అని నాతో పలికారు.

ఆ గదిలో మాకంటె పూర్వ విద్యార్థి బ్ర.శ్రీ పదిరె రాజేశ్వరశర్మగారు చేస్తున్నారని తెలిసి నాకు చాలా తృప్తి కలిగింది. కాసేపట్లో, శర్మగారే అనుమతి పత్రాన్ని తెచ్చి ఇచ్చి "త్వం భాగ్య వానేవ, విజయీ భవ!" అని ఆశీర్వదించారు. 'ఆ మహానుభావుల పేర్లు చెప్పండి' అన్నాను. ఒకరు పులిజాల హన్మంతరావుగారు, మరొకరు దేవులపల్లి రామానుజరావుగారు అని చెప్పినారు. ధన్యోస్మి.

అవధిలేని ఆనందంతో నేరుగా సిరిసిల్లకు చేరి శ్రీ ఎన్.వేంకటాచార్యులకు అనుమతి పత్రాన్ని చూపించాను. వారు నేను శ్రీయుత మామిడిపల్లి హన్మంతరావును కలిసి, పరీక్షాభ్యర్థులు చదువుకోవడానికి స్థల మడిగినాము. వారు కాంగ్రెసు ఆఫీసు భవనానికి వెనుక భాగంలో ఉన్న పెద్ద ఇంటిని ఉపయోగించు కొమ్మన్నారు. మా యూరి నుంచి స్వయం పాకానికి వంట సామగ్రిని తెచ్చుకొని ఆ ఇంటిలో నివసించాను. ప్రథమ పరీక్షార్థులకు బోధించడానికి శ్రీ పీచర్ రామానుజాచార్యులు, మధ్యమకు నేను, ప్రవేశకు శ్రీ ఆచి వేంకటాచార్యులవారు ఉపాధ్యాయులుగా నిర్ణయింపబడినాము. ఉదయం 9గంటల వరకు, సాయంత్రం 6

గంటల నుంచి 8 గంటల వరకు బోధన జరిగేది. నేను ప్రవేశ పాఠ్యాంశాలను చదువుకొనేవాణ్ని. పెందలకడ లేచి వంటవండి, స్కూల్లో చదువుకొనే ఇద్దఱు తమ్ములకు– తిరుమల నరసింహాచార్యులు, శ్రీనివాసాచార్యులకు ఎల్లారెడ్డిపేట తిరుమల కృష్ణమూర్తికి కూడా భోజనం పెట్టి, నా వద్దనే చదివించేది. ఏదేమైనా, కష్టసుఖాలను జీవితంలో సమంగా భావించే వ్యక్తియే రసరాట్టు అనిపించేది.

శ్రీ మామిడిపల్లి హన్మంతరావుగారు 26 జనవరి 1950వ నాడు వ్యాసరచన పోటీ ఏర్పరచారు. 'మహాత్మాగాంధి జాతిపిత' అనే శీర్షికపై సంస్కృత భాషలో వ్యాసరచనకు ముగ్గురు పాల్గొనగా, నన్ను ప్రథమునిగా నిర్ణేతలు ప్రకటించి బహుమానించారు. ద్వితీయ బహుమతి బ్ర.శ్రీ. కోశిగ కృష్ణమూర్తికి లభించింది. (నిర్ణేతల్లో ఒకరు ఒక అభ్యర్థితో కోడ్ నంబర్ 2 నీదే అనుకొన్నాను అన్న మాట నా చెవిలో పడింది.) ముఖ్యంగా 'కృషితో నాస్తి దుర్భిక్ష'మనే నానుడి రిత్తపోదని సంతోషించి 'ఈ ప్రథమ ప్రయత్న ఫలం భగవంతునిదే' అని మనసా సమర్పించుకొన్నాను. తర్వాత 'మార్చి' నెలలో పరిషత్ పరీక్షలు సిరిసిల్ల గవర్నమెంట్ మిడిల్ స్కూల్లో జరిగాయి. ప్రవేశపరీక్షలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడనయ్యానని (రెండు నెలల తర్వాత ప్రకటింపబడినట్లు) శ్రీ ఎన్. వేంకటాచార్యులు నాతో చెప్పినారు. హైదరాబాదుకు హాల్‌టిక్కెట్టుతో వెళ్ళి పరిషత్తునుంచి ధ్రువ పత్రాన్ని పొంది మెదక్కు చేరి శ్రీ టి.వి.ఎన్.వారి అన్నయ్యకు ఆ పత్రాన్ని ఇచ్చాను. 'నాకు ఉద్యోగం లభించే ప్రయత్నం నీవే చేయాలి' అని కోరగానే రెండు తెల్ల కాగితాల మీద నా సంతకం పెట్టించుకున్నారు.

'నేను లేఖను వ్రాసిన వెంటనే చూచుకొని ఉద్యోగానికి సిద్ధమై నా దగ్గరికి రావాలి. ఆలస్యం చేస్తే ఆ ఉద్యోగం మరొకరికి దక్కుతుంది' అని నొక్కి చెప్పినాడు. 'అన్నయ్యా! తప్పక అలాగే చేస్తానని చెప్పి నారాయణ పురం చేరుకొన్నాను. 1950 సెప్టెంబర్ 22న లేఖ వచ్చింది. మెదక్కు వెళ్ళాను. ఉర్దూ భాషలో ఉన్న ఆర్డర్ చదివి వినిపించాడు. (స్టేషన్) మూసాయిపేట గ్రామం. తమాతాన్యాలో రాయ్‌లాపురం శ్రీ లక్ష్మణరావు మెట్రిక్ ట్రేనింగుకు వెళ్ళినందున, ఆ స్థానంలో నెలకు రూ.25/- (హాలి వేతనంపై (మున్సరం) టీచర్‌గా నియమింపబడినానని వివరించారు. అన్నయ్యకు తన స్కూల్లో చదువుతున్న ఒక విద్యార్థి తండ్రి పరిచయ మున్నాడని ఒక లేఖ వ్రాసి ఇచ్చాడు. 24వ నాడు ఆ లేఖను, ఆర్డర్‌ను పట్టుకొని మూసాయిపేటలో శ్రీ దమ్మన్నగారి వెంకటరెడ్డి ఇంటికి చేరినాను. వసతి సౌకర్యాలను వారి అంగణంలోనున్న మేడ మీద కల్పించాడు. ఆ రాత్రి మాతృప్రసాదంగా తెచ్చుకొన్న అటుకులను పెరుగుతో కల్పి ఆహారంగా తీసుకొన్నాను. ఉదయాన వండుకొని భోజనం చేసిన తరువాత ఆయన తమ్ముడు శ్రీ ముత్యంరెడ్డి నన్ను స్కూలుకు తీసుకొనిపోయి హెడ్మాస్టర్‌కు పరిచయం చేశాడు. 25 సెప్టెంబర్ 1950నాడు స్కూల్ టీచర్‌గా ఉద్యోగ మారంభమయింది. 2, 3వ తరగతులకు పాఠాలు, కథలు చెప్పడం, చిన్న చిన్న పద్యాలను, ఎక్కాలను వ్రాయించడం నియమంగా ఉండింది. విధి బలీయమనుకొన్నాను.

శరన్నవరాత్రులు కాబట్టి రాత్రి 8 గంటల వరకు ఆ మేడమీదనే రోజు శ్రీమద్రామాయణంలో సీతాదేవి మహిమను ఉపన్యాస రూపంగా చెప్పగా (ముత్యంరెడ్డి ప్రచారం వల్ల), జనం ముప్పదికి పైగా వచ్చి విన్నారు. దసరా పండుగనాడు 'సీతాదేవి చరిత్ర' సర్వశ్రుతి మనోహరంగా ఉన్నదంటూ, మిత్రులందఱు

సన్మానించారు. అందరిలో శ్రీ తిరునగరి నరసింహులు- సమవయస్కుడు, ఈ స్వగ్రామంలోనే పోస్టు మాస్టర్ నాకు పరమ మిత్రుడయ్యాడు. అతని సహకారంచేత కరణం శ్రీ రాజేశ్వరరావుగారివద్ద ఎ.బి.సి.డి.లు మొదల్కొని ఇంగ్లీషు (బొమ్మ) బాలశిక్షను నేర్చుకొన్నాను. ఒక ముస్లిం టీచర్ దగ్గర 'అలీఫ్, బె, పె-సె'లు ఆరంభించి క్రమంగా మూడు నెలల్లో ఏడవ తరగతి పుస్తకం వరకు బాహ్యంగా చదువడం, వ్రాయడం నేర్చుకొన్నాను. ముఖ్యంగా ముదాసిలాలు (వక్రమైన అక్షరాలు కలవి) చదివి అర్థం చేసుకోగలిగాను. సహృదయులైన ఆ గురువులు నన్ను సంస్కరించారు. వారికి కృతజ్ఞతాపూర్వక నమస్కృతులు.

జన్మించిన తేదీగల సర్టిఫికెటు బరావర్దుతో జత పరచనందువల్ల నాలుగు నెలలవరకు జీతం రాలేదు. మెదక్కుపోయి అన్నయ్యకు చెప్పాను. నేను అన్నయ్య మున్సిఫ్‌కోర్టుకు పోయినాను. అక్కడ శ్రీ కాశీనాథరావు, మహమ్మదలీ వకీళ్ళను సంప్రదించాము. మరునాడు అదాలతుకు రమ్మన్నారు. ఏదో జన్మ పత్రికను వ్రాయించుకొని మా అన్నయ్యతో సంతకం పెట్టించుకొన్నారు. అదాలతుకు వారు చెప్పిన సమయానికి పోగా, పగటి వరకు 'అఫిడవిట్' తెచ్చి చేతికిచ్చారు. వారికో 'అయిదు పది' సమర్పించాము. మాసాయిపేటకు పోయి 'అఫిడవిట్'కు నఖలు పత్రాన్ని హెడ్మాస్టర్‌కు ఇవ్వగా, వారొక లేఖను 'అసలు' పత్రానికి జత పరచిన ఒక కవరును నా చేతికి ఇచ్చి, నీవే సంగారెడ్డికి వెళ్ళి అక్కౌంట్ ఆఫీసులో దాఖల్ చేస్తే త్వరగా జీతం వస్తుందన్నారు. ఆ మరునాడే హైదరాబాదు మీదుగా సంగారెడ్డిలో కలెక్టర్ ఆఫీసుకు పోయి అక్కౌంట్ ఆఫీసర్ శ్రీ నరసింగరావుకు ఆ కవరును ఇచ్చాను. ఆయన 'అఫిడవిట్'ను చూచి, 'ఒక వారంలో మీ బిల్లును పాస్ చేసి మీ స్కూలుకు పంపిస్తాను, విచార పడకు'మని చెప్పారు. తిరిగి నేను స్కూలుకు వచ్చిన వారానికే 'బరావర్దు' మంజూరై వచ్చింది. మరుసటి రోజున నాలుగు నెలల జీతం రూ. 100/-లు (హాలీ) చేతికందినాయి. ఆ వారంలో మా తండ్రిగారు వచ్చారు. "నీ చెల్లెలుకు తొలి కాన్పులో ఆడ శిశువు జన్మించింది; నామకరణానికి పోదాము పద" అన్నారు. హెడ్మాస్టరును సెలవు కోసమడిగితే, మున్సరంటే టీచర్‌కు సెలవు ఈయబడదన్నారు. ఆ సంగతిని నాన్నగారికి చెప్పి, మొదటి జీతమిది అని వందరూపాయలను సమర్పించుకొన్న సంతృప్తి నాకు కలిగింది. 'నిన్ను ఉద్యోగం చేయమన్నానా? స్వేచ్ఛ ఉండదు. కష్టపడుతున్నావు కదరా!' అనగానే, ""నాన్నగారూ! మీ జీవన విధానం వేరు. మీ ఆశీః పటిమతో నా జీవితం సుఖమయంగానే ఉన్నది, ఉంటుంది కూడా. నా విషయమై మీరు 'చింత' పడవద్దు" అని పాదాభివందనం చేసి పంపించాను.

ఆ సంవత్సరం టీచర్లకు 'హప్తుమ్' మిడిల్ పరీక్షను వ్రాయడానికి ప్రభుత్వం అనుమతించిందని తెలిసింది. ఒకనాడు సంగారెడ్డికి పోయి నా విషయమంత ఒక లేఖలో వివరించి దానితో మిడిల్ పరీక్షకు అనుమతిని కోరుతూ ఒక దరఖాస్తును జతపరచి, మొహతెమీమ్ తాలిమాత్‌గారికి నమస్కరించి ఆ కవరును అందించాను. వారు 'ఇదేమిటి? అన్నారు. 'గుజారిష్' అన్నాను. దరఖాస్తును చూచుకొని 'రెండు సంవత్సరాలు టీచర్‌గా ఉన్నవారికే ఈ పరీక్షకు అనుమతించాలని 'రూల్' ఉంది. నీకు అనుమతీయబడదు అన్నారు.

"మీరు ఒక జిల్లాకు విద్యాధికారులుగా ఉండి ఒక సంస్కృత పండితునికి సామాన్యమైన చిన్న పరీక్షను వ్రాయడానికి అనుమతించలేరా సార్! దయచేసి అనుమతించండి అని మనవి చేస్తున్నాను" అన్నాను.

"నీవు అరసున్న, సున్నను చెబుతావా?" అని వారనగానే "సార్! దయచేసి తెలుగు భాషను గూర్చి హేళన చేయకండి. ఆ విధానం ఒక్క తెలుగు భాషకే ఉంది. అనుస్వారమే 'కచటతప'లను 'గజడదబ'లుగా చేసి, సరళభాషగా మారుస్తున్నది. అనుస్వారంవల్ల మధురమైన ఎన్ని ముద్దులొలుకుతున్నాయో చూడండి" అన్నాను. 'మోనుస్వారః' అని సూత్రం.

"నన్నును కౌగిలించుకొని నా వదనంబునకున్ నిజాస్య మా
సన్నము జేసి యొక్క మృదు శబ్దము సేసె మనోహరంబుగా
నెన్నడు నట్టి శబ్దము మునీశ్వర! మున్వినియే నెఱుంగ న
య్యన్నువ బ్రహ్మచారి ముఖమంబురహంబు సమంబు సూడగన్॥"

(నన్నయ భారతం). తీయని తేనె సోనలు జాలువారే భాష 'తెలుగు' ఒక్కటే కదా!

"నేను పనిచేసే అవకాశం ఇక రెండు నెలలే ఉంది. మీరు అనుమతిస్తే మీ దయవల్ల బాగుపడతాను. పరీక్షలో పాస్ కాకపోతే, మళ్ళీ మీకు నా ముఖాన్ని చూపలేను సార్! కటాక్షించండి" అని వేడుకొన్నాను. 'చూద్దాము. ఇక నీవు పోవయ్యా!' అన్నారు విద్యాధికారి.

ఫిబ్రవరి 8, 51లో మొహతెమీమ్‌గారు స్కూళ్ళ తనిఖీ కోసం వచ్చి, కొత్తగా నిర్మించిన స్కూలులో బస చేశారు. హెడ్మాస్టర్ ద్వారా మిడిల్ పరీక్షానుమతి కోసం నా దరఖాస్తు అందించబడింది. దానిపై అధికారి సంతకం చేశారని తెలిసింది. దరఖాస్తు పెట్టిన తేది 'మజారియా నంబర్' హెడ్మాస్టర్ వేసి నా చేతికొక పత్రమిచ్చి పైరవి చేసుకొమ్మన్నాడు. ఆ పత్రాన్ని ఒక మిత్రునిద్వారా అన్నయ్యకు పంపించి, ఒక పక్షంరోజులైతే ఉద్యోగం ఊడిపోతుంది. ఆ లోపల అనుమతిని తెప్పించే యత్నం చేయుమని చెప్పి పంపడమయింది. 31 మార్చినాడు స్కూలులో వీడ్కోలు జరిగింది. మిత్రులనుంచి సెలవుదీసుకొని మెదక్కు చేరుకొన్నాను. 'అనుమతి తెచ్చాను, పరీక్షకు ఫీజుకట్టినాను' అని అన్నయ్య చెప్పి నాకు పరీక్ష హాల్ టిక్కెట్టు చూపించాడు.

అన్నగారి ఇంట్లో ఇద్దఱు విద్యార్థులు ఏడవ తరగతి చదువుతున్నవారు ఉన్నారు. ప్రతి సబ్జెక్టులో బోధింపబడిన పాఠాలు, సిలెబస్ వ్రాసుకొన్నాను. 1951 ఏప్రిల్ రెండవ వారంలో పీరక్షలారంభమయ్యాయి. ఆ ఇద్దరు రాత్రి నిదుర పోగానే, వారి పుస్తకాలను తెల్లవార్లు చదివి, పగలు పరీక్ష వ్రాసి రావడం నా దైనందిన కార్యక్రమం. పరీక్ష పూర్తి కాగానే, నారాయణపురం చేరుకొని రెండు మాసాలు కుటుంబ సభ్యులతో సంతోషంగా కాలం గడిపినాను.

జులై 1951లో మిడిల్ పరీక్షలో ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణుడనైనందువల్ల నన్ను రమ్మని లేఖ వ్రాశారు. అటు తానే సంగారెడ్డి వెళ్ళి నా కోసం అన్నయ్యనే ఆర్డర్ తెచ్చి పెట్టినట్లు చెప్పాడు. సంగారెడ్డికి దగ్గర 'చక్ర్యాల' గ్రామంలో ఏకోపాధ్యాయ పాఠశాలలో 16 జులై 1951నాడు ఉద్యోగిగా చేరినాను. మఱునాడు సంగారెడ్డికి పోయి రెండు హాలీ రూపాయలకు డజన్ పెద్ద బత్తాయిపండ్లను కొని, విద్యాధికారికి ప్రాభృతంగా సమర్పించి జాయినింగ్ రిపోర్టు నిచ్చాను. 'చక్ర్యాల గ్రామస్థులకు బ్రాహ్మణులంటె చాలా గౌరవం.

అవసరమైప్పుడు ఆఫీసుకు వచ్చి పనులు పూర్తి చేసుకొంటూ, సంతోషంగా పై పరీక్షలకు సాధన చేయండి' అని ఆఫీసర్ సాదరంగా పలుకగా, కృతజ్ఞత లర్పించి వచ్చాను.

ఆ వారంలోపల 'సాలానాతఖ్తా' పంపుమని ఆర్డరు వచ్చింది. స్కూలులో పాఠాలు చెప్పడం సులభమే కాని 'క్లర్కు' పని చేయడంలో 'ఎత్తుజిత్తులు' అవసర మనిపించింది. శివ్వంపేటలో టీచర్‌గా పనిచేస్తూ వచ్చే ఈ గ్రామవాసిని సంప్రదించగా, నాలుగురోజుల్లో 'తఖ్తా' సిద్ధంచేసి ఇచ్చాడు. పాత 'దస్తర్'ను పరిశీలించాను. నా స్కేల్ (హోలీ) 42 42 టు 54 18.

చక్ర్యాల గ్రామంలో శ్రీ గాజుల చెన్నయ్య, తమ్ములతో కూడియున్న గొప్ప సంపన్న కుటుంబి, సదాచారం కలవారు. వారి పెద్ద భవనంలోని ఒక భాగంలో ప్రత్యేకంగా నాకు వసతి కల్పించడమే కాక రెండేండ్లు అక్కడ ఉన్నంత కాలం మాకు భోజన సామగ్రిని సమకూర్చారు. ఆషాఢ పున్నమకు; మాఘ పున్నమకు ఏడాదిలో రెండుసార్లు గ్రామంలో ఆబాలగోపాలం, అన్నదానం చేసి పెద్దల ఆశీర్వాదం పొందేవారు.

పక్షంరోజుల వేతనం రాగానే, నేను నారాయణపురానికి పోయి నా పత్నిని, రెండవ తమ్ముడైన నరసింహాచార్యులను (సిరిసిల్ల స్కూలు T.C.తోపాటు) తోడ్కొని వచ్చాను. తమ్ముణ్ని సంగారెడ్డి హైస్కూలులో, 8వ తరగతిలో ప్రవేశపెట్టాను. ఆ స్కూలులో శ్రీమాన్ గోవర్ధనం దేశికాచార్యులు టీచర్‌గా ఉన్నారు. వారు మాకు బంధువులు. వారి ఇంటికి పోయి 'స్వామీ! నాకు H.S.C. పరీక్షార్థం ఇంగ్లీషు నేర్పండి. రోజు సాయంత్రం వచ్చి ఉదయం వెళ్ళిపోతాను' అని విజ్ఞప్తి చేశాను. 'అదెంత భాగ్యం! నా దగ్గర మీ ఇష్టానుసారంగా ప్రవర్తించవచ్చు'నన్నారు. చక్ర్యాలలో జొన్నరొట్టెలు, కందిపప్పు, వంకాయకూర బాగా రుచికరంగా ఉండేది. పాఠశాల వేళ 9 నుంచి 4 గం.లు, సాయంత్ర 5 గం.కు సంగారెడ్డికి పోయి, మొదట జ్ఞానోదయ రీడర్ (10వ తరగతి)లో గాంధీజీని గూర్చి కృష్ణాఔథీ సింగ్ వ్రాసిన ఆంగ్లపాఠం (నాలుగు పేజీలు) చెప్పించుకొన్నాను. తలగడ నున్న గోడకు ఎక్కాదీపాన్ని వెలిగించి ఆ రాత్రి, ఉదయాననూ వల్లించాను. తెల్లవారగానే లేచి వచ్చిన దేశికస్వామిని 'మీరు చెప్పిన పాఠంలో దయచేసి నా దోషాలను సవరించండి, వినండి' అనగానే వారు పుస్తకం పట్టుకొని, కొన్ని పదాలను అడిగితే వాటి అర్థం చెప్పినాను. చదివితే మీకు నా ఉచ్చారణ కూడా తెలుస్తుందని గబగబా పాఠమంత (నోటికే) చదివినాను. 'బాపురే! వేదంలాగా పూర్తి పాఠాన్ని ఒక్క రాత్రి కంఠస్థం చేశావు! రోజు ఒక్క పేజీ కూడా వ్రాయడం మంచిది. H.S.C. తప్పక పాసవుతావన్నారు. కొన్నాళ్ళ కృషి తర్వాత, కథలను అనువదించి చూపగా సవరణ చేసేవారు. Hanuman fire lanka అన్నదానికంటె He set lanka on fire అంటె బాగుంటుందని వివరించే వారు 'టేల్స్ ఆఫ్ షేక్స్‌ప్పియర్, వికార్ ఆఫ్ ఏ వేక్ ఫీల్డ్' హైస్కూలు గ్రామర్ అనే బుక్స్ తానే ఇచ్చి వీటిని వీలునుబట్టి చదువుకొమ్మన్నాడు.

1952లో వారికి ఒక పుత్రుడు జన్మించాడు. ఫిబ్రవరిలో నాకు ఒక సూనుడు ఉదయించాడు. మా తల్లిగారికి మగపిల్లవాడు జన్మిస్తే తిరుమలేశుని దర్శనానికి వస్తాము స్వామీ! అని మా అమ్మమ్మగారు మ్రొక్కినారట. కాని అట్టి మ్రొక్కుబడి నేను పుట్టిన ఇన్నాళ్ళకు కూడా దీర్చుకోలేదు. నాకూ సంతానమైనందు వల్ల దర్శనం చేసుకోకపోతే భగవన్ని గ్రహపాత్రుల మవుతామనిపించింది.

'తిరుమలకు వెళ్ళదలచానండి' అని తెల్పగానే చెన్నయ్య, తమ్ముడైన రాములు, పుత్రుడైన అనంతయ్య, బ్ర.శ్రీ. గోపాలకృష్ణయ్యగారు, పట్వారి శ్రీ లక్ష్మణ్‌రావు, ఆయన సుతుడు రామారావు పోదామని సిద్ధమయ్యారు. నాకు పురుడు వెళ్ళిన పిమ్మట శంకరపల్లి నుంచి విజయవాడ, గూడూరు, తిరుపతికి చేరడానికి రెండురోజుల సమయం పట్టింది. ఏడుగురం ఏడు కొండలస్వామిని దర్శనం చేసుకొన్నాము. ఆకాశగంగకు తెల్లవారె వరకు పోయి తీర్థమాడి వచ్చి, మళ్ళీ తలకు రూ. 13/- చొప్పున ఒక 40 మందికి భక్తులతోపాటు శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకొనే భాగ్యం కలిగింది. తిరుచానూరులో పద్మావతీ దేవిని సేవించి, నాలుగు రోజుల్లో చక్ర్యాలకు చేరుకొన్నాము. తిరుపతికిపోయి రావడానికి మనిషికి రూ. 30/-లు (రైలు ఛార్జీలు) అవసరమైన కాలమది. ఇంటికి వచ్చిన తరువాత యాత్రోత్సవం జరుపబడింది. మా తల్లిదండ్రులను పుత్రుని నామకరణానికి రమ్మని అన్నయ్య తెల్పినందున వారు మెదక్కు వచ్చారు. వందరూపాయలకు ఒక తులం బంగారం జోగిపేటలో కొనుక్కొని నేనూ మెదక్కు వెళ్ళినాను. బంధువులు వచ్చారు. సప్తగిరి నాథుడైన వేంకటరమణుని సేవించి వచ్చినానని అందఱు సంతోషించారు. మా పుత్రునికి 'వేంకటరమణ' అని నామకరణం చేశాము. మాకు పుత్రుడు జన్మించిన తర్వాతనే శ్రీ వేంకటశ్వేరస్వామి తనను దర్శించుకొనే సుకృతం ఈ సేవకునికి కల్పించాడని పెద్దలు మంగళా శాసనం చేశారు.

తర్వాత స్కూలు పరీక్షలు, వేసవి సెలవులు, తిరిగి యథావిధి ఉద్యోగం, చక్ర్యాలకు కుటుంబం మా తల్లిదండ్రులతోపాటు చేరుకొన్నది. 1952వ సం॥ గడిచింది. 1953 జులైలో దేశికాచార్యస్వామి BEd Training కోసం హైదరాబాదుకు వెళ్ళాడు. ఆ యేడు అక్టోబర్‌లో డిప్యుటేషన్‌గా నాకు మెదకు హైస్కూలుకు తబాదిలా అయింది. ఏడవ తరగతి క్లాసు టీచర్‌గాను, 8, 9 తరగతులలో సంస్కృత పాఠ (ఐచ్ఛికం) బోధకునిగానూ నియమించి, టైంటేబుల్ చేతికిచ్చారు. తక్కిన ఇద్దరు తమ్ములను (తిరుమల శ్రీనివాసాచారి, వెంకటరమణాచారి) కూడా హైస్కూలులో (7, 5 తరగతుల్లో) చేర్చాను. 'అక్కడి తోటి టీచర్లతో సమాన యోగ్యత ఎప్పుడు కలుగుతుందో కదా!' అన్న ఆర్తి పెరిగింది.

గ్ర్యాజ్యేట్ టీచర్స్‌కు H.S.C. తెలుగు వాచక పరీక్షలో ఆవశ్యంగా ప్యాసు కావాలని ప్రభుత్వ శాసనమేర్పడింది. 'విద్యయావిద్యం' అన్నట్లు శ్రీ సలాం సాహెబు అనే గణితోపాధ్యాయుడు 'నీకు లెక్కలను నేర్పుతాను, నాకు తెలుగు నేర్పండి' అని కోరినాడు. ఆ విధంగానే కృషి చేశాము. హైస్కూలులో మొదట అన్ని సబ్జెక్టులలో H.S.C. పరీక్షలో పాసైన విద్యార్థులను హైదరాబాదు పబ్లిక్ H.S.C. పరీక్షకు పంపేవారు. నాకు 45% మార్కులు వచ్చాయి. నాకు అనుమతి లభించింది. ఫీజు చెల్లించాను. 16 మార్చి 1954 నుంచి రోజు రెండు సబ్జెక్టుల చొప్పున వివేకానంద హైస్కూలు, హైదరాబాదులో పరీక్ష వ్రాయడానికి టైంటేబుల్‌తో పాటు హాల్‌టికెటు నాకు అందింది. 15 మార్చినాడు హైదరాబాదుకు చేరినాను. అక్కడ శ్రీ జి.దేశికాచార్యులు, జి.ఎస్.వరదాచార్యులు ఏర్పరచుకొన్న బడీ చావిడీ గల్లీలో ఉన్న 'మెస్సు'లో నేను చేరడానికి వారు అంగీకరించారు. H.S.C. పరీక్ష వ్రాశాను.

ఆ సమయాన నారాయణపురంలో బ్ర.శ్రీ.బావి కృష్ణశాస్త్రిగారు స్వర్గస్థులయ్యారని హైదరాబాదులో తెలిసింది. నారాయణపురం చేరుకొన్నాను. వారి కుటుంబానికి సంతాపం తెల్పడమయింది. ఆ యేటనే శ్రీ

బి.రామరాజుగారు, జానపద గేయాల తాళపత్రాలను కె.మురళీధరశర్మ, బి.అచ్యుతరాజు సేకరించి పెట్టినందు వల్ల నారాయణపురం వచ్చి తీసుకొని పోయినారని తెలిసింది.

"విద్వానేవ విజానాతి విద్వజ్జన పరిశ్రమం,
నహివంధ్యా విజానాతి గుర్వీ ప్రసవ వేదనమ్"

అన్నట్లు మహానుభావులు తెలుగు సాహిత్యాభివృద్ధికై ఎంతో శ్రమపడుతుంటారు కదా! అని యెద ఆర్ద్రమయింది.

మెదక్కు వచ్చాను. స్కూల్స్ ఆరంభమయినాయి. హెడ్మాస్టర్ శ్రీ సర్దార్ ఖాన్‌గారు 'నేను H.S.C. పరీక్షలో ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణుడనయ్యాను' అని చెప్పినారు. భగవత్కటాక్షంవల్ల కృషి ఫలించిందని సంతోషించాను. 1955 ఫిబ్రవరిలో కూతురు శకుంతల జన్మించింది. నాకు అంతలోనే 54-96 (స్కేల్) వేతనంపై రంగంపేట హెడ్మాస్టర్‌గా ట్రాన్స్‌ఫర్ అయింది. ఆఱు మాసాలు కాగానే తిరిగి మెదక్ హైస్కూలుకు తబాదిలా అయింది. 1957లో ఎఫ్.ఏ. పరీక్షను చాదర్‌ఘాట్ కాలేజిలో వ్రాసి పాసయ్యాను. శ్రీ వి.నరసింహాచారి అన్నగారు మెదకులో, హైదరాబాదు హిందీ ప్రచార సభా పరీక్షలను నడుపుతుంటే నేను సూరత్, కిల్లాపార్డీ స్వాధ్యాయ మండల్ సంచాలితాఖిల భారతీయ సంస్కృత భాషా పరీక్షా సమితి- ప్రవేశిక మొదల్కొని విశారద పరీక్షలను నిర్వహించాను. మిషన్ కాంపౌండులో బ్రిటిషు వారికి ఆఱు మాసాలు (ఆదివారం తప్ప) తెలుగు భాషను బోధించాను. గంటకు రూ.10/-ల చొప్పున వారానికొకసారి నాకు చెల్లించేవారు. 'హిందీ భూషణ్' పాసయిన నేను 'హిందీ విద్వాన్' పరీక్షార్థులకూ పాఠాలను బోధించే అవకాశం కలిగింది.

తమ్ముడు నరసింహాచారి 1956లో H.S.C. పాసై ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్‌గా ఉద్యోగంలో చేరాడు. 1958 ఫిబ్రవరిలో రెండవ కూతురు రమాదేవి జన్మించింది. 1959లో హైస్కూల్, మల్టీపర్పస్ స్కూలుగా పరివర్తనం చెందింది. తమ్ముడు నరసింహాచారి టీచర్స్ ట్రైనింగ్ పాసైనందువల్ల ఆ యేడు సిద్దిపేట డిగ్రీకాలేజిలో పియుసి పరీక్ష వ్రాసి ఉత్తీర్ణుడయ్యాడు. నేను 12వ తరగతి ఎఫ్ సెక్షన్‌కు క్లాసు టీచర్‌గా ఉన్నాను. మూడవ తమ్ముడు టి.శ్రీనివాసాచారి 12వ తరగతి (మల్టీపర్పస్) పరీక్ష వ్రాసి, ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. ఆ తర్వాత ఇంజనీరింగ్ కాలేజి (ఓ.యు)లో అడ్మిషన్ లభించింది. కాని మూడు మాసాల తర్వాత అడ్మిషన్ ఫార్మును పరిశీలించిన ఇం. కాలేజివారు '21 సం.లు దాటి, మూడు రోజులే ఎక్కువగా' నున్నందువల్ల నిరాకరించారు. లేకుంటే ఆ తమ్ముడు ఇంజనీర్ అయ్యేవాడు. నేను పోయి ప్రిన్సిపాల్ శ్రీ రంగాచారిని అడిగితే మూడు రోజుల వయస్సు అధికంగా ఉందని చెప్పి నేనిచ్చిన బాండు కట్టిన ఫీజు నాకు వాపసు ఇచ్చారు. ఇక అందరం విద్యాశాఖలోనే ఉద్యోగులమయ్యాము. అన్నదమ్ములము ముగ్గురము 1960-61లో B.A. - 3y Dc. (O.U.లో) వ్రాసి ఉత్తీర్ణులయ్యాము. మిత్రుడు టి.వి.నరసింహులు పరీక్షను హైదరాబాదులో తన గృహమందే మాకు వసతి కల్పించి ఆదరించిన పద్ధతి జీవితంలో మరపురానిది. 1962లో నేను ఎం.ఏ. మొదటి సం॥ ద్వితీయానుజుడు పొలిటికల్ సైన్సు M.A.,తృతీయానుజుడు తెలుగు M.A.మొదటి సం॥ పరీక్షను వ్రాసి ఉత్తీర్ణుల మయ్యాము. 1962 సెప్టెంబర్‌లో మా తండ్రిగారు

పరమపదించారు. శోక పరితప్తులమైనందున, ఆ సంవత్సరం ఉద్యోగం తప్ప, మరేమి చేయ తోచలేదు. ఎం.ఏ.మొ.సం॥ పరీక్షను మాతోపాటు బ్ర.శ్రీ.దోర్భల విశ్వనాథశర్మగారు, శ్రీ రవ్వా శ్రీహరిగారు, శ్రీమాన్ మరింగంటి శ్రీరంగాచార్యస్వామి కూడా వ్రాశారు.

1963 మేలో నా ద్వితీయ పుత్రుడు మనోహరాచారి జన్మించాడు. చివరి తమ్ముడు టి.వెంకటరమణాచారి 12 మల్టీపర్పస్ పరీక్షలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడైనందున తమ్ముల సహాయంతో ఉస్మానియా మెడికల్ కాలేజిలో చేర్పించడమైంది. 'రాగ్రాజ్యేట్స్'కు ప్రామోషనీయడం రద్దు అయినందువల్ల నేను 1964లో వరంగల్ బి.ఎడ్ ట్రేనింగ్ కాలేజిలో చేరి మొట్టమొదట స్టూడెంటు అనుభవాన్ని పొందాను. హైదరాబాదులో తమ్ముడు టి. నరసింహాచారి బి.ఎడ్ ట్రేనింగును ఆఱునెలల్లో పూర్తి చేసుకొన్నాడు. 1965లో నేను బి.ఎడ్ ట్రేనింగ్ పాసైనందువల్ల M.P.H. మెదకులోనే ప్రామోషన్ లభించింది. రెండవ చెల్లెలుకు శ్రీనివాసమ్మకు పెండ్లి చేసిన అప్పును తీర్చుకొన్నాము. తమ్ముడు టి.శ్రీనివాసాచార్యులు యం.ఏ. తెలుగు డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణుడై, ఖమ్మం డిగ్రీ కాలేజిలో ట్యూటర్‌గా చేరాడు. 1966 ఫిబ్రవరిలో నా మూడవ కూతురు సువర్ణ పుట్టింది. నా పెద్ద తమ్ముడు పార్థసారథి తెలుగు డిప్, ఓ.ఎల్ పాసై కౌడిపల్లి హైస్కూల్‌లో పండిట్‌గా ఉద్యోగి అయ్యాడు. నా పుత్రుడు M.P.H. పరీక్షలో ఉత్తముడుగా ఉత్తీర్ణుడయ్యాడు. జులై 1966లోను కొడుకు వెంకటరమణ సిద్దిపేట డిగ్రీ కాలేజిలో (B.Sc.)అడ్మిట్ చేశాను. జె.బి.హైస్కూల్ సిద్దిపేటకు నేను తబాదిలా చేయించుకొని వచ్చాను.

సిద్దిపేటలో పండిత సభలు, కవి సమ్మేళనాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు అధికంగా జరుగుతుండడం వల్ల పురప్రముఖులతో సాన్నిహిత్య మేర్పడింది. విద్వత్కవి శ్రీ వేముగంటి నరసింహాచార్యులు, కళాకోవిదులు, చిత్రకారులు శ్రీ కె.రాజయ్యగారు సుప్రసిద్ధులు. గీతా భవనంలో నిత్యం ఆధ్యాత్మిక ప్రవచనం సాగుతుండేది. సాహిత్య మండలి పక్షాన నెలకు ఒకటి, రెండు సమావేశాలు జరిపి, జనచైతన్యం కల్పింపబడేది. శ్రీ ఎ.రామరాజుగారు, శ్రీ వెంకట్రావుగారు (అడ్వకేట్) సంస్కృత కావ్యాలు అభ్యసించేవారు, ఉ.వే. శ్రీమాన్ ఎలిజర్ల సీతారామానుజాచార్యుల వారి సన్నిధిలో నేను శ్రీ ఎ.రామరాజుగారును ఆఱు మాసాలు ఆళ్వార్ల దివ్య ప్రబంధం, భగవద్విషయాన్ని సేవించాము. శ్రీశ్రీశ్రీ త్రిదండి పెద్ద జీయర్‌స్వామి వారి స్వాధ్యాయ యజ్ఞంలోనూ ఉభయవేదాంత సభలలోనూ పాల్గొనే అవకాశం నాకు లభిస్తుండేది. 1967లో యం.ఏ. సంస్కృతం పూర్తి చేశాను. టి.శ్రీనివాసాచారి (తమ్ముడు) కరీంనగర్ డిగ్రీ కాలేజిలో లెక్చరర్‌గా ఉండి, 'ఉదయరాగం' అనే పుస్తకాన్ని రచించి ఆవిష్కరణ సభ నేర్పరచాడు. ఆ సభలో వేదికపైన డా॥ దివాకర్ల వేంకటావధానిగారు, డా॥ జి.వి.సుబ్రహ్మణ్యంగారు వేంచేసి యున్నారు. పుస్తకావిష్కరణ, పరిచయం అయిన తరువాత తమ్ముణ్ని ఆశీర్వదించాను.

"ఉస్మానియా విశ్వవిద్యాలయ గురుపదవీ భ్రాతతేయస్యధామ్నా" అనీ "శ్రీ వేంకటావధానీతి సుప్రసిద్ధాభి ధానతః వయంత్వాంతు కథం బ్రూమః హృదయాబ్జ దివాకరమ్" అని అవధానిగారిని సుశ్లోకించాను. తిరిగి కారులో సిద్దిపేటకు చేరగానే 'ఆపండి!' అని దిగినాను. శ్రీ సుబ్రహ్మణ్యంగారు 'ఇక్కడ లెక్చరర్‌గా ఉన్నారా? అని అడిగారు. ఆ భాగ్యం లభించలేదు. మా తండ్రిగారు రామశబ్దంతో సంస్కృతాన్ని ఆరంభిస్తే, ఆ భాషలో

యం.ఏ. పట్టం పొందాలనే అభిలాష చేత పూర్తి చేశాను. కాని 49.5% మార్కులు మాత్రమే పొందగలిగాను. కాబట్టి టీచర్‌గానే ఉన్నానండి అన్నాను. 'తెలుగు యం.ఏ. కూడా పూర్తి చేయండి' అని అవధానిగారు చెప్పినారు. "వాచమర్థోనుధావతి" అన్నట్లు, దివ్యమైన దీవెనగా భావించి 'సరె! నమస్కారం' అన్నాను.

1969లో కె.వి.రమణ బిఎసిసి ప్రథమ శ్రేణిలో పాసైనాడు. తెలంగాణ అలజడులు అధికమయ్యాయి. కాకతీయ యూనివర్సిటీలో ఎం.ఎస్సీ కెమిస్ట్రీలో అడ్మిట్ అయ్యాడు. 1971 డిసెంబర్‌లో ఓ.యు. పరీక్షలు జరిగాయి.

ఆ డిసెంబర్‌లోనే ఎం.ఏ. (సెకండ్ ఇయర్) తెలుగు ద్వితీయ శ్రేణిలో పాసయ్యాను. పుత్రిక లిద్దరు ఇంటర్మీడియట్ చదువుతున్నారు. నేను 1972 సెప్టెంబర్ 25న నాడు ఆదిలాబాదు డిగ్రీ కాలేజిలో ట్యూటర్‌గా చేరినాను. అక్కడ శ్రీ పాలకొల్లు రామచంద్రరావుగారు ప్రిన్సిపాలుగా ఉన్నారు. తరువాత శ్రీ జగన్నాథరావు గారు ప్రిన్సిపాలుగా వచ్చారు. శ్రీ ఎన్.సత్యనారాయణ (తోటి లెక్చరర్) ఆదరించి, వసతి కల్పించాడు. బ్ర.శ్రీ. వెంకట నారాయణశర్మగారు పరిచయమయ్యారు. వీరు ఉపనిషదర్థాలను గూర్చి అడిగితే, యథామతి ప్రామాణికంగా వివరిస్తే సంతోషపడేవారు. 'ఉపాసనలు వేర్వేరైనా ఉపాస్యుడొక్కడే' అని వేదాంత వాక్యాలను వినిపిస్తే చాలా తృప్తిపడేవారు. వీరు ఆదిలాబాదులో రిజిస్ట్రారుగా ఉన్నారు. వీరి పుత్రుడే రఘునందన్. వినయం, మృదుహృదయంగల (డిగ్రీ) విద్యార్థి. (ఇప్పుడు ఈయన హైదరాబాదు సెక్రెటేరియట్‌లో ఉద్యోగిగా ఉన్నాడు). డా॥ మధుసూదన్‌రాజుగారు డిస్ట్రిక్ట్ మెడికల్ సూపరింటెండెంటు, ఆధ్యాత్మిక సంపన్నులు. వీరితో సాన్నిహిత్యమేర్పడింది. ప్రతిరాత్రి శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం, పోతన భాగవత పఠనం చేసేవారు. జటిలమైన ప్రశ్నలు వేస్తే, నేను శర్మగారు యథాశక్తి సంశయరహితమైన సమాధానాలను పూర్వగాథలను వివరించి చెప్పేవాళ్ళము. ప్రసిద్ధులైన శ్రీ సదాశివగారు ఉర్దూభాషలో గొప్ప విద్వాంసులు. వారితో కలిసినప్పుడు జోష్, ఎక్బాల్, గాలిబ్ వంటి మహాకవుల గేయ పంక్తులను వినిపించి ఆనంద పరచేవారు.

1973 పరీధావి సంవత్సరం ఉగాది నాకు కలెక్టర్ ఆఫీసు ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరిపారు. తిరుపతి వేంకటకవుల 'శ్రవణానంద' కావ్యంలోని 'వయసువాడట, ఆ మీద వైష్ణవుడట' అని రాగయుక్తంగా బోలెడు పద్యాలు చదివే అవకాశం నాకు లభించింది. శ్రీ రాధాకృష్ణగారి (లెక్చరరు) దర్శకత్వంలో 'కన్యాశుల్కం'లోని ముఖ్యఘట్టాలు ప్రదర్శింపబడినాయి.

ఇంతకాలందాకా ప్రసరించిన ప్రసాదచ్ఛాయలు అడుగంటాయి. విషాదచ్ఛాయలు పరంపరగా వ్యాపించడ మారంభించాయి. నా భార్య ఆరోగ్యం క్షీణించిందని సిద్దిపేట నుంచి ఫోన్ వచ్చింది. డాక్టర్ సలహాతో ఆదిలాబాదుకు తీసుకువచ్చాను. డా॥ మధుసూదన్‌రాజుగారు వలసినంత ఉపచారం చేశారు. కాలేజిలో వార్షిక పరీక్షలు జరుగుతున్నాయి. డాక్టర్‌గారు 'అది బోన్ ట్యూమర్' అని నిర్ణయించారు. 'ఆపరేషన్ అవశ్యంగా చేయించాలి' అని ఉస్మానియా హాస్పిటల్ డా॥ చలపతిరావుగారికి లేఖ వ్రాసి నా చేతికిచ్చాడు. వేసవి సెలవులు కలిసివచ్చాయి. వెంటనే సిద్దిపేట మీదుగా హైదరాబాదుకు ఆమెను తీసుకుపోయాను. 'హౌస్ సర్జన్'గా ఉన్న చిన్న తమ్ముని ఇంట్లో నేను నివసిస్తూ, ఆమెను ఉస్మానియా హాస్పిటల్‌లో చేర్చాను. మే

20వ తేదీన స్పైనల్ కార్డు డి 7-9 ఆపరేషన్ చేసి డా॥ చలపతిరావుగారు ఆమెకు నాలుగు మాసాల ట్రీట్‌మెంటు అవసరమని చెప్పినారు. ఒకనాడు 'ఆపరేషన్ షీట్'ను పట్టుకొని విద్యాశాఖ డైరెక్టర్ ఆఫీసుకు పోయాను. శ్రీ ఆదినారాయణగారికి 'షీట్' చూపించాను. 'హైదరాబాదు ఉస్మానియాలో పత్ని పేషంట్‌గా ఉంది. సిద్దిపేటలో పిల్లలు ఉన్నారు. ఆదిలాబాదులో నేను ఉద్యోగిని కదా! ఎలా నిర్వహించాలో తోచకుండా ఉంది' అని విన్నవించాను. ట్రాన్స్‌ఫర్ కోసం అప్లికేషన్ వ్రాసి ఇచ్చాను. వారు కృపాపూర్ణులై 18 జూన్ నాడు మళ్ళీ ఈ ఆఫీసుకు నన్ను రమ్మని చెప్పినారు. ఆపరేషన్ సంగతి పిల్లలకు తెల్పలేదు. చికిత్స జరుగుతున్నదని మాత్రం పిల్లలనుకొన్నారు. 18 జూన్ నాడు ఆఫీసుకు వెళ్ళేసరికి అక్కడ శ్రీ జగన్నాథరావు ప్రిన్సిపాల్‌గారు కలిశారు. వారు నన్ను డైరెక్టర్ వద్దకు తోడ్కొని పోయి 'మా రాఘవాచార్యులు కష్టంలో ఉన్నారు. ట్రాన్స్‌ఫర్ చేయండి' అన్నారు. ఉండండి అని ఒక గంటలో సిద్దిపేట కాలేజిలో లెక్చరర్‌గా ఆర్డరు తెచ్చి ఇచ్చారు. ప్రిన్సిపాలుగారు నాలుగు తెల్ల కాగితాల మీద సంతకం చేసి ఇచ్చి త్వరగా ఆదిలాబాదుకు పోయి 'ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్' నుంచి 'రిలీవింగ్ ఆర్డర్ తెచ్చుకొండి' అన్నారు. 22 జూన్ నాడు రిలీవింగు ఆర్డరు తీసుకొని 23 జూన్ నాడు సిద్దిపేట కాలేజిలో జాయినింగ్ రిపోర్టు ఇచ్చి, హైదరాబాదుకు చేరుకొన్నాను. 'ఆపదలందు ధైర్యము' అనే పద్యం స్మృతికి వస్తుండేది.

కాలేజి ఆరంభమైన తర్వాత నా తల్లితోపాటు నా పిల్లలను తెచ్చి సిద్దిపేటలో శ్రీ ఎ.రామరాజుగారి (వకీల్) ఇంట్లోనే ఒక భాగమందు నివసింపచేశాను. రామరాజుగారి ఉపకారమూ విస్మరించరానిది. నేను హైదరాబాదు నుంచి ఉదయాన చాందా బస్సులో సిద్దిపేటకు చేరి, కాలేజిలో పని పూర్తికాగానే, సాయం 4 గంటలకు బస్సులో ఉస్మానియా హాస్పిటల్‌కు చేరుతుండడం నిత్య ప్రక్రియ. జయలక్ష్మి అనే సిస్టర్ రోజూ రూ.10లు ఒక ఆడమనిషికి ఇస్తే, ఆమె పేషంట్‌ను ఆదరంగా ఉపచరించే ఏర్పాటు చేసింది. 1973 అక్టోబర్ 17న రాత్రి పుత్రిక శకుంతలకు వివాహం, 18న ఉదయం పుత్రుడు కె.వి.రమణకు పుష్పలతతో పెండ్లి చేయడం, శ్రీ వేంకటేశ్వరస్వామి సన్నిధి (ముప్పిరితోట)లో జరిగింది. కె.వి.రమణ సైఫాబాద్ కాలేజిలో రసాయనశాస్త్ర ఉపాధ్యాయుడుగా చేరాడు. ఉస్మానియా హాస్పిటల్ ప్రక్కన కోల్సావాడలో అద్దె ఇంట్లో నివసిస్తూ, ఉద్యోగ నిర్వహణతోపాటు, హాస్పిటల్‌లో తల్లికి సేవ చేసే బాధ్యతను వహించాడు. శ్రీ సి.రామయ్య లెక్చరర్‌గారి చొరవవల్ల లెక్చరర్లకు హౌజింగ్‌బోర్డు ప్రశాంతనగర్ కాలనీ కేటాయింపబడింది. అందు C.తో క్వార్టర్ నేను తీసుకొన్నాను. అప్పుడు ఆర్ట్స్ & సైన్స్ కాలేజ్, వరంగల్లులో లెక్చరర్‌గా ఉన్నాడు. 1977లో ఏలూరు C.లో C.గా చేరడానికి వెళ్ళాడు. అక్కడి నుంచి 1978లో నారాయణపేటకు ట్రాన్స్‌ఫర్ అయ్యి వచ్చాడు. 1979లో నాకు పౌత్రుడు 'కిరణానంద్' జన్మించాడు. 1981లో నాకు 'డిస్క్‌ప్రొలాప్స్' అయినందువల్ల ఉస్మానియా హాస్పిటల్లో డా॥ పి.రంగాచారి ఆపరేషన్ చేశారు. మూడు మాసాలు అక్కడే క్వార్టర్స్‌లో ఉండగా, నారాయణపేట నుంచి సకుటుంబంగా వచ్చి ఉపచరించాడు.

సిద్దిపేటలో శ్రీ వేంకటేశ్వరదేవాలయ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. సదస్సులో శ్రీవేముగంటి మొదలైన కవులతోపాటు నేనూ కొన్ని పద్యాలను వ్రాసి చదివాను. అందులో నొకటి–

"శ్రీ త్రిదండి యతీంద్రులు స్నిగ్ధ పూర్ణ/ హస్త సరసీరుహముల, సమస్త నూరి
దివ్య వైకుంఠనాథు బ్రతిష్ఠ జేయ/ పరమ పదమయ్యె మోహినీ పురము భువిని"

ఆ సందర్భంలో శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ పెద్దజీయర్‌స్వామి వారి ఆధ్వర్యమున స్వాధ్యాయ జ్ఞాన యజ్ఞమూ జరుపబడింది.

సిద్దిపేట కోటిలింగాలయ ప్రతిష్ఠ జరిగినప్పుడు చదివిన కవితలో–

"మంగళ గౌరిని మనసా/ రంగని పెండ్లాడి, నాట్య రంగము నంద
ర్ధాంగము నిడి, భూతేశుడ/ మాంగల్యము వీడి సర్వమంగళుడయ్యెన్"

"శివుని ధ్యానము జేసి చిచ్ఛక్తితోడ త/ ద్వాహన మగునట్లు వరలె నెవడు?
ధవళాచలేశుని ధ్వజముగా వెలయుచు/ ప్రమథాది గణముల పనిచె నెవడు?
కైలాసమున శివ లీలలం గననేగు/ దశకంఠు నెదిరించి తరిమె నెవడు?
భువిలోన శివభక్తి దివిదాక పెంచుచు/ బసవన్న యనుపేర బరిగె నెవడు?

సర్గస్థితి లయకారియౌ భర్గునాజ్ఞ విశ్వమున పంచి మంచిని పెంచె నెవడు?

'శృంగి' యాతడు కొందఱు 'భృంగి' యనగ, నందికేశ్వర నామ మన్వర్థమయ్యె' ఇలా అవసరమని వ్రాయడమే కాని సాధన చేసిన 'కవిత' కాదని స్పష్టమవుతున్నది కదా! సాహిత్య వికాసమండలి పక్షాన జరిగిన ఒక సభకు మంత్రి శ్రీ వల్లూరి బసవరాజుగారు అధ్యక్షత వహించినప్పుడు, వారిని ఒక పద్యంతో–

"రాజన శశధరుడౌనట/ రాజన యక్షేశుడుర్వరా పతియగునే
రాజన దుశ్చ్యవ నాఖ్యుడె/ రాజన వల్లూరి బసవ రాజే రాజా!" అని ప్రశంసించి,

"న కృష్ణాజలం తర్పతీ మాం ధరిత్రీం/ న గోదావరీ సేతుర ద్యాపి బద్ధః
నిరుద్యోగ వృద్ధి ర్నిధీనాంఖిలత్వం/ అహో! జాగృతిస్తే తెలంగాణ సీమ్నః" అని వినిపించాను.

సిద్దిపేట గీతాభవనంలో గీతాభాష్యం, దేవీ భాగవతం, కోటిలింగాలయంలో శ్రీశ్రీ మదనానంద యతీంద్రుల ప్రేరణతో శ్రీమద్రామాయణం, శ్రీ రాజేశ్వరరావు లెక్చరర్ కోరిక మీద హరివంశ పురాణం, ఇత్యాది ప్రవచనాలను చేసే అవకాశమూ కలిగింది.

1983లో 'యువభారతి' అధ్యక్షులైన బ్ర.శ్రీ.ఇరివెంటి కృష్ణమూర్తిగారి ప్రోత్సాహం చేత వ్రాయబడిన "మాఘకావ్య వైభవం" అనే పుస్తకాన్ని ఆ సంస్థయే ప్రచురించింది. చీరాల, ఒంగోలు, గుంటూరు విద్వత్కవుల నుంచి 'ఆ విధంగా మాఘ కావ్యమంతా పూర్తిగా వ్యాఖ్యానిస్తే బాగుంటుందని నాకు లేఖలు అందినందు వల్ల తర్వాతి రచనలకు ఉత్సాహం కలిగింది. 13–14 శతాబ్దిలో పాండిత్య పాథో నిధులై వెలసిన శ్రీ వేదాంత దేశికుల స్తోత్రకావ్యాలను తెలుగులో ఎవరూ వ్యాఖ్యానించలేదు. వారిని గూర్చి ప్రచారమూ ఇక్కడ ఎక్కువగా లేదు. పూర్వాచార్య సంబంధాభినివేశం చేత దేశికుల రచనలను తెలుగులో వివరించాలనే కుతూహల మేర్పడింది.

1987లో 'గోదాస్తుతి'కి పరిమళ వ్యాఖ్యను రచించి ప్రచురించాను. "1988 (మార్చి 18 శుక్రవారం) ఉగాది పర్వదినాన్ని 'నన్నయ భట్టారక పీఠం' పక్షాన వార్షికోత్సవంగా జరుపుకొంటున్నాము. మీరు పాల్గొనాలన్నదే మా కోరిక" అని తణుకు నుంచి ప్రధానకార్యదర్శి శ్రీ సువర్మగారు ఆహ్వాన పత్రాన్ని పంపించారు.

దేశికులవారు అవతరించింది 'విభవ' నామసంవత్సరమే. నేను పుట్టినది 'విభవ'లోనే. లేఖ కూడా యాదృచ్ఛికంగా వచ్చింది కదా! 'విభవ- నన్నయ భట్టారక పీఠం, తణుకు' అనే అక్షరాలలో ఒక్కొక్క అక్షరాన్ని పద్య పాదాద్యక్షరంగా రచించి, 'పద్యపంచకం' అనే శీర్షికతో పోస్టుద్వారా పంపినాను. అక్కడ 'కవితల పోటీలో' ప్రథమ బహుమతి మీదే అని యం.ఓ. పంపించారు.

"సతాంహివాణీ గుణమేవ భాషతే" అన్నట్లు, శ్రీ సుశర్మగారి వంటి పెద్దల (లేఖలోని) వాగ్విలాస విషయమై "భద్రైషాం లక్ష్మీర్నిహితాధివాచి" అనే శ్రుతి వాక్యార్థం ఎదలో పదిలంగా మెదలింది.

హైదరాబాదు ఆంధ్రసారస్వత పరిషద్భవనంలో శ్రీశ్రీశ్రీత్రిదండి పెద్దజియ్యర్‌స్వామివారు ఉభయ వేదాంత సభలను నిర్వహించారు. అప్పుడు ఉ.వే.శ్రీమాన్ తె.కం.గోపాలాచార్యుల వారి పర్యవేక్షణలో, శ్రీమాన్ శ్రీభాష్యం అప్పలాచార్యులవారి అధ్యక్షతన 'ఒషివిల్‌కాల మెల్లాం' అనే దివ్య ప్రబంధ పాశురాలను గూర్చి ప్రసంగించే భాగ్యం నాకు లభించింది. 'కున్ద మేన్దుం కు శిర్మషైకాత్తవన్", "తిరువేంగడమ్ నంగళ్కు శమంగొళ్ వీడు తరుం తరుం కున్తమే"- ఆ తిరుమలేశుడు అంటే శ్రీ వేంకటేశ్వరస్వామి అనే అర్థమే కాక 'నగాధి రాజు' అనే అర్థమూ ఉంది. ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడు గోవర్ధనగిరిని ఎత్తినాడు.

కలియుగమందు తలమీద శ్రీనివాసభగవానుణ్ని ఎత్తుకొన్న నగాధిరాజమైన వేంకటాచలమే భక్తితో నమస్కరించిన వ్యక్తులకు పాపాలనన్నిటినీ తొలగించి 'సామ్య'మనే మోక్ష ఫలాన్ని ప్రసాదిస్తుంది. ఇది ఆ తిరువాయ్‌మొళి' యొక్క సారార్థమని ప్రసంగించడమయింది. ఆనాడు మహా మహోపాధ్యాయులైన ఉ.వే.శ్రీమాన్ న.చ.రఘునాథాచార్యుల వారి సూచన ప్రకారంగా డాక్టర్ శ్రీ భాష్యం రామాచారిగారు నాకు 'శ్రీ భాష్య'మనే గ్రంథాన్ని సమర్పించారు.

అది మొదలుగా వార్షికంగా నిర్వహింపబడే ఉ.వే.సభలలో పాల్గొనే అవకాశం కలిగింది. 1985, రక్తాక్షి ఫాల్గుణ శుద్ధ విదియనాడు మా తల్లిగారు పరమపదించారు. భగవానుడు నిరంకుశ స్వతంత్రుడు కదా! 1989 జనవరి మాసాంతాన సిద్దిపేట కాలేజి నుంచి రిటైరయిన తర్వాత హైదరాబాదుకు చేరుకొన్నాము. నా ఇద్దఱు కొడుకులు హైదరాబాదులోనే ఉద్యోగం చేస్తున్నారు. వాళ్ళ తల్లికి రెండవసారి ఆపరేషన్ జరుగడం వల్ల నేను ఎక్కువ సమయం ఉస్మానియా హాస్పిటల్ క్వార్టర్‌లోనే గడిపాను. నిత్యానుష్ఠానం, స్వయంపాకం, రేయింబవళ్ళు రచన హాస్పిటల్లోనే సాగేది.

1990లో 'భగవద్విషయం-ఈడు అవతారిక' తమిళానికి అనువాదం మరియు 'భదవద్ధ్యాన సోపానం' అనే స్తోత్రానికి 'మనోరమా వ్యాఖ్య' రెండు పుస్తకాలను రచించాను. శ్రీమాన్ వి.పి.రాఘవాచారిగారు ఛైర్మన్

'అహోబిల మఠమునందు మొట్టమొదట తెలుగులో తిరుప్పావై కాలక్షేపం మీరే చేయాలని' ఆదేశించడం వల్ల 90, 91 ధనుర్మాసాలలో తిరుప్పావై ప్రవచించాను.

1992లో 'శ్రీమద్రామానుజులు- వర్ణాశ్రమధర్మాలు' అనే గ్రంథాన్ని రచించగా, శ్రీమాన్ ధనకుధరం వరదాచార్యులు తమ 'శ్రీరామానుజ కీర్తికౌముది' 12వ భాగమందు గుంటూరులో ప్రచురించారు. "శ్రీ దేశికుల గ్రంథాలకు మీరు వ్యాఖ్యానం వ్రాస్తున్నారని తెలిసింది. ఆ గ్రంథాలను 'శ్రీమాలోల గ్రంథమాల- అహోబిలమఠం, హైదరాబాదు' పక్షాన ప్రచురిస్తా"మని పత్రం వ్రాసి ఇచ్చారు. ఆ విధంగానే, 1996లో 'శ్రీరంగనాథపాదుకా సహస్రం రమణీయాంధ్ర టీకా తాత్పర్య, వ్యాఖ్యాసహితం, మొదటి భాగం మొదలుకొని 2003 వరకు వ్రాసిన 5 ఐదు సంపుటాలను 'అహోబిలమఠం'వారే ప్రచురించారు.

1997లో 'గరుడదండకం'- సుషమా వ్యాఖ్యతో ప్రచురింపబడింది.

1998లో 'ఆళ్వారులు-భక్తి ప్రపత్తి మార్గములు'- 'భక్తినివేదన, స్వర్ణోత్సవ సంచిక'లో ప్రచురితమయింది.

2001లో అమెరికాకు పోయి వచ్చినాను.

2002లో నారాయణ శతకానికి 'రాఘవీయ వ్యాఖ్య'ను శ్రీ చల్లా సాంబిరెడ్డిగారి అభీష్టానుసారం రచించగా శ్రీ పావనీ సేవా సమితి (హైదరాబాదు) ప్రచురించింది. ఆ సంవత్సరమే 'దివ్య ప్రబంధత్రయి (తమిళం), ఆంధ్ర టీకా తాత్పర్య వివరణం' ముద్రితం.

2003లో 'ద్రవిడోపనిషత్తాత్పర్య రత్నావళి'కి ప్రకాశికావ్యాఖ్యను రచించగా కరీంనగరం జూ.కాలేజి ప్రిన్సిపాల్ శ్రీమాన్ చక్రవర్తుల లక్ష్మీనరసింహాచార్యులుగారు ప్రచురించారు.

2004లో 'శ్రీ సుదర్శనాష్టకం- జ్వాలా వ్యాఖ్యానం, 2005లో 'చతుఃశ్లోకీ- దీపికా వ్యాఖ్యా సహితం' (రెండింటినీ) 'అహోబిల మఠం' ప్రచురించింది.

2006లో 'శ్రీ రుక్మిణీ కల్యాణం- వైష్ణవీ వ్యాఖ్య'ను 'శ్రీ పావనసేవా సమితి' ప్రచురించింది. కృష్ణారెడ్డి (అడ్వకేట్)గారు అచ్చు వేయించారు.

2007లో 'యతిరాజ సప్తతి- చంద్రికా వ్యాఖ్య'ను కరీంనగరం శ్రీయుత మాదాడి కృష్ణారెడ్డి (అడ్వకేట్)గారు అచ్చు వేయించారు.

2008లో 'అభీతిస్తవం- సంజీవనీ వ్యాఖ్య' పెద్దపల్లి శ్రీయుత నుంద సునీల్‌రెడ్డిగారిచే ముద్రితం.

2009లో 'శ్రీస్తుతి-హిరణ్మయీ వ్యాఖ్య' కరీంనగరం శ్రీయుత మాదాడి కృష్ణారెడ్డిగారిచే ప్రచురితం.

2010లో 'శ్రీ వేదాంతదేశిక దర్శనం' మా తిర్మల చారిటబుల్ ట్రస్టుచే ప్రచురింపబడింది (వార్షికంగా వేద సంస్కృత పండితులను సన్మానించుకోవడం పరిపాటి).

'శ్రీనివాస దయాశతకం- అమృతాస్వాదినీ వ్యాఖ్యానం' అహోబిలమఠం వారు ప్రచురించారు.

2011లో 'న్యాస వింశతి- శ్రేయసీ వ్యాఖ్య' వరంగల్, ఆచార్య కోవెల సుప్రసన్నాచార్యులవారిచే ప్రచురింపబడుతున్నది.

'యాదవాభ్యుదయ మహాకావ్యం- సుబోధినీ వ్యాఖ్య'; తిరుపతి నివాసులైన శ్రీ ఎన్.వేంకటరమణగారి ప్రేరణ చేత రచన సాగుతున్నది.

రేడియోలో వేదపఠనం, కోలాచల మల్లినాథసూరి ప్రేరణచేత రచన సాగుతున్నది.

వేదాంత దేశికులు, హంస సందేశం, ఋతువర్ణనలు, దూరదర్శన్‌లో శ్రీ పాదుకా సహస్ర వైభవం, నిఘంటువుల ప్రయోజనం ఇత్యాది ప్రసంగాలు సంస్కృతాంధ్ర భాషల్లోనూ (కొంతకాలం వరకు) చేయబడినాయి.

ఇప్పుడు ఐదు సంవత్సరాలనుంచి హైదరాబాదు, అహోబిలమఠం నుంచి వెలువడుతున్న 'శ్రీ నృసింహప్రియ' మాసపత్రికకు సహాయ సంపాదకునిగా ఉన్న, భాగవత విధేయుడను.

బిరుదులు:-

1. విశిష్టాద్వైత వేదాంత విశారద-శ్రీ.రా.కో.గ్రంథమాల, గుంటూరు.
2. శాస్త్ర విద్వన్మణి- వేద విశ్వవిద్యాలయం, తిరుపతి.
3. వాచస్పతి- రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి.

సన్మానాలు:-

1. ఉభయ వేదాంత పండిత సన్మానం. శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ పెద్ద, చిన్న జీయర్ స్వాముల వారి అనుగ్రహం.
2. శ్రీ శివానంద సద్గురు ఎమినెంట్ సిటిజన్ అవార్డు.
3. సంస్కృత పండిత సన్మానం-తెలుగు యూనివర్సిటీ, హైదరాబాదు.
4. ఉగాది పురస్కారం-దిండిగల్, శ్రీ గణపతి సచ్చిదానందస్వామి వారిచే స్వర్ణకంకణం.
5. సంస్కృత విద్వత్సన్మానం- ఆం.ప్ర.ఉగాది పురస్కారం 2007.
6. ఆచార్య వరివస్య- త్రైవర్ణ్య రామానుజకూటం, విజయనగరం 2008.
7. ఉభయ వేదాంత విద్వత్సన్మానం- నర్సాపురం, పశ్చిమగోదావరి జిల్లా.
8. ఉ.వే.విద్వజ్జన పురస్కారం- వరంగల్, మహామహోపాధ్యాయ, కవి శాబ్దిక కేసరి, శాస్త్రరత్నాకర శ్రీ.న.చ. రఘునాథాచార్యస్వామి వారి తిరునక్షత్రోత్సవం 2009.
9. మహా వ్యాఖ్యాతృ పురస్కారం- శ్రీరంగం శ్రీమదాండవన్ ఆశ్రమం, భాగ్యనగరం, 2010.

"మేధాదేవీ సరస్వతీ!", "సారస్వతీరపః" అనే వేద వాక్యాలకు "బ్రహ్మజల ధారణ ప్రశ్చ్యోతనాభ్యాం వేదాః పరాంసి, తన్మయత్వాత్ తద్వతీ సరస్వతీ" అని శంకరభాష్యం. "బ్రహ్మతత్వతపోవేదే" అనే నిఘంటు వచనం వల్ల బ్రహ్మ శబ్దానికి వేదమని అర్థం. వేదశబ్దరాశి జలమని రూపింపబడింది. జలానికి ధరించడం, ప్రవహించడం ధర్మం స్వభావం. వేద వాఙ్మయానికి ఆశ్రయించడం అంతట వ్యాపించడం దాని ధర్మం. రూపంలోనూ, గుణంలోనూ బృహత్వం కలది కాబట్టి అనంతావైవేదాః– అనంతత్వం కలదైనందున 'బ్రహ్మ' అనబడింది. బ్రహ్మమనే జలాన్ని ధరించి, ఆయా అధికారులకు ప్రవహింపజేయడం వల్ల వేదాలు సరస్సులు, సరోమయమవడం వల్ల సరస్సులు కలది 'సరస్వతి' అని నిర్వహింపబడింది.

(వే=వ+ఈ) వ కారం అమృతవాచి. ఈ కారం సంపద్వాచి. వశ్చ ఈశ్చ= వయౌ. వయౌదదాతీతి= వేదః భుక్తి ముక్తులనిచ్చేది వేదం అని అర్థం. "బ్రహ్మణి వేదే నిద్యాః ప్రతిపాదితాః" సకల విద్యలకు మూలం వేదవాణి. వణ్యతే ఇతి= వాణీ వణశబ్దే (ఈ కారంతం స్త్రీ లింగం) నినదించేది (పలుకబడునది) అని అర్థం.

"నకార ప్రాణమిత్యాహుః, దకారమనిలం విదుః" నకారమంటె ప్రాణం, దకారమనగా అగ్ని. ఈ రెండింటి కలయికయే నాదం... గాలివలె సర్వత్ర వ్యాపించి జీవింపజేసేది. అగ్నివలె తేజస్సును కలిగించేది. తాను అంతట వీచుతూ ఇతరులను బ్రతికించేది గాలి. తాను జ్వలిస్తూ ఇతర వస్తువులను ప్రకాశింపజేసేది అగ్ని (వస్తువు యొక్క కిరణాలు కంటిలోకి ప్రసరించి, పరావర్తనం కాగా, ఆ వస్తువును కంటికి కనబడునట్లు చేసేది తేజస్సు). అగ్నికి వాయువుతోడుగా ఉన్నట్లు, జ్యోతీరూపమైన శబ్దం హృదయం నుంచి ఊర్ధ్వగమనంగా ముఖోద్గతమై, నేరుగా ఇతరుల చెవులద్వారా వారి హృదయం (హృత్+ఆయతి)లోకి ప్రవేశిస్తుంది. భౌతిక ద్రవ్యం కంటికి కనబడుతుంది. "శ్రోత్రేణ హితద్వింధతే"– జ్ఞానద్రవ్యం చెవి ద్వారా ఆస్వాదింపబడుతుంది. శ్రుతి పేయమని భావం.

'వాణి' శబ్దానికి నేయుట అనే అర్థముంది. 'వయనం వాణిః'– ఇకారాంతం స్త్రీలింగం, వేఞ తంతుసంతానే' అనే ధాత్వర్థం కలది కాబట్టి, ఇది భౌతిక ద్రవ్యం (అది, యిది ఒకటే అని పొరపడరాదు).

సర్వశ్రుతి మనోహరమైన సరస్వతికి సంబంధించిన మహిమయే సారస్వతం కదా! వాఙ్మయం కంటె సారస్వత పరిధి చిన్నదైనా, పరిశ్రమైక సాధ్యమైన దీని దీధితి గొప్పది. అంతస్సారం కల్గిన సారస్వతం వర్ధిష్ణువులచేత భజనీయమైనది.

అన్వర్థాభిధానులై స్వేచ్ఛతో కల్పించిన 'పరిణతవాణి' కార్యక్రమాలను నిర్వహిస్తూ, నాకు ఈ అవకాశాన్ని సౌమనస్యంతో ప్రసాదించిన, ఆంధ్రసారస్వత పరిషదధ్యక్షులైన శ్రీయుత సి.నారాయణరెడ్డిగారికి, ప్రధాన కార్యదర్శిగా ఉన్న శ్రీ ఎల్లూరి శివారెడ్డిగారికి, నేను వాగుతున్నంత సేపు నిశ్శబ్దంగా ఉన్న రసజ్ఞులైన శ్రోతలకు కృతజ్ఞతతో హార్దాంజలి ఘటిస్తున్నాను.

స్వస్తిశ్రీర్ది శతాత్–

(2011) ఆంధ్రసారస్వత పరిషత్తు ఏర్పాటు చేసిన 'పరిణతవాణి'లోని ప్రసంగ వ్యాసాన్ని ఈ శీర్షికతో చేర్చినాము.

శ్రీమాన్ కె.వి. రాఘవాచార్యుల రచనలు

1. **మాఘకావ్య వైభవమ్** (1983)
2. **గోదాస్తుతి** – పరిమళ వ్యాఖ్య (1987)
3. **భగవద్విషయము** – ఈడు అవతారిక – అనువాదం (1989)
4. **భగవద్ధ్యాన సోపానమ్** – మనోరమా వ్యాఖ్యానమ్ (1990)
5. **శ్రీరంగనాథ పాదుకా సహస్రమ్** – రమణీయాంధ్ర టీకాతాత్పర్య వ్యాఖ్యాన సహితం (5సం. 1996, 98, 99, 01, 04)
6. **గరుడదండకమ్** – సుషమాంధ్ర టీకాతాత్పర్య వ్యాఖ్య (1997)
7. **శ్రీ నారాయణ శతకమ్** – రాఘవీయ వ్యాఖ్య (2002)
8. **దివ్య ప్రబంధత్రయి** – టీకాతాత్పర్య వివరణ సహితము (2002)
9. **ద్రవిడోపనిషత్తాత్పర్య రత్నావళి** – ప్రకాశికా వ్యాఖ్య (2003)
10. **శ్రీ సుదర్శనాష్టకమ్** – జ్వాలా వ్యాఖ్య (2004)
11. **శ్రీ రుక్మిణీ కళ్యాణమ్** – వైష్ణవీ వ్యాఖ్య (2006)
12. **చతుఃశ్లోకి** – దీపికా వ్యాఖ్య (2006)
13. **యతిరాజ సప్తతి** – చంద్రికా వ్యాఖ్య (2007)
14. **అభీతిస్తవమ్** – సంజీవనీ వ్యాఖ్య (2008)
15. **శ్రీస్తుతి** – హిరణ్మయీ వ్యాఖ్య (2008)
16. **దయాశతకము** – అమృతాస్వాదినీ వ్యాఖ్య (2010)
17. **శ్రీన్యాస వింశతిః** – శ్రేయసీ వ్యాఖ్య (2011)
18. **న్యాసదశకమ్** – బుధరంజనీ వ్యాఖ్య (2011)
19. **శ్రీ వరదరాజ పంచాశత్** – సర్వంకషా వ్యాఖ్య (2012)
20. **శ్రీ అచ్యుత శతకము** – జ్యోతిర్మయీ వ్యాఖ్య (2013)
21. **యాదవాభ్యుదయ మహాకావ్యమ్** – సుబోధినీ వ్యాఖ్య (3 సం.2013, 2015, 2016)
22. **శ్రీ విష్ణుపాదాది కేశాంత స్తోత్రమ్** – శ్రీరంజనీ వ్యాఖ్య (2014)
23. **అధికార సంగ్రహం** – అమృతవర్షిణీ వ్యాఖ్య (2014)
24. **శ్రీ గుణరత్న కోశము** – జ్యోతిష్మతీ వ్యాఖ్య (2015)

పత్రికల్లో ఆచార్యులవారిని గూర్చి...

మరో మల్లినాథుడు

శ్రీరంగాచార్య

చరవాణి: 9299 451 266

తెలుగువారికి చాలాకాలం నాడు ఒక మల్లినాథసూరి కాళిదాస కావ్యాలకు గొప్ప వ్యాఖ్యానాలు రాసి సంస్కృత సాహిత్య భిక్ష పెట్టినాడు. అటు తరువాత వేదాంత దేశికులు తమ సంస్కృత పాండితీ ప్రకర్ష చేత అనేక రచనలు చేస్తే అవన్నీ సంస్కృతంలో ఉండి కొందరికే తెలిసే స్థితి ఏర్పడింది. తమిళదేశం వారు వాటిని ఇంగ్లీషులోకి, తమిళంలోకి అనువదించుకున్నారు. తెలుగువారికి దేశిక సాహిత్యం పరిచయం కాకపోవడం అనే లోపాన్ని గ్రహించి కె.వి.రాఘవాచార్యవారు అసిధారావ్రతంగా పాదుకా సహస్రాన్నే కాకుండా దేశికులవారి అనేక రచనలకు గొప్ప వ్యాఖ్యానాలను రచించినారు. మహాప్రబంధమైన యాదవాభ్యుదయాన్ని వ్యాఖ్యానించటం కె.వి.రాఘవాచార్యగారి చిరకాల సముపార్జిత సంస్కృతాంధ్ర తమిళ సాహితీ వైభవానికి తార్కాణం. వీరి రచనల్లో దివ్య ప్రబంధాల శక్తి కూడా చోటు చేసుకోవటం తెలుగువారి అదృష్టం.

ఈ విధంగా మన కాలానికి మళ్లీ మల్లినాథసూరి రాఘవాచార్య రూపంలో అవతరించి అపురూపమైన సాహిత్యాన్ని అందించటం తెలుగు సాహితీ లోకానికి గొప్ప వరం అనటం అతిశయోక్తి కాదు. రాఘవాచార్య సంప్రదాయ విద్యలను గురుముఖతః కాకుండా స్వయంగా ఆనాటి పండితుల కృపవల్ల సాధించారు. ఏకోపాధ్యాయ పాఠశాల అధ్యాపకునిగా జీవితం ఆరంభించి విద్యతోపాటు అంచెలంచెలుగా అనేక పదవులను పొందారు. ఎన్నడూ పరుషమైన పద్ధతికి చోటులేని సాహితీ తపస్విగా పేరుగాంచారు.

ఆయన్ను అనేక సంస్థలు, పీఠాధిపతులు, విశ్వవిద్యాలయాలు సమ్మానించి, ఎన్నో బిరుదులిచ్చాయి. తిరుపతి వేద విశ్వవిద్యాలయం శాస్త్ర విద్మన్మణి, రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం వారు వాచస్పతి, సద్గురు కందుకూరి శివానందమూర్తి సనాతనధర్మ చారిటబుల్ ట్రస్ట్ వారు ఎమినెంట్ సిటిజన్ పురస్కారం, అహోబిల పీఠాధిపతుల వారు మహావ్యాఖ్యాతృ పురస్కారాలనిచ్చి గౌరవించి వారి వ్యాఖ్యాన విద్యావైభవానికి గుర్తింపు తెచ్చిపెట్టారు.

భగవద్ధ్యాన సోపానం, భగవద్విషయం, పాదుకా సహస్రం (5 సంపుటాలు), నారాయణ శతక వ్యాఖ్య, రుక్మిణీ కల్యాణం, సుదర్శనాష్టకం, యతిరాజ సప్తతి, శ్రీస్తుతి, శ్రీనివాస దయాశతకం, న్యాసవింశతి, యాదవాభ్యుదయం వంటి, వారి అనేక రచనలు అద్భుతమైన తెలుగు వ్యాఖ్యానంతో తెలుగువారికి చాలా సులువుగా, తేలికగా, స్పష్టంగా అవగాహన కలిగే విధంగా అందించిన సాహితీ తపస్వి శ్రీమాన్ రాఘవాచార్యులు. జ్ఞానాన్ని అనుసరించి బుద్ధి, మేధ, స్మృతి ఉంటాయని అక్షర రూపంగా నిరూపించిన

విద్వన్మణి ఆయన.

1929లో వేంకటమ్మ, మనోహరాచార్యులకు పెద్ద కుమారునిగా రాఘవాచార్య జన్మించారు. వారికి నలుగురు తమ్ముళ్లు, ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. ఆనాటి ప్రసిద్ధ పండితులైన శేషభట్టర్ శ్రీనివాసాచార్యుల వద్ద అక్షరాభ్యాసం చేశారు. జోగా వెంకటయ్యశర్మ, అచ్చి వెంకటాచార్యులు వేదము, దివ్య ప్రబంధాల మాధుర్యాన్ని చెప్పినవారు. దోర్బల విశ్వనాథశర్మ, తిగుళ్ల వెంకటేశ్వరశర్మ వంటి పండితులు వీరికి సహాధ్యాయులు. రాఘవాచార్య 1950లో ఉద్యోగంలో చేరి 1989లో సిద్దిపేట కళాశాలనుండి పదవీ విరమణ పొందారు.

పాఠశాల నుంచి కళాశాల వరకు వేలకొద్దీ శిష్యులను, అభిమానులను సంపాదించుకున్న విద్యా తపస్వి. వారి జీవితం కఠోర ఆచార నియమాలతో నిరంతరం భగవద్విషయ ప్రవచనంలో, ఉభయ వేదాంత విద్యలలో గడిచింది. నిండు జీవితం గడిపిన రాఘవాచార్యులు మన సాహితీ లోకానికి నిరంతరం వెలిగే ఒక జ్ఞాన భాస్కరుడు. మన జీవితంలో ఎన్నైనా సంపాదించుకోవచ్చు కానీ, ఒక మహాకవిని, ఒక వ్యాఖ్యాతృ శిరోమణిని సంపాదించుకుని, వారి మాటలు విని, రచనలు చదివి ఆనందించగలగటం పూర్వజన్మ సుకృతం. రాఘవాచార్యుల రూపంలో ఆ అదృష్టం మనకు దక్కింది.

ఆంధ్రభూమి దినపత్రిక, 8 ఆగష్టు 2016

నమో నమో రాఘవ దేశికాయ

దేవులపల్లి ప్రభాకరరావు

చరవాణి: 9133 335 055

ఒక మహావృక్షం కూలినప్పుడు దిగ్భ్రాంతి తప్పదు. ఇంతకాలం నీడనిచ్చిన, సారస్వత సుమాలతో అనాఘ్రాత సౌరభాలను నలుదిశలా ప్రసరించిన వటవృక్షం అనేక ఏళ్ల అనంతరం అలసి సొలసి శాశ్వత విశ్రాంతికి ఉపక్రమించినందుకు ఆత్మీయ జనావళికి ఖేదం కలుగడం సహజం. శ్రీమాలోల నృసింహస్వామి కటాక్ష పాత్రులు, వాచస్పతి, ఉభయ వేదాంతాలలో నిష్ణాతులు, ఉత్తమ అధ్యాపకులు, అత్యున్నత ఆచార్యులు, ప్రబోధకులు, వేదాంత దేశికుల విశిష్టాద్వైత ప్రతిపాదక అమూల్య రచనలకు విశిష్ట, విద్వత్ వ్యాఖ్యలను తెలుగు పాఠక లోకానికి, భక్తజన ప్రపంచానికి సమర్పించిన కారంచేటి వేంకట రాఘవాచార్యులు ఇక లేరని చెప్పడానికి మనసు అంగీకరించడం లేదు. 2016 ఆగస్టు 5 రాత్రి హైదరాబాద్‌లో ఇహలోక యాత్ర చాలించి ఆచార్య తిరువడిఘళ్ చేరినప్పటికి, శ్రీ కైవల్యపదం చేరడానికి వారు జరిపిన చింతన, తపస్సు ఫలించినప్పటికి రాఘవాచార్యులు ఆధ్యాత్మిక వాఙ్మయ ప్రపంచంలో చిరస్మరణీయులు. ఇక్కడి భక్తజన కోటి హృదయాల్లో వారి స్థానం సమున్నతమైనది, శాశ్వతమైనది. విశిష్టాద్వైత ప్రవక్త భగవద్రామానుజుల వారి వరుసలో నిరంతర, నిర్విరామ తపస్సుతో వేదాంత దేశికుల ఉద్గ్రంథాలకు సుబోధినీ వ్యాఖ్యలు అందించి, వారి వరుసలో చేరిన రాఘవాచార్యులు తెలంగాణ నేలపై, నారాయణ పురం (కరీంనగర్ జిల్లా)లో జన్మించడం తెలంగాణ తల్లి అదృష్టం. బమ్మెర పోతన, పాల్కురికి సోమన, కంచెర్ల గోపన్న (భక్త రామదాసు)–భక్తి రసపద విన్యాసంతో పులకితమైన తెలంగాణ ప్రాంతంలో ఆధ్యాత్మిక పరంపర ఆగిపోలేదని రాఘవాచార్యులు నిరూపించారు. అనేక సామాజిక, సాంస్కృతిక, సారస్వత ఉద్యమాలకు పుట్టినిల్లు అయిన తెలంగాణలో రాఘవాచార్యులు మహోత్కృష్ట ఆధ్యాత్మిక స్ఫూర్తి, వికాసం కల్గించే మహోద్యమానికి తమ సృజనాత్మక ప్రతిభా సంపదతో మార్గదర్శకత్వం వహించడం విశేషం. సంస్కృత, తమిళ భాషలలోని జటిలమైన, నారికేళ పాకం వంటి ఆధ్యాత్మిక, తాత్త్విక విషయాలను సరళమైన, మధురమైన తెలుగు భాషలో ద్రాక్షాపాకంవలె ప్రవహింపజేసిన ఘనత రాఘవాచార్యులదే.

తెలంగాణ సాహిత్యవేత్తలలో అగ్రగణ్యులు రాఘవాచార్యులు. నారాయణపురంలో 87 ఏళ్ల కిందట 1929 జనవరి 22వ తేదీ (విభవ, పుష్య శుక్ల ద్వాదశి) న జన్మించారు. వారి తల్లిదండ్రులు తిరుమల వేంకటమ్మ, తిరుమల మనోహరాచార్యులు. విశిష్టాద్వైత శ్రీ వైష్ణవ కుటుంబం. రాఘవాచార్యుల ధర్మపత్ని పద్మావతి. కె.వి.రమణాచార్యుల తండ్రి వీరు అని అనడం కంటే మహనీయుడు రాఘవాచార్యుల కుమారుడు రమణాచార్యులు అని అనడంలో ఔచిత్యం ఉంటుంది. సంస్కృతంలో, తెలుగులో ఎం.ఏ. డిగ్రీలు పొంది, బి.ఎడ్ డిగ్రీ కూడా పొందిన రాఘవాచార్యులు మొదట అధ్యాపకవృత్తికి అంకితమై, అసంఖ్యాకులైన విద్యార్థులకు తెలుగు భాష ప్రాశస్త్యాన్ని, ఔచిత్యాన్ని తెలియజెప్పినారు. తండ్రి వద్ద తమిళ దివ్య ప్రబంధాలను, నమిలకొండ

శ్రీరంగాచార్య, బ్ర.శ్రీ బావికృష్ణశాస్త్రి, బ్ర.శ్రీ జోగా వెంకన్న శర్మ శుశ్రూషలో సంస్కృత సాహిత్యాన్ని రాఘవాచార్యులు అధ్యయనం చేశారు. రాఘవాచార్యులకు భగవత్ విషయ బోధకులు ఉ.వే.శ్రీమాన్ కండ్లకుంట సీతారామాచార్యస్వామి. ఆధ్యాత్మిక రచనా ప్రక్రియలో ప్రోత్సహించినది కారంచేటి తిరుమల వెంకట నరసింహాచార్యులు. అధ్యాపక వృత్తి నుంచి విరమించిన తరువాత రాఘవాచార్యులు విశ్రాంతి తీసుకోలేదు. వారి క్రియాశీలత హెచ్చింది. విశ్రాంత జీవితం విశ్రాంతి పొందడానికి గాక మాతృభాష తెలుగులో సంస్కృతంలోని ఆధ్యాత్మిక, పురాణ వాఙ్మయాన్ని, వేదాంత దేశికుల వారి ఆధ్యాత్మిక గ్రంథ రతనాలను తాత్పర్యాలు, అమూల్య వ్యాఖ్యలతో అందించడానికి అంకితమైంది. ఆ తపస్సు నడుమ ఎక్కడ నిలువకుండా చివరి శ్వాస వరకు కొనసాగింది. వేదాంత దేశికుల వాగమృతాన్ని ఆస్వాదించి, ఉజ్జీవించి, తరించడానికి రాఘవాచార్యులు తెలుగు పాఠకులకు, ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు మహదవకాశం కలిగించారు. తెలుగు భాషలో ఆధ్యాత్మిక భావాలు ప్రాచుర్యం పొందడానికి, ఆధ్యాత్మిక వాఙ్మయ విస్తరణ, పరిపుష్టికి రాఘవాచార్యులు కావించిన మహోపకారం ఇది. భగవద్రామానుజుల అనంతరం రామానుజుల దర్శనాన్ని సామాన్యులకు సులభంగా అర్థమయ్యే రీతిగా తమిళ, ప్రాకృత భాషల్లో ప్రతిష్ఠించిన వేదాంత దేశికులు తిరుమల వేంకటేశ్వరస్వామి ఘంటావతారంగా ప్రసిద్ధిపొందారు. అఖండ మేధాశక్తితో, ఉభయ వేదాంత జ్ఞాన వైదుష్యంతో, తర్క మీమాంస శాస్త్రాల కూలంకష ప్రావీణ్యంతో 'కవి తార్కిక సింహ'గా, 'సర్వతంత్ర స్వతంత్రుడు'గా పేరొంది 130 గ్రంథాలను సంస్కృతం, ప్రాకృతం, తమిళం భాషలలో, మణి ప్రవాళంలో రచించి శ్రీ వైష్ణవ విశిష్టాద్వైత తత్త్వజ్ఞానాన్ని పండితులకు, పామరులకు ప్రబోధించారు. శ్రీరంగ దేవాలయం తురుష్కుల ముట్టడి నుంచి విముక్తం కావడంలో, ఉత్సవమూర్తిని పునఃప్రతిష్ఠించడంలో, ఆలయంలో అర్చనాది కార్యక్రమాలను క్రమబద్ధం చేయడంలో దేశికుల పాత్ర చిరస్మరణీయమై రామానుజ దర్శనం అనంతర కాలంలో దేశిక దర్శనంగా గౌరవం పొందింది.

వేదాంత దేశికుల ఆధ్యాత్మిక అమూల్య గ్రంథాలను కొన్నిటిని ప్రతిపదార్థ తాత్పర్యాలతో, సముచిత వ్యాఖ్యలతో రాఘవాచార్యులు తెలుగు భాషలోకి అనువదించి సుసంపన్నం కావించారు. తెలుగు భాషలో ఆధ్యాత్మిక వాఙ్మయ వికాసం కోసం అహర్నిశలు రాఘవాచార్యులు చేసిన సేవలు గణనీయమైనవి. '...నిగమాంత దేశికుల గ్రంథాలకు ఒక ప్రహతమైన వ్యాఖ్యాన మార్గాన్ని వేసుకొని ముందుకు సాగుతున్న వీరి లేఖినికి వార్ధక్యం అడ్డుకాదు. అది నిత్య యౌవనోత్సాహంతో ముందుకు సాగటం చాలా ఆనందం కలిగిస్తున్నది. కృష్ణ కథాస్వాదనంకదా మర్త్యులకు అమర్త్యతను సాధించేది? అటువంటి కథను వినూత్న కవితాశిల్పంతో లోకానికి మహాకవులకు దీటుగా అందించిన శ్రీమద్దేశికులు కవితార్కిక సింహులే. ఆ సింహాన్ని మీ వ్యాఖ్యాకర స్పర్శచే ముద్దుగా దువ్వి స్వాధీనపరచుకున్న మీరు ధన్యజీవులే ననటం సత్యం...' ఇవి శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారు తమ మంగళా శాసనాలలో రాఘవాచార్యుల వ్యాఖ్యాన ప్రతిభను, నైపుణ్యాన్ని ప్రస్తుతించిన మాటలు. రాఘవాచార్యులు తమ 84వ ఏట వేదాంత దేశికుల యాదవాభ్యుదయ మహాకావ్యానికి సుబోధినీ వ్యాఖ్యను రచించారు. 24 సర్గల మహాకావ్యం (2630 శ్లోకాలు) యాదవాభ్యుదయం. రాఘవాచార్యులు 13సర్గలకు వ్యాఖ్య రాసి ప్రథమ, ద్వితీయ, తృతీయ భాగాలను ప్రచురించగలిగారు. వేదాంత దేశికుల 'పాదుకా సహస్ర స్తుతి' మరో మహా గ్రంథం.

ఈ గ్రంథానికి రచించిన తెలుగు వ్యాఖ్య ఒక బృహత్కార్యం. అది ఐదు సంపుటాల ఉద్గ్రంథం. యాదవాభ్యుదయ సుబోధినీ వ్యాఖ్య రచనను రాఘవాచార్యులు నాలుగేళ్ల కిందట ప్రారంభించడానికి ముందు న్యాసవింశతి, దయాశతకం, వరదరాజ పంచాశత్, అచ్యుత శతకం గ్రంథాలకు తెలుగు వ్యాఖ్యలు ప్రసాదించారు. విద్యారణ్యస్వామి సమకాలికులైన వేదాంత దేశికులు విద్యానగర చక్రవర్తి సన్మానాన్ని తృణీకరించి వైరాగ్య పంచక శ్లోకాలను రచించిన మహా తపస్వి. శతాధిక గ్రంథాలు రచించిన వేదాంత దేశికుల యాదవాభ్యుదయం, సంకల్ప సూర్యోదయం, సుభాషిత నీతి, పాదుకా సహస్రం, హంస సందేశం పంచకావ్యాలుగా ప్రశస్తి పొందాయి. యాదవాభ్యుదయ కావ్యాన్ని కావ్యరత్నంగా పరిగణిస్తున్నారు. వేదాంత దేశికులకు తెలుగు పాఠక లోకం హృదయంలో పవిత్ర స్థానం కల్పించి రాఘవాచార్యులు ధన్యులైనారు. ఆళ్వారుల దివ్య ప్రబంధ పాశురాలను సంవాద రూపంగా ప్రమాణీకరించారు.

పండిత రత్న, వాచస్పతి రాఘవాచార్యులు తెలుగు భాషలో సృష్టించిన ఆధ్యాత్మిక కావ్య ప్రపంచం కమనీయమైనది. 30కి మించిన అనర్ఘ కావ్య రతనాలు సుబోధక, మనోజ్ఞ వ్యాఖ్యలతో వారి లేఖిని నుంచి వెలువడ్డాయి. మాఘ కావ్యవైభవం మొదలుకొని యాదవాభ్యుదయ మహాకావ్యమ్ వరకు అన్నీ అమృత భాండాలే. తెలుగు భాషను సుసంపన్నం కావించిన అమృత నిధులివి. శ్రీ నారాయణ శతకం (రాఘవీయ వ్యాఖ్య), శ్రీ రుక్మిణీ కళ్యాణం (వైష్ణవీ వ్యాఖ్య) మధుర, మనోహర వ్యాఖ్యలు మూలం అందాలకు కొత్త సొబగులను సంతరింప చేస్తున్నాయి. వ్యాఖ్యాన రచనా ధురీణులు రాఘవాచార్యులు. రుక్మిణీ కళ్యాణ వైష్ణవీ వ్యాఖ్యలో 'వల్లకీ గుణ వినోదం' చేయకుండా ప్రాణవిభుని కోసం పరితపించిన, నిరీక్షించిన రుక్మిణి మనోహర దృశ్యం మరువలేనిది. వేదాంత దేశికుల ద్రవిడోపనిషత్తాత్పర్య రత్నావళికి ప్రకాశికా వ్యాఖ్య, యాదవాభ్యుదయానికి సుబోధినీ వ్యాఖ్య, అభీతి స్తవానికి సంజీవనీ వ్యాఖ్య, వరదరాజ పంచాశత్‌కు సర్వంకషా వ్యాఖ్య, యతిరాజ సప్తతికి చంద్రికా వ్యాఖ్య, శ్రీ పరాశర భట్టరువారి శ్రీ గుణరత్నకోశానికి జ్యోతిష్మతీ వ్యాఖ్య, గోదాస్తుతికి పరిమళ వ్యాఖ్య, శ్రీ నారాయణ శతకానికి రాఘవీయ వ్యాఖ్య, శ్రీ సుదర్శనాష్టకానికి జ్వాలా వ్యాఖ్య, శ్రీ రుక్మిణీ కళ్యాణానికి వైష్ణవీ వ్యాఖ్య, కాంతాచతుఃశ్లోకికి దీపికా వ్యాఖ్య, శ్రీ స్తుతికి హిరణ్మయీ వ్యాఖ్య, దయా శతకానికి అమృతాస్వాదినీ వ్యాఖ్య, న్యాస వింశతికి శ్రేయసి వ్యాఖ్య, న్యాస దశకానికి బుధరంజనీ వ్యాఖ్య రాఘవాచార్యుల బహుముఖ వైదుష్యానికి ప్రతీకలు. మస్తిష్కానికి పదును పెట్టే, మనసును రంజింపజేసే, విజ్ఞానజ్యోతులను వెలిగించే సమ్మోహన వ్యాఖ్యల సార్వభౌములు రాఘవాచార్యులకు ఇదే అక్షర శ్రద్ధాంజలి.

నమస్తే తెలంగాణ దినపత్రిక, 13 ఆగస్టు 2016

వేదాంత దేశికుల కావ్యాల దీపశిఖ

సిహెచ్. లక్ష్మణచక్రవర్తి

ఉభయ వేదాంత ప్రవక్త శ్రీమాన్ కె.వి.రాఘవాచార్య (తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కె.వి.రమణా చార్యుల తండ్రిగారు) శుక్రవారం రాత్రి కన్నుమూయడం విశిష్టాద్వైత ప్రపంచానికి తీరనిలోటు. ఆయన కరీంనగర్ జిల్లా సిరిసిల్ల తాలూకా నారాయణపురంలో కారంచేటి తిరుమల మనోహరాచార్య, వేంకటమ్మ దంపతులకు 22 జనవరి 1929లో జన్మించారు. చదువు అంటే ఇదే అని తెలియని రోజుల నుండి వారి విద్యావ్యాసంగం ప్రారంభమైంది. ఇంట్లో తండ్రి దగ్గర ద్రావిడ దివ్య ప్రబంధాన్ని నేర్చుకుని, ఆరుమైళ్ళ దూరంలోని ఆవునూరిలో అచ్చి నరసింహాచార్య సమక్షంలో అనుసంధానం చేసి, ఆయన మెప్పు పొందడం ఎనిమిదేళ్ళ గొప్ప అనుభూతిగా భావిస్తారు రాఘవాచార్యులు. వేణుగోపాల ఆలయంలో 5 సంవత్సరాలున్నా పంచకావ్యాలూ పూర్తి కాలేదు. ముందు చెప్పింది వస్తేనే తర్వాతది చెప్పేవారు. అక్కడ దోర్బల విశ్వనాథశర్మ, తిగుళ్ళ వేంకటేశ్వరశర్మ, రాచెర్ల వెంకటేశ్వర్లు, గుమ్లాపురం శ్రీనివాసాచార్యులు సహాధ్యాయులు. చదువులకు 'సర్టిఫికెట్' అవసరం అనుకుంటున్న రోజులతో పాటు కరువు కూడా వచ్చింది. మిగతా వారు పై ప్రాంతాల్లో పిల్లలను వారాలకు కొందరి ఇండ్లలో ఏర్పాటుచేశారు. రాఘవాచార్యుల వారికీ వెళ్ళాలని ఉన్నా తండ్రి ఊరు దాటనీయలేదు. ఈ సమయంలోనే సురవరం ప్రతాపరెడ్డి ఆ ఊరికి రావడంతో అక్కడ చిన్న సమావేశం జరిగింది. తన గురువుల పద్యాలు గోలకొండ కవుల సంచికలో పడడం చూసి తానూ కవిత్వ విద్యలోకి అడుగుపెట్టారు రాఘవాచార్య . 'కవి యశస్సు చాలా పెద్దది, గొప్పది. అది నిర్వహించగలగాలంటే శాస్త్రజ్ఞానం అవసరం' అని తండ్రి హెచ్చరించడంతో ద్రావిడ వేదం, సంస్కృతం నుండి నాటక ఛందో లంకార శాస్త్ర సాహిత్యంవైపు మరలారు రాఘవాచార్యులు.

జమ్మికుంట మండలం వావిలాలలో పద్మావతిగారితో కె.వి.రాఘవాచార్య వివాహం జరిగింది. ఆ కాలంలోనే శ్రీమహావిష్ణు యాగానికి తన తండ్రితో హైదరాబాదు వచ్చి ఋత్విక్కుగా పాల్గొన్నారు. రాష్ట్రమంతా రజాకార్ల దౌర్జన్యంతో ఉన్నప్పుడు మా గ్రామం భగవత్ సేవలో ఉండి 'నారాయణపురం' అనిపించుకుందంటారు కె.వి.రాఘవాచార్య. 17 సెప్టెంబర్ 1948న సర్దార్ పటేల్‌కు నిజాం ప్రభువు లొంగిపోయాడన్న వార్త రేడియోలో విని సంబరాలు చేశారు. అప్పటికి ఆయన వయసు సరిగ్గా రెండు పదులు. ఉత్సవాలను, వైదిక కార్యక్రమాలను నిర్వహిస్తూ జీవితం గడిపేవారు. ఆ కాలంలోనే ఆంధ్రసారస్వత పరిషత్ వారి పరీక్షలను నేరెళ్ళ వేంకటాచార్యులు నిర్వహించేవారు. ఇది వ్రాస్తే చిన్న ఉద్యోగం పొందవచ్చున్న ఆశతో సారస్వత పరిషత్తుకు రాఘవాచార్యులు వచ్చారు. అక్కడున్న ఇద్దరు ఒక పద్యం చెప్పి ఆచార్యులవారిని అర్థం చెప్పమని అడిగి ప్రవేశ పరీక్షకు అనుమతిచ్చారు. వారు పులిజాల హన్మంతరావు, దేవులపల్లి రామానుజరావు. సిరిసిల్లకు మకాం మార్చి ప్రవేశపరీక్షకు చదివేవారికి చదువు చెబుతూ తానూ చదువుకున్నారు రాఘవాచార్యులు. పరిషత్తు వారి పరీక్ష ప్యాసై, 1950లో ఉర్దూభాషలో ఉద్యోగ ఆర్డర్ అందుకున్నారు ఆచార్యులవారు. 25

రూపాయల జీతంతో మాసాయిపేటలో ఉద్యోగంలో చేరారు. అనంతరం 'హఫ్తుమ్' మిడిల్ పరీక్షలో ప్యాసై 1951లో 'చక్ర్యాల' (సంగారెడ్డి దగ్గరలో) ఏకోపాధ్యాయ పాఠశాలలో చేరారు. అక్కడ ఉండగానే హెచ్ఎస్సీ తప్పనిసరి అన్న నియమం రావడంతో దానికోసం శ్రమించి పాసయ్యారు. వేతనం పెరిగి మెదక్ స్కూల్లో చేరారు. 1966లో సిద్దిపేటకు బదిలీ కావడంతో పండిత సభలు, కవి సమ్మేళనాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలలో ఎక్కువగా తిరిగేవారు రాఘవాచార్యులు. వేముగంటి, కాపు రాజయ్య, ఎ.రామరాజు, వెంకట్రావు వంటివారితో సాహిత్య సాంస్కృతిక చైతన్య కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 1967లో ఎమ్.ఏ. సంస్కృతం, దివాకర్లవారి సలహా మేరకు 1971లో ఎం.ఏ. తెలుగు పూర్తి చేశారు. 1972లో ఆదిలాబాద్ డిగ్రీ కాలేజీలో ట్యూటర్గా చేరినా, భార్యకు అనారోగ్యంవల్ల మళ్ళీ సిద్దిపేటకు ట్రాన్స్ఫర్ చేయించుకున్నారు. సిద్దిపేటలో ఉండగానే ఇతిహాస, పురాణ ప్రవచనాలు చేస్తూండేవారు. 1983లో యువభారతివారి విజ్ఞప్తిపై మాఘకావ్యవైభవంపై చేసిన ప్రసంగం పుస్తకంగా వచ్చింది. దానికి వచ్చిన పేరుతో వ్యాఖ్యానాలు చేయాలని నిర్ణయించుకున్నారు రాఘవాచార్య.

13, 14 శతాబ్దాలకు చెందిన వేదాంత దేశికుల రచనలను వెలుగులోకి తేవాలని భావించి ఆయన స్తోత్ర వాఙ్మయాన్ని వ్యాఖ్యానించడం మొదలు పెట్టారు. 1987లో 'గోదాస్తుతి' అన్న స్తోత్రానికి పరిమళ వ్యాఖ్యను రచించారు. హైదరాబాదు సారస్వత పరిషత్తులో ఉభయవేదాంత సభలను శ్రీశ్రీశ్రీ త్రిదండి పెద్దజీయర్ స్వామివారు నిర్వహించినప్పుడు, తిరువాయ్మొళిలోని ఒక దశకంపై చేసిన ప్రసంగంతో ప్రతిసంవత్సరం జరిగే ఉభయ వేదాంత సభలలో ప్రసంగావకాశం లభించింది. 1989 జనవరిన సిద్దిపేట కాలేజీ నుండి రిటైరయ్యాక ఇద్దరు కొడుకుల ఉద్యోగాలు హైదరాబాదే కావడంతో నగరానికి చేరారు. 1990లో భగవద్విషయం ఈడు అవతారిక అన్న తమిళ రచనానువాదం, భగవద్ధ్యాన సోపానం అన్న స్తోత్రానికి మనోరమా వ్యాఖ్యా రచించారు. ధనకుదరం వరదాచార్యులవారు ప్రచురించిన 16 సంపుటాల శ్రీరామానుజ కీర్తికౌముదిలో రాఘవాచార్యులవారు రాసిన శ్రీమద్రామానుజుల వర్ణాశ్రమ ధర్మాలు అన్న పుస్తకం 12వ భాగంలో ప్రచురితమైంది.

వేదాంత దేశికుల పాదుకా సహస్ర వ్యాఖ్య కె.వి.రాఘవాచార్యుల వ్యాఖ్యానాలలో జీవిత సాఫల్య రచనగా చెప్పదగినది. పాదుకా సహస్రం 'పాదుకలను' అంశంగా తీసుకుని వెయ్యి భావాలు చెప్పడం ఈ రచన విశిష్టత. వేదాంత దేశికుల వంటి ప్రౌఢకవి, విశిష్టాద్వైత రహస్య తత్త్వవేత్త వ్రాసిన మొత్తాన్ని వ్యాఖ్యానంలోకి తీసుకురావడంలో రాఘవాచార్యులవారు చేసిన కృషి ఎనలేనిది. హైదరాబాదులోని అహోబిల మఠం మాలోల గ్రంథమాల వారు దీనిని ప్రచురించారు. వరదరాజ పంచాశత్, గరుడ దండకం, సుదర్శనాష్టకం, చతుఃశ్లోకీ, యతిరాజ సప్తతి, అభీతిస్తవం, శ్రీస్తుతి, దయాశతకం, న్యాస వింశతి, అచ్యుత శతకమ్ వంటి రచనలను తెలుగు వ్యాఖ్యానాల ద్వారా అందులోని రహస్యాలను సాధారణ జనాలకు అర్థమయ్యే రీతిలో వెలువరించారు రాఘవాచార్యులవారు. శంకరాచార్యుల శ్రీవిష్ణు పాదాదికేశాంత స్తోత్రానికి వ్యాఖ్యానాన్నందించారు. దివ్యప్రబంధత్రయి పేరుతో ఆళ్వారుల ప్రబంధాల్లో మూడింటికి తెలుగు వివరణ, ద్రవిడోపషత్తాత్పర్య రత్నావళి రచనకు వ్యాఖ్యానాలు రచించారు. ఆళ్వారులు ప్రదర్శించిన భక్తి ప్రపత్తి

మార్గాల విశ్లేషణ చేశారు. పోతన భాగవతంలోని రుక్మిణీ కళ్యాణం, నారాయణ శతకాలకు వైష్ణవీ, రాఘవీయ పేరుతో వ్యాఖ్యానాలు రచించి పోతన పద్య రచనా హృదయాన్ని ఆవిష్కరించారు. అలాగే, యాదవాభ్యుదయం అన్న 24 సర్గల మహాకావ్యానికి వ్యాఖ్యానం రచించడంలో ప్రస్తుతం నిమగ్నమై ఉన్న రాఘవాచార్యులవారు 13 సర్గలకు వ్యాఖ్య రచించి, మూడు భాగాలుగా వెలువరించారు. ఇది మరో జీవిత సాఫల్య రచనగా చెప్పదగినది.

రాఘవాచార్యుల వారిని ఎన్నో బిరుదులు సన్మానాలు వరించాయి. విశిష్టాద్వైత వేదాంత విశారద, పండితరత్న, సర్వశాస్త్ర మార్తాండ, శాస్త్రవిద్వన్మణి, వాచస్పతి మున్నగు బిరుదులందుకున్నారు. తెలుగు విశ్వవిద్యాలయ పండిత పురస్కారం, శివానంద సద్గురు ఎమినెంట్ అవార్డు, ఉభయ వేదాంత విద్వత్సమ్మానం, రఘునాథాచార్యుల వారిచ్చే ఉభయ వేదాంత పురస్కారం, ఉగాది పురస్కారం వంటి వాటితో బాటు పెద్ద జీయర్, చిన్నజీయర్ స్వామివార్ల నుండి పురస్కారాలు పొందారు. తన సోదరులు, పుత్రులతో కలసి తిరుమల చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం పండిత సన్మానాలను చేస్తూ తాను సంస్కృత వాఙ్మయ సేవ చేస్తూ, చేస్తున్న వారిని ప్రోత్సహిస్తూ జీవితాన్ని పరిపూర్ణం చేసుకున్నారు.

ఆంధ్రజ్యోతి దినపత్రిక, 7 ఆగష్టు 2016

విద్వత్ సంప్రదాయానికి ప్రతీక

డాక్టర్ గుమ్మన్నగారి బాల శ్రీనివాసమూర్తి

తెలంగాణ ప్రాంతంలోని ప్రసిద్ధ సంస్కృతాంధ్ర పండితుల్లో కె.వి.రాఘవాచార్య ఒకరు. ఆయన కన్ను మూయడంతో తెలంగాణ ప్రాంతం ఒక విలక్షణ విద్వాంసుడిని కోల్పోయింది. కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, కేశవపంతుల నరసింహశాస్త్రి, శిరిశిన హళ్ కృష్ణమాచార్యులు వంటి నిన్నటితరం తెలంగాణ విద్వాంసుల కోవలోని వారు రాఘవాచార్యులవారు. స్వయంకృషితో ఎదిగిన మనీషి, నిరాడంబరులు, మానవానుబంధాలకు ప్రాధాన్యం ఇచ్చిన సుమనస్వి.

కరీంనగర్ జిల్లాలోని పూర్వపు సిరిసిల్ల తాలూకా ప్రాంతం ఎంతోమంది ప్రతిభావంతులకు జన్మనిచ్చింది. ఈ ప్రాంతంలోని నారాయణపురంలో రాఘవాచార్య 1929 జనవరి 22వ తేదీన జన్మించినారు. ఆచార్యులవారి తల్లిదండ్రులు తిరుమల మనోహరాచార్యులు, వేంకటమ్మ. తండ్రి ద్వారా ద్రవిడ దివ్య ప్రబంధ మధురిమలు పరిచయమయ్యాయి. సంస్కృత కావ్య సాహిత్యాన్ని అధ్యయనం చేయాలనే కోరిక బాల్యంలోనే కలిగిందట. అందుకోసం ఆవునూరు, ముస్తాబాద్ మండల కేంద్ర సమీప గ్రామంలోని పండితుల దగ్గరికి వెళ్ళేవారు. రవాణా సౌకర్యాలు లేని ఆ రోజుల్లో నిత్యం ఆయన నారాయణపురం నుంచి ఆవునూరు దాకా కాలినడకన వెళ్ళి ఒకే ఒక్క శ్లోకాన్ని నేర్చుకున్నారట. ఆనాడు ఎంతో ఇష్టంతో కష్టపడి నేర్చుకున్న చదువు తన భవిష్య జీవితానికి ఉపయోగపడిందని ఆచార్యులవారు అనేవారు. క్రమేపీ ఆయన సంస్కృతంలో ఎం.ఏ.ను సాధించారు.

రాఘవాచార్య జీవిత ఆరంభంలో అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్నారు. స్వగ్రామంలో ఆలయ అర్చకత్వంతో జీవితం ప్రారంభమైంది. నారాయణపురంలోని స్మార్త పండితులు బావి కృష్ణమూర్తి శాస్త్రి, జోగా వెంకన్న శర్మల దగ్గర నేర్చుకున్న వేదాధ్యయనం కొంత ఉపకరించింది. అయితే ఆనాటి పరిస్థితుల్లో పౌరోహిత్యం, అర్చక వృత్తులతో జీవనాన్ని కొనసాగించడం కష్టమనే సంగతి ఆయనకు అర్థమైంది. ఒకానొక దశలో ఉద్యోగ ప్రయత్నం చేయాలన్న సంకల్పం బలపడింది. అధ్యాపకులుగా ఉద్యోగం దొరికింది. కుటుంబ బాధ్యతలను పరిపూర్ణంగా నిర్వర్తిస్తూనే ఆయన తన విద్యావ్యాసంగాన్ని కొనసాగించారు. పదోన్నతితో మెదక్ తదితర ప్రాంతాల్లో కొంతకాలం పాఠశాల అధ్యాపకుడిగా పనిచేశారు. కళాశాల అధ్యాపకుడిగా ఎదిగారు. సిద్దిపేటలో స్థిరపడ్డారు. మూడు దశాబ్దాల పాటు అక్కడే ఉన్నారు. ఉద్యోగ విరమణ తరువాత భాగ్యనగరం వచ్చారు.

సిద్దిపేట జీవితం రాఘవాచార్య సాహిత్య అధ్యయనానికి బాగా తోడ్పడింది. 1960లలో దిగ్గజాల వంటి ప్రతిభామూర్తులతో సిద్దిపేట ఒక గొప్ప సారస్వత కేంద్రంగా ఉండేది. పరాశరం గోపాలకృష్ణమూర్తి, వేముగంటి నరసింహాచార్యులు, గుమ్మన్నగారి లక్ష్మీనరసింహశర్మ, ఉమాపతి పద్మనాభశర్మ, ముదిగొండ

వీరభద్రయ్య లాంటి పలువురు సిద్ధిపేట సాహిత్య వాతావరణానికి వినూత్నమైన కాంతిని తెచ్చారు. వీరితోపాటు రాఘవాచార్యులు కూడా సాహిత్య కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పాల్గొనేవారు. సాహిత్య సదస్సులు, కవి సమ్మేళనాలు, విద్వద్గోష్ఠులు, అష్టావధానాలన్నింటిలోనూ వీరి పాత్ర ఉండేది.

సిద్ధిపేట కళాశాలలో తరుచుగా సాహిత్య కార్యక్రమాలు జరిగేవి. వాత్సల్యపూరితమైన పలుకరింపు, చెరగని చిరునవ్వు, మృదువైన సంభాషణారీతి రాఘవాచార్య ప్రత్యేకతలు. విద్యార్థులు మాత్రమే కాదు అధ్యాపకులు కూడా ఆయనను గురుభావనతోనే చూసేవారు. ఆయన సిద్ధిపేట కళాశాలో బాధ్యతలు నిర్వర్తిస్తున్న రోజుల్లో తెలంగాణ ఉద్యమం వెల్లువెత్తింది. రాఘవాచార్య పెద్దకుమారుడు, ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచార్యులు ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు.

సంస్కృతాంధ్ర విజ్ఞాన ఖనిగా అభివర్ణించదగిన రాఘవాచార్యులు ఉర్దూ, ఇంగ్లీషు భాషల్లోనూ గట్టి పట్టును సాధించారు. అయితే ఆయన సిద్ధిపేటలో ఉన్న రోజుల్లో గ్రంథ రచన చేసినట్టు లేదు. పదవీ విరమణకు కొద్దిరోజుల ముందు యువభారతి సంస్థ కోరిక మేరకు ఒక చిన్న పుస్తకాన్ని రచించారు. అది 'మాఘకావ్యవైభవం'. అది 1983 ప్రచురణ పొందినది. అప్పటినుంచి మొన్న కన్ను మూసేవరకూ ఆచార్యులవారి రచన ప్రస్థానం నిరంతరాయంగా కొనసాగింది.

వ్యాఖ్యానాల రచనకు సాహిత్యంలో ప్రముఖ స్థానం ఉంది. పూర్వకాలంలో వ్యాఖ్యానాలే సాహిత్య జిజ్ఞాసువులకు కరదీపికలయ్యాయి. ప్రపంచ ప్రఖ్యాత వ్యాఖ్యాత మల్లినాథ సూరి గురించి చాలామందికి తెలుసు. గత శతాబ్ది తొలి దశాబ్దాల్లోనూ శరపరంపరగా తెలుగులో వెలువడిన వ్యాఖ్యాన సాహిత్యం క్రమేపీ కనుమరుగవుతూ వచ్చింది. ఈ సంప్రదాయాన్ని తమ రచనల ద్వారా పునరుద్ధరించిన కీర్తిమూర్తి రాఘవాచార్యుల వారు. ఎన్నో వ్యాఖ్యానాలు ఆయన కలం నుంచి జాలువారాయి. ఆయన రచనలతో వ్యాఖ్యాన సాహిత్యం సుసంపన్నమైంది. ప్రధానంగా సంస్కృతంలోని ధార్మిక ఆర్ష వాఙ్మయాన్ని ఆచార్యులవారు వ్యాఖ్యానించారు. కొన్ని తెలుగు రచనలూ ఉన్నాయి. గోదాస్తుతి (పరిమళ వ్యాఖ్య), భగవద్ధ్యాన సోపానమ్ (మనోరమా వ్యాఖ్యానమ్), శ్రీ రంగనాథ పాదుకా సహస్రమ్ (రమణీయాంధ్ర టీకా తాత్పర్య వ్యాఖ్యాన సహితమ్), గరుడ దండకం (సుషమాంధ్ర టీకా తాత్పర్య వ్యాఖ్య), శ్రీ నారాయణ శతకం (రాఘవీయవ్యాఖ్య), దివ్య ప్రబంధ త్రయి (ఆంధ్ర టీకా తాత్పర్య వివరణమ్), ద్రవిడోపనిషత్తాత్పర్య రత్నావళి (ప్రకాశికా వ్యాఖ్య), శ్రీ సుదర్శనాష్టకమ్ (జ్వాలా వ్యాఖ్య), శ్రీ రుక్మిణీ కళ్యాణమ్ (వైష్ణవీ వ్యాఖ్య), కాంతాచతుః శ్లోకి (దీపికా వ్యాఖ్య), యతిరాజ సప్తతి (చంద్రికా వ్యాఖ్య), అభీతిస్తవమ్ (సంజీవనీ వ్యాఖ్య), శ్రీస్తుతి హిరణ్మయీ వ్యాఖ్య), వ్యాస వింశతి (శ్రేయసీ వ్యాఖ్య), శ్రీ వరదరాజ పంచాశత్ (సర్వంకషా వ్యాఖ్య), శ్రీ అచ్యుత శతకమ్ (జ్యోతిర్మయీ వ్యాఖ్య), యాదవాభ్యుదయ మహాకావ్యమ్ (సుబోధనీ వ్యాఖ్య), శ్రీ విష్ణు పాదాది కేశాంత స్తోత్రమ్ (శ్రీరంజనీ వ్యాఖ్య)... ఇట్లా ఎన్నో వ్యాఖ్యలు! పండితులకే తప్ప జిజ్ఞాసువులకు అందుబాటులో లేని మణిరత్నాల వంటి ఎన్నింటినో ఆచార్యులవారు తమ వ్యాఖ్యల ద్వారా ప్రచారంలోనికి తీసుకొని వచ్చారు. ఇవన్నీ ఆయన అరవై సంవత్సరాల వయసు దాటిన తరువాత చేసిన రచనలు. సారస్వత సాధనకు వయసుతో సంబంధం లేదని తన విస్తారమైన రచనలతో నిరూపించారు. ఇట్లా ఆయన రచనా జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం.

ఇన్ని రచనలు చేసినా ఏనాడూ సత్కారాలకు పురస్కారాలకు ఇష్టపడని ఆచార్యులవారు కర్మయోగి. తన వాఙ్మయ మహా యజ్ఞాన్ని పరమాత్మ ఆదేశంగా భావించిన పరమ భాగవతోత్తముడు. ఆయన కృషిని ప్రశంసిస్తూ మహా మహోపాధ్యాయ డాక్టర్ న.చ.రఘునాథాచార్యులు ఇట్లా రాశారు: 'వీరు నిత్య సాహిత్య క్షేత్ర కృషీవలులు. ఆకలిగొన్నవానికి చేసే అన్నదానం సార్థకం అవుతుంది. ఒక సత్రం కట్టి నిత్యాన్నదానం ఏర్పాటు చేస్తే ఎంతోమంది ఆర్తులు తమ ఆకలి తీర్చుకొని తృప్తిపడతారు. అట్లా ఉపకరించే సత్రం వంటిదే శ్రీ రాఘవాచార్యులవారి నిరంతర గ్రంథ రచనా మహోద్యమం'. స్తోత్రాలలోని తత్త్వాన్ని తెలుసుకోవాలనుకునే జిజ్ఞాసువులకు రాఘవాచార్యుల రచనలు తోడ్పడుతాయని రఘునాథాచార్యులవారు తమ 'మధుర ప్రశంస'లో పేర్కొన్నారు. సుప్రసిద్ధ పండితులు, పద్మశ్రీ, మహా మహోపాధ్యాయ డాక్టర్ పుల్లెల శ్రీరామచంద్రుడు 'కె.వి.రాఘవాచార్యులవారు తమ వ్యాఖ్యాతృ చక్రవర్తిత్వాన్ని వారు రచించిన అనేక విస్తృత వ్యాఖ్యల ద్వారా నిరూపించుకున్నారు. ఒక్క వాక్యంలో చెప్పాలంటే కె.వి.రాఘవాచార్యులవారు రచించిన ఏ ఒక్క వ్యాఖ్యానమైనా వారికి అనేక శాస్త్రాలలోని విషయాలతోనూ దార్శనిక సంప్రదాయాలతోనూ నిర్దిష్టమైన జ్ఞానం లభిస్తుంది' అని అన్నారు. మహోపాధ్యాయులతో పాటు చినజీయర్‌స్వామి వంటి పెద్దల ఆదరాభిమానాన్ని అందుకొన్న గొప్ప విద్వాంసులు రాఘవాచార్యులు. పాండిత్య గరిమతో పాటు వ్యక్తిత్వ పరిమళంతోనూ అందరి మన్ననలను అందుకున్న కె.వి.రాఘవాచార్యుల వారు తెలంగాణ విలక్షణ విద్వత్ సంప్రదాయానికి ఒక మహత్తరమైన ప్రతీక.

నమస్తే తెలంగాణ దినపత్రిక, 12 ఆగష్టు 2016

తిరుమల చారిటబుల్ ట్రస్టు

13వ వార్షికోత్సవం





ఆహ్వానము

తిరుమల ఛారిటబుల్ ట్రస్టు

హైదరాబాదు

సత్కళా భారతి సంయుక్త ఆధ్వర్యంలో

"రాఘవీయం"

గ్రంథావిష్కరణ సందర్భంగా

శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ

రామానుజ చిన్న జీయర్‌స్వామి వారి

మంగళాశాసనాలతో...

కవి పండిత సత్కారం

సోమవారం, 03 జులై, 2017, సా॥ 6:15 ని॥లకు

ఎన్.టి.ఆర్ ఆడిటోరియం, తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి, హైదరాబాదు

సత్కార గ్రహీతలు

బ్రహ్మశ్రీ గుళ్ళపల్లి వెంకట్రామ సూర్యనారాయణ ఘనపాఠి వారు

హైదరాబాద్

బ్రహ్మశ్రీ గుళ్ళపల్లి కృష్ణమూర్తి ఘనపాఠి వారు

యజుర్వేద పండితులు, హైదరాబాద్

శ్రీమాన్ చిలకపాటి విజయ రాఘవాచార్యుల వారు

ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, విజయవాడ

డా॥ తిరుమల శ్రీనివాసాచార్య సాహితీ పురస్కార గ్రహీత

శ్రీమాన్ సముద్రాల శఠగోపాచార్యుల వారు

ప్రముఖ ఆధ్యాత్మిక సాహితీవేత్త, వరంగల్లు

'సత్కళా భారతి' సత్యనారాయణ

వ్యవస్థాపక అధ్యక్షులు - సెల్ : 9885673828

"రాఘవీయం" కృత్యావిష్కరణం

హేవళంబి ఆషాఢ శుద్ధదశమి 3-7-2017 తేది సోమవారం సాయం కాలం తెలుగు విశ్వవిద్యాలయం - సభా ప్రాంగణంలో రాఘవీయ కృత్యావిష్కరణ కార్యక్రమం జరిగింది. తిరుమల చారిటబుల్ ట్రస్ట్ - సత్కళాభారతి సంయుక్తాధ్వర్యంలో - గ్రంథావిష్కరణతో బాటు పండిత సమ్మానము ప్రత్యేక పండిత పురస్కృతి కార్యక్రమాలు ఎంతో వైభవంగా జరిగినాయి.

ప్రతి సంవత్సరం తిరుమల చారిటబుల్ ట్రస్ట్ ఒక విశేష గ్రంథాన్ని ఆవిష్కరించి పండిత సమ్మానంచేయటం ఒక పరంపరాగత కార్యక్రమం. వీటిల్లో అధికభాగం శ్రీమాన్ కె.వి. రాఘవాచార్యులవారి రచనలే ఆవిష్కృతమయ్యేవి. గత సంవత్సరం జరిగిన కార్యక్రమం నాటికే రాఘవాచార్యుల వారు యశః కాయులైనా వారు వ్యాఖ్యానం కృపచేసిన యాదవాభ్యుదయం తృతీయ సంపుటం ఆవిష్కృతం కాగా - ఈసంవత్సరం మాత్రం రాఘవాచార్యులవారికి అక్షరాంకోవదగా వారి సాహిత్య సర్వస్వ సమీక్షావ్యాసాలు-మరికొన్ని సాహిత్య వ్యాసాలతో సిద్ధం చేసిన **'రాఘవీయం'** కృతిని ప్రకాశమాన మొనర్చటం ఒక విశేషం.

ఈ కార్యక్రమానికి మన రాష్ట్రప్రభుత్వ సలహాదారులైన శ్రీమాన్ కె.వి. రమణాచార్యులు అధ్యక్షత వహించగా పూజ్యపాదులు శ్రీశ్రీశ్రీ అహోబిల జీయర్‌స్వామి వారు శ్రీశ్రీశ్రీ దేవనాథ జీయర్ స్వాములవారు, ముఖ్యులుగా దయచేసి 'రాఘవీయం' ఆవిష్కరణ చేయటం విశేషం.

సత్కళాభారతి నిర్వాహకులు శ్రీ సత్యనారాయణ అంతకు ముందు 'శ్రీ విష్ణుసహస్రనామ సంకీర్తనం' కార్యక్రమాన్ని శ్రీమతి అన్నపూర్ణ ఆధ్వర్యంలో వికాసతరంగిణి బృందంచే అద్భుతంగా నిర్వహింపచేసిన అనంతరం - కృత్యావిష్కరణ కార్యక్రమంగూర్చి తెల్పగా మహాకవి డా॥ తిరుమల శ్రీనివాసాచార్య అందరినీ స్వాగతిస్తూ నేటి కార్యక్రమ విశేషాలను తెల్పి వేదపండితులు, బ్రహ్మశ్రీ గుళ్లపల్లి సూర్యనారాయణ ఘనపాఠి, గుళ్లపల్లి కృష్ణమూర్తి ఘనపాఠి- ప్రఖ్యాత సంస్కృతపండితులు శ్రీమాన్ సముద్రాల శఠకోపాచార్యులను - నేటి సమ్మానితులుగా ఆహ్వానించి - 'రాఘవీయం' కృతి సంపాదకులైన డా. శ్రీరంగాచార్య, శ్రీ తాళ్లపల్లి మురళీధరగౌడులను, అధికార భాషా సంఘ అధ్యక్షులు శ్రీ దేవులపల్లి ప్రభాకరరావును, కార్పొరేటర్ శ్రీమాన్ కాందూరు నరేంద్రాచార్యులను సాదరంగా ఆహ్వానించినారు.

శ్రీమాన్ రమణాచార్యులవారు తమ అధ్యక్షభాషణంలో తమ తండ్రిగారైన రాఘవాచార్యులవారు కృషిచేసి వెలుగులోనికి తెచ్చిన సర్వకవితా-వ్యాఖ్యాన సంరంభాన్ని-సులభ శైలి వ్యాసరూపాల్లో అందించి వారి సాహిత్యమును శాశ్వత అక్షరబద్ధం చేయవలెననే సంకల్పంతో 'రాఘవీయం' పేర ఈ కృతిని సిద్ధం చేసి సాహితీలోకానికందిస్తున్నామని తెల్పుతూ ఈ రోజు పెరియాళ్వారు తిరునక్షత్రం రేపు ఏకాదశి పర్వదినం. చాతుర్మాస్యదీక్షారంభం- ఈ సత్సమయంలో-మా విన్నపాన్ని మన్నించి ఉభయజీయర్‌లు విచ్చేసి తమ శుభంకర కరకమలాలతో 'రాఘవీయ' కృతికి సూర్యాలోకన భాగ్యం కల్గించటం-ఎంతో విశేషం. ఆనందకారకమని-తమ చతురవచోనిధిత్వంతో ప్రసంగించి విచ్చేసిన సభాసదులందరినీ సంతసింపచేసినారు.

తరువాత 'రాఘవీయ' కృతి సంపాదకులైన డా॥ శ్రీరంగాచార్య ప్రసంగిస్తూ-శ్రీమాన్‌రాఘవాచార్యవర్యుల సాహితీ సర్వస్వపఠనం చేయలేనివారు 'రాఘవీయం' చదివితే వారి సర్వసాహిత్య సాన్నిహిత్యం ఏర్పడుతుందని, దీనిలోని వ్యాసాలు, కవితల గూర్చి తెల్పి రాఘవాచార్యుల వారి పీఠికలు-ఎన్నో వ్యాసాలు- సమీక్షలు చెల్లాచెదురుగావున్న వాటిని వచ్చే సంవత్సరం నాటికి 'రాఘవీయం' ద్వితీయ భాగంగా వెల్వరించటం అవసరం అన్నారు. రాఘవీయం సందర్భంగా వచ్చిన రచనలను పరిశీలించి పఠించే భాగ్యం మాకు కల్గడం శ్రీరాఘవాచార్యుల వారి కృతులను పునఃఅనుసంధానం చేసే అవకాశం కల్గిందని - వివరించినారు.

అనంతరం శ్రీ అహోబిల జీయర్‌స్వామి వారు తమ అనుగ్రహ భాషణంలో రాఘవాచార్యుల వారి విద్యావైదుష్య విశేషాలను తెల్పి, వారిని సాక్షాత్తు అక్షర చిరంజీవుల చేసే రాఘవీయకృతి నిర్మాణ ప్రయత్నం అభినందనీయమని బహువిషయ సముపబృంహణంగా స్వామివారు ప్రవచించగా-శ్రీ దేవనాథ జీయర్ స్వామివారు విశేషమైన ప్రత్యుక్తులతో చమత్కార సంభాషణం చేస్తూ ప్రస్తుత 'రాఘవీయం'లో 54 రచనలున్నాయని, రాఘవీయం ద్వితీయ భాగాన్ని 54 శీర్షికలుగా వెలువరించి మనందరికీ ముఖ్యమైన 108 సంఖ్యను పరిపూర్తి చేయవలెనని శ్రీమాన్ రమణాచార్యువారికి ఆశీఃపూర్వకమైన సూచనను చేసిరి. జీయర్‌స్వామి వారు సంచికలోని 'పెరియాళ్వారు జనించెనో' పద్యాన్ని తెల్పుతూ- పెరియాళ్వార్ల తిరునక్షత్రమైన నేడు 'రాఘవీయం' ఆవిష్కృతం కావటం - శ్రీమాన్ రాఘవాచార్య స్వామి వైభవానికి నిదర్శనమని వివరించినారు. అనంతరం - వేదపండితులు - ఘనపాఠులైన గుళ్లపల్లి వెంకటరామ సూర్యనారాయణగారిని, గుళ్ళపల్లి కృష్ణమూర్తి గారిని ఆధ్యాత్మిక విద్యాచార్య చిలుకపాటి విజయరాఘవాచార్యుల మంగళా శాసనాలతో శ్రీమాన్ తిరుమల శ్రీనివాసాచార్య, కె.వి.రమణాచార్యుల వారు ఘనంగా సత్కరించి, రాఘవీయం సంపాదకులైన డా॥ శ్రీరంగాచార్య శ్రీ తాళ్లపల్లి మురళీధరగౌడు గార్లను, అధికారభాషాసంఘ అధ్యక్షులు శ్రీ దేవులపల్లి ప్రభాకరరావు గారిని, కార్పోరేటర్ శ్రీ నరేంద్రాచార్యులను, మరికొందరు పెద్దలను యథోచితంగా సన్మానించినారు.

'సమ్మానితులై వేదపండితులు-పండితులు-తగిన రీతిగా తమ స్పందనను వ్యక్తపరచినారు. తొలుత శ్రీ గుళ్లపల్లి వెంకటసూర్యనారాయణ ఘనపాఠి మాట్లాడుతూ "శ్రీమాన్ రమణాచార్యులవారు వేదవిద్యకు వేదపండితులకు కల్పించిన గొప్పసౌకర్యం, వేదమాతను గౌరవించుటమే అని భావిస్తూ మేము నిత్యం స్మరిస్తుంటాం" అని అన్నారు. శ్రీ గుళ్లపల్లి కృష్ణమూర్తి తమ ప్రసంగంలో "ఒకనాడు వేదపండితుడు, బ్రాహ్మణుడు అంటే వుండే చిన్నచూపును రమణాచార్యుల వారు తొలగించి, వేదానికి గొప్ప గుర్తింపు తేవటం, ఆ సప్తగిరీశుని సన్నిధిబలమే! అందుకే మేము వేదపండితులుగా సంతోషిస్తున్నాం, ఉభయులమూ ఈరోజు సన్మానింపబడడం జీవితంలో ఒక విశేషం" అని పేర్కొన్నారు.

శ్రీమాన్ చిలకపాటి విజయరాఘవాచార్య మాట్లాడుతూ "దైవం మానుషరూపేణ అన్న సూక్తి రమణాచార్యులవారియందు సార్థకమైంది. టి.టి.డి.లో వారు ఈవోగా వున్నప్పుడు నేను కూడా అక్కడ వుద్యోగిని, దివారాత్రులు వారు ఫైల్స్ చూస్తూ పనులు చేస్తూ, కార్యక్రమాలను నిర్వహిస్తూ చిద్విలాసంగా

వుంటే ఇదంతా ఒక దైవలీల అని భావించేవాన్ని. భగవంతునికి నిజమైన సేవకుడు అంటే రమణాచార్యుల వారుమాత్రమే అని విశ్వసిస్తాను. వారి కారణంగానే తెలంగాణాలో 'విప్రహిత' ఏర్పడటం, ఇది గొప్పపని, ఈనాడు వీరి నుండి నేను సమ్మానాన్ని పొందటం నా అదృష్టం" అన్నారు.

"డా॥ తిరుమల శ్రీనివాసాచార్య సాహితీపురస్కార" గ్రహీత శ్రీమాన్ సముద్రాల శఠకోపాచార్యులు ప్రసంగిస్తూ "జీవితంలో కష్టపడినా బ్రతకటం అనేది ఆలస్యంగా తెలిసిన నేను, నేటితరానికి ఈ దశ రావద్దని కోరుకుంటాను. సంస్కృతం చదివి శ్రీమాన్ చినజీయర్ స్వామివారు, రఘునాథాచార్య స్వామివార్ల అనుగ్రహంతో ఒక గుర్తింపు తెచ్చుకున్న ఫలం. ఈనాడు తిరుమల శ్రీనివాసాచార్య సాహితీపురస్కార భాజనుని గావటం ఒక దశగా భావిస్తాను" అని సంతోషం వ్యక్తంచేశారు.

కె.వి.రమణాచార్యులను, శ్రీశ్రీనివాసాచార్యుల వారిని జీయర్‌స్వాములు విశేష శేషవస్త్రాలతో సత్కరించి మంగళాశాసనాల కృపచేసినారు. చివర సత్కళాభారతి నిర్వాహకులు శ్రీ సత్యనారాయణ కృతజ్ఞతలతో సభాకార్యక్రమం పూర్తయింది.

- సత్యనారాయణ
'సత్కళాభారతి'



కార్యక్రమానికి విచ్చేసిన శ్రీశ్రీశ్రీ అహోబిల జీయర్ స్వామి వారిని, శ్రీశ్రీశ్రీ దేవనాథ జీయర్ స్వామివారిని ఆహ్వానిస్తున్న డా॥ కె.వి. రమణాచార్య



జ్యోతి ప్రకాశనంతో 'శ్రీ విష్ణుసహస్రనామ సంకీర్తనం' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డా॥కె.వి.రమణాచార్యులు



శ్రీమతి అన్నపూర్ణ (ఇ.ఓ మహంకాళి దేవాలయం) ఆధ్వర్యంలో 'శ్రీ విష్ణుసహస్రనామ సంకీర్తనం' చేస్తున్న 'వికాసతరంగిణి' సభ్యులు



సభలో ఆసీనులైన కవిపండితులు, తిరుమల చారిటబుల్ ట్రస్టుసభ్యులు



సభ ఆరంభానికి ముందు చిన్నాన్న శ్రీనివాసాచార్యగారితో రమణాచార్యులు



ట్రస్టు పక్షాన ఆహూతులకు స్వాగతం పలుకుతున్న డా॥ తిరుమల శ్రీనివాసాచార్యులు



డా॥ కె.వి. రమణాచార్యుల అధ్యక్షభాషణం



వేదికపై జీయర్‌స్వాములతో పాటు ఆసీనులైన పురస్కారగ్రహీతలు, అతిథులు



'రాఘవీయం' గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న పూజ్యపాదులు శ్రీశ్రీశ్రీ దేవనాథ జీయర్ స్వాములవారు, అహోబిల జీయర్‌స్వామి వారు



గ్రంథ ఆవిష్కరణంలో జీయర్ స్వాములతో పాటు సర్వశ్రీ సముద్రాల శఠకోపాచార్య, సత్యనారాయణ, మురళీధరగౌడు
డా॥శ్రీనివాసాచార్య, విజయరాఘవాచార్య, డా॥రమణాచార్య, డా॥శ్రీరంగాచార్య, దేవులపల్లి ప్రభాకర రావు, నరేంద్రాచార్య



రాఘవీయాన్ని గురించి ప్రసంగిస్తున్న సంపాదకులు డా॥ శ్రీరంగాచార్య



సత్కారాన్ని అందుకుంటున్న బ్రహ్మశ్రీ గుళ్లపల్లి వెంకట్రామ సూర్యనారాయణ ఘనపాఠి



సత్కార గ్రహీత యజుర్వేద పండితులు బ్రహ్మశ్రీ గుళ్లపల్లి కృష్ణమూర్తి ఘనపాఠి



సన్మానం స్వీకరిస్తున్న ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త
శ్రీమాన్ చిలుకపాటి విజయరాఘవాచార్యులు



'డా॥ తిరుమల శ్రీనివాసాచార్య సాహితీపురస్కారా'న్ని ప్రముఖ ఆధ్యాత్మిక సాహితీవేత్త
శ్రీమాన్ సముద్రాల శఠకోపాచార్యులకు ప్రదానం చేస్తున్న డా॥శ్రీనివాసాచార్య, డా॥ రమణాచార్య



డా॥ రమణాచార్యులకు, డా॥ శ్రీనివాసాచార్యులకు ఆశీస్సులనందజేస్తున్న జీయర్ స్వాములు





సంపాదకులు డా॥ శ్రీరంగాచార్య, శ్రీతాళ్లపల్లి మురళీధరగౌడు గార్లను
సన్మానిస్తున్న డా॥ శ్రీనివాసాచార్య




సత్కరింపబడుతున్న అధికార భాషాసంఘం అధ్యక్షులు
శ్రీ దేవులపల్లి ప్రభాకర రావు



వదాన్యులు శ్రీ మాదాడి మాధవరెడ్డి దంపతులకు
ట్రస్టు పక్షాన సన్మానం



సత్కారం అందుకుంటున్న
వదాన్యులు శ్రీ రామిడి వెంకటరెడ్డి దంపతులు



సత్కరింపబడిన కార్పోరేటర్
శ్రీ కాందూరు నరేంద్రాచార్య దంపతులు


శ్రీమాన్ కే.వి.రాఘవాచార్యుల రచనలు




(1983)




(1987)



(1989)



(1990)




(1997)



(1996)



(1998)



(1999)




(2001)




(2004)




(2002)



(2002)



(2003)




(2004)




(2006)




(2006)




(2007)



(2008)




(2008)




(2010)




(2011)



(2011)




(2012)




(2013)




(2014)




(2014)




(2015)



(2013)



(2015)



(2016)



Raghaveeyam *A Collection of Essays*
on K.V.Raghavacharya's Works

ఆత్మజుని అంతరంగం

డా॥ కే.వి. రమణాచార్య

జనకా! నాకు శరీర మిచ్చితివి వాత్సల్యమ్మునన్ విద్యలన్
గను రీతిన్ బొనరించు మేల్మియగు సంస్కారమ్ము నేర్పించి యీ
తనయున్ బాసి నిలింప దేశముల సందర్శింప నుత్సాహివై
చన మేలౌనె? మదీయ చిత్తమున సాక్షాత్కారమున్ జెందుమా!

ఎవ్వారి ధీ శక్తి యవ్వారితమ్మునై / మును విశిష్టాద్వైత ఘనత దెలిపె,
ఎవ్వారి పాండిత్య మెల్లరున్ వెఱగంద / వేదాంత దేశిక వినుతి చాటె,
ఎవ్వారి శోధన మవ్వంపు కాంతుల / న్యాస వింశతి దిజ్నివాసమయ్యె,
ఎవ్వారి నామమ్ము హృదయంగ మమ్మోచు / సంస్కృతాంధ్ర తమిళ సభల వెలిగె
వైష్ణవ వ్యాప్తి వెల్గె నెవ్వారి శక్తి/ అతడె కారముచేడు వంశాబ్ధి తేడు
రాఘవాచార్య కీర్తిందిరా ధరుండు / పితరుడై వెలయంగ నా కితరమేల?

నా నయనమ్ములున్ రసన నాసిక వీనులు సర్వమెన్న నా
మేనున కాంతు లీనెనన మీ మహిమాంచిత భిక్షయే గదా!
నేను సృజించు పద్యము మనీషులు మెచ్చగ మీరె కర్త లీ
జ్ఞానము నిచ్చినట్టి మిము సన్నుతి జేతును తండ్రి సర్వదా!

ఎత్తుకెదుగమంచు ఎగరేసి యాడించి / మురిసినట్టి ధన్య మూర్తివీవు,
చేయిపట్టి నడిపి జీవిత పథమును / చూపించి నట్టి దిక్సూచి వీవు,
ఈతను నేర్పి సంసృతి మహాంబుధి దాట / మార్గమ్ము జూపిన మాన్యుడీవు,
దండించి ప్రేమను పండించి కష్ట సు / ఖమ్ముల దెల్పిన గణ్యుడీవు,
దుఃఖముల మ్రింగి నాకు సంతోష మొసగి / వజ్ర కవచమ్ము వగుచు కాపాడినావు
జననముండిన మరుసటి జన్మనైన / నీ కుమారునిగానె జన్మింతు తండ్రి!

గురులై మంత్ర రహస్యముల్ దెలిపి సంకోచమ్ములన్ బాపుచున్
వర సాహిత్యము ధారవోసి గుణముల్ వర్ధిల్లగా జేసి మే
దుర లౌక్యమ్మున కర్థముల్ దెలిపి యెంతో ప్రీతి నన్ బెంచె నా
న్న రహిన్ అట్టి మహోదయున్ గొలుతు విజ్ఞానమ్ము వర్ధిల్లగన్

నే నేమిత్తును తండ్రి! భక్తి నిను వందే యంచు ప్రార్థింతు నా
జ్ఞానిన్ జేసితిరంచు నా ఋణము దీర్చన్ వేగ యత్నింతు నా
యీ నాడీ స్థితినున్న కారకులు మీరేగాన సద్భక్తి నా
చే నౌ పద్య సుమాల మీ కొసగితిన్ చేకొంచు దీవించుడీ!

అమలంబౌ మధురోహలివ్విధిని ప్రత్యాశ్వస్త సంభూతమై
రమణాచార్య మహోదయాంతరమునన్ రాజిల్ల నూహించి నే
కమనీయంబగు భావనా పటిమ వ్యాఖ్యానించి పద్యమ్ములన్
ప్రమదంబొప్ప రచించి ప్రాభృతముగా భక్తిన్ సమర్పించితిన్.

మద్దూరి రామమూర్తి, అష్టావధాని 9989 924 675

A Publication of **Tirumala Charitable Trust,** *Hyderabad.*